హిందూదేశ అర్థశాస్త్రము

గ్రంథకర్త
వేమా సత్యనారాయణమూర్తిగారు, బి. ఏ.



ప్రకాశకులు
శారదా పబ్లిషింగు కంపెనీ,
185 మవుంటురోడ్డు, మద్రాసు.
1918.

 [వెల రు. 2-8.

INDIAN = = = ECONOMICS

BY

V. SATYANARAYANA MURTHI, B.A.



PUBLISHED BY
SARADA PUBLISHING COMPANY,
185, Mount Road, Madras.
1918.

[*Price Rs. 2-8.*

భూమిక.

'హిందూదేశార్థ శాస్త్రమ'నగా హిందూదేశము యొక్క సాంపత్తిక విషయములనన్నిటిని తెలుపుశాస్త్రము. ఆంధ్రభాషలో ఇదివరకు ప్రకటింపబడిన అర్థశాస్త్రము ఆర్థికవిషయములనుగురించిన న్యాయములనుమాత్రము బోధించునదైయున్నది. హిందూదేశ సాంపత్తిక విషయమునుగూర్చి ఇదివరకు ఆంధ్రమున గ్రంథములేవియు ప్రకటింపబడలేదు. హిందూదేశ ప్రస్తుతరాజకీయ వాతావరణము అల్లకల్లోలముగా నున్నది. ప్రజాస్వాతంత్రవాదులును, దేశాభిమానులును దేశముయొక్క ఆర్థికస్థితిని బాగుపరచి వ్యక్తిజీవనమును సౌఖ్యవంతముగ జేయవలయునని పాటుబడుచున్నారు. స్వలాభాపేక్షచే కొందరు అట్టివారిప్రయత్నముల కాటంకములు కలిగించ యత్నించుచున్నారు. ఇట్టిసమయమున ఇంగ్లీషురాని ఆంధ్రులకు దేశము యొక్క ఆర్థికస్థితిగతులను దెలుపుగ్రంథము నందజేయవలెననెడి తలంపుతో ఈప్రయత్నమునకు గడంగితిమి. విషయమును ప్రతివారును శ్రద్ధతో పఠించిన దేశముయొక్క నిజస్థితిని గ్రహించనగును. ఆభారము చదువరులయందే కలదు.

ఈగ్రంథమును విశేషశ్రమకోర్చి వ్రాసి గ్రంథకర్తగారు ఆంధ్రుల కృతజ్ఞతకు పాత్రులైరి.

కాగితముయొక్కయు, ముద్రణాపరికరముల యొక్కయు, క్యాలికో బైండునకును వెలలు ఇప్పుడు మునపటికంటె ఎన్నియోరెట్లధికమాయెను. ఆకారణమువలన ఈగ్రంథమునకు వెల కొంచెము హెచ్చించవలసివచ్చినందులకు చింతిలుచున్నాము.

అద్వితీయ భాషాభిమానులును ఉదారమనస్కులు నగు శ్రీయుత వేమవరపు రామదాసుపంతులుగారు మాకు చాలతోడ్పడిరి. పగలంతయు

శ్రమపడి అలసియుండియు రాత్రులయందు ఈగ్రంథముయొక్క వ్రాత ప్రతులను ఓర్పుతో తిలకించి వారి సలహాలనొసంగి యుండిరి. ఇంకను ఎన్నియోవిధముల మాకు తోడ్పడియుండిరి. శ్రీరామదాసు పంతులుగారికి మా కృతజ్ఞతా పూర్వక వందనముల నర్పించుకొనుచున్నాము.

హిందూదేశముయొక్క పూర్వపు ఔన్నత్యమును తెలుపుగ్రంథములలో అగ్రస్థానము నలంకరించు గ్రంథమగు శ్రీయుత రాధాకుముద ముఖర్జీగారివలన రచియింపబడిన 'హిందూదేశ నౌకాచరిత్రము' యొక్క భాషాంతరీకరణమును మాతరువాతిగ్రంథముగా ప్రకటింపబడును. ఈగ్రంథమునందు రెండువేల సంవత్సరములు, నౌకాకళయందును నౌకావ్యాపారమందును హిందూదేశము అనుభవించిన ఔన్నత్యమును జూపుటయేగాక ఆనాటి ఆంధ్రదేశముయొక్క ఔన్నత్యముకూడ తెలుపబడినది. ఇందు సుమారు ఏపది చిత్రపటములుగలవు.

ఇంకనుకొన్ని అమూల్య గ్రంథములను ప్రకటించ యత్నించుచున్నాము. మాయత్నములు ఆంధ్రుల ఆదరణముపై ఆధారపడియుండుటచేత భాషాభిమానులందరును మాయుద్యమమునకు తోడ్పడెదరని నమ్ముచున్నాము.

శారదా పబ్లిషింగు కంపెనీ.

హిందూదేశ అర్థశాస్త్రము.

విషయసూచిక.

I. హిందూదేశ అర్థశాస్త్ర ప్రత్యేక పఠనావశ్యకత.

II. ఉత్పత్తి (Production).

హిందూదేశ నైసర్గిక ద్రవ్యసాధనములు.

III. విభజన. (Distribution.)

IV. మారకము. (Exchange)

V. ఇండియా రాజస్వము (Indian Finance)

(2) వ్యయము.

పుట

VI. సర్కారువారి పరిశ్రమలు.

VII. స్వేచ్ఛావ్యాపారము; రక్షణ.

పుట

VIII. ఇండియాదేశము; సామ్రాజ్య సపక్షభాగ సమస్య.

IX. పరిశ్రమాభివృద్ధికి మార్గములు.

హిందూ దేశ అర్థశాస్త్రము.

హిందూదేశ అర్థశాస్త్ర ప్రత్యేకపఠనావశ్యకత.

అర్థశాస్త్రము భావనశాస్త్రము.

శాస్త్రములు రెండు విధములు: దృష్టాంతశాస్త్రములు, భావనశాస్త్రములు. పదార్థవిజ్ఞాన, రసాయన, శారీర, ఖగోళ శాస్త్రములు, దృష్టాంతశాస్త్రములు. ఆర్థిక, తర్క శాస్త్రములు, భావనశాస్త్రములు. దృష్టాంతశాస్త్రములయందలి విశేషమేమనిన, వీనిసూత్రములు ప్రత్యక్షప్రమాణములు. నిజానిజములను పరిశీలింపవలెనన్న, శోధించిన తెల్లమగును. ప్రాణవాయువును, నీటివాయువును చేరి మనము త్రాగు ఉదకమగుచున్నది. ఈ నీతిని మనము రసాయన శాస్త్రమునుండి గ్రహించుచున్నాము. ఇందలి యాదార్థ్యమును కనుగొననెంచిన, నీటిని శోధించిన యెడల మనము ప్రత్యేకించి రెండువాయువులను విడదీయగలుగుదుము. తిరుగా వానిని రెంటిని జేర్చితిమేని ఉదకమగును. ఇక భావనశాస్త్రములన్ననో, వీటిసిద్ధాంతములు ఊహింపబడినవి గాని ఇదమిద్ధములుకావు. ఒక్కొక్క స్థితియందును, అవస్థయందును మాత్రమే ఊహింపబడిన గుణములన్నియు సమకూరినప్పుడు మాత్రము, ఈసూత్రముల యొక్క ఉపయుక్తత వ్యక్తీకరింపబడును. ఆస్థితి గతులన్నియు ఏక కాల

మున సమకూరునంత వరకు భావనశాస్త్రములయందలి నీతులు
ప్రచ్ఛన్నములు.

డాక్టరు బోసు, పి. సి. రాయిగార్ల నూతనశోధనలు.

ఎడతెగని పరిశోధనలవలన ప్రత్యక్ష ప్రమాణము
లనియు, మార్పులంజెందక నికరములు (Exact) గా నుండు
ననియు జేర్కొనబడిన, పదార్థవిజ్ఞాన, రసాయన, ఖగోళశాస్త్ర
ములే పెక్కుమార్పులంజెంది, దినమునకొకరీతి వింతవాదములు
బయలువెడలుచున్నవి. గతశతాబ్దమునందు ప్రఖ్యాతిగాంచిన
శాస్త్రజ్ఞులిపుడు తిరుగా జన్మించితిరేని తమ వాదములయం
దును, సిద్ధాంతములయందును, ప్రస్తుతము కలిగిన మార్పులను
జూచి ఆశ్చర్యపడుదురు. శాస్త్రము దినదినప్రవర్ధమానమై
ఇక్కాలపు ప్రజలబుద్ధి కుశలతను వేనోళ్ల జాటుచున్నయది.
ఏకవస్తుపదార్థములని నిర్ణయించబడిన, ఎన్నియోపదార్థము
లిప్పుడు, బహుపదార్థపుంజములుగా నంగీకరింపబడినవి. ఎన్ని
యో క్రొత్త నైట్రేట్లను (Nitrates) మన సుప్రసిద్ధ రసాయన
శాస్త్రవేత్తయగు ప్రఫుల్ల చంద్రరాయిగారును వారిశిష్యులును
కనిపెట్టిరి.

ఈ శతాబ్దారంభమునకు పూర్వము ప్రజలు వస్తువుల
యందు చేతనములు, అచేతనములనియెడి రెండు తెగలు కలవని
నమ్ముచుండెడివారు. ప్రపంచమునందంతటను సుప్రసిద్ధశాస్త్ర
వేత్తయని పేరుగాంచి, మన భారతమాతకు విఖ్యాతయశము
గడించిన శ్రీయుత జగదీశ చంద్రబోసుగారు అచేతనములనియెడి
పదార్థములు లేవనియును, సర్వమును చేతనములేయనియును

సిద్ధాంతీకరించినారు. ఐరోపా, అమెరికా ఖండములయందలి
శాస్త్రవేత్తలెల్లరు వీరి సిద్ధాంతమునుగాంచి ఆశ్చర్యముజెందిరి.

పాఠకులలో కొందరికి ఈ విషయమును దెలిసికొన
వలయుననెడి కుతూహలము గలుగవచ్చును. ఒక ఇనుప ఖడ్డీని
గొనివచ్చి అందు విద్యుచ్ఛక్తిని ప్రయోగించిరి. ఆఖడ్డీయందు
విద్యుచ్ఛక్తి యథేచ్ఛగా ప్రవేశించెను. తరువాత ఒకకొనను
విషమునందు ముంచి, తిరుగా విద్యుచ్ఛక్తిని ప్రయోగింప
బూనిరి. అదియేమి చిత్రమోకాని విద్యుచ్ఛక్తియందు ప్రవే
శింపదయ్యె! విషము నొకకొనయందుంచుటచే, ఆ ఇనుపఖడ్డీ
యందలి ప్రాణము నశించెననియు, ఆహేతువువలన విద్యుచ్ఛక్తి
యందు చొరలేదనియును బోసుగారు నుడివిరి. విషమును కడిగి
వేసి, తిరుగా విద్యుచ్ఛక్తిని ప్రయోగించగా, ఎప్పటియట్ల అది
ఆఖడ్డీయందు జొచ్చెను. ఇంతియేకాక శ్రీ బోసుగారు పరిశ్రమ
వలనను విశేషశోధనల వలనను వృక్షశాస్త్రమునం దెన్నియో
క్రొత్తవిషయములను మనమెన్నడును కని, విని, యెరుగని వానిని
కనిపెట్టిరి. మొన్న మొన్నటివరకు వృక్షములకు మనుష్యుల
వలెనే భావమును, చింతయుకలదనిన పరిహసించెడివారు. ఇపు
డిది యథార్థమని అంగీకరించబడినది. బోసుగారు తమబుద్ధి
వైశద్యమును జగత్తునంతయు వెదజల్లు నిమిత్తమోయన నొక
యంత్రము నిటీవల నిర్మించిరి. ఆయంత్ర సాహాయ్యముచే,
వృక్షములయొక్క భావములను సూక్ష్మముగా కనుగొననగును.
మొక్కముదరక పూర్వమే, దానిని మరొకతావున నాటిన
బ్రతుకునేగాని, ముదిరి చెట్లయినతరువాత స్థలము మార్చనెంచి
నచో నది మృతిజెందునని మనమనుకొనుచుండెడివారము. ఇది

కేవలభ్రమయని బోసుగారు దృఢపరచిరి. కలకత్తా పట్టణము నందలి వారిశాస్త్రాలయమున (Laboratory) నిటీవల ఊడలు దన్నిన ఒక మహావటవృక్షమును పెకలించి ఎంతయో దూరము బండ్లమీదరప్పించి నాటిరి. ఆవృక్షము వెంటనే నాటికొని కలకలలాడునట్లు చిగిరించినది. ఎటుల నీవిపరీతమును మీరొనగూర్చ గలిగిరని బోసుగారిని గవర్నరు జెనరలుగారగు శ్రీ షెల్మ్సుఫర్డు ప్రభువు ప్రశ్నింపగా, ఆశ్చర్యపడుట కిదియంత ఘనవిషయము కాదనియును, ఆవృక్షరాజమును నిదురించునట్లు తాము కొన్ని మందులను ప్రయోగించితిమనియును, ఆహేతువు వలన విశేషదూరము నుండి గొనివచ్చినను, వృక్షమాయాసమును జెందక సుఖముగా నాటుకొనెననియును నుడివిరి.

అర్థశాస్త్రమునందలి సూత్రములు మార్పులు జెందుచుండును.

నికరములని వాడబడుచుండెడి దృష్టాంతశాస్త్రముల యందు అనేక క్రొత్తవాదములు బయలువెడలు చున్నవియని ఇంతవరకును చర్చించబడినది. ఇక కల్పిత (Hypothética) శాస్త్రమగు ఆర్థికశాస్త్రమునందలి ముఖ్యసూత్రములు మార్పు జెందుచుండు నను సంగతి జెప్పనక్కరలేదు. కొంతకాలము క్రిందవరకును రికార్డో మొదలగు, ఆంగ్లేయఅర్థశాస్త్రిజ్ఞులీశాస్త్రమును భావనశాస్త్రము కాదనియు రసాయన, ఖగోళశాస్త్రములవలె నికరమైనదనియు సిద్ధాంతీకరించిరి. కాని ఇటీవల ప్రొఫెసరు కెయిరన్సు, మార్షలు (Cairns Marshall) గార్లు స్పష్టముగా అర్థశాస్త్రము భావనశాస్త్రమేయని నిర్దేశించిరి. ఇందలి మూలసూత్రములు ఇదమిద్ధములుకావు. ప్రయోజ

నమునందు హ్రస్వములు. శీతోష్ణస్థితిని, భూసారమును, ఖనిజ సంపదను, అపక్వ పదార్థపుంజమును, జనసంఖ్యను, కర్మ కరుల శక్తియుక్తులను, మూలధన ప్రాబల్యమునుబట్టి ఒకానొక దేశమునకు ఒక్కొక్క అవస్థయందుమాత్రము, ఈశాస్త్రమునందలి ముఖ్యసూత్రముల నుపయోగింపనగును. దీనిన్యాయములు సర్వకాల సర్వావస్థలయందును ఉపయోగించుటకు అర్హములుకావు. కావుననే ప్రయోజనమునందు, బాహాటముగా ఉపయోగించుటకు వీలుకలుగదు. ఆప్రత్యేక స్థితిగతులలవడు వరకును, ఈ శాస్త్రమునందలి నీతులు ప్రచ్ఛన్నములు.

అర్థశాస్త్రము శాస్త్రమా ?

ఇట్టిది శాస్త్రమాయని కొందరు సందియ పడవచ్చును. కాని అట్టిసందియము అవసరములేదు. ఇప్పటి అర్థశాస్త్రిజ్ఞులు తాము ఉపపాదించునీతులను చక్కగాబోధపర్చుచు ఆవెంటనే, ఎట్టి స్థితులయందవి యుపయోగార్హములో సూచించుచున్నారు. యానసౌకర్యములు విశేషముగా నలవడుటచే, సకల రాష్ట్రములును ఒక్కపణ్యాచక్రముగా పరిగణింపబడుచుండినట్టియు, వాణిజ్యనైపుణియు కళాకౌశలమును దినదిన ప్రవర్థమానము లగుచుండినట్టియు, వివిధములగు నూతన విషయము లన్వేషించి చక్కగా స్థాపింపబడియున్న సంఘములును పలు తెరంగులగు దొరతనములునుగల, ఇక్కాలమున అర్థశాస్త్రి ముఖ్య సూత్రావశ్యకత అనేక విషయములగు గన్పట్టుచున్నది. పలువిధములగు సాంఘిక దేశీయవ్యవస్థలయందు అనుదినమును దేనిముఖ్యసూత్రముల సాహాయ్య మవసరమగు

చున్నదో, అట్టిది శాస్త్రమనుటకు సందేహములేదు. గనుక దీనిని శాస్త్రముగనే పరిగణించవలెను.

వివిధమతములు.

అన్ని దేశములలోను సర్కారువారు వాణిజ్యవ్యాపారములయం దెట్టిదైన జోక్యమును కలిగించుకొనగూడదని ఖండితముగా వాదించు పూర్వాచార పరాయణులగు (Orthdox school) ఆంగ్లేయ అర్థశాస్త్రజ్ఞుల ననుసరించువారు కొందరు గలరు. క్షేత్రమును, ద్రవ్యోత్పత్తికివలయు సర్వయుపకరణములను ప్రభుత్వమువారే స్వీకరింపవలయునని వాదించెడి సమష్టివాద (Socialistic) ప్రధానులు కొందరు గలరు. ఎవరిమతమును వారు శ్లాఘనీయముగానున్నదని వాదించుటయే కాక ఇతరులను సైతము తన్మార్గావలంబకుల జేయజూచుచున్నారు. ప్రజలయందు నాగరికత హెచ్చుగుచున్నకొలదిని ఆర్థికశాస్త్రమునందు మార్పులు ప్రబలుచున్నవి. దినమునకొక క్రొత్తవాదము బయలు వెడలుచున్నది. ఆయాస్థితిగతుల నాలోచించితిమేని, అట్టివాదము సమంజసముగనే యుండును. ప్రత్యేకమతములుగల శాస్త్రజ్ఞులు బయలు వెడలుటవలన జనించిన వాదాను వాదములు వృథాకాలేదు. "ఒక నియమిత స్థలమునందును, కాలమునందును సంభవించెడి కొన్ని పరిస్థితులకుమాత్రమే, ఆర్థికన్యాయము (Economic Law) ఉపయోగార్హమని నుడివిన బాగుండుననియును, ఆపరిస్థితులు అతి త్వరితముగా మారిపోవుచుండుననియును" ప్రొఫెసరు మార్షలుగారు వ్రాసిరి. "ఆపరిస్థితులు మార్పుజెందిన వెంటనే

ఆ న్యాయము ప్రయోజనశూన్యంబయ్యును, శాస్త్రత్వేనా [illegible] యుండును. అట్టిది శాస్త్రప్రకారము ముఖ్యసూత్ర[illegible] ఉపయోగార్హ మెన్నటికిని కాజాలదు. ఏలనన, [illegible] ప్రత్యే[illegible]ములుండుటంబట్టి ఆనీతి మొదటబోధింప[illegible], [illegible]స్థలమున్నను ఇతరవిషయ సమ్మేళనమువలన మార్పు[illegible]మగును. ఆర్థికశాస్త్రప్రయోగమును, సకల[illegible]నను అత్యంత ప్రయోజనములయ్యును, ప్రతి[illegible] ప్ర[illegible]దేశమును సహజముగ నింతయైన క్రొత్త విష[illegible]మును [illegible]మే యుండుననియును, సాంఘిక పరిస్థితుల[illegible] ప్రమాణాస్పదు క్రొత్తలగు ఆర్థిక నియమముల[illegible] విశదీకరించుచుండుననియును ఒప్పుకొనక [illegible]."*

[illegible] ప్రాముఖ్య జాతీయసంప్రదాయ మతములు§ (Historical and National school) తలయెత్తక పూర్వము ఆంగ్లేయ [illegible] న్యాయములు సర్వజనాదరణీయం[illegible]. [illegible] కాలక్రమేణ వీటిప్రభ సన్న[illegible] [illegible]మునందు సైతము నిరాదరణీయము

* Principles of Economics by Marshal.

§ [illegible] శాస్త్రము[illegible] ముఖ్యసూత్రములయందలి ప్రయోజ[illegible] ఏ దేశమున ఏ [illegible]ములయందు ఎటుల [illegible] చారిత్రాత్మక సంప్రదాయమతము యొక్క విశే[illegible]. ఇతర దేశములయొక్క ఆర్థికపరిణామ చారిత్రమును విశదపర్చుట[illegible] ఆర్థికన్యాయములయొక్క ప్రయోజనత్వమును చక్కగ నిర్ణయించు[illegible].

లగుచున్నవి. ఈ మహాసంగ్రామ సమయమున నెంతయో శ్రమపడి వీరు నెలకొల్పిన ఆర్థికన్యాయము లెల్ల చెల్లాచెదరై నామమాత్రావశిష్టములైనవి. ఆ సిద్ధాంతములు ప్రకృతానుభవమునకు దోడ్పడక చారిత్రాత్మకమైనవి. ఈన్యాయముల యందలి హేత్వాభాసములను ముందుగా ప్రకటించినవారు జర్మను అర్థశాస్త్రిజ్ఞులు. చాలకాలమువరకు జర్మను శాస్త్రిజ్ఞులు సైతము ఆంగ్లేయ శాస్త్రిజ్ఞుల సిద్ధాంతములకు దాసులైయుండిరి. కాని ఈ న్యాయములను జర్మను దేశమునకు ప్రయోగించినప్పుడు, వీని హ్రస్వ ప్రయోజనత్వమును గమనించుటకు వీలలవడినది. ఆంగ్లేయ శాస్త్రిజ్ఞులు ఇంగ్లాండు దేశముయొక్క పరిస్థితుల నాలోచించి ప్రకటించిన స్వేచ్ఛాప్రవర్తక ఆవశ్యకత మొదలగు ప్రత్యేకన్యాయముల ఉపయుక్తతను వీరు ఖండించిరి.

ఆంగ్లేయ అర్థశాస్త్రిజ్ఞుల మతమునందలి దోషములను నిర్భయముగా ప్రకటించి జర్మను దేశమును క్షీణించకుండ కళానైపుణియందును వాణిజ్యకౌశలమునందును జగద్విఖ్యాతయశము వడయునట్లొనగూర్చిన మహానుభావుడు ఫ్రెడరిక్కు

దేశీయసంప్రదాయ మతము జాతీయ గౌరవమునకును, దేశాభిమానమునకును ప్రాముఖ్యత నొసంగును. ప్రతిదేశ ప్రజలును తమ ఆత్మగౌరవమును కాపాడుకొనుటకై ప్రయత్నము చేయుట విధియని ఈ మతముయొక్క ఉద్దేశము. ఆర్థిక న్యాయములను నెలకొల్పునపుడు జాతీయ గౌరవమునకు ప్రాముఖ్యత నొసంగుట అవసరమని ఈ మతము నిరూపించును.

ఈ మతములు జర్మను అర్థశాస్త్రజ్ఞులవలన బయలు వెడలినవి.

లిస్టు అను సుప్రసిద్ధ శాస్త్రివేత్త. ఈమహానుభావుని యాశయము లొక్కజర్మనుదేశమునకేగాక వృద్ధికిరావలయు సర్వదేశములకును సమానాదరణీయంబులు. ఆర్థికనియమములను న్యాయములను పరిశీలించునపుడు, జాతీయతను, దేశాభిమానమును పూర్తిగ గమనించవలసి యున్నదని తెలియజెప్పిన పూరుషుండీతడే !

పూర్వోక్త ఆంగ్లేయ అర్థశాస్త్రిజ్ఞులలోపములు.

పైని ఉదహరించిన ఆంగ్లేయ ఆర్థిక పూర్వోక్త శాస్త్రిమునందలి లోపములుమూడు:—

అందు మొదటిది లోకమునంతయు తనదేశముగ భావించుట. ఈలోకాయతమతము (Cosmopolitanism) వలనిలోపము లెవ్వియనిన, వెవ్వేరుదేశములున్నవని పరిగణించక పోవుటయేగాక, ఆదేశముల యాశయములు సఫలీకృతములగుటకు తగిన సదుపాయములను గలిగించకుండ లోకమునందందరు ప్రజలకును ఏవిధమైన ఆర్థికనియమములను నెలకొల్పిన ప్రయోజనకారిగానుండునో వానినే అన్ని దేశముల వారును ఆచరణములోనికి గొనిరావలయునని ఈమతముయొక్క ముఖ్యోద్దేశము. ప్రపంచముయొక్క క్షేమార్థమై పాటుపడవలయును కాని ఏదేశమున కాదేశము ప్రత్యేకవ్యక్తిత్వమును గాంచ నెంచుట ఈమతప్రకారము దోషము. ద్రవ్యోత్పత్తికినలయు ఏయే ద్రవ్య సాధనములు ఇతర రాష్ట్రముల కంటె స్వదేశమున పెక్కులు స్వయంభువులో, ఆదేశములు అపక్వపదార్థసంచయమును ఉత్పత్తి చేయుటయందే వారిశక్తి యుక్తులను ఉప

యోగకరముచుండవలయును. ఈ మతముయొక్క సారము ఏమనగా అపక్వపదార్థములను అమితముగ గలిగియుండియు, శ్రమావిభాగము బాగుగావికసించని దేశములు శాశ్వతముగా అపక్వపదార్థములనే యుత్పత్తిచేయుచు కళాకౌశలమును విశేషముగ [illegible]యున్న దేశములనుండి చౌకధరలకు సరకులను [illegible]చుండవలయునేగాని, ఎన్నటికిని చిత్రకళలను శిల్పకళలను వృద్ధిచేయ తలపెట్టరాదు. ఏలనన శ్రమావిభాగము [illegible] వలన స్వదేశమునందు విదేశములకంటె [illegible] సరకులను తయారుచేయుటకు వీలుండదని వీరి ఉద్దేశము. వర్ధిల్లుచున్న దేశము లమిత తేజోవంతములగుచుండ [illegible], అనాగరికతచే క్రుంగుచున్న దేశములెన్నటికి ఆ [illegible]నుండి విముక్తిగాంచగూడదని ఈ మతము [illegible] ఫలితము. ఇది ఎంత విశ్వాసార్హమైన నీతియో, చదువరు [illegible] గాక !

కేవల ధనసంపాదనయె ఉత్తమోత్తమమని యెన్నుట [illegible] రెండవ లోపము. ప్రస్తుతలాభమును దక్క [illegible] నీ మతమెన్నటికిని గుర్తించజాలదు. వస్తువుల యొక్క మారకపు విలువను గమనించుట దక్క, ఇతర [illegible] మానసిక, రాజకీయ విషయములను గాని, దేశము యొక్క [illegible]పరిస్థితులనుగాని, ఉత్పాదక శక్తులనుగాని [illegible] ఈమతము ఎరుగదు.

[illegible] లోపమేమనిన, వ్యక్తిత్వమునే (Individualism) ప్రధానముగా [illegible]కొనుట. ప్రపంచమంతయు భిన్నభిన్న రాష్ట్రములుగా విభజింపబడి ప్రత్యేకజాతులచే నివసింపబడు

చున్నదన్న సంగతిని మరచి, మానవకోటినెల్ల నొక్కకుటుంబముగనే భావించుచుండిరి. జాతీయభావములును దేశీయ గౌరవమును ప్రాబల్యముగలవన్న సంగతిని తెలిసికొనజాలరైరి. ప్రపంచమంతయును ఒక్కదేశముగ నున్నపుడు ఎట్లు కళాభివృద్ధి చేయవలెనో ఆవిషయమును గమనించుటయే వీరిమతము.

ఆడము స్మిత్తుగారును వారిశిష్యవర్గమును ప్రపంచమున [illegible] ఒకే [illegible]రాష్ట్రముండి, యుద్ధమను మాట కలలోని [illegible], శాంతియు [illegible] దిగంతవి[illegible]యుండిన నెంతయో శ్రేయస్కరముగ నుండుననియెంచి, [illegible]పరిస్థితు లక్కాలమున నుండినట్లుగనే భావించిన వారలై ఒక [illegible] (Abstruct) వాదమును ప్రకటించిరి. ఆవాదమునందలి విశేషమేమనిన, బాహాటమైన పోటీయును, [illegible] మారకమును వాణిజ్యప్రపంచమున నెలకొనినప్పుడు, దేశమునందు శాంతిని ప్రతిష్ఠించుచు నరాజకము లేకుండ [illegible] ప్రభుత్వము [illegible]. [illegible] ప్రభుత్వము [illegible] ప్రజాపరిపాలనము నందే [illegible] వినియోగించు చుండవలెనని వీరి యభిప్రాయము.

[illegible] స్థితిగతులను ప్రజాభిప్రాయమును అనుసరించి యంత్రకళలకన్న వ్యవసాయమే ముఖ్యమైన దనియును విశేషలాభకారి యనియును, విదేశవర్తకముకంటె స్వదేశవర్తకమే విశ్వాసజనకమనియును ఆడముస్మిత్తు అభిప్రాయపడెను.

ఇంగ్లాండు దేశమునందలి కళలెల్ల బాల్యావస్థయందుండుట చేతను యానసౌకర్యములయందు సైతము విశేషకష్ట నష్టము లుండుట చేతను ప్రభుత్వమువారి సహాయము లేనిదే ఇంగ్లాండు దేశముయొక్క ఆర్థిక సంపద వృద్ధిజెందదను సంగతి అతనికి గోచరించదయ్యె. అక్కాలపు ప్రజాభిప్రాయమునుబట్టి స్మిత్తు గారియూహ సమంజసముగనే యున్నది. పూర్వోక్తశాఖకు చేరినవాడయ్యును, ఆలివరుక్రాము వెల్ (Oliver Cromwell) చే నియమింపబడిన యానసౌకర్య నియమములను (Navigation Laws) దేశీయ సాంప్రదాయమునకు జెందిన అర్థశాస్త్రజ్ఞులవలెనే, అవసరములని నిరూపించెను. ఈనియమముల నామోదించుటలో శత్రువులదాడినుండి ఎవ్విధమైన యాతి బాధలు లేకుండ దేశమును రక్షించుకొనుటయే ప్రాధాన్యము కాని, దేశమును ఐశ్వర్యవంతముగజేయుట అంతప్రయోజన కారి కాదని తెలుచున్నది. ఎల్లప్పుడును పరరాష్ట్రముల నుండియే ఆహారపదార్థములను గైకొననాశించి స్వదేశమునందలి కృషికళను పూర్తిగక్షీణింపజేసినయెడల, మూలధనమును కర్మకరులశక్తి యుక్తులను పరిశ్రమా కౌశలమునందు వినియోగించి, ధనము నమితముగ నార్జించగలిగినను శత్రుదేశములు దాడివచ్చి ఆహారపదార్థములను దిగుమతి కానీయకుండ అడ్డినపుడు, దేశమునందలిప్రజ తిండికి లేక మలమలమాడవలసినదే కదా! ఎంతధనమున్న నేమి? ఆకలిగొన్న వానికి పట్టెడన్నము సాటియగునా! ధనమునుభుజించి తృప్తిచెందినవారు లేరు. కృషి కళక్షీణించినపుడు, యంత్రములు ఆహారమును ఉత్పత్తిచేయ జాలవు. ఆహారము లేనిచో సర్వమును శూన్యము. ఐరోపామహా

సంగ్రామమున ఇంగ్లండు దేశమునకు ఆహారపదార్థములను పోనీయకుండజేసి జయమునొందుటకై జర్మను లొనర్చుచున్న ప్రయత్నముల నెల్లరెరింగియే యున్నారు.

ఇంగ్లాండునకు అమెరికా, రుషియా, హిందూదేశములు తినుబడి పదార్థముల నెగుమతి చేయ నగత్యము లేకుండ, ఆ దేశములోనే వలయుపదార్థము లెల్ల ఫలించుచుండినచో నెంతయో సాహాయ్యముగా నుండును. జలాంతర్గాముల యల జడినుండి, ఇంగ్లాండును కాపాడవలెనని సర్ యడ్వర్డు కార్సను గారెన్నియో మహాప్రయత్నము లొకవంక సల్పుచున్నను, ముఖ్యమంత్రియగు లాయిడుజార్జి ప్రతియకరము ఖాళీస్థలమునందును ఆహారపదార్థములను పైరు చేయవలసినదని యుద్ఘోషించు చున్నాడు. వందలకొలది వత్సరములనుండి మృగయా విహారార్థమై బీడు వడియున్న వేలకొలది యకరముల భూమి నిప్పుడు సస్యాఢ్యగా జేయుటకు ఆంగ్ల ప్రజలపరిమిత ప్రయత్నములు సల్పుచున్నారు. శత్రువులదాడి నుండి దేశమును రక్షించుకొనుట ముఖ్యమైన పనియైయున్న దనియెడి చారిత్రాత్మిక జాతీయ సంప్రదాయ యర్థశాస్త్రజ్ఞుల సిద్ధాంతమును, ఈమహాసంగ్రామము నిరాఘాటముగాబలపర్చినది. వీలున్నపుడు ఎల్లకళలను వృద్ధిచేయ యత్నించవలయునే గాని, ఎన్నటికిని ఇతరదేశములపై పూర్తిగ ఆశపెట్టుకొని యుండి మోసపోరాదని ముమ్మాటికిని ఈయుద్ధము నొక్కి వక్కాణించుచున్నది.

ఎప్పటికైన సర్వత్ర శాంతి నెలకొనగలదను, కాబ్డెను మహాశయుని యూహ సఫలీకృతమగు కాలము రానురాను

కడుదవ్వగు చున్నయది. ఐరోపాఖండమునందు ప్రజ్వరిల్లుచున్న దావానల మెంతలో చల్లవడునో ఎవరును నిశ్చయించ జాలకున్నారు. ఒకవేళ కొలదికాలములో రాజీపడినప్పటికిని మాత్సర్య మడుగంటునని మనమనుకొనుటకు వీలులేదు. సర్వత్రశాంతి నెలకొను ననుమాట కలలోనివార్త. ఈసంగ్రామానంతరమున జపాను, అమెరికాదేశములకు యుద్ధము రావచ్చును. పెనామా జలసంధి తెరచినప్పటినుండియు అమెరికాయుద్ధనౌకలకు జపాను చాలదగ్గర యయినది. ఫసిఫిక్ మహాసముద్రము నందలి ద్వీపములకై ఈరెండు దేశములును పెనగులాడవచ్చును. అసహాయస్థితి యందుండెడి అనాగరికములగు రాష్ట్రములను, బలీయములైన దేశములు ఆకర్షించ నెంచునంతకాలము యుద్ధములు వచ్చుచునే యుండును. మనకున్న దేశముతో మనము తృప్తిచెందవలయునన్న యాశయము, సకలదేశీయుల మనముల నొక్కసారిగా నావరించిన గాని, శాంతివర్ధిల్లు ననుటకు వీలులేదు. కాన నేమరక, సకల రాష్ట్రములవారును ఇతరరాష్ట్రములపై పూర్తిగ ఆధారపడి యుండక తమదేశములయందు కృషి వాణిజ్యాదులను వృద్ధిచేసికొనవలయును.

దేశాభిమానమును, జాతీయ గౌరవమును, బలీయములైన విషయములని రాజ్యతంత్రజ్ఞులు పూర్తిగ గమనించవలసి యున్నది. కేవల ధనార్జనా సాధనములనే పరిగణించ వీలుపడదు. సర్వదేశములను ఒకే. పణ్యచక్రముగ భావించి, బాహాటమగు పోటీల వలనను, మారకమునం దెవ్విధములైన నిర్బంధములను గల్పింపమి వలనను సర్వప్రపంచమునందలి

ఆర్థికసంపదయును వృద్ధిగాంచునను మతము శాస్త్రసమ్మతమే యైనను, ప్రస్తుత స్థితిగతులనుబట్టి ఉపయోగానర్హమైనది.

అర్థశాస్త్రనియమములు ఆయాదేశ స్థితిగతుల ననుసరించి యుండవలెను.

హిందూదేశమువలె ఒక పెద్దఖండముగా నున్నను బ్రిటీషు సామ్రాజ్యమువలె పృథివియందంతటను వ్యాపించియున్నను, జర్మనీ అమెరికా దేశములవలె రాష్ట్రసమావేశనము (Federation), లయ్యును లేదా జపాను సామ్రాజ్యమువలె కొద్దిదేశమును కలిగియున్నను ప్రతిరాష్ట్రమునకు ప్రత్యేకవ్యక్తిత్వముండి తీరునని అర్థశాస్త్రవేత్తలెల్లరు నిశ్చయముగ గమనించవలసి యున్నది. ప్రతిదేశమునకును దానికి సంబంధించిన చరిత్రయందును, సంప్రదాయములయందును, సాంఘికాచారములయందును, భూగోళ విశేషములయందును కొన్ని క్రొత్త విశేషములుండి తీరును. వీనినన్నిటిని ఒకేతీరుగ నుండునట్లు చేయుటకు వీలుపడదుగాన, ఏరాష్ట్రమున కారాష్ట్రము ప్రత్యేక ఆర్థిక న్యాయములను నియమములను గలిగి యుండుట సమంజసము. కేవలము ఆర్థికన్యాయముల ఆధారములవలన మాత్రమే, దేశములను పరిపాలించ వీలులేదు. జాతీయగౌరవమును, దేశాభిమానమును, స్థిరత్వమును గాంచవలెననెడి కుతూహలమును, భోగభాగ్యములయం దౌన్నత్యమును గాంచనెంచుటయును, సర్వదేశములను సకలప్రజలను ఆవరించియుండు నన్న సంగతి జగద్విదితమే! ఎల్లకాలమును దేశమున దరిద్రదేవత తాండవమాడుచుండ నేదేశము ఆర్థిక విషయముల పట్ల

సంపూర్ణ స్వాతంత్ర్యమును గననెంచదు! ఏప్రజలు తమదేశము సైతము ఘనత కెక్కిన ఇతరరాష్ట్రములతో పాటు తమయాత్మ గౌరవము వెలిపుచ్చ, సామ్యము గననెంచరు? జాతీయాభిమానమును, దేశీయగౌరవమును, ప్రజలయొక్కయు దేశములయొక్కయు చర్చలయందును నడవడులయందును బలవత్తరముగ నెప్పుడును గన్పట్టుచుండును. కావుననే ఆర్థిక నియమము లొకానొక దేశమునకు తత్పరిస్థితులనుబట్టి వేరుగ నిర్ణయింపవలసియున్నదని లిష్టు మహాశయుడు సిద్ధాంతీకరించినాడు. దీని ననుసరించి లోకాయతమతమును విడనాడి అర్థశాస్త్రమునందు దేశీయసాంప్రదాయ మతమునకు ప్రాముఖ్యత నీయవలసిన యావశ్యకత.

దేశీయ సంప్రదాయమతము.

దేశీయ సంప్రదాయ మతమనునది వేరొండు శాస్త్రము కాదు. ఆర్థిక శాస్త్రమునందు నిదియొక సంప్రదాయము. ఇందలి విశేషమేమనిన వాణిజ్య, వ్యాపారములయందు నిర్బంధనలుంచుటయును, దేశీయకళలను వృద్ధి నొందించుటకునై రక్షణను దాల్చుటయును, ప్రత్యేకవ్యక్తిత్వమునకు భంగకరములగు కొన్ని విషయములయందు కట్టుబాట్లను చేయుటయునై యున్నది. ప్రజయొక్కయు వ్యాపారములయొక్కయు నడవడులయందు నిర్బంధములు కలుగజేసి సమర్థించుటకు తగు సదుపాయములను గలది ప్రభుత్వమేగాన, దేశీయాన్నత్యమును మనసునందిడుకొని తత్సాఫల్యమునకునై, జోక్యమును కలిగించుకొనుట సర్కారుకు విధి. ప్రభుత్వమువారుదక్క

ఇతరులెవ్వరును ఈకార్యమును నిర్వహించజాలరు. ప్రజాశాంతి, దేశీయాన్నత్యమును, పెంపుచేయుటకంటె ప్రభుత్వమువారికి ముఖ్యవిధులెవ్విగలవు? దొరతనమువారికంటె పౌరులే వారి ఆశయములను ఏసరణి నవలంబించినయెడల సఫలీకృతముగాంచ గలుగుదురో విచారించ సర్థులుగాన, ఆవిషయములయందు పాలకులు జోక్యమును కలిగించుకొనజాలరని ఈమతముయొక్క భావము. వర్తమానపరిస్థితులకు ప్రాచీన ఆంగ్లేయ అర్థశాస్త్రిజ్ఞునిమతము అనుగుణమైనదికాదని నిర్ధారణచేయుటయే దేశీయ సంప్రదాయ మతముయొక్క ఆధిక్యత.

దొరతనమువారు ఏవిషయముల యందు ఎంతవరకు జోక్యమునుకలిగించుకొనవచ్చుననెడి విషయమున పలువురు భిన్నాభిప్రాయులై యున్నారు. ఈసందర్భమున మేమీవిషయమునుగూర్చి ఇంతకన్న విశేషముగ చర్చించవలసిన అవసరములేదు. దేశీయ సాంప్రదాయముయొక్క ప్రయోజనమును ఇంగ్లాండుదేశము సైతము అంగీకరించి చాలవరకు ఆచరణములోనికి దెచ్చినది.

ప్రజారోగ్యమును వృద్ధిచేయుపట్ల ప్రజకే సంపూర్ణ స్వాతంత్ర్యము నొసంగిన, లాభకారి గాదనియును పాలకులే ఈపనిని నిర్వహించ వలయుననియు, అందరును ఒప్పుకొని తీరవలసినదే. ఈవిషయమునుగూర్చి ఎన్నియో శాసనములు ఆంగ్లేయ ప్రభుత్వమువారు ప్రకటించిరి. ఇంతేకాక, విద్యాశిక్షణను కళానైపుణికివలయు బోధనాభ్యాసములకు తగిన సదుపాయముల నమర్చుటయునుకూడ సర్కారువారే వహించ

వలయునని అంగీకరించబడినది. ఆకారణమువలననే పాఠశాలల
యందుచేరి విద్యనభ్యసించుట బలవంతము చేయబడినది. విద్యా
శిక్షణను ప్రజలకు యథేచ్ఛగా విడిచిపెట్టక పాలకులేగైకొ
నిరి. వేయేల! కోట్లకొలది సవరనులను దేశరక్షణమునకును,
ఆరోగ్య విద్యాభివృద్ధులకును, వృద్ధాప్యమునం దొసంగబడెడి
ఫించనులకును, ఉపకార వేతనములకును, వ్యవసాయ కళాభి
వృద్ధికిని బ్రిటిషు ప్రభుత్వమువారు ఖర్చుపెట్టిరి. ఖర్చుపెట్టు
చున్నారు.

అపారముగ నింతధనసంచయమును బ్రిటిషుప్రభుత్వము
వారూరక వెచ్చించుచుండుటలేదు. స్వదేశరక్షణయును,
ఆరోగ్యవిద్యాభివృద్ధులును దేశీయౌన్నత్యమునకు ముఖ్యమని
నమ్మి చేయుచున్నవారలు. "ప్రభుత్వావలంబనము ఈవిష
యములయందు సంఘస్వాతంత్ర్యమునకు వ్యతిరేకమయ్యును,
ప్రజలమెప్పునువడసినది. ఎట్టి ఆదర్శములతో పాలకులీ నియ
మమును పాటించుచున్నారో అవి శ్లాఘనీయములనియును
అత్యుత్తమమైన వనియును ఎల్లరు నెరింగిన విషయమే; కాని
పూర్వోక్తశాఖకుచెందిన అర్థశాస్త్రివేత్తలకు మాత్రము ఇవి
రుచింపవయ్యె. ప్రభుత్వావలంబనయన్న వీరికి అనుమానగ్రస్త
ముగ నుండును. ఏలనన ఆరోగ్యమును విద్యయు వృద్ధియగుట
వలన కలిగెడి ఆర్థికసంప్రదాభివృద్ధి ఇంతయుండునని నిర్ణయిం
చుటకు వీలుచిక్కదు. ఇందులకునై వెచ్చింపబడిన ధనమును
ఇతరత్రా లాభకరమగు పనులయందు ఉపయోగపర్చవచ్చును;
అయిన ఆరోగ్య విద్యాభివృద్ధులకునై ఉపయోగించిన ధనము
లాభకారియగునా లేదా యను విషయము విచారణీయము.

ఈ సందర్భమున మాత్రము ఖర్చునకు లాభము సరిపోవుచు
న్నదా లేదా యను విషయమును ప్రజలు చర్చించ నుంకిం
చుటలేదు. ఎద్దేని యొకానొక ఆదాయ వ్యయపట్టిక నాధా
రముచేసికొని, ఈ మార్గము నవలంబించుటవలనలాభమే
అధికముగ చేకూరుచున్నదని నిర్ధారణచేయుటకు వీలు చిక్క
కున్నను; దేశీయౌన్నత్యము కొరకునై బహిరంగముగగాని
ప్రచ్ఛన్నముగగాని దొరతనము వారెవ్వియేని నిర్బంధము
లను కలిగించినచో, ఆనిర్బంధము లామోదములై యగునని
విశేషప్రజ యేకీభావమును కలిగియున్నది."*

ప్రస్తుతమున కొన్ని పరిస్థితులు ఎల్ల సందర్భముల
యందును ఉపయోగార్హంబులైనను, నిజమైన రాజ్యతంత్ర
జ్ఞుడు ప్రస్తుతలాభము నొక్కదానినే సరకుగొనడు. ఏయార్థిక
నియమములను పాటించిన, తనదేశము ప్రస్తుత నష్టమునకోర్చి
యైన మున్ముందు విశేష ఔన్నత్యమునకు రాగలదో, అట్టి
నీతులనే పరిగ్రహించును. ఏయేపరిశ్రమలును వ్యాపారము
లును ప్రభుత్వమువారు నిర్బంధనలను గల్గించనిచో ప్రస్తుతము
విశేష లాభము నొందుచున్నను, ఆపరిశ్రమలు స్వదేశ ప్రజల
నుండి తప్పిపోయి పరరాష్ట్రముల వారికి లాభకారియగునట్టి
పద్ధతిని భావికాలస్థితులను బాగుగ గమనించి యవలంబించడు.
ప్రస్తుతలాభము, ముందు రాబోవు శాశ్వతనష్టమువలన వమ్మై
పోవునన్న విషయమును బాగుగ గమనించి, ఏ మార్గము నవ
లంబించిన దేశీయ ఔన్నత్యము వృద్ధిజెంది ప్రజల యాత్మ
గౌరవము వన్నెకెక్కునో అట్టి పద్ధతిని బూనియే రాజ్యతం

* The case against Free Trade by Cunninghm.

త్రమును నిర్వహించును. రక్షణ నవలంబించుటవలన, కళా వాణిజ్యాదులు ప్రస్తుతము నష్టమువచ్చినను రానురాను వృద్ధియై దేశమునకు ఔన్నత్యమును దెచ్చును. అట్టి నీతి ననుసరించక అపక్వపదార్థ పుంజము నెగుమతిచేయుచు విదేశ వస్తువులను చౌకధరలకుకొని ఆనందించుచుండిన, ప్రస్తుతము లాభకారియయ్యెను, రానురాను పరిశ్రమలును చేతిపనులును పూర్తిగ నశించినవగుటచే, ప్రతి వస్తువునకును అన్యరాష్ట్రములకు దాసులై, స్వపరిపాలన మన్న కలలోనివార్తయై బానిసతనము ననుభవించుచుండుటయేగాక, ఆత్మగౌరవ మనుమాట మరచి, అనాగరికతవలన అజ్ఞానాంధకార కూపమునబడి దరిద్ర దేవతకుపుట్టినిల్లైబరగుచుండును. జాతీయగౌరవమును దేశాభిమానమును ఏ మార్గావలంబనవలన వృద్ధిని గాంచునో, ఆపద్ధతిని రాజ్యతంత్రజ్ఞుడు ఆచారణములోనికి దెచ్చుటవిధి. ఈ విషయములను చక్కగ పరిశీలించి, అనుభవములోనికి తీసికొనిరాగల సమర్థత ఒక్కదొరతనమువారికే కలదు. కాన మా కెందుకని తప్పించుకొనక, సర్కారువారు ఈ విషయములయందు శ్రద్ధనువహించి మెలగవలసిన యావశ్యకత మెండు.

ప్రభుత్వములు పూర్వము అనేక పొరపాటుల నొనరించినవి. వాని శక్తిసామర్థ్యములను ప్రజాసౌఖ్యమునకు వ్యతిరేకముగ నైతము ఉపయోగించుచువచ్చినవి. ఇకముందు గూడ నట్టి పరిస్థితులు ఒకవేళ తటస్థించిన దటస్థించవచ్చును. అయినను, దేశీయాభ్యుదయమునకు నేయే మార్గము లాచరణీయంబులో, ఆసరణిని శాసన నిర్మాణమును గావించుటకును,

క్రమమైన నియమములను నెలకొల్పి వాణిజ్య వ్యాపారములను నౌకలను నడిపించుటకు తగిన సౌకర్యములు ప్రభుత్వములకు దక్క ఇతరులయందు గానవచ్చుట లేదు.

దేశీయ సంప్రదాయమతము, ప్రభుత్వావలంబనము అగత్యమని యుద్ఘోషించుచున్నది. తన్మార్గావలంబకులై నాగరికతను గాంచిన సకలరాష్ట్రములును సర్వ కళాపరిపూర్తిని గాంచి సంపదలతో తులతూగుచున్నయవి.

అమెరికా, ఫ్రాన్సు, జర్మనీ, జపాను రాష్ట్రము లీపద్ధతి నవలంబించియే ఆర్థిక సంపదను వృద్ధిచేసికొని, సకలజన గౌరవపాత్రంబులై వాసికెక్కినవి. పూర్వమతావలంబకులే యగుచో బిస్మార్కు ప్రభృతి సుప్రసిద్ధులు నామమాత్రావశిష్టములుగావలసినవే! అసాధారణమైన సాంఘిక, రాజకీయ, పారిశ్రామిక వ్యవస్థలను గలిగియున్న హిందూదేశమునందలి మనకు, నితరదేశముల ఆర్థికపరిణామచారిత్రమును, విశేషించి దేశీయవాదుల సిద్ధాంతములును, విశేష అవసరములు. మన దేశస్థితిని జర్చించునపుడు, బ్రిటిషు సామ్రాజ్యముతో మనకు గల సంబంధమును ముఖ్యముగా గమనించవలసి యున్నది. దైవానుగ్రహమువలన ప్రజాస్వాతంత్ర్యాభిలాషియగు నింగ్లాండుతో మనకు పొత్తు సంభవించినది. దేశమునందెల్ల శాంతిని నెలకొల్పి, క్రమమైన పరిపాలన నేర్పరచుటయేగాక, ఒక రాష్ట్రమునుండి మరియొక రాష్ట్రమునకును, ఒక భాగమునందలి ప్రజలనుండి మరియొక భాగమునందలి ప్రజకును, యానసౌకర్యములు వృద్ధిచేయుటంబట్టి ఏవిధమైన యడ్డంకులు

లేక ఇతర ప్రపంచ కళావాణిజ్య చక్రములతో సంబంధము గలిగించబడినది. విద్యావ్యాప్తివలనను పాశ్చాత్య నాగరికతా సంబంధమువలనను, మత సాంఘిక విషయములయందు ఏ మార్పులు కలుగుచున్నను, ఆర్థికస్థితియందు మాత్ర మపరిమితమైన ప్రభావమును కనబరచినది.

ఈస్టిండియా కంపెనీవారి పరిపాలన.

ఇండియా రాజ్యతంత్ర నిర్వహణము చాలకాలము వరకు (1858-వ సంవత్సరమువరకు) ఈస్టిండియా వర్తక సంఘమువారి ఆధీనమున నుండినది. ఆవర్తకసంఘము నన దేశీయాదర్శకములకన్న సహజముగా వారి ఆదాయమును అభివృద్ధి చేసికొనుటయందే హెచ్చుశ్రద్ధను వహించుచుండెడిది. "అన్యదేశవర్తకులును, సరకులను పోటీగా తయారు చేయువారును తమస్వలాభము నాశించి కార్యనియమములను పాటించుచుందురేకాని, ఉత్కృష్టమైన నూతనపద్ధతుల ప్రవేశమును కలిగించి దేశీయకళలను వృద్ధిచేయు నుద్దేశ్యమును కలిగియుండుట కడుదుస్తరము. అట్టి ప్రయత్నములు కూడ చేయబడలేదు. సాధ్యమైనంత వరకు హిందూదేశము నందలి కళలకు బదులు బ్రిటిషు పారిశ్రామికకళలను దెచ్చు నుద్దేశ్యముతో అందుల కనుకూలమైన సరణిని రాజ్యతంత్రమును నిర్వహించిరి." *

పందొమ్మిదవ శతాబ్దారంభమున, నవయంత్ర కళారచనా సాహాయ్యమువలన, విక్రమోపార్జితములైనట్టియు,

* రమేశచంద్రదత్తు.

తన్ప్రజ నలసపోయి సంపాదించినట్టియు, క్రొత్తపణ్యచక్రములయందు పారిశ్రామిక శ్రేష్టత్వము వ్యాపించునట్లు, ఇంగ్లాండు దేశము విజృంభించుచుండ, ఇండియాదేశము వినాశకరములగు అన్యోన్య కలహములతో నిండి, వృద్ధియను మాట నెరుగనిదై కృశించుచుండెను. పురాతన, ఆధునికచారిత్రములయందెల్ల వాసిగాంచినవని పేర్కొనబడిన సుప్రసిద్ధ భారతీయ కళలెల్లరూపణె, శిల్పకారులును కళాదక్షులును వారివృత్తులకుదూరమై వ్యవసాయవృత్తినే శరణ్యముగ గ్రహింపవలసినవారైరి. క్రొత్తగా ట్రంకురోడ్డులను ఇనుపదారులను కఱవు దినములలో నిర్మించుటచే ఆపనులుచేయుటవలన వేల కొలది ప్రజలు యుసురులను నిలబెట్టుకొనగలిగినను, ఈనష్టమును మఱింత హెచ్చించినవి.

అక్రమమైన పోటీ.

"కళాచక్రమున ఈదేశవాసులకుండు సంబంధము దినే దినే క్షీణించుచున్నది. కళాచక్రమునందు మనకుకలుగుచున్న పోటీవిదేశస్థులని వ్యథజెంద నవసరములేదు. కాని పోటీలో ఒకవిశేషముకలదు. యంత్ర ప్రభావమునకును, నిరాధారమగు మానవ పరిశ్రమకును కలుగుచున్నది. స్థిరముగా స్థాపింపబడిన కళాకౌశలమును శాస్త్రప్రభావమును ఒకవంకను, అజ్ఞానమును సోమరితనమును మరియొకవంకను పోరాడుచున్నయవి. ఈ అన్యదేశ పోటీవలన ఆర్థికసంపద మనలను బాయుటయేగాక విశేషమయిన కళాకౌశలమును, సామర్థ్యమును చులుకుదనమునుకూడ మనల విడనాడి ఇతరులజేరుచున్నయవి." *

* Ranade.

హిందూదేశ ప్రత్యేకవ్యక్తిత్వము గమనింపబడలేదు.

ఇట్టిస్థితిలో మన దురదృష్టమునకుతోడు బ్రిటిషురాజ్యతంత్రజ్ఞులు వలసరాజ్యముల యొక్కయు ఆశ్రయదేశముల యొక్కయు ఆవశ్యకములను సరకుగొనక గ్రేటుబ్రిటను యొక్క కళావాణిజ్యముల నెల్లదిశలయందును పాదుకొల్పనెంచి నిరాఘాటముగ రక్షణపతాకమునుదాల్చిరి. కాన ఈస్టిండియా కంపెనీ వారుకాని, బ్రిటిషు రాజ్యతంత్రజ్ఞులుకాని, శిథిలములగుచున్న మనకళలను జీవికలనుగ చేయుటకాని, ఉత్కృష్టమైన నూతనపరిశ్రమలను ఆంగ్లేయకళా విధానము ననుసరించి, నిర్మాణమొనర్చి మనకు బలము కలిగించుటకుకాని, ఏలలపడు మార్గావలంబకులు గాలేదు. తిరుగా గ్రేటుబ్రిటిను (ఇంగ్లాండు, స్కాట్లండు, అయిర్లండు దేశములు) రక్షణమునునిరాకరించి స్వేచ్ఛావర్తకము నవలంబించినపుడు, బ్రిటిషు రాజ్యతంత్రజ్ఞులు ఇండియా దేశముయొక్క ఆర్థికవిషయములపట్ల నిష్కల్మష హృదయులు కాజాలరైరి. ఇతరవిషయముల సందర్భమున ఎన్నియోనూతన సంస్కరణములను ఆచరణములోనికి గొనిరావలయునని వాక్రుచ్చిరేకాని, ఆర్థికవిషయములపట్ల స్వేచ్ఛావర్తకావలంబన యెల్లదేశములకు అమోఘమని నమ్మెడివారు.

మన బ్రిటిషు పాలకులలో పెక్కుమంది, ఇంగ్లండు దేశమున కేసరణి ఆర్థికనియమములు పాటించిన లాభకరముగ నుండునో, ఆవిధానమే ఇండియా దేశమునకు కూడ అనుకూలముగ నుండునని నమ్మియుండిరి. ఇంగ్లాండు దేశ సాదృశ్యము ననుసరించి, ప్రయోజనత్వముకంటె వాదమే ప్రధానముగా

గల ఆంగ్లేయ అర్థశాస్త్రవేత్తలనుగ్రహించిన నియమములనే పాటించుచు, భూసారమునందును, శీతోష్ణస్థితియందును, సాంప్రదాయముల యందును, సాంఘికాచారములయందును, గల భేదములను సరకుగొనరైరి. యక్సైజుపన్నులను* 'సర్కారువారు స్వలాభాపేక్షచేతనే ఈసరకిని తీసివేయక అమలులో నుంచిరనెడి విషయమున మనతో నేకీభవింపక' హిందూదేశ క్షేమమునాలోచించియే ఆపన్నులు విధింపబడినవని పూర్వోక్త శాఖవారి సూత్రములే వేదప్రమాణములని నమ్మనాచరించెడి ప్రొఫెసరు లీస్మిత్తుగారు వ్రాసిరి. స్వేచ్ఛావర్తకమును ఇండియా దేశమునవలంబించునట్లు చేయుట, హిందూ దేశాభ్యుదయమునకు తోడ్పడునని సంపూర్ణ విశ్వాసముతో ఇంగ్లండు దేశము నమ్మినదనియును, అన్యాయముమనే. స్వదేశమునందు నైతమాచరించె ననియును వ్రాసిరి.

సర్కారువారి సహాయ మవసరము.

హిందూదేశ సమస్యలంజర్చించునపుడు తారతమ్యము నెరుంగని నిరుపయుక్తపద్ధతిని (Abstract method) వారవ

*తొలు[illegible] ఇండియా దొరతనమువారు ఇంగ్లాండునుండి వచ్చెడి నూలుసరకులపై నూటికి 3½ వంతున దిగుమతిపన్ను విధించిరి. లంకషైరు వర్తకులు ఆపన్ను ఇండియాయందు తయారగు నూలు సరకులకు రక్షణ నొసంగునదిగా పరిగణించునని భీతిజెంది ఇండియా నూలుయంత్రశాలలయందు తయారైన సరకులకు, ఎగుమతిచేయబడక పోయినను తయారైనవెంటనే, నూటికి మూడున్నరవంతు పన్ను చెల్లించవలసినట్లుగా, ఇండియా దొరతనమువారిని నిర్బంధపరచిరి. ఈపన్నులకు యక్సైజు పన్నులని పేరు.

లంబించుట మేమంగీకరింపజాలము. దొరతనము వారెవ్విధమైన ప్రమేయమును కలిగించుకొనగూడదనెడివాదము ఇండియా దేశపు భావి యౌన్నత్యమునకు ఆటంకమైనది. సర్వసాధారణముగా ఎల్ల విదేశములును, విశేషించి బ్రిటిషు అధినివేశనములు (Colonies) సైతము రక్షణ పద్ధతి నవలంబించి విస్తారము కీర్తి సంపదలను గడించినవి. రాజస్వ, ఆర్థిక నియమముల పట్ల బ్రిటను దేశమునకు ఎట్టి విధానములయందు నమ్మకమున్నను, ఇండియా దేశ సమస్యలను కేవలము ఇండియా దేశముయొక్క అభివృద్ధికి తోడ్పడునట్టి సరణినే చర్చించి, ఆచరణములోనికి గొనివచ్చుట యత్యావశ్యకము. సర్కారువారు వాణిజ్య పరిశ్రమలయందు ప్రమేయమును కలిగించుకొనగూడదనెడి నీతి, ఇండియా దేశమునకు నష్టదాయకమైనది కాని లాభకారికాలేదు. ఆపద్ధతి ఈదేశమునకు సరిపడదు. దేశమునందలి ద్రవ్యసాధనములనెల్ల క్షీణించకుండ రక్షించుచు, ఆర్థికసంపద వృద్ధియగుటకు తగిన పద్ధతుల ననుసరించుచు, ఇండియా దొరతనమువారు దేశీయ ప్రభుత్వముగ మారవలసియున్నది. ఇతరరాష్ట్రపాలకు లేతీరునవారి దేశీయాదర్శములను వృద్ధిజేయు విధానముల నవలంబించుచున్నారో, ఆతీరుననే మనదొరతనమువారు కూడ రాజ్యతంత్రమును నిర్వహించవలసి యున్నది. బ్రిటిషు రాజకీయ పరిస్థితుల ననుసరించి గాని, ప్రజాప్రతినిధి సభ (Parliament) యందలి ఇరుకక్షుల వారి * ఆవశ్యకముల ననుసరించి గాని ఇండియా రాజనీతియం

---

*ఇంగ్లీషు ప్రజాప్రతినిధి సభయందు లిబరలు కక్షియనియు, కాన్సర్వేటివు కక్షియనియు రెండుకక్షులుగలవు. లిబరలుకక్షివారు ప్రజాస్వా

దెవ్విధమైన మార్పులను ఒనరించకూడదు. ఇండియాదేశము ఏపద్ధతి నవలంబించుట వలన ఐశ్వర్యవంతమై వన్నెకెక్కిన యన్యరాష్ట్రములతో సమానగౌరవ మర్యాదలం జెందునో, అట్టిరాజ్య నీతినే శరణ్యమని మనదొరతనమువారు గ్రహించవలసి యున్నది. ఇంగ్లాండు దేశమింకను స్వేచ్ఛావర్తకమునే గణ్యమని యెంచి పూజించుచున్నను, లేదా రక్షణపతాకమును దాల్చినను మనదేశ వ్యవహారములయందు మాత్రము ఇండియాగవర్నమెంటు వారి ఉద్యమమునకు ఎవ్విధమైన అడ్డంకులను గలుగ జేయవలను పడదు. ఇండియా దేశమునకు హితములగు పద్ధతులను, మన దొరతనమువారు ఆచరింపబూనినపుడు ఇండియాకార్యదర్శి అభ్యంతరములు కలుగజేయుట పాడిగాదు. మొన్నమొన్న నూరుమియనుల సవరనులను యుద్ధము నిమిత్తము బ్రిటనుదేశమునకు మన కోశాగారమునుండి ఇండియా దొరతనమువారు దానముచేసినపుడు, అప్పటి ఇండియా కార్యదర్శియగు చేంబర్లైనుగారు ఇండియాదేశ మొనర్చిన సాహాయ్యమును గొనియాడుచు లంకషైరునుండి మనకు దిగుమతి యగుచున్న నూలుసరకులపై నూటికి నాలుగువంతున పన్నును హెచ్చుచేయుటకు అంగీకరించెను. గతసంవత్సరమున హార్డింజి ప్రభువు మాంచెష్టరు సరకులపై పన్నును విధించుట సమంజసమని ఆలోచన చేసినపుడు బ్రిటిషు వర్తకుల ఆశయములను మనమున నిడుకొని హార్డింజి ప్రభువుయొక్క ఆలోచ

తంత్ర్య ప్రధానులు. కాన్సర్వేటివు కక్షివారు రాజ్యతంత్రమునందు మార్పులకు ఇచ్చగించరు. రాజ్యతంత్రమునందు ఏమార్పును కలిగింపక ఉన్నటులనే ఉంచినయెడల శ్రేయోదాయకమని నమ్ముచుందురు.

నను అప్పటి ఇండియా కార్యదర్శి నిరాదరించె నన్న సంగతి మాచదువరు లెఱింగియే యుందురు. ప్రస్తుతము సైతము ఈ క్రొత్తపన్నును విమర్శించుటలో, ఆస్క్విత్తు మహాశయుడు కూడ లంకషైరు వ్యాపారస్తులను పురస్కరించుకొని మనకు వ్యతిరేక వాదమును సల్పెను. యుద్ధానంతరమున ఈవిషయము తిరిగి చర్చించబడునని బోనరు లాగారు వాగ్దానము నొసంగిన తరువాత కదా ప్రత్తి పన్ను పార్లమెంటువారి ఆమోదమును వడసినది! ఈసంగతులను నిష్పక్షపాత బుద్ధితో నాలోచించితిమేని బ్రిటిషు ప్రభుత్వమువారు ఆర్థికవిషయములపట్ల మన యాశయములను గుర్తించక ఇంగ్లండుయొక్క లాభమునే మనసున నిడుకొని రాజ్యతంత్ర నిర్వహణము నొనర్చుచున్నారని ఎవరికి గోచరముకాదు! ఈపన్నైనను స్థిరముగ నుండదని మనకిప్పుడే వాసనలు దగులుచున్నయవి. ఇటీవల ఇంగ్లాండులో సమావేశమైన సామ్రాజ్య యుద్ధసభయందు బ్రిటిషు సామ్రాజ్యమునకు జెందిన ప్రతి భాగమును ఇతర భాగములయందు తయారుచేయబడిన అపక్వ పదార్థ సంచయమునకును పారిశ్రామిక కళలకును విదేశములకంటె ప్రాముఖ్యత నీయవలసి యున్నదని ఏకగ్రీవముగా తీర్మానించబడినట్లు బోనరులాగారు ప్రజాప్రతినిధి సభయందు ప్రకటించిరి. దీనినే సామ్రాజ్య సహాక భాగసాతమని (Imperial preference) యెదరు. ఈపద్ధతిని అవలంబించుటవలన ఇండియాదేశమునకు గలిగెడి లాభనష్టములను ముందు చర్చించుచున్నాము. మనదొరతనము వారీ పద్ధతి నవలంబించిన యెడల విశేషనష్టము మనకు సంభవించి తీరునని మాత్రమిచట సూచించక తప్పదు.

జ్ఞానోదయమును విస్తారముగ గలిగి విజృంభించుచున్న ఇంగ్లండు దేశమున సైతము ప్రజలు, ఈరాజ్యనీతిని పాలించుట యుక్తముకాదని వాదించుచున్నారు. దొరతనమువారు ప్రమేయమును కలిగించుకొనక వాణిజ్య వ్యాపారాభివృద్ధిని పౌరుల యేర్పాటులకునే, విడిచిపెట్టినను ఇంగ్లండుదేశమున విడిచిపెట్టవచ్చును. కాని, పూర్వాచార పరాయణ ప్రియత్వమును, అజ్ఞానాంధకారా వృతమునై యనేక విషయముల పరరాష్ట్రములకన్న వెనుకబడియున్న మన ఇండియాదేశమును వృద్ధికి దేవలయునను యాశయముండినయెడల కళావాణిజ్య చక్రములయందు సర్కారువారి ప్రయత్నము లెవ్విధమైన అభ్యంతరములు లేకుండ సాగించవలసిన యావశ్యకత మెంతు.

రనడేగారి యుద్దేశములు.

1892 సం॥ న పూనానగరమునందు పాశ్చాత్యదేశముల యొక్క భూతకాల, సమకాలిక యార్థిక చరిత్రలను విమర్శించుచు నొక గొప్ప యుపన్యాసమును, కీర్తిశేషులైన న్యాయమూర్తి మహాదేవ గోవిందరనడేగారు గావించిరి. అందలి న్యాయములు సర్వజనాదరణీయంబులై ఇప్పటికిని ప్రజామోదమును వడయుచుండుటయే గాక, నిష్పక్షపాత బుద్ధితో విషయములను పరిశీలించు బ్రిటిషు రాజ్యతంత్రజ్ఞుల మెప్పును సైతము వడయుచున్నవి.

"రికార్డో సంప్రదాయమునకు (Ricardo) సంబంధించిన ఆంగ్లేయ అర్థశాస్త్రి వేత్తల ముఖ్యసూత్రములు సర్వేసర్వత్ర సకల కాలములయందును, స్థలములయందును,

అన్నితరగతుల యభివృద్ధి యందును ఉపయోగార్హములై యుండి తీరవలయుననెడి మతమును, ఐరోపాఖండమునందావి ర్భవించిన ఆధునిక భావము, నిరాకరించుచున్న యది. ప్రత్యేక వ్యక్తిత్వమును మాత్రమే గమనించక, సర్వప్రజలను అంగము లుగా గలిగియున్న సంఘశ్రేయమునే, అర్థశాస్త్రవాదము లాదర్శకములుగ గ్రహించవలసి యున్నదని ఆధునిక భావము లుద్ఘోషించుచున్నవి. పూర్వోక్త మతముయొక్క సంప్రదా యములు వ్యర్థములుగాక జనాదరణీయములు కావలెనని ఎంచినచో, ప్రజారక్షణమును సాంఘికవిద్యయును దేశము యొక్క ఆర్థికసంపదను ప్రత్యేకము ప్రజలకే విడిచిపెట్టబడక సంఘము మొత్తముమీదనే నిర్వహించబడు చుండవలెను.”

ఇట్టి విశాలదృష్టితో ఇండియా దేశముయొక్క ఆర్థిక విషయ ములను విపులముగ చర్చించెను. రాష్ట్రములంబట్టి శ్రమా విభాగముండితీరవలయునని వాదించెడి పూర్వోక్తశాఖయొక్క ఆర్థిక నియమములను సహేతుకముగ ఖండించెను. వెనుక బడియున్న ప్రాగ్దేశములెల్ల అపక్వ పదార్థములను తయారు చేయుచుండే ఎన్నటికిని తమశక్తి యుక్తులను వినియో గించుచుండవలెననియును, అభివృద్ధిని గాంచిన పాశ్చాత్య దేశములు మాత్రమే యానవిధానముల (Transport) యం దును కళాభివృద్ధియందును గుత్తను కలిగి యుండవలెనని వీరి మతముకాదు. ఎచ్చట అపక్వపదార్థములు అపారముగ పైరగుచుండునో, అన్యదేశవర్తకముకంటె స్వదేశమునందలి వర్తకము దేశమున కమితఫలప్రదాయియో, ఏదేశము నందు ద్రవ్యసాధనములు పెక్కులు స్వయంభువులో, శక్తి యుక్తులుగల కర్మకరులకు ఏదేశమునందు వేతనములు కాస్త చౌకయో, అట్టిదేశము, అపక్వ పదార్థముల నితర రాష్ట్రము లకు ఎగుమతిచేసి తిరుగా తయారైన సరకులను గ్రహించు టకుగాను పోగయోడల కూలికి ధనమును వెచ్చించుటకన్న, స్వదేశముననే, ఆయాకళలను వృద్ధినొందించిన కడుసమంజస ముగా నుండునని సహేతుకముగా సిద్ధాంతీకరించెను. గతనలు నదియేబది సంవత్సరములక్రితము పేరు ప్రతిష్టలులేని ప్రాగ్దేశ మునకు చేరిన జపానుదేశము, కళావాణిజ్య వ్యాపారముల యందాధిక్యతనుగాంచి విఖ్యాతశయమువడసిన ఇంగ్లాండు దేశమువలన సైతము మిత్రత్వమును కాంక్షింపబడుట, ఈ వాదమునందలి హేత్వాభాసమును (Fallacy) నిర్ధారణగా వెలిబుచ్చినది. స్వదేశవర్తకమునకును విదేశవర్తకమునకును తోడు, దేశమున ఉచితమైన కళాస్థాపనముకూడ ఉండి తీరవల యును. లేనియెడల దేశమునందలి కళలెల్ల అన్యదేశస్తుల పోటీలవలన నశుగంటె ఇండియాదేశమునకువలె స్వయం సహాయమనునది గగనకుసుమమై పరరాష్ట్రముల నాశ్రయించి యుండు దుర్గతి తటస్థించగలదు.

రనడేగారు గావించిన మహోపన్యాసమునందలి నీతుల ననుసరించి గత ఇరువది ముప్పది సంవత్సరములనుండి మన దొరతనమువారు కొంతవరకు రాజ్యతంత్ర నిర్వాహణ మొనర్చిరి. కఱవులును కాటకములును దేశమున నావరించి యుండి వేలకొలది ప్రజల నాహుతిగొను చుండునప్పుడు వారి యిక్కట్టులను బాపెడి భారమును దొరతనమువారే వహించుచున్నారు. ఇనుపదారులును నీటికాలువలును చాల

వరకు సర్కారువారి ఆధీనములే అయియున్నవి. రైతులను బాధింపకుండుటకునై అనేక రైతాంగపు చట్టములను దొరతనమువారు జారీచేయించిరి. ఋణదాతల బారిబడకుండ రైతులను కాపాడుటకు పరపతి సంఘములు సర్కారు ఉద్యమమువలననే స్థాపించబడినవి. వ్యవసాయ శాఖవారు కృషికళనంతయు సముద్ధరింపవలెనని ఎన్నియో విషయములను బహుదీక్షతో పరిశీలించుచున్నారు. దేశమునందంతటను పారిశ్రామిక విషయములను పరీక్షించి, ఎంతయో యుపయోగకరమగు సంగతులను ప్రజలకు దెలియపర్చిరి. కృషి వ్యాప్తియును, తత్కళాసంరంభమును ఏరీతి సంస్కరణముల నాచరించిన విజృంభించునో కనుగొను నిమిత్తమై 3, 4, సంవత్సరముల క్రిందట పూనానగరమునం దొకసభ సమావేశమయ్యెను. శిల్ప, వాణిజ్య, వ్యవసాయవిద్యల యభివృద్ధినుంద గమనమయ్యును కేవలము ఉపేక్షింపబడుటలేదు. శాస్త్రోక్తమగు విద్యయును, నవీనకళాస్థాపనమును దొరతనమువారి సాహాయ్యమును గ్రహించుచునేయున్నవి. సర్కారునకు వలయు సకల వస్తుసామగ్రిని, సాధ్యమైనంతవరకు ఇండియాదేశముననే కొనుటకు ఏర్పాటులు గావింపబడినవి. అభివృద్ధి ఇంతవరకు ప్రశంసనీయమే. ఇంతకంటె విస్తారముగా కళాభివృద్ధి నొనగూర్చగల సామర్థ్యమును గలిగియుండియు మనదొరతనమువారు రాజకీయయోచనలవలనను, మఱికొన్ని ఇతరయోచనలవలనను మిన్నక యుండవలసివచ్చెను. "కళాభివృద్ధికి సర్కారువారుచేసిన సహాయమును అనాగరికతనుగాంచిన ఇతరరాష్ట్రప్రభుత్వములతో మనమెంచి చూచినపుడు ఇండియా దొర

తనమువారు వెనుకబడియుండిరన్న సంగతి వ్యక్తీకరింపబడక మానద"ని శ్రీయుత ప్రమథనాథ బెనర్జీగారు వ్రాసిరి.

ఈ సందర్భమున సర్కారు ఉద్యమమునకు మనదేశమున నెంత అవకాశమున్నదియు రనడేగారు సూచించియున్నారు. "దొరతనమువారు ఋణముచేసి తెచ్చిన ద్రవ్యమువలనను ఆర్థికసహాయత నొసంగుటవలనను, ఇనుప దారులను నీటికాలువలను నిర్మించగలిగినపుడు నూతనపద్ధతుల ననుసరించి కళాచక్రము నింకను వికసింపచేయుటకు నిశ్చయముగా వీలు కలదు."

1890-సంవత్సరమున పూనానగరమున జరిగిన ప్రథమ కళాసభా ప్రారంభోపన్యాసమున రనడేగారు "జ్ఞానోదయము నమితముగ గలిగిన ఐరోపా అమెరికాదేశ ప్రభుత్వములవలె, ప్రయత్నావస్థ (Experimental Stage) యందైనను దేశీయ కళలను సపక్షకరములయిన పన్నులను (Preferential duties) విధించి, సముద్ధరించగల శక్తి మనకు లేదు. ఫ్రాన్సు, జర్మనీ రాష్ట్రములు తమ నౌకాకళను పంచదారవర్తకమును అభివృద్ధిలోనికి గొనివచ్చుటకు ఏయే విధానముల నాచరించిరో వానిని మన దొరతనము వారినుండి మనము గ్రహించజాలము. సర్కారువారు వసూలుచేసిన పన్నులనుండి కళాభివృద్ధికివలయు ఈవిగాని ఆర్థికసహాయతనుకాని దొరతనమువారిని దయచేయవలసినదని మనము కోరరాదు. మనకు బోధింపబడుచున్న ఆంగ్లేయ అర్థశాస్త్ర నియమములకు ఈ కోరికలు వితండవాద మతములుగ గన్పట్టుచుండును. ఈ నియమముల సత్యా

సత్యములను విమర్శించుటకునై మనమొనరించు చర్చ కేవలము వృథయగునేగాని స్వేచ్ఛావర్తకపథమునుండి వారిని మరలింప జాలమని" వాక్రుచ్చిరి.

ఈ మహానుభావుని వాక్యములయందలి నీతు లిప్పటికిని యథార్థములై యున్నవి. కళాచక్రమునందు దొరతనము వారు ఉచితరీతిని మనకు తగిన సహాయము నొసంగుట లేదని ఎల్ల రెరింగిన విషయమే.

ఇండియా కార్యదర్శి ఆటంకములు.

ఈ సందర్భమున మనమొక సంగతిని గమనించవలసి యున్నది. ఇండియాదొరతనము వారినిగాని స్థానికప్రభుత్వముల వారినిగాని మనము నిందించ నగత్యములేదు. చెన్నపురియందు ఛాటరుటనుగారు కళాశాఖకు డిరెక్టరుగా నున్నపుడు విశేష శ్రమనుతీసికొని ఒక అల్యూమినియము ఫాక్టరీని, చర్మములను క్రోముపద్ధతిని పదునుచేసి జోళ్లు వగైరాలను తయారుచేయుట కొకఫాక్టరీని నిర్మింపజేసి, ఆరెండు కళలను వృద్ధిలోనికి దెచ్చిరి. ఈతీరుననే మరికొన్ని నూతన ఆవేశనములను సర్కారువారు స్థాపించిన మిక్కిలి లాభకారిగా నుండునని ఛాటరుటనుగారు సిఫారసుచేయగా స్థానికప్రభుత్వమువారు అట్లుచేయుట కడు సమంజసముగ నుండునని ఇండియాకార్యదర్శిగారికి నివేదించిరి. సర్కారువారు కళాచక్రమున ప్రమేయమును కలిగించుకొనిన తమ వ్యాపారములు సన్నగిలి కొంపలు కూలునని తలచి ఆంగ్లేయ వర్తక సంఘములవారు స్థానిక ప్రభుత్వమువారి సిఫారసును మంజూరు చేయరాదని ఆందోళనము చేసిరి. జను

లకు స్వేచ్ఛావృత్తిని గలిగించు తలంపుగల కక్షకుచేరినట్టి, విఖ్యాతయశమువడసిన మార్లే ప్రభువు సైతము బ్రిటిషువర్తక సంఘముల యాశయములకు భంగకరములగు నేర్పాటుల జేయ ననుజ్ఞనీయడయ్యె! క్రొత్తక్రొత్త యావేశనముల స్థాపించు టకు అనుజ్ఞనీయలేదు సరికదా. అదివరకు ఉండియున్న రెండు ఫాక్టరీలనుగూడ ఇతర కంపెనీలకు అమ్మివేయవలసినదని తీర్మానించెను. అధికారవర్గమునకుచేరిన వారి యాజమాన్యము క్రిందనుండుటకుగాను ఒక ఉన్నత సాంకేతిక విద్యాలయమును (Technological Institute) మద్రాసునందు స్థాపించుట అవసరమనికూడ ఇండియా కార్యదర్శిగారికి నివేదింపగా, ఈ సిఫారసును సైతము మార్లేప్రభువు నిరాకరించెను. ఇంతయేల యుద్ధమువలన కలిగిన పరిస్థితుల మూలమున వ్యయాధికమగు టచే క్రొత్తపన్నులను విధించుటకుమారుగా మ్యాంచెష్టరు సరకులపై పన్నును విధించుట సమంజసముగ నుండునని హార్డింజిప్రభువరేణ్యుడు ఇండియా కార్యదర్శిగారికి నివేదింపగా ఈ సిఫారసుసైతము నిరాకరింపబడినది. స్థానికప్రభుత్వము లును ఇండియా దొరతనమువారును మనకు సహాయముచేయ నెంచినను ఇండియా కార్యదర్శి ఆటంకములు కలుగజేయు చుండునని దీనినిబట్టి మనము తెలిసికొనవలసియున్నది. కాన దొరతనమువారిని నిందించిన లాభములేదు. కళావాణిజ్యచక్రములయందు బ్రిటిషుప్రభుత్వమువారు ఇండియా దొరతనము వారికి స్వేచ్ఛను ప్రసాదించిననేకాని, మనదేశాభివృద్ధికినలయు ప్రయత్నములనుచేయ వీలలవడదు.

భారతీయులన్న ఏవగించుకొను కర్జను ప్రభువంతటి మహానుభావుడు సైతము 1908 సం॥ మేనెల 24-వ తేదీని ప్రభువులసభలో నిట్లు ప్రసంగించెను:—"భరతఖండమును ఏకచ్ఛత్రముగ నేలుచున్న ఇండియా కార్యదర్శిగారి అధికారమున హిందూదేశ ఆర్థికస్వాతంత్ర్యవిషయ మెట్లున్నదో నిష్పక్షపాతబుద్ధితో పరిశీలించెదము. తన యభిప్రాయముతో సరిపోయినను లేకున్నను ఇండియా దొరతనమువారు ఆర్థిక వ్యవహారమందు ఇండియాకార్యదర్శిగారి యభిప్రాయమును బడయవలసియున్నది. భారతీయుల సలహాకంటె ఇండియా కార్యదర్శిగారి అభిప్రాయమునే ఆంగ్లేయులు పాటించుచున్నారు." ఇట్టి నిదర్శనము లెన్నియోగలవు. ఇటీవల ప్రత్తిపన్నును పార్లమెంటువారంగీకరించుట, బ్రహ్మాండమైనది. ఈ మహాసంగ్రామమువలన బ్రిటిషుప్రజల దృక్పథమునందు కొంత మార్పుగలుగుట చాల శుభసూచకము. "మనము హిందూదేశక్షేమార్థమే పాటుపడుచున్నారమనియు, వారి క్షేమమునే మనక్షేమముగ నెంచుకొనుచున్నారమనియు వారు గ్రహించునట్లు మనము వర్తింపవలెనని" హార్డింజి ప్రభువు వ్రాసియున్నాడు. ప్రత్తిపన్నుల విషయమై చేయబడిన చర్చలో ఛాంబర్లెయినుగారు ఇండియాయొక్క ఆధిక్యతను బలపరచిరి. ఆ సందర్భముననే లాయిడు జార్జిగారుకూడ హిందూదేశలాభమే ఆంగ్లేయులలాభమని వ్యక్తీకరించిరి.

కాన లాయిడుజార్జిగారు మనలను కరుణించి ఇండియా దొరతనమువారికి కళావాణిజ్యసందర్భముల సంపూర్ణస్వాతంత్ర్యమునొసంగి మనకృతజ్ఞతకు పాత్రులగుదురు గాక! సామ్రాజ్య సపక్షభాగసిద్ధాంతము వలసరాజ్యములకును ఇంగ్లాండునకును లాభకారియైనను మనదేశమునకు నష్టదాయకము గాన 1913-వ సంవత్సరమున అప్పటి కోశాగారమంత్రియగు సర్ గ్రెష్టీటు వుడ్ విల్సనుగారు సామ్రాజ్యశాసన నిర్మాణసభయందు సామ్రాజ్యసపక్షభాగ సిద్ధాంతము మనకు లాభకారి గాదని నిర్ణయించుటకు సెలవిచ్చిన హేతువులనుపాటించి, ఆర్థిక స్వాతంత్ర్యమును మనకు ప్రసాదించెదరు గాత!

పయినవివరించుకొనిన వివిధఆర్థికవిషయములను ప్రపంచమొత్తముమీద చర్చించుటయేగాక ఆయాప్రత్యేకభాగములకు సంబంధించిన విషయములను విపులముగ చర్చించుట ముఖ్యము. ఈనీతి ననుసరించియే హిందూదేశ అర్థశాస్త్రవిషయముల ప్రత్యేకపఠనావశ్యకత కలుగుచున్నది.



ఉత్పత్తి

PRODUCTION.

హిందూదేశ నైసర్గిక ద్రవ్యసాధనములు.

మనపూర్వసుకృతమువలననో లేక పుణ్యభూమియని పురాణప్రశస్తిని బడయుటచేతనో, భరతఖండమునందు ద్రవ్యసాధనములు పెక్కులు స్వయంభువులు. ఆహారపదార్థములకునై మన మొకరిని ఆశ్రయింప నగత్యము లేదు. కొన్ని పదార్థములయందు ప్రపంచమునందంతటను సంపూర్ణమైన గుత్త (Monopoly) మునకూడ కలిగియున్నాము. సకల కళాభివృద్ధికిని వలయు నుపకరణములు మనదేశమునం దపరిమితములు. భూతలమునందలి సకలరాష్ట్రములనుండియు మనదేశము ప్రత్యేకింపబడినను, సకలసౌఖ్యముల ననుభవించుచు నాగరికతనుగాంచిన రాష్ట్రమనియే పేరుపొందగలము.

ద్రవ్యసాధనములు.

మన దేశమునందలి ద్రవ్యసాధనములను మూడువిధములుగ విభజింపనగును:—1. ముఖ్యమైనపంటలు. 2. అడవులు. 3. గనులు, ఖనిజసంపద. అందు ప్రథమమున పంటలనుగూర్చి ముచ్చటించెదము.

ముఖ్యమైన పంటలు.

పంటలలోకూడ అనేక తెగలుకలవు. ధాన్యములు, పప్పుదినుసులు, నూనెగింజలు, తోటపంటలు నారనుతీయు మొక్కలు, ఓషధులు, నిషావస్తువులు, రంగులు.

ధాన్యములు.

మనదేశమున పైరగు సకలధాన్యములలోను వరి ఉత్తమోత్తమమైనది. మూడువంతులు మన దేశస్థులందరికిని వరిధాన్యమే ముఖ్యమైన ఆహారపదార్థము. సాధారణముగా నూటతొంబ్బదివేలచదరపుమైళ్ళ వైశాల్యముగల భూమియందు వరి పైరగుచున్నది. ఇందు సగమునకు సుమారు బంగాళా రాజధానియందే పైరగుచున్నది. విదేశముల కెగుమతి చేయకుండినచో, ఒక్కగంగానది డెల్టాయందు పండినపంట మన దేశమున కంతకును సమృద్ధిగా సరిపోవును. ఇటీవల, ఇతర ప్రదేశములకంటె బర్మా, ఆస్సాము రాష్ట్రములయందు విశేషముగ వరి పైరగుచున్నది.

వరిపంటను విశేషముగ సేవ్యముచేయుచున్న
ఇతరరాష్ట్రములయందలి వైశాల్యము.

బర్మా	13,000	చదరపుమైళ్ళు.
ఆస్సాము	5,000	,,
సంయుక్తపరగణాలు	11,000	,,
చెన్నరాజధాని	10,000	,,
మధ్యపరగణాలు	7,000	,,
బొంబాయి రాజధాని	4,000	,,

కఱవులు కాటకములు లేక సుభిక్షముగానుండు సాధారణ సంవత్సరములలో మనదేశమునుండి బియ్యము విశేషముగ ఎగుమతి చేయబడుచుండును.

ఎగుమతులు.	హాండ్రెడు వెయిట్లు.	విలువరూప్యములు.
1899-1900 సంవత్సరముతో అంతమగు 10 సంవత్సరములలోను మొత్తముపైని సంవత్సరమునకు	31,500,000	13 కోట్లు.
1903-04 సంవత్సరమున	44,000,000	19 కోట్లు.

బియ్యముచాలవరకు బర్మారాష్ట్రమునుండి, ఎగుమతి చేయబడు చున్నవి. బంగాళా రాజధానికన్న వరిపంటయందిచ్చట చాలతక్కువది యయ్యెను, ఈరాష్ట్రమున ఎగుమతికొఱకు నైనమే వరి పైరుచేయబడుచుండును. ఇతర భాగములయందు స్థానిక ఉపయోగార్థమే పండింపబడుచుండును. కాలము సుభిక్షముగా లేనపుడు విదేశముల కెగుమతిచేయబడు బర్మాబియ్యము మనదేశమునందే వినియోగింపబడుచుండును. పంటయందు మనకు గుత్తకలదు గాన ఎగుమతులమీాద అధికమగుపన్నును విధించి రేవిన్యూను అభివృద్ధి చేయవచ్చును.

గోధుమలు.

ఈపంట విశేషముగా ఉత్తరహిందూస్థానమున శీతకాలమునందు పైరగుచున్నది. దక్షిణహిందూస్థానమున అంతగా లేదు. 31,000 చదరపుమైళ్ళకు అధికముగా మనదేశమున గోధుమలు పైరగుచున్నవి.

	వైశాల్యము.
పంజాబు, సరిహద్దురాష్ట్రములు	13,600
సంయుక్తపరగణాలు	12,200
బీరారును మధ్యపరగణాలు	5,300
బొంబాయిరాజధాని (స్వదేశసంస్థానములు సహా)	3,400
బంగాళము	2,300

గోధుమలు పైరగుచున్నవి.

గోధుమలుకూడ సాధారణముగా ఇంగ్లాండునకును, ఇతర రాష్ట్రములకును ఎగుమతిచేయ బడుచుండును. ఎగుమతులయొక్క పరిమాణము కాలమునుబట్టి మారుచుండును. కఱవువచ్చినను, కఱవువచ్చునని తోచినను, ఎగుమతులు మందగును, పండిన దినుసు మనదేశమునందే వినియోగ మగుచుండును.

	హాండ్రెడు వెయిట్లు.	విలువ.
1899-1900 సం॥ అంతమగు 10 సంవత్సరములలోను, సంవత్సరమునకు సుమారు	12,500,000	...
1900-1 సం॥ పెద్దకాటకముపట్టుటవలన	500,000 మాత్రమే	...
తిరిగి 1903-04 సం॥న	26,000,000	11 కోట్లు.

1903-వ సంవత్సరమున ఇంగ్లాండుదేశమునకు దిగుమతియైన 60,000,000, హాండ్రెడు వెయిట్లగోధుమలలోను మనదేశమునుండి 17,000,000 హాండ్రెడు వెయిట్లును, అమెరికా సంయుక్తరాష్ట్రములనుండి 24,000,000 హాండ్రెడు వెయిట్లును,

రుషి[illegible] సుమారు 17,000,000 ఎ[illegible]
చేయబడినవి. దీనిని బట్టిచూడ గోధుమపంట[illegible] మనకు సహజమైన గుత్తకలదని తెలుచున్నది. భూ[illegible] క్రుంగుచున్న నేలపన్నును అధికముచేయు ప్రయత్న[illegible], దేశమునుండి ఎగుమతి కాబడు ఆహారపదార్థములపై [illegible] పన్నులను విధించి, దేశక్షేమమునకై ద్రవ్య[illegible] చేయవలసి యున్నది.

జొన్నలు, చోళ్ళు, పప్పుదినుసులు విశేషముగ [illegible] చున్నవి కాని అవి స్వదేశమునందే విస్తారముగ [illegible] బడుచుండుటచే అంతగా వ్రాయ నవసరము లేదు.

1903-04 సంవత్సరమున	ఎగుమతులు.	విలువ.
జొన్నలు మొదలగునవి	2,000,000 హండ్రెడు వెయిట్లు	71 [illegible]
కాయ ధాన్యములు శెనగలు, ఉలవలు మొదలగునవి.	2,500,000 ,,	91½ [illegible]

మొత్తముపైని 1916-17 సం॥ న 34 కోట్ల [illegible]ముల ధాన్యములు మనదేశమునుండి ఎగుమతి [illegible].

నూనెగింజలు.

గవర్నమెంటు వారి లెఖల ప్రకారము సుమారు 19,000 చదరపుమైళ్ళ వైశాల్యముగల ప్రదేశము [illegible] నూనెగింజలను పైరుచేయుటకునై వినియోగింపబడుచున్నది.

ఇం[illegible] [illegible]ప్రదేశము బంగాళముసకు చెందియున్నది. [illegible] చెన్న రాజధానుల యందును మధ్యపరగణాల యందును మూడేసివేల మైళ్లు సేద్యము చేయబడుచున్నవి. ఇతర భాగములయందు మరియొక పైరుతో మిశ్రితములై [illegible]యోగము నిమిత్తము పైరు చేయబడుచున్నవి. మన దేశమున నూనెను తీయు యంత్రములు విరివిగా లేని హేతువుచే, ఇతర రాష్ట్రములకు మన అపక్వపదార్థమును ఎగుమతి చేసి [illegible] చేయబడిన నూనెలను గ్రహించుచున్నాము. ఇం[illegible] నష్టములు రెండు:-పొగ మోడలకు రెండుసార్లు [illegible]కొనుట [illegible]. మన కృషికశల కెంతయో సహా[illegible] [illegible]లకపిండిని విదేశముల కొసగి నష్టపడుట మరి[illegible]. [illegible] మన దేశమున అభివృద్ధిగాంచకుండుట గొప్ప నష్టము.

ఎగుమతులు.	హండ్రెడు వెయిట్లు.	విలువ.
1891 1900 సం॥ లో అంతమగు పదిసంవత్సరములలోను సంవత్సరమునకు సుమారు	16,750,000	11 కోట్లు.
1903-04	24,500,000	14½ కోట్లు.

నూనెగింజలలో ముఖ్యమైనవి: నువ్వులు, అగిసెవిత్తులు, ఆవాలు, ఆముదపుగింజలు, వేరుశెనగకాయలు.

అగిసెవిత్తులు.

సుమారదు 5,000 చదరపుమైళ్ళ ప్రదేశము పైరుచేయబడుచున్నది. మధ్యపరగణాలయందు ఈపంట విశేషము.

బొంబాయి, బంగళాము సంయుక్తపరగణాలయందుకూడ విస్తారముపైరగుచున్నది. వైశాల్యమున, నూనెగింజలలో మూడవస్థానము నలంకరించినను, ఈపంట మిగిలిన పదార్థములకంటెను అధికముగ ఎగుమతి చేయబడుచున్నది. 1898-99—1903-04 సం॥ ల మధ్య 5,000,000 హండ్రడువెయిట్లనుండి 9,000,000 వరకు ఎగుమతులు పెరిగినవి. సమశీతోష్ణతగల ప్రదేశములలో ఈమొక్కలనుండినారనుకూడ తీయుదురు. ఈసందర్భమున, నాదేశమునచేసిన ప్రయత్నములంతగా జయప్రదములు కాలేదు.

నువ్వులు.

బంగాళమున ఈపైరు ఇతరరాష్ట్రములకన్న అధికముగ సేద్యము చేయబడుచున్నది. దేశపు మొత్తము పైని 6,600 చదరపుమైళ్లు సేద్యమునందున్నది. నూనె యొక్కయు, తెలకపిండియొక్కయు ఉపయోగమును వివరించి వ్రాయ నగత్యములేదు. ఈపంట విస్తారముగా దేశమునందలి వాడుక నిమిత్తమే పైరు చేయబడుచున్నది.

వేరుశెనగకాయలు దక్షిణహిందూస్థానమునందు విశేషము. ఆముదపు గింజలపంట బొంబాయి రాజధానియందు దక్షిణము. గసగసాలు, కొబ్బరి విస్తారముగా చెన్నరాజధానియందు పైరగుచున్నవి.

నూనెగింజలనుండి నూనెను తయారుచేసి వానిని ఎగుమతిచేయుటకు బదులుగా, ఆగింజలనే ఎగుమతి చేయుటవలన కృషికళకు విస్తారనష్టమున్నదని ముందు సూచించి యున్నాము. తెలకపిండి క్షేత్రముయొక్క సారమును హెచ్చించి పం

టలు పుష్కలముగా పండుటకై ఎంతయో ఉపయోగముగా నుండును.

తోటపంటలు.

తోటపంటలలో నెల్ల చెఱకు ముఖ్యమైనది.

చెఱకు.

పంచదార విస్తారముగా చెఱకునుండి తయారు చేయబడుచున్నది. కొంతవరకు తాటి కల్లునుండి ఈత కల్లునుండికూడ తయారు కాబడుచున్నది. ముఖ్యమైనది చెఱకు పంచదార. అనేకరంగులుగల చెఱకు పైరు చేయబడుచున్నది.

బీటుచక్కెర* యొక్క పోటీవలన ఏటేట చెఱకు పైరు క్షీణించుచున్నది.

1889–1900 సంవత్సరముతో అంతమగు 10 సం॥ లోను ఏటేట సుమారు	4,400	చదరపుమైళ్లు	చెఱకు వ్యవసాయము జరగుచుండెడిది.
1903-04 సం॥ లెక్కల ప్రకారము	3,600		

దీనిని బట్టి మనము గ్రహించిన విషయము ఏమనిన, నాలుగైదు సంవత్సరములలో 800 చదరపుమైళ్ల వైశాల్యముగల భూమి మరియొక పైరునకై వినియోగింపబడుట. ఇది

---

* బీటు అనే ఒక విధమైన దుంప గడ్డనుండి తయారుచేయబడుచున్న పంచదారకు బీటు చక్కెర అనిపేరు. విశేషముగా ఈచక్కెర జర్మనీ దేశమున తయారు చేయబడుచున్నది.

ఎంత శోచనీయమో చదువరు లూహించెదరుగాక! 1909 సం॥ న మనదేశమునందు 2.1 మిలియన్ల ఎకరముల భూమి యందు పైరు చేయబడినది.

	ఎకరములు.
వంగ, విహార రాష్ట్రములు	478,000
అస్సాము	36,500
బొంబాయి, సింధురాష్ట్రములు	62,900
చెన్న రాజధాని	87,500
పంజాబు పశ్చిమోత్తర సరిహద్దు రాష్ట్రములు	447,600
సంయుక్త పరగణాలును, అయోధ్య	10,00,000
బీరారు మధ్యపరగణాలు	20,900
బర్మా	12,200
మొత్తము మిలియన్లు	2.1

1910 సంవత్సరమున $2\frac{1}{4}$ మిలియన్ల టన్నుల చెఱకు పైరు చేయబడినది. చెఱకు పంచదార వ్యాపారమును గురించి ఒక పెద్దగాథ కలదు. ఈస్టిండియా కంపెనీ వారి యజమాన్యము క్రిందకు మనదేశము రాక పూర్వము విదేశములకు మన శర్కర ఎగుమతి కాబడుచుండెడిది! ఇప్పుడది యంతయు తాఱుమాఱై, ఇతరరాష్ట్రములకు ఎగుమతి చేయుటకు బదులుగా జావా, మారిషస్, జర్మనుదేశములను మనమాశించ వలసివచ్చినది. గతసంవత్సరమున 15 కోట్లరూప్యముల చక్కెర మనకు దిగుమతి అయినది. 1903-04 సంవత్సరమున

మన దేశమునకు ఇతర దేశములనుండి $5\frac{1}{2}$ కోట్ల రూప్యముల విలువగల చక్కెర దిగుమతి అయినది. 1916-17 సంవత్సరమున 15కోట్ల రూప్యముల విలువగల చక్కెర దిగుమతి అయినది. 12 సంవత్సరములలో సుమారు 10 కోట్ల రూప్యముల విలువగల చక్కెర అధికముగా దిగుమతి అయినది. దీని నాపుటకు మనదేశముననే చెఱకు విస్తారముగా పైరుచేసి చక్కెర చేయుటకు ప్రయత్నములు సల్పబడవలెను.

నారనిచ్చు మొక్కలు.

ప్రత్తి, గోగు, జనుము మొదలగు నారదినుసులు.

ప్రత్తి.

ఉష్ణదేశముల యందు విశేషముగ పెరుగును. తరహానుబట్టి 5 లేక 8 నెలలకు పైరగుచున్నది. వర్షములు విస్తారముగా కురియ నగత్యము లేదు. రేవటి నేలలయందు ఈ పైరునకు పెట్టినదిపేరు. మనదేశమునందలి ప్రత్తి తగిన ఎరువులను వేసి సత్తువచేయనందువలనను అనేకరకముల విత్తనములు కలిసిపోవుచుండుటవలనను, పరిశుభ్రమైన నూలును తయారు చేయుటకు వీలలవడుటలేదు. 20, 40 నంబర్ల మోటునూలు తప్ప 150, 200 నంబరుల నూలు తయారగుటలేదు. ఈజిప్టు దేశపు ప్రత్తిని పైరుచేసినను ఏటేట మనదేశమునందు క్షీణించి దూది తక్కువ అగును. అన్యదేశముల ప్రత్తిని మనదేశమున పైరుచేయుటవలన పురుగులు పట్టుటవలనను, అతివృష్టి అనావృష్టిదోషములవలనను, ఆయాదేశమునందలి పైరుకన్న విశేష నష్టమును పొందును. యకరమునకు సుమారు $1\frac{1}{4}$ బంగాళా

మణుగుల ప్రత్తియును 3¾ మణుగుల గింజలును తయారగును. ప్రత్తిగింజలుకూడ హెచ్చువిలువకలవి. వీటినుండి నూనెను తయారుచేయుచున్నారు. 1911-సం॥ 40 లక్షలు ఇంగ్లీషు బారువల ప్రత్తిగింజలు ఎగుమతి చేయబడినవి. విలువ 10 లక్షల సవరనులు అనగా కోటిన్నర రూప్యములు.

ప్రశస్తమైన అమెరికాదేశపు ప్రత్తితో సమానమగు 'కంబోడియా' అను ఒకవిదేశపుప్రత్తి మన చెన్నరాష్ట్రము నందు పైరుచేయబడుచున్నది. స్వదేశమునందలి జాతులకన్న ఎకరమునకు 4, 5 రెట్లు హెచ్చుగ ఈప్రత్తి తయారగుచున్నది. 1912 సంవత్సరమున 400 పౌన్లు బరువుగల 80,000 వేలబేళ్ళ కంబోడియాప్రత్తి పైరయినది. ఈజాతిప్రత్తి అలతికాలమున హిందూదేశమునందలి ప్రతిభాగమునను పైరుకాగలదు. సింధు రాష్ట్రమున ఈజిప్టుదేశపు ప్రత్తిజయప్రదముగా పైరు చేయబడినది. కానివేగముగా ఈజాతిక్షీణించును. 1911 సంవత్సరమున 14.3 మిలియన్ల ఇంగ్లీషుబారువుల ప్రత్తితయారుచేయబడినది. 1916-17 సంవతర్సమున 56 కోట్ల రూప్యములదూది మనదేశమునుండి ఎగుమతికాబడినది. మనవాంఛలు తీరుటకునే గాక ఇతరరాష్ట్రములకు ఎగుమతి చేయుటకుకూడ చాలినంత ప్రత్తి మనదేశమున పైరగుచునేయున్నది. యక్సైజుపన్నులను తీసివేసినయడల ఇదివరకు చాలకాలమునుండి మనగుత్తయందున్న చీనాపణ్యాచక్రమును జపానుదేశముకొల్లగొనకుండఆపుకొనగలము. ఇంతియేగాక సర్కారువారు రక్షణత్వము నవలంబించినయడల మ్యాంచెస్టరు పోటీవలన ఏనష్టములు లేకుండ మనదేశముననే నూలును, బట్టలను, తయారు చేసికొనుటకు

వీలలవడును. ప్రస్తుతమున పణ్యాచక్రములయందు మ్యాంచెస్టరునకు ప్రాముఖ్యతతగ్గి జపాను దేశముయొక్క ప్రభ హెచ్చగుచున్నది. విదేశములనుండి 1916-17 సం॥ మనదేశమునకు 60 కోట్ల రూప్యములబట్టలు దిగుమతి అయినవి. మనదేశమునుండి దూదినిపంపి నూలును బట్టలును గ్రహించుటకన్న స్వదేశముననే ఆకళ విజృంభించినచో ఎంతయొతృప్తికరముగ నుండును.

గోగునార, జనుమునార.

ఈపైరునందు మనదేశమునకు ప్రపంచమునందలి ఎల్లదేశములయందును గుత్తకలదు. విస్తారముగా ఎగుమతిపన్నులను విధించి, ఎన్నియో ప్రయోజనకరములగు కార్యములను నిర్వహించుటకునై, మనదొరతనమువారు దేశాదాయమును వృద్ధిచేయనగును. ఎంతపన్నును మనమువిధించినను మనదేశమునుండి ఇతరరాష్ట్రములు ఈనారను కొనియే తీరవలెను. అట్టిపన్నును ఇచ్చుటకు ఇష్టముకానివారు వారివ్యాపారములనే ముగించుకొనినచో, అదిమరింత సుకరమైనపని. ఈ పైరునకు వినియోగింపబడు ప్రదేశమునందు ప్రత్తినివిశేషముగ పైరు చేయవచ్చును. అదియునుగాక గోనిపట్టాలను తయారుచేసియే, మనముఎగుమతి చేయవచ్చును. అందువలనమనకు మరింతలాభమధిక మగుచున్నది. జర్మను శాస్త్రకారులుకూడ దీనికి ప్రతి మరియొక నారనుసృష్టిచేయలేరు. ఇతరరాష్ట్రములవారు మన దేశమునుండి గోగునారను గ్రహించనగత్యము లేకుండుటకునై తిరిగి విశ్వామిత్ర మునిపుంగవుడు అవతరించి ప్రతిసృష్టిని ఆరంభింప వలయునేకాని కేవల మనుష్యమాత్రునివలన కానేరదు!

గోగునారపంట బంగాళమునం దధికము. సుమారు 4,700 చదరపుమైళ్ళ వైశాల్యమున ఆరాష్ట్రమునందిది పైరగుచున్నది. ఆస్సాము, నేపాళరాష్ట్రములయందుకూడ కొద్దిగ పైరుచేయబడుచున్నది. బర్మా, సరిహద్దురాష్ట్రములయందు మిక్కిలి స్వల్పము. ఎకరమునకు సాధారణముగ 15 బంగాళదేశపు మణుగులబరువుగల ప్రశస్థమైననార తయారగుచున్నది. కాని బాగుగా పండినపుడు దీనికి రెండురెట్లుకూడ తయారగుట కలదు. 1911-సంవత్సరమున 29.4 మిలియన్ల ఇంగ్లీషు బారువల గోగునార తయారైనది. అందు 16.2 మిలియన్ల బారువలకుపైగా ఎగుమతికాబడినది. 1903-04 సంవత్సరమునందు ఎగుమతులు 14,000,000 బారువలు. ఏడెనిమిది సంవత్సరములలో 2½ మిలియన్ల బారువులు అదనముగా ఎగుమతిచేయబడినవి. విలువ సుమారు 14 కోట్ల రూప్యములు. నారను ఎగుమతిచేయుటకన్న, తయారైన సంచులు వగైరాలను ఎగుమతిచేయుట ఎంతయో లాభకారిగానుండును.

తాటినార.

ప్రత్తి, గోగునారలతో సమానము కాకపోయినను విశేషముగా మన చెన్నరాజధానినుండి ఈనార విదేశములకు ఎగుమతిచేయబడుచున్నది. ఈనార అనేకవిధములగు కుంచెలు (Brush) తయారుచేయుటయందు వినియోగింపబడుచున్నది.

కొబ్బరినార.

విస్తారముగా త్రాళ్లు, పగ్గములు మొదలగునవి తయారుచేయుటయందు ఉపయోగింపబడుచున్నది. ఈనార చెన్నరాజ

ధానినుండియే విశేషముగ ఎగుమతియగుచున్నది. పొగయోడలకు ఈపగ్గములెంతయో అవసరములు.

కిత్తనార.

ఈ నారను విస్తారముగా కేన్వాసుగుడ్డ (Canvas) తయారుచేయుటకునై వినియోగమగుచున్నది. ఐరోపాఖండమునందు ఈ నారకు ఎంతయో గిరాకికలదు. లక్షలకొలది టన్నులను, ఎగుమతిచేసినను క్షణములో ఖర్చగును. ఈ నారను తయారుచేయుటకునై సులభమైన యంత్రములు (Decorticators) కలవు. చీనాదేశమున ఈనార, జోళ్ళు తయారుచేయుటకు సైతము ఉపయోగింపబడుచున్నది. పగ్గములకును త్రాళ్ళకునుకూడ ఉపయోగించుచున్న సంగతి అందరికిని తెలిసిన విషయమే.

ఈ నారను తయారుచేయుటయందు మనవారు విశేష శ్రద్ధను తీసికొనినట్లు కానరాదు. తోట కంచెలకు వేయుటయే కాని, దీని నొకపంటగా పైరుచేయుటలేదు. హిందూపురము మొదలగు ప్రదేశములయందు మాత్రము కొందరు ఐరోపా వర్తకులు వేలకొలది యకరముల భూమియందు ఈ మొక్కలను నాటి నారను తయారుచేసి ఎగుమతిచేయుచున్నారు. దీనిని సేవ్యము చేయుటయందు కూడ విశేషశ్రమలేదు. మొక్క నాటుకొనునంతవరకు నీరుపోసిన చాలును. తరువాత ఒక సంవత్సరమువరకు పశువులు మేయకుండ కాసినచాలును. అనేకవేల యకరముల పర్రనేల మనదేశమునందు కలదు. విశేషించి మన ఆంధ్రమండలమున ఈ కిత్తనారను తయారు

చేయుటకు అవకాశములు పెక్కులు. కాన ఆంధ్రమహాజనులు ఈ విషయమును గమనించెదరుగాక! విశేషమూలధనము కూడ అవసరములేదు. మనతాతతండ్రులనాడు ఇట్టి పైరును సేద్యముచేయలేదు గాన మనము ఇట్టిపనికి పూనుకొనరాదని ఎంచిన కేవల మూఢతకాని వేరొండులేదు. విశేషధనమును స్వల్ప మూలధనముతో సంపాదింపవచ్చును.

అనాస నార.

కిత్తనార మోటగా నుండును. కాని అనాసనార బహుమృదువైనది. సున్నితమును గలదియగుటచే, వస్త్రములు నేయుటకుకూడ పనికివచ్చును. రంగువేసి నేసినయెడల పట్టును బోలియుండును. నేతలో పేకగా అనాసనారనుంచి పడుగుగా పట్టునువాడిన, పట్టువస్త్రములనుండి పోల్చుట కష్టము. మంచి తివాసులను తయారుచేయుటకుకూడ ఉపయోగింపనగును. ఈ మొక్కలు విశేషముగ సింహాచలము కొండలయందు అడవివలె వ్యాపించియున్నవి. పండ్లకొరకే దీనిని పైరుచేయుచున్నారు. ఎంతయో, అమూల్యమగునారను గ్రహింపక మొక్కలను నరికి పారవైచుచున్నారు. కిత్తనారకువలె ఈనారను తీయుటకుకూడ యంత్రములుకలవు. ఒకేతరహా యంత్రములు ఈ రెంటిని తయారుచేయుటకు ఉపయోగములు. కొండలోయలయందు అనాయాసముగ నామమాత్రమగు శిస్తులకు భూమిని తీసికొని, ఈ మొక్కలను పైరుచేయవచ్చును. పాఠక మహాశయులు ఈ విషయమును కూడ గుర్తించి ఈ కళను వృద్ధిచేసి ఆంధ్రమండలమునకు వన్నె తెచ్చెదరుగాక!

అరటినార.

అరటిచెట్టు మనదేశమునకు కల్పవృక్షము వంటిది. దీనినిగూర్చి తోటపంటల సందర్భమున వ్రాయవలసినదిగాని నారనిచ్చు మొక్కలనుగూర్చి చర్చించునపుడు, ఈ నారను గూర్చి వ్రాయుట సమంజసముగ నుండుటచే నిచ్చట పొందుపరచుచుంటిమి. సుమారు ఒక అరయకరము నేలయందు అరటిచెట్లను నాటిన రోజున కొకరూపాయకు తక్కువ లేకుండ ఆదాయమురాగలదని వంగరాష్ట్రమునందు ప్రతీతి. ఇది చాలవిశ్వాసనీయ మైనసంగతి ఎల్లరకు తెలిసియేయున్నది. కాని ప్రస్తుతము మనమాకల్పవృక్షమునుండి లాభమునంతయు గ్రహించుచుండుటలేదు. ఒక్కకాయలను ఫలములను మాత్రమే అనుభవించుచుంటిమి. లక్షలకొలది టన్నుల ప్రశస్థమైన నారను గ్రహించకయే, గెలను కొట్టివేసిన వెంటనే బొందలను ఊరక పారవైచుచున్నాము. ఈ పాడుబొందలను ఎచటనైన పారవైచుటకు తగినతావు కానుపించుటలేదని మొఱలిడు ఎందఱో తోటరైతులను గోదావరి డెల్టాలో కండ్లారజూచుచుంటిమి. గంజాము జిల్లాలో ఉద్దానమునందును, గోదావరిజిల్లాలో కోనసీమను, మలబారు జిల్లాయందును, ట్రావెన్కూరు, వంగ రాష్ట్రములయందును అరటిచెట్లు విస్తారముగ పైరగుచున్నవి. ప్రశస్థమైననారను బొందలనుండి మనము తయారుచేయవచ్చును. ఈకళను వృద్ధి నొందించవలసిన యావశ్యకత విశేషముకలదు. ఎన్ని వేలటన్నుల నారను తీసినను ఇంగ్లాండు దేశమున నిముషములో విక్రయమగును. ఒకటన్ను నారకు 300 మొదలు 400 రూప్యములవరకు వెలనిచ్చెదరు. స్వదేశము

యందు ఈనారను పట్టునకు బదులుగా వస్త్రములు నేయుట యందును, విశేషించి కోట్లు, పాగాగుడ్డలను చేయుటయందును ఉపయోగింపనగును. రంగులువేసి ప్రశస్తమైన రత్నకంబళ్లను కూడ తయారుచేయవచ్చును. ఈ నారను తయారుచేయుటయందును ఒక విశేషము కలదు. తగిన యంత్రములు ఇంగ్లాండునందుగాని, జర్మనీయందుగాని తయారుకాలేదు. విశేష సున్నితమైనది యగుటచే, కిత్తనార అనాసనారలను తీయు యంత్రములు ఈనారను ఉత్పత్తిచేయుటకు పనికిరావు. దేశమునందున్న చిన్నచిన్న యంత్రములు కళాప్రదర్శనములకు పంపుటకు మాత్రము నారను తయారుచేయుటకు ఉపయోగించును కాని విశేషముగా వ్యాపారమును సాగించి లాభమును తీయుదమన్న నివి ప్రయోజనకారులు కావు. ఈ నారను తీయుటకు ఒకరసాయన శాస్త్రవిధానము కలదు. దాని సహాయమువలన సూక్ష్మముగా తయారుచేయ గలుగుదుము. ఈనార విశేషముగ ఖండాంతరముల విక్రయమగుటకు అవకాశము ఏల కలిగెనని ప్రశ్నింప వచ్చును? నీటియందు పుట్టి పెరుగును గనుక అరటినారకు నీటియందు ఉపయోగింపబడి నపుడు చివికునట్టి గుణము లేదు. ఈనారతో తయారుకాబడిన పగ్గములును మోకుత్రాళ్ళును హెచ్చుకాలము పాడుకాకుండ నీటియందు వాడుక చేయుటకు వీలగును. కాన విశేషముగా, ఈపగ్గములు ఓడలకు కావలసిన త్రాళ్లకై ఉపయోగపడును. తయారుచేసిన, మనకు అమ్మకము ఉండునో లేదో యని విచారించ నగత్యము లేదు. సాహసమునుపూని ఈకళను వృద్ధికి తెచ్చుట చాల యవసరము.

దేశముయొక్క ద్రవ్యసంపదను విశేషముగ వృద్ధిచేయుటకు వీలలవడును.

నిషావస్తువులు.

పొగాకు, తేయాకు, కాఫీ, మద్యములు మొదలగునవి.

పొగాకు.

పొగాకు మనదేశమున స్వయంభువు కాదు. తొలుదొల్త పోర్చుగీసువారిచేత మనదేశమునకు కొనిరాబడి చాల కాలము క్రిందవరకును జనసామాన్యముచే నిషేధింపబడుచు వచ్చినది. ఇపుడు మాత్రము నిషేధింపబడుట లేదాయని కొందరు ప్రశ్నించవచ్చును! నిజమే! కాని నిషేధించువారలల్పసంఖ్యాకులు. పెక్కుమంది విద్యార్థికులు సిగరెట్లను నాగరికతా లక్షణముగ కూడ నెంచుచున్నవారు. ఇందువలన శరీరారోగ్యము పాడగుటయేకాని కొంచెమైనను లాభము లేదు. అభ్యసించువారలు కారణములను కల్పించ జాలరని మామతము కాదు.

అక్బరు చక్రవర్తి కాలమున ప్రభుసన్మానమును బడసి, పొగాకు మనదేశమున స్థిరస్థాయి అయినది. 10 లక్షల యకరముల భూమియందు పొగాకు సేద్యము చేయబడుచున్నది.

	1909 సం॥ న ఎకరములు.
వంగ, విహారరాష్ట్రములు	440,400
ఆస్సాము	6,700
సింధు, బొంబాయి	101,500
చెన్న రాజధాని	200,900

	1909 సం॥ న ఎకరములు.
పంజాబు, సరిహద్దు	64,000
అయోధ్య, సంయుక్తపరగణాలు	85,800
బీరారు, మధ్యపరగణాలు	31,600
బర్మా	82,000
	10,000,00

పై పట్టీని చూచిన వంగరాష్ట్రమునందు సగమునకు సుమారు పైరగు చుండుట కనిపెట్టుచున్నాము. 1825 సం॥ నుండి, మనదేశమునుండి పొగాకు ఎగుమతి చేయుట ఆరంభము. 1886-87 సం॥ న ఒక ముఖ్యమైన ఎగుమతి సరకుగ గణింపబడినది. ఆసంవత్సరమున 5½ లక్షల రూప్యములు విలువగల పొగాకు ఎగుమతి అయినది. 1903-4 సంవత్సరమున 21 లక్షలవరకు అధికమైనది. ఇండియా, బర్మాదేశములందు సిగరెట్లకు గిరాకి అధికమగుటచే ఇంతవిస్తారముగ నెగుమతి చేయబడు నది. ఇంతవరకు ఈవిషయము ప్రశంసనీయమైనా దిగుమతులు ఎగుమతులకన్న అధికములుగనే ఉన్నవనిన సంగతి కడుంగ [illegible] శోచనీయము. 1903-4 సంవత్సరమున ఏబదిలక్షల రూప్యములు విలువగల చుట్టలు సిగరెట్లు మనదేశమునకు దిగుమతి చేయ బడినవి. గ్రేటు బ్రిటనునుండి విస్తారముగ దిగుమతి కాబడు చున్న చౌకరకము సిగరెట్లు, ఇందులకు [illegible] పొగాకును ఎగుమతి చేయుటకంటె దేశమునందే సిగరెట్టు ఫ్యాక్టరీలను నెలకొల్పి విదేశములనుండి దిగుమతి కాకుండు ఏర్పాటులను చేయవలసి ఉన్నది. ఆకాలు చౌకధరలకు నూన

దేశమున తయారుకావని తోచినపుడు దిగుమతులపైని పన్ను నువిధించ నగును. పన్నును విధించుటవలన ప్రజలకు సిగరెట్లు చౌకగాలభించక కొంతకష్టముగా నుండునేమోయని [illegible] నవసరములేదు! ఏలననిన సిగరెట్లను కాల్చుటచే [illegible] లలో నొకటికాని సుగుణము కాదు. ఖరీదు [illegible] వాటిని కాల్చుటయే మానిన సర్వశ్రేయము. లేదా [illegible] అయినను వృద్ధియగును. ఏదియైనను సుకరమే!

గసగసాలచెట్లు.

ఈ చెట్లపాలనుండి నల్లమందు తయారుచేయబడు చున్నది. ఉత్తరహిందూస్థానమున విశేషముగా పైరగుచున్నది. సర్కారువారి యాజమాన్యముక్రింద [illegible] సంయుక్తపరగ ణాల రాష్ట్రములయందు నల్లమందు తయారుచేయబడు చున్నది. గ్వాలియరు, ఇందూరు మొదలుగాగల స్వదేశ సంస్థానములు కూడ ఈచెట్లనుపైరుచేసి నల్లమందును [illegible] ఎగుమతి చేయుచున్నారు. ఇదివిస్తారముగా చీనాదేశమునకు ఎగుమతి యగుచుండెడిది. ఇటీవల చీనాదేశస్థులు [illegible] మేల్కాంచినవారై ఈమత్తుదేవతను పూర్వ [illegible] తమదేశము నాగరికతనుగాంచిన ఇతరరాష్ట్రముల సమాన గౌరవ మర్యాదలం జెందజాలదని కనిపెట్టిరి. [illegible] తరిమివేయుటకునై అనేక ఏర్పాటులు చేయబడినవి. తమదేశ మునందలి పంటనుకూడనశింపుచేయుటకు నిశ్చయించితిమనియు ఇండియా దేశమునుండికూడ ఎగుమతులను తగ్గించుచుండ వలెననియు బ్రిటిషు దొరతనమువారితో సంధి చేసికొనిరి.

కాన అలతికాలములో చైనాదేశమునకు మనదేశము నుండి ఎగుమతులుపూర్తిగా ఆగిపోవును. ఒకవంక దేశ ప్రజ మద్యపానవిముక్తులుగ జేయుడని, సర్కారువారికి మొఱ పెట్టుచుండ కల్లు, సారాయి, ఇజారాలవలన వచ్చెడిరెవిన్యూ తగ్గిపోవుననియూహించి మనప్రార్థనలును పెడచెవిని పెట్టుచు న్నారు. ఇట్టిస్థితిలో 5 లేక 6 మిలియన్లు ఏటేట నల్లమందు నుండివచ్చెడి రెవిన్యూను చైనాదేశస్థులు ప్రార్థించినంత మాత్రమున కేవలపరమార్థము నాలోచించి ఎట్టులనియ్యకొనిన దియు కొంతచిత్రముగ తోచకమానదు! చైనాదేశస్థుల మాంగల్యమును పోనాడుటకై బ్రిటిషుప్రజలు అంతశ్రద్ధను వహించి నపుడు, మనదేశమునందలి మద్యపానమును నిషేధముచేసి మనకైపురేల వదలగొట్టరాదో ఊహించశక్యముకాను! రెవిన్యూకొఱకునై కల్లు, సారాయి, ఇజారాలను ఇంకను ఇచ్చుచున్నామని సర్కారువారు బదులుచెప్పినయడల అదిసహేతుకముగ కానరాదు. చైనాదేశము నుండివచ్చెడి రెవిన్యూను వదలుకొనినపుడు స్వదేశమునందలి రెవిన్యూను (పన్నునుండి వచ్చు ఆదాయము) సయితము ఏలవదలరాదు? చీనాదేశపు ప్రజలకు జ్ఞానోదయమును ప్రసాదించునపుడు, బ్రిటిషు ప్రభుత్వము క్రిందనున్న ఇండియాదేశపు ప్రజలకేల అట్టివరమును ప్రసాదించరాదు! కొద్దికాలములో నల్లమందునుండి వచ్చెడి రెవిన్యూ విస్తారము తగ్గిపోవునన్న సంగతిని మనముగ్రహించుటను. 1916-17 సం॥ మన సర్కారువారికి నల్లమందునుండి వచ్చిన ఆదాయము 3,153,100 సవరనులు. 1917-18 సంవత్సరములకు 3,389,300 సవరనులు బడ్జెటుచేయబడినది. ఆదా

యము అధికమగుటకుగలకారణము పూర్వముకంటె వెలను అధికము చేయుటయే అయియున్నది. అనగా పూర్వము సవాయికి మూడుతులములు అమ్ముచుండెడి నల్లమందు, ఇప్పుడు తులము ఒకరూపాయి అమ్ముచున్నది. ఇందుచే తయారైన సరకు చాలతక్కువయై యున్నను, ఆదాయము మాత్రము హెచ్చుగ కనబడుచున్నది. ఈచెట్లను పైరుచేయు నైశాల్యము కూడ చాలవరకు తగ్గించబడినది.

తేయాకు.

పొగాకువలెనే తేయాకుకూడ మనదేశమున స్వతస్సిద్ధముకాదు. తొలుత ఈస్టిండియాకంపెనీ వారివలనను, తరువాత ఐరోపావాస్తవ్యులచేతను తేయాకువిశేషముగ ఇండియాదేశమునందు పైరుకాజొచ్చినది. మనదేశమునుండి ఎగుమతికాబడు దినసులలో నిదికూడ ఒకప్రధానమైన వస్తువుగ పరిగణించబడుచున్నది. 1916-17 సంవత్సరమున 14 కోట్ల రూప్యములు విలువగల తేయాకు ఇంగ్లాండునకు ఎగుమతిచేయబడెను. ఇంగ్లాండు దేశమునందు మనకు చీనాదేశముతో తేయాకునకు పోటీకలదు. పోటీయందు మన తేయాకు నిలిచి చీనా తేయాకును క్రమముగా తొలగించుచున్నదన్న సంగతి చాలసుకరము! చీనాదేశపు తేయాకుపైని కొంచెము దిగుమతి పన్నునువిధించిన గ్రేటుబ్రిటను దేశమునకు వలయు తేయాకునంతయును మనదేశమునుండియే పంప గలుగుదుము.

తేయాకుపంట దక్షిణహిందూస్థానమున అంతగాలేదు. ఉత్తరహిందూస్థానమున విశేషము. బొంబాయి మధ్యపరగణాలయందు తేయాకు పైరగుటయే లేదు.

1909-వ సంవత్సరమున తేయాకు సేద్యమునందున్న భూమి.

	ఎకరములు
వంగవిహార రాష్ట్రములు	143,000
అస్సాము	348,000
చెన్నరాజధాని	14,600
పంజాబు, పశ్చిమోత్తర పరగణాలు	9,900
అయోధ్య, సంయుక్తపరగణాలు	8,200
బర్మా	1,600
	525,000

1910-వ సంవత్సరమున మనదేశమునందు 261 మిలియన్ల పౌనుల తేయాకు పైరయినది. అందు 175 మిలియన్లు అస్సామునందును, 63 మిలియన్లు వంగరాష్ట్రమునందును, 20 మిలియన్లు దక్షిణహిందూస్థానమునను పైరయినది. ఆసంవత్సరమున మనము 243 మిలియన్లు పౌనులు ఎగుమతిచేసితిమి. అందు మూడువంతులు ఇంగ్లాండుదేశమే గ్రహించినది. బ్రిటిషు రాష్ట్రములలో నాటుకయగుచున్న తేయాకునందు నూటికి 63 పాళ్లు మనదేశమే ఎగుమతి చేయుచున్నది.

కాఫీ.

తేయాకువలె కాఫీ అంత విస్తారముగ మనదేశమున పైరగుటలేదు. మైసూరు, కొడగు, తిరువాన్కూరు, మైనాడు, షెవరాయి (Shevaroy) పర్వతములయందు మాత్రము అధికముగ పైరగుచున్నది. 1903 సం॥ న కాఫీతోటలయందు 82,000 కూలీలు పని చేసిరి. 1903-4 సం॥ న ఎగుమతుల

విలువ ఒకకోటి ముప్పది ఏడు లక్షలరూప్యములు. కాని తక్కువ ధరలకు అమ్మబడుచున్న బ్రెజిలియను కాఫీ ఐరోపా ఖండమునందంతటను అమ్మబడుచుండుట వలన మనకాఫీ ఎగుమతి వర్తకమునకు నష్టమువచ్చినది. మనదేశమునకు సరిపోవు కాఫీవిత్తులు దేశమునందే తయారగుచున్నవి.

నీలిమందు.

మనదేశమునందలి రంగు పదార్థములలో ముఖ్యమైనది. ఈపైరును గూర్చి విచారకరమైన గాథను తెలియపర్చవలసి యున్నది. చాలకాలమువరకు మనదేశమున విశేషముగ పైరు చేయబడి ఇతరరాష్ట్రములకు ఎగుమతి చేయబడుచు వచ్చినది. కాని జర్మను రసాయన శాస్త్రజ్ఞులు వారి ప్రజ్ఞావిశేషమువలన నీలిమందును కృత్రిమముగ (Artificial) తయారుచేయ మొదలిడినది మొదలు, మన నీలిమందు పోటీకి ఆగలేకపోయినది. అందువలన విదేశములకు ఎగుమతులు సన్నగిలుటయేగాక స్వదేశమునందుకూడ ఖర్చు తక్కువ అయినది. ఇది ఎంతయు శోచనీయము! యుద్ధమువలన జర్మను ఎగుమతులు నిలిచిపోవుటచే మన నీలిమందుకు తిరిగి గిరాకి అతిశయించినది. తిరుగా ఈపైరును విశేషముగ సేద్యముచేయ నారంభించిరి. ప్రశస్థమైన నీలిమందును మనదేశమున తయారు చేయుటకు పెక్కు అవకాశములు కలవు. నీలితోటలకు విహారరాష్ట్రము పెట్టినది పేరు. సర్కారు వారి సహాయము ఈవిషయమున మిక్కిలి అవసరము. యుద్ధానంతరమున, జర్మనుదేశమున తయారగు సరకులను బ్రిటిషు సామ్రాజ్యమునందలి ఏభాగమునకును రానీయకుండు ఏర్పాటులను బ్రిటిషు ప్రభుత్వమువారు చేయుచున్నారు. కాన

మనదేశపు నీలిమందునకు మంచిదశ రానున్నదని మన
మూహింపవచ్చును.

తొగరు, చిరువేరు, కుసుంబా, జాఫరా మొదలగుసహజ
ములైన రంగుపదార్థములు మనదేశమునకలవు. సర్కారువారు
ఒక నిపుణుని రంగుకళ అభివృద్ధియగుటను గూర్చి మనదేశము
నందలి సాధనములను పరీక్షించుటకై నియోగించుట బాగు.

అడవులు.

ఉష్ణదేశములలో అడవులు ప్రాణసమానముగ నెన్న
బడవలయును. వీనివలన దేశమునకు పెక్కులాభములు కలవు.

1. వర్షములు కురిసిన ఆ నీరంతయు నిష్ప్రయోజన
ముగ కొండప్రక్కలగోసి ప్రవహింపకుండునట్లు చేసి, నదులను
సర్వకాలములయందు ఏకరీతిని మందగమనమున ప్రవహించు
నట్లు చేయుచున్నవి. ఈ అడవులే లేనియడల వర్షాకాలము
ఆఖరుకాగానే మన మహానదులన్నియు ఎండిపోయి, నీటికొరకు
వరుణదేవుని తిరిగి ప్రార్థించవలసివచ్చును. నదీ ప్రవాహములు
విశేష భూభాగమును కోసి వేయకుండ అడవులు కాపాడు
చున్నవి.

2. చెట్ల ఆకులనుండి నీటి ఆవిరిని నలుదెసల వ్యాపింప
జేయుటవలన పవనుని ఉష్ణతను తగ్గించి శాంతునిగ జేయును.
అందువలన దేశము శాంతత్వమును వహించును.

3. అసంఖ్యాకములగు జంతు సమూహమునకు మేతకు
కసవు నొసంగుచున్నవి. కృషికళావ్యాప్తి పశువుల నాశ్రయించి
యుండును. వర్షములులేక కాటకములుపట్టి, మేయుటకు

గడ్డి దొరకనప్పుడు అడవులకు పశువులను మేతకు తోలి
పెట్టుటవలన వాటికి ప్రాణదానము నొసంగుటకు వీలగుచు
న్నది. వంట చెఱకునకును, గృహనిర్మాణమునకును కలయు
కలప దొరకుచున్నది. చెట్ల ఆకులు మేతకేగాక, భూమికి
ఎరువుగాకూడ ఉపయోగమగుచున్నవి.

4. ఇంతేగాక, అనేకములగు వాణిజ్యోపయుక్తము
లగు పదార్థములు మన అడవులయందు బయలుదేరుచున్నవి.
కర్పూరతైలము, మైనము, రబ్బరు, లక్క, తోళ్ళను పదును
చేసి శుభ్రము చేయుటకు పనికివచ్చు చెట్లపట్టలు, ఏలకు
పళ్ళు, కాకితములు తయారుచేయుటకు ఉపయుక్తమగు 'శాబై
గడ్డి' (Sabai grass) వెదురు, గుగ్గిలము, మొదలగు విశేష
విలువగల పదార్థము లెన్నియోగలవు. దేశముయొక్క కళా
కౌశలము విరివిగాంచుచున్న కొలదిని, నూతన పద్ధతులను
పూని వీనిని ఉపయోగములోనికి గొనివచ్చు సమర్థత ప్రజ
లకు అధికమగుచున్న కొలదిని, ఈ వస్తువులయొక్క విలువ
హెచ్చగుచుండును.

పూర్వకాలమందు భరతఖండమున చీమలుదూరని
చిట్టడవులును కాకులు దూరని కాఱడవులును గలవని ప్రతీతి.
కామ్యక, ద్వైత, దండక నైమిశాది వనములు పురాణప్రసిద్ధ
ములు. కాని మనవారి వివేకశూన్యతచే, అట్టి కాఱడవు
లన్నియు నశింపు చేయబడినవి.

ఆమహారణ్యంబులన్నియు మంటగలియుటచేతనే క్షామ
దేవత మనదేశము నాశ్రయించినది. రామరాజ్యమున నెలకు

మూడువానలని ప్రసిద్ధి. ఇపుడాసంగతి కలలోనివార్త. నెలకొకవానయైనను, కొన్నిప్రదేశములయందు అధమము సంవత్సరమున కొకపుష్కలమైన వర్షమైనను పడుటలేదు. వనరాజి నశించుటచేతనే మనమిట్టి యిక్కట్టులపాలు కావలసివచ్చినది. ఈకారణముచేతనే విఖ్యాతయశము వడసిన స్పెయినుదేశము కూడ అనావృష్టికిలోనై ప్రభతగ్గియున్నది.

ఈవిషయమును ఇంగ్లీషు ప్రభుత్వమువారు చక్కగ గమనించినవారై ఈదేశమున మిగిలియుండు అడవులను రక్షించుటకును, లేనిచోట తిరిగి ఉత్పత్తిచేయుటకును శాసనములను ఏర్పఱచియున్నారు. ఇదియెంతయు ప్రశంసనీయము. మనలో మహాత్ములుకొందరు వంటకట్టెయలకు పుల్లలుస్వేచ్ఛగా దొరకుటలేదని, సర్కారువారి రాజ్యనీతిని ఈవిషయమునందు నిందించుచున్నారు. తాత్కాలిక ప్రయోజనములను మాత్రమే గుర్తించి భావిపరిస్థితులను సరకుగొనక యుండుటవలననే, సర్వవిధముల మనదేశము దరిద్రదేవతకు పుట్టినిల్లయినది. ఇకముందైనను మనప్రజలు తాముజేయు కార్యములపట్ల భావి పరిస్థితులను దీర్ఘదృష్టితో పరికించెదరు గాక!

1878 సంవత్సరమున సర్కారువారు సర్వోత్కృష్టమైన ఈఉద్యమమునకు పూనుకొనిరి. 1908సం॥న హిందూదేశ వైశాల్యమునందు నూటికి 24 వంతున అడవులు పెంచబడినవి. బర్మాయందు-వనరాజివిస్తారము-నూటికి 76-వ వంతు, ఆస్సాము తూర్పు బంగాళములు 31-వ వంతు, చెన్నపురి 14-వ వంతు బొంబాయి 9-వ వంతు, పంజాబు 9-వ వంతు, బంగాళమున 6-వ వంతు, అడవి ప్రదేశము లున్నవి.

అడవులు మూడుతరగతులు.

ఇండియా దేశమునందలి అడవులు మూడు తరగతులుగా భాగింపబడినవి:—

1. ఆపుదలచేయబడినవి. (Reserved) ఇవి ప్రభుత్వము వారి యాధీనమందున్నవి. జనసామాన్యము యొక్క ఉపయోగమునకు విడిచిపెట్టబడకుండ కే[illegible] నుంచబడినవి.

2. రక్షించబడుచున్నవి. (Protected) ఈ అడవులయందు సర్కారువారు అంతప్రమేయమును కలిగించుకొనరు. చాల విషయములయందు ఆ చుట్టుప్రక్కలనున్న జనసముదాయమునకు స్వేచ్ఛయొసగబడుచున్నది.

3. ఏతరగతికిని జెందనివి. కొద్దికట్టుబాట్లతో ప్రజల ఉపయోగమునకే విడిచిపెట్టబడినవి.

అడవుల వైశాల్యము.

ఈక్రింది పట్టీవలన 1910-వ సంవత్సరమున ఇండియా దేశమునందలి వివిధరాష్ట్రములకు జెందిన అడవులవైశాల్యమును తెలిసికొన వచ్చును.

	సర్కారువారిచే కేటింపుచేయబడినవి. చదరపు మైళ్లు.	రక్షించబడు చున్నవి. చదరపు మైళ్లు	ఏ తరగతికిని చెందనివి చదరపు మైళ్లు.	1910-సంవత్సరమున అడవులవలన వచ్చిన నికర ఆదాయము.
				సవరనులు
బర్మా	26,077	...	111,150	440,000
బీరారు, మధ్యపరగణాలు	...	..	21,384	32,000
చెన్న రాజధాని	18,629	...	1,401	36,000
బొంబాయి	14,006	1042	...	107,000
అస్సాము, తూర్పు బంగాళములు	6,491	4	22,416	55,000
వంగ విహారరాష్ట్రములు	4,254	3698	...	31,000
సంయుక్త పరగణాలు	3, 958	9100	186	90,000
పంజాబు	1, 952	5222	1684	51,00)
హిందూదేశముపైని 1910-సంవత్సరము మొత్తము.	96,000	9,000	141,000	796,000

ఇంతియేకాక అండమాను దీవులయందు అమితములైన వనసమూహములు గలవు. ఆద్వీపములుకూడ ఇండియా దొరతనమువారి ఆధీనముననే యుండుట వలన, మనదేశమునకు చెందినవనియే వాడవచ్చును.

అడవులవలని ఆదాయము.

వైశాల్యమున స్పెయిను, బెల్జియము, పోర్చుగలు దేశములయొక్క వనరాజితో సమతుల్యమయ్యు సర్కారువారి ఆదాయము మాత్రము ఎకరమునకు మూడు అణాల కన్న గిట్టుటలేదు. మన అడవుల యందు ఆర్థిక సంపద ఎంతయో ఉపయోగమునకు తీసికొనిరాకుండ ప్రచ్ఛన్నమై యున్నది. దొరతనమువారు ఈవిషయమును గూర్చి ఇప్పుడు శ్రద్ధను వహించుచున్నారను సంగతి, సంతోషజనకము. ఎంతయో రాజస్వమును అధికము చేయవచ్చును. ఈమధ్య ఇంగ్లాండులో సర్ రాబర్టు కార్లైలుగారు మన అడవులను అర్థకోశయుక్తముగ జేయుటను గూర్చి దొరతనమువారు విశేషశ్రద్ధను వహించుచున్నారని ప్రశంసించిరి. ముఖ్యముగా కాగితములను తయారు చేయుటకు ఉపయోగమగు వెదురును గడ్డియును విస్తారముగ కలదని నుడివిరి. ఈప్రసంగము పైని మదరాసు టైమ్సుపత్రిక, యుద్ధమువచ్చి మూడు సంవత్సరములు కావచ్చె ననియు, కాగితములకు కఱవుపట్టి క్రొత్తవార్తా పత్రికలను స్థాపించుట యటుండ ఉన్నవానికే కాగితములు, ఈ దేశము ననేగాక ఇంగ్లాండునందు సైతము, కఱవగుచుండ ఇండియా దొరతనము వారింకను వృథాయుపన్యాసములనే చేయుచు

కార్యక్రమమునకు పూనకుండుట కడు విషాదకరమని, వ్రాసి
నది. టైమ్సుపత్రిక వ్రాతసహేతుకముకాదని ఎవరనగలరు ?
కాగితములను ఎగుమతిచేయుటకు ప్రపంచము నందంతటను
ఆస్ట్రియాదేశము గుత్తనుకలిగి యుండెడిది. తరువాత బెల్జి
యము. ఈదేశములు రెండును సమరమున చిక్కుకొనుటచే,
ఈమహాకాటకము సంప్రాప్తమైనది. స్వీడనుదేశస్థులు ఇంగ్లాం
డునకు కాగితపు గుజ్జును (Wood pulp) ఎగుమతిచేయుట
నిలుపుచేసిన తోడనే, కఱవుమరింత అధికమైనది. ఇప్పట్టున
మన దేశమునకు సరిపోవు కాగితములను తయారు చేసకొను
టకు కావలసినసామగ్రి మన దేశమునందు అపారముగనున్న
దని మనము గుర్తించవలసియున్నది. సర్కారువారి సహాయ
ముండిన జాలును.

అండమాను దీవులయందలి అడవులను ఆర్థికప్రయో
జనములుగజేసి సర్కారువారి ఆదాయము నధికముచేయుటకై
ఏర్పాటులు చేయుచున్నారు. కొడగుదేశమునందలి అడవులను
రెండు ట్రాంబండ్లనునిర్మించి అందలివస్తు సముదాయమును
సులువుగా పణ్యాచక్రములకు కొనివచ్చుటకు నిర్ణయించిరి.
ఇందువలన రెవిన్యూ విశేషవృద్ధి గాంచును. శ్రీయుత
ఏ. ఆర్. బానర్జీగారు కొచ్చిను సంస్థానమున దివానుగా నున్న
పుడు, అడవులయొక్క ఆదాయమును ట్రాంబండ్లను నిర్మిం
చియు, రబ్బరుతోటలను నాటుటకు విశేషమైన సదుపాయ
ములను సమకూర్చియు, వృద్ధిచేసిరి. గతసంవత్సరమున పంజాబు
దొరతనమువారు గుగ్గిలపు వ్యాపారమును వృద్ధిచేయుటకై
ప్రయత్నముచేసిరి. అందువలన దొరతనమువారి ఆదాయము

క్రిందటి సంవత్సరము అధికమైనది. ఇంకను సర్కారు ఆదా
యమును వృద్ధిచేయుటకు వీలగుపదార్థము లెన్నియోకలవు.
దొరతనమువారు యుద్ధానంతరమున నీపనికి బూనుకొన నిశ్చ
యించుట శుభసూచకము.

ఆదాయమును అధికముచేయుటయే ముఖ్యోద్దేశముగ
భావించి సర్కారువారు విచక్షణలేకుండ అడవులను నాశనము
చేయకయును, నిర్మూలము చేయునపుడు దానితోపాటు క్రొత్త
మొక్కలనుకూడ నాటుచును మనవనరాజిని కాపాడెదరుగాక.

అటవీసంపద.

ఇండియా దేశమునందలి యడవులలో దొరకు పదార్థ
ములలో అమూల్యములైనవి, టేకుదూలములు. 1911 సంవ
త్సరమున 73 లక్షల రూప్యములు విలువగల కలప ఎగుమతి
అయినది. కరక్కాయలు 50 లక్షలు రూప్యముల విలువ
గలవి, ఎగుమతి అయినవి. రెండుకోట్ల రూప్యములువిలువగల
లక్క ఎగుమతియైనది. రబ్బరు, మంచిగంధపు తరువులు, విరు
గుడు చేవమ్రానులు, ఇవిగాక పట్టు, మైనము, గుగ్గిలము, కాచు,
వార్నీషులు, తోళ్ళను పదునుచేయుటకు ఉపయోగమగు చిల్లర
వస్తువులుకూడ మన అడవులయందు సమృద్ధిగానున్నవి. దేశ
మునందు వెదురు, మంచిగంధము, ఇండ్లుకట్టుకొను నిమిత్తము
టేకు, గుగ్గిలపు మద్దిమానులుకూడ వినియోగింప బడినవి.
పంటచెఱకునుగూర్చి ఇచట ప్రసంగించపనిలేదు. మన వన
రాజియందు ఏనుగులుకూడ దొరకును. ఏనుగులయొక్క ఉప
యోగమును వేరెచర్చించి వ్రాయనగత్యములేదు. చదువరు

ల్లో వీటినిగురించి తెలియనివారుండరు. 1906 సంవత్సరమున సర్కారువారి అడవులనుండి వచ్చిన నికరాదాయము 828,512 సవరనులు.

చర్మములు

అడవులకు చెందని వయ్యును, తోళ్ళను పనుచేయు పదార్థములనుగూర్చి వ్రాయునపుడు, ఇచ్చటనే చర్మములను గూర్చి ప్రసంగించుట యుక్తమనితోచెడిని. చర్మములు విస్తారముగ జోళ్ళను తయారుచేయుటకును, పెట్టెలు సంచులు వగైరాలు తయారుచేయుటకును ఉపయోగింప బడుచున్నవి. 1913-14 సంవత్సరమున 79,26,000 రూప్యములు విలువగల జోళ్ళు మన దేశమునకు దిగుమతియైనవి. చర్మములను విపరీతముగ పరదేశములకంపి, జోళ్ళను పైనుండి సంగ్రహించుచున్నాము. ఇది యెంతయు విషాదకరమైనసంగతి. మనకావలసినవి తీరుటకునేగాక ఇతరరాష్ట్రములకు ఎగుమతిచేయుటకును కూడ అసంఖ్యాకములగు చర్మములు మనదేశమున కలవు. పదునుచేయుటకు అవసరములగు కరక్కాయలు, తంగేడుపట్టా దినుసులు మన అడవులయందు అసంఖ్యాకములు. గతసంవత్సరమున (1916-17) 24 కోట్లరూప్యముల విలువగల చర్మములు మనదేశమునుండి ఎగుమతికాబడినవి.

ఖనిజసంపద.

"ఇండియాదేశము, ప్రపంచమంతటినుండి ఏసంబంధము లేక వేరుచేయబడినప్పటికిని లేదా ఇతర దేశములయొక్క పోటీలనుండి ఆదేశమునందు ఉత్పత్తియగు లోహాదులను రక్షణ నవలంబించి కాపాడినయెడల, ఆదేశమునకు కావలసిన యెల్ల

లోహములను తానే సరఫరా చేసికొనుటకు తగిన సామర్థ్యమున్నదని నుడువుటకు, ఎవ్విధమైన అనుమానమును లేదు." అని బాల్ (Ball) అను నొక ఆంగ్లేయపండితుడు ఇండియా దేశపు ఆర్థిక భూగర్భశాస్త్రమున వ్రాసి యున్నాడు.

ఖనిజస్థితి.

ప్రపంచమునందలి ఖనిజ సంపదయందంతటను మన దేశము అగ్రస్థానము నలంకరించుచున్నది. తాతా అండుసన్సు వారివలన కాలిమటిలో (Kalimatv) స్థాపింపబడిన అయఃకర్మాగారము (ఇనుము, ఉక్కు ఫ్యాక్టరీ) దక్క నూతన పద్ధతుల ననుసరించి మనఖనిజసంపద ఉపయోగింపబడుట లేదు. ఇది చాల విచారకరము. కాన లోహములన్నియు పరదేశయాత్ర వెడలుచున్నవి. విదేశములయందు వస్తురూపముగ తయారుచేయబడి తిరుగా మనదేశమునకు దిగుమతి చేయబడుచున్నవి. పూర్వపు పద్ధతుల ననుసరించి పనిచేయుచున్న మన లోహకర్మాగారములు విదేశీయుల పోటీకి ఆగజాలక కృంగుచుండుట తటస్థించుచున్నది. కావుననే అశోధిత లోహములను ఏటేట విస్తారముగ ఉత్పత్తి చేయుచున్నను, తయారై దిగుమతియగుచున్న సరకులసంఖ్య హెచ్చుగుచున్నది. ఒకకోటి యేబది లక్షల రూప్యములు విలువగల అపక్వ లోహపదార్థ సంచయమును ఏటేట మనము విదేశముల కంపి(బొగ్గు, ఉప్పు, కిరసనాయిలు,సురేకారము మినహా) ఇరువదిఆరుకోట్లయాభయి లక్షల రూప్యముల మూల్యముగల లోహాదులను, లోహాదుల వలన తయారు చేయబడిన సరకులను మనము గ్రహించుచున్నాము. ఇటీవల మైసూరు ప్రభుత్వమువారు తమ రాష్ట్రము

సందలి ఖనిజసంపదను వృద్ధిచేయుటకు ప్రయత్నములు సల్పు చుండుట శుభసూచకము. ఇండియా దొరతనమువారు కూడ ఈవిషయమున తగిన శ్రద్ధను తీసికొని మనఖనిజ సంపద విదేశీయులచే కొల్లగొన బడకుండ కాపాడెదరు గాక! ఇక మన లోహాదులను గూర్చి వివరముగా చర్చించెదము:—

రాక్షసిబొగ్గు.

మన ఖనిజసంపద యందంతటను ఉత్కృష్టస్థానము నలంకరించునది రాక్షసిబొగ్గు. కళాప్రపంచమును సముద్ధరించుటకు బంగారము కన్న రాక్షసిబొగ్గే హెచ్చుప్రయోజనకారి యని చెప్పుట అతిశయోక్తి కాదు. దేశమునందలి కూలివాండ్రకు వృత్తులను కల్పించుటలో, ఈఖనిజమే విశేష సహాయమగుచున్నది. ఉత్పత్తి చేయబడుచున్న పదార్థసంచయములో నూటికి 94-వ వంతు మన దేశీయ కళలను వికసింప చేయుటయందే వినియోగమగుచున్నది.

రాక్షసిబొగ్గు విశేషముగ రైల్వేలవలన వాడుక చేయబడు చున్నది. 1884 సంవత్సరమున ఇండియాదేశము నందలి ఇనుపదారులలో నూటికి 68 మాత్రమే వాడబడుచుండెడిది. 1903 సంవత్సరము సరికి 99 వంతు మనదేశపుబొగ్గే రైల్వేలయందు ఉపయోగము కాజొచ్చినది.

ఇండియా దేశమునందు, ఉత్పత్తియగుచున్న సీమ, బొగ్గులో సగము ఝరియా (Jherria) బొగ్గు గనులనుండియు మూడవవంతు రాణీగంజి గనులనుండియు వచ్చుచున్నది. ఇరువదియవ వంతు గిరిడీ గనులనుండి వచ్చుచున్నది.

ఝరియాగనులు.

27 మైళ్లు పొడవును 9½ మైళ్ళు వెడలుపును కలిగియున్నవి. ఈగనులయందు అపారమైన బొగ్గుకలదు. ఎంత కాలమువరకు దొరకు చుండునను విషయమును ఇంతలో మనము చర్చించ నగత్యములేదు.

రాణీగంజ బొగ్గుగనులు.

రమారమి ఒకశతాబ్దమునుండి వాడుక చేయబడు చున్నవి. ఈస్టిండియన్ రైల్వే 1854 సంవత్సరమున నిర్మింపబడునంత దనుక, ఈగనులయందలి బొగ్గు ఆచుట్టుపట్లనే ఉపయోగింప బడుచుండెను. దాల్టను గంజి, రాజమహాలు, రామఘర్ — బొకారియా, సంబలపూరు బొగ్గు గనులు కూడ వంగ, విహారరాష్ట్రములయందున్నవి. డాల్టను గంజియందు 70,000 టన్నులు ఉత్పత్తియగుచున్నది. మిగిలిన మూడు గనులనుండియు వత్సరమునకు కొన్నివేల టన్నులు మాత్రమే తయారగుచున్నది. మనదేశమునందు ఉత్పత్తియగుచున్న రాక్షసిబొగ్గునందు నూటికి తొంబదివంతున పైనపేర్కొనబడిన వంగవిహారరాష్ట్రములయందలి ఏడుగనుల నుండియు తయారగుచున్నది. ఈరెండు రాష్ట్రములయందు గాక హైదరాబాదు నైజాము వారి రాష్ట్రమునందలి శింగరేణియందు అయిదులక్షల టన్నులు ఏటేట ఉత్పన్నమగుచున్నది. 1910 సంవత్సరమున ఉత్పన్నమైన బొగ్గులో నూటికి 4-వ వంతు సింగరేణి బొగ్గుగనుల నుండి వచ్చుచున్నది.

శింగరేణిగనులు, ఝెరియా, రాణీగంజి, గిరిఢీగనుల తరువాతనాలుగవదిగా నెన్నబడుచున్నవి. మధ్య పరగణాల యందలి మొహపాణి(Mohapani) గనులు 52,000టన్నులును, బెలూచిస్థానమునందలి ఖోస్టుగనులు 41,000 టన్నులును, పంజాబు దేశమునందలి సాల్టురేంజి 30,000 టన్నులును, ఏకసీరు దేశమునందలి గనులు 14,000 టన్నులును, 1911 సంవత్సరమున ఉత్పత్తిచేసినవి. ఇండియా దేశమునందలి ఇతర గనులు—మధ్య హిందూస్థానమునందలి 'ఉమారియా' ఆస్సాము నందలి 'మాకుమ్' పశ్చిమోత్తర పరగణాలయందలి 'హజారా' యును అయియున్నవి. 1911 సంవత్సరమున ఉత్పన్నమైనబొగ్గు 12.7 మిలియన్ల టన్నులు. విలువ 2½ మిలియన్ల సవరనులు. ఈ గనులయందు పనిచేసిన కూలీలసంఖ్య 116,153. విదేశములకు ఎగుమతిచేయబడిన బొగ్గు 873,987 టన్నులు. ఇటీవల కలకత్తాపట్టణమున జరిగిన 'ఇండియా ఖనిజ సమావేశముల' (Indian mining Federation) ద్వితీయ వార్షికసభయందగ్రాసనాధిపత్యమువహించినయన్. సి. సర్కారువారిట్లు వాక్రుచ్చియున్నారు. "రాకుసిబొగ్గుయొక్క ప్రస్తుతధరలు, చాలకాలమునుండి నష్టము ననుభవించుచున్న బొగ్గుగనులకు, నూతనోజ్జీవనమును కల్గించుచున్నవి. ఈ యుద్ధము ముగియునంతవరకు, దొరతనమువారికి కావలసినబొగ్గు అధికముగనుండును. యుద్ధానంతరమున మనదేశపు బొగ్గునకు విదేశములయందు విశేషగిరాకి కలుగునట్లు సూచనలు పొడగట్టుచున్నవి. తగినంతసరకును మనము ఉత్పన్నముచేసి సరఫరాచేయ లేకపోతిమేని, ఆదరఖాస్తు (demand) మనలనుండి

తొలగిపోవును". దీనినిబట్టిచూడ మనబొగ్గువర్తకమునకు విశేషముగ గిరాకికలదనియును మంచిరోజులు వచ్చినవనియును చెప్పకతీరదు.

బంగారము

విస్తారముగా మైసూరు సంస్థానమునందలి కోలారుగనుల నుండి ఉత్పన్నమగుచున్నది. 1911 సం॥ న మనదేశమునందు ముత్పన్నమైన బంగారు 583,567 ఔన్సులు. దీనివిలువ 2.23 మిలియన్ల సవరనులు. తయారైనపదార్థ సంచయమంతయు విదేశయాత్ర వెడలెను. మొత్తములో నూటికి 95-వ వంతు కోలారు గనులనుండియే ఉత్పన్నమైనది. 3-వ వంతుకు కొంచెము తక్కువగా, నిజాము రాష్ట్రమునందలి హుత్తి గనినుండి ఎత్తబడినది. ధార్వార్ గని విడిచివేయబడినది. కాళహస్తిదగ్గరనున్న సువర్ణరేఖ మొదలగు కొన్నినదీమ తల్లులుకూడ బంగారపు ఇసుకను ఒసంగుటకలదు. సింధునదియొక్క పైభాగమున కాశ్మీరుసంస్థానమున 1903-వ సంవత్సరములో 106 ఔన్సుల ఇసుక ఎత్తబడినది. 1902 సంవత్సరమున ఐరావతీనదియొక్క పైభాగమునందు మియిట్క్యీయినాకు పైభాగమునందు బంగారుఇసుకను త్రవ్వుటకు కొన్నియంత్రముల నుపయోగించిచూచిరి. 1903-వ సంవత్సరము జూను నెలవరకు నదీప్రవాహమునందను పరిశీలించిచేసిన ప్రయత్నములు లాభకరములేయని గమనించినవారై మరికొన్ని యంత్రములను ఏర్పాటుచేయుటకు నిర్ణయించిరి. నదీప్రవాహములనుండి ఎత్తబడినబంగారము చాల తక్కువ. మైసూరు సంస్థానమునందలి గనులు ఒక బ్రిటీషు కంపెనీవారిచే పనిచేయబడుచున్నవి.

కిరోసన్ నూనె.

దీనికి శిలాతైలమనియు, మట్టితైలమనియు కూడ పేరు కలదు. హిమాలయ పర్వతముయొక్క తూర్పుపశ్చిమభాగము లయందు ఇండియాదేశముయొక్క కిరోసినునూనె నిచ్చుగనులు కలవు. పశ్చిమమున ఐరేనియనుపంక్తి, (Iranian) (పంజాబు బెలూచిస్థానములతో సహా) పారశీకమువరకు వ్యాపించియున్నవి. తూర్పున అరకానుపంక్తి, (Arakan) (ఆస్సాము, బర్మాలతోసహా) సుమిత్రా, బోర్నియో, జావా, కిరోసినునూనె గనులవరకు వ్యాపించియున్నది. ఈ రెండు పంక్తులయందును, బర్మాదేశమునందలి స్థితిగతులు నూనెనునిలవచేయుటకు చాల అనుకూలముగనున్నవి. యేనాన్గ్యాన్గ (Yenangyang) నూనె గనులు ప్రశస్తమైనవి.

పంజాబుదేశమునకూడ నూనెఊటలు రావల్పిండి జిల్లాయందుకలవు. కాని పంజాబునందుత్పన్నమగు నూనె దేశమొత్తములో చాలతక్కువ. ఒకటి రెండువేల గాలనుల నూనె మాత్రమే ఏటేట ఎత్తబడుచున్నది.

ఆస్సామురాష్ట్రమున కిరోసిన్నూనె విశేషముగా ఎత్తబడుచున్నది. 118 అంగుళలోతున మాకుమ్ (Makum) వద్దనున్న ఒకపెద్దఊటనుండి ఆస్సాము ఆయిల్కంపెనీవారు 1899 సం॥నుండి నూనెను తయారుచేయ నారంభించిరి. 1903 సం॥న ఈఊటనుండి 2,529,000 గాలన్లనూనె ఎత్తబడినది. 1913 సంవత్సరమున 632,000 గాలనులుమాత్రమే ఎత్తబడినది. ఏటేట ఈకంపెనీవారి వ్యాపారము వృద్ధియగుచున్నది.

బెలూచిస్థానమున కూడ విశేష నూనె ఊటలుకలవు. వీటిలో ముఖ్యములైనవి, మఱ్ఱి పర్వతములయందలి ఖట్టన్ (Khattan), పిరాణిదేశమునందలి మొగల్కోట ఊటలు. 1891 సం॥ మున కొన్నిచిన్నయూటలను పరీక్షించిచూడగా ప్రశస్తమైననూనె నొసంగునట్టివిగా నున్నవి. ఈఊటలనుండి జయప్రదముగా నూనెను తయారుచేయుటకు ప్రయత్నములు సలుపబడ లేదు.

బర్మా.

అరకాను యోమాపంక్తియొక్క తూర్పుభాగమున నున్న ఐరావతీనదియొక్క లోవయందు యేనన్గ్యాంగు, సింగుపు యూనాన్గ్యాటు అనుగొప్ప నూనె-ఊటలుకలవు. బర్మాదేశమునందు ప్రస్తుతము ఎత్తబడుచున్న నూనె విస్తారముగా ఈమూడు ఊటలనుండియే. ఇంకను మినుబు, అత్యాటిమో, ప్రోము, థింద్విను లోవయందుకూడ నీటిఊటలుకలవు. కాని ఈఊటల నంతగా ఇంకను ఉపయోగములోనికి తీసికొనిరాలేదు.

1899 సం॥ న ఎత్తబడిననూనె 32,309,531 గాలనులు

1903 సం॥ న ,, 85,328,491 గాలనులు

మొత్తముపైని మనదేశమున 1910 సంవత్సరమున 215 మిలియన్ల గాలనులనూనె ఎత్తబడినది. ఇందు 988,000 టన్నుల నూనె విదేశములకు ఎగుమతి కాబడినది. ఈనూనె వ్యాపారమున 1910 సం॥న పనిచేసిన జనులసంఖ్య 116,000.

మేంగనీసు.

గత ఇరువది సంవత్సరములనుండి గనులనుండి, ఎత్తుట ప్రారంభమైనది. ఈవ్యాపారము అలతికాలములో విశేషవ్యాప్తినిగాంచినది. ప్రపంచములో ఈలోహమును ఉత్పత్తిచేయు దేశములలో రెండవదిగమనదేశము ఎన్నబడుచున్నది. 1903-వ సం॥ 171,806 టన్నులు తయారైనది. 1911 సంవత్సరమున 807,907టన్నులులోహము ఎత్తబడినది. కొలదికాలములోమనదేశమే ఈలోహమును ఉత్పత్తి చేయుటయందు అగ్రస్థానము నలంకరించగలదు. మధ్యపరగణాలయందు నాగపూరుప్రదేశమున విశేష గనులుకలవు. ఇదిగాక బాలాటు, చిండ్వారా జబల్పూరు జిల్లాలలోకూడ గనులున్నవి. నూటికి 69-వ వంతు మధ్యపరగణాలయందలి ఉత్పత్తి. చెన్నరాజధానినుండి నూటికి 15-వంతు లోహము ఎత్తబడుచున్నది. విజయనగర సంస్థానమునందలి గరివిడిగనుల ప్రసిద్ధి పాఠకు లెరింగినదే యుండును. గంజాముజిల్లా, కళ్ళికోట సంస్థానమునను, బల్లారి జిల్లాయందలి సాండూరు పర్వతములయందును ఈ గనులుకలవు. వీనిని ఉపయోగములోనికి తేవలసియున్నది. బొంబాయి రాజధాని యందు మహాబలీశ్వరము చుట్టుప్రక్కలను, సతారా బీజపూరు, ధార్వార్ జిల్లాలయందును గనులు కలవు.

బొంబాయినుండి ఉత్పత్తి యగుచున్నది. నూటికి 3.75 వంతు

మైసూరు	,,	5.3	,,
వంగదేశము	,,	5.2	,,
మధ్యహిందూస్థానము	,,	1.5	,,

సూరేకారము.

విస్తారముగా విహారరాష్ట్రమునందుత్పత్తి. ఈపదార్థము విశేషముగా వ్యవసాయమున కెరవగు, ఎరువుగను రసాయనకళలకును ఉపయోగించును. మనదేశమునం దుత్పన్నమగు సరకంతయు విదేశములకు ఎగుమతి చేయబడుచునే యున్నది.

మెగ్నెసైటు.

దక్షిణహిందూస్థానమున విశేషముగ కలదు. శేలము నద్ద ఈఖనిజము విశేషముగకలదు. ఈఖనిజముచే నావరింపబడియున్న ప్రదేశము సుద్దకొండలని పేర్కొనబడుచున్నవి. ఈలోహము, ప్రస్తుతము విరివిగాఎత్తబడి వ్యాపారము బాహాటముగా జరుగుచున్నది.

తృణమణి.

బర్మాదేశమున తగుమాత్రము కలదు.

గ్రాఫైటు.

పెన్సిళ్ళలోవేయు సీసపుబొగ్గు. విశాఖపట్టణ పర్వత పంక్తియందును, స్వతంత్రసంస్థానమగు భట్టీసాగరు ప్రాంతమునను కొడగు, గోదావరి జిల్లాలయందును, అప్పరుబర్మాయందును, ఈలోహముకలదు. కాని తిరువాన్కూరు సంస్థానమున తప్ప, ఎచ్చటను ఈఖనిజసంపద ఆకర్షించబడుటలేదు. మరియు, అల్యూమినియము, సీసము, తుత్తినాగము, కోబాల్టు, నికెలు, కాటుకరాయి, జిప్సము, పటిక, గంధకము, మొదలగు ఎన్నియో లోహములు కలవు.

తగరపు రేకు.

వంగదేశమునకు చెందిన హాజరీబాగు జిల్లాయందలి పాలన్‌పూరు సంస్థానమున ఈలోహము విశేషముగ కలదు. దీనిని బాగుగాపరిశీలించి వాడుకలోనికి తీసికొని రావలసిన ఆవశ్యకత మెండు. బర్మారాష్ట్రమునకూడ ఈఖనిజము ఉత్పత్తియగుచున్నది. మనదేశమునకు వలయునంత తగరపు రేకు దేశమున దొరకుటలేదు. (స్ట్రెయిటు శెటల్మెంట్సు) జావా, బార్నియో, సింగపూరు, మలకాలనుండి మనమువిస్తారముగా ఈ రేకును గ్రహించుచున్నాము.

అభ్రకపు రేకు.

చాల సంవత్సరములనుండి అభ్రకమును ఉత్పత్తిచేయుటయందు మనదేశమగ్రపీఠము నలంకరించియున్నది. ప్రపంచమునందలి యావత్తు ఉత్పత్తిలోను సగమునకధికముగా మనదేశమే ఉత్పత్తిచేయుచున్నది. అభ్రకము రేకును ఉత్పత్తిచేయుటయందు ముఖ్యమైన ప్రదేశములు రెండు. నెల్లూరు జిల్లాయందును, అరవైమైళ్ళ పొడవును, పన్రెండుమైళ్లు వెడలుపును కలిగి గయ, హాజరిభాగు, మాంఘియరు జిల్లాలయందు వ్యాపించియున్న ఒక పంక్తియందును విస్తారముగ కలదు. వంగరాష్ట్రమున, అభ్రకపువ్యాపారము విశేషకాలమునుండి జరుగుచున్నది. నెల్లూరు జిల్లాయందుమాత్రము 1892 సం॥న ప్రారంభమైనది. ఈవ్యాపారము విశేషలాభకారిగా నున్నది. 1911 సం॥న మనదేశమున 31,686 ఇంగ్లీషుబారువల అభ్రకము ఎత్తబడినది. అందు 31లక్షల రూప్యముల విలువగల సరకు ఎగుమతిచేయ

బడినది. ఈగనులను త్రవ్వుటయందు నూతనపద్ధతులను మనవారు ఉపయోగించుటలేదు. ప్రస్తుతము లాభకరముగనున్నను రానురాను నూతన పద్ధతుల ఆవశ్యకత వ్యక్తీకరించబడక మానదు.

రాగి, వెండి.

ఈ రెండులోహములును మన దేశమునందంతగాలేవు. వెండి బహుస్వల్పము. ఈలోహమును ఎప్పుడును మనముపై దేశములనుండి—ముఖ్యముగా అమెరికానుండి—గ్రహించుచుండవలసినదే. పూర్వము మన దేశమున రాగి విశేషముగ నుండెడిదికాని ఆగనులన్నియు ఇపుడు నిస్సారములైనవి. ఈ లోహముకూడ విశేషముగ మన దేశమునకు ఇటీవల దిగుమతియగుచున్నది.

రత్నములు.

భరతఖండము రత్నములకు పెట్టినదిపేరు. అనేక శతాబ్దములనుండి వినియోగించ బడుచుండుటవలన ఇపుడవి చాల వరకు సన్నగిలినవి. 1911 సం॥న 288,216 కేరట్ల రత్నములు (కెంపులు వగైరా) ఎగుమతి చేయబడినవి.

ఇనుము.

ప్రశస్తమైన ఇనుపగనులు దేశమునందంతటను వ్యాపించియున్నవి. ఈ ఇనుముయొక్క పరిశుద్ధత నాలోచించిన ఇంగ్లాండునందలి ఇనుపవర్తక యజమానులకు సైతము నోరూరకమానదు. మరియొక విశేషమేమనిన పరిగ్రహణమునకు విశేషశ్రమ యవసరములేకుండ పెక్కుస్థలములయందు పై

భాగముననేయున్నది. ప్రశస్థమైన డామస్కసు కత్తులను తయారుచేయుటకు సైతము పనికివచ్చెడి ఉక్కుగనులు కుప్పలుగానున్నవి.

తాతా అండుసన్సువారి కర్మాగారము.

ఐరోపాదేశ పద్ధతుల ననుసరించి ఇనుమును తయారు చేయుట మన దేశమునందు రెండు చోట్లనే జయప్రదముగ జరుగుచున్నది. ఖరగ్‌పూరునకు సమీపముగానున్న శాక్చి (Sakchi) పట్టణమున తాతాఅండుసన్సు వారిచే ఒక గొప్ప అయఃకర్మాగారము స్థాపింపబడినది. ప్రశస్థమైన ఉక్కును, ఇనుమును తయారుచేయబడుచున్నవి. మన రైల్వేలకు కావలసిన కమ్ములువగైరా సామానులు చాలవరకు, ఈ కర్మాగారమున తయారగుచున్నవి. ఈ కర్మాగారమును విరివిచేయుటకునై గతవత్సరమున ఏర్పాటులు చేయబడినవి. మన దేశమున అలతికాలములో ఆవిరియంత్రములుకూడ తయారుచేయబడనున్నవి. యుద్ధము ఎడతెగక జరుగుచుండుటవలన ఆంగ్ల వర్తక నౌకలు విశేషముగ, నావికాదళమున చేర్చబడుటచే, మన దేశమునుండి ఎగుమతులు చేయుటకు ఓడలయొక్క గిరాకి అతిశయించినదన్న సంగతి చదువరు లెరింగియేయుందురు.

ఇండియా వర్తకనౌకలయొక్క ఆవశ్యకత.

నూలుసరకులను ఎగుమతి చేయుటలో చీనాదేశమున జపానుదేశమునకును మనకును పోటీయున్న సంగతి ఇదివరకే సూచించియున్నాము. ఆంగ్లనౌకలు విస్తారము రాకపోకలు

జరిగించుచుండుట లేమివలన మన వ్యాపారమునకు అభ్యంతరము కలుగుచున్నది. జపానుదేశము ఓడల సంఖ్య నధికముగావించుటవలన వాణిజ్యచక్రమున విజృంభించుటకువీలగుచున్నది. ఇటీవల బొంబాయిలో జరిగిన నూలువర్తక యాజమానుల సంఘముయొక్క సాంవత్సరికోత్సవ సమావేశమునందు శ్రీయుత మానమోహనదాసు రాజ్జీగారు మనదేశ వాణిజ్యవ్యాప్తికి పొగఓడలయొక్క ఆవశ్యకతను గూర్చి ముచ్చటించిరి. ఓడల నిర్మాణము కొలదికాలమున మనదేశమునకూడ జరుగవలసియున్నది. నావికా నిర్మాణము మనదేశమున క్రొత్తదికాదు. పూర్వచరిత్రలను జదివినచో తెల్లమగును. ఈ ఓడల నిర్మాణమునకు, వలయు పరికరముల నన్నిటిని కాలిమటియందలి తాతావారి కర్మాగారమే తయారుచేయగలదని వ్రాయుటకెంతయో సంతసముగనున్నది.

బంగాళా దేశమునందలి ఇనుప కర్మాగారము నందుకూడ నూతన పద్ధతులపైని పిగ్-ఐరను, ఉక్కును, తయారు చేయబడుచున్నవి. ఇదిగాక మధ్యపరగణాలయందు ఇంకను పూర్వపద్ధతులపైని ఇనుము కఱిగించ బడుచున్నది. రైల్వేల కతిదూరముననుండు ప్రదేశములయందు ఈ విధానము కొంత లాభకరముగనే యున్నది.

ఇనుపగనులుగల ప్రదేశములు.

విస్తారముగా ఇనుపగనులు గల ప్రదేశములు శేలం జిల్లా, బళ్ళారిజిల్లాయందలి సాండూరు (Sandur) సంస్థానము, మధ్య పరగణాలయందలి చందా, రాయపూరు, జబల్‌పూరు

ఛోటానాగపూరు, ఒరిస్సా యందలి మాౕర్‌భంజ్ సంస్థానములు. మాౕర్‌భంజిసంస్థానమునందలి గనులనే తాతాఅండు సన్సువారు 99 సంవత్సరముల కవులుకు తీసికొని కాలిమటీయందు పనిచేయుచున్నారు. మైసూరు సంస్థానమునందలి బాబాబూడన్ పర్వతములయందు గొప్ప ఇనుపగనులున్నవి. ఈగనులకు సమీపమున బొగ్గుగనులు లేకపోవుటవలన, ఈకనుముల యందలి ఖనిజసంపదను ఆకర్షించుటకు వీలుచిక్కక ఇంతకాలమువరకు వేచియున్నది. కాని ఇటీవల సర్ విశ్వేశ్వరయ్యగారి మంత్రిత్వమున అన్నివిధములను మైసూరు సంస్థానము అభివృద్ధిగాంచుచున్నదన్న సంగతి నిర్వివాదాంశము. తాతా అండుసన్సువారి కర్మాగారమును విశేషప్రజ్ఞచే నడిపించుచున్న పి. పి. పెరిన్ అనునిపుణునిచే ఇటీవల కొన్నిశోధనలు గావింపబడినవి. పెరిన్‌గారు రాతిసిబొగ్గు లేదని ఈలోహమును విడిచిపెట్ట నవసరము లేదనియు, కట్టెలను కాల్చి బొగ్గు తయారుచేసి ఆబొగ్గువలన ఇనుమును కఱుగ వచ్చుననియు అభిప్రాయము నిచ్చిరి. బొగ్గును తయారు చేయుటకొక యంత్రసామగ్రిని, ఇనుమును కఱగుటకు బ్లాస్టుఫర్నేసను * యంత్రమును స్థాపించి, పనిచేయుటకు నేర్పాటులు గావింపబడినవి. కెమ్మనగుండి కనుమలయందు 5 లక్షల టన్నుల ఉత్కృష్టమైన ఇనుమును లక్షలకొలది టన్నుల

* గనులనుండి ఎత్తిన అశోధిత లోహమును శుభ్రపర్చుటకై కరిగింపవలసిన ఆవశ్యకత కలదు. కరుగుటకై బ్లాస్టుఫర్నేసు అను సాధనము వాడుక చేయబడుచున్నది. అశోధిత లోహమంతయు ఈఫర్నేసునందు వైచి కరిగి వడకట్టిన మంచిలోహము లభించును.

రెండవ తరగతి ఇనుమును ఉన్నట్లు ఇటీవల వార్తాపత్రికల యందు ప్రకటితమైనది. సేలము బళ్లారిజిల్లాలయందలి ఇనుపగనులనుకూడ, కట్టెలను కాల్చి తయారు చేసిన బొగ్గువలన, విశేషలాభకరముగ పనిచేయవచ్చునని ప్రొఫెసరు ఖాటరుటను గారు అభిప్రాయము నిచ్చిరి.

1911 సంవత్సరమున మనదేశమున 366,180 టన్నుల ఇనుము తయారుచేయబడినది. ఇందు 21 లక్షల రూప్యముల విలువగలది పైదేశములకు ఎగుమతి చేయబడినది.

ఉప్పు.

1910 సం॥ న మనదేశమున సుమారు 34 మిలియన్ల మణుగుల ఉప్పు తయారుచేయబడినది. అందు నూటికి 91-వ వంతు సరస్సులనుండియు సముద్రములనుండియు నీటిని ఆవిరిగా చేయుటవలనను, 9-వ వంతు గనులనుండి ఆకర్షించుట వలనను దొరుకుచున్నది.

(1) ఉప్పుమళ్ళ నుండి:		
చెన్నరాజధాని	12.6	మిలియన్ల మణుగులు.
సింధు, బొంబాయి రాష్ట్రములు	12.5	,,
బర్మా	½	మిలియను ,,
(2) రాజపుత్రస్థానమునందలి 'సాంబారు' సరస్సునుండి	4.8	,,
(3) పశ్చిమోత్తర పరగణాల యందలి ఖాతిఉప్పు, సాల్టు రేంజినుండియు పంజాబుగనుల నుండియు.	3.3	,,

ఉప్పు పన్నువలన మన దొరతనమువారికి వచ్చుచున్న ఆదాయము 1916-17 సం॥ న 4,785,900 సవరనులు. ఉప్పు యొక్క ప్రయోజనము ఈఆదాయమునుండి గ్రహించనగును.

గనులయందు పనిచేయుచున్న కర్మకరులు.

ప్రస్తుతము మనదేశమున గనులయందు సంవత్సరము పొడుగునను దినమునకు ఒకలక్ష యాభయి వేల జనులు పని చేయుచున్నారు. గనులను విస్తారముగా త్రవ్వుటకు మొదలిడిన కొలదిని వేలకొలది ప్రజలకు వృత్తులు కల్పింపబడును. బొగ్గు గనులకు చాలమంచి కాలము రానున్నదని సూచించి యున్నాము. దేశస్థులు గమనించవలసిన విషయము ఒకటి కలదు. అన్యదేశీయులను మనఖనిజసంపదను కొల్లగొననీయవచ్చునా ?

మన గనులను భారతీయులే ఉపయోగములోనికి తీసికొని రావలయును గాని అన్యదేశీయులను కొల్లగొన నీయరాదు. ఇదివరకే చాలనష్టము ననుభవించి యుంటిమి. ఈసందర్భమున కీర్తిశేషులైన దివాను బహదూరు ఆర్. రఘునాథరావు పంతులుగారి వచనములు జ్ఞప్తికివచ్చుచున్నవి. రఘునాథరావు గారి స్వాంతభూములలో ఒక మేంగనీసుగని యున్నది. దానిని ఎందఱో విదేశీయులు పనిచేయుట కనుజ్ఞ దయచేయుడని కోరగా ఆమహాశయు డిట్లనెను. ఎప్పటికైన స్వదేశస్థుడగు భారతీయుడే నాగనిని త్రవ్వుటకు పూనుకొనవలయునేగాని, అన్యదేశీయుల కెన్నడునేను ఇవ్వదలచుకొనలేదని ఖండితముగా బదులుచెప్పెను. అందువలని లాభము స్వదేశముననే ఉండి తీరవలయునుగాని పరదేశీయుల నైశ్వర్యవంతుల జేయరాదు. భారతీయులెల్లరు ఈవిషయమును గమనించెదరు గాక.

గోఖలే మహాశయుని అభిప్రాయము.

గోఖలే మహాశయుడు సైతము వెల్బీకమిషను ఎదుట సాక్ష్యమిచ్చుచు నీతీరుననే వాక్రుచ్చెను. "నాకు గొప్ప ఆస్తి యున్నచో నేననుభవింప వలసినదేగాని ఇతరులు దానిలాభమును పొందుటకు వీలులేదు. ధర్మవిరుద్ధముగ నా ఆస్తినంతయును యితరులనుభవించుచు నాకు భరణముక్రింద కొంతస్వల్పభాగమునిచ్చుట చాలహాస్యాస్పదము. నాఇష్టము వచ్చినరీతిని నేను అనుభవింపవలసినదే గాని ఇతరు లెంతమాత్రము పాలుగొనకూడదు. వర్తమానమందు నేను అనుభవించినను లేకపోయినను పరులకీయక నాసొత్తుగ నేనేయుంచుకొనియెదను." ఈపంచాయితీవారి ఎదుటనే మరియొక సందర్భమున గోక్లేగారిట్లు సాక్ష్యమిచ్చిరి:—"నాఅర్థము తెల్లము జేయుటకునే నొక దృష్టాంత మిచ్చెదను. ఒక గృహమున్నది. దానిలో నొక్కడే కాపురముండెను. వీనికి పక్షవాతరోగము సంభవించినది. వీనిగృహమందు సుందరమగు వస్తువు లనేకములున్నవి. పక్షవాతముచే పీడింపబడుచున్న ఈగృహస్థు వీనిసుఖము, సంతోషము పొందజాలడాయెను. కాన పరులెవరో వానియింట ప్రవేశించి ఇంటనున్న వస్తువులలో, స్వల్పభాగము మాత్రము వానికిచ్చి మిగిలిన గొప్పవస్తువుల నన్నిటిని గొంపోయిరి. ప్రస్తుతమందు మాపని ఇదేరీతిగ నున్నది."

కాన దేశీయులే, దేశమునందలి ద్రవ్యసాధనములను ఉపయోగములోనికి గొనివచ్చి తమకును దేశమునకును కీర్తి తేవలసియున్నది.

శ్రమ. (Labour)

ద్రవ్యోత్పత్తికి మూలాధారములు మూడువిధములు.

ప్రకృతి, (Nature) శ్రమ (పని), మూలధనము. ఇంతదనుక మనము మొదటిదియగు ప్రకృతినిగూర్చి చర్చింతిమి. దేశమునందలి ద్రవ్యసాధనములు ప్రకృతిజనకములే. ఇక రెండవదియగు శ్రమను గూర్చి విమర్శింతము.

శ్రమ యనగా కర్మకరుల (పనివాండ్ర) శక్తి యుక్తులు. ఏదేశమున ద్రవ్యసాధనములకు తోడు శ్రమా విభాగము (Division of labour) చక్కగానుండునో, ఆదేశము ఐశ్వర్యవంతమగుటకు ఇసుమంతయైనను సందియము లేదు.

శ్రమావిభాగము.

కర్మకరులసంఖ్య మనదేశమున విస్తారము. వేతనములు కూడ కాఱుచౌక. అయిన ఒక్క కర్మకరుల సంఖ్యనుబట్టియే మనము శ్రమావిభాగమును నిశ్చయించరాదు. పదునొకండవ ఇండియా కళాసభయందు బొంబాయి నగరమున అగ్రాసనాధిపులగు సర్ దొరాబు తాతాగారిట్లు వాకృచ్చిరి! "కర్మకరుల సంఖ్యనుబట్టియే మనము శ్రమావ్యవస్థను నిర్ణయించరాదు. మొత్తములో ఎంతమంది నిపుణులు కలరో, వారి కౌశలమును బట్టి నిశ్చయించ వలసి యున్నది."

కర్మకరులపై మోపబడుచున్న నేరములు

ఐరోపా దేశమునందలి కర్మకరులతో సరి పోల్చిచూచినపుడు మనకర్మకరులు కార్యసాధనత్వమున కడునిష్ప్రయోజ

కులుగ నున్నారని మనము తఱుచు వినుచున్నాము. ఇండియనులు చేతిపనులన్న సేవగించుకొందురనియు, శ్రమ యొక్క గౌరవమును గమనించుట లేదనియు కూడ వినుచునే యున్నాము. ఈరెండవ నిందారోపణ విద్యాధికులను గూర్చి కాని సామాన్యప్రజను గురించి చెప్పినదికాదు. ఇది సత్యమే! మనలో విద్య నభ్యసించినవారు వాణిజ్య పరిశ్రమలయందు వారి బుద్ధికుశలతను వినియోగించి దేశమునకును తమకును కీర్తిసంపదనుగడించవలసిన యావశ్యకతను ఈసరికిని గ్రహించుటలేదు. ఇది కడువిషాదకరమైన సంగతి. విద్యాధికులు పరిశ్రమలయందు ప్రవేశించకపోవుటచేతనే ఇండియాదేశమునందలి కర్మకరులు నిష్ప్రయోజకులనియు కౌశలమన్న నెట్టిదియో ఎరుంగరనియు నిందారోపణ చేయబడుచున్నది. ఇప్పటికైనను తెలివితెచ్చుకొని బి. ఏ., యమ్. ఏ. పరీక్షలయందు దారి తేరినవెంటనే రెవిన్యూ ఉద్యోగమునందు చేరుటగాని, లా కాలేజియందు జేరి వకీలు పట్టాలను గ్రహించుటగాని కట్టిపెట్టి మన కళాకౌశలము సందిగ్ధ స్థితిలోనున్న ఇట్టిసమయమున తమబుద్ధి వైశద్యమును కళాచక్రమునకు ధారపోసి యశఃకాములగుదురుగాక!

నిందారోపణమును బాపుకొనుటకు విధానములు.

ఈనిందారోపణమును బాపుకొనుటకుగలవిధానములు రెండు. దేశమునందెల్లయెడల విద్యావ్యాప్తిని జేయుట ఒకటి. రెండవది, సమర్థులగు బోధకులనియమించి చిన్ననాటనే శిల్పముమొదలగు చేతిపనులయందు శిక్షను గరపుట. చిన్నతనముననే శిక్షనువడసినచో, పనిచేయుటయన్న ఏవగించు

కొనరు. పనిచేయుటయనగా ఉద్యోగములు చేయుటకాదు. పరిశ్రమలయందు బుద్ధికుశలతను ఉపయోగించుట.

నిపుణులగు కర్మకరులు ప్రస్తుతము లేని మాత్రమున కళాచక్రము వికసించజాలదా?

నిపుణులగు కర్మకరులు దేశమున లేరనియెడి సిద్ధాంతము నూతగాగొని ఎన్నటికిని ఇండియాదేశముయొక్క కళాప్రపంచము వికసించనేరదనియును అట్టిస్థితిలో సర్కారువారు ఏపరిశ్రమకును సహాయము నొసంగుటకూడ అసంభవమనియును వాదించుప్రముఖులు కూడగలరు. ఇది ఎంత విశ్వాసార్హమో, పరిశీలించెదము. తొలుదొల్త భరతఖండము సర్వరాష్ట్రములయందును కళాపరిపూర్తినిగాంచి వన్నెకెక్కినసంగతి నిర్వివాదాంశము. ఈస్టిండియాకంపెనీవారి యాజమాన్యము క్రింద మనదేశమున్న కాలమున ఇంగ్లీషువర్తకుల యాశయములు సఫలీకృతములగుటకు అనేకవిధముల మనకళలను రూపుమాపిరి. కళాప్రపంచము తేజోవిహీనమగుటచే, త్రాగుటకె గంజిలేక మనకళాదక్షులెల్ల వ్యవసాయవృత్తినే శరణ్యముగ గ్రహించవలసిన దుస్థితిపట్టినది. ఆకారణమువలన ఇండియాదేశము కృషికళ నభివృద్ధిచేయుటకేగాని పారిశ్రామిక దేశమెన్నటికిని కాజాలదని వాదించుట సమంజసముగ నున్నదేమో చదువరులూహించెదరుగాక! పరిశ్రామికవిద్యను సర్కారువారు ప్రసాదించినయెడల పూర్వపుపాన్నత్యమును జ్ఞప్తికిదెచ్చు కళాదక్షులు తిరిగి బయలువెడలకపోరు. కర్మకరుల వేతనములు మనదేశమున కారుచౌకయని ముందుసూచించితిమి. ఇంగ్లీషు

పనివాండ్రతో పోల్చిచూచినపుడు మనదేశస్థులు వెనుకపడియున్నారను సంగతిని ఆధారముచేసికొని దేశములో కూలిచౌకయగుటకు బదులు బహుప్రియమైనదని గూడ వాదుచున్నారు. దీనికివారుచూపు నిదర్శనమేమనగా, ఒకలంకషైరు పనివాడు దినమునకు చేసినపని, ఇండియాదేశమున నలుగురుమనుష్యులు గాని చేయజాలకపోవుట. ఈ సందర్భమున నొకప్రశ్న. ఇండియాదేశమునందలి వర్తకసంఘములు ఏకర్మకరులనుండి పనిని గ్రహించి కోట్లకొలది ధనమునార్జించగలిగిరి ? సర్కారువారు ప్రమేయమును గలిగించుకొని పారిశ్రామికవిద్యను దేశమునందంతటను వ్యాపింపజేసి, పరిశ్రామిక వ్యవహారములయందు నేర్పుతో పాటుపడుటకు సంసిద్ధుల జేసిరేని శ్రమసమస్య తనకు తానే సద్దుకొనును.

శిల్పుల కొసంగవలసిన విద్య.

మనశిల్పులకొసంగెడి విద్య వ్రాయుట, చదువుట, లెక్కలువేయుట అనునీమూడు విషయములతోనే ముగించినలాభములేదు. కళాపరిపూర్తినిగాంచి విజృంభించుచున్న ప్రపంచమందలి ఇతర రాష్ట్రియములయందెట్టి విద్యనొసంగుచున్నారో అట్టివిద్యనే మనశిల్పులకుకూడ గరపవలసియున్నది. లేనిచో ఎప్పటి స్థితిలోనేయుండును.

భారతీయుల ప్రజ్ఞ.

ఎద్దానినైన సూక్ష్మముగ గ్రహించుటయందు మనదేశస్థులు మిక్కిలి సమర్థులు. ఇతరవిషయములయందెంతనీరసస్థితియందున్నను, ప్రజ్ఞావిశేషమునమాత్రము ఇతర రాష్ట్రముల

వారికి మనవారు తీసిపోరు! టావర్నియరను (Tavernier) ఒక ఫ్రెంచి యాత్రికుడు అక్కాలపు పరిస్థితులనుగూర్చి ఇట్లు వ్రాసెను. "ప్రశస్తమైన సాధనసామగ్రిని కలిగియున్న ఐరోపా కర్మకరు లేవిధముగ సరకులను తయారుచేసిరో, ఆరీతినే నాజూకననెట్టిదో యెరుగని హీనదశయందున్న పనిముట్లతో ఇండియా దేశపు పనివాండ్రు వస్తువులను తయారు చేయుట చాల ఆశ్చర్యకరముగ నున్నది." టేవర్నియరు కాలమునందు యంత్ర కళలన్నవి పేరునకైన లేవు. అట్టి స్థితిలోనే ఐరోపు కర్మకరులతో జయప్రదముగ పోటీయందు నిలిచినపుడు, తగినపరిశ్రామిక శిక్షనొసంగి సంసిద్ధులను చేసిననో ఇపుడుకూడ కళాచక్రమున వారికి సమానులుకాగలరు. క్రికెట్టు ఆటయందు ఇంగ్లాండునంతను మన రంజిత సింగు జయించెను. పరంజపె, త్యాగరాజను, మొదలగు ఎందరు భారతీయులు గణితశాస్త్రమునందు విదేశీయులకంటె ఉన్నతిగాంచ లేదు. ఇంగ్లీషుభాష మన కన్యభాషయయ్యు సురేంద్రనాథ బానర్జీవంటి యొందరువక్తలు బయలుదేర లేదు. బ్రజేంద్రనాథశీలు హేరంబచంద్ర మైత్రావంటి ఎందరు సుప్రసిద్ధ ఇంగ్లీషుప్రొఫెసరులు మనదేశము నలంకరించుట లేదు. ఇదియంతయు మనబుద్ధి కుశలతను, చెప్పక చెప్పుచున్నది. తగినఅవకాశమును అభ్యాసమును ఒసంగి అనుకూలమగు పరిస్థితులను గల్పించినచో, మానవప్రపంచమున కవసరమగు ఏశాఖయందైనను ప్రసిద్ధులగువారితో సముడని ఉత్తీర్ణత గాంచగలశక్తి భారతీయునకు కలదు.

కర్మకరులయందు చలనములేకుండుట.

కేవల నిరర్థకులనియు కౌశలమన నెట్టిదో ఎరుగనివారనను నిందారోపణనుగూర్చి ఇంతవరకును చర్చించితిమి. మోపబడిన నేరములలో నిక రెండవదానినిగూర్చి విమర్శింతము. త్రాగుటకుగంజియున్న, అల్ప సంతుష్టులగుటచే ఒకపూట మాడుచున్నను, మనదేశమునందలి కూలివాండ్రు పరదేశములంబట్టిపోరనుట. ఉన్నయూరినే ఆశ్రయించుకొనియుందురు గాని హెచ్చువిత్తము నార్జించుటకై విదేశములకేగ కుండుట రెండవ దోషము.

అన్యదేశములకన్న స్వదేశమునందు పనివాండ్ర చలనము తక్కువయనుమాటసత్యమే. మనమతాచారములు ఇందునకు చాలతోడ్పడినవి. మోక్షేచ్ఛయేగాని ఐహికచింతఅంతగా మనప్రజల నావరించుట లేదు. ప్రస్తుత ప్రపంచస్థితిలో ఐశ్వర్యోపార్జనకేగాని మోక్షమునకు ప్రయత్నించుటకు వీలంతగా లేదు. మనదేశము మూలనడియుండుటకు అల్పసంతుష్టియును, సాహసలోపమును చాలవరకు తోడ్పడినవి.

కర్మకరులయందలి చలనము మనపత్రికలు లారోపించునంత నీచదశయందున్నదియాయనుసంగతిని విమర్శింతము. చలనము తక్కువగా నున్నంత మాత్రమున కదలికయే లేదనియును కూపస్థ మండూకము వలె ఉన్నచోటనే పడియుందురనుటకు, వీలు లేదు. ఇందునకు ప్రత్యక్ష నిదర్శనములు గలవు. వలసరాజ్యములయందు మనకూలివాండ్రు పొందుచున్న బాధలను శ్రీగంధి మహాశయుడు వారిని సముద్ధరించుటకు

చేసిన ప్రయత్నములును పాతకు లెరుంగకపోరు. అన్నిబాధ లకును ఒడబడి, ఏల మనకర్మకరులు విదేశముల కేగుచున్నారు? ఇది కదలికలేకపోవుటవలననా ? అస్సాము, విహారరాష్ట్రముల యందలి నీలి, తేయాకుతోటలకు ఏదేశమునుండి కూలీలుచేరి పనిచేయుచున్నారు? వారచ్చటయెన్ని ఇక్కట్ల ననుభవించు చున్నదియును, గంధిమహాశయుడు మోతిహారియందు చేయుచున్న విచారణవలన బహిరంగము చేయబడును. బ్రిటిషుతోట యధి కారులకు వీరిరాకచాల ఆందోళనము కలిగించు చున్నది. గుట్టుబయలుపడునేమో యని భీతావహులైనట్లు తోచెడిని ! కూలివాండ్ర చలనము లేదని వాదించువారు రంగూనుపట్టణ మును వీక్షించి కేని పంజాబుమొదలు, తిరువాన్కూరు వరకు సకల రాష్ట్రములనుండియువచ్చి పనిచేయుచున్న కర్మకరులు వారిదృష్టిపథమున దన్నులొ్కనియెదరు.

కళాచక్రమును విరివిచేసి తగినవృత్తులు, మనదేశము నందు కల్పింపబడినచో, కర్మకరు లెంతయో సంతసముతో దేశముననేయుండ నుద్యుక్తులగుదురు. స్వదేశముననే తగిన వసతులున్న బాధలు పడుటకునై విదేశముల కేగ నలసి యుండదు. ఇందులకొక దృష్టాంతము. గంజాం జిల్లాలో బరం పురం, నరసన్నపేటలు పట్టుసాలీలకు ప్రసిద్ధి. అందులో నరసన్నపేటయందు పూర్తిగ పట్టుసాలీలే నివశించుచుండెడి వారు. ఊరియందు 12 పేటలలోను, ఇపుడుచూచిన పట్టు సాలీలను వెతకవలసినదేగాని మునుపటివలె ఎక్కడచూచి నను వారేలయి కానవచ్చుటలేదు. వీరేమయిరి? అదృశ్యుల య్యిరా? లేదు. పవరుమగ్గముల పోటీకి ఆగలేక జీర్ణదశలోనికి

వచ్చి నిలువ నాస్కారము లేకపోవుటచే వంగరాష్ట్రమునందలి సెరంపూరు గ్రామమునకు వేలకొలదిచేరిరి. బరంపురం సంగతి కూడనిట్లే. నేతకళ విదేశములపోటీకి ఆగలేకపోవుటచేత కదా ఈపట్టు సాలీలకునిట్టి దురవస్థపట్టినది. స్వస్థానముననే సెరం పూరునకువలె ఆకళను నూతన పద్ధతులపైని స్థాపించినచో, గృహములను స్వగ్రామములను విడిచి వారుపోవకయుందురు. మనకర్మకరులకు కదలిక కలదో లేదో చదువరులీవిషయమును బట్టి యూహించెదరుగాక !

శ్రమాభివృద్ధికి మార్గములు.

ఇక రంధ్రాన్వేషణము నటుంచి ప్రస్తుతము మన శ్రమా వ్యవస్థ హీనదశయందుండుటకుగల కారణములను చర్చించుచు, సాధనాంతరములకూడ పొందు పర్చనగును:-

ఆర్జనశక్తిని అధికముచేయుట.

మనదేశమునందలి కర్మకరులు చాలతక్కువ కూలికి పనిచేయుట కలవాటు పడియుండుట అందరు నెరింగినదే. ఈ అల్ప సంతుష్టిత్వము వారిపురోభివృద్ధికి అడ్డు కలుగుచున్న దేమోయని తోచెడిని. అయిన, మనశిల్పులయొక్క ఆర్జనశక్తిని అధికము చేయుటకు వీలగు ప్రయత్నములు సల్పినంతమాత్ర ముననే చాలదు. ఏలనన, అధికముగ సంపాదించిన సొమ్మును పిన్నవయసునం దలవాటుచేసికొనిన త్రాగుడు మొదలగు దుర్వ్యసనములక్రింద వినియోగించును. లేదా, దినమునకు తాను సంపాదించవలసిన సొమ్ము, వేతన మధికముగ వచ్చు చుండుటచేత కొంతకాలము మాత్రమే పనిచేసిన చేకురునని

ఊహించినవాడై రోజంతయు పాటుపడక కొంతవరకుమాత్రమే పనిచేసి ఊరకయుండవచ్చును. ఈరెంటిలో నేపద్ధతి నవలంబించినను, శ్రమానిపుణత పూర్వస్థితియందే యుండును.

జీవనశైలిని అధికము చేయుట.

కావున కర్మకరులయొక్క ఆర్జన పాటవమును వృద్ధి చేయుటతో తృప్తినొందక, ఆవెంటనే వారు పూర్వమునకంటె ఉత్కృష్టమగు శైలిని జీవనము నడుపుటకు ఉద్యుక్తులుగ జేయ వలసి యున్నది. గొప్పగా బ్రతుకుట కలనడుట ఆరంభమయిన కొలదిని, పూర్వమువలెగాక నిత్యమును కావలసిన వస్తువుల సంఖ్య అధికమగుచుండును. వాంఛలధనమగుచున్న కొలదిని, హెచ్చుగా పాటుబడి ధనము నార్జించవలె నన్న ఆవశ్యకత స్ఫురించును. ఇయ్యది వారిపురోభి వృద్ధికి చాలతోడ్పడును. నాగరికత వ్యాపించుచున్న కొలదిని కోరికలధికమగు చుండుట మనము గమనించుచున్నాము. వాంఛాపూర్తికినై పాటుపడు నపుడు కౌశలమును, ఋజువర్తనమును, సకాలమునకు పని చేయుటకు వచ్చుటయు మొదలగు సుగుణము లలవడకమానవు. కాబట్టి ఆర్జనపాటవముతో పాటు, జీవనశైలిని సైతము అధికము చేయవలసియున్నది. లేనిచో నిష్ప్రయోజకమగుట యేగాక, పూర్వముకన్న దుర్విషయముల దవుల్కొనుటచే మరింత హీనస్థితికి కూడ వచ్చును. అటులగాకుండ కాపాడ వలసి యున్నది.

యజమానులకునుకర్మకరులకును, అన్యోన్యతనుపెంపుచేయుట.

యజమానులకును పనివాండ్రకును గల అన్యోన్య సంబంధమునకు హెచ్చుప్రాముఖ్యత నీయవలెను. యజమాని

యగువాడు కేవల ధనార్జనాసక్తితో కర్మకరులయెడల ప్రవర్తింపరాదు. కొంత పరమార్థ చింతను కలిగి వారల కష్టసుఖములను తనవిగా భావించి వర్తించుచుండవలెను. మంచివేతనముల నొసగుట, తగిన వాసయోగ్యమగు ఉనికిపట్టులను కర్మకరులకు ప్రసాదించుట మొదలుగాగల సదుపాయములను పనివాండ్రకు కలిగించుచు వారి జీవనములను గౌరవముగ జరుపుకొనుటకు సహాయము నొనర్చ వలసి యున్నది. మదరాసు దొరతనము వారిచే నియమింపబడిన నేత కళాదక్షుడగు (Weaving expert) యస్. సుబ్రహ్మణ్యఅయ్యరు బి.ఏ. గారు సూచించినటుల సర్కారువారు తామభివృద్ధిలోనికి గొనిరాదగు కళలకు తగిన సానుభూతినొసంగి మార్గదర్శకులు కావలసి యున్నది. ఆకళలు పూర్వపు పుంతలంబోక నూతన పథములం ద్రొక్కవలసి యున్నది. అది ఎట్లనిన, పనివాండ్రుకూడ లాభమునందు పాల్గొనుటకు వీలయ్యెడి పద్ధతిపైని క్రొత్తకళలను స్థాపించుట: కర్మకరులకుకూడ లాభమునందు వంతుదొరకు నట్లేర్పాటులు గావింపబడినపుడు, వారుసహజముగ మిక్కిలి శ్రద్ధతోను నిపుణతతోను కార్యముల నిర్వహింప బూనుదురు. లాభాపేక్ష ఎట్టిఛాందసునైనను విశేషశ్రమ తీసికొనునట్లు పురికొల్పక మానదు. ఈపద్ధతిని మనవ్యవహార నిర్మాతలు పరిశీలించవలసి యున్నది.

వ్యవహార నిర్మాతల ఆవశ్యకత.

మన శ్రమావ్యవస్థయందలి నాలగవ లోపము- తగినవ్యవహార నిర్మాతలు లేకయుండుట. ఎంతకళా కౌశల

మున్నను, నడిపించు నాయకులు సమర్థులగువారు లేనియెడల ఆవ్యాపారమంతయు పాడువడుటయే గాక శ్రమ యంతయు నిరర్థకమగును. ఈలోపము వలననే, స్వదేశాభిమానము నూతనసోజ్జీవమును గల్గించుటచే స్థాపింపబడిన, వందలకొలది జాయింటుస్టాకు కంపెనీలు (సంభూయసముద్ధానములు) మూల పడుట ఎల్లరెరింగిన విషయమే. కళాచక్రమును సముద్ధరింప వలెననెడి భక్తివిశ్వాసములు గాఢముగ కలవారై ఎందరో వకీళ్ళు తగుమనుష్యులు చోదకులుగనుండి కంపెనీలను స్థాపన చేసిరి. కాని వీరికి పారిశ్రామికశిక్ష లేనిలోపముచే, శ్రమ యంతయు వృథయయ్యెను. వ్యవహార నిర్మాతల యావశ్యకత మనకు విస్తారముగ నున్నది.

కర్మాగారములయందు అభ్యాసశిక్ష నొందవలసిన అగత్యము.

ఈలోపమును సముద్ధరించుటకు నేర్పాటులు చేయు బడుచునే యున్నవి. అనేకమంది యువకులు విదేశములకేగి పారిశ్రామిక కళలయందు త్తీర్ణులగుటకు విద్యను గఱచు చున్నారు. పూర్వముకంటె ప్రస్తుతము విద్యార్థులకు గూడ శిల్పవిద్యాలయం దభిరుచిగలుగుచున్నది. ఇదియంతయు ప్రశంస నీయమే. కాని ఒక్క సంగతిని మనము గ్రహించవలసి యున్నది. ఐరోపా అమెరికా జపానుదేశములకేగి శిల్పకళా శాలల (Teachnological schools) యందు విద్యనభ్యసించి నంత మాత్రముననే వ్యవహార నిర్మాతలు కాజాలరు. సర్ ఫ్రెడరికు నికల్సనుగారు హాలెండు పారిశ్రామిక పంచాయతీ యెదుట సూచించినట్లు పారిశ్రామిక విద్యకళాశాలలయందు

అభ్యసించుట ప్రథమసోపానము వంటిది. కళాచక్రమునంతయు నీ విశాలతతో నిర్వహించ గలుగుటకింకను కొన్ని దశలు గడువవలసి యున్నవి. విద్యపూర్తి అయిన వెంటనే ఒకకర్మా గారమునందు ప్రవేశించి అభ్యాసశిక్ష (Apprentice) నొంద వలసియున్నది. కర్మాగారములయందు అభ్యాసశిక్షను వడసిన గాని తామభ్యసించిన విద్యకును అభ్యాసమునకునుగల తార తమ్యమును, గ్రహింపజాలరు. పారిశ్రామిక మర్మములన్నియు కళాశాలలనుండియే గ్రహింప ననువుగాదు. అభ్యాసమువలన గాని సకలమును తెల్లముగాదు. ఈవిషయమునే సర్ దోరాబు తాతాగారు బొంబాయి నగరమునందు జరగిన పదునొకండవ కళాసభాయందు నొక్కివక్కాణించిరి. ఈపద్ధతి నవలంబించిన యెడల నిర్విఘ్నముగ కార్యములు సాధించగల వ్యవహార నిర్మాతలు బయలువెడలక పోరు.

ప్రతికక్షులు విరామములేక సాటుచున్నంత దుస్థితిలో మనశ్రమావ్యవస్థ లేదని పాఠకులు గమనించవలసి యున్నది. వలయు నవకాశము లమర్చినచో, సమర్థులగు కర్మకరు లీదేశ మున పెక్కుఉందురని దృఢముగా చెప్పగలము.

మూలధనము (Capital).

పారిశ్రామిక పురోభివృద్ధి కవసరములగు ప్రకృతి, శ్రమ, మూలధనములు మూటిలోను, మనదేశ పరిస్థితులయందు మూలధనమే అగ్రస్థానము నలంకరించుచున్నది. ఏలననిన మూలధన ప్రాబల్యము మనదేశమున లేకపోవుటవలన రత్న గర్భయనిపేరు గాంచినను, భరతవర్షము మూలధనము విష

యమున హీనదశయందుండుట కడు సంతాపకరము. ప్రస్తుత స్థితి ఎటులనున్నదో చర్చింతము.

మూలధన మననేమి ?

మూలధనమనగా దేశమునందలి ధన సంపదయని భ్రమించరాదు. పరిశ్రమలయందు పెట్టుబడి పెట్టుటకు ఎంత ధనము దేశమున అలవడునో దానినే మూలధనమందురు. దేశమున రత్నరాసు లపారములుగ నున్నను ఆసంపద చేతిపనులను యంత్రకళలను ఉత్పత్తి చేయుటయందు తోడ్పడదేని పరిశ్రామిక విషయములపట్ల ఆదేశమును కడుబీదస్థితియందున్నదనియే పరిగణింపబడవలెను. అక్కఱకురాని ధన సంచయము ఎంతయుండిన నేమిప్రయోజనము !

దేశమునందలి మూలధనము.

మన దేశమునందలి ధనసంపద ఎంతయున్నను కళాచక్రమున నుపయోగించుటకు అలవడునది మాత్రము బహు స్వల్పము. ఈ విషయమున ఇతర దేశములకన్న మనదేశము వెనుకబడియున్నది. కోట్లకొలది ధనము మనదేశమున నగల క్రిందనో నాణెముల క్రిందనో పాతుపడియున్నదని ఒక ప్రతీతి కలదు. ఇది కొంతవరకు సత్యమేకాని, ప్రతికక్షులనుకొనునంత హెచ్చుస్థితిలో లేదని నిర్భయముగా చెప్పవచ్చును. కళాచక్రమున వినియోగింపబడకున్నను, దేశమునందంతధనము మూల్గుచున్న మనకీ హీనదశ కలిగియుండదు. బ్రిటిషుప్రభుత్వమువారు మనదేశమునకు రాకముందు మహమ్మదీయ పరిపాలనమున దేశమున శాంతి లేకపోవుటచే, ప్రజలు కొంత

వరకు ధనసంచయమును మరుగుపర్చ జొచ్చిరి. ప్రస్తుతము ఈ పద్ధతి అంతగా కాన్పించదు. నూతనాదర్శములను మన వారుకూడ గ్రహించుచున్నారు. అయినను తమ స్వగ్రామముల కనతిదూరమున స్థాపింపబడిన పరిశ్రమలయందు ధనమును పెట్టుబడి పెట్టుట కింకను మనదేశస్థులు జంకుచునే యున్నారు. బొంబాయి రాజధానియందు 1915-వ సంవత్సరమున, ఎన్నియో స్వదేశీబ్యాంకులు దివాలాతీసినవి. ఈ బ్యాంకులు దివాలాతీయుటవలన ప్రజలయందు నెమ్మదిగా అంకురించుచున్న విశ్వాసము తిరిగి సన్నగిలజొచ్చినది. తమ సొమ్మునకు సాధ్యమైనంతవరకు భయములేదని సంపూర్ణమైన నమ్మకము కలిగినగాని, పరిశ్రమలయందు ప్రజలు ధనమును పెట్టుబడి పెట్టుటకు ఇష్టపడరు. అయినను నిపుణులవలన బాగుగా పరిశోధింపబడి స్థాపితములైన కళలయందు, తమ ధనమును ప్రవేశపెట్టుటవలన లాభకరముగ నుండునని మనవారు గ్రహించుచున్నటుల సూచనలు పొడగట్టుచున్నవి.

పరిశోధనయొక్క ఆవశ్యకత.

కళాదక్షులగు వారిచేత పూర్తిగ పరిశీలింపబడి, ఎచ్చోట నూతనపరిశ్రమల స్థాపించిన లాభకారిగ నుండునో ఆస్థలముననే నూతన పరిశ్రమలు స్థాపింపబడవలెను. పరిశోధనకగు ధనవ్యయమును, సరకుచేయరాదు. మనదేశమునందలి సుప్రసిద్ధ వ్యవహారనిర్మాతయని ఖ్యాతినివడసిన సర్ జెమ్సెట్జీ తాతాగారు, ఎచ్చోట అయః కర్మాగారమును స్థాపించిన జయప్రదముగ జరుగునోయని ఐరోపా అమెరికా దేశ

ములనుండి నిపుణులను రావించి దేశమునంతటను పరిశోధనలను గావించిరి. ఒరిస్సా రాష్ట్రమునందలి మొహర్భంజి సంస్థానమున కాలిమటియను ప్రదేశమున స్థాపించిన జయకరముగ నుండునని నిర్ణయింపబడినది. పరిశోధనల కొరకు లక్షరూప్యములవరకు తాతాగారు వ్యయపర్చిరి. ప్రతిఫలమును మనము కండ్లార జూచుచున్నాము.

తాతా అండుసన్సువారి అయః కర్మాగారమునకు వలయు మూలధనమంతయు మన దేశముననే చేకూరినది. ఈ మూలధన మంతయు మనదేశమున దొరకదని ఈ కంపెనీకి ఇంగ్లాండునందలి ధనమును సేకరింపదలచి, అచ్చటి ప్రజలనుకోరిరి. కాని అక్కడ వీరుచేసిన ప్రయత్నములు సఫలములుకాలేదు. ఈ కంపెనీ జయప్రదముగ జరుగదని ఆంగ్లప్రజ శంకించెనేమో? వారు శంకించుట మనకు శుభమైనది. దేశస్థులే వలయుమూలధనమునంతయు సమకూర్చిరి.

తరువాత లోనవ్లా కొండల యందొక విద్యుచ్ఛక్తి జనిత స్థానమును నిర్మించుటకై మరియొక కంపెనీ తాతా అండు సన్సువారి వలననే స్థాపింపబడెను. ఈ రెండు కంపెనీలకునుఆరుకోట్ల రూప్యములు మూలధనము కావలసివచ్చెను. ఈ ద్రవ్యమునంతను దేశస్థులే అను గ్రహించిరి. ఇటీవల ఈ రెండు కంపెనీలకును మూలధనము హెచ్చించబడినది. యుద్ధపరిస్థితులవలన, ఈ ఆవేశనముల రెండింటిని విరివిచేసిన విస్తారము లాభము సంపాదించనగునని గ్రహింపబడినది. ఈ ద్రవ్యముకూడ దేశస్థులనుండియే సేకరింపబడి

నది. ఈ సందర్భమున స్వతంత్ర సంస్థానాధిపులగు బరోడా, మైసూరు, గ్వాలియరు, భావనగరు మహారాజులును, శ్రీ దర్భంగా మహారాజుగారును విశేషధనమును పెట్టుబడిపెట్టి తమ సానుభూతిని కనబర్చిరని వ్రాయుట కెంతయు సంతసముగానున్నది. ఈ మహాశయులు తమ స్వస్థానములయందలి కళలను పోషించుటకేగాక, బ్రిటిషు ఇండియాకు చెందిన మన కళాప్రపంచమునకుగూడ వారి సానుభూతిని కనబర్చుచుండుట భావి ఫలసూచకముగాని వేరొండుగాదు.

పరపతి సంఘములయందు చేయవలసిన మార్పు.

విద్యాప్రవాహము దేశమున వెల్లి విరిసిన కొలదిని, వివాహములకును శ్రాద్ధములకును అమితమైన వ్యయమును చేయక మనదేశమునందలి ధన సంపదను పరిశ్రమలయందు వినియోగ పర్చవలెననెడి అభిరుచి ప్రజలకు కలుగకపోదు. మన దేశమున స్థాపితములై యున్న పరపతి సంఘములు (కోఆపరేటివ్ క్రెడిటు సొసైటీలు) రానురాను వడ్డీనితగ్గించి, ధనమును కళాచక్రము ఆకర్షించునట్లుచేయుటకు వీలును కలిగించవచ్చును. పరపతి సంఘముల తాలూకు మూలధనమును నూటికి 7 వంతున గవర్నమెంటు ఋణపత్రములయందు నియోగించవలెనని చెన్న రాజధాని దొరతనమువారు మొదట తీర్పుచేసిరి. కాని ఇటీవల మనవారు ఈ తీర్మానమును రద్దు చేయవలెనని దొరతనమువారిని కోరగా కనీసపక్షము నూటికి 50-వ వంతైనను గవర్నమెంటు ఋణపత్రములయందుండి తీరవలయునని నిర్ణయించిరి. ఇటుల తీర్మానించుటవలని

నష్టము లెవ్వియనిన— మూలధనము చాలవరకు సర్కారు ఋణపత్రముల బడియుండుటచే మనకు వచ్చువడ్డీ చాల తక్కువయగుట అటుండగా, ఆధనము మన కళలయందు ఉపయోగము చేయుటకు వీలు చిక్కకున్నది. ఇది ఎంతనష్టదాయకమో చదువరు లూహించెదరుగాక. నూటికి 50-వ వంతున ఋణపత్రముల యందుంచవలెనని తీర్మానము చేసినను బ్యాంకి డిరెక్టరులకు అధమము అరవై లేక 65-వ వంతైన ఋణపత్రముల యందుంచుట బాగుండునని సభ్యులెల్ల జాతి చేసినట్లు వార్తాపత్రికలయందు ప్రచురమైనది. తీర్మానము ప్రకారము 50-వ వంతుకన్న అధికముగ, గవర్నమెంటు పత్రములుకొన నవసరము లేకుండ జేయునట్లు మదరాసు దొరతనమువారు చేయవలసియున్నది.

భూములపై వడ్డీతగ్గించవలసిన అగత్యము.

నూటికి 18 లేక 24 రూపాయలవడ్డీ భూమితాకట్టుపైని వ్యాపారస్తులకు గిట్టుచున్నంతకాలము క్రొత్తగా స్థాపింపబడిన కళలనుండివచ్చెడి సామాన్యరాబడి, వీరిని ఆకర్షింపజాలదు. రైతులకు భూమిపైని నూటికి ఆరురూపాలకన్న అదనము గాకుండ వడ్డీని గ్రహించరాదని సర్కారువారు తీర్మానించిన బాగుగనుండునని కొందరు మహాశయుల యభిప్రాయము. అటుల జేసినచో, ఋణదాతల బారినుండి రైతు విముక్తుడగుటయేగాక చాలధనము మనచేతిపనులకును యంత్రకళలకును వినియోగించుటకు లభ్యమగును.

విదేశములనుండి మూలధనము గ్రహించవచ్చునా?

స్వదేశమున ధనముచేకూర నప్పుడు విదేశములనుండి గ్రహించవచ్చునా లేదాయని ఒకసమస్య:— ప్రస్తుతము ఈవిషయమునుగూర్చి అంతగా చర్చించవలసిన యగత్యము కాన్పించదు. ఏలనన, కోట్లకొలదిధనము ప్రతిదినమునను ఈమహాసంగ్రామము నోటబడుచున్నది. యుద్ధానంతరమున తిరిగి చాలకాలమువరకు ఐరోపా అమెరికాదేశ వాస్తవ్యులు ఇతర దేశములకు పెట్టుబడిపెట్టజాలరు. వారిదేశములకు వలయు ధనమును సేకరించుటయే దుర్లభముగానుండును. కావున మనకళావ్యాప్తికి అవసరమగుధనము మనదేశములనుండియే సమకూరవలసియున్నది. జేమ్సెట్జీ తాతాగారివలె ప్రథమమున కళాదక్షులరావించి పరిశోధనలు లెస్సగా సలుపుటయు, తగినవ్యవహారనిర్మాతలను నియమించుటయు మొదలగు ఉపాయముల వలన ప్రజలకు స్థాపింపబడబోవు నూతన పరిశ్రమలయొక్క ప్రయోజనమునందు గాఢవిశ్వాసములను కల్గించుటవిధి. నమ్మకమును కలుగజేసినచో, దనసంచయము చేకూరక పోదు. పైనసూచించిన రెండు విధములలోను ఏమాత్రము లోపము చేసినను అందుధనమును పెట్టుబడిపెట్టిన భాగస్వాములకేగాక దేశమునకంతకును ఉపద్రవము తెచ్చినవారగుదురు. ఈవిషయములను వ్యవహార నిర్మాతలు జాగరూకతతో జ్ఞప్తియందుంచుకొన వలయును.

విభజన.

DISTRIBUTION.

శిస్తు.

భూముల పైసలాలు.

స్వదేశ సంస్థానములయందలి పైసలాపద్ధతులను గూర్చి మనము విచారించవలసిన అగత్యము లేదు. హిందూదేశమునకు చెందియున్నను, ఇండియా దొరతనమువారితో ప్రత్యేకముగా ఒడంబడికలు చేసికొనుటవలన సంస్థానములయందలి ఏలుబడి విధానము లెటుల నున్నను బ్రిటిషు ఇండియాయందు నివసించెడి భారతీయులకు అంతగా ఉపచరించవు. కనుక బ్రిటిషు ప్రభుత్వమువారి సంపూర్ణపరిపాలనములోనున్న దేశమునందలి భూముల పైసలాలనుగూర్చి మాత్రమే ఇచట పొందుపరచుచున్నాము.

భూముల పైసలాపద్ధతులు మూడువిధములు :—

1. శాశ్వత పైసలాపద్ధతి. ఈపద్ధతి అన్నిటికంటెను ఉత్తమమైనది. ఈపద్ధతి వంగవిహారరాష్ట్రములయందును, సంయుక్తపంగణాలయందలి కాశీప్రాంతమునను చెన్నరాష్ట్రమునందలి గోదావరీ, మహానది మధ్యప్రాంతములయందును విరాజిల్లుచున్నది.

2. గ్రామపద్ధతి. దీనినే మహల్వారీ పద్ధతియని కూడ వాడుచుందురు. పంజాబు, సంయుక్తపరగణాలు ఈపద్ధ

తిని కలిగియున్నవి. అయోధ్యప్రాంతములయందలి గ్రామములు మాత్రము దొరతనమువారిచే స్వయముగ పైసలా కాబడక, తాలూకుదారులను మధ్య మనుష్యులద్వారా వ్యవహరించబడుచున్నవి. అయిన రహితుపై, తాలూకుదారునకు గల అధికారము బహుస్వల్పము.

3. రైతువారీపద్ధతి. ఈపద్ధతి బొంబాయి, చెన్నపురి, సింధురాష్ట్రములయందు అమలులోనున్నది. ఈ పద్ధతియే ఆస్సాము, బర్మారాష్ట్రములయందు సైతము వాడుకచేయబడుచున్నది. వంగరాష్ట్రమునందలి తగుమాత్రము పర్వతప్రదేశములును, ఒరిస్సాయందలి సముద్రపుటొడ్డు భాగముకూడ శాశ్వతముగ పైసలా చేయబడలేదు.

మొత్తముపైని బ్రిటిషు ఇండియాయొక్క విస్తీర్ణములో 5-వ వంతు ప్రదేశమున శాశ్వత పైసలాపద్ధతి అమలులో నున్నది. ల్యాండు రివిన్యూలో (నేలపన్ను) నూటికి 53-వ వంతు మొదటి రెండు తరగతుల భూముల అమరకమునుండియును, 47-వ వంతు రైతువారీపద్ధతినుండియును వసూలగుచున్నది.

శాశ్వతపైసలా పద్ధతి.

ప్రస్తుతము ఇండియాయందు జమీందారులు అనుపేర పిలువబడు నేలఖామందులు పెక్కులు గలరు. జమీందారులు అనగా పన్నులను వసూలుచేయువారనుట. ఈ నామము, మహమ్మదీయ పరిపాలనమునందు నేలపన్నును వసూలుచేసెడి ఉద్యోగస్తులకు ఒసంగబడెను. ఈ ఉద్యోగస్తులకు ముసల్మాను

ప్రభువుల ఏలుబడియందు భూములపై ఎవ్విధమైన హక్కును ఈయబడియుండలేదు. హైందవ పరిపాలనమునందు, దొర తనమువారికిని రైతులకును మధ్యగా క్షేత్రమునందు ఒకవిధమైన స్వాతంత్ర్యమును గలిగిన మధ్యవర్తులు ఉండెడివారు. సర్కారువారికి నియామకముగ చెల్లవలసిన పన్నును వీరు వసూలు చేయుచుండెడివారు.

1793 సం॥న కారన్ వాలీసుప్రభువు బంగాళము నందలి జమీందారులకు, శాశ్వతపైసలాపద్ధతిని నెలకొల్పెను. ఈ చరిత్రాత్మకవిషయమును చదువరులు ఈతరుణమున గమనింప వలసియున్నది. ఈపద్ధతి వంగదేశమునకు ఐశ్వర్యప్రదాయిగ నున్న హేతువువలన కారన్ వాలీసుప్రభువు వంగదేశస్థులకు లాభమును కలుగజేయవలెనను దృఢవిశ్వాసముతో ఇట్టిపద్ధతిని నెలకొల్పెనని పొరపడరాదు. కారన్ వాలీసు ప్రభువునకు పూర్వము ప్రతిసాలునను భూములు వేలము వేయుచుండుటయును, ఎవరు హెచ్చుసొమ్మునకు పాడుకొనిరో వారికి ఆ సంవత్సరమునకు భూముల నొసంగుటయును ఆచారముగనుండెడిది. అందువలన సర్కారువారికి తరుచుగా తక్కువ ఆదాయమే లభ్యమగువచ్చెను. ఆకాలమున గంగానది వరదలవలన పంటలు విశేషము నష్టమగుచుండుటకూడ తటస్థించుచుండెడిది. ఆనకట్టుకట్టి నదీప్రవాహమును కేవలము సముద్రపాలుగాకుండ, సస్యముల కనుకూలమగు తెరవున, కాలువలు త్రవ్వబడియుండలేదు. అట్టి పరిస్థితులలో కారన్వాలీసు ప్రభువు సర్కారు రాజస్వమును పెంపుచేయవలయుననియెడి ఉద్దేశ్యముతో శాశ్వత పైసలాపద్ధతిని ఆచరణములోనికి గొని

వచ్చెను. ఈపద్ధతి ప్రకారము నిర్ణయించబడిన శిస్తులు విపరీతముగా అధికమైనవి. సర్ జాన్ షోరు అను మహాశయుడు, ఇంత కఠినతరమగు పైసలాపద్ధతులను నెలకొల్పుట ప్రమాదజనకమని గంభీరముగా ఆక్షేపించెను. ప్రస్తుత వంగదేశ జౌన్నత్యమునకు కారణభూతమయ్యెను, ఈ శాశ్వతపైసలా పద్ధతి ప్రథమమున కఠినతరముగ నుండెనని తెలిసికొనవలసి యున్నది. కారన్ వాలీసు ప్రభువుయొక్క ఉద్దేశ్యము వంగదేశీయులకు ఉపకారము చేయవలెనని కాకపోయినను, తుదకు ఐశ్వర్యప్రదముగ పరిణమించినది.

జమీందారులను నేల ఖామందులుగ గ్రహించి, పుత్రపౌత్ర పారంపర్యముగ భూములను అనుభవించుటకును, విక్రయించుటకును తనఖా పెట్టుటకును గూడ హక్కొసంగెను. అయిన నిర్ణీతమగు వాయిదానాటికి పన్ను చెల్లించక పోయిన యెడల ఈ హక్కులు అన్నియును తొలగిపోవునట్లుగకూడ నిర్ణయించబడినది. సర్కారునకు చెల్లవలసినపన్ను సకాలమునందు వసూలగుటకై ఈషరతు చేర్చబడినది.

సర్కారువారికి ప్రతిసాలునను చెల్లించవలసిన శిస్తు మొత్తమును శాశ్వతముగా నిర్ణయించబడెను. ఈనియమిత మొత్తమును ప్రభుత్వమువారు ఎన్నడును హెచ్చుచేయరాదు. శిస్తుమొత్తమును చెల్లించుటయేగాక కొన్ని నిర్ణీతమైన పనులనుకూడ నెరవేర్చునట్లుగా షరతు ఏర్పర్చబడెను. 1870 సం॥ ఈపనులు నిర్వహించుటకు బదులుగా కొంత హెచ్చుపన్ను చెల్లించునట్లు మార్పుచేయబడెను.

భూములయొక్క విస్తీర్ణమును శిస్తును తెలుపుచు జమీందారులు రహితులకు పట్టాల నొసంగునట్లుగా కూడ నిశ్చయించబడెను. ఈషరతు ప్రాయశః రహితులనుండి హెచ్చుసొమ్ము జమీందారులు సేకరించకుండ నుండుటకై చేసిన ఏర్పాటై యుండవచ్చును. పట్టాయందుశిస్తు నమోదు చేయనిచో, తాణాదారులు ఎంతసొమ్ము వసూలుచేసినను రహితు చెల్లించవలసియేయుండును. రైతుయొక్క క్షేమము నిమిత్తమై ఈషరతు విధించబడెను.

మరొకముఖ్యమైన షరతుకలదు. రైతుయొక్కహక్కులను మామూళ్ళను స్థిరపర్చు విషయమై దొరతనమువారివలన జారీచేయబడు శాసనములకు జమీందారులు బద్ధులుగనుండవలయును. రైతులను క్షోభ పెట్టకుండుటకునై సర్కారువారు నిర్మించిన శాసనములకుకూడ జమీందారులు అనుకూలవర్తనులు కావలసియున్నది. మదరాసు ఎస్టేట్సు ల్యాండు ఆక్టు(1908) ఇందులకొక ఉదాహరణము. శిస్తునకు అదనముగా జమీందారువిధించెడి శుల్కములన్నియును తీసివేయబడెను. సరకులను ఒకతావునుండి మరియొకతావునకు గొనిపోవునపుడు (Transit duties) చెల్లించవలసిన పన్నులును రోడ్డుహాశీళ్లును పడవహాశీళ్ళును సర్కారువారి ఆధీనముక్రిందనే యుంచబడెను. మార్కెటుహాశీళ్లును, చేపలపన్నును (Fisheries) పోరంబోకుభూములనుండియు వృక్షములనుండియు వచ్చెడిఆదాయమును జమీందారులకు విడిచిపెట్టబడెను.

తాలూకుదార్లకు జమీందారులకుగల హోదా ఒసంగబడెను. వీరుప్రత్యేకముగా సర్కారువారికి చెల్లవలసిన

నియామకపు శిస్తును చెల్లించవచ్చును. పెద్దజమీందారుద్వారా వారు వ్యవహరించవలసిన ఆవశ్యకత లేకుండ స్వయముగా దొరతనమువారితో సంబంధమును కలిగియుండుటకు ఏర్పర్చబడెను.

చెన్నపురి, ఒరిస్సా రాష్ట్రములయందలి పెక్కండ్రు చిన్న సంస్థానాధీశులకు వారికిగల స్వతంత్ర పాలనాధికారములను పూర్తిగాతగ్గించి జమీందారులకువలె నియామకపు నేలపన్నును చెల్లించవలసినట్లుగా ఏర్పర్చబడెను. వీరిహోదా జమీందారుయొక్క హోదాతో సరిపుచ్చబడెను.

శాశ్వపైసలాపద్ధతివలని నష్టములు.

ప్రతిసంవత్సరమును దొరతనమువారికి రాబడియందు $4\frac{1}{2}$ కోట్లరూప్యములు నష్టమువచ్చుచున్నది. శాశ్వతముగ నిర్ణీతముకానిచో, జమీందారు లనుభవించుచున్న హెచ్చుశిస్తుపైకము సర్కారుకుచేరవలసి యుండును. ఈ $4\frac{1}{2}$కోట్ల రూప్యములను శ్రమపడకుండ సంపాదించిన లాభముగ (Unearned increment) అర్థికశాస్త్రమునందు పరిగణించబడుచున్నవి. శ్రమపడకుండ సంపాదించినలాభము నేలఖామందునకు చెందవలెననియు, బ్రిటిషుపాలకులు నేలఖామందులగుటచే, ఇండియా దొరతనమువారు, ఈధనసంచయమును రాబట్టుకొనుటకు అర్హులనియును, శాశ్వతపైసలాపద్ధతి ఇందులకు ప్రతికూలముగనున్నదనియును కొందరిమతము.

రాజస్వమునందు అంతమొత్తము జమీందారుల వశమగుచుండుటవలన ఇండియాదొరతనమువారు పన్నులనధికము

చేయవలసి నట్టుగను, బంగాళము చిన్నరాష్ట్రములందువలె జమీందారులు లాభము ననుభవించుచుండిరి. ఆ హెచ్చు పన్నులను బ్రిటిషు ఇండియాయందు ఇతర ప్రాంతములవలెను చెల్లించవలసి వచ్చినట్లుగను నేటను—[illegible], [illegible] వారు వ్రాసిరి.

జమీందారులు తమవద్ద నున్నయున్న ధనమును [illegible] వ్యయమునందు ఉపయోగించని [illegible] నష్టము కలుగుచున్నది. తరుచుగా జమీందారులు స్వదేశ [illegible] చమును తమ దృష్టిపథమును [illegible] పట్టణముల యందో కాలమును వెళ్లబుచ్చుచుండుట మనము [illegible] చున్నాము. వీరు చేసెడి వ్యయము చాలవరకు నిరర్థక వ్యయమే. కృషికళను పెంపుచేయుటగాని, విద్యావ్యాప్తికి శ్రమపడుటగాని జమీందారులు ఎరుగరు. [illegible] జమీందారులు విద్యావ్యాప్తికి సహాయులగుచున్న [illegible] గతి నిజమేకాని, ఇంకను వీరు చేయవలసిన కార్యములు పెక్కులుగలవు. రైతుల వద్దనుండి ధనమును [illegible] తమ ముఖ్యకార్యముగ యోచించు జమీందారుల సంఖ్య ఇంకను తగ్గవలసి యున్నది. కృషికళా[illegible] పెంపు చేయుటకు సమర్థత కలిగియుండియును, [illegible] డుట కడు శోచనీయము. బంగాళమునందలి జమీందారులు చాలవరకు విద్యాధికులై దేశీయా[illegible] చినవారై పాటుపడుచున్నారు. చిన్నరాష్ట్రములందు, ఇంకను అట్టిపరిస్థితి అలవడుటలేదు. ఇది చింతనీయమైన విషయము. జమీందారులలో చాలవరకు, జమీను గ్రామములను విడిచి

పట్టి ఏ చెన్న నగరమునో వాసస్థానముగ చేసికొనుచుండుటవలన, అక్కడి రైతులయొక్క కష్టసుఖములను గుర్తించుటకు సైతము వీలుచిక్కక యున్నది. సార్థకవ్యయమును చేసినవారలై, దేశమును ప్రజలను సముద్ధరించవలసిన బాధ్యత జమీందారులకు కలదు.

శాశ్వతపైసలా పద్ధతివలని లాభములు.

ఇక శాశ్వతపైసలా పద్ధతియందలి లాభములను వివరించుచున్నాము. ముందు పేర్కొనబడిన నష్టములు మున్నగువానిని కప్పివేయగలుగు లాభములు ఈపద్ధతియందు గలవు. పాఠకులు ఈక్రిందిఫలితములను చక్కగ గమనించినచో, హిందూదేశమునందంతటను ఈపద్ధతి వ్యాప్తమై యున్న యెడల ఎంతోసుకరముగ నుండునదియును చక్కగ గ్రహించగలరు.

సర్కారునకు ఏటేట చెల్లవలసిన శిస్తుపైకము మార్పులేనిదిగ నిశ్చయించబడెను. వేలము పద్ధతి యున్నచో ఒక సంవత్సరమున పెరుగుటయును ఒకసంవత్సరమున తగ్గుటయును కూడ కలుగుచుండును. నిర్ణీతమైన శిస్తు వసూలు కాదనియెడి భీతి లేదు. నియామక కాలమునకు పూర్తిగా రివిన్యూ చెల్లి తీరవలసియున్నది.

హిందూదేశము నందలి ఇతర ప్రాంతములయందు అనగా రైతువారీ పైసలా పద్ధతి అమలులోనున్న ప్రదేశములయందు పైసలాలు శాశ్వతముగ జేయబడని హేతువువలన రైతులకు ప్రతిపైసలా సమయమునను కలిగెడి కష్టనష్టములకు ఈపద్ధతి చోటిచ్చుటలేదు. అనగా, తరంవారీకట్టి శిస్తును నిర్ణ

యించెడి అధికారులబాధ శాశ్వత పైసలాపద్ధతిని కలిగియున్న రైతులకు లేదు.

సేవ్యపర్చక పోరంబోకుగా విడిచిపేయబడిన ఎంతయో భూమిని జమీందారులు వ్యవసాయమునకు తెచ్చిరి. భూమిని బాగుచేసినది రైతే అయినను, జమీందారు యొక్క సహాయమువలననే అట్టి పరిస్థితులు లభ్యమయ్యెను. జమీందారులను నేలఖామందులుగ సర్కారువారు అనుగ్రహించుట వలననే, ఇండియాయందలి ఇతరరాష్ట్రములకంటె బంగాళాదేశ మందలి క్రిందిభాగమున (Lower Bengal) క్రొత్తలగు "నవ్య కృషికళలు" స్థాపించబడెనని మెయినుగారు వ్రాయుచున్నారు. సర్కారు ఉద్యోగస్థులవలె తరుచు మారిపోవుటలేక జమీందారు స్వస్థానమున నుండువాడగుటచే వ్యవసాయమును పెంపుచేయుటయందు విశేష ఆసక్తి కలిగియుండుటకు సాధ్యమగుచున్నది. సర్కారు ఉద్యోగస్థులు అంతగా శ్రద్ధవహించుటకు అవకాశములేదు.

విశేషసంపదను కలిగియున్నవారగుటచే జమీందారులు కృషికళాభివృద్ధికినై ఎంతధనము వెచ్చించవలసివచ్చినను సమర్థులగుచున్నారు. క్రొత్తక్రొత్త ఏర్పాటులనుచేసి వ్యవసాయకళను పెంపుచేయుటకు ధనవంతులగుటచే, జమీందారు లర్హులు. రైతులకట్టి మూలధనప్రాబల్యము చిక్కుట కడుదుర్లభము. సర్కారుకు చెల్లవలసిన కిస్తీ సకాలమున చెల్లించుటకే, ఎన్నియో కడగండ్లబడుచుండుట సామాన్యముగ సంభవించుచున్నది. విస్తారముగ కృషికళను పెంపుచేయుటకు శాశ్వతపైసలాలు కలిగిన ప్రాంతములయందే అనువగుచుండును.

క్షామదినములయందు ప్రజలకు సదుపాయమైన సహాయమును, కఱవులచే అల్లాడుచున్న ప్రజల క్షుద్బాధనివారణముచేయు నిమిత్తమై ఆహారపదార్థములను ఆప్రాంతములకు సరఫరాచేయుటకును, కొన్నిపనులను కల్పించి జీవయాత్రనడపుటకు అనువగు ఏర్పాటులను గావించుటకును పెద్దజమీందారు లున్న ప్రాంతములయందు వీలేర్పడుననియును, గ్రామపద్ధతియును రైతువారీపద్ధతియును అమలులోనున్న ప్రాంతములయందుకంటె విశేష సౌకర్యమును కలుగజేయుటకు జమీందారులకు శక్తిగలదనియును సీటన్ కార్ గారు వ్రాసిరి. ప్రజలను బాగుచేయుటకుగాని చెరుపుటకుగాని జమీందారులకు విశేషశక్తికలదు. ప్రజలు తమ్మెంత బాధించినను తమ ఏలికగా నెంచి భృత్యతను కనబరచుచుండుటయే ఇందులకు తార్కాణము. మహారాజు ఎస్టేట్సులయందు ఆక్టు రహితులకు సంపూర్ణ స్వాతంత్ర్యము నొసంగినను, జమీందారులు దైవసములుగనె ఇంకను ఎన్నుకొనబడుచుండుటవలన, ప్రజలను సంరక్షించుటకును వారిమెప్పువడయుటకును వీరికిగలశక్తి వ్యక్తీకరింపబడుచున్నది. దర్బారు ఉత్సవములకు వేనవేలుగ ప్రజలు వచ్చిచూచుట ఎల్లరెఱిగియే యున్నారు. ధర్మకార్యములను విశేషముగచేసి ప్రజల మెప్పునువడయుటకు జమీందారులకు గలశక్తి విశేషము. ఈసత్తులన్నియును స్వస్థానమున నివసించెడి జమీందారులకు మాత్రమే వర్తించును.

ప్రజలకును ప్రభుత్వమువారికిని మధ్యగా, రాజభక్తి కలిగిన జమీందారీబృందము శాశ్వత పైసలాపద్ధతి నెలకొల్పుటవలన ఉత్పన్నమయ్యెను. సిపాయిలముట్టడియందు వీరు

విశేషరాజభక్తిని కనబర్చినట్లు ఒక ఆంగ్లేయచరిత్రకారుడు వ్రాసియున్నాడు. రాజభక్తివిషయక మటుండ, దేశమునందంతటను ఆరోగ్య విద్యాభివృద్ధులకును, వాఙ్మయకళాపోషణమునకును క్షామపీడితులను దరిజేర్చుటకును జమీందారులు విశేష సహకారులైరన్న సంగతి నిర్వివాదాంశము. వేయేల ఆంధ్ర వాఙ్మయాభివృద్ధికి, పూర్వకాలముననేమి, ప్రస్తుతముననేమి ఎందరు జమీందారులు తోడ్పడినదియును పాఠకులెరింగిన విషయమే.

శాశ్వతపైసలాపద్ధతి బంగాళమునకు మరియొకలాభమునుగూడ సమకూర్చెను. జమీందారులయొక్క ఆస్తి పంపకము చేయబడక ఒక్కపెద్ద కుమారుడే అనుభవించవలయునను నియమము ఆరాష్ట్రమునందు లేదు. కుమారులందరును సమభాగములను గ్రహించ నర్హులు. ఇందువలన కుటుంబములు వృద్ధియగుచు వచ్చినకొలదిని సామంతుల సంఖ్య అధికము కాజొచ్చెను. సామంతులసంఖ్య అధికమగుటవలన వీరు సామాన్యప్రజలతో కలసిమెలసి సంచరించుటకు వీలేర్పడుటయేగాక దేశీయ పురోభివృద్ధికి తోడ్పడుటకుకూడ అవకాశము చిక్కెను. వంగదేశపురోభివృద్ధికి, శాశ్వత పైసలాపద్ధతియే కారణమని నొక్కి చెప్పవచ్చును.

మహల్వారీ లేక గ్రామపద్ధతి.

గ్రామపద్ధతి పంజాబు, సంయుక్త, మధ్య పరగణాలయందు అమలులోనున్నదని ఇదివరకే సూచించియున్నాము. గ్రామపద్ధతియందలి విశేషమేమనిన, సర్కారువారు గ్రామ

స్థులు యావన్మందితోను రాబడి నిర్ణయించుట. అనగా ఆయా గ్రామములకు చెల్లవలసిన రివిన్యూయొక్క జవాబుదారీ గ్రామస్థులందరును వహించి యున్నారనుట. రివిన్యూ సకాలమున చెల్లనపుడు దొరతనమువారికి గ్రామస్థులలో ప్రత్యేకముగా కూడ ఎల్లరును బాధ్యులే. గ్రామమొత్తమునకు నిర్ణయించబడిన రాబడి చెల్లించుటకుగాను గ్రామయజమాని సంతకము చేసి దొరతనమువారికి ఒడంబడికను దాఖలుచేయును. అటు వాత గ్రామములోని వారందరు తమలో తాము ప్రతి సాగు భూమికిని ఇంతింత శిస్తు చెల్లించవలయునని నిర్ణయించుకొందురు. కొందరు వంశపారంపర్యముగ తాము అనుభవించుచు వచ్చిన భూములను నిర్ణీతమైన శిస్తుచెల్లించెడి పద్ధతిపైని తమ యధీనముననే ఉంచుకొనియెదరు. గ్రామ పంచాయతీలు నిర్ణయించిన శిస్తులు సక్రమముగ ఉన్నదియును లేనిదియును, దొరతనమువారి, పైసలా ఉద్యోగస్థులు కనిపెట్టుచుందురు. గ్రామ పటములను, హక్కులను తెలియపర్చెడి లెక్కలను భద్రముగా దాచబడుచుండును. పైసలా స్థిరమైనదికాదని చదువరులు ఈవరకే గ్రహించియుందురు. సంయుక్తపరగణాలయందు ముప్పది సంవత్సరముల కొకతూరియును, పంజాబు మధ్యపరగణాలయందు ఇరువది సంవత్సరముల కొకసారియును పైసలాలు మార్పుజెందుచుండును. ప్రతి పైసలాయందునను నిర్ణీతమైనశిస్తు తిరుగా పైసలాకాలము ఆసన్నమగువరకును మార్పుజెందక స్థిరముగనుండును. దొరతనమువారి పైసలా ఉద్యోగస్థులు భూములకు తరంవారికట్టి, ధాన్యాదులయొక్క ధరలనుబట్టియును సమీప ప్రాంతములయందలి భూముల

శిస్తునుబట్టియును చెల్లవలసిన శిస్తును నిర్ణయించుచుందురు. కఱవుదినములయందు, చెల్లించవలసిన రెవిన్యూ తగ్గించబడుచుండును. దీనినే "రిమిషను" అని మనరైతులు వాడుచుందురు.

గ్రామపద్ధతియందు సర్కారువారు రైతులతో ప్రత్యేకముగా అమరకములు నిశ్చయించుకొనకుండ, మధ్యమనుష్యులద్వారా వ్యవహరించుచుందురు. గ్రామయజమాని తనగ్రామమున కంతకును సంతకముచేసి ఒడంబడిక దాఖలు చేయుటనుగూర్చి వ్రాసియేయున్నాము. శ్రీయుత గణేశచంద్రదత్తు దేశబాంధవుడు, కర్జనుప్రభువు పరిపాలనమున తటస్థించిన ఘోరకాటక సమయమున నిర్భయముగా నేల పన్నునుగూర్చి వ్రాసినలేఖలు కొంతవరకు పైసలాపద్ధతులను మార్పజాలినవి. అంతకు పూర్వము సర్కారువారు సేకరించుచు రాబడి నూరింటతొంబదిపాళ్ళు. ప్రస్తుతము ఏబదిపాళ్ళగను అంతకన్న తక్కువగనుకూడ నిర్ణీతమైనది. బొంబాయి రాష్ట్రమునమాత్రము సర్కారుగ్రహించగల శిస్తుపైకమునకు మితి ఏర్పర్చబడలేదు. ఈ పైసలాయందు మరొక విశేషముకలదు. పైసలా అధికారి (Settlement Officer) చే నిశ్చయించబడిన శిస్తును తగ్గించవలయునని ఏ న్యాయస్థానమునను కోరుటకైనను వీలులేదు. పైసలా అధికారితీర్పు కఠినతరమయ్యును, స్థిరత్వమును గాంచవలయునేగాని వేరుసాధనాంతరములు గానరావు. పైసలా అధికారి ఎంతన్యాయముగా పరిశీలించి శిస్తును నిర్ణయించినను, ఆ అధికారితీర్పుపై న్యాయస్థానమునకు విమర్శనాశక్తి నొసంగకుండుట చాల కష్టతరమని నిస్సంశయముగా చెప్పకతీరదు.

నిర్ణీతములైన శిస్తులను చెల్లించుటయేగాక రోడ్లకును, ధర్మ ఆసుపత్రులకును, విద్యాశాలలకును ఉపయోగించు నిమిత్తమై కొన్ని పన్నులు అదనముగ వసూలు చేయబడుచున్నవి. గ్రామయజమానులకును తలారులు మొదలగు వారికిని చెల్లించవలసిన జీతములకొరకుకూడ కొన్ని పన్నులు వసూలు చేయబడుచున్నవి.

అయోధ్యరాష్ట్రమునందు తాలూకుదార్లతో సర్కారువారు ఒడంబడికను చేసికొనుచున్నారని ఇదివరకే సూచించబడెను. గ్రామస్థుల మొత్తముపైని నిర్ణయించుటకు బదులుగా తాలూకుదారుతో ప్రత్యేకముగా దొరతనమువారు వ్యవహరించుచుందురు. తాలూకుదారులు సర్కారుకు చెల్లవలసిన యీనత్తుపైకమును వసూలుచేసి, వసూలుచేయుటకగు ఖర్చులను, తాముశ్రమపడి పనిచేసినందులకును, జీవయాత్ర గడచుటకును తమగౌరవమును కాపాడుకొనుటకు దయచేయబడిన సొమ్మునిమినహాయించుకొనుటకు షరతుకలదు. తాలూకుదారునకును జమీందారునకును విశేషభేదము గలదు. తాలూకుదారులు ముస్తాదరులను బోలియుందురు. ముస్తాదరులు తాము చెల్లించవలెనని ఒప్పుకొన్న పైకమును ఖామందులకు చెల్లించి శేషమును తమలాభముగ గ్రహించుచుందురు. ముస్తాదరులకు ఏ ఒకటి రెండుసంవత్సరములకో షరతు విధించబడియుండును. తాలూకుదార్లవలె ఇరువది ముప్పది సంవత్సరముల వరకును వ్యవహరించ వీలులేదు. జమీందారులకువలె తాలూకుదార్లకు భూములయందు శాశ్వత హక్కు లేదు.

రైతువారి పద్ధతి.

బొంబాయి, సింధు మదరాసు రాష్ట్రములయందు ఈపద్ధతి అమలులో నున్నది. గ్రామపద్ధతి వలెను, శాశ్వత పైసలాపద్ధతివలెను మధ్యమనుష్యుల ద్వారా వ్యవహరించక, సర్కారువారు రైతులతో స్వయముగ వ్యవహరించుట ఈపద్ధతియందలి విశేషము. ప్రతిగ్రామమును చక్కగా సర్వేచేయబడి, ప్రతిరైతుయొక్క భూమియు గ్రామపటమునందు ప్రత్యేకముగా నిరూపింపబడుచున్నది. పైసలా ఉద్యోగస్థులు రైతునకుగల హక్కులను తెలియపర్చుచు ఆ సామీవారీగా సేద్యమునందున్న భూమివివరమును, సర్కారునకు చెల్లవలసిన పన్నులును, సరిహద్దులను తెలుపు పట్టాల నొసంగుటయే గాక అన్ని లెక్కలను భద్రపరచు చుందురు. చక్కగా వ్రాయబడియుండుటచేత, రైతులకు ఇతరులవలన అన్యాయము జరుగుటకు వీలుండదు. తగాయిదావచ్చినప్పుడు, కొంతకమువార్కి దరఖాస్తుచేసిన సరియైన హంశములను నకళ్ళను గ్రహించుటకు వీలున్నది. పట్టాభూములయందు రహితునకు స్వతంత్రహక్కులు ప్రసాదించబడెను. తన ఇష్టము వచ్చినవారికి భూములను మార్పించుటకును, అమ్ముకొనుటకును కూడ రహితునకు హక్కుకలదు. తనతోనే పట్టాఅంతరించక పుత్రపౌత్ర పారంపర్యముగ, పట్టాభూములను అనుభవించుటకు రహితునకు హక్కుకలదు. ఇక రైతుయొక్క బాధ్యత ఎట్టిదనిన పైసలా కాలమునందు, నిర్ణయించబడిన శిస్తును సకాలమునకు చెల్లించుటమాత్రమే. సకాలమున శిస్తు పైకము చెలామణి చేయకపోయినయెడల జప్తికాబడి

వేలము వేయబడును. సర్కారువారికి ఏరహితు సేద్యము నందున్నను నష్టములేదు. నియామకపుశిస్తునకు అనుభవదారు బాధ్యుడై యేయుండును. ఇతరవిషయములయందు మహాల్వారీ పద్ధతినిపోలియే రైతువారి పైసలాకూడ ఉండును. ఆతీరుగనే ఇరువది సంవత్సరములకో ముప్పది సంవత్సరములకో ఒకసారి తిరుగా సర్వేకాబడి పైసలాచేయబడుచుండును. ముప్పది సంవత్సరముల కొకతూరి చెన్నరాష్ట్రమునందు పైసలా అగుచున్నది. పైసలా అధికారితీర్పునకు ప్రతివాదమేదియును లేదు. ఆతీర్పుప్రకారము అమలుజరిగి తీరవలసినదే.

ఈ సందర్భమున మదరాసు ఎస్టేట్సు ల్యాండు ఆక్టును గూర్చి కొంతవరకు ముచ్చటించుట సంభావ్యముగ గన్పట్టెడిని. ఈ శాసనము 1908-వ సంవత్సరమునందు జారీచేయబడినది. తొలుత ఈశాసనము రహితులపాలిటి కల్పతరువుగ ఎన్నుకొనబడినది. కాని రానురాను రహితులకు నష్టప్రదాయిగ నున్నయటుల విషయమును పరిశీలించిన ఎల్లరును అభిప్రాయపడక తీరదు. ఇటీవల దొరతనమువారుకూడ ఈశాసనము యొక్క అమలు సంతృప్తికరముగ లేదని ప్రకటించియున్నారు. రైతునకు భూమియందు స్వతంత్రహక్కును ప్రసాదించిన సంగతి సత్యమే. కాని ఈహక్కు లాభకరముగ పరిణమించుటకు మార్గ విఘ్నకారియగుచున్నది. ఈ శాసనముక్రింద దాఖలు కాబడుచున్న వ్యాజ్యెములసంఖ్య విపరీతముగ పెరుగుచున్నది. స్టాంపుఖర్చులకును, వకీళ్ళఫీజులకును చక్కగా ఉపయోగపడు చున్నది.

యుద్ధానంతరమున ఈశాసనము తిరిగి సవరణచేయ బడవలెను. జమీందారులకు కొంతవరకు అనుకూలముగనుండు నట్లు మార్చవచ్చును. న్యాయస్థానములయందు విచారణ అల వడునట్లుగ సవరణచేయుట ముఖ్య ఆవశ్యకము. ప్రస్తుతమున చాలవరకు కలెక్టరులవలనను, రివిన్యూ బోర్డువారివలనను తగాయిదాలు తెగగొట్టబడుచున్నవి. ఉత్తమన్యాయస్థానము లకు వీరితీర్పులపై అధికార మొసంగబడలేదు.

స్థిరమగు పైసలాపద్ధతులు అలవడని కారణమువలన సంభవించెడి నష్టములు పెక్కులు. సర్కారువారి రాజస్వ మును కొంతవరకు పెంపుచేయగలుగుటనుతప్ప, దేశము పురోభివృద్ధికి అనువగుమార్గములు అస్థిరపద్ధతివలన అలవడు టకు వీలుచిక్కకున్నది. ముఖ్యమైన నష్టములనుమాత్రమే ఈ దిగువ పొందుపర్చుచున్నాము:—

శాశ్వత పట్టారహితునకు ఒసంగక పోవుటవలన, క్షేత్రమును అభివృద్ధిచేయవలయుననియెడి సంకల్పము కృషి కుల మనంబుల నావరించుటకు వీలులేదు. విస్తారము మూల ధనమును వెచ్చించి, తనసేద్యమునందున్న భూమిని రైతు సస్యాఢ్యముగా చేసినచో, అందలి ఫలితము తనకు దక్కదుగదా యనుభీతి ఎల్లపుడు బాధించుచునేయుండును. పైసలాకాలము తీరుగా ఆసన్నమైనపుడు రహితు తన స్వంతమూలధనమును వెచ్చించిచేసిన అభివృద్ధిపైనికూడ పైసలా అధికారులు శిస్తును పెంపుచేసెదరన్న విషయము సర్వకాలసర్వావస్థలయందును, కృషికుల మనోవీధిని తాండవమాడుచుండును. అట్టి పరిస్థితు

లలో క్షేత్రమును వృద్ధిచేయవలయునని రైతునకు ఉత్సా హము జనింపదు. తాను వెచ్చించిన ధనమునకు తగినలాభముగాదు నని తోచినప్పుడెవడు ఎట్టి వ్యాపారమునను ప్రవేశించును! అటులగాకున్న కృషికుల స్వదేశమునందు చక్కగ నివసించు ననుట [illegible].

పైసలా [illegible] తగ్గించబడుచున్నకొలది, విశే షముగా [illegible] పైసలా [illegible]లు శిస్తులను పెంపుచేయుచున్నయెడ [illegible] పైరులను [illegible] సరిగా [illegible]. [illegible] తక్కువగ గిట్టుచున్న [illegible] ఇట్టి క్షేత్రములను [illegible]. [illegible] కృషికులకు చాల నష్టము కలుగుచున్నది. [illegible] పైసలా పూర్తి [illegible]కును సరిగా సేద్యము [illegible] ఉపయ [illegible] దేశమునకు కూడ నష్టము.

సర్కారువారు [illegible] పట్టా భూములు విస్తీర్ణము [illegible]. [illegible] పైని [illegible] ఆధారముగ నున్నవి. క్రొత్తక్రొత్త పైరులను [illegible] కృషికులను పెంపు చేయవలయునన్న సేద్యమునందున్న భూమియొక్క విస్తీర్ణము చాల హెచ్చుగను [illegible]వలయును. లేనిచో మూల ధనమును [illegible] చేయు టకు గిట్టదు. ఇందులకొక ఉదాహరణము. యుద్ధపరిస్థితుల వలన స్వదేశమునందలి [illegible] పంచదారకు గిరాకి [illegible]

యించెనన్న సంగతిని పాఠకులు గమనించియే యుందురు. నూతన విధానములను ఈపైరునునాటి పంచదారను తయారు చేయవలయునన్న అధమము ఏబది యెకరముల భూమియైనను లభ్యమైనగాని వీలేర్పడదు. చెఱకుతోటలకు నీరు విశేషముగ అవసరమని ఎల్లరెఱింగినదే. ఏతములతోను, మోటలతోను తృప్తినొందక గొప్పనూతులను త్రవ్వి యంత్రసాహాయ్యమున జలమును సస్యములకు పారించవలయునన్న పెక్కు ఎకరముల భూమి ఒకే ప్రదేశమున సాగుచేయుటకు అలవడినగాని గిట్టదు. పైరులయొక్క ఉత్పాదకశక్తులను నూతనవిధానముల నాచరించి, ఇనుమడింప నెంచినచో, సేవ్యమునకు క్షేత్రము విస్తారముగ చిక్కుట ఆవశ్యకము. ఈ పద్ధతి అమలులోనున్నంత కాలము అట్టిపరిస్థితు లలవడుట దుర్లభము.

ప్రతి ఇరువది, ముప్పది సంవత్సరములకును పైసలా పూర్తియగుటకు దొరతనమువారికి విశేష ధనవ్యయమగుటయును, రైతులయొక్క మనోశాంతికి భంగము కలుగుటయును గూడ తటస్థించుచున్నవి.

రైతులకు జీవయాత్ర నడుపుకొనుటకు మాత్రము తగుమాత్రముగా విడిచిపెట్టబడి, మిగిలినదంతయును అమలులోనున్న పైసలాపద్ధతులవలన సర్కారు బొక్కసములను జేరుచున్నయది. ఈవిషయమున అధికారవర్గమునకు చెందిన వారికిని, సుప్రసిద్ధభారతీయ నాయకులకును అభిప్రాయభేదము కలదు. రాజస్వప్రకరణమునందు నేలపన్నునుగూర్చి వ్రాయునపుడు, ఈవిషయము విపులముగ చర్చించబడును.

ఈకారణములవలన చరస్వాభావికమగు (Temporary) పైసలాపద్ధతులు దేశీయపురోభివృద్ధికి అభ్యంతరములుగ నున్నవి. శాశ్వతపైసలాపద్ధతి భరతవర్షమునందంతటను నెలకొల్పబడినచో, ఒక్క కృషికళయేగాక సర్వకళలును విజృంభించుటకు అవకాశమున్నది.

కర్మకరుల వేతనములు. (Wages.)

కర్మాగారములయందు పనిచేయుటకు వేతనముల నధికముగ నొసంగినను ఇండియాయందలి కర్మకరులుత్సాహమును జూపుటలేదని ప్రొఫెసరు లీస్మిత్తుగారు తమ గ్రంథము (India and the Tariff problem) నందు వ్రాసియున్నారు. ఇట్టి పరిస్థితులు అలవడుటకు గల ముఖ్యకారణములు రెండు:-విద్యాగంధము నెరుంగనివారగుటచే, నాగరికతగల దేశములలోని కర్మకరులవలె జీవయాత్ర నడపుటయందు అంతగా ధనము వెచ్చించరు. వీరికిగల వాంఛలు బహుస్వల్పము. వాంఛలధికమగుటయేకదా నాగరికతాలక్షణము. వాంఛలధికమగు కొలదిని విశేషశ్రమ తీసికొని పాటుపడి ధనము నార్జించవలసిన ఆవశ్యకత కలుగును. అట్టివాంఛలు స్వల్పమైనపుడు ఏపట్టెడు అన్నమో అంబలియో, గంజియో త్రాగుటకు దొరకిన యెడల తృప్తినొందుచుండుట తటస్థించును. అట్టివారలకు ధనాకర్షణమునందును ఆసక్తి అంతగాయుండదు. మరియొక ముఖ్యకారణము. హిందూదేశమునందలి కర్మకరులు తమ స్వగ్రామములను ఆలుబిడ్డలనుబాసి పాశ్చాత్యదేశములకుంబలె పట్నములంబట్టిపోరు. పట్నములయందు కొంతకాలము నివసించి కొంతసొమ్ము జాగ్రతపఱ్చుకొనిన వెంటనే స్వగ్రామము

లకు పోవుచుందురు. జన్మస్థానమును వీడి పోవుటంచుసిన [illegible]ణముతో సమానముగ నెంచుచుందురు. ధనమునే అపేక్షైన ముగా పాశ్చాత్యులకువలె పూజించుట నెరుంగని వారగుటచే కూలి అధికముగ గిట్టుచున్నను తమకు అనుకూలముగ లేని పనులయందు శ్రమపడుట కిచ్ఛగించరు. అందువలననే [illegible] [illegible]నులను త్రవ్వుటకును, ఆస్సామువగైరా ప్రాంతములందుండెడి తేయాకు తోటలకును కర్మాగారములలో పనిచేయుటకును కర్మకరుల లభ్యమగుట కష్టసాధ్యమగుచున్నది. అయిన పూర్వ మున్నంత అసూయత ఇపుడు గానవచ్చుటలేదు. క్రమముగా తగ్గుచున్నది. ఇట్టిదురవస్థను తొలగించుటకు ప్రారంభవిద్యను దేశమునందెల్లెడల బలవంతముగా ఎల్లరును అభ్యసించునట్లు శాసించబడవలయును. జీతములు వసూలుచేయకనే ప్రతిబాలు [illegible]నకును విద్యగరపవలసియున్నది. విద్యవ్యాప్తమగు కొలదిని పూర్వాచారములను వదలి పాశ్చాత్యసోదరులవలె [illegible] [illegible]ండలి కర్మకరులుకూడ పాటుపడ నిచ్ఛగింతురు. కొంత [illegible] శిల్ప శిక్షణముకూడ అవసరము. వాంఛలను అధికము చేసిన వెంటనే ఎట్టిపనినైనను నిర్వహించి ధనాకర్షణమును చేయవల యుననియెడి కుతూహలము జనించకమానదు. ప్రతి [illegible] హైందవ కర్మకరులకు నిపుణతయన నెట్టిదియో తెలియదని ఆరోపించెడు నెపములకు సైతము ఎడముండదు. నిపుణతలో ఒకరికి తీసిపోవువారు కారని రెండవప్రకరణమునందు సూచించియేయున్నాము.

కృషికళయందు నియమితులైన కర్మకరులకు వేతనములు నాణెముల రూపకముగగాక వస్తురూపకముగనే పెక్కు

తొప్పులు [illegible] ఒక[illegible] జనుము [illegible] ఆచారమైయున్నది. వ్యవసాయపు [illegible] ప్రకారము [illegible] వేతనములు [illegible] ధాన్య[illegible]మైయున్నది. [illegible] [illegible] [illegible] [illegible] ప్రకారము [illegible] [illegible].

[illegible] వేతనములు [illegible] [illegible] [illegible] న్యాయము. [illegible] స్థితి [illegible] యున్నది. [illegible] [illegible] గిరాకి [illegible]ముగ నుండును. [illegible] వేతనము [illegible]లదు. [illegible] కర్మాగారములును [illegible] రాజమార్గము[illegible] [illegible] [illegible] కొన్ని కొన్ని [illegible] స్థాపించబడి [illegible] [illegible] వేతనములు [illegible] వృద్ధి[illegible]. [illegible] [illegible] [illegible] వృద్ధిపొందినది యును [illegible] సాధనా[illegible] [illegible]. [illegible] వేతనములు పెరుగుచుండుట మాత్రము [illegible]. [illegible] [illegible] వేతనములు తగ్గుటకూడ కలదు. ఆహార పదార్థములు [illegible]ప్రియముగ [illegible]చున్నను, వేతనములు తగ్గిపోవుట కలుగుచున్నది. వలననగా పంటలు నష్టమగుట వలన కృషికులకు భోజనమునకే కష్టము తటస్థించినప్పుడు, వేతనముల నిమిత్తమై విశేషముగ వెచ్చించనిష్టపడరు. పని

కొరకు వెతకుకొను కర్మకరులసంఖ్య అధికమగుటవలన కూలి తగ్గుచుండును. తిండికివలయునన్ని ధాన్యము దొరకిన సంతోషముతో బనిచేయుటకు కూలివాండ్రిచ్ఛగింతురు.

ఇంపీరియలు గెజటీయరునందు బంగాళము, అస్సాము, పంజాబు రాష్ట్రములయందు వేతనములు ఈ క్రిందివిధముగా పెరిగినట్లు వ్రాయబడియున్నది:—

		బంగాళము.	అస్సాము.	పంజాబు.
కృషికళయందలి కూలివాండ్రకు	నూటికి	39 వంతు	41	49
శిల్పులకు		48	65	50

చెన్న రాష్ట్రమునందును, మధ్య పరగణాలయందును కర్మకరుల వేతనములు ఇంతగా పెంపుజెందలేదు. నూటికి 6 మొదలు 15 కంటె అధికముకాలేదు. పై రాష్ట్రములయందలి వేతనములు వృద్ధియగుట ఒకసాంతమును స్పష్టపరచుచున్నయది. కర్మకరుల వేతనములకును, ముఖ్యఆహార పదార్థమునకును గల సంబంధమును వెల్లడిచేయుచున్నది. పై రాష్ట్రములయందు వరి బియ్యము ముఖ్యఆహారపదార్థము. ధాన్యముయొక్క ధర పెరుగుటచేత, వేతనములుకూడ వృద్ధియైనట్లు తేలుచున్నది.

వేతనములు ధాన్యరూపకముగ ఒసంగబడినప్పుడు సరకులయొక్క వెలలుపెరిగినను కూలివానిని బాధించవు. తనకు దొరకిన ధాన్యాదులను కొంతవరకు విక్రయించి లాభము సంపాదించిననేతప్ప, ధాన్యరూపకమగు వేతనములు కూలి

వానికి నష్టదాయకంబుగ పరిణమించును. పాశ్చాత్యదేశములలో వలె కర్మకరులు సమ్మెకట్టుట ఇండియాయందు లేదు. ఇచట వేతనములు ఇంకను ఇదివరకు అమలులోనున్న పద్ధతిని అనుసరించియే చాలవరకు నిర్ణీతములగుచున్నవి. కర్మకరులకు విద్యాదానము అత్యవసరము. హిందూదేశముయొక్క భావిస్థితి, నిపుణులగు కర్మకరులనుబట్టి యుండును. అట్టికర్మకరులలవడనిచో ఇతరదేశములతో స్వదేశకళలు పోటీకి నిలచుట కష్టము.

భారతీయులు 1916-1917 సంవత్సరములో ఏయే వృత్తులయందు ఎందరు పనిచేయుచున్నదియును ఈ క్రిందిపట్టీవలన తెలియును.

వ్యవసాయము	22,46,95,900
గనులుత్రవ్వుట మొదలగునవి	2,33,44,192
కళలయందు	3,53,23,041
వాణిజ్యము	1,78,39,102
ప్రభుత్వోద్యోగములు	55,86,766
విద్యాశాఖ	53,25,357
ఎగుమతి దిగుమతులయందు	50,28,900
ఇతరవృత్తులు	1,72,86,678

తేయాకు, నీలితోటలయందలి కూలీల కష్టములు.

తేయాకు, నీలివగైరా తోటలయందు పనిచేయుచున్న కర్మకరులనుగూర్చి ఒకింతవ్రాయుట సమంజసము. 1916-వ సంవత్సరమున లక్ష్మణపురమున (Lucknow) సమావేశమైన

దేశీయ మహాజనసభయందు మహాత్మగాంధిగారిని బేహారము నందలి ఐరోపియను తోట యజమానులు భారతీయులనెట్లు ఆదరించుచున్నదియును విచారించవలసినదని ఒక తీర్మానము గావించబడెను. మహాత్మగాంధిగారు దక్షిణ ఆఫ్రికాయందలి భారతీయుల ఇక్కట్టులను బాపుటకు ఎంతకష్టనష్టములను ఓర్చినదియును చరిత్రాత్మకమైయున్నది. కొన్ని నెలలక్రిందట మోతీహారియందుగాంధిగారు విచారణచేయ నారంభించిరి. గాంధిగారు విచారణ ప్రారంభించెదరని తెలిసినవెంటనే ఐరోపియనుతోట యజమానులుజెందిన కలవరము వార్తాపత్రికలం జదివినవారి కెల్లరకును తెలిసియేయున్నది. మహాత్మగాంధిగారిని విచారణ చేయనీయకుండ తరిమివేయుటకై ఎన్నియో కుతంత్రములు పన్నబడినను విచారణ జయప్రదముగ జరిగినది. గాంధిగారు తమఅభిప్రాయమును బేహారుప్రభుత్వమువారికి నివేదనపత్రము నంపిరి. తోటయజమానులకు గౌరవముగా నివేదనపత్రమునంపి నట్లు కానరాదు. మదరాసుమెయిలు గాంధిగారిపై వ్రాసిన పిచ్చివ్రాతలకు సమాధానమిచ్చుచు పోలకు మహాశయుడు "గాంధిగారి నివేదనపత్రమును వెల్లడిచేసినయెడల ఆసేతు హిమాచల పర్యంతమును హిందూదేశము అట్టుడికినట్లుడుకు"నని తెలియజేసెను. ఇందువలన ఐరోపియను తోటయజమానుల ప్రవర్తన సక్రమమైనదికాదనియును భారతీయులు పెక్కుకడగండ్లను గుడుచుచుండిరనియును స్పష్టమగుచున్నది. ప్రస్తుతము బేహారుస్థానిక ప్రభుత్వమువారు గాంధిమహాశయుని ఒకసభ్యునిగ నియమించి ఒకవిచారణ సభనేర్పర్చియున్నారు. దానివలన తోటయజమానులగుట్టు వీధిబడకమానదు. భారతీయులయెడల వీరు క్రమముగ వర్తించుటలేదని చెప్పకవీలు లేదు.

ఒడంబడిక పద్ధతిపైని వలసపోవు కూలీలు.

ఇక ఒడంబడికె (కంట్రాక్టు) పద్ధతిపై నికూలీలను గొని పోవు పద్ధతినిగురించి కొంతవరకు వివరపర్చవలసి యున్నది. 1910 సం॥న గోఖలేమహాశయుడు సామ్రాజ్యశాసన నిర్మాణ సభయందు ఒడంబడిక పద్ధతిపై కూలీలను గొనిపోవుటను ఆపివేయవలసినదని ఒకతీర్మానమును ప్రతిపాదించెను. మూడు విషయములను ఈ సందర్భమున గమనించవలసి యున్నదని గోఖలేగారు వాక్రుచ్చిరి:—చాలకాలము క్రిందట ఆపివేయ బడిన బానిసపద్ధతిని ఈ ఒడంబడికపద్ధతి పునర్జీవికను జేయు చున్న విషయమొకటి.

ఇక రెండవవిషయము బానిస స్థితినుండి ఇటీవలనే విముక్తులైన నీగ్రోజాతివారు సైతము ఈపద్ధతిని నిరసించు చుండుట. నీగ్రోలునిరసించు పద్ధతిని స్వేచ్ఛగా సంచరించు చున్న ప్రజలకు కట్టిపెట్టుటమరియొకటి.

తోటయజమానుల బలవంతముపైని పునర్జీవికను జేయు చున్నను, అప్పటప్పట ఇండియా దొరతనమువారును, సామ్రాజ్య ప్రభుత్వమువారును ఈపద్ధతియందలి దోషములను విచారణవలన కనగొనినవారై, ఒడంబడికపద్ధతిని ఆపుచేయు చుండుటనుబట్టిగూడ సర్కారువారికి సైతము ఈపద్ధతి సమ్మతి లేనట్లు తేలుచున్నది. ప్రజాప్రతినిధిసభయందు సైతము ఈ పద్ధతి ఒకసారి నిరసించబడినది; కాని తక్కువ మంది ప్రతి

నిధులు సమావేశమైయున్న యదనున తిరిగి మూలధన ప్రాబల్యాతే విజయమునుగాంచిరి.

ఈపద్ధతిని అమలులోనుంచరాదని వ్రాక్రుచ్చుచు తమ వాదమును బలపర్చుకొనుటకునై గోఖలేగారు ఈక్రిందిఅయిదు కారణములను నుడివిరి:—

1. ఈపద్ధతిక్రింద విదేశములకేగు కూలివాండ్రుతొలుత తామేగుదేశస్థులయొక్క భాషనుగాని, ఆచారవ్యవహారములుగాని ఎరుగనట్టియు, స్నేహితులుగాని బాంధవులుగాని ఇరుపార్శ్వములను లేని క్రొత్తవియగు దూరదేశములకు పనినిమిత్తమై పోవుటకు ఒడంబడికవ్రాసి ఇత్తురు.

2. అచట కేగినపిమ్మట తామెన్నడును ఎరుగని ఏయజమానివద్దనో పనికి కుదురునట్లుగ ఏర్పాట్లు గావింపబడును. యజమాని తమ్ముగాని తాము యజమానినిగాని అదివరకు ఎరుగకపోవుట అటుండగా, తమఇచ్చవచ్చిన యజమానివద్ద చేరి పనిచేయుటకునుగూడ వలనుపడదు.

3. యజమానియొక్క భూమియందే నివసించునట్లుగను, యజమానియొక్క సెలవుచీటిలేనిదే ఇతరప్రదేశములకు పోకుండునట్లుగను, నియమించబడిన పనులు ఎంత కాఠిన్యముగనున్నను చేసి తీరవలసినట్లుగను ఒడంబడిక వ్రాసి కొనబడును.

4. ఒడంబడిక సాధారణముగా ఐదు సంవత్సరముల వరకు నిర్ణయమగును. నియమిత కాలములో షరతులకు వ్యతిరేకముగా తప్పించుకొనుటకు వీలులేదు. ఎన్ని కడ

గండ్లను గుడుచుచున్నను ఒడంబడిక ప్రకారము అమలుజరుగవలసినదే.

5. తాముపనిచేయు నియమితమైన సంవత్సరములలో చుట్టుప్రక్కల లభించుకూలికన్న, చాలతక్కువగా నిర్ణీతమైన కూలికి పనిచేయవలసి యున్నది.

పోయినప్రదేశములలో కూలివాండ్రు పనిపడియందు ఏమైన లోపములువచ్చినయెడల ఏశిక్షాస్మృతి ననుసరించివారిని దండించెదరో ఆసంగతి తెలుపుటలేదు. అన్యభాషలో వలసపోవువారు వ్రాసియిచ్చు ఒడంబడిక షరతులకు ఏ స్వల్పలోపమువచ్చినను, శిక్షాస్మృతిప్రకారము శిక్షింపబడుచున్నారు. జర్మనీమొదలగు ఇతరదేశములయొక్క వలసరాజ్యములకు పోవు కూలీలను అట్టిస్వల్పలోపములకు శిక్షాస్మృతిప్రకారము దండించక న్యాయస్థానములలో విచారించబడుదురు. ఈవిషయము గోఖలేమహాశయుడు సామ్రాజ్యశాసన మహాసభలో గంభీరముగా వ్రాక్రుచ్చెను.

ఈవిషయమునే 1916-సం॥నందు ‘ఫిజి’ దీవులకుబోయి అక్కడి వ్యవహారములను చూచివచ్చిన సి. యఫ్. ఆండ్రూసు, (Andrews) పియర్సను (Pearson) గార్లు తమ నివేదన పత్రమునందు ప్రచురించిరి. వీరి విచారణపత్రికను జదివిన ఏభారతీయునకును ఒడలుకంపించకమానదు. నూర్గురు మగవాండ్రకు నలువదేసి స్త్రీలచొప్పున వలసరాజ్యములకు పంపబడుచున్న సంగతిని దొరతనమువారే ఒప్పుకొనిరి. 4 లేక 5 గురు పురుషులకు ఒక్కొక్క స్త్రీయుండుటయును, అందువలన భారతనారీ

మతుల పాతివ్రత్యమునకు భంగకరమగుటయును చూచివచ్చిన ఆండ్రూసు, పియర్సనుగార్లు కంఠశోషణముగా నివేదించిరి. పంపబడిన స్త్రీలు సైతము చెడునడవడులకు అలవాటుపడిన వారుగనే ఉండుచువచ్చుట తటస్థించినది. నీతివిషయకమటుండ యూరోపియను యజమానులు పెట్టుబాధలను సైరించజాలక ఎందరో బలవన్మరణముల పాలగుచున్నారు. ఈపద్ధతి వ్యాప్తమైయున్న ప్రదేశములయందు నివసించెడి భారతీయులందరును కూలీలుగనే పరిగణింపబడు చున్నారు. వారు ఏవృత్తియందున్నను వలసప్రజల దృక్పథమున హైన్యభావమునే కలిగియున్నారు. ఈపద్ధతి భారతీయజాతీయ గౌరవమునకు కళంకమును తెచ్చుచున్నది. త్వరలో రూపు మాపవలసియున్నది. ఇది వట్టికే కాలహరణమగుటచే ఇండియా దొరతనమువారు త్వరపడుటవిధి. హార్డింజిప్రభువు ఇండియాను వీడిపోవుటకుముందు ఒడంబడిక పద్ధతిని రూపుమాపెదమని వాగ్దానము చేసి యున్నారు. ఆండ్రూసు పియర్సనుగార్లు ఫిజీదీవులనుండి ఇండియాకు విచ్చేసిన తరువాతను, లక్షలకొలదిసభలు గావింపబడి ఈపద్ధతి గర్హ్యమైనదని తీర్మానములు గావింపబడినవి. పోలకు గారు ఆంధ్రమండలములలో సంచరించి ప్రతి ముఖ్యపట్టణమునందును గావించిన గంభీరోపన్యాసములు చదువరులు గమనించియే యుందురు. కొందరు ప్రముఖులు చెమ్సుఫర్డు ప్రభువువారినిదర్శించి, హార్డింజి ప్రభువరేణ్యుని వాగ్దానమును అమలులోనికి గొనిరావలయునని నివేదించిరి. దర్శించబోయినవారిలో కొందరు భారతనారీమణులుకూడ గలరు గవర్నరు జనరలుగారిచ్చిన సమాధానము సంతృప్తి కరముగలేదు. ఇండి

యాకార్యదర్శియగు ఛాంబర్లెయినుగారు కూడ నిరసనభావమును జూపిరి.

1917 సం॥ ఏప్రియలు నెలయందు ఇంగ్లాండునందు సమావేశమైన సామ్రాజ్యయుద్ధ ఆంతరంగిక సభకు పంపబడిన ఇండియాప్రతినిధులు (ప్రభుత్వమువారిచే నెన్ను కొనబడినవారు) ఈపద్ధతినిగూర్చి ఒక 'పత్రమును దాఖలు చేసిరి. అది విచారణకు తేబడక, విషయ విమర్శనమునకై నియోగించబడిన సభవారి కంపబడినది. మనప్రతినిధులు ఏమి తెలియపర్చినదియును, ప్రభుత్వమువారు ఎట్టి సానుభూతిని దాని యెడల కనుబరచినదియును, తెలిసికొన వలసిన ముఖ్యులమగు మనకు తెలియపర్చలేదు. నియోజించినసభకు గాంధి, పోలకు, ఆండ్రూసు పియర్సను గార్లలో ఒకరినైనను అనుభవైకవేద్యులను సభ్యులుగ ఏర్పాటుచేయలేదు. ఇట్టి గూఢప్రవృత్తికి దొరతనమునాకేల కడంగినదియును గోచరమగుట లేదు.

ఇది ఇట్లుండగా గవర్నరు జనరలుగారు దేశసంరక్షక శాసనము ననుసరించి ఇటీవల వలసబోవు పద్ధతిని నిలుపుచేసినందులకు భారతీయులు కృతజ్ఞులే. కాని పూర్తిగా నిలుపు చేయబడినదని ప్రకటించక, దేశసంరక్షక శాసనముక్రింద ఆపు చేసినట్లు ప్రకటించుట సంభావ్యముగలేదు. యుద్ధానంతరముననైనను ఈపద్ధతిని పునర్జీవికనుజేయ వలనుపడదు. భారత జాతీయ గౌరవమునకు కళంకము కలుగును. ప్రపంచమునందలి బానిసవృత్తిని తొలగించుటకునై ఘోరప్రయత్నములుసల్పిన ఇంగ్లాండుదేశము భారతీయుల యాత్మ గౌరవమునకు భంగకరమగు నేర్పాట్లను తొలగించక మిన్నకుండుట పాడిగాదు.

యుద్ధపరిస్థితుల వలన బ్రిటిషు పాలకుల దృక్పథమునందు మార్పు గలిగినట్లు వినుచున్నాము. ఆగాగప్పు రాజకీయ విషయములయందు ఎటుల పరిణమించినను, భారతీయుల గౌరవమర్యాదలను నిలవబెట్టుటకునైన త్రోడ్పడి తీరవలెను.

వడ్డీ (Interest).

ధనము క్రయసత్వమును గలదియయ్యును ఇతరవస్తువులతోపాటు (ఇదియుకూడ) ఒక పదార్థముగనే పరిగణించబడవలసియున్నది. ఇతర వస్తుసముదాయమునకు వర్తించు ఆర్థికన్యాయములు ధనమునకుగూడ సమముగ వర్తించును. ఏవస్తువైనను సమృద్ధిగా దేశమునందమరియున్నయెడల, ఆ సరకునకు గిరాకి క్షీణించుచుండునన్న విషయము సామాన్య ఆర్థికన్యాయమే. రాశి తక్కువగనుండి, సరకుయొక్క అవసరము అధికమగుచో గిరాకి అతిశయించి మూల్యము హెచ్చుచుండును. ఈ న్యాయము ప్రకారమే వ్యాపారములయందు ఉపయోగించబడుటకునై దేశమునందు మూలధనము పుష్కలముగ నున్నయెడల వడ్డీ తక్కువగనుండును. అటులగాక ధనరాశి స్వల్పముగ చిక్కుచున్నయెడల వడ్డీ అధికమగుచుండును. వడ్డీ అధికమగుట ఈ ఒక్కవిషయమునుబట్టియే నిర్ణీతము కాకపోయినను, ఈ విషయమునకు మాత్రము హెచ్చు ప్రాముఖ్యతకలదు. అప్పుతీయువాని ఋజుమార్గ వర్తనమును బట్టియును, హామీనిబట్టియునుకూడ వడ్డీ నిర్ణీతమగుచుండును.

హిందూదేశమున మూలధన ప్రాబల్యము నాగరికతను గాంచిన ఇతరరాష్ట్రములతో సరిపోల్చిచూడ కడుహీనదశయం

దున్నదని రెండవ ప్రకరణమునందు సూచించియేయున్నాము. స్వాతస్సిద్ధమగు ధనలోపమునకుతోడు, దొరతనమువారి రాజస్వ నీతియును, నాణెముల చెలామణీనీతియును (Currency policy) మరింత సహాయ భూతములగుచున్నవి. నిలవయున్న ధనరాసులను (Cash balances) వినియోగము లేకుండ సర్కారు వారి కోశాగారములయందు త్రుప్పు పట్టునట్లుగ పాతరవేయబడుచున్నవి. ఈ ధనసంచయమును దేశీయ బ్యాంకులకు ఒసంగినయెడల ఎంతయో అనుకూలముగనుండి యుండును. సర్కారువారికి నాణెముల ముద్రణములవలన అపారమైన లాభము వచ్చుచున్నది. ఈ లాభమునంతను బంగారుప్రమాణ (Gold standard reserve) నిధియను పేర ఇంగ్లాండునందు ప్రోగుచేయుటవలన ఇండియాకు కొంచెమైనను లాభము కలుగుట లేదు. ఇండియా కార్యదర్శిగారి సభయందు విశేషపలుకుబడిగల ఇంగ్లీషు బ్యాంకర్లకు చాలతక్కువ వడ్డీలకు ధనము లభించుచున్నది. ఇది ఎంతయు శోచనీయము. ఈ కారణముల వలన ఇండియాయందు నూటికి 6 మొదలు 10 వరకు వడ్డీ నిచ్చినగాని పెద్ద వ్యాపారములకు మూలధనము చిక్కుట లేదు. ఇంగ్లాండునందన్నో 3 మొదలు 5 వరకు వడ్డీ నిచ్చిన యెడల అచటి వ్యాపారస్తులకు మూలధనము సులభముగ అలవడుచున్నది.

ఇండియాయందు అధికవడ్డీలు.

సామాన్య వ్యాపారములయందు రైతునకు గావలసిన విత్తనములు, కూలిపనులు వగైరా పెట్టబడులకును, సర్కారు శిస్తు చెల్లించవలసిన యదనునను, వడ్డీ విపరీతముగ చెల్లించ

వలసి వచ్చుచున్నదన్న సంగతి ఎల్లరెరింగియే యున్నారు. ఇందులకుగల ముఖ్యకారణము రైతుయొక్క అవసరము. ఈ సంగతిని సాహుకారు గమనించి విషమ షరతులను ఏర్పర్చి రైతునకు విశేషనష్టమును కలిగించుచున్నాడు. నూటికి నెలకు రెండురూపాయలు వడ్డీకి, సొమ్మిచ్చినయెడల రైతు అదృష్ట వంతుడే. తరుచుగ, మూడు రూపాయల రెండణాలు వసూలు చేయుచుందురు. నెలవడ్డీలు గాక కొన్ని ప్రాంతములయందు వారపువడ్డీలుకూడ ప్రబలముగ పీడించుచున్నవి. ఈ వడ్డీలు న్యాయముగ విధించబడుట లేదు. ఇతరమార్గము లేక ఎట్టి కడ గండ్లకైననోర్చి బీదరైతులును సామాన్యస్థితిపరులును సాహు కార్ల వలలో పడి చిక్కుపడుచున్నారు. సాహుకార్లు పెట్టు బడి పెట్టుటలో రెండువిధములుగలవు. వడ్డీకి సొమ్ము నొసంగు టయేగాక విత్తనములకును, రైతుయొక్క సాదరునకును ధాన్యమునిచ్చుటకూడ కలదు. ఈ ధాన్యమునకు తిరిగి ద్విగుణముగా పంటలుపండిన తరువాత క్రొత్తధాన్యము వసూలుచేయుటకూడ కలదు. సాధారణముగా నూటికి ఏబది వంతున వడ్డీతో, వసూలు చేయబడుచుండును. దివాణపుశిస్తు చెల్లించవలసిన వాయిదా తటస్థమయినపుడు అప్పటి వరిపంట పైనిగాని. మరియే ఇతరపంట పైనిగాని, చాలతక్కువ ధరలకు తిరిగి ధాన్యాదులను కొలిచి అప్పగించెడి పద్ధతిపైని, అప్పు ఇచ్చుచుండుటకూడకలదు. కాలవశమున ఆ సంవత్సరము పం టలునష్టమైననో తిరిగి క్రొత్తసంవత్సరపుపంటలకు వ్రాసికొన బడుచుండును. ఈ పద్ధతి సంప్రాప్తించినయెడల రైతు క్రుంగి పోవుట తటస్థించును. రెండు మూడు సంవత్సరములు ఈ

రీతిగ గతించినతరువాత భూమి వేలమువేయించి సాహుకారు తన స్వాధీనము చేసికొనుచుండును.

ఉన్నతన్యాయస్థానములయందు, నూటికి నెలకు రెండు రూప్యములకన్న అదనముగ వడ్డి చెల్లించెదమని పత్రములో వ్రాసి కొన్నను రద్దుచేయబడుచున్నవి. వారపు వాయిదాలు న్యాయ శాస్త్ర సమ్మతములుకావు. నెలకు నూటికి రెండురూపాయలు పైబడిన వడ్డీ చెల్లించనగత్యము లేదు. ఇండియాయందలి ఎల్ల ఉత్తమ న్యాయస్థానములును, ఈ విషయమున సమభావమును కలిగియున్నవి.

వడ్డీకివడ్డీ కట్టుచుండుట మనదేశమునందు సామాన్య ముగ జరుగుచున్నది. ఈకారణమువలన సాధారణముగా ఋణ ముతీర్చుసరికి అసలుకంటె వడ్డియే అధికమగుచుండుటకూడ తటస్థించుచున్నది. కలకత్తా పట్టణమునందును, బొంబాయి రాజధానియందును ‘దండూపట్’ న్యాయము అమలులోను న్నది. ఈన్యాయప్రకారము వడ్డీఅసలును మించరాదని నిర్దే సించబడినది. ఈన్యాయము ఎంతయుక్తముగ నున్నదియును పాఠకులు గుర్తించగలరు. అసలునకుమించి వడ్డిఉండరాదన్న న్యాయము, ఈరెండుచోటులలో మాత్రమేవర్తించి, ఇతరప్రాం తములయందు వర్తించకుండుట ఆప్రాంతవాసుల దురదృష్టము దక్క వేరొండుగాదు. ఈన్యాయమును హిందూదేశమున కం తకును వర్తించునట్లుగ దొరతనమువారు శాసించుట సమంజ సము. అటులగావించినయెడల చాలమంది ప్రజల ఇక్కట్లులను బాపినవారగుదురు.

బంగారు నగలయొక్కయు వెండినగలయొక్కయు హామీపైనిస్సైతము ఋణము లీయబడుచున్నవి. నగల హామీయున్నను మార్వాడీలు విధించుచున్న వడ్డీలు చాలహెచ్చుగనున్నవి. భూములతనఖా పైనికూడ కృషికళకు ధనమొసంగబడుచున్నది. ఇందలివిశేషమేమనిన స్వల్పకాలములోనే ఆఋణము తీర్మానముచేయవలసి యున్నదనియెడి షరతును కలిగియుండుటచేత, ప్రయోజనకారి యగుటకు మారుదుఃఖ భాజనమగుచున్నది. అప్పుతెచ్చినసొమ్ము, భూమిని అభివృద్ధిలోనికి గొనివచ్చుటకునై ఉపయోగించ వీలులేక యున్నది. ఏలయనిన అయిదారు సంవత్సరములు గడవున్నగాని క్షేత్రమునుండి మరమ్మతు వగైరాలుచేసి లబ్ధినిగ్రహించుటకు వీలుచిక్కదు. క్షేత్రముయొక్క అభివృద్ధి నిమిత్తమై వినియోగించబడని ఋణధనము నిష్ప్రయోజనము. వడ్డీని పెంపుచేయుటకుదక్క వేరొండు ప్రయోజనకారి కాజాలదు.

మారువాడీలకును సాహుకారులకునుతోడు, ఐరోపియను వ్యాపారస్తుల పాయకార్లును గుమస్తాలును రైతుయొక్క సంపదను కొల్లగొనుచున్నవారలు. ఇది ఒకతరహావడ్డి వ్యాపారము. దీనిఫలితము, అన్యదేశీయులకు ఇండియాధనము జేరుటయే! గోగునార, నూనెగింజలు వగైరాలు పండకపూర్వము, ఈపాయకార్లు (వ్యాపారస్తులయొక్క ఏజంట్లు) తగుమాత్రముగా సొమ్మునొసంగి, పంటలు తేలినవెంటనే రైతునకు లబ్ధిలేకుండ తక్కువధరలకు అపక్వపదార్థసంచయమును గ్రహించి, విదేశములకు ఎగుమతిచేసి అందలి విశేషలాభముల వలన ఈవ్యాపారస్తులు స్వల్పకాలములో లక్షలకొలది ధనమును ఆర్జించుచున్నారు.

ఇందులకొక యుదాహరణము. జూలైమాసమునందు గోగునారను సేద్యముచేయు నిమిత్తమై కృషికులు వ్యాపారస్తులయొద్ద బజానా (Advance) పుచ్చుకొనుచున్నారు. అక్టోబరునెలలో గోగునారను ఇచ్చెడిపద్ధతిమీద, ఈబజానా లొసంగబడుచున్నయవి. మణుగు (బంగాళాదేశపుమణుగు) నకు 9 మొదలు 10 రూప్యములు విలువగల గోగునారను 5 మొదలు $5\frac{1}{2}$ రూప్యములు బజానాగా గ్రహించి ఐరోపియను వ్యాపారస్తులకు సమర్పించుచున్నారు. మణుగునకు ఏడురూప్యములు విలువగల సీమ అవిసెగింజలను అయిదు రూప్యములు బజానా ఇచ్చియును, మూడునాలుగు నెలలలో వాపసుచేసెడి రెండున్నరరూప్యములు విలువగల ధాన్యమునకు ఒకటిన్నరరూపాయనిచ్చియును, అన్యదేశ వ్యాపారస్తులు స్వదేశమునందలి పంటలను కొల్లగొనుచున్నారు. ముందుగా సొమ్మునొసంగినందులకు కొంతవడ్డీ తగులుబడియైనను, ఈ వ్యాపారస్తులు గ్రహించుచున్నలాభము అపారముగనున్నదని యొప్పుకొనక తీరదు. విశేషశ్రమపడి పండించిన పంటలయొక్కలాభము కృషికళకుజెందక విదేశస్తుల నోటబడుచున్నది. పరపతిసంఘములు విచ్చలవిడిగ దేశమునందంతటను అమరినగాని, ఈదుస్థితి తొలగుమార్గము గాన్పింపదు. వినియోజకాన్యోన్య సంఘములును, ఉత్పత్తిసంఘములును విశేషముగా మనదేశమున వ్యాప్తము కావలసియున్నది.

పరపతిసంఘముల ఆవశ్యకత.

ఇకపరపతి సంఘములనుగూర్చి విమర్శింతము. పరపతిసంఘములనుగూర్చి 1904 సం॥ ఇండియాదొరతనమువారు

ఒకచట్టమును జారీచేయించిరి. 1912-వ సం॥ న కొన్నిసవరణలు చేయబడెను. ఈ సంఘములు ప్రస్తుతము బాల్యావస్థయందున్నవి. ఇంకను విరివి కావలసిన యావశ్యకత కలదు. ఐరోపా ఖండమునందు సహకార సంఘములు విశేషప్రతిభనుకలిగియున్నవి. విశేషించి జర్మనీదేశమున విస్తారముగా వ్యాపించి, ప్రజలకు అనేకవిధముల సహకారు లగుచున్నవి. ప్రభుసన్మానమును విశేషముగ, గలిగియున్నవగుటచేత ఐరోపాఖండమునందు ఈ ఉద్యమము విశేషవ్యాప్తినిగాంచి సకల విషయములయందును ప్రజలకు తోడ్పడుచున్నది. ఇండియాయందు ప్రభుసన్మానము ఏమియు లేదని నిరూపించుట మా మతముకాదు. సర్కారువారు విశేషముగ ప్రోత్సాహము చేయవలసిన ఆవశ్యకత మనదేశమున విస్తారము. ఋణదాతల బారినుండి పేదరైతును తొలగించి క్షేత్రమునకును రైతునకును క్షేమముగూర్చుటకును, అన్యదేశీయులు స్వల్పమొత్తములను ముందుగానొసంగి పదార్థసంచయము నంతయును చౌకగా గ్రహించుటకు వీలలవడకుండ జేయుటకును సహకార సంఘములు అవశ్యములు. ఈసంఘములు పెరిగి విజృంభించుటకు దొరతనమువారి తోడ్పాటు మిక్కిలి అవసరము. సహకారసంఘములయొక్క మూలధనములో దొరతనము వారొసంగునది నూరింటనాలుగు పాళ్ళుమాత్రమే! యీసహాయము కొంతవరకు క్షేమకారియయ్యును బహుస్వల్పమని చెప్పక తప్పదు. ఆస్ట్రియా, హంగరీప్రభుత్వమువారు హంగరీబ్యాంకుకు క్రెడిటు బ్యాంకునకు ఒకమిలియను క్రౌనులను (క్రౌను 25 షిల్లింగులు అనగా మూడురూప్యముల నాలుగణాలు) వడ్డీలే

కుండదయచేసిరి. ఈబ్యాంకి కృషికుల ఉపయోగార్థమై ఏర్పర్చబడినది. ప్రభుసన్మానము విశేషముగ అలవడినగాని ఏదేశమందైనను ముఖ్యముగా ఇండియాయందు, ఇట్టి యుద్యమములు చక్కగా వ్యాప్తిని గాంచజాలవు. సహకార ప్రవృత్తివలన లభించెడి లాభములను పాఠకు లెరింగియే యుందురు. సహకార సంఘములు దేశమందంతటను వ్యాపించియున్నయెడల వడ్డీ తగ్గగలదు. నూటికి రెండు రూపాయలు మొదలు మూడు రూపాయలవరకు వడ్డీ చెల్లించవలసిన అగత్యముండక, అర్థ రూపాయకో, పది అణాలకో వలయుధనము చిక్కుచుండును. క్రమముగా వడ్డీ ఇంకను తగ్గగలదు.

సహకార ప్రవృత్తి బహువిధములు. ప్రస్తుతము ఇండియాయందు అమలులోనున్న పద్ధతి, పరపతి నొసంగుట ఒక్కటియే. కృషి విషయకమగు సహకార సంఘములును, వినియోజ కాన్యోన్య సంఘములును, సరకుల విక్రీత సహకార సంఘములును, వేయేల మానవకోటికి సంబంధించిన సర్వవ్యాపారములకును సహకార సంఘము అలవడుటవలన ప్రజలకును దేశమునకునుగూడ క్షేమకరము. నేతవిషయికమగు సహకార సంఘములు జయప్రదముగ జరుగుచున్నవని వ్రాయుటకు చాల సంతసముగానున్నది. సకలవ్యాపారములయందును సహకార సంఘములు స్థాపింపబడవలెను. ఇట్టి ఉద్యమములు విరివియగుటకు విద్యావ్యాసంగమును బాగుగ గలిగిన యువజనులయొక్కయు, నాయకులయొక్కయు ప్రోత్సాహము అత్యవసరము. విధ్యాధికులు తటస్థముగ ఊరకున్నయెడల ప్రతికక్షులు మనయందు ఆరోపించు అపవాదములసంగతి

యటుండ, స్వదేశమునందలి కళలు అభివృద్ధిగాంచి భారతీయుల గౌరవ ప్రతిప్రత్తులు నిల్చుటకువీలుచిక్కదు. విద్యాధికులమని విర్రవీగక మన సోదరులగు కృషీకులయొక్కయు, శిల్పులయొక్కయు, కర్మకరులయొక్కయు కష్టసుఖములను గుర్తించి, సర్వవిధములవారికి సహాయులయినగాని, దేశముఅభివృద్ధిని గాంచజాలదు. దేశమునందలి ప్రజలెల్లరు సుఖులైనగదా, ఆదేశముయొక్క ప్రతిభ ఇతరదేశముల వారివలన పొగడ్తనుగాంచును! పాఠకమహాశయులు ఇందలి ప్రాశస్త్యమును గమనించినవారలై తమప్రాంతములయందు సహకారసంఘములు వేనవేలుగ బయలు వెడలునట్లు పాటుపడుట మిక్కిలి ఆవశ్యకము. ప్రతి గ్రామమునను ఒకసంఘముండి తీరవలయును.

జిల్లా బ్యాంకులు.

పరపతి సంఘములకు విద్యాధికులయొక్కయు సామంతులయొక్కయు ప్రోత్సాహము అవసరమని నిరూపించియేయున్నాము. సంఘముల యొక్క ఏర్పాటులయందు కొన్ని నియమములు మార్పును జెందవలసియున్నది. ప్రతిజిల్లాయందును, పరపతిసంఘముల నిమిత్తమై, ఒకసెంట్రలుబ్యాంకి ఉండి తీరవలయును. సెంట్రలుబ్యాంకి అనగా ఆయాజిల్లాలయందలి పరపతిసంఘముల కన్నిటికిని పెట్టుబడిపెట్టుటకునై నియోజింపబడిన కొశియనుట. ఈనిధి మూడుకార్యములను నిర్వర్తించునదిగ నుండవలయును:—

1. అడిగినవెంటనే వాపసుచేయు పద్ధతిపైని దానికి సంబంధించియున్న సంఘములనుండి స్వల్పవడ్డీకి ధనమును

గ్రహించుచుండుట (డిపాజిట్లు). 2. ఆసంఘములకు ఋణము నొసంగుట. 3. వానియొక్క లెక్కలను తనిఖీచేసి ఆదాయవ్యయములను తెల్పి సలహా నొసంగుటయును సెంట్రలుబ్యాంకి చేయుచుండవలయును. అట్లుల గావించుటవలన జిల్లాయందలి సర్వసంఘములకును తగినసలహా చిక్కుచుండుటయేగాక లెక్కలను తనిఖీ చేయుటకుగూడ విశేషధనము వ్యయము చేయ నవసరముండదు. జిల్లామొత్తముపైని అన్యోన్యముకొంతవరకు పెంపుజెంది, పరపతి వృద్ధియగుటకు వీలుకలుగుచుండును. సెంట్రలు బ్యాంకి చేయుపని మరియొకటిగలదు. తనకు సంబంధించియున్న సంఘములయొక్క లెక్కలను ప్రకటించుచు నుండుటచేత విద్యాధికులయొక్కయు సామంతులయొక్కయు దృష్టిని ఆకర్షించుటకు వీలుకలుగునట్లు చేయగలదు. ఎట్టివ్యవహారమైనను బహిరంగముగ జరుగుచున్న యెడల ఇతరుల దృష్టి పడినను ఎట్టివ్యాపారముల సరిగ నడిపించుటకు అనువగుచుండును. సెంట్రలుబ్యాంకి చేయగలుగు ఘనకార్యము మరియొకటి గలదు. ప్రస్తుతము పరపతి సంఘములు ఇతర జామీనుదార్ల జామీనుపైని ఋణము నొసంగుచున్నవి. అట్లు ఒసంగబడెడి ఋణము అంతగా నుండదు. భూముల తనఖాపైని ఋణము నొసంగినచో హెచ్చు ధనమును సంగ్రహించుటకు వీలుకలుగును. క్షేత్రమును వృద్ధిచేయుటకు తగిన యేర్పాట్లనుచేయుటకై హెచ్చుధనము ఆవసరము. భూముల సాగుబాట్లు చేయుటను, నూతులుద్వారా జలాశయములను నిర్మించి క్రొత్తపైరులను నాటుటకును క్రమమైన ఎరువులతో భూమిని సత్తువచేసి సేద్యపర్చి లాభమును గ్రహించుట

కును స్వల్పకాలముచాలదు. వెంటనే అనగా స్వల్పకాలములో
తీర్చెడిపద్ధతిపైని ఋణము తెచ్చి అసలు జరుపుటకు వీలు
చిక్కదు. ఇరువది, ముప్పది సంవత్సరములవరకు మరలునట్లు
గాని, ఋణము తెచ్చి భూములను అభివృద్ధి చేయుటవలన లా
భముగిట్టదు. ఇంతకాలము వరకును సెంట్రలు బ్యాంకులు తమ
తాలూకు మూలధనమును వినియోగించి పెట్టజాలవు.
కనుక సెంట్రలు బ్యాంకులు డిబెంచరులు (బ్యాంకులచేయిచ్చు
ఋణపత్రము) మూలముగ, మూలధనమును గ్రహింపవలెను.
భూముల తనఖాపైని సొమ్మునొసంగుటకు వీలుగలిగియుండును.
ఈపద్ధతి ఐరోపాఖండమునందలి ప్రష్యా, బల్గేరియా, ఆస్ట్రి
యా, హంగేరీ దేశములయందు నిర్విఘ్నముగ జరుగుచున్నది.
ఈ బ్యాంకులు విశేషసహకారులుగనున్నవని చెప్ప వ్రాయబడి
లేదు. పరపతిసంఘములయొక్క సభ్యులపైనను, ఆ సం
ఘమునందలి సభ్యులజవాబుదారీపైనను సెంట్రలు బ్యాంకుల
జవాబుదారీపైనను ఋణము లొసంగబడుచున్నది. సెంట్రలు
బ్యాంకులు తమ జిల్లానుండియేగాక ఇతర ప్రాంతముల నుండి
గూడ తక్కువవడ్డీలకు ధనమును గ్రహింపగలవు. కనుక ప్రతి
జిల్లాయందును, ఒక్కొక్క సెంట్రలు బ్యాంకి నెలకొల్పబడ
వలెను. భూముల తనఖాపైని ఋణము లొసంగుటకును వీలు
కలిగియుండవలెను.

రైఫీసనుపద్ధతి.

గ్రామ పరపతిసంఘములు బంగాళమునందు బీహారు
(విహారరాష్ట్రము) నందును, బొంబాయి, మధ్యపరగణాల
యందును రైఫీసన్ (Raiffesen) పద్ధతులపై నెలకొల్పబడి

నవి. రైఫీసను పద్ధతియందు సంఘములయందలి సభ్యులు
కొన్ని భాగములను సొమ్ము చెల్లించి కొననగత్యము
లేదు; సంఘమునందలి అందరి సభ్యుల జవాబుదారీపైని
వ్యవహారము జరుగుచుండును. ఈ పద్ధతి బంగాళమునందు
విశేష జయప్రదముగ జరుగుచున్నది. పంజాబు సంయుక్త
రాష్ట్రములు, బర్మా రాష్ట్రములయందు ఈపద్ధతి కొంతమా
ర్పును జెందియున్నది. చెన్నరాష్ట్రమునందుకూడ సభ్యులు
కొన్ని భాగములను కొని తీరవలసినదిగనే యున్నది. భాగ
ములు కొనవలసిన పద్ధతిప్రకారము పరపతి సంఘములు
స్థాపింపబడుటవలన ఒక కీడు కలుగకమానదు. భాగములు
కొన్నవారికి తప్ప ఇతరులకు ఈ సంఘములు పరపతి నొసం
గవు. వ్యవహారము జయప్రదముగ జరుగుచున్న కొలదిని,
నూతన సభ్యులను చేర్చుకొనుటకు నైనను ఈ సంఘములు
పూనుకొనవు. సహకార ప్రవృత్తియొక్క ముఖ్యోద్దేశ్యము
బీదవారలకు సహాయమును నపేక్షించు ఎల్లరకును సహాయము
నొసంగుటయై యున్నది. అటులగానిచో సహకార
ప్రవృత్తి యనునది నామమాత్రమే అగుచున్నది. జర్మనీదేశము
నందు జయప్రదముగ అమలు జరుగుచున్న పద్ధతి ఇండియా
యందుకూడ నిర్విఘ్నముగ జరుగగలదు. బంగాళమునందు
కూడ ఈపద్ధతి సుకరముగనే అమలు జరుగుచున్నపుడు పం
జాబు, బర్మా, సంయుక్తపరగణాలు, చెన్నరాష్ట్రము మొదలగు
ప్రాంతములయందుకూడ లాభకారిగనేయుండునని వేరుగ చెప్ప
నక్కరలేదు. ఇండియా యందెల్లెడల రైఫీసను పద్ధతి ప్రకా
రమే, గ్రామ పరపతి సంఘములు నెలకొల్పబడవలెను.

విభజనసంఘములు.

ఈ సందర్భమున విభజన సంఘములను (Distributive societies) గూర్చికూడ కొంత వ్రాయవలసియున్నది. జీవయాత్ర నడపుటకు ఆవశ్యకములగు పదార్థములనల్ల విభజన సంఘములు జాగ్రతపరచి సరఫరా చేయుచుండిన యెడల పెక్కులాభములు కలుగుచుండును. అంగడి వర్తకులయొక్క నాణ్యతనుచూచి పరిశుభ్రమైన వస్తుసముదాయమును సేకరించుటకు వీలలవడుచుండును. సరకులయొక్క వెలలు కూడ తగ్గుటకు వీలున్నది. పాశ్చాత్య దేశములయందలి విభజన సంఘములు పెక్కులుకలవు. ఈ సంఘములు ఆయాదేశములకు విశేష ప్రయోజనకారులుగా నున్నవి. సహకార ప్రవృత్తి సంఘములు, విద్యావ్యాపకమునకును, నిరుద్యోగులకు పనులు కల్పించుటకునుగూడ, స్కాట్లాండు ఇంగ్లీషు దేశములయందు గలవు. ప్రతి విషయమునందును సహకార ప్రవృత్తి మార్గములు లాభకారులేయగును. ఈ సంఘములు ఇట్లు విరిసినట్లుగ, స్వదేశమునందు వ్యాపించినగాని, మనకర్షకుల నల్ల పీల్చి పిప్పిచేయుచున్న అధికవడ్డీలు తగ్గుటకు మార్గములేదు. అన్యదేశీయులు మన అపక్వపదార్థ సంచయమును కొల్లగొనుటకుగూడ వీలుచిక్కదు.

సహకార సంఘములవలని ఆర్థిక ఫలితములకంటెను అన్యోన్యతను ఇనుమడింప జేయుటవలన సంఘమునకు కలిగెడు బలము వేయిరెట్లు అధికమైనది. సంఘబలమే దేశబలము. దేశము బలీయముగ నున్నయెడల ప్రజలు సుఖించుటకు వీలే

ర్పడును. భారతదేశీయులు సహకార సంఘములయొక్క ఆవశ్యకతను గ్రహించినవారలై, ఆంధ్రమండలమున ప్రతి గ్రామమునందును దేశీయ పద్ధతిపైని సహకారసంఘములు స్థాపించుటకు తగిన ఏర్పాటులనుగావించి, ఆ ప్రాంతములయందలి ప్రజలను సంరక్షించవలసిన ఆవశ్యకత విశేషముగనున్నది.

లాభము.

ఆంగ్లేయ అర్థశాస్త్రములననుసరించి ఈ విషయమునుగూర్చి కొంతవరకు చర్చించవలసియున్నది. స్వదేశమునందలి నేటి స్థితిని బట్టి వాణిజ్య వ్యాపారములు పెంపుగాంచినగాని, లాభమునుగూర్చిన ఉపయోగకరమగు చర్చలు. వ్యవహారములయందు ఖర్చులుపోను మిక్కిలి ద్రవ్యములాభముగ పరిగణింపబడును. వ్యవహారములనగా యంత్రశాలలును హస్తకళలును స్థాపించబడి, తయారుచేయబడిన సరకులవిక్రయములనుట. ఎల్ల వ్యాపారములనుగూర్చి ఇచట చర్చించ తగదుగాని.

లాభము మూడువిధములగు ద్రవ్యమును చేరియున్నది:-

i. మూలధనముయొక్క వడ్డీ.

ii. వ్యాపారమునందు నష్టము రాకుండ చేయబడిన భీమా (Insurance against Risk.)

iii. వ్యాపారమును నడిపించినందులకు, ఉద్యోగస్థునకు ఈయవలసిన ప్రతిఫలము.

స్వదేశ వ్యాపారములయందు మొదటిరెండువిధములగు ధనమును పెట్టుబడి పెట్టిన భాగస్వాములకు చెందుచున్నది. పెద్ద వ్యాపారములయందు వ్యవహారమును నడిపించుటకు

ప్రత్యేకముగా ఒక అధికారి నియమింపబడుచుండును. ఈ
మూడు విధముల ధనమును ఒకరికే లభించుట లేదు. ఇంగ్లాండు
నందువలెగాక ఇండియాయందు కళానిర్మాణమునకునై వె
చ్చించ నగత్యమగు మూలధనమునకు విశేషవడ్డీ ఒసంగవలసి
యున్నదన్న సంగతి ఎల్లరెరింగినదే. కావున వ్యవహారములు
జయప్రదముగ జరుగవలెనన్న విశేషలాభము అలవడినగాని
గిట్టదు. భూముల తనఖాపైని విశేషద్రవ్యము జమీందారులు
మొదలగువారు సేకరించుచుండుటచేత కళాప్రపంచమును సము
ద్ధరించుటకు చాలినంత మూలధనము అలవడుటలేదు. ధనాధి
కులకు ఋణములనొసంగి వడ్డీలను గ్రహించుటయే విశేష
లాభకరముగ నున్నటుల కానవచ్చుచున్నది. అట్లు గానిచో,
కళానిర్మాణమున తమధనమును వెచ్చించక ఊరకుండరు.

అపక్వపదార్థ సంచయమును విదేశములకు ఎగుమతి చేయుటవలన కలిగెడి లాభమును పూర్ణముగ మనవారు గ్రహించుటలేదు. ఏ హోల్వ్యేల్సను కంపెనీ నోటనో స్వదేశస్థులకు చెందవలసిన లాభము పడుచున్నది. మనవర్తకులు బస్తాకు ఒకకానివచ్చిన అదియే పదివేలుగ పరిగణించుచున్నంత వరకును, విదేశవ్యాపారులే విశేషలాభమును గ్రహించుచుందురు. ఏ దేశమునందు ఏ పదార్థమునకు గిరాకికలదో తెలిసికొనినవారలై, జడియక ఆయాదేశములకు సరకులను ఎగుమతిచేసి సంపూర్ణముగ లాభమును భారతీయులే గ్రహించవలసియున్నది.

మారకము.

EXCHANGE.

హిందూదేశ నాణెములచరిత్ర.

మహమ్మదీయులు హిందూదేశమును జయించుటకు పూర్వమును, తరువాతకొంతకాలము వరకును పెద్దవ్యాపారములయందు బంగారునాణెములే చెలామణి యగుచుండెడివి. ఇప్పటికినైతము మనవారు వరహాలు మాడలు అని లెక్కించుచుందురు. వెండినాణెములుకూడ ముద్రింపబడుచు వచ్చెనుగాని బంగారుకంటె తక్కువ. చిల్లర వ్యాపారములలో ఉపయోగించుటకు రాగినాణెములుకూడ ముద్రింపబడుచుండెడివి. పల్లెటి గ్రామములయందు గవ్వలుకూడ వాడుకచేయబడుచువచ్చెను.

ఆల్టమషు అను ముసల్మాను సుల్తాను ఏలుబడియందు (1233 A.D.) తొలుత హిందూదేశమున వెండిరూప్యము ముద్రింపబడెను. ఈనాణెమునకు అప్పుడు టాంకా అనిపేరు. 1542 సం॥ షర్షా ఏలుబడియందు ఈనాణెమునకురూప్యము అనిపేరువచ్చెను. అప్పటినుండియు ప్రస్తుతమువలెనే రూప్యము 180 ధాన్యపుగింజల బరువు కలిగియున్నది. మొగలాయి చక్రవర్తుల పరిపాలనమునందు వెండినాణెములును బంగారునాణెములును స్వేచ్ఛగా ముద్రింపబడుచువచ్చినవి. లెక్కలన్నియు

రూప్యములలోనే లెక్కింపబడుచు వచ్చెను. బంగారునాణె
ములు నజరులు, కప్పములు చెల్లించుట మొదలగువానికి మా
ఉపయోగింప బడుచుండెడివి. దక్షిణ హిందూస్థానమున మా
త్రము 1818-వ సంవత్సరమువరకు, బంగారునాణెములే చెలా
మణియగుచుండెడివి. మహమ్మదీయుల దండయాత్రలు దక్షిణ
దేశమును, ఉత్తరహిందూస్థానమునలె బాధింపనందుచేత
వెండినాణెములకు బదులుగా బంగారు నాణెములే చెలామణి
అగుచుండుట తటస్థించెను. ఈస్టిండియా కంపెనీవారు వెండి
నాణెములవలన, 1818 సంవత్సరమునుండియు బంగారు నాణె
ముల చెలామణి అడుగంటెను.

నాణెముల చెలామణిస్థితి.

నాణెముల చెలామణిస్థితి ఎంత గందరగోళముగా
నున్నదియును 1773-వ సం॥ హిందూదేశమున వాడుకలో
నున్న నాణెములనుబట్టి గ్రహింపనగును. 139 రకముల బం
గారు మొహర్లును, 61 విధముల పగోడాలును (వరహాలు)
556 తరగతుల వెండినాణెములును వీటికితోడు 214 రకముల
విదేశ నాణెములును వాడుకలోనుండెడివి. భరతఖండమునకు
అన్యదేశములతో వాణిజ్యవ్యాపారము ఎక్కువగా జరుగుట
చేత, ముఖ్యముగా దక్షిణహిందూస్థానమున విదేశనాణెములు
హెచ్చుగా వాడుకయందుండెడివి. ఇట్టిస్థితిలో ఈస్టిండియా
కంపెనీవారు 1778 సం॥న కలకత్తాయందు రెండవ షాఆలము
చక్రవర్తియొక్క పాలనమునందు సిక్కా రూపాయలను
ముద్రించ నారంభించిరి.

1885 సం॥ నందు హిందూదేశమున కంతకును వెండి
రూప్యమే, ఋణతీర్మానములకును, ఎల్ల వ్యాపారములకును
చెలామణి యగునట్లుగ శాసించబడెను. ఇంతవరకును సర్కారు
వారు బంగారు, వెండినాణెములను రెండింటిని చెలామణియం
దుంచిన బాగుండునని ప్రయత్నములుసల్పెడివారు. 1835 సం॥
నుండియు వెండినాణెమునే, సర్కారుకు చెల్లవలసిన శిస్తుదస్తు
లకును ఋణతీర్మానములకును ప్రభుత్వమువారు ప్రమాణ
ముగ అంగీకరించిరి. బంగారు నాణెములకును వెండి నాణె
ములకునుగల మారకపువిలువ నేదు నిర్ణయించలేదు. ఆనిర్ణ
యమును వ్యాపారులకే వదిలిపెట్టిరి. నాటినుండియు బంగారు
మొహర్లును, వెండినాణెములును ఆంగ్లేయ ప్రభువులయొక్క
చిహ్నములతో ముద్రింప నారంభింపబడెను. రూప్యమును
మాత్రమే హిందూదేశమున చెలామణి నాణెముగా సర్కారు
వారు శాసించిరి. బంగారు నాణెములు అప్పటి బజారు ధర
ప్రకారము సర్కారు కోశాగారములయందు చెలామణి
యగుచు వచ్చెను.

1817 సంవత్సరమునుండియు, బంగారు వెండి నాణె
ములు స్వేచ్ఛగా సర్కారు టంకశాలలయందు ముద్రించుటకు
ఏర్పాటులు చేయబడినవి. ఈపద్ధతి 1893 సం॥ వరకు అవిచ్ఛిన్న
ముగా జరిగెను. నాణెముల ముద్రణమువలని లాభమును ప్రజలే
గ్రహించుచుండిరి. నాణెముల ముద్రణమువలన లాభము నెట్లు
సంపాదింపనగునని పాఠకులకు కొందరికి సందియముతోచ
వచ్చును. రూప్యముయొక్క భారము 180 వడ్లగింజలయెత్తు
ఉండవలయునని, ఇదివరకే సూచించి యుంటిమి. రూప్యము

నందుపయోగింపబడిన లోహమంతయును వెండికాదు. అందు 165 వడ్లగింజల యెత్తు వెండియును 15 వడ్లగింజల యెత్తు టంకమును ఇమిడియున్నవి. ఈ టంకము ఎత్తు లోహము యొక్క విలువ నాణెముల ముద్రణమువలన లభ్యమగును. రూప్యములనువలయువారు టంకశాలల యొద్దికిపోయి, వెండి నొసంగుచో, వెండియొక్క విలువనుబట్టి రూప్యములు చిక్కుచుండెడివి. రూప్యముయొక్క విలువ రెండు షిల్లింగులుగ నుండెడిది.

అమెరికాయందును మరి ఇతర దేశములయందును వెండి గను లపరిమితముగ బయలుపడుటచే, వెండియొక్క విలువ, బంగారుతో సరిపోల్చిచూడ క్రమముగ క్షీణించనారంభించెను. ఒకసమయమునందు రెండు షిల్లింగులకుమారుగా, రూప్యము యొక్కవిలువ ఒక్కషిల్లింగే అయ్యెను. అందువలన పౌను పదిరూపాయలు ఖరీదగుటకు మారు ఇరువది రూప్యములయ్యెను. సీమఖర్చులను (Home charges) పేర ఇండియా దొరతనమువారు సంవత్సరమునకు 18 మిలియన్ల పౌనులను ఇంగ్లాండుకు బంపవలసి యుండుటచేత, పూర్వముకంటె విశేషముగా రూప్యములను చెల్లించవలసిన యవస్థపట్టెను. వెండియొక్క విలువ తగ్గిపోవుటవలన సర్కారువారికి రెండుగత్యంతరములు కానవయ్యెను. సీమఖర్చులను ఇంగ్లాండునకు పంపునిమిత్తము పన్నులను వృద్ధిచేసి ధనమును సేకరించు పద్ధతియొకటి. రెండవది రూప్యముయొక్క విలువను అధికముచేయుట. హిందూ దేశమున పన్నులను వృద్ధిచేయుట ప్రమాదజనకమని దొరతనమువారు గ్రహించిరి. కాబట్టిరూప్యముయొక్క మారకపు

విలువను అధికముచేయవలసిన గత్యంతరమొక్కటియే సర్కారువారికి కానవచ్చెను. కొంతకాలమువరకును ఇట్టి పరిస్థితులు అంతర్జాతీయ ఒడంబడికల (International agreements) వలన చేకూరునని వేచియుండిరి.

హెర్షెలు పంచాయతి.

కాని అట్టిస్థితిలభించదని గమనించి 1893 సం॥న హెర్షెలు ప్రభువుయొక్క యాజమాన్యముక్రింద ఒకపంచాయతీ నియమింపబడినది. టంకశాలలో ప్రజలకు స్వేచ్ఛగా రూప్యములను ముద్రించియిచ్చుట ఆపివేయవలసినదనియును, ప్రజలు బంగారును టంకశాలలకు గొనిపోయి రూప్యముల నీయవలసినదని కోరుచో, ఒకవంతు బంగారునకు 15 రెట్ల చొప్పున రూప్యములను ముద్రించి టంకశాలలు సరఫరా చేయవలయుననియును ఈ పంచాయతీవారు తీర్మానించిరి. ఈపంచాయతీ తీర్మానములయొక్క సారాంశములను సంక్షేపముగా 1893 సం॥ జూను 7-వ తేదిని ఇండియా దొరతనము వారికి ఇండియా కార్యదర్శి గారంపిన తంతియందు పొందుపరచబడియున్నది. "బంగారును ప్రమాణముగా గ్రహించి టంకశాలలను ముగింపుచేసెదమని, ఇండియా దొరతనము వారు చేసిన సూచనను ఈపంచాయతీవారు అంగీకరించిరి. ప్రజలయొక్క యుపయోగము నిమిత్తమై టంకశాలలు మూసివేయబడినను, సర్కారువారు మాత్రము రూప్యమునకు పది పెన్సుల విలువచొప్పున నాణెములను ముద్రించుచునే యుందురనియును అట్టుల చేయుట మారకమునందు విలువ అధికము కాకుండునట్లు చేయు నిమిత్తమనియును దొరతనమువారు ప్రకటించవలసిన

దని ఈసభవారు అభిప్రాయపడుచున్నారు." ఈ సిఫారసు యొక్క ఫలితము వెండియొక్క విలువపెరిగి 1893 సం॥ సరికి పైనజెప్పిన (రూప్యమునకు పదిపెన్సులు) రేటుప్రకారము బంగారు వెండి నాణెముల ధరలునిర్ధారణ చేయుటకు వీలు చిక్కెను. 1893-వ సం॥ మొదలుకొని 1897-వ సం॥ వరకు కొన్ని సమయములయందు మాత్రమే రూప్యములు ముద్రింప బడినవి.

ఫౌలరు పంచాయతి.

హెర్ షెలు పంచాయతీయొక్క సిఫారసు పూర్తిచేయుట కును మరికొన్ని ఇతరవిషయములను పరిశీలించుటకును, 1898 సం॥ ఫౌలరు పంచాయతీయను పేరిట మరియొక పంచాయతీ నియమింపబడెను. ఫౌలరుపంచాయతీ వారి తీర్మానములను పూర్ణముగా ఇండియాదొరతనమువారును, [illegible] యును, ఆచరణము లోనికిదెచ్చి యుండిరి. 1907, 1913 సం॥ ల మధ్య ఇండియా దొరతనమువారికి [illegible] తటస్థించక పోయెను. ఈ పంచాయతీవారి తీర్మానముల యొక్క సారాంశము:—బంగారును [illegible] న్యాయమైన ప్రమాణముగ అంగీకరించి [illegible] యును, బంగారునాణెములను స్వేచ్ఛగా ముద్రించుటకుగాను టంక శాలలు నెలకొల్పబడవలయుననియును తీర్మానించిరి. వెండి నాణెములను ముద్రించు విషయమునమాత్రము, స్వేచ్ఛను మానుగా సర్కారు [illegible] అభి ప్రాయపడిరి.

ఈపంచాయతీవారి అభిప్రాయము ననుసరించి నాణెముల ముద్రణమునందు ప్రజలకు స్వేచ్ఛ నొసంగినను సర్కారువారి [illegible] లేకుండ యుండవలసినట్లు తీర్మానించబడెను. నాణె ములు ముద్రించుటవలన లభించిన లాభమును ప్రత్యేకనిధి (బం గారునిధి) ని [illegible] నెలకొల్పవలసినట్లుగా [illegible] బడెను. [illegible] యును [illegible] బంగారు [illegible] విలువను తెలుపును, బంగారు నాణె ములు ముద్రించుటకు ఒక టంకశాలయును ఉండవలెనని గట్టిగా నిశ్చయించబడెను. [illegible] ఇప్పటివలె బంగారును మాత్ర సామ్యమునకు ప్రమాణముగ అంగీకరించి, బంగారు నాణెముల విలువను [illegible] చేయుట [illegible] సన్నాహమును [illegible].

[illegible] సిఫారసులను గవర్న్మెంటు [illegible] పట్టిక [illegible].

గవర్న్మెంటు [illegible] 1890 సం॥ జూలై 25 వ తేదీని వ్రాసిన [illegible] (Despatch) [illegible] నాణెములను ప్రమాణముగ అంగీకరించుటకు [illegible] పంచాయతీ వారి [illegible] తీర్మానము [illegible] ఖండితముగా [illegible]. పంచా యతీవారి తీర్మానములను ఎవ్విధమైన [illegible] మును లేకుండ అమలులోనికి తెచ్చుటకు తగిన ఏర్పాటులను చేయవలసి దని కోరెను. ఈ ఉద్దేశ్యముతోనే ఇంగ్లాండునుండి [illegible] యగుచున్న సవరినును (పెద్దకాసు) సర్కారువారు ఎల్లవిధ

యములయందును ప్రమాణముగ అంగీకరించ వలయునని యును, హిందూదేశమున సవరనునే వాడుకలో నుంచు నట్లుగ శాసించవలయు ననియును ఇండియాకార్యదర్శి సిఫారసు చేసెను. "బంగారు నాణెములను ముద్రింపించు కొనుటకు ఎవ్విధమైన అభ్యంతరములు లేకుండ టంకశాలలు ప్రజలకు ఉపయోగము నిమిత్తమై విడిచిపెట్టబడ వలయునని" ఈ ఉత్తరమునందు వ్రాయబడెను. వెండి నాణెములను టంకశాలల యందు కొన్ని నియమములకు లోబడి ముద్రించుటకు మాత్రము సర్కారు వారంగీకరించిరి. ఇంగ్లాండు దేశము నుండి ఇండియాదేశమునకు దిగుమతి యగు వస్తువులయొక్క విలువను చెల్లించుటలో ఇంగ్లీషు బ్యాంకులహుండీలు కొనుటకంటె రూప్యములను రవాణా చేయుటయే లాభముగా నుండునని తోచినపుడు, ఆరూప్యములకు బదులు సమానమ విలువగల బంగారును బంగారుప్రమాణ నిధులనుండి ఇచ్చుచుండవలెనని ఇండియా కార్యదర్శి తెలియపరిచెను.

ఫౌలరు పంచాయితీయొక్క తీర్మానముల నామోదించియు వాటిని ఆచరణములోనికి ఇండియా దొరతనమువారు గొనిరాకుండుట కడువిచారకరము. ధనము నిలవయున్న పుడెట్లు వ్యవహరించవలయు ననువిషయము ఆలోచించ వలసి యున్నది. నిలవయున్న ధనమును పన్నులు తగ్గించు విషయమునగాని, లేదా ఆరోగ్య విద్యావిషయికములగు ప్రజోపకరములైన పనుల నిమిత్తమై వెచ్చించుటగాని చేయవలసినదని ఫౌలరు పంచాయితీవారి అభిప్రాయము. అటుల చేయుటమాని ప్రభుత్వమువారు అజ్ఞానముచే ఆవరింపబడి యున్న హేతువను

వలె, సర్కారు కోశాగారములయందు బంగారును ఎవ్విధమైన ఉపయోగమునకును కొనిరాకుండ పాతర వేయుటగాని, లేదా "వర్తకమునయొక్క సుభుస్థు" నిమిత్తమను నెపమున ఇంగ్లాండునందు నిలవచేయుటనుగాని, చేయుచున్నారు. నిలవయున్న ధనము 1907 సం॥ నకు 46 మిలియనుల పౌనులకు పెరిగినది. ఇంగ్లాండునందలి బ్యాంకరులు కౌన్సిలు హుండీలను కొనుట కలవాటు పడిరనియును, ఆ హేతువు వలన ఈపద్ధతి ఉంచితీర వలయుననియును సర్కారువారు సమాధానము చెప్పుచున్నారు. 1913 సంవత్సరము నందు నెలకొల్పబడిన ఛాంబర్లెయిను సభవారు, కౌన్సిలు హుండీలు తరుచుగా వర్తక వ్యాపారముల కనవసరమగు సమయముల నైతము విక్రయింపబడుచు వచ్చెనని, ఒప్పుకొనక తప్పినదికాదు. ఈపద్ధతి ననలంబించుట వలన, ద్రవ్యము ఎప్పుడు అత్యావసరమో అట్టి సమయములయందు దొరకుట కష్టముగానున్నది. అందువలన హిందూదేశముయొక్క ద్రవ్యము దేశాభివృద్ధికి తోడ్పడుటలేదు.

కౌన్సిలుహుండీల అమ్మకమునసేమి.

ప్రతిబుధవారమును ఇండియాకార్యదర్శి ఈహుండీలను అమ్ముచుండును. హుండీలనగా బొంబాయి, మదరాసు, కలకత్తా గవర్నమెంటు కోశాగారములపై ఇవ్వబడిన ఆజ్ఞాపత్రములు కౌన్సిలు హుండీలను ఈకోశాగారముల ఎదుట దాఖలు చేసిన వారికి సొమ్ము ఇవ్వబడును. కౌన్సిలు హుండీలయొక్క ఖరీదునకు, లండనునందు సరకులను కొనిన వ్యాపారస్తులు చెల్లించవలసిన బంగారును ఇండియా కార్యదర్శి గ్రహించుచుండును.

కౌన్సిలు హుండీలను తపాలా ద్వారా పంపుటకు ఒక వారము
దినములు పట్టునని ఎంచి, తొందరగా నున్న యెడల తంతివార్తల
ముగా కూడ మార్చబడుచు వచ్చుచున్నవి. కౌన్సిలు హుండీల
విలువకంటె కొంచెము సొమ్ము అధికముగా ఇచ్చినయెడల
తంతివార్తలముగా పంపబడును. ప్రతి బుధవారమును చేయు
చున్న అమ్మకములు చాలనట్లు, అప్పుడప్పుడు నిజమైన అవ
సరముల నిమిత్తముగాని, ముందుకొరకైనగాని, ప్రత్యేక వేల
ములుగూడ వేయుట తటస్థించుచుండును. ఈప్రత్యేక వేలము
లయందు ఇండియా కార్యదర్శిగారు చాల తక్కువ ధరలకు
హుండీలను విక్రయించుచుందురు. ఈవేలములయందు ఇవ్వ
బడిన హుండీలు బంగారు ప్రమాణ నిధికిని, బ్యాంకినోట్ల నిధి
కిని ఇవ్వబడుచుండును. ఈహుండీలు తరుచు బంగారును ఎగు
మతి చేయుటకగు ఖర్చుకంటె సైతము తక్కువగా విక్రయింప
బడుచుండుటచేత, హిందూదేశమునుండి విదేశ బంగారము
పరదేశయాత్ర వెడలుట తటస్థించుచున్నది.

పంచాయతీ తీర్మానములను అమలు చేయనందువలని నష్టములు.

ఫౌలరు పంచాయితీవారు బంగారును చలామణి నాణ్య
ముగా అంగీకరించవలయునని తీర్మానించినను ఇండియా ప్రభు
త్వమువారు ఆతీర్మానమును ఆచరణములోనికి గొనిరాకుండుట
విషాదకరము. 1904—1908 సంవత్సరముల మధ్య, [illegible]
మిలియన్ల పౌనుల విలువగల రూప్యములను ముద్రించిరి.
వాడుకలోనున్న నాణెములలో బంగారుకంటె వెండి నాణె

ములు మూడురెట్లు అధికముగ వాడబడుచున్నవి. సుమారు
180 కోట్ల రూప్యములు ప్రస్తుతము వాడుకయందున్నవి.
ఇట్లుచేయుట, ఫౌలరు పంచాయితీవారి సిఫారసులకు వ్యతి
రేకము. ఇది ఇంతటితో పూర్తికాలేదు. ఫౌలరు పంచాయితీ
వారు బంగారు నాణెములను ఇండియాలోనే చేయవలసినదని
తీర్మానించిరి. సర్కారువారికి అట్లుచేయుటకు వీలు లేనియెడల
నాణెములను ముద్రించుటవలన దొరతనమువారికి లభించుచున్న
లాభమును ఇండియాయందే బంగారు నిధిగా కూర్చినచో,
మారకమునకంతయు సహాయకారిగా నుండియుండును. ఈ
లాభమునంతయు హిందూదేశమున నుంచక లండను నగరమున
సత్తుపత్రముల ఆకారముగ (Securities) నుంచబడినది. ఇండి
యాదేశమున, తగినంత బంగారును నిలవచేయక పోవుట సరి
గదా, 4 మిలియన్ల పౌనులు వెండినాణెములయందు నిలవ
చేయబడుచున్నవి. నాణెముల [illegible] అమలు
[illegible], ఇప్పటికిని దాచబడుచున్న బంగారు
ప్రమాణ నిధియందలి సగముధనము ఇనుపదారుల వ్యయము
క్రింద 1906-1907 సంవత్సరములయందు వినియోగించబడె
ను. సామ్రాజ్య శాసననిర్మాణసభయందలి దేశీయ ప్రతినిధులు
ఈ అన్యాయమును గూర్చి ఎంతయు ఉద్ఘోషించిరి. ఇట్టి పద్ధతి
నవలంబించుటవలన 1907 సం॥ మందు అమెరికా దేశమున
సంభవించిన ధనక్షోభము వలన (Monetary crisis) మన
ప్రభుత్వమువారు చాల చికాకు పడవలసివచ్చెను. ఇండియా
కార్యదర్శిగారి హుండీలు చెల్లక పోవుట తటస్థించెను. హార్డింజ్
ప్రభువగారును, కోశాగారమంత్రియగు సర్ గై ఫ్లీట్వుడ్

విల్సనుగారును ఫౌలరు పంచాయితీ తీర్మానములను పూర్ణముగా ఆచరణములోనికి గొని రావలసియున్నదని వ్రాసిచ్చిరి. 1913 సంవత్సరమునందు గవర్నరు జనరలుగారు టంకశాలలు బాహాటముగా ప్రజల ఉపయోగమునిమిత్తమై యుంచవలయునని ప్రబలవాదనను సల్పిరి.

తిరిగి నాణెముల ముద్రణ ప్రారంభము.

ఇంతవరకు హెర్షెలు, ఫౌలరు పంచాయితీల తీర్మానములును, దొరతనమువారు ఆతీర్మానముల యెడల ఎట్టి సానుభూతిని కనబరచినదియును చర్చించబడినది. 1900 సం॥ నుండి నాణెముల ముద్రణ తిరిగి ఆరంభమయినది. బ్యాంకినోట్ల నిధి (Paper currency) యందుంచబడిన బంగారుతో వెండినికొని సర్కారువారు రూప్యములను ముద్రించుటకు ఆరంభించిరి. 1910 సం॥ మార్చి 31-వ తేదీ సరికి సర్కారువారు ముద్రించిన రూప్యములు సుమారు 17 కోట్లు రూప్యముల ముద్రణము వలన దొరతనము వారికి విశేషముగ లాభము లభించుచున్న దన్న సంగతి ఎల్లరెరింగినదే. ఈలాభమును మారకమునందు కలుగుచుండెడి విలువయొక్క తేడాలను సవరించుటకుగాను 1901-వ సం॥ నందు ఒక బంగారు నిధి (Gold reserve fund) నెలకొల్పబడియెను. 1906-వ సంవత్సరమునందు ఈలాభములో 6 కోట్ల రూప్యములు ఇండియాయందుంచుటకు తీర్మానించబడెను. నాటినుండియు ఈనిధి 'బంగారుప్రమాణనిధి' యనుపేర బరగుచున్నది. 1907-వ సం॥ నందు ఈనిధియందలి ధనములో చెరిసగము ఇనుపదారులకునై

వ్యయపర్చబడెనని ఈవరకే ముచ్చటించితిమి. 1906-1907 సంవత్సరముల మధ్య ఇండియా దొరతనమువారి నాణెముల ఉత్పత్తి పద్ధతి (Currency policy) హ్రాస్వదృష్టిని కలిగినదియై, క్రమముగా నుండలేదని, అధికార వర్గమును పొగడు కీన్సు (Keynes) సైతము ఒప్పుకొనక తీరినదికాదు. ఈనిధియందు 1908-సంవత్సరాంతమున 18 కోట్ల రూప్యములవరకు వెండి పెరిగినది. 1913-వ సంవత్సరాంతమునకు 'బంగారు ప్రమాణనిధి' యందుంచబడిన ద్రవ్యము 22,571,333 పౌనులు. ఈనిధిని ఇంగ్లండునందు నెలకొల్పుటచేత, ఇండియా దేశమునకు విశేషనష్టము కలుగుచున్నది.

ఛాంబర్లెయిను పంచాయతీ.

ఛాంబర్లెయిను (1913) సభవారు బంగారు ప్రమాణనిధి యందలి, వెండికోశాగారమును తీసివేసి, ఈనిధియందలి రూప్యములను బ్యాంకినోట్ల నిధికి మార్చవలయునని అభిప్రాయము నొసంగిరి. ప్రస్తుతము ఈనిధి బంగారును, బంగారు హామీగల పత్రములను (Gold securities) కలిగి యున్నది. ఛాంబర్లెయిను సభవారుకూడ బంగారునే పెంపొందించ నుంకించుట చేత ఈవిషయమున యుద్ధము సంప్రాప్తించక పోయిన చో గొప్పమార్పులు జరిగియుండును. అయినను ఈనిధియందలి వెండినాణెములు పంచాయితీవారి తీర్మానము ప్రకారమే బ్యాంకినోట్లనిధికి మార్చబడినవి. అందువలన ఈనిధియందలి ధనమంతయు బంగారుక్రిందగాని, బంగారు హామీగల పత్రముల క్రిందగాని ఉంచుట తటస్థించినది. 1915 సంవత్సరాంతమునకు (అనగా 31 మార్చి ఆఖరుకు) ఈనిధియొక్క విలువ

25½ మిలియన్ల పౌనులు ; అందు సగము బంగారు పత్రముల* క్రిందను, ఒకకోటి డెబ్బది లక్షల రూప్యములు బంగారు రూపకముగను ఇంగ్లండునందుంచబడెను; శేషించిన ధనము లో ఇండియాయందు 5¼ మిలియన్ల పౌనులు బంగారు నాణెములుగను, 7 మిలియన్ల పౌనులు ఇండియా కోశాగారముల నిలవ నిమిత్తమును ఉంచబడినవి. ఇంగ్లాండునందు బంగారు-పత్రములక్రింద నుంచబడిన ధనము ఇటీవల ఇంగ్లీషు యుద్ధ ఋణముగ మార్చబడినది.

బ్యాంకినోట్లు.

ఇక బ్యాంకినోట్లను గురించి వ్రాయవలసి యున్నది. 1839-43 సం॥ ల మధ్య రాజధాని బ్యాంకులకు, అడిగిన వెంటనే సొమ్ము చెల్లించుపద్ధతిని నోట్లు జారీచేయుటకు అనుజ్ఞ యొసంగబడెను. 1862 సంవత్సరమున ఈ నోట్లను గురించి సర్కారువారు ప్రత్యేకముగా ఒక శాఖను నెలకొల్పిరి. బ్యాంకినోట్ల (కరెన్సీనోట్లు) ను గురించి, 1910-వ సంవత్సరము నందు ఒక చట్టము జారీ చేయబడెను. ఆసంవత్సరమున, 5,10,50 రూప్యములవిలువగల అన్నినోట్లును ఇండియాదేశ మున చెలామణియగు నట్లుగను, ఈనోట్లేగాక గవర్నరు జన

* బంగారుపత్రములనగా ఆపత్రములు చెలామణియందు పత్రము లకుబదులు సొమ్మియ్యవలెననిన బంగారు నాణెములనే చెల్లించవలెను. ఇప్పుడు అమలులోనున్న నోట్లు వెండిపత్రములగుటచేత మనము సర్కారును, బంగారును ఇమ్మనికోరినను ఇచ్చుటకు బాధ్యతలేదు. వెండిని అనగా వెండినాణెముల నిచ్చుటకుమాత్రము సర్కారుబాధ్యులు.

రల్గుగారు ఇండియా గెజటునందు ప్రకటించిన ఏనోటులయినను ఇండియాయందంతటను చెలామణియగునుండవలెనని శాసించ బడినది. 1911 సం॥ నూరు రూపాయిల నోట్లు కూడ సర్వత్ర చెల్ల వలసినట్లుగా తీర్మానించబడెను. 1911-వ సం॥ కరెన్సీ నోట్లనిధి 12 కోట్లనుండి 14 కోట్ల రూప్యములవరకును అధి కము చేయబడెను. కరెన్సీనోట్ల శాఖవారు, హద్దులేకుండ ఎన్నినోట్లను ప్రకటించ వలయునన్న (Issue) అన్నినోట్లను ప్రకటించుటకు హక్కును గలిగియున్నారు. కరెన్సీనోట్లనగా అడిగిన తక్షణమే సొమ్ము చెల్లించవలసిన షరతును గలిగి యున్న, ఇండియా దొరతనమువారి, ప్రామిసరీనోటు. ప్రస్తు తము వాడుకలోనున్న అన్నినోట్ల మూల్యమును, బంగారు వెండినాణెముల క్రిందగాని, గ్రేటుబ్రిటను, ఇండియా దొర తనముల ఋణపత్రములక్రిందగాని జాగ్రతపర్చబడియే యున్న ది. ఈ ఋణపత్రముల క్రింద 140 మిలియన్ల రూప్యములకు పైబడి యుండరాదనియును అందు నలభై మిలియన్లు బంగారు పత్రములక్రింద ఇంగ్లాండునందుండునట్లుగను తొలుత శాసించ బడినది. 1891-వ సం॥సరికి అనేక చట్టముల మూలమున 30 మిలియన్లుమాత్రము బంగారు పత్రములయందుంచునట్లుగ శాసించబడెను. కరెన్సీనోట్ల హామీ నిమిత్తము ఏర్పర్చ బడిన నిధియొక్క మొత్తము 1911-వ సంవత్సరమునందు 140 మిలియన్లుగ నిర్ణయింపబడినది ; అందు 20 మిలియన్లు (Consols) సర్కారువారు తీసికొను అప్పుపత్రములు క్రింద నుంచవలసినట్లుగకూడ నిశ్చయించబడెను. ప్రస్తుతము ఈనిధి యందున్న ధనము (1,529 లక్షుల రూప్యములు) 10,200,00

పౌనులు. యుద్ధము ఆరంభమగునరికే ఈసు, ఇంతకంటె చాల హెచ్చుగ నుండెడిది. 75,44,00,000 రూప్యములు. ఇందులో 9,15,00,000 రూప్యములు ఇంగ్లాండునందు బంగారుక్రిందను, నాణెములక్రిందను 40,00,000 రూప్యములు పత్రములక్రిందను ఉంచబడుచు వచ్చినవి. యుద్ధపరిస్థితులందున కొందరు నోట్లను వాపసుచేసి బంగారును గ్రహించుటకు ఆరంభించిరి. తొలుత దొరతనమువారు పదివేలపౌన్లనోట్లను ఒక్కసారి దాఖలుచేసినవారికి మాత్రమే బంగారు నొసంగసాగిరి. దానికికూడ కొందరు సిద్ధముగ నుండుటచేత, కరెన్సీనోట్లకు బంగారు నాణెముల నొసంగుట ఆపుచేయబడెను. బంగారునకు కొందరు నోట్లువాపసుచేసి గ్రహించుటచేత 1914 సం॥ నవంబరు సరికి 60 కోట్ల రూప్యములుగల మొత్తపునిధి 1915 సం॥ నవంబరుసరికి 61 కోట్ల రూప్యము లయ్యెను.

టంకశాలలయందు ప్రజలకు స్వేచ్ఛగా నాణెములను ముద్రించి ఇవ్వవలసిన ఆవశ్యకత.

ఇండియాయందలి టంకశాలలు బంగారునాణెములను ముద్రించుటకు ఎవ్విధమైన ఆటంకములను కలుగనీయకుండ శాసించవలయునని దేశీయ ప్రముఖుల యాశయము. ఆర్థిక విషయములనుబట్టి ఆలోచించిన యెడల ఇందలి ఆవశ్యకత వ్యక్తీకరించబడును. 1898-వ సం॥ న సమావేశమైన ఫౌలరు పంచాయితీవారు కూడ దేశీయ ప్రముఖుల అభిప్రాయ ప్రకారమే తమ తీర్మానము నొసంగిరి. అట్టి స్వేచ్ఛయగు టంకశాలలు లేనిచో మారకమునందు గలిగిన వెలల మార్పు తేడాలను వెంటనే సవరించుటకును, ధరలయందును వట్టములయం

దును (Prices & Discounts) గలిగిన తేడామొత్తములను సరిపుచ్చుటకును వీలు చిక్కదు. 1913 సం॥ ఇండియా దొరతనమువారి విమర్శనమునందు కూడ ఈభావమే వ్యక్తీకరించబడెను. బాహాటముగా నాణెములను ముద్రించుట లేనిచో, 1907 13 సం॥ ల మధ్య తటస్థించినట్లే నాణెముల ముద్రణము అప్పటి కోశాగారమంత్రియొక్క ఊహాపోహలనుబట్టి యుండును; క్రొత్తనాణెములను చేయుటగాని, చేయకపోవుటగాని, ఆక్కాలమునం దధికార వర్గముతో సంబంధమును గలిగిన రాజస్వ కూటమువారి (Financial clique) ఆశయముల ననుసరించి రాజ్యతంత్రమును నడుపుటకు వీలుండును. హిందూదేశ పురోభివృద్ధికి ఇట్టి పద్ధతి చాల ఆటంకకరము. భారతదేశము తిరిగి కళావాణిజ్య వ్యాపారాదులయందు వాసిగాంచి, పేరెన్నికగన్న రాష్ట్రములతో సమాన గౌరవమర్యాదలు బొందవలయునన్న, తత్ఫలప్రాప్తికి చౌకగా లభించెడి మూలధనము అపారముగ చిక్కవలసి యున్నది. ఇంగ్లాండునందలి వ్యాపారస్థులకు వలయు మూలధనము నూటికి 3 మొదలు 5 వంతున వడ్డీకి చిక్కుచున్నది. భారతీయ వర్తకుల కన్ననో 6 మొదలు 10 వరకు వడ్డీనిచ్చిన గాని మూలధనము అందుబాటు లేదు. ఇట్టిస్థితిలో ఇండియాదేశము యొక్క ద్రవ్య (కరెన్సీ) పద్ధతిని ఇండియాయందు మూలధనము తక్కువవడ్డీకి దొరకునట్లు ఏర్పరచవలసి యున్నది. ఇది గొప్ప ఆవశ్యకము. ప్రభుత్వమువారు అమలులో నుంచిన పద్ధతివలన చాల నష్టములు సంప్రాప్తించుచున్నవి. పరదేశములనుండి, మూలధనము చౌకగా ఇండియాయందు ప్రవేశిం

చుటకు తగిన అవకాశములు కలిగించుటలేదు. ఇంతేకాక హిందూదేశమున (విశేషశ్రమపడి) కూడబెట్టిన మూలధనమును సైతము, ఇండియాయొక్క స్వంతకార్యములయందు, వినియోగించుకొనుట కాస్కారము లేకుండ, లండను నగరమునకు గొనిపోయి, ఆనగరమునందలి పణ్యాచక్రముయొక్క లాభము నిమిత్తమై ఉపయోగింపబడుచున్నది. సీమఖర్చుల నిమిత్తమను పేరిట ప్రతిసాలునను ఇండియానుండి 18 మిలియన్లపౌనులు ఇంగ్లాండునకు పంపబడు చున్నవి. మేజరు విన్గేటుగారి అభిప్రాయమున ఈ ధనసంచయము నంతయు, సముద్రమున వైచిన ఎంతలాభమో, ఇండియాకు అంతలాభము సంప్రాప్తమగుచున్నది. సీమఖర్చుల సంగతి యిటుండనిండు! అంపుల కవసరమైనంత ద్రవ్యమును కౌన్సిలు హుండీలను విక్రయించి కార్యదర్శిగారు వ్యవహరించిన బాగుగనే యుండును. ఆసొమ్ముగాక ఒకసంవత్సరమున, 14 మిలియన్ల పౌనుల హుండీలను ఇండియా కార్యదర్శి విక్రయించినట్లుగా, వెబ్బుగారు సూచించిరి. వెబ్బుగారి లెక్కప్రకారము అనవసరముగా, ఇండియానుండి సీమకు గొనిపోయిన మూలధనము 50 మిలియన్లపౌనులు.* ఈద్రవ్యము ఇండియాయందలి స్వదేశ బ్యాంకర్లకు అప్పుగ నీయబడక, ఇంగ్లాండునందు ఋణమీయబడుచున్నది. ఇదియెంతయు శోచనీయము. శామ్యూయల్, మాంటెగు అండు కంపెని అనుబ్యాంకర్లకు రెండు మిలియన్ల పౌనులు, చలనములేని ఋణముగ (Standing loan) ఈయబడినట్లు వెబ్బుగారు ప్రకటించిరి. చలనములేని ఋణమనగా

* D. P. Webb's Advance India.

స్వల్పకాలమునకు తొలుత తక్కువవడ్డీకి ఋణమునిచ్చి, వాయిదా దాటినవెంటనే, తిరిగి క్రొత్త ఋణముక్రింద లెక్కలలో నమోదు చేయుచుండుట యనుట. ఇందలి ఫలిత మేమనిన, ఐశ్వర్యవంతమగు ఇంగ్లాండుదేశమునకు తక్కువ వడ్డీకి మూలధనము నొసంగుచు, ఇండియాయందలి వ్యాపారములు తగిన మూలధనములేక క్రుంగుచుండుట. ఐశ్వర్యవంతుల ఐశ్వర్యము వృద్ధిగాంచుటయును, ఇండియాయొక్క దరిద్రస్థితి ఎన్నటికిని విమోచనమగు సాధనాంతరములు గనుంగమియు, తటస్థించుచున్నది. దీనికితోడు, ఇండియా దొరతనమువారు సర్కారు కోశాగారములయందు, నిలవధనమును అనుపయోగముగ పాతర వేయుచుండుటకూడ, ఇండియా వ్యాపారస్థులకు కష్టనష్టములను గలిగించుచున్నది. ఛాంబర్లెయిను పంచాయితీవారు (1913) రూప్యముయొక్క మారకపు విలువను తరచుగా మారకుండునట్లుగ స్థిరపద్ధతిపైని నిర్ణయించ నలయుననియును, హిందూదేశమున బంగారు నాణెములను ముద్రించు టంకశాలలుండి తీరవలయుననియు స్పష్టముగ తీర్మానించకున్నను, అట్టిపద్ధతియందు తమకుగల సానుభూతిని వెల్లడించిరి. ఇండియాదొరతనము వారు ఫౌలరు పంచాయితీ వారి తీర్మానమును, ఇప్పటికైన అమలులోనికి గొనితెచ్చి, భారతీయుల ఇక్కట్టులను బాపెదరుగాక!

బంగారు నాణెముల చెలామణి.

ఛాంబర్లెయిను పంచాయతీవారు ఇండియాయందు బంగారునాణెముల చెలామణియొక్క ఆవశ్యకతను గమనించ

లేదు. కాని బొంబాయిపట్టణమున, లండను టంకశాలాధ్యక్షుని యాజమాన్యముక్రింద, ఒక టంకశాలనుస్థాపించి, ఇంగ్లాండు నందువలె కాసులను, అరకాసులను ముద్రించుటకు, తమకుగల సానుభూతిని వెల్లడించిరి. ఇండియాయందు వేరొకతరహా బంగారు నాణెములు ముద్రించుటచో, ఇదివరకే గందరగోళముగానున్న నాణెముల చెలామణి పద్ధతియందు చిక్కులు తటస్థించు ననియును, క్రొత్తనాణెములు ప్రజల ఆమోదమును పడయవనియును, క్రొత్తనాణెములను గ్రహించుటకు ప్రజలు జంకుదురనియును వీరభిప్రాయమిచ్చిరి. ఈ పంచాయితీవారి నివేదనపత్రమునందు, సర్ జేమ్సు బెగ్బీయను నాతడు పంచాయితీవారితో నేకీభవించక స్వంతముగా వ్రాసిన అభిప్రాయమునందు (Minute) దేశీయ ప్రముఖుల కోరికను వ్యక్తీకరించెను. ఇంగ్లాండునకువలె, కాసులను, అరకాసులను తయారుచేయక ఇండియాయొక్క ఆశయములకనువగు క్రొత్త నాణెములను తయారుచేయుట యుత్తమమని వ్రాసెను. బెగ్బీవారి యభిప్రాయమే భారతీయుల అభివృద్ధికి తోడ్పడును.

ఛాంబర్లెయిను పంచాయతివారి తీర్మానములు.

ఛాంబర్లెయిను పంచాయతీ వారు ఇండియాకు బంగారు నాణెము లవసరము లేదని తీర్మానించిరి. బంగారు నాణెములను, ఇండియాయందు వాడుకయగునట్లు చేయుట అనవసరమని ఈకమిటీవారి ఎదుట నివేదించిన హేతువులను, వానికి పంచాయితీవారొసంగిన సమాధానములను ముందుగా నిచట పొందుపరచి, తరువాత ఇతరచర్చకు పూనుకొనెదము.

1. వెండినాణెములకంటె, బంగారునాణెములు మూల్యమును హెచ్చుగ గలిగి యుండుటచేత ఒక ప్రాంతమునుండి మరియొక ప్రాంతమునకు గొనిపోవుటకు చాల సౌకర్యముగ నుండునని దేశీయులయభిప్రాయము. గొప్ప మొత్తములను చెలామణి చేయవలసినప్పుడు బ్యాంకినోట్లను (కరెన్సీనోట్లు) ఉపయోగించవచ్చుననియు, చిన్న మొత్తములను చెల్లించవలసి వచ్చినప్పుడు రూప్యములను వాడుక చేయవచ్చుననియు వీనికి కమిటీవారి సమాధానము. పెద్దవియు చిన్నవియు కాని మొత్తముల చెలామణి ఎట్లు చేయవలసినదియును కమిటీవారు తృప్తికరముగ సమాధానము నీయజాలరైరి.

2. ఉత్తమమైన నాణెముల చెలామణిపద్ధతిని (Ideal currency) దేశమునందు నెలకొల్పుటకు, బంగారునాణెములను వాడుకలోనికి తెచ్చుట, ముఖ్యసోపానము. ఆర్థికశాస్త్రజ్ఞులందరును బంగారును విశేషముగా నుపయోగించుచో, చెలామణిపద్ధతి సులభముగను [illegible] జరుపుటచే, ఉత్తమపద్ధతియని ఏకాభిప్రాయమును గలిగియున్నారు. ఆపద్ధతియే ఇండియాయందు అమలులోనికి తేవలెనని దేశీయుల వాదము. ఏదేశచరిత్రలోను ఈపద్ధతి అమలులోనున్నట్లు కనుపించదని కమిటీవారు సమాధానమునొసంగిరి. వ్యాపకముగ సొమ్ము చలామణిచేయబడుచున్నను, నోట్లపద్ధతియే ఎక్కువ లాభకరమైన పద్ధతియని వారియభిప్రాయము. ఈసమాధానము తృప్తికరముగ లేదు.

3. బంగారునాణెములు దేశమున చెలామణియగుచుండినయెడల దేశమునకు గౌరవము వచ్చుననియును, వెండినాణెములను గలిగియుండుట దేశము ఇంకను అభివృద్ధిలోనికి రాక

వెనుకబడియున్నదని చాటుచుండుననియును దేశీయులు చెప్పిన మరియొక కారణము. విదేశములకు ఈయవలసిన మొత్తములకు ఇండియా బంగారునే ఇచ్చుచున్నది. గనుక దేశీయగౌరవమునకు లోపములేదని కమిటీవారిజవాబు. ఇండియాయందు బంగారు నాణెములు చెలామణి యగుటకును, విదేశములకు ఇంగ్లండు లోనున్న బంగారు ప్రమాణనిధులనుండి బంగారు నొసంగుట యు సమానము కాజాలవు. కమిటీవారు ఇచ్చిన సమాధానము నిజస్థితిని మరుగుపరచుటకై చేసిన యుక్తికాని వేరుకాదు.

4. మారకముయొక్క విలువలో తేడాలురాకుండ చేయుటకు బంగారు నాణెములను విస్తారముగా వాడుకలో నుండునటుల ఏర్పాటులను జేయుటయే ఉత్తమమార్గమని దేశీయుల అభిప్రాయము. కమిటీవారు ఈ వాదమునకు రెండు సమాధానముల నిచ్చియున్నారు. i. జర్మనీ, ఫ్రాన్సు మొదలగు దేశములు, బ్యాంకినోట్లనే వారిదేశమున వ్యాపారమునందు చెలామణిగ గలిగియుండియు, బంగారునిధులను నెలకొల్పుట వలనను ఇతరదేశములనుండి తమకురావలసిన ద్రవ్యముయొక్క హుండీలను నిలవయందుంచుట వలనను, ఇతర దేశములకు తాముచెల్లించవలసిన సొమ్మును చెల్లించ గలుగుచున్నారు. ii. కొంచెము బంగారము మాత్రమే వాడుకలో నున్నయెడల, ధనక్షోభలు (Money crises) సంభవించినపుడు విదేశముల కెగుమతి చేయబడుటకు వీలుచిక్కకుండును. విస్తారముగా బంగారునాణెములు దేశమున వాడబడుచున్నయెడల దేశము యొక్క బంగారునిధులు అందుకు తగినట్లుగనే క్షీణదశయందుండును. గనుకమారకమునకు సహాయభూతము కాజాలదు.

కమిటీవారి మొదటి ఆక్షేపణకు జర్మనీ ఫ్రాన్సుదేశముల ఆర్థిక న్యాయములతో ఇండియా ఆర్థిక న్యాయములను పోల్చుట సాహసమని మాసమాధానము. ఇతరదేశములలో ధనక్షోభలు సంభవించినపుడు వారు ఏప్రకారముగ సమర్థించు కొనుచున్నారో ఆప్రకారమే ఆయాస్థితిగతుల ననుసరించి ఇండియా దొరతనమువారు సమర్థించు కొనగలరని కమిటీవారి రెండవ ఆక్షేపణకు మాసమాధానము.

5. క్రొత్తరూప్యములను తరుచుగాముద్రణముచేయుట సమంజసము కాదనియును, బంగారునాణెములు విరివిగా చెలామణియగు చుండినయెడల క్రొత్తరూప్యములను ముద్రించుటకు అవసరముండదనియును, దేశీయులఅభిప్రాయము. బంగారు నాణెములు విశేషముగా వాడుకయందున్నను అవి రూప్యముల చెలామణినితగ్గింప జాలవనియును బ్యాంకినోట్లు చెలామణి తగ్గించుననియును, అందువలన క్రొత్త రూప్యములను ముద్రించుట అవసరమగుచునే యుండుననియును, కమిటీవారి ఆక్షేపణ. బ్యాంకినోట్లశాఖయొక్క అధికారులు (Paper currency commissioners) ఇట్టి అభిప్రాయమును కలిగియున్నారనియును, ఇందుకు తార్కాణగా బంగారు నాణెముల వాడుక విరివియగుచున్నకొలదిని పంజాబు, పశ్చిమోత్తర పరగణాలయందునోట్లు తక్కువగా ఖర్చగుచున్నవనియును కమిటీవారు తెలియపర్చుచున్నారు.

6. ఇండియాయందు బంగారు నాణెముల చెలామణి అమలులో నుండనియెడల ఇండియాలో నాణెముల చెలా

మణిపద్ధతి నిజమైనదిగాక కృత్రిమమైనదగుటయును ఇతర దేశీయులవలన వ్యవహరింప బడుచుండుటయును సంప్రాప్తించుచుండునని దేశీయులవాదము. ఇతరులు చెలామణిపద్ధతిని, వ్యవహరించుచున్నంత మాత్రముననే ఇట్టిపద్ధతి నింద్యమైనదనుట న్యాయముగాదనియును వెండివిలువకంటె హెచ్చువెలకు రూప్యము చెలామణియగుచున్నంత మాత్రమున పద్ధతిని నిందించరాదనియును కమిటీవారి సమాధానము. రూప్యములు వాణిజ్య వ్యాపారములయొక్క అవసరములనుబట్టి ముద్రణమగుచున్నవనియును, దొరతనమువారు తమఇచ్ఛవచ్చినట్లెల్లనాణెముల ముద్రణమునకు గడంగుట లేదనియును కొన్ని నిబంధనలకులోనై వ్యవహరించుచున్నారనియును కమిటీవారి వాదము. దొరతనమువారెట్టి నిబంధనలకు లోనై రూప్యములను ముద్రించుచున్నదియును, తాత్కాలిక కోశాగార మంత్రియొక్క కటాక్ష వీక్షణముల కీపద్ధతిలోనై యుండుననియును, అధికారవర్గమునకు సంబంధించిన రాజస్వ-కూటమువారి ఆశయములనుబట్టి నూతననాణెముల నిర్మాణ ముండుననియును ఇదివరకే సూచించి యున్నాము.

7. బంగారులోహము విశేషముగా ఉత్పన్నమగుచుండుటవలన ప్రపంచమునందు ముందుముందు వెలలు విపరీతముగ పెరిగిపోవుస్థితి రానున్నదిగాన హిందూదేశముకూడ ప్రపంచమును సముద్ధరించుటకునై బంగారును విస్తారముగా ఆకర్షించునట్లుచేయుట సమంజసమని దేశీయులవాదము. ఇతర దేశములవలె ఇండియాయందు బంగారు విస్తారముగా, నెలకొని యుండునట్లుచేయుట యుక్తియుక్తము కాదనియును,

ఇండియాయొక్క వాంఛలను అవసరములనుబట్టియే, ఎంత బంగారము ఆకర్షించబడవలసి యున్నదో నిర్ణయించవలెనని యును కమిటీవారి ఆక్షేపణ.

పై ఆక్షేపణములతో బంగారునాణెముల చెలామణి ఇండియాయందు అవసరములేదని నిర్ణయించుచు ప్రస్తుత పద్ధతిని స్థిరముగానుండునట్లు చేయుటకు కమిటీవారు మూడుకారణములను సూచించుచున్నారు. ఆ కారణములనుగూడ ఖండించి, వెనుక కమిటీవారు స్వయముగ వెల్లడిపరచిన అభ్యంతరములయందలి హేత్వాభాసములను పొందుపరచుచున్నాము.

ప్రస్తుతపద్ధతియే యుండునట్లు చేయుటకు కమిటీవారొసంగిన కారణములు:—

1. ప్రజలు, బంగారు నాణెములకంటె వెండి నాణెములనే ఆసించుచుండుటచేత, దొరతనమువారు వెండినాణెముల ముద్రణమునకు కడంగుచున్నారు. ఈ కారణము ఎంత సహేతముగ నున్నదియును, ఇటీవల ఇండియాదేశము ఎంత బంగారును ఆకర్షించినదియును గమనించిన తెల్లమగును. దీనినిబట్టి ఇండియా బంగారునే విస్తారముగ కోరుచున్నట్లు కానగును.

2. రషియా, ఆస్ట్రియా, జపాను దేశముల చెలామణి పద్ధతులు చాలవరకు సామ్యమును కలిగియుండుటచేత, ప్రస్తుతపద్ధతియే బాగుండునని వారి రెండవకారణము. ఇతర దేశములయొక్క స్థితిగతులతో ఇండియాను సరిపోల్చ వీలు లేదు. ఇతరదేశములయం దాకర్షణము చేయబడిన బంగారు నాణెములుగాని, లోహముగాని, ఆ ప్రభుత్వములయొక్క

కనకరాసులను పెంపొందజేయుట కలవడుచున్నవి. ఇండియా యందలి స్థితిగతులు వేరుగాన వానితో సామ్యము పనికిరాదు.

3. ఇండియా దేశప్రజలకు బంగారుకంటె విశేష లాభకరమగు ఇతర చెలామణి పద్ధతియొక్క లాభమును బోధపర్చవలసియున్నది. ఇది మూడవకారణము. అయిన బంగారును ఇటీవల విస్తారముగా ఆకర్షించుచుండుటవలన ఇండియా దేశమునకు కృత్రిమపు రూప్యమునందు (Token-coin) నమ్మకమున్నటుల గానరాదు. కావున దేశీయులకు బోధపరచవలసిన ముఖ్యవిషయము, పాతరబడియున్న కనకరాసులను బయటికితెచ్చి, లాభకరముగ ఉపయోగించునటుల చేయవలసియున్నది. బంగారు నాణెములనుగాని లోహమునుగాని ఇచ్చిపుచ్చుకొనుటలో వాడవలయునని సర్కారువారు శాసించినచో ఆపద్ధతి అమలులోనికివచ్చును. అటుల గావించుటకు, వాడుకలోనుండు బంగారును పెంపుచేయుట అవసరము. క్రమక్రమముగా, బంగారుయొక్క స్థానమును, బంగారు-నోట్లు గైకొనవచ్చును.

ఛాంబర్లెయిను కమిటీవారికి, బంగారునాణెముల చెలామణి పద్ధతిని ఇండియాయందు నెలకొల్పుటకు గల యాభ్యంతరములను ఈ దిగువను పొందుపరచుచు, వాటిని సహేతుకముగా ఖండించుచున్నాము:—

1. మారకపు తేడాలను తగ్గించుటకు బంగారును వాడుకలో నుంచుటకంటె నిధియందుంచుట లాభకరము. ఈ వాదమునకుగల ఆక్షేపణములు మూడు.

(i) బంగారు సామాన్యముగా వాడబడుచున్న యెడల, బంగారుయొక్క స్థానమును, బంగారు-నోట్లు ఆవరించి ఆబంగారునంతటిని బంగారు నిధియందు జేర్చుటకు వీలలవడును.

(ii) కృత్రిమపు చెలామణి పద్ధతికంటె, బంగారు వాడుకలో నుండుటయే ఉత్తమము.

(iii) బంగారు నాణెముల చెలామణిని దేశమునందు, నెలకొల్పుటచే, బ్యాంకినోట్ల నిధియందు విశేషముగా నుంచబడిన రూప్యములు తగ్గి, ఆ నిధియందు బంగారు చేరుటకు వీలుండును.

2. బంగారును చెలామణి నాణెముగ కలిగియుండుట వ్యయాధిక మగుపద్ధతి.

ప్రస్తుత పద్ధతివలన, బంగారు పాతర బడుచుండుట సంప్రాప్త మగుచున్నది. గనుక ప్రయోజన శూన్యమగు ఈ పద్ధతికంటె, వ్యయాధికమైనను బంగారు చెలామణి పద్ధతియే కొంత లాభకరముగ నుండును.

3. బ్యాంకి నోట్లయొక్క వ్యాప్తికి బంగారు నాణెములు ప్రబల శత్రువులు.

కృత్రిమ (Artificial) నిర్బంధనల నుంచినంతమాత్రమున, నోట్లయొక్క వ్యాప్తి ఇనుమడింప జాలునా! ఎట్టి చెలామణి పద్ధతియు, దాని ఉపయోగమును బట్టియే ప్రజల సన్మానమును వడయుచుండును. సాధారణముగా ద్రవ్యమును ఒకతావునుండి మరియొక తావునకు పంపవలసి వచ్చినపుడు ప్రజలు నోట్లనే వాడుచుందురు.

4. భారతీయులు, బంగారును నగలక్రిందనో నాణె ములక్రిందనో, నిలవజేయుటకు అలవాటుపడియున్న వారగుట చేత, బంగారు చెలామణిని ఇండియాయందు ప్రవేశపెట్టినను, ఆ బంగారంతయు పాతరబడుచునే యుండునుగాని ఎన్నటికిని చెలామణికి అలవడదు.

బంగారు విశేషముగా ప్రజలవలన నిలవ చేయబడు చుండుటకు గల ముఖ్యకారణము, ప్రజలకు కృత్రిమపువిూహ్య మునందుగల నమ్మకపు లోపమే. కావున బంగారు చెలామణి పద్ధతి, స్వదేశమునందు నెలకొల్పుచో దాని కలవాటుపడిన కొలదిని, ప్రజలు బంగారును నిలవచేయుటకుమారు బంగారు నోట్లనే (Gold notes) నిలవచేయుటకు అలవాటు పడుదురు.

బంగారునాణెముల చెలామణి అవసరము.

కాబట్టి ఇండియాయందు బంగారు నాణెముల చెలా మణిపద్ధతి తప్పక అమలులో నుంచవలయును. స్థలసంకోచ ముచే, ఈ విషయమును ఇంకను చర్చచేయువలసి యున్నను విరమించవలసి వచ్చినది. ఒకటి రెండు సంగతులను మాత్రము పొందుపర్చక తీరదు. దొరతనమువారి చెలామణి నీతిని విమ ర్శించు ప్రముఖుల అభిప్రాయమేమనిన—ప్రస్తుతము అమలు లోనున్న మారకపుపద్ధతిని మార్పుచేయకుండ అమలు జరు పుచు, క్రొత్త రూప్యములను ముద్రించుట మానవలయును. కొంతకాలమునకు, అరుగుదల వలనను ఇతర ఉపయోగముల వలనను రూప్యములు సన్నగిలుటవలన రూప్యమును అవ సరములేని నాణెముగ (Subsidiary coin) పరిగణించ

వచ్చును. మరి కొంతకాలమునకు వాడుకలోనున్న బంగారు స్థానమును ఆక్రమించుటకు బంగారు—నోట్లు ముద్రింపబడవల యును. అప్పుడు బంగారంతయు నిధులయందు జేరి, బంగారు నిధులప్రాపున—ఉత్తమమైన చెలామణి పద్ధతి—దేశమునందు నోట్లు చెలామణి యగుచుండుట, ఇండియాకు సంప్రాప్తించ గలదు.

ఉత్తమపద్ధతి చేకూరుటకు, నాలుగుదశలు (Stages) గడవవలసి యున్నది:—

1. క్రొత్త రూప్యముల ముద్రణమును ఆపివేయుట.
2. బంగారును విశేషముగావాడుకలోనికి గొనివచ్చుట.
3. బంగారు—నోట్లను ముద్రించి వ్యాపకముచేయుట.
4. బంగారునిధులప్రాపున, నోట్లు దేశమునందు చెలా మణియగుచుండుట.

సర్కారుబ్యాంకి.

నాణెముల చెలామణి సభవారి యెదుట, రాజధాని బ్యాంకులు, ఇండియాయొక్క కళాపురోభివృద్ధికి తోడ్ప డుట లేదనియును, ఆకారణము వలన సర్కారు బ్యాంకి నొకదానిని, నెలకొల్పినయెడల, పక్షపాతములేకుండ స్వదేశ వ్యాపారస్థులకు గూడ సదుపాయములను గలిగించుచుండు నని, కొందరుప్రముఖులు సాక్ష్యమిచ్చిరి. విద్యాసాగర పాం డ్యాగారు, మదరాసు (రాజధాని) బ్యాంకి ఆంగ్లేయవర్తకుల కేగాని ఇండియనువర్తకులకు సహాకారి యగుటలేదని, మద రాసు వార్తాపత్రికలకు ఇటీవలవ్రాసిన వ్రాతలను చదివిచూ

చిన సర్కారుబ్యాంకియొక్క ఆవశ్యకత విశదముకాగలను. హిందూదేశమునందలి, వివిధప్రాంతముల వ్యాపారస్తుల ఆశయములు దీర్చునట్లుగను, స్వదేశ అన్యదేశవ్యాపారములను పోషించవలసిన విషయములయందును, చక్కగ కార్యతంత్రమును నిర్వర్తించుటకు తగిన సాధనముల నలవర్చుట కష్టసాధ్యము. ఇదివరకే పెంపుచెందియున్న అధికారవర్గ కూటములను, ఈసర్కారుబ్యాంకి విరివి చేయుననికూడ చాలమంది అభిప్రాయ పడుచున్నారు. మామతమున, సర్కారుబ్యాంకి యోచనవదిలిపెట్టి, దొరతనమువారు, ఇండియనుబ్యాంకులు విశేషముగ దేశమున మొలకలెత్తుటకు తగిన సాదనాంతరములను గల్పించిన బాగుగనుండునని తోచుచున్నది. ఇండియను బ్యాంకులు విశేషముగా వ్యాప్తిజెందినయెడల హిందూదేశ కళాభివృద్ధికి అమితమగు సాహాయమునొసర్చిన వగుటయేగాక ఇండియాయందలి మూలధనము మార్కెట్లు దరిజేరుటకు జంకుచుండుననియెడి అపవాదముకూడ తొలగిపోగలదు. సర్కారు ధనమును యాజమాన్యమునందు గలిగియున్న రాజస్వసంఘములుగాని, రాజధాని బ్యాంకులుగాని ఇండియనుబ్యాంకులు అభివృద్ధిలోనికి వచ్చునట్టుగ సహాయముచేయుట అవసరము. సర్కారునిలవ ధనములోకొంతభాగము, రాజధానిబ్యాంకులు తక్కువవడ్డీకి గ్రహించుచున్నవి. ఇండియాయందలి మారకపుబ్యాంకులు (Exchange Banks) కూడ, లండను నందు తక్కువవడ్డీలకు డిపాజిట్లను గ్రహించుచున్నవి. ఒకఇండియను బ్యాంకులుమాత్రమే వెలివేసినట్టు సర్కారుసాహాయమునకు దూరమైనవి. ఇదిక్రమమైన రాజ్యనీతికాదు.

సర్కారుబ్యాంకి విషయమై ఛాంబర్లెయిను పంచాయితీవారు నిశ్చితాభిప్రాయము నొసంగజాలక, నిపుణులను కలిగిన ఒకచిన్నికమిటీ ఈవిషయమునుచర్చించి నిర్ణయించునట్లుగా తీర్పుచేసిరి. సర్కారు బ్యాంకిని నెలకొల్పుటకన్న, ఇండియను బ్యాంకులకు సహాయసంపత్తి నొసంగుట సుకరము.

తాతాబ్యాంకి.

ఇండియాలో వర్తకరాజు లనదగిన తాతాకంపెనీవారు ఒక కళావాణిజ్యములబ్యాంకి (Industrial Bank) ని 6 కోట్ల రూప్యముల మూలధనముతో స్థాపించి సర్కారువారికి మార్గదర్శకులయ్యిరి. ఈబ్యాంకి నూతనకళలనుస్థాపించుటకు, ప్రస్తుతము రాజధాని బ్యాంకులవలెగాక, చాలకాలమువరకు వాపసు చేయనక్కర లేని అప్పులనుఇచ్చి, కళాప్రపంచమున కెన్నియో విధముల తోడ్పడనున్నది. పని ప్రారంభింపబడినది. పశ్చిమ సముద్రతీరముననున్న కొబ్బరివ్యాపారమును దేశముననే నడపుటకుగాను ఒకఫ్యాక్టరీని కొచ్చియందు స్థాపించు ఏర్పాటులు చేయబడుచున్నవి. ఇట్టిబ్యాంకులు రాజధానికి ఒకటివంతుననైనను ఉండితీరవలెను. ఇండియా అభివృద్ధికి తోడ్పడు ముఖ్యమై పనులనుచేయుటకు ఎల్లప్పుడును వెనుకంజవేయు బ్రిటిషు పాలకులు తాతాకంపెనివారి మార్గము నవలంబింతురుగాక.

ప్రస్తుత హెచ్చుధరలకు కారణములు, ఫలితములు.

దేశమునందు ఆహారధాన్యముల వెలలుపూర్వముకంటె విపరీతముగాపెరిగినవి. ఈ మహాసంగ్రామమునకు పూర్వమే ధరలధికమయ్యెను.

(1873 సం॥ యొక్క ధరలు = 100)

సంవత్సరము	బియ్యము.	గోధుమలు.
1873	100	100
1893	164	125
1903	162	129
1907	238	165

పైపట్టీవలన 1873-వ సంవత్సరము యొక్క ధరలతో 1907-వ సంవత్సరపు ధరలు సరిపోల్చిచూడగా దేశప్రజల యొక్క ముఖ్య ఆహారపదార్థములగు ధాన్యములయందు, విశేష తేడా కానవచ్చుచున్నది. బియ్యముయొక్కధర నూటికి నూరును గోధుమలధర నూటికి ఏబది సంతులను ఇతర ధాన్యములయొక్క వెలలుకూడ ఆతీరుగనే పెంపొందుట స్పష్టీకరించబడుచున్నది. 1904-1907 సం॥ల మధ్య, పంటలు సామాన్యముగ మంచిస్థితియందున్నను, ధరలుమాత్రము నూటికి 25 చొప్పున పెరిగెనని అప్పటి కోశాగారమంత్రి వాక్రుచ్చెను. వెలలు పెరుగుటకు గల కారణములను విమర్శించుటకుముందు ఒక దురభిప్రాయమును ప్రజల మనంబులనుండి పారదోలవలసిన ఆవశ్యకతకలదు. అర్థశాస్త్రవేత్తలలో కొందరు, ధరలు పెరుగుచుండినచో, దేశముయొక్కసంపద పెంపుగాంచుచున్నదని సంతసించువారలు కలరు. వారలలో సుప్రసిద్ధ ఫ్రెంచి ఆర్థికశాస్త్రజ్ఞుడగు (Charles Gide) ఛార్లెసు జీడ్ మహాశయుడొకడు. ఇతరదేశములకు ఈఆర్థికన్యాయము వర్తించును గాని ఇండియాయందు మాత్రము ఐశ్వర్య చిహ్నమగుటకు మారు దరిద్రహంశను సూచించునని చెప్పకతప్పదు. హెచ్చు

ధర లైశ్వర్యజనకములేయగుచో, ఆలాభము నేల ఖామందులను జెందుచుగాని, పేదరైతును బాగుచేయజాలవు, అటుల గానియెడల స్వదేశమునందలి కృషికులు హైన్యస్థితియందుండుటకు కారణమేమి? నేలఖామందు సంగ్రహించగా మిగిలినది, సరకులను ఎగుమతిచేయు ఆంగ్లేయ వ్యాపారస్థుల బారిబడుచున్నది. రైతుస్థితి యథాప్రకారమే. సరకులయొక్క ధరలు పెరుగుటతోపాటు, స్వదేశమునందలి కళలభివృద్ధినిగాంచినయెడల హెచ్చుధర లైశ్వర్యజనకములని ఊహించనగును. ధాన్యాదులయొక్క వెలలతోపాటు, కర్మకరుల వేతనములు కూడ పెంపుగాంచిన యెడల బాగుండెడిది. అటుల జరగుట లేదు. కళావాణిజ్యములు అభివృద్ధియందున్న ప్రాంతములయందు మాత్రము కర్మకరుల వేతనములు కొంతవరకు పెరిగినను, పల్లెటిగ్రామములయందు నివసించువప్పటికంటె, ఆపట్టణరాజములయందు జీవయాత్రను గడుపుటకు విశేషముగా, ధనము వెచ్చించవలసి వచ్చుటవలన, లభించిన అధికకూలి వమ్మైపోవుచున్నది. కర్మకరునకు, మిగులునదంతగాలేదు. ఈవిషయమటుండ, వెలలసందర్భమున, ఒక ముఖ్యాంశమును గమనించవలసియున్నది. ఇతర దేశములకువలె గాక, హెచ్చుధరలు ఇండియాదేశమునకు హానికరములుగాని వేరొండు గాజాలవు. ఏలనగా, హెచ్చుధరలు, కర్మకరులయొక్క వేతనములను అధికముచేయును. శ్రమ చౌకగా లభించినచో, సరకులను ఉత్పత్తిచేయుటకుగల ఖరీదు ఇనుమడించక మానదు. భరతఖండమునకు, ఇతరదేశములకంటె పనివాండ్రు లభించుటయందు మాత్రము అధిక్యతకలదు. అనగా కర్మకరుల వేత

నము లీదేశమున కాలుచోకయగుటచే, కళాచక్రమునందు ఈ విషయమున ఇతరదేశములకంటె, మంచి స్థితియందున్నది. శ్రమ ప్రియమైనయెడల, ఇప్పుడిప్పుడే తలయెత్తుచున్న మన కళలు చక్కగా స్థాపింపబడిన విదేశకళలపోటీకి ఆగలేక, క్రుంగవలసినఅవస్థపట్టును. హెచ్చుధరలు,విదేశములకేగుచున్న ఎగుమతులనుకూడతగ్గించగలవు. ఎగుమతులు తగ్గిపోయినయెడల,ప్రతిసంవత్సరమునుఇండియావిదేశములకు చెల్లించవలసిన, 25 కోట్ల రూప్యములును లభించుట దుర్లభము. విదేశములకు చెల్లవలసిన ధనము, ఎగుమతుల వలన సేకరించబడక పోయినయెడల, దేశమునందు క్రొత్తపన్నులను విధించవలసి వచ్చెను. విదేశముల కంపవలసిన ధనసంచయములో, సీమ ఖర్చులే విశేషముగానున్నవి. ఈ కారణములవలన, ధరలు పెరుగుట ఇండియా కళాభివృద్ధికిని, రాజస్వమునకునుగూడ విప్లవకారియే యగుచున్నది. కావున, హెచ్చుధరలు ఐశ్వర్య చిహ్నములని భ్రమించరాదు.

ఇక వెలలు పెరుగుటకుగల కారణములను చర్చించ నగును. ఈక్రిందపేర్కొనబడిన కారణములయందు, ఎయ్యది ఎంతవరకు తోడ్పడెనో నిశ్చయించుటకు సాధ్యముకాదు. ప్రతికారణమును కొంతవరకు సహకారియే అయ్యెను. కొన్ని కారణములు ప్రత్యక్షముగను కొన్ని పరోక్షముగను కూడ వెలలను పెంచుటకు సహాయభూతములైనవి.

1. కఱవులును కాటకములును దేశమునుపీల్చి పిప్పి చేయుచుండుట ప్రథమకారణము. ఈ కారణమును ముందు

పేర్కొనుటచే ఇదియేముఖ్యముగ తోడ్పడెనని యూహించ రాదు. ఇదిస్వాభావసిద్ధమగు కారణముగాన ముందుపేర్కొన బడెను. 1891-92 సం॥ యొక్కధరలతో సరిపోల్చిచూడగా 1896-97,1899-1900 సంవత్సరములయందు వెలలుఅపారముగ పెరిగెను. కఱవులుదేశమునుపీల్చి పిప్పిచేయుచుండగా,ఆతరుణముననే అన్యదేశములయందు మనఆహారధాన్యములకు గిరాకి అతిశయించుచువచ్చెను. ఎగుమతులధికమగుటచేత స్వదేశమునందలి వెలలుసైతము అధికమయ్యెను. మహాకాటకములు సంభవించినప్పుడుసైతము, బియ్యముఎగుమతులు యథాప్రకారముగనేజరుగుచుండెను. 1898-99 సం॥లలో ఆహారధాన్యముల ఎగుమతులు ముప్పదిలక్షలటన్నులు అధికమయ్యెను. రెండవగొప్ప కాటకపు సంవత్సరమునకు (1900)ముందు సంవత్సరమున, ఇట్టి స్థితి సంభవించెను. సుభిక్షమగు దినములలో వెలలుతగ్గుటయు కలదుగాని, ఏసంవత్సరమునందలి వెలలును పూర్వపువెలలతో సామ్యమును గాంచుటలేదు. పుష్కలముగ పంటలు పండినప్పుడుధాన్యాదులమితముగ ఎగుమతి చేయబడుచుండుటచేత, వర్షములు ఎటాముటివలనగాని వరదలు విశేషమగుట వలన గాని పంటలుతగ్గినపుడు, వెలలు సామాన్యజనులను బాధించుచున్నవి.

2. ఆహార ధాన్యములయొక్క ఉత్పత్తి, వానికిగల గిరాకితో సరిగా అభివృద్ధినొందుటలేదు. అనగా ధాన్యముల యొక్క పంటలు గిరాకి అతిశయించినంత హెచ్చుగా ఇండియా యందు అధికమగుటలేదు. బంగాళాదేశమునను, బొంబాయి యందలి కొన్నిప్రాంతముల యందును, వరిపంటకంటె ప్రత్తి

గోగునారపంటలు హెచ్చులాభము వచ్చునవియగుటచే, వరి కంటె హెచ్చు ప్రదేశమున సేద్యము చేయబడుచున్నవి. అందువలన వరిసేద్యమందున్న భూమితగ్గుచు వచ్చుచున్నది. 1897-98 సం॥ లయందు ఆహారపదార్థముల సేద్యమునందున్న భూమియొక్క విస్తీర్ణము $182\frac{3}{4}$ మిలియన్ల ఎకరములు. 1906-07 సరికి 195 మిలియన్లకు సుమారుగా పెరిగినది. పదిసంవత్సరములలోను నూటికి $7\frac{1}{2}$ చొ॥ న వరిపంటక్రిందనున్న భూమి పెరిగినది. ప్రత్తి సేద్యమునందున్న భూమి నూటికి ఏబదిరెట్లును గోగునార సేద్యమందున్న భూమి డెబ్బదిరెట్లును పెరిగినది. జనసంఖ్య అధికమగుచుండుటచేత ఉత్పత్తియగుచున్న పదార్థము చాలకపోవుట కూడ ఒక కారణము. రోడ్లు, ఇనుపదారులు మొదలగు యానసౌకర్యములు దేశమునందు పెంపు చేయబడుటచేత మూలమూలలనున్న ప్రదేశములనుండి సైతము ధాన్యాదులు పణ్యచక్రములకు చేరుచున్నవి. యానసౌకర్యములు విస్తారముగా అలవడుటచేత పండినప్రదేశమునను పండని ప్రదేశమునను కూడ, ధరలు ఒకేతీరుగనుండుట సంభవించుచున్నది. ధాన్యరాసులు ఎగుమతులకు వీలులేక కొన్నిప్రదేశములయందు పాతరబడియుండుట చాలఅరుదు. రైల్వేలుగల ప్రాంతములయందలి ప్రజలు, పూర్వము ధనవంతులు అనుభవించవలసిన వస్తువులని విడిచిపెట్టబడిన సరకులను, సామాన్యస్థితివంతులు సైతము ఉపయోగించుచున్నారు. పూర్వము ఏగంటి అన్నమునో, చోడిఅంబలినో తినెడివారు ఇప్పుడు వరిఅన్నమునకు అలవాటు పడియుండుట ఎల్లరెరింగియే యున్నారు. ఈకారణములవలన పదార్థ

ముల సరఫరా, గిరాకితో సమముగ నుండక వెనుకబడుచుండుట చేత, వెలలు పెరుగుట తటస్థించుచున్నది.

3. హిందూదేశమున ఆహారపదార్థములయందు చాలమంది ప్రజలకు వరియే ఆధారమైయున్నది. అట్టి పదార్థము విశేషముగ పరదేశయాత్ర వెడలుచున్నదని ఈ వరకే సూచించియున్నాము. బియ్యపు ఎగుమతికి యానసౌకర్యములు చౌకగా అలవడునట్లు చేయుటవలన, ఏటేట ఎగుమతులు జాస్తియగుచున్నవి. ఐశ్వర్యవంతములైన వగుటచే అన్యదేశములు మనపదార్థములకు హెచ్చుధరలను చెల్లించగలవు. హెచ్చువెలలు విదేశములయందు లభ్యమగుచుండ చౌకధరలకు స్వదేశమునందు అమ్ముటలేదు. ఎగుమతులు విస్తారమగుచున్న కొలదిని పూర్వము స్వల్పధరలకు అలవడుచున్న సరకులు సైతము చాల హెచ్చుధరలకు అమ్మబడుచుండుటన్న సంగతి ఎల్లరెరింగినదే!

బియ్యపు ఎగుమతులయొక్క రాసియు మూల్యమును.

సంవత్సరము	రాసియొక్క టన్నులు	విలువ రూప్యములు	ఉజ్జాయింపున టన్ను ఒక్కంటికి ధరలు.
1903-04	22,50,000	19,08,28,000	85
1904-05	24,74,000	19,61,90,000	79
1905-06	21,52,000	18,63,69,000	$86\frac{1}{2}$
1906-07	19,35,000	18,52,51,000	95
1907-08	19,13,000	20,33,63,000	$105\frac{1}{2}$

అయిదు సంవత్సరములలో ఎగుమతి చేయబడిన టన్ను బియ్యముయొక్క ధర 85 నుండి 105½ రూప్యములవరకు పెరిగినది. అనగా నూటికి 24 వంతున హెచ్చినది. ఆ కాలముననే ఇండియాయందలి ధరలు 162 నుండి 238 వరకు పెరుగుటచేత నూటికి 45 వంతున హెచ్చెను. దీనినిబట్టి మొత్తపు ఎగుమతి ధరలకంటె చిల్లరగా అమ్మబడు (పదార్థముల) ధరలే మిక్కిలి వేగముగ పెరుగుటను గాంచుచున్నాము. దేశమునందలి వాడుకలకు మిగిలిన ఉపరిగానున్న ధాన్యములు మాత్రమే ఎగుమతి యగుచున్నవని కొందరి మతము. తరచుగా క్షామములును దారిద్ర్యమును పీడించు ఈ దేశమున వాడుకలకు మీరి ఉపరిగా ఉత్పన్నమగు ధాన్యములుండుట కల్ల. స్వదేశమునందలి వాడుకలకు తగినంత ధాన్యము పండుటలేదని ముందే సూచించియున్నాము.

4. దొరతనమువారి నాణెముల విధానము గూడ సరకుల ధరలను పెంపుచేయుటకుగల ముఖ్యకారణమని శ్రీయుత గోపాల కృష్ణ గోఖలే మొదలగు మహాశయుల అభిప్రాయము. ఈ అభిప్రాయము ఆర్థికశాస్త్రమునందలి ముఖ్యసూత్రముల ఆధారమును వడసినదేగాని, తర్కముకొరకు ఎత్తిన పన్నుగడ కాదు. వాడుకలోనున్న నాణెముల సంఖ్యనుబట్టి సరకులధరలు నిర్ణీతములగు చుండునన్న సంగతి ఆర్థికశాస్త్రమున ముఖ్యమైన సామాన్యసూత్రమే. దేశముయొక్క వాణిజ్యవ్యాపారములకు వలయునన్ని నాణెములు వాడుకలోనుండక కొరవడినయెడల, ఆనాణెములకు గల గిరాకి అతిశయించును. గిరాకి అతిశయించినవెంటనే సామాన్యవస్తువులవలెనే ఆనాణెములయొక్క వెలలు పెరుగును. అనగా పూర్వముకంటె హెచ్చుగా పదార్థ

ములను కొనుటకు ఆనాణెములకే శక్తికలుగును. అందువలన వెలలు తగ్గుట తటస్థించును. వాడుకయందున్న నాణెముల సంఖ్య వ్యాపారములకు అవసరమైనంతకంటె హెచ్చుగ నుండుచో, ఆనాణెములయొక్క మూల్యము తగ్గి వాటి కొనుబడివిలువను తగ్గించును. ఆకారణమువలన సరకులను గొనునప్పుడు పూర్వముకంటె హెచ్చునాణెములను చెల్లించవలసి వచ్చును. అప్పుడు సరకులయొక్క ధరలు పెంపుగాంచును. రాసి అధికమగుచున్న కొలదిని మూల్యము తగ్గుచుండునన్న ఆర్థికన్యాయము ఇతరవస్తువులకువలెనే నాణెములవిషయమున కూడ వర్తించుచుండును. ఇండియాదేశ నాణెముల చెలామణి పద్ధతియందిట్టి స్థితియే సంభవించెను. 1893 సం॥ న టంకశాలలు ప్రజల ఉపయోగమునకు వీలుగాకుండ మూసివేయబడుటయును, అప్పటినుండియు సర్కారువారే రూప్యముల ముద్రణమునకు గడంగుటయును పాఠకులెరింగియే యున్నారు. రూప్యముయొక్క విలువ స్వభావవిరుద్ధముగా 1 షిల్లింగు 4 పెన్సులక్రింద నిర్ణయించబడిన సంగతికూడ తెలిసికొనియే యుందురు. అప్పటినుండియే సిక్కారూప్యమనుపేరు పోయి కృత్రిమపునాణ్యమను బిరుదమును మననాణ్యము ధరించుట నారంభించినది. కృత్రిమపు నాణ్యమనగా రూప్యముయొక్క విలువ అందలి లోహపువిలువకంటె హెచ్చు చేయబడినది. రూప్యమును వెండిక్రింద కరిగించి అమ్మకము చేసినయెడల, మూడువంతులలో రెండువంతులకంటె ఖరీదురాదు. లోహపు విలువతో సమముగ నాణెముయొక్క విలువ, సర్కారువారు స్వాయముగ నాణెములను ముద్రించుటకు పూర్వ ముండెడిది.

బంగారు నాణెములను చెలామణి రూకలుగ చేయనందువలన ఇట్టిగతిపట్టినది. రూప్యములు విశేషముగ ముద్రింపబడెనని ఈ వరకే సూచించియున్నాము. ప్రస్తుతము వాడుకలోనున్న రూప్యములసంఖ్య రెండువందలకోట్లకు పైబడియున్నది. టంకశాలలనుండి విస్తారముగా నాణెములను ముద్రించుటవలన ఇతర వస్తువులకువలెనే, ఈనాణ్యముల మూల్యము తగ్గిపోయి వానివిలువ క్షీణించెను. అందువలన ధరలు హెచ్చుటకు వీలు చిక్కెను. రూప్యముల నూతనముద్రించుట లేదనియు వ్యాపారములయొక్క ఆవశ్యకతను బట్టియే ముద్రింపబడుచున్నవనియును, సమాధానము నొసంగుచున్నారు. వ్యాపారములు హెచ్చుగా జరుగుచున్న సమయములయందు, ఈసంగతి నిజమే యనుకొందము. కాని ఒకసారి రూప్యములను ముద్రించినచో, అవి వాడుకలోనే ఉండిపోవును. వెలవసిన, తక్కువ విలువ గలిగినవగుటచే, ఆనాణెములను ఎవ్వరును కరిగించుటకుగాని పాతరవేయుటకుగాని పూనుకొనరు. టంకశాలలు స్వేచ్ఛగా ప్రజోపయోగమునకై విడిచిపెట్టబడినంతకాలము మార్కెట్ల యొక్క అవసరమునుబట్టి రూప్యములు సంకోచము చేయబడుటకుగాని తగ్గించుటకుగాని వీలుండెడిది. ఇపుడది సాధ్యము గాదు. ఒక్క గోఖలేమహాశయుడే గాక వెబ్బు, జే. ఎమ్. కీన్సు మొదలగు ప్రముఖులుగూడ రూప్యముల నధికముగ ముద్రించుటవలననే ధరలు పెరిగినవని వ్రాసిరి. ఫౌలరు పంచాయితీవారి తీర్మానములను ఆచరణములోనికిగొనిరాకుండ ఇండియా దొరతనమువారు వ్యవహరించుటవలన రూప్యములు విశేషముగా ముద్రణమగుటయే గాక రాజస్వవిషయమున

పెక్కు కేసులు వాటిల్లెనని చెలామణి రాజ్యతంత్రమును విమర్శించునపుడు విశదీకరించియే యున్నాము.

5. బంగారును ప్రమాణముగ నంగీకరించియు, బంగారు నాణెములను ఇండియాయందు ముద్రణము చేయకపోవుటవలన, బంగారునాణెములను చెలామణి నాణెములుగాగల దేశములయందు, ధరలు పెరిగినప్పుడెల్ల ఇండియాకు నష్టముసంభవించుచున్నది. స్వదేశమునందు పెరిగిన ధరలు బంగారునాణెములను వాడుకచేయు దేశములయందలి ధరలనుబట్టి కలిగినవే అయిన యెడల కొంతకాలమునకు తిరిగి తగ్గవచ్చునని యొడి భ్రాంతి కలుగుచున్నది. కాని, ఇతర కారణములుకూడ సహకారులగుచుండుటచేత, అట్టి యాశలతో ప్రయోజనము లేదు. నాణెముల చెలామణి నీతిని సవరించినగాని ధరలు చక్కబడవు.

ధర లధికమగుటవలన ఫలితములు.

ఇక ధరలధికమగుటవలని ఫలితములను పేర్కొనవలసియున్నది. రైతునకు విశేషమైన లాభమేదియు ఉండజాలదనియు నేలఖామందే ఆఫలితమును గ్రహించుననియు ఇదివరకే సూచింపబడినది. ముఖ్యముగా సామాన్యగృహస్థులను, దేశములోని వాడుకనుబట్టి ద్రవ్యవేతనములు గ్రహించు కర్మకరులను ఉద్యోగస్థులను హెచ్చుధరలు పీడించుచుండును. శ్రమను ప్రియముచేయుటకు గూడ హెచ్చుధరలు తోడ్పడుచుండును. సరకులను ఉత్పత్తిచేయుటకుగల మూల్యము హెచ్చగుటచేత, ఎగుమతులు సన్నగిలుటకూడ తటస్థించును. కళావాణిజ్య చక్రములకును, దేశమునందలి ప్రజలకునుకూడ ఆహారపదార్థముల వెలలు ఇనుమడించుటవలన కీడు వాటిల్లకమానదు.

బ్యాంకుల పద్ధతులు.

షాహుకార్లు.

పల్లెటి గ్రామములయందు షాహుకార్ల వలన రైతులకు పెట్టుబడి ఈయబడుచున్నది. చెన్న రాజధానియందలి షాహుకార్లు నాటుకోటిసెట్లు, చెట్టియార్లు, కోమట్లునైయున్నారు. ఉత్తర హిందూస్థానమునందలి షాహుకార్లు మారువాడీలు, మహాజనులు, సెత్‌లు, బనియాలు, క్షత్రీలు అను తెగలకు చెందియున్నారు. కొందరిమతమున షాహుకార్లు దేశమునకు అరిష్టదాయకులుగ పరిగణింపబడుచున్నారు. కాని పల్లెటి గ్రామములయందలి రైతులకు కృషికివలయు విత్తనములు మొదలగు ఉపకరణములకు కావలసిన వెచ్చమును సరఫరా చేయుటయేగాక, పంటలు తేలువరకు భోజనమునకును ఇతర అవసరములకును వలయు ద్రవ్యమునుకూడ సరఫరా చేయుచుండుటవలన, షాహుకార్లను పేదరైతులు సాదర భావముతోనే చూచుచున్నారు. పరపతి సంఘములు దేశమునందంతటను వెల్లి విరిసినట్లు వ్యాప్తమగు నంతవరకు, షాహుకార్లు గ్రామములయందలి కృషికళకు తోడ్పడక తీరదు. వీరు వసూలుచేయువడ్డీ విపరీతమయ్యును, తరుణమునందు వలయు మూలధనమును సరఫరా చేయుచుండుటవలన ప్రయోజనకారులే యగుచున్నారు.

పట్టణమునందలి బ్యాంకులు.

ఇక పట్టణములయందు బ్యాంకు లేతీరుగ పనిచేయుచున్నవియును మనము తెలిసికొనవలసియున్నది. నూతనముగ

ఐరోపీయను పద్ధతులపై బొంబాయి, మదరాసు, పంజాబు రాష్ట్రముల యందు స్థాపితమైన బ్యాంకులు జాయింటు స్టాకు కంపెనీ పద్ధతిపైని నెలకొల్పబడినవి. జాయింటు స్టాకు కంపెనీలనగా, వలయు మూలధనమును పలువురుచేరి ప్రోగుచేసి స్థాపించబడినవి. ఈ స్వదేశబ్యాంకులు ముఖ్యముగా కళలను మూలధనము నొసంగి సముద్ధరించుచున్నవి. కళలకు సహాయములగుటయేగాక, స్వదేశ-వర్తకము వికివియగుటకు గూడ తోడ్పడుచున్నవి. తరచుగా జమీందారులకును పెద్దనేల ఖామందులకును ఋణములొసంగుచు, సేటులవలె వడ్డీవ్యాపారమునుకూడ చేయుచున్నవి. రాజధాని బ్యాంకులవలె ఇండియను బ్యాంకులకు దొరతనమువారు సానుభూతిని గనబరచుట లేదనియును, నిలవయున్న ధనమును నిష్ప్రయోజనముగ సర్కారు కోశాగారములందు పాతర వేయుచుండుటవలనను, బంగారు ప్రమాణనిధి ఇంగ్లాండు నందుంచబడుట వలనను ఇండియను బ్యాంకులకు అభివృద్ధికి ఆటంకకరమగుచున్నది.

జగత్ సెట్ ఉమచందులు.

మారువాడీలును, సెట్‌లును స్వదేశ పద్ధతులపై బ్యాంకుల వ్యవహారమును నిర్వర్తించుచున్నారు. స్వదేశ ప్రభువుల ఏలుబడి యందు ఈ బ్యాంకర్లకు విశేష పలుకుబడిగలదు. జగత్ సెట్ ఉమచందులు వంగదేశమున సురాజ దౌలా ఏలుబడి యందు ఎంత ప్రతిభను కలిగియున్నదియును చరిత్రాత్మకమైయున్నది. ప్లాసీయుద్ధమున సురాజ దౌలానోడించి, ఆంగ్లేయ పరిపాలనమునకు శంకుస్థాపనముచేసిన క్లైవుప్రభువు తాను

చేసిన కుట్ర నవాబునకు తెలియునేమోయని గ్రహించి ఉమచందు అను బ్యాంకరునకు తెల్లకాగితముపై సంతకములేకుండను, ఎఱ్ఱకాగితముపై క్రమముగను నోటువ్రాసి వాట్సను యొక్క సంతకమును సైతము ఫోర్జరీచేసిన సంగతి చరిత్రాత్మకమే. బ్రిటిషు ప్రభుత్వము స్థాపితమైన తరువాత, స్వదేశ బ్యాంకర్లు ప్రభుసన్మానమునకు వెలియై ఇతర వ్యాపారములయందు తమధనమును వెచ్చించ నారంభించిరి. మధురానగరవాసులగు సెత్ లనుబ్యాంకరులు ఉత్తరహిందూస్థానమున, రాత్ చైల్డు బేరింగ్సు అను ఐరోపా బ్యాంకర్లవలె, విఖ్యాతయశమును గడించిరని ఒక చరిత్రకారుడు వ్రాయుచున్నాడు. ఇప్పటికిని ఉత్తరహిందూస్థానమునందు ఈబ్యాంకరులు విశేషప్రతిభను కలిగియున్నవారు.

స్వదేశసద్ధతుల విశేషము.

స్వదేశ పద్ధతి యందలి విశేషమేమనిన, మూలధనమునంతయు, ఒకే కుటుంబమువారు జాగ్రతపరచి వ్యవహరించుట. నూతన పద్ధతులవలె ఈ బ్యాంకులు జాయంటుస్టాకు కంపెనీలుకావు. వ్యాపారము వంశానుక్రమణికగ సాగుచుండునుగాని కొంతకాలముండి రూపుమాయుటలేదు. దగాయననెట్టిదియో ఈ బ్యాంకరు లెన్నడును ఎరుగరు. ఋజుమార్గవర్తనులు. నూతన పద్ధతులపై నెలకొల్పబడిన ఎన్నియో బ్యాంకులు దివాలా తీయుటను చూచుచుంటిమిగాని ఒక్క మార్వాడీ బ్యాంకిగాని సెత్ బ్యాంకిగాని దివాలా తీసెనన్న మాట పేరునకైన లేదు.

వీరు చేయువ్యాపారము మూడువిధములు. భూములమీదను, గొప్పగొప్ప జమీనులమీదను ఋణము నిచ్చుటయొకటి. ఇందువీరుపల్లెటి గ్రామములయందలి షాహుకార్లను బోలియున్నారు. ఋణమీయబడిన ద్రవ్యసంచయము అధికముగనుండుటతప్ప, వేరువిశేషమేమియులేదు. స్వదేశమునందు వర్తకముచేయు వ్యాపారస్తులకు ఈబ్యాంకరులు ధనమునొసంగుటగూడ కలదు. అందువలన దేశమునందుత్పన్నమగు పదార్థసంచయమును, ఒకతావునుండి మరియొకతావునకు గొనిపోయి దేశమునందంతటను వ్యాప్తముచేయుటకు సహకారులగుచున్నారు. కొన్ని సమయములయందు, ఆప్రాంతములయందలి కళాదక్షులకు (Manufacturers) మూలధనము నొసంగుటనుగాని, ఋణము నిచ్చుటనుగాని చేయుచున్నారు. ఈరెండు విషయములయందును స్వదేశపురోభివృద్ధికి స్వదేశ బ్యాంకరులు తోడ్పడుచున్నారు. ముఖ్యముగా స్వదేశమునందలి వర్తకమునకు అనువగు సాధనాంతరములను, మారకపు బ్యాంకులవలె, అలవడునట్లు వీరు చేయుచున్నారు. బేరసారములయందు తరచుగ ద్రవ్యమును ఒకతావునుండి మరియొకతావునకు పంపనవసరము లేకుండ, హుండీల ద్వారా వ్యావారమును సాగించుచున్నారు.

హుండీలు.

హుండీలనగా, ఒకవర్తకుడు మరియొక వర్తకునకు సొమ్ము చెల్లించవలసినట్లుగా ఇవ్వబడిన ఆజ్ఞాపత్రము లనుట. ప్రతి పట్టణరాజమునందును బ్యాంకర్ల ఏజంట్లు ఉండియుందురు. ఈఏజంట్లు హుండీలురాగానే, సొమ్మును చెలామణిని

చేయుచుందురు. హుండీలకు సొమ్ము సరఫరా చేసినందుకై నూటికి 3 పైసలు మొదలు ఆరుపైసలవరకును సుంకము వసూలు చేయబడును. పూర్వము హుండీలలో కొన్నిటికి నలుబదియొక్క రోజులు, కొన్నిటికి 51 రోజులు, 61,121 రోజులు వాయిదా యుండెడిది. ప్రస్తుతము హుండీలయొక్క వాయిదా 11,21,41,51 రోజులై యున్నది. ఎన్ని రోజులలో సొమ్ము చెల్లించవలసినదియును, ఆహుండీయందు లిఖించబడియుండును. వెంటనే సొమ్ము చెలామణి చేయవలసిన హుండీలు కూడ గలవు. ఈహుండీలకు దర్శనహుండీలని పేరు. హుండీలను లిఖించుట, గుమాస్తాలపై విడిచిపెట్టబడుచుండును. ఈగుమాస్తాల కొసంగు జీతములు బహుస్వల్పము. లక్షలకొలది మూల్యమునుగల హుండీలను గుమాస్తాలు వ్రాయుచుందురు. ఎవరిపేరను హుండీపంపబడెనో వారు, ఆహుండీని సొమ్ము చెలామణి చేయక నిరాదరించినయెడల యజమానియొక్క వ్యాపా[illegible]తయు కట్టుబడిపోయి అవమానము తటస్థించును. ఇంత పూచిగల వ్యాపారము స్వల్పజీతముగల గుమాస్తాలపై విడిచిపెట్టబడినను తేడావచ్చుచుండుట చాల అరుదు. "హిందూదేశ వర్తకపద్ధతియందు విఖ్యాత యశమును సంపాదించిన హుండీల యొక్క వ్యాప్తి దేశమునందమితముగనున్నది. లక్షలకొలది రూప్యములు ఇందు పెట్టుబడి పెట్టబడియున్నను, వాయిదా కాలము పూర్తియయిన తరువాత నిరాదరించబడి సంభవించిన నష్టము కలుగుట లేదు" ని ఒక లేఖకుడు వ్రాసియున్నాడు. హుండీలనుమార్చి సొమ్ము చెలామణి చేయుటకును సట్టముల క్రిందను, మధ్యస్థులు, లక్షలకొలది ద్రవ్యమునార్జించుచున్నారు.

ఇండియా రాజస్వము.

INDIAN FINANCE.

ఇండియా ఋణముయొక్క చరిత్రము.

ప్రథమ భాగము	1837-1858
ద్వితీయ భాగము	1858-1877
తృతీయ భాగము	1877-1902

1837 సంవత్సరమున విక్టోరియా మహారాజ్ఞి ఇంగ్లాండు సింహాసనము నధిష్టించెను. సింహాసనాసీనురాలైన 21 సంవత్సరములవరకును హిందూదేశము ఈస్టిండియా కంపెనీవారి పరిపాలనము నందుండెను. 1858 సం॥ న సిపాయి ముట్టడిని అణచివైచిన తరువాత కంపెనీవారి పాలనమునుండి తొలగించి బ్రిటిషు ప్రభుత్వమువారే ఈదేశమును స్వయముగ పరిపాలించ నారంభించిరి.

కంపెనీ యాజమాన్యముక్రింద నుండిన 21 సంవత్సరములలోను హిందూదేశము యొక్క ఆదాయ వ్యయములు ఈక్రింద గనబర్చబడిన పట్టీవలన తెలియనగును. ఆపట్టీని పరిశీలించుటవలన మొత్తపు ఆదాయములో భూమిపన్ను ఎన్నవ వంతగునో ఆసంగతియును, వ్యయములో సీమఖర్చులు (Home charges) ఎన్నవ వంతగునో ఆసంగతియును స్పష్టమగును.

పౌను=సవరను లేక పెద్దకాసు. మిలియను=10 లక్షలు.

1

సంవత్సరము	ల్యాండు రివిన్యూ నేలపన్ను	మొత్తపు ఆదాయము	సీమఖర్చులు ఇంగ్లాండునందలి ఖర్చులు	మొత్తపు వ్యయము
	పౌనులు.	పౌనులు.	పౌనులు.	పౌనులు.
1837-38	11,853,975	20,858,820	2,304,445	19,857,970
1843-44	13,228,850	23,586,573	2,944,073	24,925,871
1848-49	14,274,270	25,396,386	3,012,908	26,766,848
1849-50	15,248,694	27,522,344	2,750,937	26,960,988
1853-54	15,838,649	28,277,530	3,262,289	30,240,435
1854-55	16,419,031	29,133,050	3,011,735	30,753,456
1855-56	17,109,971	30,817,528	3,264,629	31,637,530
1857-58	15,317,911	31,706,076	6,162,043	41,240,571

పైపట్టీవలన మనము గమనించవలసిన ముఖ్యవిషయము, 1837 సం॥నందు రెండుమిలియన్ల పౌనులకు పైగా సీమఖర్చుల క్రింద చెల్లించినప్పటికిని ఆదాయమునుండి వ్యయమును తీసివేయగా నిలవ కానవచ్చెను. విల్లియం బెంటింకు ప్రభువు యొక్క జాగ్రతగలపరిపాలనమును, బెంటింకు ప్రభువును, సర్ ఛార్లెసు మెట్కాఫుగారును పాలమునందు మార్పుల నొనర్చి వ్యయము చాలవరకు తగ్గించుటవలనను, నిలవ చేకూరుటకు సాధ్యమైనది. 1838 సం॥ న ఆక్లండు ప్రభువు ఇండియాకు వచ్చినదిమొదలు నిలవ సున్నయై ఏటేటవ్యయము అధికమగుటచే ద్రవ్యము చాలమికూడ తటస్థించెను. ఆక్లండు ప్రభువు పామ్మరుస్టను మంత్రియొక్క అధికాశతో కూడికొనిన రాజ్య

నీతిని అవలంబించినవాడు. ఆక్లండు ప్రభువు తరువాత గవర్నరు జనరలుగావచ్చిన ఎలెంబరో ప్రభువు పాలనయందు సైతము రాజస్వముయొక్క స్థితి ఇటులనే యుండెను.

హార్డింజి, డల్‌హౌసీ ప్రభువులయొక్క సిక్కుయుద్ధములతో రాజస్వముయొక్క స్థితి మరింత పాడయ్యెను. 1849-50 సంవత్సరమున పంజాబు దేశము నాక్రమించుకొనిన తరువాత తిరిగి నిలవ కానవచ్చెను. అయినను డల్‌హౌసీ ప్రభువు పరిపాలనమునందు వ్యయము అధికమై 1853-54 సం॥ సరికి ముప్పది మిలియన్లకుపై దాటెను. నాగపూరు మొదలగు గొప్పరాజ్యములను సర్కారువారు ఆక్రమించుకొన్నను 1854-56 సం॥న డల్‌హౌసీ ఇండియాను వదలి వెళ్ళువరకు నష్టమేకానవచ్చెను.

కానింగు ప్రభువుయొక్క ఏలుబడియందు ప్రథమ సంవత్సరమున మాత్రము నిలవ కాన్పించినది. ఇందులకు కారణము, డల్హౌసీ ప్రభువు అయోధ్యరాజ్యమును ప్రభుత్వము వారి వశమును జేయుటవలన కలిగినదియే. అయిన ఈనిలవ సిపాయి ముట్టడి సంవత్సరమగు 1857-58 సం॥న సున్నయై, పదిమిలియన్ల పౌనులు వ్యయమే అధికమయ్యెను.

సీమ ఖర్చులు.

సీమఖర్చులు ఏటేట వృద్ధి యగుచుండుట గూడ మన మాపట్టీని పరిశీలించినందువలన తెలియవచ్చుచున్నది. బ్రిటిషు సామ్రాజ్యమును ఇండియాయందు నెలకొల్పుటవలన లాభము రెండు దేశములకును కలదు. హిందూదేశమునకు మాత్రమే కలుగుటలేదు. బ్రిటిషు సామ్రాజ్యమునందు ఇండియా శిరో

మణివలె ప్రకాశించుచున్నదని సుప్రసిద్ధ ఆంగ్లేయ రాజ్యతంత్రజ్ఞులు అభిప్రాయము నిచ్చుచున్నారు. అందువలన సామ్రాజ్యమునకగు ఖర్చులు రెండు దేశములవారును భరించుట సమంజసము. అధమము 10 వంతులలో 9 వంతుల ఖర్చు ఇండియావహించి మిగిలిన ఒక వంతగు సీమఖర్చులనైనను (ఇంగ్లాండునందలి ఖర్చునైనను) ఇంగ్లాండు వహించుటన్యాయము.

సీమఖర్చుల నిమిత్తమై ప్రతి సంవత్సరమును హిందూదేశమునుండి పరదేశయాత్ర నెడలుచున్న ధనముయొక్క ఆర్థిక ఫలితములనుగూర్చి మేజరు విన్గేటుగారిట్లు వ్రాసియున్నారు:—

"గ్రేటు బ్రిటనుకు చెల్లించబడుచున్న కప్పము ఆంగ్లేయ రాజనీతియందు కేవలము అసంగతము. పన్నులు ఏదేశమునుండి విధించబడినవో ఆదేశమునందే ఖర్చగుట ఒకతీరు; ఒక దేశమునుండి వసూలుచేయబడి మరియొక దేశమున ఖర్చగుట వాని తీరు వేరు. మొదటి విషయములో ప్రజలనుండి సేకరింపబడిన ద్రవ్యము ప్రభుత్వోద్యోగీయులక్రింద ఖర్చింపబడి, ఆ ధనము తిరిగి వారిద్వారా పరిశ్రామికవృత్తియందున్న వారికే చేరును. ఆ పన్నులవలన విభజనయే మారునుకాని, దేశముయొక్క మొత్తపు రాబడి యందెట్టివిధమైన నష్టమును కలుగనేరదు. ఒకదేశమునుండి సేకరింపబడిన ద్రవ్యము వేరొక దేశమున ఖర్చయ్యేనేని, దేశాదాయములో కొంతభాగము ఒకతెగ ప్రజలనుండి మరియొక తెగ ప్రజలకు మారుటలేదు సరి

గదా, ఏదేశమునుండి ఆద్రవ్యము సేకరింపబడుచున్నదో ఆదేశమునకు ఆ ద్రవ్యమంతయు సంపూర్ణముగ నష్టమే. ఇందువలన దేశముయొక్క ఉత్పాదకశక్తియందు ఎట్టిఫలము కలుగుననిన, ఆ ధనమునంతయు సముద్రములో వైచిన ఎంత లాభముండునో, పై దేశములకంపిన, నంతియ లాభము."

"ఇండియా దేశమునుండి సీమఖర్చులనియెడి కప్పమును గ్రహించుట న్యాయబుద్ధితో ఆలోచించినను, నిజమైన మనస్వలాభమునుబట్టి చూచినను, ప్రపంచజ్ఞానము ననుసరించి చూచినను, లోకమునకును ఆర్థిక శాస్త్రములయందలి ముఖ్యసూత్రములకును కేవల విరుద్ధముగానున్నది. కాబట్టి ఇకనైన సీమఖర్చులను ఇంగ్లీషు కోశాగారమునుండి మనము చెల్లించుట సమంజసమైనదియు విశేషజ్ఞానముతో కూడుకొనినపనియునైయున్నది. సీమఖర్చులనగా 1. ఈస్టిండియా కంపెనీ భాగములపైని ప్రతిసాలునను చెల్లించవలసిన లాభమును, 2. ఇంగ్లాండునందు చేసిన ఋణముయొక్క వడ్డీయును, 3. ఇండియా ప్రభుత్వమునకు సంబంధించిన ఇంగ్లాండునందలి ఉద్యోగస్థులయొక్క జీతములును, యస్టాబ్లిషుమెంటు ఖర్చులును, కచ్చేరీలనుంచుటకై కట్టబడిన ఇండ్లయొక్క మూల్యమును, 4. పురసంబంధమైనవియు, సేనాసంబంధమైనవియునగు ఉద్యోగస్థులయొక్క ఫర్లో (సగము జీతమునైనిచ్చు శెలవు) ముజరాలు ఫించనులును 5. హిందూదేశమున పనిచేయు నిమిత్తమై సేకరించబడిన బ్రిటిషు సైన్యమునకు ఇంగ్లాండులో అయిన ఎల్ల ఖర్చులును, 6. ఇంగ్లండునుండి ఇండియాకును ఇండియానుండి ఇంగ్లండు

కంపెనీ యాజమాన్యముక్రింద ఇండియా దేశము ఉన్న 21 సంవత్సరములలోను పెరిగిన ఇండియా ఋణము ఈ క్రింద పొందుపర్చబడిన పట్టీవలన తెలియనగును.

2

సంవత్సరము	ఇండియా ఋణము	ఇంగ్లండునందు చేసిన ఋణము	మొత్తము
1837-38	30,249,803	3,552,825	33,772,718
1838-39	30,231,162	1,734,300	31,965,462
1839-40	32,750,69	1,734,300	34,484,997
1840-41	34,187,727	1,734,300	35,992,127
1844-45	41,203,150	2,299,600	43,502,750
1845-46	41,592,249	2,299,600	43,891,849
1846-47	44,584,625	2,299,600	46,884,625
1850-51	51,199,815	3,899,500	55,099,315
1855-56	53,848,922	3,915,317	57,764,239
1856-57	55,546,652	3,915,317	59,461,969
1857-58	60,704,084	8,769,400	69,473,484

1839-40 సం॥ లలో పెరిగిన 2½ మిలియన్ల పౌనుల ఇండియాఋణము సరియైనదికాదు. లెక్కలను వ్రాయుట యందు గలిగినమార్పులచే అధికముగా కానవచ్చును. ఆక్లండు ప్రభు నారంభించిన ఆఫ్ఘనుయుద్ధమువలన 1840-41 మొదలు 1844-45 వరకు 34½ మిలియన్లనుండి 43½ మిలియనుల వరకు ఋణము పెరిగినది. ఒక్క ఈస్టిండియా కంపెనీవారు మాత్రమే కాక జాన్ బ్రైటు అను నొక ఆంగ్లేయశాస్త్రజ్ఞుడు

సైతము ఆఫ్ఘనుయుద్ధముయొక్క ఖర్చులను ఇండియాకు కట్టిపెట్టుట అన్యాయమని తీవ్రముగా వాదించెను. 'ఇంగ్లీషు రాజ్యాంగ మంత్రులవలన ఇంగ్లీషుసామ్రాజ్యలాభము నిమిత్తమై చేయబడిన ఈ ఆఫ్ఘను యుద్ధముయొక్క ఖర్చు-15 మిలియన్ల పౌనులు-ఇంగ్లీషుప్రజలే భరించవలసియున్నది.' సిక్కుయుద్ధములవలన 1850-51 సరికి ఇండియాఋణము 55 మిలియనులైనది. డల్‌హౌసీ ప్రభువుయొక్క ఏలుబడియందు, తక్కువ చేయుటకు ఎన్నిప్రయత్నములు సల్పబడినను ఇండియాఋణము 59½ మిలియనులైనది. 1857-వ సం॥న జరిగిన సిపాయిముట్టడి వలన సంవత్సరాంతమునకు నిలిచియున్న ఇండియా ఋణము 69½ మిలియనులు. ఈస్టిండియా కంపెనీనుండి ఇంగ్లీషు ప్రభుత్వమువారి ఏలుబడి క్రిందకు ఇండియాదేశము వచ్చునరికి 69½ మిలియన్ల సవరనులుగ ఇండియాఋణము నిలిచియుండెను.

'ప్రపంచమునందేదైన న్యాయమగు తిరుగబాటున్నచో అది ఈస్టిండియాకంపెనీపై హిందూముసల్మాను సిపాయిల యొక్క తిరుగబాటే అయియున్నది. ఆవుయొక్కయు పంది యొక్కయు క్రొవ్వును అంటించిన తూటాలను సిపాయిలను ఉపయోగింపుడని వారు కోరుటవలన వారు ఎదిరించుట న్యాయమని' ఒక నిష్పక్షపాత బుద్ధిగల చరిత్రకారుడు వ్రాసియున్నాడు. బ్రిటిషు పాలనాధికారులు ఈఘోరపాట్లను గావించిరి. అయిన ఖర్చునుమాత్రము ఇండియావహించినది. ఇంతకు మునుపు ఇండియాసైన్యము చీనా ఆఫ్ఘను స్థానములయందు ఉపయోగింపబడినది. ఇండియా సరిహద్దులుదాటి ఇండియా సైన్యములు పనిచేసినందుకుగాను ఏవిధమైన ముజరాను ఇచ్చి

యుండలేదు. కాని, సిపాయిముట్టడిని అణచుటకై ఇంగ్లాండు నుండి పంపబడిన బ్రిటిషు సైన్యముయొక్క ఖర్చుమాత్రము ఇండియాదేశమునుండి వసూలుచేయబడినది.

ఆశ్రయదేశములయొక్కయు, అధినివేశనములయొక్కయు పరిపాలన విషయమై ఇంగ్లాండునందు నెలకొల్పబడిన కచేరీలయొక్క ఎల్ల ఖర్చులును సైనిక నావికాదళసంబంధమగు ఖర్చులును, ఇంగ్లాండుదేశమే భరించుచున్నది. ఈతీరుగనే ఇండియాసంబంధమగు ఖర్చులను సైతము ఇంగ్లాండు భరించుట న్యాయము. ఇండియా సామ్రాజ్యమును శత్రువులనుండి కాపాడుటకై నియోగింపబడియున్న సైనికవ్రాతమునకగు ఖర్చులలో ఒక్కషిల్లింగు (12 అణాలు) నైన బ్రిటనుదేశము భరించుటలేదు.

అధినివేశనములకేమి, ఇతర విదేశప్రభుత్వములకేమి అవసరము వచ్చినపుడు ఎంతద్రవ్యము ఖర్చుఅయినను వెనుదీయక సహాయమొనరించు ఇంగ్లాండు దేశము, ఇండియాసామ్రాజ్యము అఖండమైన ధనక్షోభచే పీడింపబడుచున్నతరి, సహాయమునొసంగక వెనుదీయుట చాల ఆశ్చర్యకరముగను విపరీతముగను ఉన్నది.

సహాయము నొసంగుటలేదు సరికదా, ఇండియాకు పంపిన బ్రిటిషుసైన్యములయొక్క ఎల్ల ఖర్చులను గ్రేటుబ్రిటను వసూలు చేయుటయేకాక, ఆసైన్యములు ఇంగ్లండునుండి ఇండియాకు బయలుదేరుటకు పూర్వము, ఇంగ్లండులోనున్న ఆరు మాసములకైన ఖర్చులనుకూడ ఖచితముగ వసూలు చేసినది.

ప్రజాప్రతినిధి సభయును, ఇంగ్లీషుప్రజలును సరిగా వ్యవహరించని లోపముచే ఈయుపద్రవము సంభవించినది. గనుక ఇంగ్లీషుప్రజలే ఈభారమును వహించుట న్యాయమని జాన్ బ్రైటుగారు నొక్కివక్కాణించిరి.

ఇండియాదేశమును యుద్ధములుచేసి జయించిస్వాధీనపరచుకొనుటకును, పరిపాలించుటకును, ఇండియాయందలి ద్రవ్యసాధనములను వాడుకలోనికి తెచ్చుటకును, బ్రిటిషుప్రజలచే పెట్టుబడి పెట్టబడినమూలధనమే, ఇండియా ఋణమునకుకారణమని కొందరియభిప్రాయము. అట్టి యభిప్రాయము సరికాదు. 1858 సం॥ వరకు తనను జయించుటకును పరిపాలించుటకును కావలసిన ధనమును ఇండియాదేశమే వహించినది. 1858వరకు విన్గేటుగారి లెక్కప్రకారము 19-వ శతాబ్దమునుండి, వడ్డీనిగాక, నూరుమిలియన్లవరకు ఇండియాకప్పమును చెల్లించినదని తేలుచున్నది. 18-వ శతాబ్దమునందు గ్రహించిన సొమ్మును లెక్కించనేలేదు.

"సీమఖర్చులనుపేర వసూలు చేయబడిన ఈకప్పమే ఇండియాఋణమునకు కారణము" తనపరిపాలనకు కావలసిన యావత్తుఖర్చును, దేశమునందు తరచుగ జరగుచువచ్చిన సంగ్రామములకును, కొన్నికొన్ని ప్రదేశములను ఆక్రమించుకొనుటకునై కావలసిన ద్రవ్యమును, ఇండియాదేశమే భరించినది. స్వదేశమునందలి ఖర్చులకు అదనముగా సీమఖర్చులకువలయు

ద్రవ్యమును చెల్లించ లేక ఏటేట ఋణపడి [illegible] ప్రభువు ఇండియానువిడిచి స్వదేశమున కేగునప్పటికి (60) మిలియన్ల వరకు ఋణపడిపోయినది. సిపాయిముట్టడి 1857 సం॥ న పది మిలియన్లు ఖర్చగుటచేత కంపెనీవ్యవహారము ముగింపునకువచ్చునప్పటికి ఇండియాఋణము నెబ్బదిమిలియన్ల పౌనులాయెను.

ఈస్టిండియా కంపెనీవారి వద్దనుండి, బ్రిటిష్ ప్రభుత్వమువారిచే, ఇండియా సామ్రాజ్యము క్రయమునకు కొనబడుటచే ఆక్రయధనము సైతము ఇండియాదేశస్థులే భరించవలసి వచ్చెను. కంపెనీ భాగస్వాములయొక్క మూలధనము బ్రిటిష్ ప్రభుత్వమువారిచే చెల్లించబడక ఇండియా ఋణమునందే చేర్చబడినది.

ఇట్లు పెరిగిపోయిన ఋణమునకు ఇండియా గవర్నమెంటువారు హామీగానుండుటచేత, (ఇంగ్లాండునకు) ఎక్కువ వడ్డీరేటుప్రకారము వడ్డీ చెల్లించబడుచున్నది. హామీ ఈయకపోయినను ఈఋణమునకు ఇంగ్లండు ప్రభుత్వమువారు పూచీపడినయెడల వడ్డీరేటుతగ్గి ఒకమిలియను పౌనులు ఇండియా చెల్లించవలసిన వడ్డీలో తగ్గును. ఈవిషయమును గూర్చి స్టాన్లీ, డెర్బీ (Stanly, Derby) ప్రభువులు తీర్మానముల నుపపాదించినను, ఇంగ్లండు ప్రభుత్వమువారు అంగీకరించిన లేదు.

1858-59 సం॥ మొదలు 1876-77 సంవత్సరమువరకు ఇండియాయొక్క ఆదాయము ఈక్రింది పట్టీవలన విశదమగును. రివిన్యూ కలములో, భూసంబంధమైన రివిన్యూమాత్రమే

చూపబడినది. ఖర్చుకలములో ఇంగ్లాండునందలి ఖర్చుమాత్రమే వ్రాయబడెను.

3

సంవత్సరము	ల్యాండు రివిన్యూ నేలపన్ను	మొత్తపు ఆదాయము	(సీమఖర్చులు) ఇంగ్లాండు నందలి ఖర్చు	మొత్తపు ఖర్చు
	పౌనులు.	పౌనులు.	పౌనులు.	పౌనులు.
1858-59	18,123,658	36,000,788	7,466,136	51,056,930
1859-60	18,757,400	39,705,822	7,239,451	51,861,720
1864-65	20,095,061	45,652,897	6,998,770	46,450,990
1865-66	20,473,897	48,935,220	6,211,178	47,332,102
1870-71	20,622,823	51,413,686	10,083,004	51,098,506
1875-76	21,503,742	51,310,063	9,898,683	53,911,747
1876-77	19,857,152	55,995,785	13,467,763	58,178,563

18 సంవత్సరములలో అనగా 1875-76 సంవత్సరాంతమునకు, ఇండియాదేశముయొక్క మొత్తపు ఆదాయము 36 మిలియన్లనుండి 51 మిలియన్ల వరకు వృద్ధియయ్యెను. ఈకాలమునందే సీమఖర్చులు 7½ మిలియన్లనుండి 10 మిలియన్ల వరకు పెరిగెను.

1876-77 సం॥ న చెన్నరాజధానియందు గొప్ప క్షామము తటస్థించెను. ఆహేతువువలన నేలపన్నువలని ఆదాయము తగ్గిపోయెను. ఆసంవత్సరముననే సర్కారువారు ప్రారంభించిన సార్థకమగు పనుల (Productive works-Irrigation & Railways) యొక్క ఆదాయమును వ్యయమును చేరి గతసంవత్సరము కంటె అధికమైనవి.

1856-57 సంవత్సరమునకు నిలిచియున్న ఇండియా ఋణము 59½ మిలియన్లు. ఆ మరుచటి సంవత్సరము 69 మిలియన్లయినది. సిపాయి ముట్టడిని అణచు నిమిత్తము చేయబడిన యుద్ధములయొక్క ఖర్చును ఇండియాకు కట్టిపెట్టుట చేత 1860 సం॥ న ఇండియా ఋణము నూరుమిలియన్లకు పై బడినది. గారంటిపద్ధతిని మానివేసి సర్కారువారే, ఋణము చేసి తెచ్చిన ధనముతో రైల్వేలు 1870 సం॥ నుండి నిర్మించ నారంభించిరి. జాగ్రత యనునది గమనించక ఇచ్చవచ్చినచోట్ల నెల్ల ఇనుపదారులు నిర్మింపబడుటచేత ఇండియా ఋణము 1870 సం॥ నుండి విశేషముగా వృద్ధి కాదొడంగినది.

సంవత్సరము	ఇండియా ఋణమును ఇతర బాకీలును	ఇంగ్లాండునందలి ఋణము	మొత్తము
	పౌనులు	పౌనులు	పౌనులు
1858-59	66,682,031	15,69 ,277	81,171,308
1869-70	72,999,633	35,196,700	108,186,338
1870-71	31,371,859	54,627,617	118,000,476
1874-75	81,738,594	43,597,038	130,835,597
1875-76	84,759,779	49,797,633	134,556,809
1876-78	83,537,922	55,897,033	138,935,025

1876-77 సంవత్సరాంతమున నిలిచియున్న 139 మిలియన్ల ఇండియాఋణమునందును, ప్రభుత్వమువారు సర్కారు రైల్వేలపైనను నీటిపారుదల పనులపైనను ఖర్చు పెట్టబడిన ద్రవ్యము మాత్రము ఇమిడియున్నది. 1876-77సం॥ సరికి సర్కారువారు, సర్కారు-ఇనుపదారులక్రిందను, నీటిపారుదల

పనుల నిమిత్తమును 24 మిలియన్ల పౌనులు వినియోగించిరి. అందు, ఇనుపదారులకైన వ్యయము 141,651,353 పౌనులు. నీటిపారుదల పనులకు వెచ్చించినది 9,651,618 పౌనులు.

ఈఋణమునందు న్యాయముగా బ్రిటిషు ప్రభుత్వము వారిచే, తమ కోశాగారమునుండి చెల్లించవలసినదియు ఇండియాకు అన్యాయముగా కట్టిపెట్టబడినదియు నగు ఈస్టిండియా కంపెనీ భాగస్వాముల మూలధనము 12 మిలియన్ల పౌనులును చూపబడలేదు. ఇండియా దేశముమాత్రము ఇప్పటికిని ఈ ద్రవ్యమునకు వడ్డీని చెల్లించుచునే యున్నది.

ఈస్టిండియా కంపెనీవారు పెంచిన 69½ మిలియన్ల ఋణమును గురించి ఇదివరకే ముచ్చటించితిమి. కాని బ్రిటిషు ప్రభుత్వమువారి ఏలుబడి క్రిందకువచ్చిన 19 సంవత్సరముల లోను, ఇండియాఋణము—ఈస్టిండియా కంపెనీవారి మూలధనము గాక—రెండింతలయినదని వ్రాయుటకు చాలవిచారకరముగా నున్నది.

విశేషముగ పెరిగిపోయిన ఇండియా ఋణమును గురించి నిష్పక్షపాత బుద్ధితో తీర్పునొసంగెడి ఇతర న్యాయస్థానము వారెవరైన ఇండియాదేశమునకు సంబంధించిన ఎల్ల రాజస్వ విషయములను పరిశీలించి తీర్పునొసంగెదరను కొందము.

అట్టి న్యాయస్థానముయొక్క తీర్పెటులనుండునని మన మాలోచించవలసిన అగత్యములేదు. కంపెనీవారు పెంచిన 69½ మిలియన్ల పౌనులను ఒక్కసారిగా తీసి వేసియుందురు. ప్రాయశః వారు సిపాయి ముట్టడిని అణచు నిమిత్తము

ఇండియాకుపంపిన బ్రిటిషు సైన్యముల యొక్క ఖర్చు 40 మిలి యన్ల పౌనులును ఇండియా చెల్లించుట యుక్తమని తీర్పుచేసి యుంపురు. అయిన వారు సామ్రాజ్య సంబంధమయిన యుద్ధ ములలో అఫ్గనిస్థానమునందును, చీనా, పెరిషియా, అబిసీనియా దేశములయందు నియోగించబడిన ఇండియా సైన్యముల యొక్క ఖర్చును ఇండియాకు ముజరానిచ్చియే యుందురు. అటుల జేసినచో ఇండియా చెల్లించవలసిన శేషమేమైనఉన్నను బహు స్వల్పముగా నుండును. సర్కారువారు ఇండియా యొక్క క్షేమమునిమిత్తమై వ్యయముచేసిన 24 మిలియన్ల పౌను లను ఉంచియుందురు. వారు దాని కొరకై యేర్పాటును మాత్ర ముచేసి యుందురు. అట్టి పనులకు అప్పు చేయుటను మాత్ర ము కట్టిపెట్టుమని వ్రాసియుందురు. ఏలననగా, ఇనుపదారులు ఇతర కంపెనీలేవైన పూనుకొనువరకు ఆపుచేయవచ్చును; నీటిపారుదల పనులు మాత్రము సర్కారువారికి ప్రతిసాలునను వచ్చెడి రాబడినుండి ఖర్చుపరచి, వృద్ధిచేయ వలసినదని తీర్పు నొసంగియుందురు. ఈతీరున నూరుమిలియన్ల ఋణము లెక్కచేసి వేయబడియుండును. శేషము ఇండియా రాజస్వమునుండి, ఈనూరు మిలియన్లకును వడ్డీ చెల్లించ నక్కరలేకుండ పోవుట వలన, అలతికాలములో తీరిపోగలదు. దేశీయ ఋణమన్న మాటయే ఉండకపోవును. ఇండియాయందు దేశీయ ఋణ ముండవలసిన అగత్యము లేదు.

దేశీయ ఋణమనునది ఇండియా దేశమున పూర్వపు రాజుల పరిపాలనమునందెచ్చటను కానరాదు. కొన్ని సమ యములయందు, హిందూ ముసల్మానురాజులు సొమ్మును అప్పు

తీయవలసి వచ్చినను వారిపూచీమీఁదనే అప్పు తెచ్చుచుండిరి. ఇంగ్లాండునందలి రాజులు సైతము పూర్వకాలమున రాజద్రవ్య సంబంధమైన నగలను తాకట్టుపెట్టిగాని, ఆఋణ తీర్మానము నిమిత్తము కొన్ని రాబడుల ఆదాయమును కేటాయింపు చేసి గాని, బ్యాంకరుల (Bankers) వద్ద అప్పు తెచ్చుచుండిరి. 1688 సంII వరకు ఇంగ్లండు దేశమున దేశీయ ఋణమన్న మాటయే లేదు. ఒక మిలియను పౌనులకు తక్కువగా (664, 268 పౌనులు) ఉండెను. పూర్వము ఇండియాను ఏలిన రాజుల పద్ధతిగాని లేదా 17 వ శతాబ్దమునందలి ఇంగ్లీషు నీతిగాని బ్రిటిషు పాలకులు ఇండియాయందు అవలంబించి యుండిన యెడల ఏ దేశమునకు బాధకరముగ నుండి యుండును; అటుల చేయక సులభముగా యూరోపాఖండమున వ్యాపించబడిన దేశీయ ఋణమును, ఇండియాయందుకూడ నెలకొల్పిరి.

యుద్ధములను జరుపుచుండుటకును, అనేక వ్యాపారములను వృద్ధిచేయుటకును, ఇతర దేశస్థులతో పాటు తమ వ్యాపార సర్వాధికారమును నిలుపుకొనుటకును యూరోపా దేశస్థులు నవీన ముగా దేశీయ ఋణమును (National debt) కల్పించిరి. ఏ ఇతర దేశములను ఇండియా జయించ నపేక్షించుట లేదు. ఆక్రమణమునకు పోయెడి దేశము ఇండియా కాదు. బలవత్తరమైన సైన్యము నౌకాబలము ప్రాముఖ్యమునకలిగి యున్నప్పుడు ఈదేశమునకు ఎట్టివిధమైన భయమునులేదు. ప్రతి సాలునను వచ్చెడి ఆదాయమునుండియే ఇంగ్లీషువారు ఈదేశ మును స్వాధీనపరచుకొనుటకు వెచ్చించిన ఖర్చులను హిందూ దేశము చెల్లించగలిగినది. దేశక్షేమకరములగు పనులనుసర్కా

రువారు పూనికొనినప్పుడు, దేశముయొక్క ఆదాయమునుండియే
వెచ్చించుట సమంజసము. ఇట్టిదేశములో శాశ్వతమైన దేశీయ
ఋణమును కల్పించుటకు అగత్యములేదు. సిపాయిముట్టడి
యుద్ధములైనతరువాత దేశమందెల్లెడల శాంతి నెలకొనియున్న
ప్పుడును, బ్రిటిషుప్రభుత్వమువారు న్యాయముగ పాలింపనారం
భించినపుడును, దేశీయఋణమును వృద్ధిచేయు నగత్యము లేదు.
లారెన్సుప్రభువు ఖర్చునంతయు ఆదాయమునుండి భరించుటకు
ఎన్నియో ప్రయత్నములు సల్పెను. మేయో (Mayo) ప్రభువు
ఋణముచేసి తెచ్చిన ధనముతో ప్రజోపయోగకరములగు
పనులను ప్రారంభించుట పొరపాటు. ధనముసులభముగా అప్పు
పుట్టినపుడు ఖర్చుకూడ శీఘ్రముగా అగుచునే యుండును.
అందువలననే ఋణము వృద్ధిగాంచుచుండెను.

19-వ శతాబ్దమునందెల్ల గొప్ప కోశాగారమంత్రి
(Financier) యనిపేరొందినగ్లాడుస్టను (Gladstone) మంత్రి,
ఇండియాయొక్క ఋణమును, వ్యయమును, విపరీతముగా
హెచ్చుగుటను కనిపెట్టినవారై దానిని తగ్గించుటకుగాను
1871 సం॥ న ఒకకమిటీని నియోగించెను. గ్లాడుస్టను దేశము
నకు ముఖ్యరాజ్యాంగ మంత్రియగుటచే, ఈసభయందితని
కార్యభారమును వహించుటకు వీలుచిక్కలేదు. ఈమహాను
భావుడందుండియుండిన, ఎంతయో లాభకరముగ నుండెడిది.
హెన్రీఫాసెట్టను ఒకఇండియా దేశమిత్రుని తనస్థానే ఆసభ
యందీయన ప్రవేశపెట్టెను. 3, 4 సం॥ లవరకు ఈసభవారు
పనిచేసి చాలసాక్ష్యమును గ్రహించిరి. కాని స్వతంత్ర ప్రభు
త్వము (Liberal Government) 1874 సం॥ నందు మారి

పోవుటవలన ఈసభవారియొక్క శ్రమ వృథయయ్యెను. అయి
నను ఈసభవారు విచారణచేసిన సాక్షులు చెప్పిన సంగతులు
మాత్రము సర్వజనాదరణీయంబులై యున్నవి.

అందలి సాక్ష్యములను మూడునాల్గింటిని, ఇందు పొందు
పరచుచున్నాము.

1865 మొదలు 68 సంవత్సరములవరకు ఇండియాకోశా
గారమంత్రిగ పనిచేసిన, మాసీ దొరగారొక ముఖ్యసాక్షి.
సభవారడుగగా నీతఁడు నిక్కచ్చముగా ఆదాయమునుబట్టి,
వ్యయమును తగ్గించవలెనని సంతోషముగా చెప్పెను.

“వ్యయమునకు సరిపోవునట్లుగా ఆదాయమును వృద్ధి
చేయవలయుననియెడినీతి, ఇంగ్లీషు రాజస్వమునను చెందియు
న్నది. ఆ సిద్ధాంతమున ఇండియా రాజస్వమునకును దీనికి
వ్యతిరేకపుసిద్ధాంతము అవలంబింపవలసి యున్నది. ఇందులకుగల
ముఖ్యకారణము దేశమునందలి ద్రవ్యసాధనములు బహు
స్వల్పము. ఏమాత్రము పన్ను అధికముగ చేసినను నష్టము
(Deficit) సంప్రాప్తించును. ఏపన్నును విస్తరింప చేయుటకు
వీలులేదు. రాబడిపన్నుదక్క ఏకొత్తపన్నును ఇపుడుకల్పింప
వీలులేదు. నాకు తెలిసినంతవరకు క్రొత్తపన్నులు వేయుటకు ఎట్టి
స్థిరమైన ఆధారములును లేవు. కాబట్టి ఇండియాదేశపు రాజస్వ
వ్యవహారకర్తలందరు (Financiers) వ్యయమును, ఆదాయ
మునకు సరిపోవునట్లుగా తగిన ఏర్పాటులను చేసికొనుట విధియై
యున్నదని నొక్కి వక్కాణింపగలను.”

1834 సం॥ న ఈస్టిండియా కంపెనీ డైరెక్టరులకు వెల్లింగ్టను ప్రభుప్రవారు, వ్యయమును ఆదాయమునకంటె హెచ్చించకుండ చేయవలెనని జవాబు నిచ్చియున్నారు. "డ్యూకు ఆఫ్ వెల్లింగ్టను వారిచ్చిన జవాబుయొక్క సారమును గ్రహించినవారై, ఆతీరుగనే హిందూదేశమునందంతయును అమలు జరపిన చాల బాగుండుననని" మాసీగారనువారు నుడివిరి.

సర్ ఛార్లెసు ట్రివిలియను గారిచ్చిన సాక్ష్యము ఇంతకంటెను బలవత్తరమైనదియును నిర్దిష్టమైనదియు నైయున్నది. ఈమహానుభావుడు కూడ ఇండియాదేశమున కోశాగారియను ప్రతి పదవిని వహించినవాడే. ఈతడు మదరాసు గవర్నరుగ నున్నప్పుడు నాలుగుసార్లు వ్యయమును, పన్నులును, అధికము చేయ కూడదని నిర్భయముగా పోరాడెను. 1859 సం॥ న పొగాకుపై పన్ను విధించరాదని అభ్యంతర పెట్టెను. "నాటనుండియు ఇండియాలో రాజస్వవిషయమున రెండు పరస్పర విరుద్ధములగు రాజ్యనీతులు ఉండుట తటస్థించినది; వ్యయమును తగ్గించవలయుననియెడి రాజ్యనీతిని బలము చేయవలెనని నావాదము; కలకత్తాకును ఇంగ్లండునకును సమ్మతిమైన రాజ్యనీతి, పన్నులను హెచ్చించ వలసినదనియే." ఆసంవత్సరమునందే రెండు మూడు సారులు గవర్నరు జనరలువారికి ఖర్చులను తగ్గించవలసినదని అభ్యంతర పెట్టుచు వ్రాసెను. 1860 సం॥ మార్చి 20 తేదీని, నాల్గవసారి ఈయన తిరిగిఆటంక పెట్టుటవలన ఉద్యోగమునకు సైతము రాజీనామా నీయవలసివచ్చెను. ఆదాయమును బట్టివ్యయమును నిర్ణయించుకొన వలయునని [illegible] ఘోరముగాపోరాడెను. రాజస్వ విషయములయందును, అన్ని

ఇతరవిషయములయందును ప్రజాప్రతినిధుల సలహానుతీసికొని వ్యవహరించుటయే క్షేమకరమని ట్రివిలియనుగారు నొక్కి వక్కాణించిరి.

"ఇండియాదేశ పరిపాలనమునందు ప్రజల కెవ్విధమైన ప్రమేయమును లేకుండ జేసి, వెలివేసినట్లు వేరుగా నుంచుచున్నాము; మనము ఏదైన ఒకదానిని ఆలోచించి, దానిని గురించి విశేషముగా వారిని అడుగకయే ఆప్రకారము ఆచరించుట మంచిదని మాత్రము చెప్పి అమలులోనుంచుచుందుము." సర్ రాబర్టు మాంట్గోమరీగారు నుడివిరి. ప్రతిస్థానిక ప్రభుత్వాధిపతియును (Local Governor) దేశీయప్రతినిధులు గల యొక ఆలోచనసభను (Consultative body) కలిగియున్నపక్షమున పన్నులను విధించు విషయమునను, న్యాయశాస్త్రమునందు మార్పులొనరించు విషయమునను ప్రజల అభిప్రాయములను, ప్రభుత్వోద్యోగియుల అభిప్రాయములను తెలిసికొనినవాడై, ఋజుపథమున దేశమును పాలించుటకు వీలగునని, ఈమహానుభావుని యుద్దేశ్యము.

గే (Gay) యనునొక ప్రముఖుడు రాజస్వ సభవారి యనుమతితో ఒక నివేదనాపత్రమును (స్టేటుమెంటు) దాఖలుచేసెను. ఈపత్రమునందు సిపాయి ముట్టడికి పూర్వము 1856-57 సం॥యొక్క పన్నులును, ప్రభుత్వమువారు పరిపాలించనారంభించిన పంద్రెండవ సంవత్సరమగు 1870-71 సం॥ యొక్క పన్నులను చూపబడినవి. ఇక్కాలమున ఇండియా సామ్రాజ్యము ఉన్నది ఉన్నయట్లులనే యున్నది కాని వృద్ధి కాలేదు ; ద్రవ్య

సాధనములుగాని కళలుగాని అభివృద్ధిలోనికి రాలేదు; దేశము నందు పన్ను వేయదగిన సంపద యందుగాని ప్రజలయొక్క స్థితి గతులయందుగాని ఏవిధమైన వృద్ధియు కానరాదు; అయినను పన్నులు మాత్రము అపరిమితముగా వృద్ధియైనవి. అందు ముఖ్యముగా ఉప్పు పన్నును, మరికొన్ని ఇతర పన్నులును అద్భుతముగా పెరిగినవి.

వానిలో కొన్నిటిని ఈదిగువను పొందుపరచుచున్నాము.

బాబతు వారి రివెన్యూ	1856-57	1870-71
	పౌనులు.	పౌనులు.
భూమిపన్ను	20,046,748	24,170,151
ఇతరపన్నులు (Assessed taxes)	108,833	2,072,025
కస్టమ్సుపన్నులు (సముద్రముపై ఎగుమతి దిగుమతులు కాబడు వస్తుసంచయముపై వసూలు చేయబడు సుంకము)	1,191,985	2,610,789
ఉప్పుపన్ను	3,610,223	6,106,280
నల్లమందు	4,088,434	8,045,469
ఇతరబాబతుల రివెన్యూ	1,974,687	6,371,521
మొత్తము...	31,920,910	49,376,225

బ్రిటిషు ప్రభుత్వమువారు ఇండియాను స్వాధీనముగ పాలించనారంభించిన పంద్రెండు సంవత్సరములలోను పన్నులు నూటికి యేబదివంతున హెచ్చయినవి. పన్నులు అధికమైనవని యును, సర్కారువారు పన్నులను తగ్గించవలసినదని ఎన్నివిధ

మైన ప్రయత్నములును సల్పలేదనియును, 1856-57 సం॥ న కంటె 19 మిలియన్లు పెరిగెననియు, బొంబాయి ప్రజాసంఘము వారు 1871 సం॥ రం మార్చి 29 తేదీని పార్లమెంటువారికొక మహాజరర్జీని పంపుకొనిరి.

దేశభక్తుడగు మన దాదాభాయి నౌరోజీ ఇండియా పక్షమున సాక్ష్యము నొసంగుచు బ్రిటిషుపరిపాలనమునందు ఏటేట పన్నులు అధికముగా పెరుగుచుండెననియును, సంప దయు ద్రవ్యసాధనములును క్షీణించుచున్నవనియును, దేశము నందెల్లెడల దరిద్రదేవత మూర్తిభవించియుండెననియును, అతి గంభీర వాక్కులతో సభవారి యెదుట సహేతుకముగ జర్పించెను.

“ఇంగ్లాండుదేశము తనద్రవ్యసాధనములనుండి (మేయో ప్రభువుగారు చెప్పినప్రకారము) సాలునకు డెబ్బది మిలియన్ల పౌనులు ఆదాయమును సంపాదించుచున్నది. అందు సర్కారు ఋణమునకు చెల్లించవలసిన వడ్డీక్రింద 27 మిలియన్ల పౌను లను తీసివేయగా, గవర్నమెంటువారి ఇతరఖర్చులకుగాను 43 మిలియన్ల పౌనులు మిగులుచున్నవి. ఇంగ్లీషు ప్రజలయొక్క ఆదాయములో ఖర్చు నూటికి అయిదున్నర వంతగుచున్నది. బ్రిటిషు ఇండియా ప్రభుత్వమువారికి సాలునకు ఏబదిమిలియన్ల సవరనుల ఆదాయము వచ్చుచున్నది. అందు 8 మిలియన్ల సవ రనులు, ఇండియా ఋణముయొక్క వడ్డీక్రిందను, ఇనుపదారుల క్రిందను తీసివేయగా, 42 మిలియన్ల సవరనులు ప్రభుత్వము వారి ఇతర ఖర్చులకు మిగులుచున్నది. ఇది 300 మిలియన్ల

ప్రజలయొక్క ఆదాయములో నూటికి 14-వ వంతు అగు
చున్నది. ఇండియాగవర్నమెంటువారు బ్రిటిషు గవర్నమెంటు
కన్న, రెండున్నర రెట్లు అధికముగా వ్యయముచేయుచున్నారు."

ఇండియా ప్రజలెంత సహేతుకముగా ఖర్చుతగ్గించ
వలయునని మొఱలిడినను నిష్ప్రయోజనములైనవి. పన్నుల
యందుగాని, వ్యయమునందుగాని అణుమాత్రమైనను తగ్గించ
బడలేదు. మేయోప్రభువుగారి క్రొత్త ఏర్పాటులవలన స్థానిక
ప్రభుత్వములవారు మరికొన్ని క్రొత్తపన్నులను విధించుట
గూడ తటస్థించినది. ప్రజాప్రతినిధులసలహాను పడయుట అనవసర
మని సర్ చార్లెసు ట్రెవిలియనువంటి అనుభవశాలులగు వారలను
లెందరు సలహానిచ్చినను అంగీకరించరైరి.

ఇండియాదేశము నందలి న్యాయము చాలనట్లుండినా,
అబిసీనియాల యుద్ధములయొక్క ఖర్చులను, తంతిమార్గముల
కైన ఖర్చులును, సేనాసంబంధములైన ఖర్చులును న్యాయ
ముగా ఇంగ్లీషు రాజస్వమునుండి చెల్లించబడ వలసియున్నను,
ఇండియాదేశమునకే కట్టిపెట్టబడుచు వచ్చినవి.

1858 సం॥ వరకు ఇట్టివిషయములయందు ఈస్టిండియా
కంపెనీ డైరక్టరులు ఆటంకపెట్టుచునే యుండెడివారు. కంపెనీ
తీసివేసిన తరువాత ప్రజాప్రతినిధులకు పాలనమునందు ప్రమే
యము కలిగించుకొనుటకు వీలులేదయ్యెను. బ్రిటిషు ఆంత
రంగిక సభయందు ఇండియాకార్యదర్శి ఒకసభ్యుడు. ఆంత
రంగిక సభవారందరు ఏదైనని ఒకమార్గమును అవలంబించుచున్నను,
వారియూహలకు ఈయన అడ్డుచెప్పజాలడు. ఇక కార్యదర్శి

గారి సభ్యులన్నలో ఇద్దరుదక్క మిగిలినవారు ఇండియా ప్రతి
నిధులు గాకపోవుటచేత బ్రిటిషుప్రజలయొక్క ఆశయములకు
ప్రాముఖ్యతనీయక వీలులేదు. ఇండియా దొరతనమువారును
నాగరికార్య నిర్వాహకసభయందును రాజస్వవిషయమున ప్రజా
ప్రతినిధుల కెవ్విధమైన జోక్యమును కలిగించక పోవుటవలన,
ఇంగ్లండునుండివచ్చెడి ఆజ్ఞాపత్రముల ప్రకారము అమలు
జరుపవలసి వచ్చుచున్నది.

ఇండియాయొక్క ఆశయములు ఎట్లణగద్రొక్క బడు
చున్నదియును 'శాలిస్బరీ' ప్రభువుయొక్క సాక్ష్యమువలన
స్పష్టమగుచున్నది.

అన్యాయముగా ఇండియాకు ఖర్చులను తగిలించుట
అసమంజసమైన పనియని తెలిసి ఇండియాకార్యదర్శి "అటులచేసి
నచో నేనంగీకరించువాడనుకాను. ఉద్యోగమునకు రాజీనా
మానిచ్చెదనని" యనగూడదాయని ఫాసెట్టుగారు ప్రశ్నించిరి.

శాలిస్బరీప్రభువు—"ఏమంత్రియును అటుల జేయుటకు
జడియును. ఏలననగా అట్లుచేయుటవలన గవర్నమెంటే ఆగి
పోవుట తటస్థించును."

ఫాసెట్టు—"మీరూరకుండ వలసినదేనా"?

శాలిస్బరీప్రభువు—"ఎట్టి అన్యాయమునకైనను ఘట్టిగా
అడ్డుచెప్పుచు చివరకు అంగీకరించవలసియే యున్నది."

రాజ్యతంత్రమునందు ప్రజాప్రతినిధులకు చోటివ్వని
హేతువువలన, ఇట్టిఅన్యాయము ఇండియాకు జరగుట తట
స్థించుచున్నది.

వ్యయము నధికముచేయవలయుననియెడి రాజ్యనీతి యొకటియును, పన్నులనధికము చేయవలయుననియెడి రాజ్యనీతి యొకటియును, ఇండియా రాజస్వమునందు ప్రబలుచు వచ్చెనని 1873-వ సంవత్సరమున సర్ ఛార్లెసు ట్రెవిలియను గారు ఇండియా రాజస్వ విచారణసభవారి ఎదుట నుడివిరి. ట్రెవిలియనుగారి పద్ధతిఖర్చును తగ్గించవలయుననునది. తద్వ్యతిరేకపద్ధతి కలకత్తాకును ఇంగ్లండునకును ప్రీతికరమైనది. కలకత్తాకుమారుగా ప్రస్తుతము ఢిల్లీపట్టణము గవర్నరు జనరలు గారి ముఖ్యపట్టణము.

గవర్నరుజనరలు నార్తుబ్రూకు (North Brook) ప్రభువును, కోశాధ్యక్షుడగు సర్ విల్లియము ముయిరును, ఇరువురును చాలించుకొని ఇండియాను విడిచినతరువాత (1876సం॥ నుండి) పన్నులను వృద్ధిచేయవలయుననియెడి రాజ్యనీతియును, నిరంకుశాధికారముతో దేశమునందు చెలాయించెను. 1877 సం॥న చెన్నరాజధానియందు కఠినతరమగు గొప్పక్షామము సంప్రాప్తించినను, లిట్టనుప్రభువు వ్యయమును పన్నులను, తగ్గించుటకు ప్రయత్నించలేదు. అందుకు విరుద్ధముగా సర్ జానుస్ట్రాచీ యనునూతన కోశాగారమంత్రి సలహాపైని, కఱవులచే బాధపడుచున్న ప్రజలకు సదుపాయము జేయునిమిత్తమై ఒకనిధిని (Famine Relief & Insurance Fund) స్థాపించుటకై క్రొత్త పన్నులను విధించెను.

సాధ్యమైనంతవరకు ఆదాయములో ప్రతిసంవత్సరమును ఒకకోటిన్నర రూప్యములు కఱవులచే తపించుచున్న

ప్రజలకు కొంత తరుణోపాయ మొనర్చుటకును, వారి సదుపాయము నిమిత్తము కొంతపనిని కల్పించుటకును, వీలలవడుటకునై నిలవ కనబరచుట ఈనిధియొక్క ముఖ్యోద్దేశము. ఒకవేళ క్షామపీడితుల నిమిత్తమై వినియోగింప బడకుండ ఏసంవత్సరమైన కొంతసొమ్ము మిగిలిన యెడల ఆద్రవ్యమును, ఋణమును తగ్గించుటకును పూర్తిగా తీర్చివేయుటకును వినియోగపర్చుట ఈనిధియొక్క ముఖ్యోద్దేశ్యము. దేని నిమిత్తమై ఈక్రొత్తపన్నులు విధింపబడినవో, ఆవిషయముననే అవి వెచ్చింపబడునని సర్కారువారు ప్రజలకొక వాగ్దానమును కూడ చేసియున్నారు.

ఈవాగ్దానము ఇచ్చినతోడనే రద్దు చేయబడెను. 1878-79 సం॥ పు ఆదాయవ్యయ పట్టికయందు ఈనిధికిగాను సొమ్మునిర్దేశింపబడినది. అనురుచటి సంవత్సరముననే ఈనిధికై వెచ్చించ నిశ్చయించినసొమ్ము ఆదాయవ్యయపట్టిక యందు కానరాలేదు. క్షామపీడితుల నుద్ధరించుటకునై ఏర్పరచబడిన పన్నులు మాత్రము మామూలు ప్రకారము వసూలు చేయబడుచు వచ్చినవి. అందులకై హిందూదేశ ప్రజలు ఈ అన్యాయమును గూర్చి ఎంతయో మొఱపెట్టిరి. ఆదాయవ్యయపట్టికలో నిలవయున్నను లేకపోయినను నష్టము సంభవించినను, ఈక్రొత్త పన్నులవలని ఆదాయమును మాత్రము క్రొత్తగా ఋణము చేయ నవసరము లేకుండ చేయుటకు ఉపయోగించెద మని స్ట్రాచీగారు సమాధాన మిచ్చిరి.

ఈజవాబు సహేతుకముగ నున్నట్లు ఇండియా ప్రజలకు తోచలేదు. తమ కొసంగిన వాగ్దానమును తప్పించుకొను నుద్దేశ్యముతో ష్ట్రాచీగారు ఈచిత్రవాదమును గావించిరని ప్రజలభిప్రాయపడిరి. ఇండియా కార్యదర్శిగారికి సైతము ష్ట్రాచీగారి వాదము సంతుష్టికరముగ నున్నట్లు పొడకట్టలేదు. 1881 సం॥ న క్రొత్త పనులయొక్క ఆదాయము ఒకటిన్నర కోట్ల రూప్యములును ఆదాయ వ్యయపట్టికలో క్షామనివారణ నిధి నిమిత్తమని కనబరచి, అందు (1) సహాయము నిమిత్తము (2) సార్థక పనుల నిమిత్తము, (3) ఋణము తగ్గించునిమిత్తము, అను మూడు బాపతులక్రింద ఆసొమ్ము నమోదుచేయ వలసినదని తీర్మానించ బడినది.

క్షామనివారణ నిధియందు హెచ్చుభాగము ప్రయోజకరమగు సార్థకపనులకు బదులు, ఋణము తగ్గించుటకు చేయుటకు ఏర్పరుపబడిన సార్థక పనుల నిమిత్తము వినియోగించ వచ్చునని యెడి నీతి అంగీకరింప బడినది.*

క్షామనిధి మొదట ఏర్పరచిన నియమముల ప్రకారము వినియోగము జరుగక పోవుట సరికదా, తరువాత మార్పుదలచేసిన నియమముల ప్రకారమైనను వినియోగము జరుగలేదు. 1895-96 సంవత్సరాంతమునకు క్షామనివారణనిధి 15 మిలియన్ల పౌనులయినది. ఈక్రింద కనబరచబడిన పట్టీవలన 10 మిలియన్ల పౌనులు మాత్రమే ఖర్చయినట్లు తేలుచున్నది.

---

* 1898 సం॥ కఱవుల విచారణ సంఘమువారి నివేదన పత్రము; 325 పుట.

1881-82 మొదలు 1896-97 వరకు

	పౌనులు.
క్షామపీడితుల క్షుద్బాధనివారణార్థము	21[illegible],571
సార్థక అయోమార్గములు (రయిల్లు)	4,367,287
సార్థక నీటిపారుదల (ఇరిగేషను) పనులు	1,200,207
ఋణము తగ్గించుటకు గాని లేకుండ జేయుటకు గాని	3,551,533
మొత్తము...	9,341,598

"అప్పు లేకుండ చేయుట" అనుపదము చాల గూఢమైనది. అనేక విధములుగ ఈపదమునకు వ్యాఖ్యానము చేయవచ్చును. ఆఖరు కలములో "అప్పును తగ్గించుట" అని తప్ప మరియొకవిధమైన అర్థము చెప్పరాదు. ఆవిషయమటుండగా, క్షామనివారణ నిమిత్తము ఏర్పరచబడిన మొత్తపుఖర్చులో $5\frac{1}{2}$ మిలియన్ల పౌనులు ఖర్చు చేయబడలేదు. ఇండియా ఋణమునందు ఈ సొమ్ము తగ్గించి తీరవలసినది. ఋణమును తగ్గించుటకు బదులుగా ఈపదునైదు సంవత్సరములలోను బెంగాల్ - నాగపూరు, మిడ్లండు అయోమార్గములకు కలిగిన నష్టము 2,389,397 పౌనులు, క్షామనివారణ నిధియొక్క ఖర్చుక్రింద వ్రాయబడినవి.

అటుపిమ్మట ఆరుసంవత్సరములు ఘోరమైన కాటకములు హిందూదేశమును పీడించెను. ఆహేతువువలన క్షామనివారణార్థమగు ఖర్చు విస్తారముగా అధికమయ్యెను. 1881-

82 మొదలు 1901-02 వరకు అయిన 21 సంవత్సరములకును నియామకమైన సొమ్ముకన్న ఒక మిలియను పౌనులు అధికముగా ఖర్చుయ్యెను.

1881-82 మొదలు 1901-02 వరకు

	పౌనులు.
కఱవులబాధ చల్లార్చునిమిత్తము	11,906,358
సార్థక ఇనుపదారులు	4,827,522
నీటిపారుదల పనులు	1,398,955
ఋణమును తగ్గించుటకు గాని లేకుండజేయుటకు గాని	4,132,996
మొత్తము...	22,265,831

బెంగాల్-నాగపూరు, మిడ్లండు రైల్వేలకు ఇరువది యొక్క సంవత్సరములలోను సంభవించిన నష్టము 3,280,334 పౌనులను ఈనిధినుండియే ఖర్చుపెట్టబడినది. ఇటీవల కఱవుల నివారణార్థము వెచ్చింపబడిన ద్రవ్యము ఇండియాఋణమును హెచ్చించినది. కఱవులులేని సంవత్సరములలో క్షామనిధి నిమిత్తము వసూలుచేయబడిన పన్నులు, ఆఋణమును తగ్గించుటయందు వెచ్చించ బడుటలేదు.

1877-78 మొదలు 1901-02 వరకు ఇండియాదేశము యొక్క ఆదాయవ్యయములు ఈక్రింది పట్టీలయందు చూపబడినవి.

సంవత్సరము	నేలపన్ను	మొత్తపు ఆదాయము	సీమఖర్చులు	మొత్తపు ఖర్చు
	రూప్యములు	రూప్యములు	రూప్యములు	రూప్యములు
1887-78	19,891,1,450	61,972,4,810	16,202,0,160	66,234,5,210
1884-85	21,832,2,110	70,690,6,810	17,527,4,060	71,077,1,270
1885-86	22,592,3,710	74,464,1,970	18,426,1,700	77,265,9,230
1891-92	23,965,7,740	89,143,2,830	22,911,9,120	98,675,7,480
1896-97	23,974,4,890	94,129,7,410	26,234,2,550	95,834,7,630
1897-98	25,683,6,420	96,442,0,040	25,319,8,240	101,801,2,150
1900-01	26,254,5,460	112,908,4,360	25,801,4,350	110,403,1,300
1901-02	27,432,0,270	114,516,7,880	26,052,9,830	107,091,4,230

రూప్యముయొక్క విలువ నధికముచేయుటవలన కలిగిన ఫలితముల నిచ్చుటపొందుపరచు నిమిత్తము గత ఐదుసంవత్సరములయొక్క లెక్కలను పరిశీలించి చూతము. 1897-98 సం॥ న రూప్యముయొక్కవిలువ 15 పెన్నులకన్న కొంచెము అధికము చేయబడినది. 1899-00 సం॥లో 16 పెన్నులు చేయబడి ఇప్పటికిని అదేరీతిని నిలచియున్నది.

	1897-98	1898-99	1899-1900	1900-01	1901-02
	పౌనులు.	పౌనులు.	పౌనులు.	పౌనులు.	పౌనులు.
మొత్తపు ఆదాయము	64,257,207	67,595,815	68,637,164	75,272,291	76,344,525
ఖర్చు	67,880,014	64,954,942	65,862,541	73,602,087	71,394,282

ఈ లెక్కవలన ఇండియాదేశమునందు ఈ అయిదుసంవత్సరములలోను రూప్యముయొక్క విలువను హెచ్చించుటవలన

12 మిలియన్ల పౌనుల పన్నులు అధికమైనవని స్పష్టమగుచున్నది. 1879 సం॥న రూప్యముయొక్క విలువను హెచ్చించినచో ఈవిధముగనే పరిణమించునని ఇంగ్లాండునందలి కోశాగారప్రభువు లభిప్రాయపడి అటులచేయ వలనుపడదని స్పష్టముగా ఖండించిరి. ఇండియా గవర్నమెంటువారి యుద్దేశ్యము రూప్యముయొక్కవిలువ నధికము చేయుటవలన 'తమకువచ్చు ఆదాయము నధికముచేయుటయని' తేల్చినవారై ఆనీతిక్రమమైనదికాదని నిర్దేశించిరి.

ఆనీతిని అవలంబించుటవలన ఇండియాదేశపు ప్రజలకు నష్టము కలిగి, ఇండియాలో పనిచేయుచున్న ఇంగ్లీషు ఉద్యోగస్థులకు లాభమును కలుగజేయునని కనిపెట్టినవారై 1886 సం॥ న తిరిగి వాదుఖండించిరి. 1899 సం॥ న నాణెముల చెలామణీ విచారణసభవారియెదుట కీర్తిశేషులైన రమేశచంద్రదత్తు మొదలగు ప్రముఖులవలన, రూప్యముయొక్క విలువను అధికముచేయుటయనగా "పన్నునధికము జేయుటయని" స్పష్టముగా నుడువబడెను. 1902 సం॥ ము మార్చినెలయందు సామ్రాజ్యశాసన నిర్మాణసభలో కీర్తిశేషులైన గోపాలకృష్ణగోఖలే దేశబాంధవునివలనగూడ ఈవిషయము కడుశోచనీయముగ ప్రశంసించబడినది.

1871 సం॥ నుండి నేలపన్నుగాక భూములపైని అనేకమగు ఇతరశెస్సులు వసూలు చేయబడుచున్నవి. ఈపన్నుల వలన వ్యవసాయమునే ఆధారముగా కలిగియున్న ప్రజలకు విపరీతమైన బాధ కలుగుచున్నది. వానిని తీసివేసి ప్రజలకు సౌకర్యమును కలిగించుటన్యాయము. 'ఈశెస్సులను తీసివేయు

టయేగాక, నేలపన్నునుసైతము 1855 సం॥న డల్‌హౌసీ ప్రభువును, 1864 సం॥ న సర్ ఛార్లెసువుడ్డుగారును ఆర్థికశిస్తునందు (Economie Rent) సగమునకు పైబడనీయరాదని నిర్ణయించిన ఏర్పాటును, అతిక్రమించరాదు.

క్షామ నివారణార్థము విధించబడిన పన్నులు సైతము క్షేత్రమునకు భారముకలిగించుచునే యున్నవి. ఈపన్నుల నుంచుట ప్రజలయొక్క దారిద్ర్యమును, కఱవులయొక్క కాఠిన్యతను అధికముచేయునేగాని వేరొండుగాదు. వీనిని తీసివేయుటవలన వ్యవసాయదారులకు కొంతసహాయమగును. కృషికులయొక్క స్థితిగతులను అభివృద్ధిచేయుటయును, భూమిపై అధికమగు పన్నులు లేకుండ జేయుటయును కఱవులబాధలేకుండ జేయుటకు తగునేర్పాటు లయియున్నవి. ఉప్పుపన్ను నింకను తగ్గించవలసియే యున్నది. నూలుయంత్రకళాశాలలపై విధించిన యక్సైజు పన్నులను తీసివేయవలసియున్నది.

ఈదేశమునందు ఆదాయవ్యయపట్టికలో నిలవకాన్పించినపుడెల్ల ఏదియో అనవసరమును వ్యయకరమునగు యుద్ధము తరచుగా సరిహద్దులయందు తటస్థించుచునే వచ్చినది. సైనిక ఏర్పాటుల నిమిత్తము బ్రిటిషు కోశాగారమువారికి ఇవ్వవలసివచ్చుచుండెడి హెచ్చు మొత్తములవలన సైతము ఆనిలవ ఖర్చయిపోవుట గలదు. బ్రిటిషుసైన్యమును సమకూర్చుటకునై హెచ్చు సొమ్మునకుగాను కర్జనుప్రభు వెంత ఆటంకపెట్టినను 786,000 పౌనులు బ్రిటిషు కోశాగారమునకు పంపబడినవి. మరి 400,000 పౌనులు దక్షిణ ఆఫ్రికాయందలి ఖర్చునిమిత్తమై కోరబడినవి. ఈకోరిక మాత్రము, ఇండియా దేశము

నందును ఇంగ్లండు నందును, ఉద్యోగస్థులును ప్రజలును ఏక గ్రీవముగా ఖండించుటవలన, నెరవేరలేదు. ఇండియాదేశపు ఆదాయవ్యయ పట్టికయందు నిలవను జూపుచు, లంకషైరు వ్యాపారస్థులు తమ నూలు సరకులపై విధించబడిన దిగుమతి పన్నులను తీసివేయ వలసినదని ఒకటి రెండు సారులుకోరిరి.

ఇటుల జరగుచువచ్చుటకు ఇండియా రాజ్యాంగపద్ధతియే కారణము. భారతీయులు దక్క ఎల్ల బ్రిటిషు ప్రజలును ఏదో ఒకవిధముగ దొరతనమువారి వలన తమ కోరికల నీడేర్చుకొనుటకు గాను ప్రయత్నములు సల్ప వీలున్నది. బ్రిటిషు ఆంతరంగిక సభవారు, ఆసభయొక్క సభ్యుడగు ఇండియాకార్యదర్శిగారి ద్వారా వారి కోర్కెలను కొనసాగించు కొనగలరు. బ్రిటిషు వ్యాపారస్థు లన్ననో ప్రజాప్రతినిధి సభయందలి తమసభ్యులద్వారా తమకోర్కెల నీడేర్చుకొన గలరు. సైనిక వ్రాతమునకు సంబంధించువారు, గవర్నరు జనరలుగారి కార్యనిర్వాహక సభయందుగల సైనిక సభ్యుని ద్వారా సాధించు కొనగలరు. దురదృష్టమువలన ఇండియా దేశముయొక్క పరిపాలనమునందు వాక్కు లేనిది ఒక్క ఇండియా దేశస్థులే! ఆకారణము వలన పన్నులను అధికము చేయుట వలన కలిగిన నిలవ, ప్రజలకేవిధమైన సౌకర్యమును కలిగించకనే అంతరించు చున్నది. ఇకముందట్టి నిలవ విశేషముగ కానవచ్చునని తోచదు.

1877-78 మొదలు 1901-02 వరకు అయిన ఇరువది యైదు సంవత్సరముల తాలూకు మొత్తపు ఋణమును ఈక్రింద రెండు పట్టీలయందును చూపబడినది.

సంవత్సరము	శాశ్వతమైనదియును, నిధిరాహిత్యమైనదియునగు ఇండియాయందలి ఋణము	ఇంగ్లాండునందు ఇండియా ఋణము
	రూప్యములు	పౌనులు
1877-78	82,783,2,770	59,677,033
1878-79	86,877,8,210	59,029,117
1879-80	91,506,8,460	68,855,556
1880-81	95,782,3,570	71,429,133
1881-82	98,784,4,140	68,141,947
1882-83	100,651,8,620	68,585,694
1883-84	103,503,4,560	68,108,837
1884-85	104,450,4,060	69,271,088
1886-87	100,717,4,800	73,806,621
1887-88	107,806,7,950	84,140,148
1888-89	111,585,9,490	95,033,610
1889-90	113,437,0,520	98,192,391

సంవత్సరము	ఇండియా ఋణము	ఇంగ్లండునందు చేసిన ఋణము	మొత్తము
	పౌనులు.	పౌనులు	పౌనులు.
1890-91	78,416,801	104,408,208	182,825,900
1891-92	79,229,246	107,404,143	186,633,389
1893-94	82,545,516	114,113,792	196,659,308
1896-97	85,158,840	114,883,233	200,042,073
1897-98	86,766,193	123,274,680	210,040,873
1900-01	90,407,865	133,435,379	223,843,244
1901-02	91,925,015	134,307,090	226,232,105

ప్రస్తుతపు ఇండియా ఋణము.

సంవత్సరము	ఇండియాయందలి ఋణము	ఇంగ్లాండునందలి ఋణము	ప్రతిసంవత్సరము చెల్లించవలసినవడ్డీ
	రూప్యములు	రూప్యములు	రూప్యములు
1912-13	1,42,85,64,79	26,87,687,895	8,63,23,275
1915-16	1,53,89,36,400	27,39,858,855	151,784,500

యుద్ధములును కఱవులును లేని సంవత్సరములయందు ఋణతీర్మాన నిధికినై ప్రతిసాలునను ఆదాయమునుండి కొంత సొమ్ము ఏర్పాటుచేయుట అవసరము. ఋణమును, వ్యయమును, తగ్గించు నిమిత్తమై ప్రజాప్రతి నిధుల సలహానుబడయుటకూడ చాల ఆవశ్యకము. ఇండియా రాజస్వ వ్యవహారమునందు ప్రజాప్రతి నిధులకు ప్రమేయము నొసంగుట సైతము అగత్యము. గవర్నరు జనరలుగారి కార్య నిర్వాహక సభయందు మిక్కిలి అనుభవనీయులును, సామర్థ్యము గలవారును, ఋజుమార్గ వర్తనులును అగు గౌరవనీయ సభ్యులెందరో గలరు. అయినను వీరిలో చాలవరకు వ్యయశాఖలకే (Spending departments) అధ్యక్షులై యున్నారు. వీరలు సహజముగా తమ శాఖలయొక్క అవసరములనే తిలకించెదరు గాన వ్యయాధికమునే వీరు కాంక్షించుచుందురు. వ్యయమును తగ్గించవలయునని చెప్పు ప్రతినిధులు లేనిలోపముచే, వీరికడ్డు చెప్పువారు ఎవ్వరును లేరు. హిందూదేశమునగాని, మరియే ఇతర దేశమున గాని దేశముయొక్క వ్యయమునందు ప్రజలకు కొంత వాకున్నగాని, వ్యయమును తగ్గించ సాధ్యముకాదు.

హిందూదేశ పరిపాలనమున రాజస్వ శాఖయందు కార్యభారమును వహించి కీర్తి వడయుటకు భారతీయులకు అవకాశము లేదు. నేలపన్నును గాని ఏయితర శుల్కమునుగాని విధించుటవలని కష్టసుఖములను వీరు బాగుగ గుర్తించగలరు. కృషికులచెంత మసలుచుండుటం జేసి వారి కష్టసుఖములను ఎఱింగినవారలై, వారియుద్దేశ్యములను కోరికలను స్పష్టముగా నొక్కి చెప్పగలరు. ఖర్చును తగ్గించుటయందు వీరు విశేష శ్రమతీసికొని రాజ్యతంత్రమును నిర్వహించుదురు.

రివిన్యూయొక్క ఆధారములు.

(1) బ్రిటిషు ఇండియా దొరతనమువారు భూమికిని, అడవులకును ఖామందులైయున్నారు. ఇంతేగాక ఎన్నియో స్వతంత్ర సంస్థానములు వీరిని ఆశ్రయించుకొనియున్నవి. రయితువారీ భూములనుండి రయితులవల్ల నేలపన్నును జమీందారీ భూములనుండి జమీందారులవల్ల శిస్తును, సర్కారువారు గ్రహించుచున్నారు. ఇదిగాక సర్కారు అడవులయందు పశువులను మేపుకొనుటవలన వసూలు చేయబడిన మేతకూలియును, అటవి సంపదను విక్రయించుటవలన కలిగెడి లాభమును, ఖనిజములను త్రవ్వుటవలన దొరతనమువారికి లభించెడి నఫా (Royalty) యును, సర్కారు రాబడికి ఆధారములైయున్నవి. స్వదేశ సంస్థానములు చెల్లించెడి కప్పముకూడ నేలపన్ను క్రిందనే నమోదగుచున్నది. హిందూదేశమున సర్కారువారి రివిన్యూయందు నేలపన్నే ఉత్తమమైనది. విశేషధనము నేలపన్నునుండియే సేకరించబడుచున్నది. ఇండియా దేశమునందలి నేలపన్ను నందొక విశేషమున్నది.

భూముల పైసలాలు అంతటను శాశ్వతములుకావు. బ్రిటిషు ఇండియాయందు మొత్తపు వైశాల్యములో అయిదవ వంతుభూమి శాశ్వతముగ పైసలు చేయబడినది. రైతువారీ పైసలాపద్ధతి బొంబాయి, సింధు, మదరాసు రాష్ట్రముల యందు నెలకొల్పబడియున్నది. రైతువారీ పైసలా శాశ్వతమైనదికాదు. తరచుగా ముప్పది సంవత్సరముల కొకమారు సర్వే చేయబడి పైసలు చేయబడుచుండును. తరచుగా పైసలు చేయబడుచుండుటవలన దొరతనమువారి రాబడి 30 సంవత్సరముల కొకసారి వృద్ధియగుచుండును. ఈపద్ధతి దొరతనమువారి రాజస్వమునకు లాభకారిగనే యున్నది. కాని రైతుస్థితి ఆలోచించినపుడు నష్టదాయకమగుచున్నది. దీని భాగమున్ను విశేష వ్యయముచేసిన పైసలాకాలమున శిస్తును పెంపుచేయుదురను తోడ్పడునని రైతుశ్రద్ధతీసికొని భూమిని వృద్ధిచేయడు. ఇందు వలన దేశముయొక్క ఆర్థికసంపద చక్కగా వినియోగింపబడు వీలు చిక్కకున్నది. శాశ్వతముగ పైసలా అయిన వంగదేశపు ప్రజలు ఎట్టి మంచిస్థితిలో నున్నదియును పాఠకులు ఎరింగియే యుండుదురు. శాశ్వత పైసలానుండియు, (మహాల్వారీ) గ్రామ పైసలాపద్ధతినుండియు సర్కారుకు నూటికి 53 వ వంతును రైతువారీ పైసలానుండి 47-వ వంతును, శిస్తు ఆదాయమగుచున్నది.

సంవత్సరము	నేలపన్ను
1915-16	పౌనులు 22,031,161
1916-17	,, 22,063,500
1917-18 కి రానున్నది.	,, 22,261,600

(2) నేలపన్ను తరువాత నల్లమందునుండి వచ్చెడి ఆదాయము అధికమైనది. ఇండియాలో చిల్లరగా అమ్మకటయందును, విదేశముల కెగుమతి చేయుటయందును సర్కారువారికి గుత్తకలదు. గుత్తను కలిగియుండుటచే సర్కారువారు నిర్ణయించెడి వెలకే విక్రయమగుచుండుట వలన విశేషలాభము వచ్చుచున్నది. ఆదాయవ్యయములను సరిపెట్టుటకు కష్టముగా నున్నపుడు, ఈరివిన్యూవరప్రసాదినివలె కోశాగారమంత్రులకు తోడుపడుచుండెడిది. కాని చీనాదేశముతో బ్రిటిషు ప్రభుత్వమువారు చేసికొనిన ఒడంబడిక వలన ఈ రివిన్యూ మనలను బాసిపోవుచున్నది. స్వల్పకాలములో అంతరించగలదు. బ్రిటిషుప్రభుత్వమువారి ధర్మబుద్ధివలన ఇండియా రాజస్వమునకు చాలలోటుపాటు కలిగినది. ఏటేట మిలియన్ల కొలది పౌనులు రాబడి వచ్చుచుండెడిది. 1910-వ సంవత్సరమున నల్లమందునుండివచ్చిన నికరాదాయము 9.4 మిలియన్ల పౌనులు.

1915-16 సం॥	వచ్చిన స్థూలమైన ఆదాయము	1,913,514	పౌనులు.
1916-17	,, ,,	3,153,100	,,
1917-18	రానున్నది	3,389,300	,,

(3) జనోపయోగము నిమిత్తమై సర్కారువారు కొన్ని వ్యాపార సంబంధములగు ఉద్యమములను కొనసాగించుచున్నారు. ఇనుపదారులు, నీటి పారుదల విధానములు, (పోష్టు టెలిగ్రాఫు) తపాలా, తంతి పద్ధతులు. వీనినుండి దొరతనమువారికి కలిగెడి లాభము ఆర్థికవిషయములను బట్టి గమనించిన, వ్యాపారస్థునికి తన వ్యాపారమునందు సంప్రాప్తించిన ప్రతిఫలముగ తేలుచున్నది.

	ఇనుపదారులు	నీటిపారుదల విధానములు	తపాలా తంతిమార్గములు
1915-16	17,977,103	4,799,079	3,787,478
1916-17	20,981,600	4,979,500	4,176,700

(4) న్యాయస్థానములయందు అర్జీలు మొదలైనవి దాఖలు చేయుటకును, వాణిజ్య వ్యాపార సంబంధములగు వ్యవహారములను క్రమపద్ధతి ప్రకారము నమోదు చేయుటకును, దొరతనమువారు శుల్కమును వసూలు చేయుచుందురు. ఇదిగాక రిజిస్ట్రేషను శాఖనుండికూడ దస్తావేజులు వగైరాలు రిజిస్టరు చేయుటవలన సర్కారునకు కొంతఆదాయము వచ్చుచున్నది.

	పౌనులు.	పౌనులు.
1915-16	1,579,904	1,694,400
1917-18 సంవత్సరము రానున్నది.		1,706,300

(5) సర్కారుయొక్క పరిపాలనమునకగు ఖర్చులనిమిత్తమై పలువిధములగు శుల్కములను దొరతనము వారు వసూలు చేయుచున్నారు. యక్సైజుపన్ను కష్టమ్సుపన్ను స్టాంపులు, ఉప్పుపన్ను, రాబడిపన్ను మొదలగునవి.

(6) ఈశుల్కములుగాక, కొన్ని సమయములయందు రూప్యములను ముద్రణము చేయుటవలన కొంతలాభమును గ్రహించుచున్నారు. ఔన్సువెండికి కొన్నిరూప్యములు ముద్రణముచేయ వలయునని నిర్ణయము. వెండిచౌకయగుటచేత టంకశాలలనుండి దొరతనము వారికి లాభముకలుగుచున్నది.

ఈ లాభమునంతయు అనుపయోగముగ ఇంగ్లాండు నందు బంగారు ప్రమాణనిధికై నియోగించుచున్నారు.

సీమఖర్చులను ఏటేట ఇండియా దొరతనమువారు ఇంగ్లాండునకు పంపవలసి యుండుటవలన, మారకము ఇండియాకు అనుకూలముగా నున్నపుడు రూప్యమునకు ఒకషిల్లింగు 4 పెన్సులకన్న అదనమగు విలువచిక్కుట వలనకూడ కొంత లాభము కలుగుచుండును. మారకము ప్రతికూలముగ నున్నపుడు కొంతనష్టము కూడ తటస్థించుచుండును. కాని ఈ బాపతు ఆదాయము అంతహెచ్చయినదికాదు. టంకశాలల నుండి 1916-1917 సం॥ న సర్కారుకు వచ్చిన ఆదాయము 624,600 పౌనులు.

ఉప్పుపన్ను.

విదేశములనుండి దిగుమతి కాబడుచున్న ఉప్పుపైని రేవుపట్టణములయందును, సరిహద్దు ప్రాంతముల యందును సుంకము (Customs) విధించ బడుచున్నది. ఇండియాలో తయారుచేయబడిన ఉప్పుమీదసైతము ఆసుంకమునకు సమ తుల్యమగు శుల్కము వసూలు చేయబడుచున్నది. ఈరెండు బాబతుల వసూళ్ళను యక్సైజు, కస్టమ్సు పన్నులక్రింద నమోదుచేయబడక ప్రత్యేకముగా "సాల్టురివిన్యూ" క్రింద నమోదు చేయబడుచున్నది. 1910 సంవత్సరమున దేశమున తయారైనఉప్పు నూటికి 70 పాళ్ళను దిగుమతికాబడిన ఉప్పు 30 పాళ్ళను ఇండియాయందు ఖర్చయినది. సర్కారువారు స్వయముగనే చాలభాగము ఉప్పును పండించుచున్నారు.

డేరా ఇస్మాయిలుఖాను రాతిగనులును, సంభారు సరస్సునుండి తయారుచేయబడిన ఉప్పును, బొంబాయి చెన్న రాజధానులయందలి కొన్ని ఉప్పుమళ్ళను దొరతనమువారి వలననే పనిచేయబడుచున్నవి.

ఉప్పుపన్ను నుండివచ్చిన ఆదాయము.

1915-6 సం॥ న 5,433,632 పౌనులు. 1916-17 సం॥ 5,820,900 పౌనులు.
1917-18 సం॥ కు రానున్నది. 5,965,400 పౌనులు.

1910 సం॥ న సర్కారుకు వచ్చిన నికరమైనరాబడి 4 కోట్ల 75 లక్షలు మాత్రమే. ఇప్పుడధిక మగుటకు కారణము, ఉప్పు పన్నును ఇటీవల అధికముచేయుటవలన కలిగినది.

స్టాంపు రివిన్యూ.

న్యాయస్థానములయందు ప్లయంట్లు పిటిషనులు మొదలగునవి దాఖలు చేయుటకు అంటించబడు కోర్టు-ఫీజు స్టాంపులనుండియు, ఆస్తులను ఒకరినుండి మరియొకరికి మార్చినపుడును, పత్రములు వ్రాసినపుడును, బ్యాంకులకు ఇచ్చు చెక్కులకును, హుండీలకును, రశీదులకును అంటించబడు రివిన్యూ స్టాంపులనుండియు, ఈ ఆదాయము వచ్చుచున్నది.

1915-16 సం॥న ఆదాయము		5,433,632	పౌనులు.
1916-17	,, ,,	5,820,100	,,

యక్సైజు రివిన్యూ.

(1) కల్లు, గంజాయి, భంగు, సారా నల్లమందు మొదలగు నిషాద్రవ్యములను ఇండియాదేశమున తయారు చేయునప్పుడును, చిల్లరగా అమ్ముకొనుటకు లైసెన్సుల నిచ్చుట వలనను సర్కారువారికి ఈఆదాయము వచ్చుచున్నది. స్వదేశ సారాయములను తయారు చేయునపుడు ఒకశుల్కమును దొరతనమువారు వసూలు చేయుదురు. (2) ఇండియాయందు ఖర్చగు నల్లమందు గంజాయి మొదలగు వానినుండికూడ శుల్కము వసూలు చేయబడుచున్నది. విదేశ సారాయముల నుండి వసూలు చేయబడిన సుంకములును, మన నూలుకళలను పీడించుచున్న యక్సైజు పన్నులును, ఈ రివిన్యూయందు చూపబడుట లేదు. అవిప్రత్యేకముగా కష్టమ్సుపన్నుల క్రింద నమోదు చేయబడుచున్నవి.

1915-16 సం॥ న ఆదాయము		8,632,209	పౌనులు
1916-17	,, ,,	9,152,500	,,

రాబడీ పన్ను.

ఈపన్ను 1000 రూపాయిలకు పైబడి ఆదాయము వచ్చు ఆసామీలనుండి వసూలు చేయబడుచున్నది. పూర్వము వెయ్యిరూపాయిలలోగా ఆదాయము వచ్చువారినుండి కూడ రాబడి పన్ను వసూలు చేయబడుచు వచ్చినది. శ్రీజార్జి సార్వభౌముని పట్టాభిషేక సమయమున ఒసంగబడిన వరములలో రాబడిపన్నును, తగ్గించుట ఒక వరమయియున్నది. ఇపుడు వేయిరూప్యములుపైగా రాబడి గలవారినుండియే వారిరాబడియందు రూపాయకు 5 పైసలువంతున రాబడి పన్నుక్రింద వసూలు చేయబడుచున్నది. 1917-18 సం॥ న "సూపరు-టాక్సు" అని మరొక పన్నుకూడ విధించ బడినది. ఇంగ్లాండు

నకు యుద్ధపుఖర్చు నిమిత్తమై ఇండియా కోశాగారమునుండి 150 కోట్లు రూప్యములు ఒసంగబడెను. అందుల వడ్డీ నిమిత్తమై ఆరు మిలియన్ల పౌనులు ఏటేట అవసరమగుటచే, ఈ "సూపరు-టాక్సు" అనెడి క్రొత్త పన్నుకూడ విధించబడెను. ఏబదివేల రూప్యముల రాబడిగల వారినుండియు, అంతకంటె ఎక్కువగా రాబడి గలవారినుండియు ఈసుల్కము వసూలు చేయబడును. ఈ శుల్కమువలన వచ్చెడి రాబడి 1,350,000 పౌనులుగ 1917-18 సం॥ న బడ్జెటు చేయబడినది.

ఈపన్నులుగాక అనేకములగు శెస్సులురోడ్ల నిమిత్తమును, పాఠశాలలనిమిత్తము, వైద్యశాలల నిమిత్తము వసూలు చేయబడుచున్నవి.

కష్టమ్సు పన్నులు.

అన్యదేశములనుండి ఈదేశమునకు దిగుమతి కాబడు చున్న సకల వస్తు సామగ్రిపైనను, రేవుపట్టణములయందును, సరిహద్దు ప్రాంతములయందును ఈసుంకము వసూలు చేయబడుచున్నది. ఈసుంకములయందే, నూలుయంత్ర శాలలనుండి వసూలు చేయుచున్న యక్సైజు పన్నులును, విదేశ సారాయములనుండి వసూలు చేయబడిన పన్నులును చేర్చబడి యున్నవి.

1915-16 సం॥ న సర్కారు ఆదాయము.		5,873,886	పౌనులు
1916-17	,, ,,	8,569,100	పౌనులు
1917-18 రానున్నది	,, ,,	9,394,800	,,

సర్కారువారి మొత్తపు రాబడి.

1915-16 సం॥	84,413,537	పౌనులు.
1916-17 ,,	96,834,500	,,
1917-18 రానున్నది	98,850,900	,,

ఇదియంతయు స్థూలాదాయముకాని, నికరాదాయముకాదు.

వ్యయము.

ఈదేశమున సైన్యములకును ఇనుపదారులకును హెచ్చుగా ఖర్చగుచున్నది. సీమఖర్చులనుపేర ఇంగ్లాండు గ్రహించుచున్న కప్పము కూడ ఇండియాకు అమితమగు వ్యయమును కలిగించుచున్నది. నీటిపారుదలకును, ఇతర ప్రజోపయోగ కరమగు పనులకును గూడ కొంతద్రవ్యము ఖర్చుపెట్టబడుచున్నది. ఇనుపదారులతో సరిపోల్చి చూచినప్పుడు ఈ శాఖలకగు ఖర్చు అంతగా కానరాదు. ఆదాయము వసూలు చేయుటకును, రాజకీయ వ్యావహారిక శాఖ (Civil dept.) యందలి ఉద్యోగస్తులయొక్క జీతభత్యముల క్రిందను కూడ కొంతధనము వ్యయమగుచున్నది. తపాలా, తంతిమార్గములకగు ఖర్చుగాక, క్షామనివారణనిధి నిమిత్తమైకూడ ఏటేట ఇండియా రాజస్వమునుండి కొంతధనము ప్రత్యేకింపబడుచున్నది.

నీటిపారుదల విధానములు.

సైనిక వ్యయమునుగూర్చియు, రైల్వే రాజస్వమును గూర్చియు, విపులముగా వేరొకచోట చర్చించబడును. సీమ ఖర్చులనుగూర్చి జాతీయ ఋణముయొక్క పూర్వోత్తరమును

తెలియజేయు సందర్భమున విపులముగ చర్చించియున్నాము.
నీటిపారుదల విధానములకగు ఖర్చునుగూర్చి మాత్రము ఒక్కిం
చుక చెప్పవలసియున్నది. ఇనుపదారులు ఆర్థిక సంపదను
ఒకతావునుండి మఱియొక తావునకు మార్చుటదక్క వేరొండు
ప్రయోజనకారులుగావు. సంపదను ఉత్పత్తిచేయునవి, నీటికాలు
వలుగాని రైల్వేలుకావు. నీటికాలువలగుండ పడవలపై గొని
పోబడుసరకులకు రైల్వేలకు చెల్లించవలసినంత హెచ్చు రేటున
శుల్కములను చెల్లించ నక్కరలేదు. చాలచౌకగా సామాను
లను కాలువలపై పడవలుగొనిపోవును. ఇనుపదారులకంటె నీటి
కాలువలు సస్యములకుచాల సమీపముగ నుండును. గనుక
ధాన్యాదులను పణ్యచక్రములకు గొనిపోవుటకు నీటి కాలువలే
హెచ్చు సదుపాయములను కలిగియున్నవి. దేశమునందలి
వర్తకమునకు నీటికాలువలు హెచ్చు సహాయభూతములుగ
నుండును. వ్యాపార సౌకర్యముమాట యటుండ కృషికళకు
నీటి పారుదల విధానములుచేయు సహాయ మింతింతయని
చెప్పరాదు. జలశూన్యమగు భూమి ఎల్లపుడును సస్యముల
కాటపట్టగుటకు నీటిపారుదల అవసరము. ఏ మొక్కజొన్న
లో, గంటెలో, రాగులో దక్క వరిపంట యనునది కను
లకు గానరాదు. చాలకాలము క్రిందవరకును గోదావరీ,
కృష్ణా, కావేరీ డెల్టా భూములు ఈ తీరుననే యుండుచు వచ్చి
నవి. అందలి ప్రజ జొన్న అన్నమును తినుట దక్క వరి అన్న
మునుతినుట నెరుగరైరి. ఇపుడు నిర్జలప్రదేశములు ఈమహా
నదుల యుదకమువలన తామర తంపరలుగ సాలునకు మూడు
పంటలుపండి, అందలి కృషికులనెంతో ఐశ్వర్యవంతులుగచేయు

దొడంగినవి. ఈ కాలువలవలన భరతవర్షముయొక్క ఆర్థిక
సంపద ఎంతయో విరివినిగాంచినది. ప్రభుత్వమువారిచే, చాల
తక్కువధనము ఈ యుద్యమములకై వెచ్చించబడుచున్నది.
ఆంగ్లప్రజలు స్వేచ్ఛావర్తకము తమకు లాభకారిగనుండుట
వలన భారతీయులకుగూడ లాభకరముగ నుండునని నమ్మినటు
లనే, నీటి కాలువలకంటె, ఇనుపదారులే దేశముయొక్క సంప
దను ఇనుమడింప జేయునని నమ్మియున్నట్లు తోచుచున్నది.
స్వేచ్ఛావర్తకము దేశాభివృద్ధికి ఎంత నష్టదాయకమో ఈ
పద్ధతియును అంత నష్టదాయకమని దృఢముగా చెప్పగలము.
వెనుక కావేరీ, గోదావరీ నదులకు ఆనకట్టలనుగట్టి భరతవర్ష
మునకు మహోపకార మొనరించిన సర్ ఆర్థరుకాటనుగారు,
హిందూదేశమున ఇనుపదారులకు మారుగా నీటి పారుదల
విధానములను విరివిచేయవలయునని ప్రబలవాదము సల్పుచుండ
అప్పటి ఇండియా కార్యదర్శియగు హామిల్టనుప్రభువు, "మీతల
ఎప్పుడును నీరూరుచుండున"ని కాటను దొరగారిని పరిహాసము
చేసెను. ఇండియాయందు పెక్కువత్సరములు ఉద్యోగము
చేసి, భారతీయుల కష్టసుఖములను బాగుగ గుర్తించి వీరి
యాశయములను వృద్ధిచేయుటకునై యావజ్జీవమును నిష్పక్ష
పాతబుద్ధితో కృషిచేసిన ఆంగ్లశిఖామణియగు కాటను దొర
వారు అట్లు పరాభవింపబడిరి. కాటనుదొరవారి సిఫారసులను
అంగీకరించియున్న యెడల హిందూదేశము నందెల్లెడలను, నీటి
పారుదల విధానములు ప్రబలములై వర్షాపేక్ష లేకనే సస్యములు
అనుకూలముగ ఫలించుట కిరవైయుండి యుండును. క్షామ
మనునది భరతవర్షమున పేరునకైన లేకుండ ఉండియుండును.

ఇపుడన్ననో వర్షములు ఏమాత్రము ఎటూమటీ అయినను కఱవులును కాటకములును ప్రజలను పీడించుచునే యున్నవి.

వీని అన్నిటికంటెను ప్రబలమైన కారణము మరియొకటి గలదు. నీటి పారుదల విధానములు ఆరంభించినది మొదలు నేటివరకును నూటికి అయిదురూపాయిల చొప్పున పెట్టుబడి మీద లాభము నొసంగుచునే యున్నవి. ఇనుపదారులన్ననో జాతీయ ఋణమును అమితముగ విరివి జేయుటయేగాక 1900 సంవత్సరమువరకును నష్టమునే కలిగించుచువచ్చినవి. 400-కోట్ల రూప్యముల పెట్టుబడిమీదను నూటికి ఒకవంతైనను నికర లాభము వచ్చుటలేదు. ఇదిగాక క్షామనివారణ పంచాయతీ వారును, ఇరిగేషను పంచాయతీవారునుకూడ కఱవుల నుండియు కాటకములనుండియు దేశమును సముద్ధరించుటకునై నీటిపారుదల విధానములను శీఘ్రకాలములో విరివి చేయనల యునని తీర్మాన మొసంగియున్నారు. కాన దొరతనమువారు ఈ పంచాయతీల తీర్పును మన్నించి, ఇనుపదారులకగు వ్యయ మును తగ్గించి, దేశమునందెల్లెడలను నదీప్రవాహములను పెంపుచేసి సంపదను విరివి చేయనలసియున్నది. వీటియొక్క అగత్యమునుగూర్చి, ఇంతకన్న అదనముగా వ్రాయబనిలేదు. క్షామనివారణార్థమై చేయించు సార్థకపు పనులకుగాను ఏటేట ఒకకోటిన్నర రూప్యములు బడ్జెటు చేయబడుచున్నవి. అందు 75 లక్షలు ఇనుపదారులకును, 75 లక్షలు నీటిపారుదల విధాన ములకును వెచ్చించబడుచున్నవి. ఇనుపదారులకు ప్రత్యేక ముగా నీయబడు 12 మిలియన్ల పౌనులును చాలనట్లు, ఈ ద్రవ్యమునుండికూడ 75 లక్షల రూప్యములు ఖర్చుపెట్టుట

చాల అన్యాయము. ఈ కోటిన్నర రూప్యములును నీటిపారు దల పనుల నిమిత్తమయి ఖర్చుపెట్టవలసియున్నది. కఱవుల బాధను శాశ్వతముగ తొలగించునవి జలాశయములుగాని అయోమార్గములుకావు. కాన క్షామనివారణనిధికై నిర్దేశింప బడిన ధనమునంతటిని నీటికాలువల క్రిందనే ఖర్చుపరచుటవిధి.

విద్యావిధానములు.

విద్యాశాఖకుగూడ విశేషధనమును వెచ్చించవలసిన ఆవశ్యకత చాలగలదు. నాగరికతను గాంచిన ఐరోపా, అమె రికా, ఆసియాఖండముల దేశములు తమ ప్రజలను విద్యా వంతులుగ జేయుటకునై విశేష ధనసంచయమును ఖర్చుపెట్టు చున్నారు. హిందూదేశమునందలి స్వదేశ సంస్థానములెన్ని యో ప్రారంభవిద్యను ఉచితముగ నొసంగుచున్నవి. కొన్ని సంవత్సరముల ప్రాయము వచ్చువరకును బాలురను పాఠ శాలల కంపుట బలవంతము చేయబడినది. విద్యావిషయమై స్వదేశసంస్థానములకు గూడ వెనుకబడియుండుట చాల శోచ నీయము. సామ్రాజ్యశాసన నిర్మాణసభయందు గోపాలకృష్ణ గోఖలే దేశబాంధవుడు ప్రారంభ విద్యనుగూర్చి రెండుసార్లు తీర్మానముల నుపపాదింపగా సర్కారువారిచే నిరాకరించబడి నవి. దొరతనమువారు ద్రవ్యలోపముచే, ఈ యుద్యమమునకు పూనుకొనకున్న, విద్యావిషయికమగు ఒకపన్నును విధించినను భరించెదమని గోఖలేగారెంత సహేతుకముగ చర్చించినను ఈ మహాశయుని వాక్యములకు దొరతనమువారు చెవినొగ్గలేదు. శ్రీయుత బయ్యా నరసింహేశ్వర శర్మగారుకూడ సామ్రాజ్య

శాసన నిర్మాణసభయందు ప్రారంభవిద్యనుగూర్చి ఒకతీర్మానము నుపపాదించిరి. ఈ తీర్మానమునకు సర్కారువారు సమ్మతినొసంగ నందువలన తీర్మానము రద్దుపరచబడెను. విద్యయొక్క ప్రభావమును ఆవశ్యకతను చక్కగ గుర్తించిన ఆంగ్లేయ ప్రభుత్వము వారే భారతీయులకు జ్ఞానోదయమును ప్రసాదించకుండుట కడుం గడుశోచనీయము.

247-వ పేజిలో కనబరచబడిన పట్టీవలన 1915-16, 1916-17 సంవత్సరముల యొక్క ఖర్చు వివరము తెలియగలదు. ఈలెక్క, సామ్రాజ్యశాసన నిర్మాణసభయందు, కోశాగారమంత్రిచే మార్చినెలయందు దాఖలుచేయబడిన ఆదాయవ్యయ పట్టికనుండి ఇట పొందుపరచబడినది.

పైన వివరించిన పట్టీనుండి మనము గ్రహించవలసిన విషయములు రెండు. 1916-17 సం॥ తాలూకు సీమఖర్చులును, 1917-18సం॥న ఐరోపాయుద్ధమునకగు ఖర్చులలో నూట ఏబది కోట్ల రూప్యములు ఇండియా ఇంగ్లండునకు దానము చేయుట వలన ఆబాబతు వడ్డీనిమిత్తము ఆరుమిలియన్ల పౌనులు ఖర్చు హెచ్చుగా బడ్జెటు చేయబడుటను, మనము గమనించవలసియున్నది. ఆరుమిలియన్ల పౌనుల రాబడి నిమిత్తమై క్రొత్త పన్నులు విధింపబడెను.

గోగునారపై అధికముచేసిన పన్నునుండి	500,000
"సూపరు-టాక్సు" (రాబడిపన్ను)	1,350,000
నూలుసరకుల దిగుమతిపై నూటికి 4-వ వంతు పన్నును అధికముచేయుటవలన వచ్చెడిఆదాయము	1,000,000
ఇనుపదారులపై విధించబడిన అధికమగుభారము	500,000

బాపతువారీఖర్చు	1915-16 సం॥ తాలూకు.	1916-17 సం॥ తాలూకు.	1917-18 సం॥ బడ్జెటు చేయబడినది.
	పౌనులు	పౌనులు.	పౌనులు.
రివిన్యూ మొత్తము నుండి ఖర్చుచేయబడినది	9,467,370	9,483,700	10,026,100
వడ్డీ	1,190,364	791,800	6,832,800
తపాలా, తంతి మార్గములకు	3,149,680	3,555,600	3,601,900
టంకశాలలకు	89,873	172,500	115,800
సివిలుడిపార్టుమెంట్లయొక్క జీతములు, ఖర్చులు	18,868,215	19,640,100	20,920,400
అనేక బాబతుల సివిలుఛార్జీలు	5,128,675	5,393,300	5,257,200
క్షామనివారణమునకును, భీమాకును	1,000,000	1,000,000	1,000,000
ఇనుపదారులు వడ్డీయును ఇతర ఖర్చులు సహా	13,901,665	14,185,300	14,147,400
సైనికఖర్చులు	23,503,093	26,819,800	27,227,100
నీటిపారుదల ఏర్పాటులకు	3,721,096	3,687,000	3,8[illegible]4,000
జనోపయోగమగు ఇతరపనులకు	5,451,727	4,726,400	5,536,500
	85,471,258	89,455,500	98,819,300

1916-17 సం॥ సీమఖర్చులను తెలియజేయుపట్టీ.

సీమఖర్చుల మొత్తము 26 మిలియన్ల పౌనులు= 39 కోట్ల రూప్యములు.

		మిలియన్ల పౌనులు.
సైన్యములకగు ఖర్చు		5.6
ఇనుపదారుల నిర్మాణమునకై తెచ్చిన ఋణముయొక్క వడ్డీ		3.6
ఇనుపదారులనుకొనునిమిత్తము ప్రతి సం॥ చెల్లించబడు వాయిదాలు		3.3
కంపెనీలు పెట్టిన పెట్టుబడియొక్క వడ్డినిమిత్తము		2 2
ఇతర ఖర్చులు		.3
ఇతరఋణములకు చెల్లించవలసిన వడ్డీ		7.4
సివిలుఖర్చులు ఫర్లోముజారా మొదలగునవి.	.26	
ఉద్యోగము చేయుటకు శక్తిచాలకుండుట వలనఇచ్చెడి పించనులు మొదలగువానికి మునుగాలక్రిందను, ఉపకార వేతనములనిమిత్తము.	2.02	2.4
ఇతరఖర్చులు.	.14	
ఋణతీర్మాననిధి నిమిత్తము.		1.0

మొత్తము 26 మిలియన్లపౌనులు=39 కోట్లరూప్యములు.

సీమఖర్చులు 1917-18 సం॥ న ఇంకను అధికముగా గలవు. యుద్ధమునకిచ్చిన నూరుమిలియన్ల పౌనులును ఈదేశములో అప్పుదొరకనందున దొరతనమువారు ఇంగ్లండునందు ఋణము చేయవలసి వచ్చును. అందుచే సీమఖర్చులలో వడ్డీ బాబతు ఇంకను పెరుగగలదు.

1916-17 సం॥న వ్యయముపోను ఆదాయమునుండి 5,817,500 పౌనులు, నిలవవచ్చెను. 1917-18 సం॥ న 129,800 పౌనులు నిలవ వచ్చునటుల బడ్జెటు చేయబడెను.

పన్నులయొక్క భారము.

నల్లమందు ఎగుమతినుండియు, నేలపన్ను నుండియు వచ్చిన ఆదాయమును విడిచిపెట్టగా 1910 సం॥ న పన్నుల వలన సర్కారుకువచ్చిన నికరాదాయము 35.53 కోట్లరూప్యములు. నల్లమందు ఎగుమతివలన వచ్చిన ఆదాయము విదేశస్థులవలన చెల్లించబడుచుండుటచేత, పన్నులయొక్క భారము విషయమును చర్చించునపుడు ఈ ఆదాయమును సరకుచేయ బనిలేదు. ఇక నేలపన్నునుండి వచ్చిన ఆదాయమును కూడ ఈసందర్భమున ఆలోచించక పోవుటకు గలకారణము, అధికార వర్గమునకుజెందిన చాలమంది నేల పన్నును ఒకపన్నుగ భావించుటలేదు. వీరిమతమున నేలపన్ను దొరతనము వారియొక్క ద్రవ్యసాధనములను, ప్రజలు ఉపయోగించినందులకై సర్కారుకు చెల్లించవలసిన, వెలగా భావింప బడుచున్నది. దీనినిగురించి ముందు విపులముగా చర్చించుచున్నాము. 1910 సంవత్సరమున పన్నులవలన ప్రజలకు కలిగినభారము మనిషి ఒక్కంటికి సుమారు ఒకటిన్నర రూప్యములు. నేలపన్నును గూడ (మనిషి ఒక్కంటికి 1 షిల్లింగు 8 పెన్నులు) జేర్చితిమేని 1910 సం॥ న మనిషి ఒక్కంటికి సుమారు రెండురూపాయల పదకొండుఅణాల నాలుగుపైసలు. భారతీయులయొక్క ఆదాయముసాలుకు ముప్పది రూప్యములకు పైబడుటలేదు. ఆంగ్లేయులయొక్క ఆదాయమును సరిపోల్చి చూచినయెడల, ఈదేశస్థులకు పన్నులవలని భారము అధికమని స్పష్టము కాగలదు.

నేలపన్నుయొక్క స్వభావము.

అధికారవర్గమునకు జెందినవారు, హిందూదేశమునందలి క్షేత్రమునకు దొరతనమువారు ఖామందులగుటచే ప్రజలనుండి సేకరించునది శిస్తుగాని పన్నుకాదని వాదించుచున్నారు. భారతీయులన్ననో, నేలపన్నను పేర సర్కారువారు వసూలుచేయుచున్నది ఆర్థిక శిస్తుకాదనియును, ఇదికూడ ఒకవిధమగు పన్నే యనియును అభిప్రాయపడుచున్నారు. ఇట్టి అభిప్రాయమును కీర్తిశేషులగు మహదేవ గోవిందరనడే, రమేశచంద్రదత్తు, గోపాలకృష్ణ గోఖలే మొదలగు దేశబాంధవులు అనేక సభాముఖములను గ్రంథరాజముల మూలమునను వెలిబుచ్చిరి.

ఇండియా దొరతనమువారికిని, దేశీయులకును నేలపన్నును గూర్చి గల భేదభావము, అమలులోనున్న నిజస్థితిని గూర్చిగాని, రాజనీతి విషయకమై కాదు. శాశ్వత పైసలా చేయబడని భూములనుండి సర్కారువారు సేకరించుచున్న నేలపన్ను, రైతు భూమిని బాగు చేయుటకై వెచ్చించిన సొమ్మునకు వడ్డీయును, రైతుయొక్క కష్టమునకు ప్రతిఫలమును, మినహాయించిన ఆదాపైన నిర్ణయించబడినదా, లేక ఈఖర్చులను మినహాయించక మొత్తము ఫలితముపైన నిర్ణయించబడినదా యను హంశమును యోచించవలసియున్నది. అధికారవర్గమునకు జెందినవారు, నికరాదాయమునందు సగమునకు తక్కువగా దొరతనమువారు సేకరించి రైతునకు కూలిపనులు వగైరాలను విడిచిపెట్టుటయేగాక తగినంత లాభమును

కూడ వదిలివేయుచుండిరనియును, రైతునకు విడిచిపెట్టబడిన లాభము దొరతనమువారు గ్రహించుచున్న శుల్కమునకు సమముగగాని, అధికముగగాని ఉండుట కలదని వాదించుచున్నారు. భూములు పైసలాలు చేయునపుడు ఇట్టినీతిని పాటించవలయునని దొరతనము వారిమతము. కాని ఈమతము మాత్రము ఆచరణములోనికి గొనిరాబడుటలేదు. ఈనీతిని పంజాబు సంయుక్తరాష్ట్రములయందు దొరతనమువారు అవలంబించుచున్నట్లు కానవచ్చుచున్నది. (ఈరాష్ట్రములయందలి కృషికళ నీటిపారుదల విధానములచే సంరక్షింపబడి, రైతులు మంచి స్థితిలోనున్నారు) మదరాసు రాజధానియందలి కొన్ని భాగములయందు సైతము ఇట్టినీతియే ఆచరణములోనున్నది. కాని అయోధ్య, బుండల్-ఖండు, నీటిపారుదల విధానములచే సంరక్షింపబడని మధ్యపరగణాలు, మదరాసు రాజధానియందలి కొన్ని జిల్లాలును, ముఖ్యముగా బొంబాయి, దక్కను, గుజరాతు దేశములయందు, నిజస్థితిని చక్కగా గుర్తించగలిగిన మహామహులవలన నేలపన్ను పద్ధతి నిందార్హమైనదిగ ప్రశంసించబడెను. ఇట్టి అభిప్రాయముల నొసంగినది, ప్రజలతో కలసిమెలసి తిరిగి వారికష్టసుఖములను బాగుగా కనుగొనిన మహాశయులేగాని మిడిమిడి జ్ఞానమును కలిగి వాదమునే ప్రాధాన్యముగా గలిగిన వారిచే నొసంగ బడుటలేదు. "ఈభాగములయందు వసూలు చేయబడుచున్న భూముల ఆదాయము ఆర్థిక శిస్తునకు పైదాటి, వ్యవసాయమున కగు ఖర్చునుగూడ ఆకర్షించుచున్నదని" వీరుఖండనగా చెప్పుచున్నారు.

దక్కను రైతులనుగూర్చి మహాదేవ గోవిందరనడేగారు 1892 సంవత్సరమున ఇట్లు ప్రసంగించిరి:—నేలపన్నను పేర పశ్చిమహిందూదేశమున వసూలుచేయబడుచున్న శుల్కము సరియైన శిస్తులనుండి సేకరించబడుచున్న పన్నుకాదు. తరచుగా పేదరైతుయొక్క కూలిపనులను లాభమునుకూడ కొంతవరకు ఆకర్షించుచున్నది. భారమధికమగుచున్న కొలది, పేదరైతు నీచజీవన మవలంబించవలసిన అవస్థ తటస్థమగుచున్నది. గోపాలకృష్ణగోఖలే మహాశయుడు బొంబాయి రాజధానియందలి భూముల పైసలాలను గూర్చి 'శాస్త్రవిరుద్ధమయ్యును ప్రతికాలమునను (30 సంవత్సరములకొకతూరి తటస్థమగుచుండును) రైతువలన క్షేత్రములకు చేయబడిన అభివృద్ధిమీదనుకూడ శుల్కము విధించబడుచున్నదనియును, అదివరకు ఉన్నశిస్తు చెల్లించుటకు ఆస్కారములేని భూములమీద సైతము మిగతభూములతోపాటు శిస్తు పెంపు చేయబడుచున్నదనియును, ముఖ్యముగా సంయుక్తపరగణాలు బొంబాయి, చెన్నపురి రాజధానులయందు అధికముచేయబడిన నేలపన్నుయొక్క భారమువలన క్షేత్రము క్రుంగుచున్నదనియును ఖండితముగానక్షేపించిరి. ఇటుల జేయుటవలన భూమిని అభివృద్ధిలోనికి తెచ్చుటకై మూలధనమును రైతువెచ్చించుటకు వెనుదీయుచుండుననియును అందువలన కృషికళ లభివృద్ధిగాంచదనియును గోఖలేమహాశయుని అభిప్రాయము.

ఈసందర్భమున రమేశచంద్రదత్తుగారివలన నేలపన్నును గూర్చి జూపబడిన హేత్వాభాసముల నిటపొందుపరచుట

యుక్తము. దత్తుగారు కాటకము లధికముగా నుండుటచేత భూములయొక్క పైసలాపద్ధతులయందు మార్పొనరించవలయునని బహిరంగముగా కర్జనుప్రభువుగారికి పత్రికాముఖముగ లేఖలు ప్రకటించెను. 1900 సం॥మార్చినెల 28 తేదిని సామ్రాజ్యశాసన నిర్మాణసభయందు సర్ ఫిరోజిషా మెహతాగారు, ఆనందాచార్యులుగారు, సర్ బిపిన్ క్రిష్ణబోసు మొదలగు ప్రముఖులయొక్క ప్రసంగములు చదివిచూచిన పైసలాపద్ధతులయొక్క కాఠిన్యత ఎల్లరకును విశదమగును. తొలుతభూమిపన్ను మొత్తపు పంటలో ఎన్నవ వంతగుచున్నదో నిశ్చయించుదము.

	నూటికగువంతులు.
బంగాళ రాష్ట్రము. బీహారు ఒరిస్సా రాష్ట్రములుకూడ అపుడు ఇందే ఇమిడి యుండెను.	5 మొదలు 6 వరకు
పశ్చిమోత్తరపరగణాలు	8
పంజాబు	10
చెన్నరాజధాని	10 మొదలు 31 వరకు
బొంబాయి రాజధాని	20 మొదలు 33 వరకు

పై పట్టీవలన భూమియొక్క భారము ఏరాష్ట్రమునందెంత యగుచున్నదియును గమనించగలము. శాశ్వత పైసలా కాబడిన బంగాళ దేశమున నేలపన్ను తేలికగానున్నది. ఈ పద్ధతి పూర్వము హిందూరాజుల ప్రభుత్వమున నున్న యటులనే అమలగుచున్నది. అందువలన వంగదేశప్రజలు ఐశ్వర్య

వంతులై ఆర్థిక రాజకీయ విషయములయందు ఇతర రాష్ట్రములకన్న మిక్కిలి అభివృద్ధిలోనుండుటను మనము కండ్లార జూచుచునేయున్నాము. నేలపన్ను హెచ్చుగుటచే క్షేత్రము, భారము మిక్కుటమై క్రుంగుచుండునుగాని వృద్ధికాజాలదు. మదరాసు, బొంబాయి, రాజధానులయందలిస్థితి చాల విచారకరముగనున్నది. 31-33-వ వంతువరకు భూమిపన్ను వసూళ్లు చేయబడుచుండుటవలన కృషికులు కడు బీదస్థితిలో నుండుట మనము చూచుచునేయున్నాము. హిందూదేశమున కంతకును శాశ్వతపైసలా జరిగి యుండినయెడల సర్కారుకు రావలసిన రాజస్వములో కొంతవరకు నష్టమువచ్చినను ప్రజలందరును సౌఖ్యముగా ఉండునట్లు చేయుటవలన, వారు కళాప్రపంచమును సముద్ధరించ గలుగుటచే, దేశముయొక్క ఆర్థికసంపద ఇనుమడించక మానదు. అందువలన సర్కారుకు కలిగెడి లాభము అపరిమితముగ నుండును.

నేల పన్నునకు సంబంధించిన హేత్వాభాసములు.

హిందూదేశ మిత్రులలో నొకనిగ పేర్కొనదగిన హెన్రీ ఫాసెట్టుగారు నేలపన్నునుగురించి తమ ఆర్థిక శాస్త్రమున ఇటుల వ్రాసిరి:—“ఇంగ్లీషు నేలఖామందు తన ఆస్తిపై ఎట్టి హక్కులను కలిగియున్నాడో ఆతీరుగనే హిందూదేశమునందలి క్షేత్రముపై చాలభాగము ఇండియా దొరతనమువారు అట్టిహక్కును కలిగియున్నారు. దొరతనమువారు ప్రత్యేక నేలఖామందులవలె వ్యవహరించుచున్నారు. రైతులు కృషికి

కావలసిన భూమిని ఇతర నేల ఖామందులనుండి గ్రహించుటకు బదులు సర్కారువారి నుండియే గ్రహించుచున్నారు”.

ఫాసెట్టుగారు స్పష్టముగా ‘నేలపన్నని’ వ్రాసినను అధికార వర్గమునకు జెందిన పెక్కు లేఖకులును, ఉపన్యాసకులును భూములనుండి గ్రహించుచున్న ఆదాయము శిస్తేకాని పన్నుకాదని వాదించుచున్నారు! ఇదే మొదటి హేత్వాభాసము. ఈ విషయమునుగూర్చి జరిగిన వాదానువాదములవలన తేలిన విషయము, గొప్ప అనుభవశాలురగు ప్రభుత్వోద్యోగియులవలననే క్షేత్రముల ఆదాయము పన్నుకాని శిస్తుకాదని స్పష్టముము చేయబడినది. ఇట్టి అభిప్రాయమును వెలిబుచ్చినది, సాధారణ ఉద్యోగస్తులు కారు. సర్ లూయీ మాలెట్, లార్డు శాలిస్బరీ, సర్ జాన్ షోర్, సర్ బార్టల్ ఫ్రియరు, సల్లివను మొదలగు ఎందరో ప్రముఖులు ఇట్లభిప్రాయపడిరి. ఈస్టిండియా కంపెనీ డైరక్టరులవలన ఈ విషయము మిక్కిలి స్పష్టముగా నేలపన్ను శిస్తుకాదనియును పన్నేయనియును 1856-వ సంవత్సరమునందు తెలియజేసిరి.

1864-సం॥న అప్పటి కార్యదర్శియగు సర్ ఛార్లెసు వుడ్డుగారివలనకూడ ఈ సంగతి విస్పష్టము చేయబడినది. సాధారణముగా శిస్తునందు సగముభాగము నేలపన్నుగ సేకరించుటకు తమకుగల యుద్దేశ్యమును వెల్లడిచేసిరి. 1875-వ సం॥మున ఈవిషయము సర్ లూయీమాలెటు, సర్ బార్టలు ఫ్రియరు, శాలిస్బరీప్రభువు (అప్పటి ఇండియాకార్యదర్శి)లచే తిరిగి విమర్శింపబడి, హిందూదేశమున సేకరించబడుచున్న

నేలపన్ను శిస్తుకాదనియును, ఆ ఆదాయము పన్నుగనే భావింపబడుచున్నదనియును మర్మము లేక చెప్పిరి. బొంబాయిరాజధానియందు వసూలు చేయబడుచున్న నేలపన్ను ఆర్థికశిస్తుపై విధించబడుచున్న శుల్కముకాని శిస్తుకాదని ఖండనగా ఏ. రాజర్సు అను నాతడు తెలియజేసెను.

కాబట్టి నేలపన్ను శిస్తుకాదనియును పన్నేయనియును గ్రహించుటకు ఆక్షేపణలేదు. హిందూదేశమునందలి ప్రజలలో చాలమంది కృషికళనే జీవనాధారముగ గలిగియున్నారు. అట్టిస్థితిలో చెన్నరాష్ట్రమునందును బొంబాయి రాజధానియందును, కొన్ని ప్రాంతములలో నూటికి ముప్పదియవవంతును అంతకుపైబడి కూడ నేల పన్నును వసూలుచేయుట ఎంతయుశోచనీయము.

రెండవ హేత్వాభాసము.

నేలపన్నుయొక్క కరభారమును (Incidence of taxation) నిర్ణయించు సందర్భమున ఈ హేత్వాభాసము కలుగుచున్నది. ఒక్కొక్క రాజధానియొక్క మొత్తపుపంట ఇంత యుండునని ఊహించుట ఇందలి హేత్వాభాసము. ఇందుకు తార్కాణముగా 1878 సం॥ కలుపుల పంచాయితీవారి నివేదనపత్రము రెండవసంపుటము 111-వ పేజీయందలి అంకెలను ఇట పొందుపరచుచున్నాము.

రాష్ట్రము	జనసంఖ్య	సేవ్యమునందున్న భూమి		మొత్తపు పంట యొక్క విలువ	నే. పన్ను	పంటయొక్క విలువయందు భూమిపన్ను నూటికి ఎన్నవ వంతు
		ఆహారపదార్థములు ఎకరములు	ఆహారపదార్థములుకానిపంటలు ఎకరములు			
పంజాబు	17,600,000	18,500,000	2,500,000	34,150,000	1,910,000	5·6
పశ్చిమోత్తర పరగణాలు అయోధ్యసహా	41,000,000	31,450,000	5,200,000	71,750,000	5,565,000	7.8
బంగాళము	60,000,000	48,000,000	6,000,000	108,500,000	4,050,000	3·9
మధ్యపరగణాలు	8,200,000	12,000,000	2,500,000	21,250,000	600,000	3·8
బీరారు	2,250,000	3,700,000	2,800,000	11,500,000	525,000	4 6
బొంబాయి	16,000,000	21,500,000	5,500,000	39,000,000	2,970,000	7·6
చెన్నరాజధాని	31,000,000	26,000,000	2,500,000	50,000,000	3,160,000	6.8

ఆహారపదార్థములనుండి ఎకరమునకు అయిదుపౌనుల విలువగల పంట పండుచుండుననియును ఇతర పంటలనుండి ఎకరమునకు 3 పౌనులు పంట పండుచుండుననియును మదింపు చేయబడినది. ఈలెక్కయందలి లోపములెవ్వియనిన—వ్యవసాయమునందున్న క్షేత్రమంతయు ప్రతిసాలునను పండుట యుండదు. హిందూదేశమునందంతటను ప్రతి సంవత్సరమునను ఈవిలువగల పంటయే పండునని యూహించుట పొరబాటు. 'సేవ్యభూమి' యని లిఖింపబడిన ప్రదేశమంతయు వ్యవసాయము నందుంచుటకూడ తటస్థించని సంగతియటుండ, తూచినట్లు ఈవిధముగ ఫలించుచున్నదని వ్రాయసాహసించుట పొరబాటు. ఇక పంటలవిషయమున సైతము సరియైనలెక్క చిక్కుటకు వీలులేదు. సేవ్యము నందున్నభూమి ఎంతవరకు ఫలవంతమగుచున్నదియును తెలిసికొనుటకు ఆధారములు లేనప్పుడు, పంటలయొక్క మదింపుకట్టుట సాధ్యముకాదు. మొత్తపుపంటలో నేలపన్ను నూటికి ఇన్నవ వంతగుచున్నదని వ్రాసినవ్రాతలకు ఏవిధమైన ఆధారములును లేవు. ఊహింపబడిన వగుటచే వీనిని సరకుచేయబనిలేదు. కఅప్రులపంచాయితీవారి యెదుట అనుభవశీలురగు అధికారులు నేలపన్ను 5 మొదలు 31వరకు యున్నదని చెప్పినసంగతులను గమనించక పైన కనబరచబడిన పట్టీయందలి అంకెలనే ఆధారముచేసికొని, సర్కారువారు వ్యవహరించుట న్యాయముకాదు.

మూడవ హేత్వాభాసము.

ఇండియా దొరతనమువారు సేకరించుచున్న నేలపన్ను మొగలాయిప్రభువుల వలన విధించబడిన ఆదాయముతో సరి

పోల్చిచూచిన తక్కువగనేయున్నదని భావించుట. మొగలాయి ప్రభువులవలనవిధించబడిన నేలపన్ను లెక్కలుమాత్రము బ్రిటిషు దొరతనమువారు విధించిన శుల్కము కంటె అధికముగనే యుండెను. అందు ఏమాత్రము వసూలు చేయబడుచుండెడిది యను సంగతి విచారణీయము. సర్ జాన్ స్ట్రాచీగారు "ఇండియా" యను పుస్తకమునందు ఔరంగజేబునాటి నేలపన్నుయొక్క లెక్కలనుగూర్చి 105-వ పేజీయందిట్లు వ్రాసిరి. "ఈఅంకెలు, వసూలు చేయబడిన ఆదాయమునుగురించి వ్రాయబడినవా లేక ఇంతద్రవ్యము వసూలుచేయబడవలసి యున్నదనియో స్పష్టముగా ఎచ్చటను వ్రాయబడలేదు. కాని వసూలుచేయవలసియున్న ఆదాయమును నిరూపించునవి యనియే నిస్సందేహముగా చెప్పవచ్చును. నామతమున మొగలాయి ప్రభువులయొక్క రివిన్యూను తెలుపు ఈ అంకెలునమ్మ నర్హములైనవి కావు."

బ్రిటిషుపాలకులు అయోధ్య నవాబువలన విధింపబడిన హెచ్చురేట్లప్రకారమే రివిన్యూను విధించుచు, వసూలు చేయుటలోమాత్రము అప్పటిరీతిని కాపుమాపులు చేయుట లేదని, బేడెను పవలుగారు బ్రిటిషు ఇండియాయందలి క్షేత్రపద్ధతినిగూర్చివ్రాసిన రెండవ సంపుటముయొక్క 14-వ పేజీయందువ్రాసిరి.

మొగలాయిప్రభువులు ఒకవేళ హెచ్చురేట్లను నేలపన్ను వసూలుచేసిరనియే ఊహింతము. ఆద్రవ్యము నేవిధముగ వారు వ్యయము చేయుచుండిరి? ఈ ప్రపంచమునందెల్ల శిల్పకళయందు ఇండియాదేశమునకు వన్నెదెచ్చునటుల తాజి-

మహల్, మయూరాసనము, జమ్మా-మసీదు మొదలగు కట్టడములకును, చిత్రపుపనులక్రిందను వినియోగించుటయే గాక ప్రజోపయోగ కరమగు ఎన్నియో ఉద్యమములకు వారు ఆసొమ్మును ఖర్చు పెట్టుచుండిరి. నీటికాలువలకును రోడ్లకు కూడ విశేషద్రవ్యము వెచ్చింప బడుచుండెడిది. అందువలన పన్నులరూపమున ప్రజలనుండి సేకరించబడిన ద్రవ్యముతిరుగా ఆప్రజలకే ఏదో ఒకవిధమున చెందుచుండుట తటస్థించుచుండెడిది. ఏదేశముననైనను వసూలుచేయబడిన ద్రవ్యము తిరిగి ఆ దేశముననే వెచ్చింపబడుచో పన్నులయొక్క భారమధికమైనను ప్రజభరించగలరు. కళాచక్రము మొగలాయిప్రభువుల కాలమునం దెంత యౌన్నత్యస్థితి యందున్నదియును, బ్రిటిషుప్రభుత్వమున ఎట్టినీచదశయందున్నదనియును గమనించిచూచిన మొగలాయి ప్రభువుల రివిన్యూయొక్క కరభారము అంతకష్టతరముగ నుండియుండదని విశదము కాకమానదు. ఇపుడన్ననో సీమఖర్చులక్రింద ఎన్నియోకోట్ల రూప్యములు పరదేశయాత్ర వెడలుచున్నవి. 1916-17 సం॥ న ఇండియాను బాసిపోయిన ధనము 39 కోట్లరూప్యములు. ఇందణుమాత్రమైనను మన దేశమునకు తిరిగిరాదు. మేజరువిగ్నేటుగారు వ్రాసిన ప్రకారము ఈధనమునంతయు సముద్రములో పారవైచిన దేశమునకెంత లాభమో అంతియ చేకూరును.

నేలపన్ను ఆర్థికశిస్తుకాదనియును, ఇదికూడ ఒకతీరు పన్నేయనియును తేలినది. కావున దొరతనమువారు ముప్పది సంవత్సరముల కొకసారి తిరిగీ పైసలాచేయునప్పుడు, రైతు చేసిన అభివృద్ధిని విడిచిపెట్టి ధరలుపెరిగి నప్పుడును, సర్కారు

వలన నీటిపారుదలకు విశేషద్రవ్యము వ్యయముచేసి సదుపాయములు చేయబడినప్పుడును, రివిన్యూను అధికముచేయుట న్యాయముగాని, పైసలాకాబడి నపుడెల్ల శిస్తును పెంపు చేయుట పాడిగాదు. ఇటీవల పంజాబు శాసననిర్మాణసభయందు, లాలాసోహన్ లాలుగారు భూముల పైసలాలు ముప్పది సంవత్సరముల కొకసారి జరుపుచుండవలయునేగాని అంతకులోపుగా జరుపరాదని ప్రభుత్వమువారిని కోరుచు ఒక తీర్మానము నుపపాదించిరి. ఆతీర్మానము అధికార సభ్యుల వలన నిరసించబడినది. తీర్మానమునకు సమ్మతులను లెక్కించమని సోహనలాలుగారు కోరగా అధికార సభ్యులందరు వ్యతిరేకముగను, అనధికారసభ్యులందరు తీర్మానము పక్షమునను సమ్మతులనిచ్చిరి. 13గురు వ్యతిరేకముగను 13గురు తీర్మానమునకనుకూలముగను తమ సమ్మతులనిచ్చిరి. అప్పుడు గవర్నరుగారు తమకు ఇతరసభ్యులకంటె అదనముగానున్న రెండవ సమ్మతిని అధికారసభ్యుల పక్షముగ నొసంగిరి. అందువలన సోహనలాలుగారి తీర్మానము రద్దుకాబడినది. పాఠకులు, డిసెంబ్రులై జేషను పంచాయితీవారియెదుట పంజాబు దొరతనమువారు, భూములపైసలాలను ముప్పది సంవత్సరములకులోపుగ మార్చమనిచేసిన వాగ్దానమును, శాసననిర్మాణ సభయందలిచర్చను, సమగ్రముగా ఆలోచించిచూచిరేని, ఇదిఎంతశోచనీయమైన సంగతియును చక్కగ గ్రహించగలరు. శాశ్వతపైసలా నొసంగకపోయిన మానిరిగాని, ముప్పదిసంవత్సరములకు లోపుగా పైసలాలను మార్చరాదని అనధికార సభ్యులుకోరగా నిరసించుట ధర్మముకాదు.

ఇండియాదేశపు ఇనుపదారులు.

"ఇండియాదేశముయొక్క సదుపాయము నిమిత్తము ఇనుపదారులు నిర్మింపబడినవి కాని ఇనుపదారుల నిమిత్తమై ఇండియా సృష్టించబడలేదు" సర్ జార్జిక్లార్కు (ఇపుడు సిడెన్ హాము ప్రభువని పిలువ బడుచున్నాడు).

బొంబాయి రాజధానియందు బ్రోచియను పట్టణరాజ మొండుగలదు. ఆనగరమును బొంబాయి, బరోడా సెంట్రలు ఇండియా రైల్వే, ఇతరప్రదేశములతో కలుపుచున్నది. ఈ రైల్వే నాటికి రెండువందలరెట్లు రేట్లను అధికముచేయుట వలన (అనగా ఇదివరలో ఒక రూపాయయున్న రేటు మూడు రూపాయలు చేసిరి) తమ వ్యాపారములకు చాల నష్టము వచ్చెనని 1910 సం॥ బొంబాయి గవర్నరు గారికి బ్రోచి పట్టణమునందలి యంత్రశాలాధికారులును వర్తకులును మహాజరు నంపుకొనిరి. ఈమహాజరును ఇండియా దొరతనము వారికి పంపు సందర్భమున సిడెన్హాము ప్రభువు, పైనీతిని గంభీరముగా వ్రాక్రుచ్చెను. ప్రజలయొక్క కష్టసుఖములను బాగుగ గుర్తించిన వాడగుటచే, దేశమునందలి కళల యొక్క పురోభివృద్ధికిని ప్రజలయొక్క సదుపాయముల కొరకును, ఇనుపదారులు నిర్మింపబడినవికాని కేవలము వర్తక విషయమగు లాభమునిమిత్తమే, ఇండియాదేశమున రైల్వేలు నెలకొల్పబడలేదని స్పష్టముగా నొక్కి వక్కాణించెను. దేశక్షేమమును ప్రజాక్షేమమును కేవల ఐశ్వర్యోపార్జనము కన్న నెక్కుడుగ పరిగణింప బడవలయుననెడి నీతి ఎల్లరకు తెలిసినదే. దొరతనమువారి ప్రయత్నములన్నియు ఇందులకే కదా! ఈరాజ

నీతిని ఇండియా దొరతనమువారు పూర్తిగ గమనించినట్లు తోచదు. ఒకవేళ మన దొరతనమువారు తల యూచినను, ఇండియా కార్యదర్శిగారు ఇంగ్లాండు నందలి కంపెనీ భాగస్వాముల యొక్క ఆశయములకు హెచ్చు ప్రాముఖ్యత నిచ్చుచు, ఇండియా దేశముయొక్క పురోభివృద్ధికి పెక్కు విషయముల అనుకూలు డగుటకు బదులు ప్రతికూలు డగుచున్నాడు. ఇది ఈదేశమునకు చాలనష్టదాయకముగ నున్నది.

ఇనుపదారులను నిర్మింప మొదలిడి డెబ్బది సంవత్సరములు కావచ్చినను ఈసరికి రైల్వే రాజస్వము (ఆదాయము) ను కూర్చి సరియైన గ్రంథమొకటియును వెలువడ కుండుట చాల సంతాప కరము. మొత్తముపైని రాజస్వ విషయమున ఎంతవరకు లాభకరముగ నున్నదియు మాత్రము మేమిచట పొందుపరచగలము. కొన్ని ఇనుపదారులు నష్టదాయకముగను కొన్ని లాభకారిగను ఈదేశమున కలవు. ఏటేట కంపెనీల వలన ప్రచురింపబడు రిపోర్టుల యందు ఈసంగతి వ్యక్తీకరింప బడుచుండును. మొత్తపు ఫలితము నాలోచించి చూచిన సంతృప్తి కరముగ లేదని చెప్పక తీరదు. 1910-వ సంవత్సరమునకికి సర్కారు రాజస్వమునకు నలుబది కోట్ల రూప్యముల నష్టము సంప్రాప్త మయ్యెను!

					కోట్లరూప్యములు.
నష్టము	1849-50	నుండి	1858-69	వరకు	2.10
,,	1859-60	నుండి	1874-75	,,	24.39
,,	1875-76	,,	1894-95	,,	25.35
				మొత్తము నష్టము.	51.84

	కోట్లరూప్యములు.
నికరపు నష్టము 1895-96 నుండి 1898-99 వరకు	3.85
,, లాభము 1899-00 నుండి 1907-08 రకు	15.47
,, నష్టము 1908-09 ,, ...	1.86
,, లాభము 1909-10 ,, ...	1.24
మొత్తముమీద నికరపు నష్టము ,,	51.84
,, ,, లాభము ,,	11.00
1909-10 సంవత్సరమునకు నిలిచియున్న నష్టము	40.84

మనరైల్వేలనుండి 1900 సంవత్సరమునుండియే సర్కారుకు లాభము వచ్చుచున్నది. ఇంకను పైని చూపిన నలుబది కోట్లరూప్యముల నష్టమును భర్తీ చేయవలసియున్నది. 1925 సంవత్సరము సరికి ఈనష్టము భర్తీయయ్యేనేని చాలఅదృష్టవంతులమే.

రైల్వే రాజనీతియొక్క విమర్శనము ఏల నందురేమో? 1910 సంవత్సరముసరికి రైల్వేలమీద 439 కోట్లరూప్యములు వెచ్చించబడెను. ఏటేట ఆదాయమునుండి వడ్డీలక్రింద ఎంత ధనమును ఈయవలసి వచ్చుచున్నదియును గమనించినచో, రైల్వే రాజస్వ విమర్శన మత్యావశ్యకమని చదువరులు చక్కగ గుర్తించగలరు. ఇటీవల ఇనుపదారుల నిర్మాణమునకై సాలునకు 12 మిలియన్ల సవరనులు (పదునెనిమిది కోట్ల అరువది లక్షల రూప్యములు) వెచ్చించబడుచున్నవి. దేశముయొక్క ఆర్థికస్థితిని చక్కగ విచారించక బ్రిటను దేశమునందలి భాగ్యవంతులయొక్క ఆశయములను సఫలీ కృతములు చేయునిమిత్తమై ఇండియా దొరతనమువారు, విశేష ద్రవ్య

మును ఇనుపదారుల నిర్మాణమునకునై వ్యయము చేయుచున్నారు. రైల్వేలవలన ప్రజలకును దేశమునకును కలుగబోవు, లాభము మాట అటుండనిచ్చి, కోట్ల కొలది రూప్యములను వెచ్చించగల స్థితిలో దేశమున్నదో లేదో చర్చించుట ముఖ్య ఆవశ్యకము. ప్రయోజనత్వమును దేశముయొక్క ఆర్థికస్థితిగతులననుసరించి చర్చించి నిశ్చయించుట ధర్మము. నీటికాలువలకును, నీటిపారుదల కట్టడములకును ప్రభుత్వమువారు చాల తక్కువగా సొమ్ముఖర్చు చేయుచున్న సంగతి ఎల్లరెఱింగినదే. సాలునకు ఒకకోటి యేబది లక్షలుమాత్రమే నీటిపారుదల కట్టడముల విషయమై ఖర్చు చేయబడుచున్నది. హిందూదేశమునకు నీటిపారుదల విధానములు ప్రాముఖ్యములుకాని, ఇనుపదారులుకావు. ఇనుపదారులు ఆర్థికసంపదను ఒకతావునుండి మరియొక తావునకు మార్చుచుండునేగాని ఉత్పత్తిచేయజాలవు. నీటిపారుదల విధానములన్ననో ప్రాణాధారములు. కృషికర్మమే ఈదేశమున పెక్కు ప్రజలకు జీవనాధారమైయున్నది. నీటిపారుదల విధానములను విరివిచేసినచో, అనావృష్టి బాధలంతగా నష్టపరచ జాలవు. ఒక్క వ్యవసాయశాఖకే (Irrigation Department) యననేల విద్యాశాఖకును ఆరోగ్యశాఖకును కూడ చాలతక్కువ సొమ్ము ఖర్చుచేయబడుచున్నది. ఇండియా దొరతనమువారు ఇనుపదారుల నిర్మాణమునందు చాల పక్షపాతబుద్ధితో రాజ్యతంత్రమును నిర్వహించుచున్నారని యొప్పుకొనక తీరదు. ఇది సరియైన రాజ్యాంగపద్ధతి కాదని నిరూపించక వీలులేదు.

1910-వ సంవత్సము సరికి రైల్వేలమీద పెట్టుబడి 439 కోట్లు. 1900-వ సంవత్సరమున 339 కోట్లుమాత్రమే. అనగా పదిసంవత్సరములలో నూరుకోట్ల రూప్యములు హెచ్చు వ్యయము చేయబడెను. నూటికి ముప్పదిరెట్లు అధికము కాబడెను. ఆపది సంవత్సరములలోను రైల్వేలనుండి వచ్చిన ఆదాయము యొక్క లాభనష్టములను విచారింతము. మొత్తపు ఆదాయములో నూటికి 36 పాళ్లు వృద్ధి అయినది. మొత్తపు ఖర్చులన్నవో (Woking charges) నూటికి అరువదిరెట్లు పెరిగినవి! 1901 సంవత్సరమున వడ్డీ బాబతు 4.37 కోట్ల రూప్యములును, 1910 సంవత్సరముకు 6.127 కోట్లరూప్యములవరకు పెరిగినది. 263, 264 పేజీలలో పొందు పరచిన పట్టీవలన ఈఅంకెలయొక్క వివరము తెల్లమగును. రైల్వేరాజస్వమును, మొత్తపు రివిన్యూ కలమునుండి తొలగించి, ప్రత్యేకముగా కనబరచుచుండిన, అందలి తంత్రమును మనము బాగుగగుర్తించుటకు అవకాశములుండును. మన నాయకులు ఈవిషయమును పట్టుదలతో సర్కారువారికి నివేదించికృతార్థులుకావలసిన యావశ్యకత, చాలగలదు.

రైల్వేరాజస్వ విషయమును విపులముగా చర్చించుచో ఎన్నియో పుస్తకములను వ్రాయవలసియుండును. స్థలసంకోచముచేత నిప్పట్టున సంక్షేపముగా ప్రధానాంశములను మాత్రమే పొందుపరచ దలంచితిమి. చదువరుల, మనంబులందు ఈవిషయమునుగూర్చి విస్తారముగా తెలిసికొనవలయుననెడి ఇచ్ఛజనించెనేని మాప్రయత్నములు సఫలములైనవని నమ్ముచున్నాము.

అసంఖ్యాకులగు రైల్వే ఉద్యోగస్తుల అభివృద్ధినిమిత్తమును, ఈదేశమునందలి ఆర్థికసంపదను వాణిజ్యద్రవ్య సాధనములను కొల్లగొనుచున్న అన్యదేశీయుల సౌకర్యముల కొరకును మనదేశమున ఇనుపదారులు నిర్మించినట్లున్నది. స్వదేశసంపదను కొల్లగొనుచున్న ఈ విజాతీయుల ఆశయములే ప్రాధాన్యముగ నెంచబడుచున్నవి. ఇండియా దేశముయొక్క రైల్వేచారిత్రమంతయు దీనికి ప్రబలనిదర్శనము. దొరలయొక్క ఆశయములు మరి ఏ ఇతరశాఖలయందును ఇంతగా అభినందించ బడుటలేదు. క్రొత్తక్రొత్త ఇనుపదారుల నిర్మాణమునకేమి, లేదా ఇంజనులు, వాగనులు, సామానుతీసికొనిపోవు (పెట్టెలు) బండ్లు మొదలగు సామగ్రిని అధికముచేయు విషయముననేమి ఆంగ్లేయవర్తకులు తమ వాణిజ్యసంఘముల మూలముగ ఆందోళనము చేసినచాలును. ఒకవేళ ఈ ఆందోళనము ఫలింపదేని ఇంగ్లీషు ప్రజాప్రతినిధి సభయందలి సభ్యులు ఇండియాకార్యదర్శిగారిని నిర్బంధముచేసి చివరకు ఇంగ్లీషువర్తకుల కోరికలు నెరవేర్చు కొందురు. క్రొత్త ఇనుపదారులను నిర్మించుటవలన వీరి కేమియు బాధకలుగదు. వీరు వడ్డీలక్రింద ఏమియు నీయనక్కరలేదు. భారమంతయు భారతీయులే వహించుచుండ, లాభమును మాత్రము తాము గ్రహించుచుందురు. తాము కొంచెమైనను నష్టపోకుండ, ఇండియా దేశమునందలి ద్రవ్యసాధనముల నన్నిటిని కొల్లగొనుటయే ఆంగ్లేయవర్తకుల ఆశయము. రైల్వే విషయములయందు, ఈ దేశస్తుల ఆశయములు కొంచమైనను గమనింపబడుటలేదు. ఏవిధమున అన్య

దేశీయుల వ్యాపారములు వృద్ధిని గాంచునో అద్దానినే పరిగణించుచున్నారు.

ఇందులకెన్నియో నిదర్శనములు గలవు. గారంటీ చేయబడిన ఇనుపదారుల సంగతిని యోచింతము. తొలుత 1848 సం॥ న ఇండియాయందు ఇనుపదారులు నిర్మించుటయందు ఇంగ్లాండునకువలెనే కంపెనీలు, మొదట పెట్టుబడి పెట్టుటకు ప్రారంభించినవి. రైల్వేలవలన లాభము వచ్చునో నష్టము వచ్చునో ప్రథమమున తెలియదు. గనుక సర్కారువారు నూటికి అయిదువంతున వడ్డీగిట్టునట్లుగా అంగీకరించినగాని కంపెనీలు మూలధనమును వెచ్చించ నియ్యకొనలేదు. అపుడు నూటికి అయిదువంతున వడ్డీ గిట్టునట్లు మేము పూచీపడెదమని ఇండియా దొరతనమువారు పూనుకొనిరి. తమ సొమ్మునకు వడ్డీ ఎటులనైన గిట్టునుగదా యను ధైర్యముతో కంపెనీలు ఎన్నియో లక్షలరూప్యములను కొన్నివిషయములలో అనవసరముగకూడ, పెట్టుబడిపెట్టెను. సర్కారువారు పూచీపడుటనే గారంటీయనెదరు. మొదట గారంటి చేయబడిన ఇనుపదారులన్నియు ఇండియా దొరతనమువారిచే తిరుగా కొనబడినవి. కొన్ని సంవత్సరములు పోయిన తరువాత కంపెనీలు వెచ్చించిన మూలధనమునకు అప్పటి మార్కెట్టు రేటుప్రకారము యావత్తు భాగములను కొనుటకు ప్రభుత్వమువారు తమకు అధికారమును ఉంచుకొనిరి. గారంటీ చేయబడిన రైల్వేలయందలి భాగస్వాము లెటుల ఐశ్వర్యవంతులైనదియు చూతము. నూటికి అయిదువంతు వడ్డీకి సర్కారువారు పూచీ పడియున్నారు. రైల్వేలనుండి వచ్చెడి నష్టమును, పన్నులను చెల్లించు ఈ

దేశస్థులు భర్తీచేయవలసి యున్నది. వెల్బీ పంచాయితీ వారి యెదుట నీయబడిన సాక్ష్యమువలన 1896 సం॥ సరికి 51.84 కోట్ల రూప్యముల నష్టము సంప్రాప్తించెను అనగా సాలునకు సుమారు కోటి రూప్యములు నష్టము. ఇంతటితో సరిపోలేదు. కంపెనీలకు లాభము వచ్చునట్లుగను, సర్కారుకు నష్టము వచ్చెడిరీతిని ప్రభుత్వమువారు, గారంటీ చేయబడిన కంపెనీలతో తిరిగి ఒడంబడికలు చేసికొనిరి. కంపెనీలయొక్క భాగములు ప్రభుత్వమువారిచే కొనబడినవి. కంపెనీలయొక్క కంట్రాక్టు (లైసెన్సు) ఆఖరు అయేకాలమునకు అట్టి భాగములను కొనుటకు కావలసిన ధనమును సమకూర్చుటకునై, ఏటేట రాజస్వమునుండి కొంత ధనమును కేటాయింపుచేసి ఒకనిధిని ఏర్పాటుచేయలేదు. అటులచేయక యుండుటవలన, సర్కారువారు కంపెనీలయొక్క కరుణాకటాక్షములకు పాత్రులు కావలసివచ్చెను. గవర్నమెంటువారు కొనబోవు నాటికి ఉండెడి మార్కెట్టు ధర ప్రకారము కంపెనీలయొక్క మూలధనమంతయు చెల్లించవలసి వచ్చెను. రైల్వే కంపెనీభాగములన్నియు బజారు ధరప్రకారము హెచ్చు మూల్యమునకుగాని లభింపవయ్యెను. ఏటేట నష్టము వచ్చుచున్నది గదా, ఈ భాగములకు ధర ఎటుల అధికమయ్యెనని ప్రశ్నించవచ్చును. నూటికి అయిదువంతు వడ్డీ గిట్టునట్లుగా మన ప్రభుత్వమువారు పూచీపడియుండుటచే భాగములయొక్క ధరలు పెరిగినవి. ఆఋణ తీర్మానమునకై ప్రత్యేకనిధిని నెలకొల్పకపోవుట చేత వీరి మూలధనమును చెల్లించుటకుగాను, ప్రభుత్వమువారు తిరిగి ఋణము చేయవలసివచ్చెను. అందుచేత పూర్వపుకంపెనీలే

తిరుగావచ్చుట తటస్థించెను. ఇంతటితో పూర్తియైన బాగుగనే యుండును. మఱియొక షరతుకూడ విధించబడెను. రైల్వేలను కంపెనీల యాజమాన్యము నందుంచుటకును, తమ శ్రమకు ప్రతిఫలముగా, లాభమునందు కొంత భాగము కంపెనీలకు చెందునట్లుగను నిశ్చయించ బడెను. దూరదృష్టి లేకపోవుట వలనను సరియైన రాజ్యతంత్ర నిర్వాహణ లోపము వలనను, పూచీ సేయబడిన రైల్వేకంపెనీలు, విస్తారము లాభమును తమ మూలధనమునుండి సంగ్రహించుటయేగాక తిరిగి రైల్వే యాజమాన్యమును వహించి అదనముగా క్రొత్తలాభమును సైతము పొల్గొనుచున్నారు. ఇండియా జాతీయ ఋణమును ఇనుమడింప చేయుటకు ఆఫ్ఘను యుద్ధములకును, సీమఖర్చులకును, రైల్వేలుకూడ సహకారులైనవి.

ఇనుపదారులు నిర్మించినది మొదలు నేటివరకును ఇండియా రైల్వే రాజస్వమున ఎన్నియో ఘోరమైన పొరపాటులు లొనరింప బడినవి. ఇట్టి పొరపాటులు నాగరికతను గాంచిన ఏదేశమునందైన గావింపబడుచో, దేశమునందంతటను కలవరము పుట్టియుండును. 1848 మొదలు 1917 వరకు రైల్వేల విషయమై ఏ క్రొత్తమార్గము నవలంబించినను అది హిందూ దేశమునకు క్షేమకరముగ నుండుటకు బదులు విప్లవకారిగ నుండునట్లుగనే పరిణమించుచుండెను. డల్హౌసీ ప్రభువుయొక్క వరప్రసాదమే నేటికిని ఇండియాను పీడించుచున్నది.

ఈమహాశయుడు కటాక్షించకయున్న ఇట్టి దురవస్థ సంప్రాప్తించక పోవును. రైల్వేలను ఇండియాయందు నిర్మా

ణము చేయుటవలన లాభమేమియు కలుగలేదని శాసించుట మామాతముకాదు. డల్హౌసీప్రభువు, కంపెనీలకు పూచీనిచ్చి ఇనుపదారులను అపుడు నిర్మింపకున్నచో, రైల్వేలే ఈదేశమున లేకపోయి యుండునని భ్రమించరాదు. నాగరికాగ్రగణ్యయగు ఇంగ్లాండుతో ఈదేశమునకు పొత్తుసంభవించినపుడు డల్హౌసీప్రభువు గవర్నరు జనరలుగానుండు కాలమున లభించకపోయినను, దూరదృష్టిగల కానింగు, లారెన్సుప్రభువుల కాలమందైనను రైల్వేలుదేశమున నిర్మించబడియే యుండును. విశేష మేమనెదరేమో? కంపెనీలకు గారంటీనిచ్చి విశేషధనమును గోల్పోవుటకన్న సర్కారువారే ఋణము తెచ్చి ఇనుపదారులను నెలకొల్పియుండును. 1868-69 సం॥ న ఇండియా దొరతనమువారు స్వయముగనే రైల్వేలను ఋణముచేసి తెచ్చిన ద్రవ్యముతో నెలకొల్పనారంభించిరి. దురదృష్ట వశమున ఈరాజ్యనీతి యందుకూడ మార్పు లొనరించబడి, పదిసంవత్సరములు కాగానే తిరిగికంపెనీల మూలధనముతో కొన్నిరైల్వేలును, సర్కారువారి మూలధనముతో కొన్ని యును నిర్మింపబడినవి. రైల్వేరాజస్వనీతిని తలచినకొలదిని లోపములె కానవచ్చుచుండును. కంపెనీలని పేర్కొనబడిన వన్నియును ఇంగ్లాండునందలి ఆంగ్లేయ మూలధనముతో నేర్పడిన కంపెనీలే అయియున్నవి. ఇండియా ప్రజలకు ఏ జోక్యమును లేదు.

ఋణతీర్మాననిధిని (Sinking fund) నెలకొల్పకయుండుట సర్కారురాజస్వనీతియందు ముఖ్యమైనలోపము. సర్కారువారికి వాణిజ్యపరిజ్ఞానము ఏమాత్రమున్నను ఋణతీర్మాన

నిధియొక్క ఆవశ్యకత తెలిసి తీరవలయును. ప్రతికంపెనీ ఒడం బడికయందును 25 సంవత్సరములకో, 50 సంవత్సరములకో సర్కారువారి ఇష్టప్రకారము తీసికొనుటకు ఆటంకములు లేకుండ షరతులుండియే యున్నవి. ఆనిధియున్న యెడల తిరుగా ఋణముచేయ నక్కరలేకయే, కంపెనీలకు క్రయధనమును చెల్లించుటకు వీలుగా నుండియుండును. గారంటీ చేయబడిన వడ్డీని (నష్టమువచ్చినపుడెల్ల) ఇచ్చుకొనుచు, తిరిగిఋణ తీర్మాన నిధిని నెలకొల్పుటవలన ఇండియా రాజస్వమునకు భారమధిక మగుననుమాట సత్యమే. కాని ఆభారము చివరకు లాభకారి గనే పరిణమించి యుండునని మా నమ్మకము. ఏది ఎటుల నున్నను క్రయధనమునుతిరిగి ఏదో ఒకవిధముగ ఋణము తెచ్చి చెల్లించుటకంటె అట్టినిధియున్న యెడల చాలతక్కువ ధనము వ్యయమైయుండును. ఒక్క ఈస్టిండియను రైల్వేదక్క గారంటీ చేయబడిన ఇతర రైల్వేకంపెనీ లన్నియు ఏబది సంవత్సర ములుదాటిన తరువాతనే కొనబడినవి. ఋణతీర్మాననిధియుండి యుండిన తిరుగా ఋణముచేసి చాలసొమ్మును వడ్డీల క్రింద వినియోగించవలసిన అవస్థపట్టియుండక పోవును. అటులగావిం చినచో ఇండియా దొరతనమువారు ఈసరికి అన్ని రైల్వేలకు ఏకంపెనీయొక్క జోక్యమును లేకుండ ఖామందులై యుండి యుందురు. ఇపుడన్ననో ఈస్టు ఇండియను రైల్వే (కలకత్తా నుండి ఢిల్లీ మీదుగా సిమ్లావరకు పోవును). 1919 సంవత్సరము వరకును, గ్రేటు ఇండియను పెనెన్సులారైల్వే (నాగపూరు నుండి బొంబాయివరకును, రాయచూరునుండి బొంబాయినగర కును పోవును). 1925 సంవత్సరమువరకును, ఇతరరైల్వేలు

1950 వరకును కంపెనీల యాజమాన్యమునందుండి తీరవలసి యున్నది. కంపెనీలు విధించిన షరతులకు దొరతనమువారు లోబడియుండవలసిన అవసరము లేక పోయియుండును. మొదటి 55 సంవత్సరములలోను సాలునకు కోటిరూప్యముల చొప్పున ఇండియా రాజస్వమునకు నష్టమువచ్చినది. మిగిలిన 50 సంవ త్సరములలోను, న్యాయముగా సర్కారునకు చెందవలసిన లాభములో చాలతక్కువగా సంప్రాప్తించగలదు. కంపెనీలు తమఖర్చులుపోను ఏటేట కోటిరూప్యములను వారిలాభము నిమిత్తము మొత్తమునందు పొల్గొనుచున్నవి.

ఇనుపదారులపై వచ్చులాభము.

1907 సం॥ న రైల్వేకమిటీయొకటి, విచారణనిమిత్తమై సిద్ధపరించబడెను. ఆకమిటీవారు తమనివేదనము యొక్క నాల్గవపేరాయందు 1906-07 సంవత్సరముతో అంతమగు అయిదుసంవత్సరముల యొక్క రైల్వేరాజస్వమును గూర్చియు ప్రకటించిరి. అందు అయిదవ సంవత్సరముయొక్క లెక్కను పరిశీలించి చూతము.

	1906-07	
మూలధనము	253,708,169	సవరనులు.
స్థూలాదాయము	2[illegible],834,000	,,
స్థూలమైనఖర్చులు	130,493,522	,,
ఖర్చుపోగామిగిలిన నికర ఆదాయము	13,341,338	,,
మూలధనముపైని నూటికివచ్చిన నికర ఆదాయము	5·26	,,

పై పట్టీయందలి అంకెలనుబట్టి నూటికి 5.26 వంతున దొరతనమువారికి నికర ఆదాయము వచ్చినదనిగాని, లాభమని గాని పాఠకులు తలంచరాదు!

ఏలననిన స్థూలమైనఖర్చులకు రైల్వేలనిమిత్తమై తెచ్చిన ఋణములయొక్క వడ్డీయును కొన్ని గారంటీ కంపెనీలకు ఏటేట చెల్లించవలసిన వాయిదాలకగు (Annuities) ఖర్చులును, ఋణతీర్మాననిధి నెలకొల్పనందువలన కంపెనీలయొక్క భాగములకు అదనముగా చెల్లించవలసిన ద్రవ్యమును చేర్చవలసి యున్నది. నికరాదాయమని పేర్కొనబడిన 13.34 మిలియన్ల సవరనులనుండియు పైన జెప్పబడిన ఖర్చులన్నియు తీసివేయగా శేషము 2,313,541 సవరనులకు దేలుచున్నది. వాణిజ్య విధానమునం దంగీకరింపబడు నీతిప్రకారము, ఇండియా దొరతనమువారికి 253,708,169 సవరనుల పెట్టుబడిపైని వచ్చిన నిజమైన నికరాదాయము 2,313,541 సవరనులు మాత్రమే. నూటికగు లాభము 0.91-వ వంతుమాత్రమే అయియున్నది. కమిటీవారు సూచించినప్రకారము 5.26-వ వంతు కాదు. ఆసంవత్సరమున అన్ని బాబతులక్రిందను వెచ్చించబడిన ధనమును తీసివేసిన నిలచియున్నది నికరాదాయమన జెల్లును. ప్రభుత్వమువారు ఈనిజమైన నికరాదాయమును ప్రకటించకుండ, నామమాత్రమైన 5.26 వ వంతు నికరాదాయమని ప్రకటించుట చాలపొరబాటు. రైల్వేలు నెలకొల్ప మొదలిడి 1908-వ సంవత్సరమునకు 60 సంవత్సరములు కావచ్చినను, సర్కారువారికి రైల్వేలపై వెచ్చింపబడిన కోట్లకొలది మూలధనముపై నూటికి 0.91 వంతుకంటె అదనముగా (ఆదాయము) లాభము నొసంగకుండుట కడువిషాదకరము. నూటికి ఒకవంతైనను లేదు! ఇదియైనను 1899-1900 సం॥ నుండిమాత్రమే లభించుచున్నది. రైల్వే కమిటీవారివలన తెలియజేయబడిన ఇండియా దేశముయొక్క రైల్వేరాజస్వపునిజస్థితి ఇటుల నున్నది. కమిటీవారు కొన్ని రైల్వేలకు చెల్లించుచున్న సంవత్సరవాయిదాలో కొంతవరకు క్రయధనమును చెల్లించుట యగుచున్నదికాన, సర్కారువారి నికరాదాయమునందు చేర్చవలసియుండునని వ్రాసియున్నారు. సత్యమే. 1906-07 సరికిమూలధనమునందు తీర్చబడినద్రవ్యము 752,135 సవరనులు. కమిటీవారువ్రాసినట్లుగనే ఈద్రవ్యమును కూడ నికరాదాయమునందు చేర్చుదము. అపుడు మొత్తము 3,065,676 సవరనులగుచున్నది. ఈ మొత్తమునుండి నూటికి వచ్చెడిరాబడి 1.20-వ వంతు అగుచున్నది. రైల్వేరాజస్వముయొక్క ఉదంతమంతయు ఇందులో నిమిడియున్నది. దేశమునందు అరువదియేండ్లు రైల్వేలు నెలకొల్పబడియుండ 253 మిలియన్ల సవరనులమీదను సర్కారుకువచ్చిన నికరాదాయము నూటికి 1.20-వ వంతుమాత్రమే! రైల్వేరాజస్వమెంత నీచ దశయందున్నదియు ఈ అంకెలే చెప్పక చెప్పుచున్నవి.

ఇనుపదారులకగు ఖర్చు.

నూతన ఇనుపదారులను నిర్మించుటయందే గాక, వాగనులను (Rolling stock) ఏటేట అధికము చేయవలసినదని ఆంగ్లేయవర్తక సంఘములు ఆందోళనము చేసినవెంటనే ఇండియాదొరతనమువారు క్రొత్త సామానులకొరకు అనుజ్ఞనిచ్చుచున్నారు. ఈవిషయమై 1900-01—1906-07 సంవత్సరములమధ్య ఎంతఖర్చు అయినదియును ఈదిగువ చూపబడినది.

	సవరనులు.
1. క్రొత్త అయోమార్గములను సృష్టించుటకు	22,836,510
2. వాగనులు మొదలగువాని నిమిత్తము	27,411,120
మొత్తము.	50,247,630

1900-01 సరికి నిలిచియున్న ఖర్చు 5,317,768 సవరనులనుండి 1905-06 సరికి 8,999,430 సవరనుల వరకు పెరిగినది. 1906-07 సరికి 9,741,000 సవరనులయినది. ఆరు సంవత్సరములలో మూలధనముక్రింద 4,423,232 సవరనులు ఖర్చయినది. అనగా నూటికి 83-వ వంతు అధికము కాబడినది.

ఆంగ్లేయవర్తకుల ఆందోళనము.

ఖర్చు రెండింతలు అధికము కాబడినను, రైల్వేకంపెనీలవారును, ఆంగ్లేయవర్తక సంఘములును తృప్తిని గాంచుట లేదు. కోరినకోరికలు నెరవేరుచున్న కొలదిని ఇంకను అధికముగా కావలయు ననియే ఆందోళనము చేయుచుందురు. ఆంగ్లేయ వర్తక సంఘములన్నిటియందును బంగాళమునందలి సంఘమునకు హెచ్చు ప్రాముఖ్యతయున్నది. ఈవర్తకులలో చాలమంది, గోగునార యంత్రశాలలకును, రాక్షసి బొగ్గు గనులకును అధికారులై యున్నారు. తమ వ్యాపారము హెచ్చుగా సాగుటకొరకు రయిలుకూలిని(Railway Freight) తగ్గించుట అవసరమని గుర్తించినవారై, అందు నిమిత్తమై మొదట ఆందోళనము చేసిరి. ఆ ఆందోళనమునందు కృతార్థులైనవెంటనే, రయిలుకూలి తక్కువగుటచేత బంగాళారాష్ట్ర

మునందలి రాక్షసిబొగ్గు చాల చౌకధరకు దొరకుచుండుట వలన దేశమునందలి చాల భాగములయందు ఈ బొగ్గునకు గిరాకి అతిశయించెను. లాభమునంతయు ఒక్కసారిగా గ్రహింపగోరి, సామానుబండ్లు చాలనందున వానిని అధికము చేయవలసినదని ఆందోళన ఆరంభముచేసిరి. తొలుత రయిలుకూలిని తగ్గించవలసినదనియు అది లభించినవెంటనే సామానుబండ్ల సంఖ్యను అధికము చేయవలసినదనియు ఆందోళనము చేసిరి. ఈ ఆందోళనమునందు వీరు కృతార్థులైరని వ్రాయుటయందు ఆశ్చర్యమేమున్నది! రాక్షసిబొగ్గు వ్యాపారమునకేగాక మేంగనీసునకుకూడ గిరాకి అతిశయించెను. ఇంగ్లాండునకు రషియా దేశపు సరఫరా తగ్గిపోవుటవలన ఇండియా దేశమునందలి మేంగనీసుకు గిరాకి అతిశయించెను. ఇందలి విశేషమేమనగా, మేంగనీసు ఇసుకవలె నుండుటవలన దీనిని రేవు పట్టణములకు గొనిపోవుటకై సామానుబండ్లు విశేషముగా కావలసివచ్చెను. రాక్షసిబొగ్గు వ్యాపారమునకును, మేంగనీసు వ్యాపారమునకును ఎన్నియో వేగనులును ఇంజనులును అవసరమయ్యెను. వీనిని అధికము చేయుటయనగా, మూలధనమును అధికముగా వెచ్చించుటయును వడ్డీలకు విస్తారముగా ధనమును విదేశములకు చెల్లించుటయును తటస్థమగుచుండును. ఇది ఈదేశమునకు చాల నష్టదాయకము. పై దేశములకు వడ్డీల నిమిత్తమైగాని ఉద్యోగస్తుల జీతముల నిమిత్తమైగాని పోవు సొమ్మునందు ఒకపైసాయైనను ఈదేశమునకు తిరిగిరాదు. ఏటేట సీమఖర్చులక్రింద ఈ దేశమునుండి కోట్లకొలది రూప్యములు విదేశయాత్ర నెడలుచున్నవి. కుబేరుని నవనిధులు సైతము ప్రతిదినమును

వ్యయముచేయుచు పైరాబడిని అందు చేర్చినచో హరించక మానవు.

అందువలని నష్టములు.

వేగనులను, ఇంజనులను అధికము చేయుటవలన ఒక గొప్పనష్టముకలదు. ఈబండ్లుసంవత్సరముపొడుగునను వాడుక చేయబడవు. సంవత్సరమునకు నాలుగుమాసములు మాత్రమే వర్తకసమయము. మిగిలిన 8 నెలలును ఈవేగనులు త్రుప్పు పట్టి పాడగుచుండవలసినదే! ఇందువలన ఎంతనష్టము సంభవించుచున్నదియు ఊహించ వలసియున్నది. 1906 వ సం॥ కు నిలువయున్న వేగనులు 115,686. 1908 సంవత్సరము సరికి 13,000 జాస్తి అయ్యెను. అనగా రెండు సంవత్సరములలో నూటికి సుమారు 11 వంతున అధికమైనది. వేగనుల సంఖ్య ఆంగ్లేయవర్తక సంఘముల ఆందోళనమువలన విస్తారముగా పెరిగినది.

మూడవతరగతి ప్రయాణీకుల దుస్థితి.

కాని, మనుష్యులు ప్రయాణము చేయుటకై మూడవ తరగతిబండ్ల సంఖ్యఎంత అధికము చేయబడినదియును రైల్వే కమిటీవారు పేర్కొనలేదు. జగన్నాథము, సింహాచలము, తిరుపతి, శ్రీరంగం మొదలగు పుణ్యక్షేత్రములకు యాత్రదివసములయందు లక్షలకొలది ప్రయాణీకులుపోవుచున్న సంగతి ఎల్లరెఱింగినదే! ఒక్కొక్క బండిలో వందలకొలది జనమును బస్తాబందీ చేసినను, ప్రయాణీకులబండ్లు చాలక సామాను బండ్లయందుసైతము యాత్రికులను కూరుటచేత ఊపిరి పీల్చు

టకు గాలియైననురాక పడుచున్నకడగండ్లను మనము కండ్లార జూచుచునే యున్నాము. మన ప్రయాణీకుల దుస్థితి మార్చ వలయునని దేశీయ మహాజనసభవారు ఎన్ని పర్యాయములు మనవి చేసికొన్నను నిష్ప్రయోజనములగుచున్నవి. ఆంగ్లేయ వర్తక సంఘములకుగల పటిమ మన దేశీయమహాజనసభకు లేనిహేతువువలననే ఇట్టిరాజ్యనీతికి వీలుకలుగుచున్నది. ఇండియాదొరతనమువారు తమ ఆందోళనమును పెడచెవిని బెట్టినచో, పార్లమెంటు సభయందలిసభికులు ఇండియా కార్యదర్శిగారిని ఎట్టకేలకు ఒప్పించగల సామర్థ్యమును కలిగియున్నారు.

రైల్వేబోర్డునందలి ప్రాతినిధ్యము.

ఇండియా దేశమునకు పార్లమెంటు సభయందు ప్రాతినిధ్యములేదని విచారించ పనిలేదు. రైల్వేబోర్డునందే మనకు ప్రాతినిధ్యము నొసంగనపుడు, పార్లమెంటు విషయమై మనము వగవ పనిలేదు. సామ్రాజ్య, స్థానిక, కార్యనిర్వాహక సభలయందును, ప్రధాన న్యాయస్థానములయందును, ఇండియా కార్యదర్శిగారి సభయందును గౌరవముతో స్థానముల నలంకరించుటకు తగిన భారతీయులు దొరకుచుండ, రైల్వేబోర్డునందు ప్రాతినిధ్యమును వహించుటకు తగినవారొక్కరును లేరనుట చాల సంతాపకరము. ఒకవేళను ఈయుత్తమ పదవిని అభిలషించుటకు తగిన భారతీయులే లేనిచో సర్ విఠల్‌దాసు ఠాకర్సేగారు సెలవిచ్చినట్లు, బ్రిటిషు ప్రభుత్వమునకు గౌరవమయిన సంగతికాదని వక్కాణించక తప్పదు. నవనాగరిక శిఖామణులనబడు ఆంగ్లేయులచే నాటవబడి సంవ

త్సరములనుండి పరిపాలింపబడుచున్నను, రైల్వేబోర్డు సభ్యత్వ పదవికి అర్హుడగు భారతీయుడొక్కడును ఉద్భవించక పోవుట నిజమే అయినచో బ్రిటిషు ప్రభుత్వముయొక్క కీర్తి కళంక రహితముకాదని వేరుగచెప్ప నక్కరలేదు. ఈరైల్వే కమిటీ వారు వేగనులను ప్రత్యేకముగా నిర్మించవలసిన అగత్యము లేదని తీర్మానించినందుకు మనకు వందనీయులు. ఏరైల్వే కంపెనీవారు, ఆ రైల్వేకంపెనీ వ్యాపారముయొక్క అవసరము లకు వలయునన్ని బండ్లను వారే జాగ్రత పరచుకోవలసిన దనియును, వేగనులను విధి విరామము లేకుండ అధికము చేయుటకు బదులు ఉన్నవానితోనే జాగ్రత్తగా పనిజరిగించు కోవలసినదనియును తీర్మానించిరి. ఈతీర్మానమును ఆచరణము లోనికి దెచ్చిన, ఎంతయో బాగుగనుండును.

ఇంకను ఇనుపదారులు అభివృద్ధికావలయునా?

రైల్వేకమిటీవారు ప్రస్తుతము ఉండియున్న ముప్పది వేలమైళ్ళ ఇనుపదారులతోను తృప్తినొందక, ఒకలక్షమైళ్ళ వరకు ఇనుపదారులను నిర్మించుట సమంజసమని తీర్మానించిరి. అందులకు సాలునకు $12\frac{1}{2}$ మిలియనుల సవరనులు ఇండియా దొరతనమువారు ఖర్చుపెట్టుట యుక్తమనిరి. వలయుమూల ధనమును సేకరించుటకు ఉపాయాంతరములను చర్చించుచు $7\frac{1}{2}$ మిలియనులు దొరతనమువారు ఇంగ్లాండునుండి ప్రత్యేక ముగ ఋణముచేయవలసినదిగను, మిగిలిన 5 మిలియన్ల సవ రనులును హిందూదేశమునుండి సంగ్రహించుటయును పాడి యనిరి.

	లక్షలు
ఇండియా దేశముయొక్క ఆదాయమునుండి	100
ఋణమును తగ్గించుటకుగాని లేకుండజేయుటకు గాని ఆదాయమునుండి ఏటేట గ్రహించునది.	75
సేవింగ్సుబ్యాంకి డిపాజిట్లనుండి	100
రూపాయిఋణము (Rupee loan)	325
న్యాశాములు చేయుటవలన వచ్చిన లాభమునుండి	150
మొత్తము, రూప్యములు.	750

750 లక్షలు=5 మిలియన్ల సవరనులు.

రైల్వేకమిటీవారి యోచన మాకంత తృప్తికరముగ లేదు. బ్రిటిషువ్యాపారస్తులయొక్కయు బ్యాంకర్లయొక్కయు క్షేమము నభిలషించి ఈ తీర్మానము గావింపబడెను గాని, భారతీయులయొక్క కష్టసుఖములను లాభనష్టములను గమ నించలేదు. ఏలననగా ఈ దేశముయొక్క ఆర్థికస్థితిని నిష్పక్ష పాతబుద్ధితో గమనించినయెడల ఎట్టివారికిని ఇనుపదారుల యొక్కవృద్ధి ప్రస్తుతము అవసరముకాదని తోచకమానదు. నీటిపారుదల పనులయొక్క ఆవశ్యకత మనదేశమున నెండు. రైల్వేనిర్మాణము అవసరము లేదు. ఇనుపదారులు మన దేశమునకు చాల అభివృద్ధిని కలుగజేసినమాట సత్యమేకాని, వీనిని ఇంకను అధికము చేయకపోయినయెడల ప్రాణోపద్రవము ఏమియు కలుగదని మానమ్మకము. దేశముయొక్క ఆదాయ వ్యయములను చక్కగా గుర్తించి, జాగ్రత్తగా రాజ్యతంత్ర మును నిర్వహించవలసిన ఆవశ్యకత ఈదేశమున కడుమెండు.

ఏలననగా జాతీయఋణము ఇదివరకే అపరిమితముగ పెరిగినది. వడ్డీలక్రింద విదేశములకు అపారముగ ధనమునుపంపుచుండుట చేత స్వదేశమునందలి ఆర్థికసంపదకు విశేషనష్టము కలుగుచున్నది.

రైల్వేలు, నీటిపారుదల పనులు.

రైల్వేలకన్న నీటిపారుదల విధానములయొక్క ఆవశ్యకత ఇండియాదేశమున విశేషముగ కలదు. కఱవులచేత బాధపడుచున్న భారతీయుల ఇక్కట్టులను బాపునిమిత్తమై 'ఇర్రిగేషను' కమిషనువారు 44 మిలియన్ల సవరనులను నీటిపారుదలపనులకు ఖర్చుపరచవలసినదని అభిప్రాయమునిచ్చిరి. గోదావరి, నేరా (Nera) ప్రాజక్టులు గాక ఇర్రిగేషను కమిటీవారు సిఫారసుచేసిన ప్రాజక్టులన్నియు మూలబడియున్నవి. సంవత్సరమునకు 5 మిలియన్లచొప్పున సర్కారువారు వ్యయముచేసినచో 8, 9 సంవత్సరములలో ఆప్రాజక్టులన్నియును పూర్తి కాగలవు. ఈనీటిపారుదల విధానములనన్నిటిని పూర్తిచేయుట వలన అనావృష్టిదోషము సంభవించినను దేశమునందు పంటలు పుష్కలముగపండుట కవకాశము కలుగుచున్నది. ఈతిబాధలు లేకుండిన దేశమునందలి ప్రజలు సంతుష్టు లగుటయేగాక ఆర్థికసంపదకూడ వృద్ధిగాంచును.

ఈసందర్భమున ఇండియా దొరతనమువారు ఒకముఖ్య సూత్రమును గ్రహించవలసి యున్నది. ఒకదేశమునకు లాభించు రాజ్యనీతి మరియొక దేశమునకుకూడ లాభించుననుట వెర్రియని సర్కారువారు గ్రహించవలసి యున్నది. స్థితిగతులను

బట్టి అమృతమునుసేవించినను కొన్నితత్వములకు, ఒకానొక సమయమందు విషముగ పరిణమించకమానదు. స్వేచ్ఛావర్తకము ఇంగ్లండునకు లాభకారియగుటచే ఇండియాకు కూడ లాభము నిచ్చుననెడుమాట వట్టిభ్రమయనియు ప్రతిదేశమునకు ప్రత్యేక ఆర్థిక వ్యవస్థలలవడియుండుననియు ప్రథమ అధ్యాయమునందు విపులముగాచర్చించి నిర్ధారణచేసి యున్నాము.

కాబట్టి ఆర్థికస్థితిననుసరించి ప్రస్తుతము నూతన రైల్వే నిర్మాణమును పూర్తిగ ఆపుచేసి, సంవత్సరమునకు పదిమిలియన్ల పౌనులు మాత్రమే ఇనుపదారులక్రిందను నీటిపారుదల విధానములకును ఖర్చుచేయవలసియున్నది. అందు 5 మిలియన్ల పౌనులు ఇరిగేషను కమిషనువారి సిఫారసుప్రకారము ప్రాజక్టులను నిర్మించుటయందును, 5 మిలియన్లపౌనులు రయిల్వేలయొక్క లోటుపాట్లను భర్తీచేయుచుండుటకును వినియోగించవలసి యున్నది. నీటిపారుదలపనులు పూర్తి అయిన తరువాత ఇనుపదారులను నూతనముగా నిర్మించుసంగతి ఆలోచించవచ్చును. స్వదేశమున ఎవ్వియేని కంపెనీలు బయలువెడలి, దేశమునందలి మూలధనముతో రైల్వేనిర్మాణమును చేయబూనిన, ఆంగ్లేయ వర్తక సంఘముల ఆందోళనకు జడియక సర్కారువారు అనుజ్ఞ నిచ్చుచుండవలెను.

ఇనుపదారులకు ధనము ఇండియాయందు దొరకదా ?

ఇనుపదారులకొరకు వలయు ద్రవ్యమును ఋణముచేసి తెచ్చుటవలని లాభనష్టములను చర్చించనగును. వలయు ధనమును స్వదేశమునుండి గ్రహించుటయే లెస్స. ఈదేశమున

రైల్వేనిర్మాణమునకు అవసరమగు ధన సంచయము లభించక
పోవునాయనుప్రశ్న. బొంబాయినూలుయంత్రశాలలకు కావల
సిన మూలధనము 10,14 కోట్ల రూప్యములును ఇండియా
దేశమే సరఫరాచేసినది. వీరిచ్చువడ్డీ నూటికి $4\frac{1}{2}$ లేక $4\frac{3}{4}$రూప్య
ములు మాత్రమే. నూలుయంత్రశాలలసంగతి యటుండనిండు.
పట్టణపారిశుద్ధ్య సంఘములును, నగరములను విశాలము
చేయుటకును ఆరోగ్యవంతములుగ చేయుటకును ఏర్పడిన
ట్రస్టులును రేవుల సంఘములును (Harbour trusts)
వారికి వలయు ధనమునంతయు నూటికి 4 రూప్యముల వడ్డీకి
దేశమునుండియే గ్రహించుచున్నారు. గవర్నమెంటువారి
సంబంధములేని, ఇట్టి సంఘములే తమ వాంఛాపూర్తికి
వలయు ధనమును స్వదేశమునుండి సేకరించ గలిగినప్పుడు,
గవర్నమెంటువారికి అప్పుకావలయుననిన అందులో ఇనుప
దారుల నిమిత్తమని తెలియుచో ధనము చేకురకపోవునా ?
నూటికి $3\frac{1}{2}$ కంటె వడ్డీని అధికముగ చెల్లించనునెడి పట్టును
పట్టక, సర్కారువారు నూటికి 4 రూప్యములు వడ్డీ నిచ్చు
టకు అంగీకరించవలెను. ఆ వడ్డీకి స్వదేశమున ఇనుపదారుల
నిమిత్తమై వలయుధనము తప్పక దొరకగలదు. వడ్డీ కొంత
అధికము అయినప్పటికిని, ఈ పద్ధతివలన దేశమునకు కలిగెడి
లాభము విస్తారము గనుక దొరతనమువారు సంకోచించక
ఈ నీతిని పాలించుట అత్యావశ్యకము. స్వదేశముననే
ఋణమును గ్రహించుటవలన, వడ్డీల క్రింద మన రాజస్వము
నుండి ఏటేట చెల్లించవలసిన ద్రవ్యము విదేశములకేగక
ఈ దేశమునందే నిలిచియుండును. పరదేశయాత్ర వెడలు

ధనము అన్యదేశీయుల నైశ్వర్యవంతులను జేయుటయందే
వినియోగపడుచుండును. స్వదేశమునందే ఇమిడి యుండుట
వలన దేశముయొక్క మూలధనము అధికముకాగలదు. ఏటేట
చెల్లించెడి వడ్డీ తిరుగా మూలధనముక్రింద లభించుచుండును.
ఇందువలన దేశమునకు కలిగెడి లాభము అపారము. స్వదేశ
మునందలి ధనసంపదను నగలక్రిందనో నాణెముల క్రిందనో
భారతీయులు పాతర వైచుచున్నారనియెడి ఒక అపవాద
మనమీద కలదు. ఈ అపవాదను ఆధారముగ గైకొ
నియే, ఇండియా దేశమునందలి మూలధనము క్రొత్తయుద్య
మములయందు జొచ్చుటకు శంకించుచుండునని మన ప్రతి
కక్షులు నిర్భయముగా సాటుచున్నారు. అది నిజమైనను
రైల్వేలకు కావలసిన మూలధనమంతయు నూటికి 4 రూప్య
ముల వడ్డీ నిచ్చెదమని సర్కారువారు ప్రకటించినచో సంగ్ర
హించగలుగుదురు! సర్కారువారు కలకత్తా బొంబాయి
చెన్నపురి మార్కెట్టులయందు నూటికి ఎంత వడ్డీ గిట్టుచుం
డునో, ఆ రేటునే తాముకూడ ఇచ్చుటకు అంగీకరించుట
న్యాయము. తగుమాత్రముగా వడ్డీ అధికమగుటవలన రాజస్వ
మునకు ఏమియు చేటుమూడదు.

రైల్వేలక్రింద వెచ్చించతగిన ద్రవ్యము.

దొరతనమువారి ఆదాయమునుండి రైల్వే కమిటీవారు
తీర్మానించినట్లుగా సాలునకింత ధనము రైల్వేల నిమిత్తమని
కేటాయింపుచేయ వీలులేదు. ప్రస్తుత రాజస్వస్థితిని విమర్శిం
చుచో విద్యాశాఖకును ఆరోగ్యశాఖకును ఎంతయో ధనము

అగత్యమైయుండియు, ద్రవ్యలోపముచే దొరతనమువారుమన్న కుండుట ఎల్లరెరింగినదే. క్రొత్తపన్నులను విధింతమన్న ఇదివరకే నేలపన్ను అధికముగా నున్నది. ఎగుమతి, దిగుమతి పన్నులను వృద్ధిచేయుదమంటిమా, ఆర్థిక స్వాతంత్రములేని లోపము మనలను పీడించుచున్నది. లంకషైరు వ్యాపారస్తు లొకవంకను బ్రిటిషు పార్లమెంటునందలి స్వేచ్ఛావర్తక వాదు లొకవంకను ముఖ్యముగా ఇండియా కార్యదర్శియు అభ్యంతర పరచుచునే యుందురు. ఈ కారణములచేత, ఇండియా రాజస్వమునుండి కొంతద్రవ్యమును ఏటేట రైల్వేనిర్మాణమునకై వినయోగించరాదు.

రైల్వే కమిటీవారు తీర్మానించినట్లు నాణెములను ముద్రించుటవలన సర్కారునకు లాభించుచున్న లాభములో 150 లక్షల రూప్యములను రైల్వే నిర్మాణమునకై వెచ్చించవగును. నాణెములను ముద్రించి అందలిలాభములో సర్కారువారు బంగారు-ప్రమాణ-నిధి నొకదానిని ఇంగ్లాండునందు నెలకొల్పియున్నారు. నాణెములవలన వచ్చెడి లాభమంతయు ఈ నిధియందు పాతరబడి యున్నది. ఈనిధిని ఇంగ్లాండునందు నెలకొల్పుటవలన భారతీయులకు రవ్వంతయైనను ప్రయోజనకారికాదు. ఈనిధి ప్రయోజనత్వము సంగతి యటుండనిచ్చి, నాణెముల ముద్రణము వలని లాభము ప్రజలకు చెందవలసియున్నదని మేము ఖండితముగా చెప్పగలము. 1893 సంవత్సరమున. ఇండియా యందలి టంకశాలలు మూసివేయకపూర్వము, నాణెములను ముద్రించుటవలని లాభములను ప్రజలే అనుభవించుచుండెడివారు. ఇపుడన్ననో ఈలాభమును ప్రభు

త్వమువారు గ్రహించుచున్నారు. ముద్రణము వలని లాభము ప్రజలయొక్క క్షేమలాభముల నిమిత్తమే ఉపయోగించుట అవసరము కాబట్టి ఈలాభమును నిరుపయోగముగా ఇంగ్లాండునందలి బంగారు-ప్రమాణ-నిధియందు పాతరవేయక, దేశక్షేమకరమగు పనులయందు వినియోగించ వలసియున్నది. ఇనుపదారులు జనసామాన్యముయొక్క ఉపయోగము నిమిత్తమే నిర్మింపబడుచుండును గాన రైల్వే కమిటీవారు సిఫారసు చేసినట్లు ఆలాభమునంతయు ఇనుపదారుల నిర్మాణమునందు ఖర్చు పరచుచుండవలెను.

బడ్జెటునందు రైల్వే ఆదాయవ్యయములు ప్రత్యేకించవలెను.

ఇండియా దేశముయొక్క ఆదాయవ్యయ పట్టిక యందు (బడ్జెటు) మొత్తపు రెవిన్యూ లెక్కల నుండి, రైల్వే రాజస్వమును ప్రత్యేకముగా తెలియజేయుట చాల అవసరము. రైల్వే లెక్కలుకూడ మొత్తపు ఆదాయపు కలములో నమోదు అగుచుండుటవలన రైల్వే రాజస్వము యొక్క నిజస్థితి విశేష పరిశ్రమ చేసినవారికి దక్క, ఇతరులకు తెలియుటలేదు. మన ఇనుపదారులన్నియు సర్కారునకు లాభకారులుగ నుండుటలేదు. కొన్నిటికి మంచిలాభము వచ్చుచున్నది. కొన్ని నష్టపోవుచున్నవి. పంజాబునుండి కలకత్తాకు పోవు నార్తు-వెస్టరను రైల్వేసంగతి ఆలోచింతము. ఈఇనుపదారికి 62 కోట్ల రూప్యములు 1908 సం॥ సరికి వెచ్చింపబడినవి. ఇదిగాక 25 కోట్ల రూప్యములు రాజస్వమున కీవరకు నష్టము కలిగినది. లాభము ఏమాత్రము వచ్చినదాయని

ప్రశ్నింప 1904 మొదలు 1908 వరకు నాలుగు సంవత్సర
ములలోను 2½ కోట్ల రూప్యముల నికరలాభము చేకూరినది.
87 కోట్ల రూప్యములకును 1904 సం॥ నుండి 50 లక్షలరూప్య
ములకు సుమారుగా నికరలాభము వచ్చుచున్నది. రైల్వే రాజ
స్వమును ప్రత్యేకముగ తెలియచేయుటవలన ఏ ఇనుపదారి
లాభకారిగనున్నదియు, ప్రజలకు తెలియుట కవకాశమున్నది.
మూలధనమును క్రొత్తగా వినియోగము చేయువలయునన్న ఏ
ఇనుపదారి నిమిత్తమై ఉపయోగించిన బాగుగ నుండునో,
రాజస్వమును ప్రత్యేకముగ లిఖించుటవలన ఎల్లరకును తెలి
యుట కవకాశముండును. నిజము తెలిసిన పిమ్మట లాభము
నొసంగు ఇనుపదారులకు వలయు మూలధనము విశేషముగ
దేశమున లభించును. నష్టమువచ్చుచున్న ఇనుపదారులపై నిష్కా
రణముగ అధికవ్యయముచేసి దేశముయొక్క జాతీయఋణమును
పెంచవలసిన అవసరముకానరాదు. జాతీయఋణమును అధిక
ముచేయుటవలనకలిగెడి నష్టములను ఇదివరకు మేమువిపుల
ముగా చర్చించియే యున్నాము. ఇండియా దొరతనమువారి
ఆదాయవ్యయ పట్టికయందు రైల్వే రాజస్వము ప్రత్యేక
ముగ లిఖింపబడుచో, ఇంకొక లాభము కూడ గలదు.
మనకోశాగారమంత్రులు బడ్జెటులను తయారు చేయునప్పుడు
ఖర్చునకుతగిన ఆదాయమును సాధ్యమైనంతవరకు కనబరచు
టయేగాక కొంతనిలవనుకూడ కనబరచుచున్నారు. ఆదాయ
మునుబట్టి ఏదేశమునకైనను, వ్యయమును నిర్ణయించుకొను
టయుక్తము. చాలకాలము క్రిందవరకును నల్లమందునుండి
వచ్చెడి ఆదాయము కోశాగార మంత్రులపాలిట కామధేను

వుగ పరిణమించుచుండెడిది. ఖర్చునుతగ్గించ నక్కరలేకయే
నల్లమందు నుండి వచ్చెడి ఆదాయమువలన బడ్జెటులయందు
ఖర్చుపోను ఆదాయమే, అధికముగనున్నట్లు కనబరచుటకు
వీలుకలుగుచుండెడిది. చీనాదేశముతో బ్రిటిషు దొరతనము
వారు చేసికొనిన ఒడంబడికవలన ఈ కామధేనువు చాలవరకు
నష్టపోయినది. కొలదికాలములో రూపుకూడ మాయగలదు.
అట్టిస్థితిలో రైల్వే ఆదాయము కోశాగార మంత్రులకు పూ
ర్వమువలెనే లభించినది. కాబట్టి ఈ ఆదాయమును ప్రత్యేక
ముగా లిఖించినగాని మన ఆదాయముయొక్క నిజస్వరూపము
ఆదాయవ్యయపట్టికలయందు విశదీకరింపబడదు. రైల్వేరాజ
స్వమును వేరుచేయగనే, నూతనమార్గములను నిర్మించుట
కును, వేగనులు, యంత్రములు (ఇంజనులు,) వగైరాసామ
గ్రిని ఆంగ్లేయ వర్తకసంఘములయొక్క ఆందోళనకుజడిసి
వృద్ధిచేయుటకును వీలుచిక్కదు. దేశమునందలిప్రజలకు రైల్వే
రాజస్వముయొక్క స్థితినిపూర్తిగ గమనించుటకు వీలలవడును.
ఎంతవరకు నూతన ఇనుపదారు లావశ్యకములో చక్కగ
గుర్తించుటకు వీలుండును. యుద్ధనీతిననుసరించి నార్తువెస్టరను
రైల్వే ఎంతవరకు వృద్ధిచేయబడు చున్నదియును మనము
గ్రహించగలము. ఎన్నియో వందలమైళ్లు ప్రదేశమున ఈ ఇను
పదారి యుద్ధవిషయమై పెంచబడినది. రానురాను అఫ్గను
స్థానమును చేరునట్లుతోచెడిని! యుద్ధసంబంధమగు ఇనుప
దారులు అవసరము కలిగినప్పుడు సైన్యమును గొనిపోవుటకు
తప్ప ఎందుకును పనికిరావు. వాటివలన ఆదాయమురాదు.
ఈ యినుపదారు లెంతద్రవ్యమును మ్రింగుచున్నదియు మనము

కనుగొనగలము. నార్తు-వెస్టరను రైల్వే చాలవరకు ఈపద్ధతి మీదనే విరివి చేయబడినది.

డఫ్రినుప్రభువు ఏర్పాటు.

ఆంగ్లేయ వర్తకసంఘముల ఆందోళనమునకు ఇండియా దొరతనమువారు గాని బ్రిటిషు ప్రభుత్వమువారు గాని ఏల చెవినొగ్గవలయునని పాఠక మహాశయులకు సందియము కలుగవచ్చును. ఇందాశ్చర్య మేమున్నది? ముప్పదిరెండు సంవత్సరములనుండి దేశీయమహాజన సభవారు మూడవ తరగతి ప్రయాణీకుల కడగండ్లను తొలగింపుడని ఆందోళనము చేయుచున్నను వృథాగా పరిణమించుచున్న సంగతి చదువరు లెరింగియే యున్నారు. ఇట్టి రాజ్యనీతికి డఫ్రిను ప్రభువు కారణము. ఈతడు గవర్నరు జనరలుగా దేశమును పరిపాలించు కాలము వరకును భారతీయుల కష్టసుఖములను గూర్చి చేయు ఆందోళమునందు ఆంగ్లేయవర్తక సంఘములు కూడ తమ సానుభూతిని కనబరచుచు వచ్చినవి. ఈసంఘములుకూడ ప్రజలతో ఏకీభవించు చుండుటవలన భారతీయుల కోర్కెలను చెల్లించక తప్పకుండెడిది. ఆంగ్లేయవర్తక సంఘములు దేశీయులతో సమముగ వాదించుచుండుట డఫ్రిను ప్రభువుకు కష్టముగా తోచెను. ఇండియా దేశ పురోభివృద్ధిని మాత్రమే ఏకాగ్ర దృష్టితో కాంక్షించకుండు, మహానుభావులకు, ఇట్టి కూడిక అసంగతముగనే కానవచ్చును! డఫ్రిను ప్రభువు చేసిన మహోపకార మేమనగా, ఆంగ్లేయ వర్తకసంఘములను భారతీయులనుండి విడదీయుటయే. అది మొదలుగా భారతీయుల

కష్టసుఖములనుగూర్చి చేయు ఆందోళనమునందు వారు పాల్గొనుటలేదు. ఆంగ్లేయవర్తకసంఘముల యాందోళనమునకు ఇండియా దొరతనము వారు తప్పక చెవియొగ్గి తగిన ఏర్పాటులను చేయుటకు అంగీకరించుటయే డఫ్రిను ప్రభువు గావించిన మేలు. డఫ్రిను ప్రభువు చేసిన ఒడంబడిక ఇప్పటికిని ఇండియా దేశమునకు వచ్చెడి గవర్నరు జనరలు లందరును పాటించుచున్నారు. ఈ ప్రభువువారి ఏర్పాటు ఈదేశమును పీడించుచున్నది.

రైల్వేలన్నియు ఇండియా ఆదాయమునుండియే నిర్మింపబడినవి. మనప్రజలయొక్క క్షేమమును కోరియే ఇండియా దేశము పరిపాలించబడుచున్నది గాన ప్రస్తుతము క్రొత్త ఇనుపదారుల నిర్మాణమును కట్టిపెట్టి "ఇర్రిగేషను" కమిషను వారు ఒసంగిన అభిప్రాయ ప్రకారము నీటిపారుదలా విధానములను నిర్మించవలసి యున్నది.

ఇండియా దేశముయొక్క సైనికరాజస్వము

రైల్వే రాజనీతివలెనే, సైనిక నీతియందు సైతము హిందూదేశముయొక్క ఆశయములు గుర్తింపబడకనే పరిపాలనము జరిగెనని వ్రాయుటకు చాల విచారకరముగ నున్నది. ఆదాయమునకు తగినట్లు ఖర్చును నిశ్చయించుట రాజస్వ విషయమున అమోఘమగు నీతి. ఈనీతిని మనపాలకులు ఆచరణములోనికి తెచ్చినట్లు కానరాదు. ఏఏటేట సైన్యపుఖర్చులు అధికమగుచునే యున్నవి. హిందూదేశ రాజస్వమునందు, నేలపన్ను ముఖ్య ఆధారమని ఆంగ్లేయ రాజ్యతంత్రజ్ఞులు విసువు

జెందక ప్రకటించుచున్నారు. అట్టి మూలాధారమగు రాజస్వ
మంతయు సైనిక ఖర్చుల నోటబడుచున్నది. నేలపన్ను ఈసరికి
విపరీతముగా పెరిగిన దగుటచే ఇకముందు విస్తారముగా వృద్ధి
కాగలదను చిహ్నములెవ్వియును పొడగట్టుటలేదు. 1909-10
సం॥ పార్లమెంటు లెక్కల ప్రకారము నేలపన్ను 20.55 మిలి
యన్లపౌనులు అనగా 30.82 కోట్లరూప్యములు. ఈఆదాయము
అటవీసంపదను చేర్చకయే లభించినది. ఇక సైన్యపుఖర్చు లెట్లు
న్నవనగా (సైన్యపుఖర్చులు=సైన్యమునకును నావికాదళమున
కును, సైనికకట్టడములకును, దేశరక్షణమునకై నిర్మింబడిన
కట్టడములకును అయినఖర్చులు) 19.11 మిలియన్ల పౌనులు. అ
నగా 28.66 కోట్లరూప్యములు. దీనినిబట్టి చూడగానేలపన్నం
తయు సైన్యముక్రిందనే వ్యయమగుచున్నదని తేలుచున్నది.

సైన్యమునకగు వ్యయాధికము.

పదునారు సంవత్సరముల క్రిందట (1900-01) భూమి
పన్నునుండి సర్కారుకు వచ్చిన నికర ఆదాయము 16.73
మిలియన్లపౌనులు. నికరమైన సైన్యపు ఖర్చు 15.47 మిలియన్ల
పౌనులు. పదిసంవత్సరములలో భూమిపన్ను నూటికి 22.8-వ
వంతు పెరిగినది. సైన్యపుఖర్చులన్ననో నూటికి 23.53-వ వంతు
అధికమయ్యెను. కాబట్టి భూమిపన్నుకన్న సైన్యపుఖర్చులే
త్వరితముగ పెరుగుచు వచ్చినవని వ్రాయుటయందు ఎవ్విధమైన
అతిశయోక్తియును లేదు.

దేశమునందు శాంతి నెలకొని యున్నపుడు, సైన్యమును
రణమున కాయతముచేయు స్థితిలో నుంచుట ఆర్థిక విషయ

మున చాల నష్టదాయకమని చెప్పక వీలులేదు. ఏదేశమున
కైనను ఇట్టి రాజ్యనీతి విప్లవకారి. బీదదేశమగు ఇండియాదేశ
మునకు విశేష నష్టము కలిగించును. సైన్యముల కగుఖర్చు
సార్థకమగునది కాక నిరర్థకమగు చున్నది. ఆర్థిక సంపదను
వివిచేయుటకు తోడ్పడదు. అయిన దీనికొక సమాధాన
మొసంగబడుచున్నది. శత్రువుల దాడినుండి స్వదేశము ఎవ్విధ
మైన బాధలేకుండ శాంత భూయిష్టమైయుండుటకు వీలలవడు
నని సమాధానము. సమాధానము సమంజసముగనే యున్నది.
కాని ఒక్కవిషయమును మాత్రము గమనించవలసి యున్నది.
దేశముయొక్క శక్తినిబట్టి రాజ్యనీతిని నిర్ణయించుట న్యాయ
ము. ఎప్పుడో శత్రువులు దేశమును కొల్లగొనెదరేమోయను
భీతిచే, అమితమైన ధనమును సైనిక నికాయమునకై వెచ్చిం
చుట పాడిగాదు. ఐరోపా ఖండమునందలి బీద దేశములకన్నను
ఇండియాదేశము కడు బీదస్థితియందున్నది. ఇట్టిస్థితిలో రాజస్వ
విషయమున పాలకులు విశేష జాగ్రతతో వ్యవహరించవలసిన
ఆవశ్యకత మెండు.

ఆరోగ్య విద్యాశాఖలకును, కళావాణిజ్య వ్యాప్తికిని
అవసరమగు ధనము కరవగు చున్నను, సైనిక వ్యయము
నిమిత్తము వలయునంతధనము దొరతనము వారికి చిక్కుచునే
యున్నది. 1885 సం॥ నుండియు సైనిక రాజస్వ చారిత్రమును
గమనించితిమేని ఈసంగతి విస్పష్టమగు చున్నది. కీర్తిశేషులైన
సర్ ఆక్లెండు కాల్విను గారును, సర్ కోర్టునే ఇల్బర్టుగారును
తమ అసమ్మతిని దెలుపుచు 1885 సం॥ ఆగస్టు 14 తేదీని
ఇటుల వ్రాసిరి:—

"దేశముయొక్క పరిస్థితుల కదనమైన, సైనిక నికాయ ముండుచో, సరిహద్దులను దాటి దండయాత్రలు వెడలుటకు సాధారణముగా పురికొల్పుచునే యుండును."

అట్టి స్థితిలో సేనలను తగ్గించవలసిన ఆవశ్యకత స్పష్టముగా విశదీకరింపబడుచున్నది. "కృషికులు తమ కష్టార్జితమువలన సంపాదించి సర్కారునకు దాఖలుచేసిన ముప్పదికోట్ల రూప్యముల ఆదాయమును 2 లక్షల 25 వేల సైన్యముయొక్క ఖర్చునిమిత్తమే వెచ్చించబడుచున్నది."

1885-సం॥న అన్యదేశ నీతియందు (Foreign policy) మార్పు కలుగుటచే సైన్యపుఖర్చులు విపరీతముగా పెరుగనారంభించెను. సర్ జాన్ లారెన్సు, మేయో, నార్తుబ్రూకు, రిప్పను ప్రభువుల పాలనమునందు సైనికవ్యయమును హెచ్చుకానీయకుండ చాలవరకు తగ్గించుటకై ప్రయత్నములుచేయబడెను. 1871-72 సంవత్సరముసరికి ఇండియా దొరతనము స్వాధీనము చేసికొనిన రాష్ట్రములయందు పాలనమును స్థిరతగాంచుటకు తగిన ఏర్పాటులు పూర్తిచేసిరి. 1871-72 నుండి 1876-77 సరికి సైనిక వ్యయము 14½ కోట్ల రూప్యములకు నిలిచినది. దురదృష్టవశమున ఆఫ్ఘను యుద్ధములు కలుగుటచేత సంత్సరమునకు సుమారు 15.41 కోట్ల రూప్యములగుచువచ్చినది. 1880-81 సంవత్సరమునకు 21 కోట్లకు పై దాటినది. 1882 సంవత్సరమున ఆఫ్ఘను యుద్ధములకైన వ్యయమును కొంతవరకు బ్రిటిషు కోశాగారమునుండి 'గ్లాడుస్టను' మహాశయుండొసంగుటచే రిప్పను ప్రభువు పాలనమునందు,

క్రోమరు ప్రభువు కోశాగార మంత్రిగ వ్యవహరించి సైనిక ఖర్చులను తిరిగి 16½ కోట్ల రూప్యములవరకు తగ్గించగలిగెను. క్రోమరు ప్రభువు మణుగునకు 8 అణాలు ఉప్పుపన్నును తగ్గించుటయేగాక, సారాయములమీదదక్క ఇతర దిగుమతి పన్నుల నన్నిటిని తీసివేసియు సైన్యపుఖర్చులను తగ్గించగలిగెను.

1884-85 సం॥ నుండి సైనికవ్యయాధికమును ఈక్రింద పట్టీయందు పొందుపరచుచున్నాము:—

			కోట్లరూప్యములు.
1884-85	...	...	17·05
1885-86	...	...	20·06
1890-91	...	...	21·09
1891-92	...	...	22·66
1893-94	...	...	23·53
1894-95	...	...	24·31
1898-99	...	...	23·05
1899-1900	...	...	26·44

1885-86 సం॥నందు తొలుత విపరీతముగా 3 కోట్ల రూప్యములు వ్యయమధికమగుటను పై పట్టీవలన తెలిసికొనవగును. ఈ సంవత్సరమునందే పెంజడే అల్లరి (Penjdeh "Incident") తటస్థించుటయు, బర్మాయుద్ధమారంభమగుటయు తటస్థించినది. బర్మాయుద్ధముయొక్క చరిత్రము కడు విషాదకరము. ఈ అన్యాయ యుద్ధమునుగురించి సవిస్తరముగా సర్కారువారివలన ప్రచురించబడిన చరిత్రములనుండి

గ్రహించనగును. ఈ 3 కోట్ల రూప్యముల వ్యయాధికమును చాలనట్లు 1899-1900 సరికి మరింత విపరీతముగా అధికము చేయబడి 26.44 కోట్ల రూప్యములకు నిలిచినది. అనగా పదమూడు వత్సరములలో 6.38 కోట్ల రూప్యములు అధికముగా ఖర్చు చేయబడెను.

1900-1901 నుండి 1909-10 సం॥ సరికి అయిన నిక్కత ఖర్చు:—

			కోట్లరూప్యములు.
1900-1901	...	...	23·20
1901-1902	...	...	24·24
1902-1903	...	...	26·44
1903-1904	...	...	27·21
1904-1905	...	...	31·03
1905-1906	...	...	29·50
1906-1907	...	...	30·25
1907-1908	...	...	28.86
1908-1909	...	...	29·40
1909-1910	...	...	28·66

ఈ పదిసంవత్సరములలోను సంవత్సరమునకు సుమారు 27.87 కోట్లరూప్యములు వ్యయమగుచువచ్చినది. 1899-1900 సం॥కంటె సాలునకు 1.43 కోట్ల రూప్యములు వ్యయాధికమగుచువచ్చెను. ఇరువదియవ శతాబ్దారంభమున నిలిచియున్న వ్యయము 23.20 కోట్లు. ఈ లెక్కప్రకారము చూచిన పది సంవత్సరములలోను 5.46 కోట్ల రూప్యముల ఖర్చు పెరిగెను.

ఈవరుసను చూచినయెడల సాలునకు 54.60 లక్షల రూప్యములు అధికమయ్యెను. ఈ లెక్కలనుబట్టి సైనికవ్యయము ఎంత తీవ్రముగ పెరుగుచున్నదియు ను గ్రహించవచ్చును. 1884-85 సంవత్సరమునకు నిలిచియున్న 17.05 కోట్లవ్యయము 1909-10 సరికి 28.66 కోట్లవరకు పెరిగిపోయినది. అనగా 11.61 కోట్ల రూప్యములు అధికము కాబడెను. నిరంకుశముగా పెరిగిపోవుచున్న సైనిక వ్యయమును తగ్గించుట యుక్తమని ఖండితముగా చెప్పగలము. ఆవ్యయమును తగ్గించి ద్రవ్యలోపముచే విడిచిపెట్టబడుచున్న ఎన్నియో ఉద్యమములను కొనసాగించుట అవసరము. నేలపన్నంతయు సైనికవ్రాతము నోటను బడుచుండుట ప్రశస్థమైన రాజ్యనీతికాదు. ఆర్థికసంపదను ఇనుమడింప జేయవలసిన ఆవశ్యకత హిందూదేశమున విస్తారముగకలదు. నాగరికతను గాంచిన ఇతర రాష్ట్రములతోపాటు సమానగౌరవ మర్యాదలం జెందుటకు, సైనిక నికాయమునకగు ఖర్చును తగ్గించి, ఆరోగ్య విద్యాశాఖలయందు ధనమును అమితముగ వెచ్చించవలసిన అవసరము విశేషముగా కలదు.

వ్యయాధికమునకుగల కారణములు.

వ్యయాధికమునకుగల ముఖ్యకారణములు రెండు:-(1) సైనిక మిశ్రమపద్ధతి (army amalgamation scheme). (2) అన్యదేశములకు సంబంధించిన రాజ్యనీతియందలి మార్పు. ఈరెంటియందును సైనిక మిశ్రమ పద్ధతి 1859 సం॥ నుండియు హిందూదేశమును బాధించుచున్నది. సిపాయిలముట్టడిని అణచి

వేసిన వెంటనే ఈమిశ్రమ పద్ధతిని దొరతనమువారు అవలంబించిరి. ఈపద్ధతి నవలంబించుట వలన లక్షలకొలది రూప్యములు అన్యాయముగా బ్రిటిషు రణోద్యోగీయులచే (British war office) ఇండియానుండి వసూలు చేయబడెను. ఇట్టి దుఃఖ భాజనమగు రాజ్యనీతిని ఇండియాదొరతనమువారికి కట్టిపెట్టబడెను. ఒక్క ఇండియా దొరతనమువారి ఆమోదమును వడయలేదను కేల, హిందూదేశమునందు పనిచేసిన సైనిక శిఖామణుల సమ్మతిని సైతము ఈరాజ్యాంగనీతి వడయలేదు. ఈస్టిండియా రాజస్వ సభవారి యెదుట సాక్ష్యమిచ్చు సందర్భమున జనరలు సర్. జి. బాల్ఫరు గారివలన ఈపద్ధతి అతి కఠినవాక్కులతో గర్హింపబడినది. వలదు వలదని ఇండియా కార్యదర్శులును అక్కాలపు ఇండియా దొరతనములును మొఱలిడుచున్నను లక్షలకొలది రూప్యములు ఇండియాకు కట్టిపెట్టబడినవి. ఆభారముచే గత ఏబది అరువది సంవత్సరముల నుండియు హిందూదేశ రాజస్వము ఇంతింతయని చెప్పనలవి గాకుండ చీకాకు వడినది.

1858 సం॥ న బ్రిటిషు ప్రభుత్వమువారు స్వయముగ ఇండియా దేశమును పాలింపనారంభించు వరకు సైన్యమునకు వలయు ఐరోపా సైనికులను కొంతవరకు ఇండియాయందును, కొంతవరకు ఇంగ్లాండునందును సేకరించుట ఆచారముగ నుండెడిది. సిపాయిల తిరుగు బాటుతరికి ఇండియా సైన్యము యొక్క సంఖ్య:—39,375 బ్రిటిషు సైనికులును 214,985 ఇండియను సిపాయిలును కలరు. సిపాయి ముట్టడిని అణచివేసిన తరువాత, ఇద్దరు ఇండియను సిపాయిలకు ఒక్కొక్క

బ్రిటిషు సిపాయివంతున ఉండునట్లు నిశ్చయించబడినది. హిందూదేశమునందలి సైనిక సంబంధమైన ఏర్పాటులన్నియు ఇంగ్లాండునందలి బ్రిటిషు యుద్ధ-శాఖ వారివలననే నిర్ణయింపబడుచువచ్చెను. ఆంగ్లేయ సైనిక వ్రాతమునందు ఏయేమార్పులొనర్పంప బడినను ఆపద్ధతులనే ఇండియా దొరతనమువారు బదులుచెప్పక అవలంబించవలసి యున్నది. ఈమిశ్రమపద్ధతిని అమలులోనికి తెచ్చిననాటనుండియు, హిందూదేశమున పనిచేసిన సైనిక శిఖామణులచే పూర్తిగ గర్హింపబడెను. బ్రిటిషు యుద్ధ శాఖవారు ఇంగ్లాండునందలి సైన్యమునకు ఎట్టి ఏర్పాటులు గావించిరో వానిని ఇండియా దొరతనమువారు ఆచరించి తీరవలసినదే. వేరు గత్యంతరమేమియు లేదు. ఐశ్వర్య వంతమైన ఇంగ్లాండు దేశము ఎంతవ్యయమునకైన ఓర్చునుగాని కడుపేదతనముచే క్రుంగుచున్న హిందూదేశము ఇట్టి భారమును వహించజాలదు. చాలకున్న మొఱయాలించి రక్షించువారెవరు? ఈసందర్భమున మొసలిచే పీడింపబడుచున్న గజేంద్రుని యవస్థ స్ఫురణకు వచ్చుచున్నది.

> 'లావొక్కింతయులేదు ధైర్యము విలోలంబయ్యె ప్రాణంబుల్
> ఠావుల్దప్పెను మూర్ఛవచ్చె శ్రమంబయ్యెడిన్
> నీవేతప్ప నితఃపరంబెరుగ మన్నింపన్ దగున్ దీనునిన్
> రావే ఈశ్వర కావవే వరదసంరక్షించు భద్రాత్మకా'
>
> మహాభాగవతము.

భద్రాత్మకా యనుటకు బదులు 'జార్జీశ్వరా' యని చదివిన నెంతయో సమంజసముగా నుండును.

మిశ్రమపద్ధతి.

మిశ్రమపద్ధతివలన ఇండియాదేశమునకు సంభవించిన నష్టము ఈస్టిండియా రాజస్వ సభవారివలన 1871-72 సం॥ నందు సమగ్రముగా వ్యక్తీకరింపబడెను. హొస్రీఫాసెట్టుగారి అభిప్రాయమును మాత్రము ఇచట పొందుపరచుచున్నాము. ఈమహాశయునిచే మిశ్రమపద్ధతి ఖండితముగా గర్హింపబడెను. "ఈస్టిండియావర్తక సంఘము ముగింపబడిన కొలది సంవత్సరములలోనే, సైనికమిశ్రమపద్ధతి అనుభవసీయులగు సుప్రసిద్ధ హైందవరాజ్య తంత్రజ్ఞుల సలహాకు వ్యతిరేకముగా అమలులోనికిగొని తేబడినది. ఐశ్వర్యవంతమగు ఇంగ్లాండుదేశమునకు ఉపచరించుసైనిక నిర్మాణపద్ధతులు, దరిద్రముతో తాండవమాడుచున్న ఇండియాదేశముయొక్క స్థితిగతుల నాలోచించి చూచిన, ఆచరణములోనికి కొనిరాగల స్థితియందు లేకున్నను, బలవంతముగా, వ్యయాధికమగు నుస ఆంగ్లేయ సైనికపద్ధతులనే కట్టిపెట్టుచున్నాము. అతి భాగ్యవంతమగు ఇంగ్లాండు దేశమునకును అతిబీదదేశమగు ఇండియాకును కూడిక తటస్థించినది. భాగస్వాము లిద్దరును సమాన సహకారాయంపు లేని వారగుటచే, సంవత్సరమునకు 20 వేల పౌనులరాబడిగల ఆసామీయును, సాలునకు ఒక వెయ్యిపౌనుల ఆదాయము మాత్రమే వచ్చెడి ఆసామీయును కలసి సమముగ గృహకృత్యమును నిర్వర్తించుటవలన ఎట్టిచిక్కులు తటస్థించుచుండునో అట్టి అసంగతమే ఇండియాకు మిశ్రమపద్ధతి నవలంబించుట వలన యలవడెను. ఇరువదివేల పౌనులురాబడిగలవానికి ఉచితమైనఖర్చు, సాలుకు వేయిపౌనుల రాబడిగలవానికి కష్టతరమై

అప్పులపాలు చేయునుగాని వేరొండుకాదు. చేయబడుచున్న ఖర్చంతయు ఉచితమైనదనియే అనుకొందము. అయినను తక్కువరాబడి వచ్చుచున్నవానికి తనతలకు మిగిలినవ్యయము చేయుటవలన ఋణగ్రస్తుడై బాధపడుచుండ, నీకు మరి యేకన్యాయము చేయబడుట లేదనియును, నీవంతుఖర్చే నిన్ను కోరుచుంటిమనియును చెప్పిన ఏమిలాభము? వానిదుఃఖము ఉపశమించునా? హిందూదేశమువలెనే బలవంతముగా భాగస్వామిని జేసి, చేయువ్యాపారమునందు ఇష్టమున్నను లేకపోయినను వదిలిపెట్టకుండ యుండవలసివచ్చుచో వానిగతి చెప్పతరము కాదు."

1859 సం॥నుండి ఇండియాకు ఇట్టి దుర్గతియే తటస్థించినది. 58 సంవత్సరములనుండి ఈపద్ధతి అమలులోనున్నది. ఈ 58 సంవత్సరములలోను ఎన్నియోసారులు ఇండియా [illegible] దర్శి బ్రిటిషుయుద్ధ శాఖవారి కోరికలకు [illegible] చునేవచ్చెను. కాని ఎల్లప్పుడును [illegible] జయమును గాంచుచుండిరి.

వానిలో ముఖ్యమైన కొన్ని వివ[illegible] పరచుచున్నాము:—

(1) కేపిటేషను భత్యము. (Capita[illegible]owance) (2) డిపోఖర్చులు (3) సైనికులను పంపుటకగు [illegible] (4) గి[illegible] ఖర్చులు (5) ఉద్యోగస్థులయొక్కయు, సిపా[illegible] యొక్క[illegible] జీతములును, భత్యములును (6) సగము జీతముపైని [illegible] తీసికొనిన వారి ఖర్చులు (7) మందుగుండు సామా[illegible]ను

శతఘ్నులు వగైరాల కగు ఖర్చులు (8) ఇతర బాబతు ఖర్చులును, పింఛను తీసికొనిన సైనికాధికారులయొక్కయు సిపాయిల యొక్కయు ఉపకారవేతనములు. 1908-09 సరికి ఈ ఖర్చులమొత్తము 4.67 మిలియన్ల పౌనులు అనగా 7 కోట్ల రూప్యములు. ముప్పదిసంవత్సరముల క్రిందట ఇందుసగమైనను లేకపోయినను, అక్కాలపు ఇండియా దొరతనమువారు, తమకు చాల అన్యాయము జరుగుచున్నదని మొఱపెట్టుచునే యుండెడివారు. 1873-వ సంవత్సరము ఫిబ్రవరి 8 తేదీని పంపబడిన ఉత్తరమునందు నాగరికతయందుగాని ఐశ్వర్యమునందుగాని ఇంగ్లాండుకంటె చాల వెనుకబడియున్న ఆశ్రయ దేశమగు ఇండియాయందు కరుణించి ఇండియా చెల్లించవలసిన భాగమును దయార్ద్రదృష్టితో నిర్ణయించుట పాడియని ఇండియా దొరతనమువారు విన్నవించిరి. 1908-09 సరికి నిలిచియున్న 4.67 మిలియన్ల పౌనులును 1916-17 సరికి 5.6 మిలియన్ల పౌనుల వరకు పెరిగినవి. రమారమి ఒకకోటినలభై లక్షలరూప్యములు ఎనిమిది సంవత్సరములలో అధికమైనది. సైనికమిశ్రమ పద్ధతియే ఈ వ్యయాధికమునకు మూలాధారము. ఈపద్ధతిని త్యజించనంతకాలము, ఇండియా దేశము వ్యయాధికముచే పీడింపబడుచునే యుండును.

1879-వ సంవత్సరమున ఇండియా దొరతనమువారి వలన సమావేశము చేయబడిన సైనిక పంచాయతీవారు ఈ తీరుగ అభిప్రాయము నొసంగిరి:—"ఇంగ్లాండు దేశముయొక్క రక్షణమునందలి లోటుపాట్లను సవరించెడి ఉద్దేశ్యముతో, ఇండియా దేశమునందు సైనికనిర్మాణమును, ఏర్పాట్లునుజరిగింప

రాదు. హిందూదేశపు ప్రజలయొక్క క్షేమలాభములను గమనించి సైనిక తంత్రమును నిర్వహించవలసి యున్నది; ముఖ్యముగా ఇండియాదేశపు ఖర్చుపైని ఆదేశమునకు ఎట్టిసంబంధము లేనిదే, ఇంగ్లాండుయొక్క లాభమునిమిత్తమై ఇండియా సైన్యతంత్రము నిర్వహింపబడరాదు." ఈసైనిక పంచాయతీయందు ఫీల్డుమార్షలు రాబర్ట్సు ప్రభువుకూడ సభ్యుడే. 1884 సంవత్సరము నవంబరు 21-తేదిని రిపన్ప్రభువు గవర్నరు జనరలుగానుండు కాలమున ఒక ఉత్తరము (Depatch) పంపబడెను. 1864-65 నుండి 1884-సరికి సీమసైనికఖర్చులు ఎనిమిలక్షల పౌనులయ్యెను. ఆ ఉత్తరమునందు సంవత్సరమునకు ఎనిమిదిలక్షల పౌనులు క్రొత్తఖర్చువలన తగులుబడి అగుచున్నదనియును ఖర్చులలో కొంతవరకు మాత్రమే అభివృద్ధి నిమిత్తమై అగత్యములైనవనియును, ఇతరములగునవి హిందూదేశ వాంఛల సంబంధము లేకుండగనే విధింపబడినవనియును పెక్కువిషయములయందు ఇండియా దొరతనమువారి ప్రమేయము లేకనే ఈఖర్చులు కట్టిపెట్టబడుచున్నవనియును తెలియజేయబడినది.

బ్రిటిషు సైన్యముయొక్కయు ఇండియా సైన్యముయొక్కయు జీతముల పట్టీని, రెండు దేశములయందుగల భేదమును తెలియజేయు నిమిత్తమై ఈక్రింద ప్రకటించుచున్నాము. రిపన్ ప్రభువు తెలియచేసినట్లు జీతములయందు స్వల్ప మార్పుచేసినను, ఇండియా రాజస్వమునకు విశేషభారమును కలిగించుచువచ్చును. ఈ విషయమును సామ్రాజ్యప్రభుత్వమువారు గమనించినట్లు కానరాదు.

ఫిరంగులను కాల్చుదండు.

		నెలజీతము.	
		ఇంగ్లాండునందలి జీతము.	ఇండియాలో జీతము.
కల్నలు	రూ.	883	910
,,	,,	568	1665
లెప్టినెంటు కల్నలు	,,	589	1002
మేజరు	,,	316	789
కెప్టెను పెద్దతరగతి	,,	263	417
,, తరగతిలేనిది	,,	231	417
పదిసంవత్సరములైన తరువాత			
లెప్టినెంటు	,,	175	265
3 సం॥లు పనిచేసిన	,,	159	265
ఉద్యోగమున ప్రవేశించు తోడనే లెప్టినెంటుకు	,,	130	213

గుఱ్ఱపుదళము.

కల్నలు	రూ.	950	1033
లెప్టినెంటు కల్నలు	,,	519	1437
మేజరు	,,	393	809
కెప్టెను పెద్దతరగతి	,,	289	503
,, తరగతిలేనిది	,,	289	503
లెప్టినెంటు పది సం॥ తరువాత	,,	196	305
,, మూడు సం॥ ,,	,,	196	305
,, ఉద్యోగము నిచ్చునపుడు	,,	178	250
సబు లెప్టినెంటు	,,	132	250

కాల్బలము.

		నెలజీతము.	
		ఇంగ్లాండునందలి జీతము.	ఇండియాయందలి జీతము.
కల్నలు	రూ.	888	918
లెప్టినెంటు కల్నలు	,,	422	1402
మేజరు	,,	340	759
కెప్టెను పెద్దతరగతి	,,	273	445
,, తరగతిలేనిది	,,	240	445
లెప్టినెంటు పదిసం॥ తరువాత	,,	170	256
,, మూడు సం॥ ,,	,,	153	256
,, ఉద్యోగము నిచ్చునపుడు	,,	133	202
సబు లెప్టినెంటు	,,	136	202

1895-96 సం॥నందు ఇంగ్లాండునందలి సైనికాధికారుల కన్న హిందూదేశమునందలి సైనికాధికారులెంత హెచ్చుజీతములను గ్రహించుచున్నదియు విశదమగుచున్నది. జీతములు వృద్ధి చేయుటవలనను మారకమునందు రూప్యమునకు 22 పెన్సులకు బదులుగా 16 పెన్సులనే గ్రహించుచుండుటవలనను హిందూదేశమందలి సైనికాధికారులకు ప్రస్తుతము విశేషముగా ఖర్చగుచున్నదని చెప్పనక్కఱలేదు. ఒక్క సైనికాధికారులే కాదు. ఇండియాలో పనిచేయు ఐరోపియను సిపాయిసైతము 20-సం॥ క్రిందకంటె ఇపుడు అధికముగా జీతమును గ్రహించుచున్నాడు.

సైనిక నికాయమునకగు ఖర్చుకుతోడు మందుగుండు సామానుల నిమిత్తము 1895-సంవత్సరమునందు రమారమి ఒకకోటి రూపాయిలు ఖర్చుచేయబడెను. ఏటేట ఐరోపాదేశ

వాస్తవ్యుల బుద్ధివైశద్యమును వెదజల్లుటకోయన శాస్త్రము విరివిని గాంచుచున్నది.

శాస్త్రప్రభావమువలన క్రొత్తలగు మానవ నాశకరమగు యంత్రములు నిర్మింపబడుచునేయున్నవి. క్రొత్త ఆయుధములు వెలువడిన తోడనే ఇండియాదేశమున కూడ అవి ప్రవేశించుచుండును. వీనికై ఎంతయో ధనము వ్యయము చేయబడుచుండును. ఇప్పటికి ఈయంత్రముకన్న మించిన మానవనాశకరమగు యంత్రము మరొకటి లేదని సంతసించుచుండ, మరియొకటి సృష్టించబడుచుండును. వెనుకటివానిని త్రుప్పుపట్టునట్లుగ విడిచిపెట్టి క్రొత్తవానిని సంగ్రహించుటకు ప్రయత్నములు గావింపబడుచుండును. అందువలన విశేషవ్యయమగుచుండును.

ఇంగ్లీషు సిపాయిలను స్వల్పకాలము పనిచేయు పద్ధతిపైని ఇండియా సైన్యమున చేర్చుచున్నారు. ఈపద్ధతి ఇంగ్లాండునకు లాభకారి యయ్యును, ఇండియాదేశమునకు నష్టభాజనమగుచున్నది. సిపాయిలను ఇండియాకు గొనివచ్చుటకును తిరిగి ఇంగ్లాండునకు పంపుటకును పొగయోడలకగు ఖర్చులు విస్తారము. పూర్వమువలెనే ఇండియాకు కావలసిన యూరపియను సిపాయిలను ఇండియాయందే సేకరించ వీలగుచో, మనకంత ఖర్చుకాదు. ప్రస్తుతపు ఖర్చునందు నూటికి 50-వ వంతు తగ్గియుండునని మామతము.

అన్యదేశనీతి.

మిశ్రమపద్ధతి ఇండియా రాజస్వమునకు చాల విప్లవకారిగ పరిణమించెనని పైచర్చవలన విస్పష్టమగుచున్నది. ఇక

రెండవకారణమగు అన్యదేశనీతిని గూర్చి కొంతవరకు ముచ్చటించుచున్నాము. సర్ జాన్ లారెన్సు, నార్తుబ్రూకు, రిపన్ ప్రభువుల పరిపాలనమునందు దేశము శాంతభూయిష్టమై అన్యదేశనీతియం దెట్టివిధమైన మార్పులం జెందక దండయాత్రలను మాట కలలోని వార్తయై సైనికఖర్చులు చాలవరకు తగ్గించబడుచు వచ్చినవి. 1875-76 సం॥రమున బీకన్సుఫీల్డు ప్రభువు ఇంగ్లాండునకు ముఖ్యమంత్రియయ్యెను. ఈతడు సామ్రాజ్యమును ఎల్లవిధముల అధికము చేయవలయుననియే పాటుపడెడివాడు. ఇతనికి సహాయముగా ఇండియాకు వచ్చిన గవర్నరు జనరలు కూడ సామ్రాజ్యాభిలాషియే. సిమ్లాసైనిక పంచాయితీవారు ఆంగ్లేయ సైనికులు అరువదివేలును ఇండియనుసైనికులు 1,20,000 కంటెను అధికము చేయబడకూడదని చేసిన తీర్పును గమనించక, సైన్యవృద్ధికి ఆజ్ఞయిచ్చెను. అందువలన ఆంగ్లేయ సైనికులు పదివేలును ఇండియా సైనికులు ఇరువదివేలును అధికముచేయబడిరి. ఈమార్పు డఫ్రిన్ ప్రభువు ఏలుబడియందు మనకు లభించెను. అది మొదలుగా లాండ్సుడౌను, ఎల్జిను, కర్జను ప్రభువుల పాలనమునందు సైతము దండయాత్రలు ఏసరిహద్దు ప్రాంత ప్రదేశములనో బయలు వెడలుచునే యుండెను. గవర్నరు జనరలు పటిమతక్కు గలవాడును, సేనాధిపతి బలీయుడైనను, లేదా ఇరువురును బలీయులే యైనను, సరిహద్దు ప్రాంతములయందు యుద్ధములకు కొదువలేదు. వెల్బి ప్రభువుచేత ప్రశ్నింపబడినప్పుడు సర్ యడ్వర్డు కాలెను చెప్పినట్లు, ఇండియాసైనికనీతి యంతయు (ముఖ్యముగా దండయాత్రలు వెడలుట) మితవ్యయమునం దిష్టముగల గవర్నరు

జనరలును బట్టియుండును. ఈదండయాత్రల వలన రాజస్వము నకు కలుగు కీడు సర్ ఆక్లెండు కాల్విను గారిచే బాగుగ గమనింపబడినది. "హిందూదేశ రాజస్వమును తరుచుగా చీకాకు పరచునది సరిహద్దు ప్రాంతములయందలి అల్లరులే."

ఎల్జిను, లాండ్సు డౌను ప్రభువులయొక్క పాలనము నందు రణకౌతుకము విపరీతముగ నుండెడిది. కాశ్మీరు దేశము నందలి అల్లరియు తరువాత గిల్జిటు, హున్‌జా, నాగ్యాపె ప్రదేశములను ఆక్రమించుకొనుటయును జరిగెను. దీని అనంతర ము చిత్రలు దండయాత్రయు తరువాత టిరా దండ యాత్రయు నడచెను. టిరాదండ యాత్ర జయకరముగ జరుగలేదు. కర్జను ప్రభువు కాలమునదేశములను జయించి ఆంగ్లేయ సామ్రాజ్య మును ఇంకను విరివి చేయవలయుననెడి నీతిపెచ్చుపెరిగెను. ఈ యొక్క ఫలితమే టిబెటు దేశముపైకి వెడలిన దండయాత్ర. అయిన ఈదండయాత్ర పైకి గోముఖ వ్యాఘ్రమువలె, శాంత రసప్రధానముగనే గన్పట్టెను. కాని లోపలి యుద్దేశ్యము టిబెటుదేశమున ఆంగ్లేయ పతాకను నాటుటయే. ఇంతటితో తనివి జెందక పారశీక జలసంధియందు కూడ కొంతవరకు అల్లరి చేయుటకే ఈమహాశయుడు ప్రయత్నించెను. దురదృష్ట వశమున ఈముగ్గురు ప్రభువుల కాలమునందును ఇండియా ప్రధాన కార్యదర్శులు దుర్బలులే తటస్థించుచు వచ్చినందువలన ఈప్రభువులయొక్క రణనీతి నిరంకుశముగా చెలరేగెను. డఫ్రిను ప్రభువుకాలము మొదలు మింటో ప్రభువు కాలమువరకును రణనీతి స్వచ్ఛంద విహారియై రాజస్వమును చీకాకు పరచుచునే వచ్చినది.

సైనికవ్యయమును తగ్గించుట ఎట్లు.

ఇక సైనికఖర్చులు ఏవిధముగ తగ్గించ గలుగునదియు మనము చర్చించవలసి యున్నది. 1885-వ సంవత్సరమునకు నిలిచియున్న సైనికఖర్చులు 17.05 మిలియన్ల పౌనులు. అమితముగా పెరిగియున్న ఖర్చును తగ్గించుదమన్న, ఖర్చులు వృద్ధియగుటకు ఏకారణములు సహకారియయ్యెనో, వానిని తొలగించినగాని లాభములేదు. సైనిక మిశ్రమపద్ధతిని, అన్యదేశనీతి యందు కలిగింపబడిన మార్పును పూర్తిగా తీసివేయవలసి యున్నది. హిందూదేశమునకు సహజముగా ప్రకృతివలన ఒసంగబడిన సరిహద్దులను రక్షించుకొనుట యందు తృప్తి చెందవలయునేగాని ఆఫ్గని స్థానమును, పారశీక జలసంధియు, దక్షిణ పారశీకమువరకును మన సరిహద్దుగనే భావించి విశేషధనము ను సైనికనికాయమునకై వెచ్చించుట పాడిగాదు. డిస్‌రాలీ గారు సూచించిన "శాస్త్రీయపు సరిహద్దు" మృగతృష్ణ వలె ముందున కేగుచున్న కొలదిని దవ్వగుచునే యుండును. కాన అట్టినీతిని త్యజించుట అవసరము.

ఈరెండు పద్ధతులను విడిచిపెట్టిన తరువాత సైనిక నివహామునందుకూడ కొన్నిమార్పులు జరిగించవలసి యున్నది. సిమ్లా సైనిక పంచాయితీవారు 60 వేల ఆంగ్లేయ సైనికులను 1,20,000 ఇండియను సైనికులను హిందూదేశ రక్షణమునకై ఉంచిన జాలునని తీర్మానము చేసిరి. ఆతీరుగ సైన్యమును తగ్గించుట అవసరము. సైనికులను తగ్గించుటలో ఒక విశేషము కలదు. ఇండియను సైనికునికన్న ఆంగ్లేయసైనికుడు మనరాజ

స్వమునకు హెచ్చు ఖర్చును కలుగజేయుచున్న సంగతి జగద్విదితమే. ఇండియను సైనికులు పరాక్రమవంతులు కారని భీతిజెంద నవసరములేదు. ఐరోపా ఖండమును పీల్చి పిప్పిచేయుచున్న ప్రస్తుతపు మహాసంగ్రామమున మిత్రమండలి పక్షమున పరాసు రంగమున జర్మను శత్రుఘ్నుల వేడిమికి ఎదిరి నిలిచిన వారిలో భారత యోధులునుగలరు. వీరి బలపరాక్రమములు శత్రువులవలన సైతము ఉగ్గడింపబడియెను. స్వదేశసంరక్షణమునకును, ఇతరసైన్యములకు, భారతయోధులు వెనుదీయరు. వీర రక్తమింకను హిందూదేశీయుల రక్తనాళములయందు ప్రవహించుచునే యున్నది. భారతయోధులు భీరువులు కారని జగత్తునకంతయు సాటినది. ఆంగ్లేయ సైనికులసంఖ్యయే సిమ్లాపంచాయితీవారు తీర్మానించిన అరువదివేలకంటెను తగ్గించుట యుక్తము. ఇయ్యది రాజకీయ వ్యవహారమునకు సంబంధించిన దగుటచే విస్తారముగా ఈవిషయమును చర్చించుటకు వీలులేదు. ఇండియా సైనికునకు సంవత్సరమున కగుఖర్చు 392 రూప్యములు. ఆంగ్లేయ సైనికుని కన్ననో సాలునకు 1142 రూప్యములు ఖర్చగుచున్నది.

సైన్యమును తగ్గించుటకు కారణములు.

ఇంగ్లండునకును రషియాకును ఆంగ్లో-రషియను ఒడంబడికవలన మైత్రి పొసగిన దగుటచే రషియాదేశము ఇండియాను ఎప్పుడైనను జయించు నను భీతి అవసరములేదు. ఇదివరకు ఇండియా ప్రతినిధులు సైనిక ఖర్చులను తగ్గించవలసినదని కోరినపుడెల్ల రషియాదేశము దండెత్తి వచ్చునేమోయని సమాధానము నిడుచుండిరి. ఇపుడా భీతి యంతరించెను.

వాయువ్య దిశనుండి గాని నైఋతి మూలనుండిగాని, ఐరోపా, ఆసియాఖండములయందలి ఏదేశముగాని ఇండియాపైకి దండెత్తి వచ్చుననెడి భీతిలేదు. స్వచ్ఛంద సైనికవ్రాతము వలనను, ఆయుధపాణులగు పోలీసు సంఖ్య నధికము చేయుట వలనను, విశేషించి స్వతంత్ర సంస్థానములయందు సైనికతంత్రమును పూర్తిగ అభ్యసించిన సైన్యములుండుటవలనను, దేశమునందు చేయవలసిన పనులు సైనికవ్రాతమునకు చాల చులకన చేయబడెను. ఇది రెండవ కారణము. మూడవ ముఖ్యకారణ మేమనగా పూర్వమువలె గాకదేశమునం దెల్లభాగములకును సరిహద్దు ప్రాంతములతో యాన సౌకర్యములు విశేషముగా అలవడినవి. యుద్ధసమయములందు సైన్యమును గొనిపోవుటకు ఎన్నియో వందలమైళ్లు ఇనుపదారులు ప్రత్యేకముగా ఆపని నిమిత్తమే నిర్మించబడెను. ఇంతేకాక ఎన్నియో కోటలును రక్షణత్వమున కనువగు కట్టడములును నిర్మింపబడెను. సైన్యనివహమునకు పూర్వముకంటె మంచి మందుగుండు సామానులును ఆయుధములును సరఫరాచేయబడినవి. ఈకారణములన్నియు మిక్కిలి బలీయములైనవి. మరొక కారణము కూడగలదు. వాలంటీయరులుగ భారతీయులను అపరిమితముగ సైన్యమునందు చేర్చుకొని తగినశిక్షను ఒసంగుచో సమయము తటస్థించినప్పుడు స్వదేశసంరక్షణమునకై ఎన్నియో మిలియన్ల మంచి సైనికులు లభించుదురు. వాలంటియరు పద్ధతిని, యూరేషియనులకును,ఆంగ్లోఇండియనులకును ఒసంగుచుండగా భారతీయులకు ప్రసాదించకుండుట ధర్మము

కాదు. అటుల జేయుటవలన సైనిక ఖర్చులను విశేషముగా తగ్గించుటకు వీలేర్పడును.

సర్కారువారు పరిశ్రమలు.

'లై సెజ్జీ ఫెయిరు' మతముయొక్క ప్రధానాంశమును మాచదువరు లీవరకే గ్రహించియుందురు. దేశమునందు అరాజకము లేకుండ క్రమమైన పరిపాలనా పద్ధతుల నేర్పరచుటయే దొరతనమువారికి విధిగాని వాణిజ్య పరిశ్రమలువారి అధికారములోనివి కావని ఈ మతముయొక్క వాదము. ఈ మతము ఉపయోగానర్హ్హమని కొంతవరకు ప్రథమ ప్రకరణమున సూచించియున్నాము.

దొరతనమువారు ఈ న్యాయమును పాటించుచుండుటచేతనే మనకళాప్రపంచము వికసించుటకు మారు ముకుళించుచున్నది. ఈ పద్ధతి మనదేశమునదక్క ఇతర రాష్ట్రములయందెచ్చటను పాటింపబడుటలేదు. గవర్నమెంటువారు ఈ నీతిని విడిచిపెట్టినగాని మన దేశమునందలి కళలకు మోక్షము లేదు.

ఈసంగతినిగూర్చి దేశీయ మహాజనసభలయందు కళాసభలయందు మన నాయకులు ఏటేట చర్చించి తీర్మానములు చేయుచున్నారు. కాని ఆచరణములోనికి మాత్ర మాతీర్మానములు తేబడుటలేదు. అధి నివేశనములకువలెనే ఇండియా దేశమునకుకూడ వాణిజ్య పరిశ్రమల విషయమున సంపూర్ణ స్వాతంత్ర్యమున్నగాని కళలు విజృంభింపజాలవు. బొంబాయి నగరమున జరిగిన పదునొకండవ కళాసభయందు ఈ సమస్య

చర్చించబడి, దొరతనమువారు భారతీయుల యాశయములను గుర్తించుటలేదని నిష్కర్షగా ఉపన్యాసములు చేయబడినవి. ఇందులకు ఉదాహరణముగా, యక్సైజుపన్నులు త్రోపుడు చేయబడవలసి యున్నదని దేశీయమహాజనసభ ప్రారంభమైనది మొదలు 32 సంవత్సరములుగా ఘోషించుచుండ లంకషైరు వ్యాపారస్థుల అభ్యంతరములవలన స్తంభించి యున్నవి. ఇండియా దొరతనమువారు కూడ కోశాగార మంత్రి ద్వారా తమ అశక్తిత్వమును వెల్లడిచేసిరి. "ఈ పన్నులను త్రోపుడుచేయుట యుక్తమని మేము సిఫారసుచేయగా పై అధికారుల (ఇండియా కార్యదర్శి) వలన మంజూరు చేయబడలేదు." ఇండియాకార్యదర్శి దొరతనమువారి సిఫారసును మంజూరుచేయక పోవుటకు కారణము మ్యాంచెష్టరు నూలు వర్తకులే! మ్యాంచెష్టరు వర్తకులు ఇండియా ఆర్థిక న్యాయములను నిర్ణయించుచున్నంతకాలము, ఇండియా దొరతనమువారు గాని ప్రజలుగాని న్యాయము దొరకునని ఎంచుటకు వీలులేదు. సర్ విఠల్‌దాసు థేకర్సే, రహీంబాయి కరీంబాయి మొదలగు ప్రముఖులెల్ల, ఈ పన్నులను తీసివేయకుండ ఉంచుటవలన సంభవించిన నష్టములను విశదముగా తెలియపరచిరి. స్వదేశమున నూలు యంత్రములు వృద్ధియై వ్యాపారము అభివృద్ధి యగుటకు వీలయిన పరిస్థితులు సహజముగాకలవు. ఈ పన్నులున్నంతకాలము మన నూలు పరిశ్రమకు ముక్తిలేదు.

ఇండియాదేశ పరిశ్రమల స్థితి.

మరియొక విషయమునుకూడ గమనించవలసియున్నది. ఇండియా దొరతనమువారికి స్వతంత్రత యటుండగా బ్రిటిషు

వర్తకులు ఇంకొక తంత్రమునుపన్నిరి. ఆంగ్లేయపరాసు ఒడంబడికప్రకారము ఫ్రెంచిరేవులయందు మ్యాంచెష్టరు నూలు సరకులు నూటికి అయిదవవంతు దిగుమతిపన్నును చెల్లించుటకును, ఇండియాదేశపుసరకులు నూటికి 22-వ వంతుపన్నును చెల్లించుటకును ఏర్పాటు చేయబడినది. ఈపన్నును ఇచ్చి ఇండియాదేశపు సరకులు పరాసుమార్కెట్లు చొరజాలవు! ఈవిధముగా ఫ్రెంచిమార్కెట్టునందుకూడ ఇండియాసరకులు పోటీలేకుండ మ్యాంచెష్టరు జాగ్రతపడినది. ఇట్టి సవతితల్లి ప్రాపు ఒక్క ఆంగ్లేయ-పరాసు ఒడంబడికయందేగాక, 1898 సం॥న జరిగిన జపాను ఒడంబడిక యందుకూడ కాననయ్యెడిని. ఆ ఒడంబడికయందు ఏయేదేశములకు విస్తారము హితకరమగు పద్ధతులనవలంబింపబడవలెనో పేర్కొనబడినవి. ఆ పేర్కొనబడిన దేశములలో ఇండియాదేశముకానరాదు. ఇది ఏటిన్యాయమని తాతాగారు ప్రశ్నించిరి. మనప్రశ్నలకు సమాధానము నిచ్చువారెవరు? యుద్ధానంతరమున ఈసమస్య తిరుగరాగలదుగాన, ఇండియాయొక్క వాణిజ్యపరిశ్రమలనుగూర్చి నిర్ణయించవలసి వచ్చినపుడు, అంతర్జాతీయ సమావేశముల యందు దేశప్రతినిధులే స్వయముగపోయి సంగతి సందర్భముల గమనించి దేశపరిస్థితుల కనుకూలమగు నియమములను శాసించుటకు వలయు హక్కులను బ్రిటిషు ప్రభుత్వమువారు మనకు ప్రసాదించవలసియున్నది.

వర్తకవ్యాపార విషయములయందు మనదేశమునకు సంపూర్ణస్వాతంత్ర్యము నొసంగుటవిధియని ఇండియా కళాసభయందేగాక, బొంబాయినగరమునజరిగిన ప్రథమవాణిజ్యమహా

సభయందు సర్ ఫజుల్ భాయి కరింబాయిగారుకూడ వాణిజ్య విషయమునందును పారిశ్రామికవిషయ మందును మనకు స్వరాజ్యముకావలెనని నిర్దేశించిరి. ఈవిషయములందు స్వరాజ్యముండినగాని దేశము ఉన్నత స్థితికిరాజాలదని వాక్రుచ్చియున్నారు. బ్రాహ్మణేతర సంఘమున కృషిచేయుచున్న రాయబహదూరు పిట్టిత్యాగరాయ శెట్టిగారుకూడ ఇటీవలమదరాసునందు దక్షిణ ఇండియావర్తక సమావేశ సభయెదుట, దేశమునకు స్వరాజ్యమవసరములేదని వాదించుచున్నను, పారిశ్రామిక విషయములయందు సంపూర్ణస్వాతంత్ర్యముండి తీరవలయునని గంభీరముగా ఉపన్యసించిరి. దీనినిబట్టి దేశమునందలి అన్ని తెగలవారును యీవిషయమున ఏకాభిప్రాయమును కలిగియున్నారని బ్రిటిషు ప్రభుత్వమువారు గమనించి, మనకోరిక చెల్లించవలసియున్నది.

జపాను అభివృద్ధికి కారణము.

ఏబది సంవత్సరములక్రింద పేరు ప్రతిష్టలులేని జపాను దేశము ఇపుడెంత యుత్కృష్టదశయందున్నదో చదువరులెరింగియే యున్నారు. కళావాణిజ్యములపట్ల దొరతనమువారు తమ సానుభూతిని కనబరచుటచేతనే ఇంత మహోన్నతపదవిని గాంచ గలిగినది. వాణిజ్య పరిశ్రమలపట్ల జపాను ఏనీతిని పాలించినదో కొంతవరకు ముచ్చటించుట ప్రయోజనకారియని తోచెడిని.

1867-68 సంవత్సరములయందు "మెజ్జి" శకము ప్రారంభమయినది. ఈరాజులు బహుచక్కగా దేశమును పరి

పాలింపనారంభించిరి. కళావిషయములయందు పాశ్చాత్యదేశ పద్ధతులు సక్రమముగా ఆమోదింపబడుచు వచ్చినవి. నూతనాదర్శములను దేశమునందు వ్యాపకము చేయుటకు సర్కారువారు మార్గదర్శకులైరి. ఒక పట్టువడుకు యంత్రము, ఉన్ని ఫ్యాక్టరీ, గాజుఫ్యాక్టరీ, కాగితములను తయారుచేయు యంత్రాలయము, కొన్ని వర్కుషాపులు ప్రభుత్వమువారివలననే స్థాపింపబడినవి. ఇంతేగాక ఫ్యాక్టరీలకు కావలసిన యంత్రసామగ్రిని కొనుటకై సర్కారువారు అప్పులనుకూడ ప్రసాదించిరి. గనులనుత్రవ్వి ఖనిజసంపదను వాడుకలోనికి గొనివచ్చుటకు విదేశములనుండి ఎందరో నిపుణులు రప్పింపబడిరి. ఇతర పరిశ్రమలయందుకూడ వీరే మార్గదర్శకులైరి. "మెజ్జి" శకమునకు పూర్వము చాలకొద్దిగా పనిచేయబడుచున్న గనులను సముద్ధరించుటకునై, ఎనుబదిమంది వరకు అన్యదేశములనుండి నిపుణులు విచ్చేసిరి. 1890 సం॥ ప్రాంతమున పారిశ్రామిక విద్యను నేర్చుటకు పాఠశాలలు స్థాపింపబడెను. చీనాకును జపానునకును వచ్చిన యుద్ధమువలన దేశమునందు ఉత్సాహము మరింత అధికమైనది. ఎన్నియోక్రొత్త శిల్పకళాశాలలు స్థాపించబడెను. 12 సంవత్సరములనాటికి అనగా 1902 సం॥ సరికి ఎగుమతులు 25 మిలియన్ల పౌనులవరకును పెరిగినవి. రషియాకును జపానునకును జరిగిన యుద్ధమటుండ, యూరపు, అమెరికా, ఆసియా, ఆఫ్రికాఖండములను చీకాకు పరచుచున్న ప్రస్తుత మహాసంగ్రామము జపాను దేశముయొక్క అభ్యున్నతికి మరింత తోడ్పడినది.

దేశీయౌన్నత్యమునకు ముఖ్యములయిన కొన్ని కళలకు సర్కారు ధనసహాయము నొసంగుచున్నారు. ఇతరవిషయములయందు జపాను దొరతనమువా రొసంగుచున్న సహాయము విద్యకును, శోధనలకును అయియున్నది. పరిశ్రామిక పాఠశాలలకన్నిటికిని ధనసహాయము నొసర్చుటయేగాక కొన్ని మాదిరి ఫ్యాక్టరీలను, పారిశ్రామిక రసాయన శాస్త్రాలయములను స్థాపించుచున్నది. ఇదియేగాక యంత్రములను అద్దెకీయుటయు నిపుణులను దేశమునందలి ఎల్లభాగములకును పంపి ఉపన్యాసముల నిప్పించుటయును అనుభవసిద్ధములగు శోధనలనుగావించుచుండుటయు లోనుగాగల ఎన్నియో విధములచే ప్రజలకు ఉత్సాహ సాహసములను గలిగించుచున్నవారు. వందలకొలది విద్యార్థులను విదేశములకు పంపుటయేగాక, వర్తకులనుకూడ అన్యదేశ పరిస్థితుల గమనించుటకుగాను పంపుచున్నారు. విదేశములనుండి వందలకొలది నిపుణులు కూడరావింపబడిరి.

మఱియు అన్యదేశవర్తకమును వృద్ధిచేసి లాభమును వడయుటకు, వర్తకపుటోడలుఅత్యావశ్యకమని గ్రహించినదై బొంబాయికిని కలకత్తాకును నేరుగ ప్రయాణముచేయుటకు ఎన్నియో ఓడలు నియోగింపబడెను. ఈస్టీమరులకు జపాను దొరతనమువారు రేట్లనుతగ్గించి విస్తారము ద్రవ్యసహాయముచేయుచున్నారు. ఆసాహాయ్యపుబలిమివలననే మనదేశమునందలి జపానువ్యాపారమును ఏఏటేట అధికముచేయ గలుగుచున్నది. జపానుస్టీమరుల రాకపోకలు, ఏటేట అభివృద్ధిగాంచుచున్నవి. జపానుస్టీమరులు మన కోస్తావ్యాపారమును హెచ్చుగా ఆకర్షించుచున్నవనుటకు ఒక నిదర్శనము. 1914 సంవత్సరమున

నిప్పన్-యోషన్ కెయిషా కంపెనీ స్టీమరులకును బ్రిటిషు ఇండియా-స్టీము-నావిగేషను కంపెనీ ఓడలకును కేవునుగూర్చి విశేషపోటీ ఆరంభమయినది. బ్రిటిషు కంపెనీ భరించరానంత స్వల్పపు కేవును జపాను కంపెనీ ప్రసాదించగలిగినది. దీనిని బట్టి జపాను దొరతనము వారు తమవాణిజ్య పరిశ్రమలను విజృంభింప జేయుటకు ఎట్టిసహాయము నొసంగుచున్నారో మనము గ్రహించవలసి యున్నది. మనకన్న, మనదొరతనము వారు ఈవిషయమును హెచ్చుగా గమనించవలసి యున్నది. హాలెండు పారిశ్రామిక పంచాయితీ సభవారు ఈమార్గము లను అనుసరించవలయునని మన దొరతనము వారికి సిఫారసు చేయుదురో లేదో మనమూహింపజాలము. పబ్లికుసర్వీసు కమి షనువారివలె వారెట్టి తీర్మానములను జారీచేసినను వానిని సరకు గొనక ఇండియాదొరతనమువారు సాధ్యమైనంతవరకు ఇండియా దేశస్థుల ఆశయములనే మనసునందిడుకొని జపానుదేశపు పుంతనే పోవలయును. అటుల జేయ రేని ఇండియా దేశపు భావిదశ కళాచక్రమున సన్నగిలుచుండునేగాని, వికసించి విజృంభింప జాలదు.

స్వదేశసంస్థానముల అభివృద్ధి.

జపానుదేశపు సంగతి యటుండనిచ్చి స్వదేశ సంస్థానము లేనీతిని పాటించుచున్నవో పరిశీలించెదము. శ్రీశాయాజీ గైక్వారు ప్రభువు బరోడాంసంస్థానమున ఎన్నివిధముల, కళా వ్యాప్తిని గావించినదియు ఎల్లరెరింగిన విషయమే. స్వయముగ కొన్ని ఫ్యాక్టరీలను ప్రభుత్వమువారే స్థాపించి, అందుల లాభ నష్టములను ప్రజలకు ప్రకటించుచుండెడివారు. లాభమువచ్చు

చున్నదని తెలియగానే, ఎందరో ధనాధికులు సర్కారువారిని అప్పటికయిన ఖర్చును తామిచ్చివేయుదుమనికోరుటయు వారం దులకంగీకరించుటయు జరగుచు వచ్చినది. ఈవిధమున బరోడా ప్రభుత్వమువారు ప్రజలకు మార్గదర్శకులైరి. కొన్ని కళలకు ధనసహాయము నొసంగుచు, విదేశములకు సర్కారు ఖర్చు పైని పారిశ్రామిక విద్యనభ్యసించుటకు యువకుల నంపుచు, నిపుణులగువారిని పైదేశములనుండి రావించి స్వస్థానమునందలి, బుద్ధి కుశలులగు యువజనులకు అనుభవసిద్ధముగ విద్యను నేర్పుచు, ఎన్నియో విధముల కళలను పోషించిరి. మైసూరు సంస్థానముకూడ ఈ మార్గము నిప్పుడిప్పుడే అవలంబించు చున్నది. బాబా బూడన్ పర్వతపంక్తియందలి ఇనుపగనులను వాడుకలోనికి తెచ్చుటకునై తాతా అండుసన్సు వారితో ఒడంబడిక చేయబడినది. ఈగనులనుండి సాలుకు 20 వేల టన్నుల బీడు-ఇనుము (Pig-iron) ఉత్పత్తియగును.

ఆస్ట్రేలియా పరిశ్రమల అభివృద్ధి.

గవర్నమెంటువారు వర్తకవ్యాపారములయందు ప్రమేయమును గలిగించుకొనుటయనిన, పులియో భూతమోయని దిగులుజెందువారు. 1916 సం॥ జూను నెలయందు ఆస్ట్రేలియా దేశపు ముఖ్యమంత్రియగు హ్యూజెస్ బ్రిటనుదేశమునందు గావించిన గంభీరోపన్యాసములను జదివినవారు ఈభ్రమ వదిలిపోయి జాగ్రదావస్థయందుండగలరు. వ్యవసాయకళను పరిశ్రమలను ఆస్ట్రేలియాదేశము ఏతీరున పోషించి రక్షించినదో, స్కాట్లండునందలి రెండువందల వ్యవసాయవాణిజ్య సంఘముల

యెదుట విపులముగా వాక్రుచ్చియున్నాడు. యుద్ధారంభము
నకు పూర్వము స్థాపింపబడిన కళలెచ్చటను ఆస్ట్రేలియాయందు
కానరావు. ఇపుడన్ననో గోధుమ, శర్కర, లోహకళలను
చక్కగా స్థాపించి, అభివృద్ధిలోనికి గొనివచ్చినది. మనదేశమున
కూడ కృషికళకు సర్కారువారు కొంత సాహాయ్యమును చేయు
చున్నారు కాని ఆస్ట్రేలియా దొరతనమువారు చేసిన పోషణ
చాల సంతృప్తికరముగాను పూర్ణమయినదిగను ఉన్నట్లు తోచె
డిని. క్రొత్తస్థలములయందు గోధుమలను పైరుచేసిన రైతులకు
ఆస్ట్రేలియాయందలి కొన్ని రాష్ట్రముల దొరతనములు, పండిన
సరకునంతటిని, అమ్మకమైనను లేకున్నను నష్టము లేకుండ,
దొరతనమువారు నిర్ణీతమైన ధరలకు రైతులనుండి కొనుటకు
అంగీకరించిరి. ఈనీతిని అవలంబించుటవలన సేన్యమునందలి
భూమియొక్క పరిమాణము అధికమగుటయేగాక పండిన గోధు
మలుకూడ పూర్వముకన్న రెండున్నర రెట్లు అధికముగాం జొచ్చిన
వని హ్యూజెస్ మంత్రి వక్కాణించెను. ఈప్రత్యేక కళయందు,
ఆస్ట్రేలియాదేశపు పద్ధతుల నవలంబించుట మనదేశ పరిస్థితులు
ఒప్పకున్నను, ఇట్టివిధములగు ప్రేరేపణలను గలిగించిన-చో
వికసించి విజృంభించు కళలెన్ని యోగలవు. ఆస్ట్రేలియా దేశము
తనకు వలయుచక్కెరకునై విదేశముల పైని ఆధారపడియుండు
టకు ఇష్టపడలేదు. కావున ఆప్రభుత్వమువారు పంచదార
వ్యాపారమునకు తగిన ప్రోత్సాహము నొసంగి వృద్ధికి తేదల
చినవారై, ఆయుద్దేశ్యముతో చెఱకును పైరుచేయువారికిని,
రసము తీయువారికిని, శుభ్రపరిచి పంచదార చేయువారికిని,
తయారైన పంచదారను వినియోగించు ప్రజలకుకూడ

రాబోవు మూడుసంవత్సరముల వరకును ధరలు గ్యారంటీ
చేసిరి. ఇందుల ఫలితము, పంచదార అధికముగ ఉత్పత్తి
యగుటయే. పాఠకులు మన చెఱకు పంచదార స్థితిని తలచు
కొనిన విచారించక మానరు. ఆదేశపులోహకళలుకూడ ఇదే విధ
మున ప్రోత్సాహము వడసి మంచిదశయందున్నవి. ఆదేశము
నకు అత్యావశ్యకములగు లోహపు సరకులన్నియు అచ్చటనే
తయారగుటకు తగినస్థితియందున్నవి. గోధుమ, శర్కర, లోహ
కళలయందు ఆస్ట్రేలియా దేశము సంపూర్ణ స్వాతంత్ర్యమును
గాంచెను.

దేశమునందలి ద్రవ్యసాధనముల నెల్ల తమ ఆధీనమునం
దుంచుకొని, కళాప్రపంచమునకు వలయునంత అపక్వపదార్థ
సంచయమును క్రమముగా సరఫరా యగుచుండునటుల ఏర్పా
టులు చేయుటయందును, తయారగు సరకునకు పణ్యచక్ర
మును నిరూపించుటయందును, మూలధనమును క్రమమున సమ
కూర్చుటయందును, సర్కారువారు ప్రమేయమును గలిగించు
కొని కళలను స్థాపించుట ఆవశ్యకమని హ్యూజెస్ మహా
శయుడు విరామములేకుండ నొక్కి వక్కాణించెను.

ఇండియా దొరతనమువారి అశ్రద్ధ.

ఇండియా దొరతనమువారు ఆస్ట్రేలియా దేశమునుండి
ఈనీతిని గ్రహించిరని మేము నమ్మజాలము. వలననగా పారిశ్రా
మిక విషయములయందు ప్రమేయము గలిగించుకొనవలెనని
దేశస్థులు మొఱపెట్టుచుండ, దొరతనమువారు ఆయాలాపముల
నెల్ల పెడచెవిని పెట్టుచున్నారని వ్రాయుటకు ఎంతయు సంతాప

కరముగ నున్నది. ముందంజవేసి, తగినసాహాయ్యము నొసరించు
టలేని సంగతియటుండ, మీదు మిక్కిలి దేశమునందలి ద్రవ్య
సాధనములు పాడుపడుచుండుట కూడ నిర్విచారముగ చూచు
చున్నారు. హిందూదేశ కళాపురోభివృద్ధికి, సాహసము
మిక్కిలి అవసరమనియు, ఆసాహసము, సర్కారువారి సాహా
య్యమున్ననేగాని, ప్రజలయందు కలుగుట దుర్లభమనియు,
వెనుక మన వాణిజ్య పరిశ్రామిక శాఖకు అధ్యక్షులుగానుండిన
సర్ విల్లియమ్ క్లార్కు "ఇండియామార్గ" అనునొక పత్రికకు
వ్రాసియుండెను. ఇంతేగాక సర్కారువారు ఏకళకునైన సహా
య్యముగా నున్నారని తోచిన యెడల, ప్రజయందు గాఢమైన
విశ్వాసము అంకురించి ఆకళనుస్థాపించుటకు వారి నుద్యుక్తు
లుగజేయునని క్లార్కుగారు వాక్రుచ్చిరి. ఏకళలు, స్వతస్సిద్ధ
ములుగ విజృంభించుటకు తగిన పరిస్థితులు దేశమునం దలవడి
యున్నవో, అట్టికళలను పోషించు నిమిత్తమైనను ఇండియా
దొరతనమువారు క్లార్కు మహాశయుని సలహాను ఆమోదించ
వలసి యున్నది.

ఈసందర్భమున "ఇండియను టెక్స్టైలుజర్నలను" నొక
పత్రికయందు ఒక వర్తకుడు వ్రాసిన వ్రాతల నిచ్చట పొంద
పరచుట సామంజసముగ నుండునని తోచెడిని.

"ఐరోపా మహాసంగ్రామము, మనకు బోధించిన గొప్ప
నీతి ఏమన, భుజబల పరాక్రమములేని ఏదేశమును నిలచు
టకు ఆధారము లేకపోవుట. ఆర్థిక విషయములపట్ల పరరాష్ట్ర
ములనుండి సంపూర్ణ స్వాతంత్ర్యమును సంపాదించినగాని

ఏదేశమును నిలువవీలులేదు. అంతర్జాతీయ స్నేహ బాంధవ్య
ములు ఎంత ఆవశ్యకములో, ఏదేశమున కాదేశము ద్రవ్యో
త్పత్తియందును, ద్రవ్యసాధనముల పట్లను శాస్త్రవిషయముల
యందును పారిశ్రామిక విషయముల యందును అన్యరాష్ట్ర
ములపై కొంచెమైనను ఆధారపడియుండక స్వదేశమునే
నమ్ముకొనియుండుట కూడ, అంత ఆవశ్యకమగు సంగతియే.
హిందూదేశము యొక్క గోగునార, ప్రత్తి, పట్టుసంపదను
దేశమునందింకను విరివిచేసి, ఆపదార్థ సంచయము పరదేశ
యాత్ర వెడలునపుడు ఎగుమతిపన్నులను విధించి రెవిన్యూను
అభివృద్ధి చేయవలసి యున్నది. నూలుసరకులపై విధించబడిన
పన్నులను ఇకనైనను కాలహరణము చేయక తీసివేయవలసి
యున్నది. రబ్బరు, చెఱకు, ధాన్యాదులు మొదలగునవి దేశము
నందలి వినియోగమునకు వలయునంత పైరుచేయుట అగత్యము.
హిందూదేశపు వర్తకనౌకలను నిర్మించి ధనసాహాయ్యము
నొసంగి పోషించవలసి యున్నది. భూగర్భశాస్త్రమునందు
శిక్షితులైన విద్యాధికులకు వృత్తులను గల్పించుట చేతను,
విదేశములకేగి గనులయందు విద్యనభ్యసించుటకు సర్కారు
వేతనము లొసంగుటవలనను, ఖనిజసంపద నాకర్షించుటకు
తగినఏర్పాటులు చేయుటఅవసరము. స్వదేశమునందలి స్వతంత్ర
సంస్థానములలోను, పట్టణములలోను రాష్ట్రములలోను శాస్త్రా
లయములును శోధనాలయములును ప్రభుత్వము వారివలన
నెలకొల్పబడవలసి యున్నవి. పట్టణపారిశుద్ధ సంఘములు,
ఉచితముగ చదువుకొనుటకు వీలగు గ్రంథాలయములను
వాణిజ్యప్రదర్శక శాలలనుకలిగి యుండవలెను. ప్రతిరెండవ

సంవత్సరమునను సర్కారువారి రెవిన్యూనుండి రైతులకు శుభ్రమైన విత్తనములు, సత్తువ చేయుటకుతగిన పరికరములు ఎముకలపొడి సరఫరా చేయబడుచుండవలెను. గవర్నమెంటు వారు క్షామ దినములలో సర్కారు ఆదాయమునుండి చాల సొమ్మును ఖర్చుపెట్టుటయేగాక, ఎంతయో రెవిన్యూనుకూడ మాఫుచేయుచుండగా, సాధారణ సంవత్సరముల యందు సైతము సర్కారు రాజస్వమునుండి రైతులకుకొంత సహాయమునొసంగి, భూమిని ఏల విస్తారము సస్యాఢ్యయగునట్లు చేయరాదు ? అమెరికాసంయుక్త రాష్ట్రములు జపానుమున్నగు ప్రభుత్వములు అనేకవిధముల తమదేశములయందలి భూమిని హెచ్చు ఫలవంతముగా నొనర్చు చున్నారు. అందువలననే అక్కడిరైతులు చదువుకొనిన వారును భాగ్యవంతులుగను కూడ నున్నారు. హిందూదేశమునందలి బీదరైతులనుకూడ పట్టుదలతో విద్యనభ్యసింపజేయుట లెస్సగాని, వారినిజడులుగనే విడిచిపెట్టుట సమంజసముకాదు. వారలను విద్యాధికులను చేసినయెడల రాజస్వము వృద్ధియగునుగాని తగ్గిపోదు.

ప్రారంభవిద్య దేశమునందెల్ల యెడలను రాబోవు పది సంవత్సరములలోను నిర్బంధము చేయబడవలసి యున్నది. అందులకుగాను ఒకప్రత్యేకనిధిని తత్క్షణము ఏర్పాటుచేయుట చాల అవసరము.

జపాను ప్రభుత్వమువారు ఏకళలకును సాహాయ్యమునొసంగుటలేదని కొందరు వాదించుచున్నను, వారు అన్ని పరిశ్రమలకును అన్నివ్యాపారములకును ధనసాహాయ్యము చేయుచున్నారని ధైర్యముగా చెప్పగలము. వివిధములగు

వ్యాపారములకు, కళలకు, ఫ్యాక్టరీలకు ప్రత్యేకసంఘములు కలవు. ఆసంఘములు ప్రభుత్వమువారి సన్మానమును వడయుచున్నవి. నాటికివచ్చెడి నష్టముపూర్తిగ దొరతనమువారివలన ముదరా నీయబడుచున్నది. ప్రత్యేకించి ఏఫ్యాక్టరీకిని దొరతనమువారు సహాయము నొసంగుటలేదుగాని, నూతనకళలకు మూలధనమును అప్పునొసంగుటయు, సర్కారుకుచెల్లవలసిన పన్నులను తగ్గించుటయు మొదలుగాగల సహాయములను చేయుచున్నది.''

తేజోవిహీనమైయున్న భారతీయ కళాప్రపంచమునకు తిరిగి వికాసమును కలిగించవలెనన్న ప్రభుత్వమువారి సాహాయ్యము అత్యావశ్యకమని పైచర్చవలన తెలినది. జపాను, అమెరికా, జర్మని మున్నగు దేశముల ప్రభుత్వములవారును, విశేషించి బ్రిటిషు అధినివేశములలోనిదగు ఆస్ట్రేలియా దొరతనమువారును ఇండియా దేశమునందలి స్వతంత్రసంస్థానాధీశులును, వాణిజ్య పరిశ్రమలయందు ఏసహాయమును చేయుచున్నారో, ఇండియా దొరతనమువారుకూడ ఆరీతినే ప్రవర్తించవలసిన ఆవశ్యకత చాల హెచ్చుగా నున్నదని నిర్దేశింపబడినది. ఇండియాకార్యదర్శి ఈవిషయములయందు స్థానిక ప్రభుత్వములకు సంపూర్ణస్వాతంత్ర్యము నొసంగితీరవలయును. ఇప్పటికే చాలకాలహరణమయినది. ఒకనిమిషమైనను జాగుచేయుట పాడిగాదు.

సర్కారు సహాయ మెంతవరకు.

ఏవిషయములలో ఎంతవరకు సర్కారువారు కలుగజేసికొన వలయునో యనువిషయమున పలువురు భిన్నాభిప్రా

యులై యున్నారు. కొందరు తగిన సలహానిచ్చుటతోడనే సర్కారుపని పూర్తిఅయినదని అనుకొనువారలు. మరికొందరు అన్ని విషయములయందును కలుగజేసికొని తీరవలయునందురు. ప్రస్తుతము ఈసందర్భమున సర్కారు ప్రోత్సాహము నీయవలసిన విషయములను కొంతవరకు చర్చించెదము.

పారిశ్రామికాభివృద్ధికి అవసరములగు వానిని నాలుగు తెగలుగ భాగింపనగును. ద్రవ్యసాధనములు, శ్రమ, మూలధనము, శిల్పసంబంధమైన నిపుణత. ఈనాలుగు విషయములు కూడ ముఖ్యములేకాని, అందులో ఎంచిచూచినపుడు శిల్పులయందలి నిపుణతకును, శాస్త్రమునకును నేను అగ్రస్థానము నొసంగుటకు వెనుదీయనని సర్ దోరబుతాతాగారు, పదునొకండవ పారిశ్రామిక మహాసభయందు నొక్కివక్కాణించిరి. గొప్పరాజ్యతంత్రజ్ఞుడు, సేనాధిపతి, వ్యవహారనిర్మాత వీరు మువ్వురు స్వయంభువులు కావలసినదేకాని, తర్బీతువలన పెద్దవారుకాజాలరు. అయినను తగినఆశ్రమముదొరకి, సాంకేతిక విద్యాశిక్షణము బాగుగా అలవడినచో సాధారణ మానవునకు సైతము కొంతబుద్ధి కుశలత కలుగకపోదు. దేశమునందు ఎల్లడలను విరివిగా శాస్త్రవిద్యయు పరిశ్రామిక విద్యయు వెదజల్లినగాని వ్యవహారనిర్మాతలు బయలుదేరుటకు అవకాశముండదు. ముందుగా గొప్ప విద్యాలయములు దేశమున స్థాపింపబడవలెను.

ముందుకళాస్థాపనమా లేక శాస్త్రవిద్యా ప్రవేశమా.

దేశమునందు గొప్పకళలు స్థాపింపబడినతరువాత పారిశ్రామిక, శాస్త్రవిద్యాలయములు స్థాపించబడవలెనని కొందరిమతము. వీరిముఖ్యాభిప్రాయము, కళాస్థాపనమునకుముందు పూనుకొనవలెననుట. కళలు నెలకొల్పబడిన వెనుక కళాశాలలు (టెక్నికలు ఇన్‌స్టిట్యూటు) ప్రతిష్ఠింపబడవలెనుగాని, సాంకేతిక విద్యాలయములను ముందుస్థాపించరాదందురు. ఈ అభిప్రాయము కేవలము దురభిప్రాయమని సర్ హార్కోటుబట్లరుగారు సంయుక్త రాష్ట్రములకు పారిశ్రామికవిద్య అవసరమని తెలియపరచుచు పదిసంవత్సరములక్రిందట ఒక రిపోర్టును ఇండియా దొరతనము వారికి పంపిరి. నాగరికతనుగలిగిన ప్రతిదేశమునందును సాంకేతిక విద్యాలయము లనేకములున్నవి. ఒక్క ఇంగ్లాండు దేశమునందు గాక తక్కిన అన్ని దేశములయందును పారిశ్రామిక విద్యయొక్క ప్రారంభదశయందే సాంకేతిక విద్యాలయములు స్థాపనచేయబడినవి. అమెరికా దేశమున 1824 సం॥న రెన్‌సిలారు ఇనిస్టిట్యూటును, 1855 సం॥న మేసాచూసెట్సు ఇనిస్టిట్యూటును, 1868-66-71 సంవత్సరములయందు వాక్‌సెష్టరు, లై యూనివర్సిటి, స్టీవెను ఇనిస్టిట్యూటులును, స్థాపింపబడినవి. అట్టివిద్యాలయములే ప్యారిసు నగరమున 1795 సం॥ నను వియన్నాయందు (ఆస్ట్రియాయొక్క ముఖ్యపట్టణము) 1815 సం॥ నను నెలకొల్పబడినవి. జర్మను సాంకేతిక విద్యాలయములన్నియు పదునెనిమిదవ శతాబ్దాంతమునుండి పందొమ్మిదవ శతాబ్దారంభమునకు స్థాపింపబడినవి. జపాను, పెద్దపరిశ్రామిక విద్యాశాలలతో ఆరంభించినది.

ప్రప్రథమమున ఈ విద్యాలయము లన్నియు చిన్నవే. కాని
కళాపరిపూర్తి గాంచనెంచు దేశములయందు పారిశ్రామిక
విద్య చాలవరకు ప్రారంభదశయందే ఆరంభము కాజొచ్చినది.
సాధారణవిద్య దేశమునందు వ్యాపించిన వెంటనే తప్పక
దానివెనుక పరిశ్రామిక విద్యకూడ వ్యాపించుచు వచ్చినది.

సర్ హార్ కోర్టుబట్లరుగారు శెలవిచ్చినసంగతినిబట్టి ఇం
గ్లాండునందు మాత్రము పారిశ్రామికవిద్య ముందుగా ఆరం
భముకాలేదని మనము గ్రహించి యుంటిమి. యంత్రకళలు
హస్తకళలు, దేశమునముందుగా స్థాపితములైనవి. ఆనీతిని
పాలించుటవలని నష్టములను ఈమహాసంగ్రామము దేశమును
చీకాకు పరచుచున్నపుడుగాని ఆంగ్లప్రజలు గుర్తింపజాల
రైరి. ఆదేశమునందలి ప్రజ్ఞావంతులెల్లరును, పరిశ్రమలకును
శాస్త్రమునకును అన్యోన్యసంబంధము అమితముగా నుండు
నట్లు చేయవలెనని ఇప్పుడు చక్కగా గ్రహించి యున్నారు.
ఇంగ్లాండునందలి విద్యాశాఖవారు ఇటీవల శాస్త్రీయ, పరి
శ్రామిక శోధనలను నిపుణులగువారి యాజమాన్యముక్రింద
జరగునటుల ఏర్పాటులుచేసి వృద్ధిజేయుటకుగాను, ఒకగొప్ప
యుద్యమమును తలపెట్టిరి. ఆయుద్యమమును మనదేశమునకు
గూడ వ్యాపింపజేసిన నెంతయో బాగుగనుండును. ఈసందర్భ
మున శ్రీయుతజగదీశ చంద్రబోసుగారికి హార్డింజి ప్రభువరే
ణ్యుడు ఒక రసాయన శాస్త్రాలయమును నిర్మించి పరిశోధనలు
చేయుటకుగాను ఏర్పాటులుగావించెను. ఇది ఎంతయో శుభ
సూచకము.

సర్ దోరబుతాతాగారు శెలవిచ్చినట్లు శాస్త్రాలయముల
దేశమునందు నెలకొల్పి పరిశోధనలను గావించుటకు ఏర్పాటు
లను చేయుట సర్కారు వారి పూచీగాని ప్రజలవలన కాదు.
శాస్త్రాలయముల నెలకొల్పుటయనిన మాటలతో పనిగాదు.
ఎన్నియో లక్షలరూప్యములను ఖర్చుపెట్ట వలసి యున్నది.
అందులకు కావలసిన ధనము సర్కారు వెచ్చించవలెనే గాని
సామాన్య ప్రజల కలవిగాదు.

శాస్త్రవిద్య కొందరికి మాత్రముకాదు.

పరిశ్రామిక విద్యయనిన మా అభిప్రాయము ఏదో
కొందరు నిపుణులను మాత్రము దేశమునం దుత్పత్తిచేయుట
కాదు. శాస్త్రీయవిద్య దేశము నందంతటను వెల్లి విరిసినట్లు
వ్యాపింపజేయవలయును. జర్మనీదేశముయొక్క ప్రాముఖ్యత
దేశమునందు సుప్రసిద్ధ రసాయన, భౌతికశాస్త్రవేత్తలను కొంద
రినిమాత్రము కలిగియుండుటగాదని సర్ నార్మన్ లాకియరుగా
రొకప్పుడు సూచించిరి. ఇతరదేశములయందు కూడ కొందరు
సుప్రసిద్ధ శాస్త్రవేత్తలు లేకపోలేదు. జర్మనుదేశము నందలి
విశేషమేమనిన శాస్త్రజ్ఞానము దేశమునందంతటను వెదజల్ల
బడినది. ఇండియాదేశమునందుకూడా జర్మను పద్ధతి ప్రకారము
శాస్త్రవిద్య వెల్లివిరియునట్లేర్పాటులు చేయబడవలసియున్నది.
తరువాత పరిశ్రామిక విద్యాశాలలు మన పనివాండ్రయొక్క
కళాకౌశలమును ఇనుమడింప జేయుటకునై నెలకొలుపబడ
వలెను. చిత్రవస్తు ప్రదర్శనశాలల వలన ప్రజలకు జ్ఞానో
దయము నొసంగవలసి యున్నది. వస్తుప్రదర్శన శాలల మూల
మున ప్రజలకెంతయో సూక్ష్మముగ బోధింపనగును. కర్మ

కరులయొక్క శక్తియుక్తులను అధికము చేయుటకునై దేశమునందు సర్వత్ర సామాన్యవిద్య గరపబడవలెను. ప్రజలందరును వ్రాయను చదువను నేర్చిరేని కళాపురోభివృద్ధికి పెక్కువిధముల సహాయభూతులు కాగలరు.

ఇండియా దొరతనమువారు మేల్కొను సూచనలు.

పైచర్చవలన తేలిన ప్రధానాంశము 'లైసెజీఫెయిరు' మతము మనదేశ పరిస్థితులకు ఇసుమంతయైనను ప్రయోజనకారి కాదనియును, ప్రభుత్వావలంబన మిక్కిలి అవసరమనియు నుకదా! ఈవిషయమును కొంతవరకు ఇండియా దొరతనమువారుకూడ గ్రహించుట శుభప్రదమని చెప్పక వీలులేదు. ఇండియాదేశ ఆదాయము చాలవరకు సర్కారుఉద్యమములవలననే యలవడుచున్నది. తపాలాతంతిమార్గములు నల్లమందు, కల్లుసారాయి ఇజారాలు, అడవులు, చాలభాగము రెవిన్యూ నిచ్చుచున్నవి. 1900 సంవత్సరములనుంచి రైల్వేలు కూడ లాభజనకములుగనే యున్నవి. ప్రస్తుతము దొరతనమువారు ఇండియా యందలి రైల్వేలనన్నిటిని కంపెనీల యాజమాన్యమున నుండనీయనగునా, లేక ప్రభుత్వమువారే స్వీకరించవలయునా యను అంశమును విచారణ చేయుచున్నారు. ఈస్టిండియా రైల్వేకంపెనీ కలకత్తానుండి సిమ్లావరకు వ్యాపారమును నడపుచున్నది. ఆకంపెనీకి ఒసంగబడిన ఒడంబడిక 1918 తో ఆఖరయిపోవుచున్నది. తిరిగికంపెనీకి ఒసంగుట లాభమా లేక సర్కారు ఆధీనమునకు గొనివచ్చుట లాభమా అనువిషయము ఆలోచనీయము. ఈవిషయమును గూర్చి మరియొక సందర్భమున విపులముగా చర్చించబడును.

గాన సర్కారువారే రైల్వేలన్నిటియందును యాజమాన్యమును వహించి, కార్యక్రమమును నిర్వర్తించుట యుచితమనిమాత్ర మిచట చెప్పవలసియున్నది.

ఈమధ్య సామ్రాజ్యశాసన నిర్మాణ సభయందు, సుప్రసిద్ధ భారతీయ అర్థశాస్త్రవేత్తయగు సర్ దిన్షా ఎడల్జీ వాచాగారు అడవుల పరిపాలనమును గూర్చి ప్రశ్నింపగా గౌరవనీయులగు సర్ క్లాడు హిల్‌గారు తామీవిషయమును గూర్చి ఆలోచించుచున్నామనియు, వర్తకరీత్యాలాభము వచ్చు విధమున అడవులను ఉపయోగించెదమని ప్రత్యుత్తరమిచ్చిరి. అండమాను దీవులయందలి దుర్గమారణ్యములను లాభజనకములుగజేసి సర్కారురాజస్వము అధికమగునట్లు ఏర్పాటులు గావింపబడెననియు, యుద్ధానంతరమున ఈయుద్యమమును కొనసాగించ గలుగుదుమనియుకూడ చెప్పిరి. ఇటీవల పబ్లికుసర్వీసు కమిషనుకు అగ్రాసనాధిపతిగా ఇండియాకువిచ్చేసిన ఐలింగ్టను (Lord Islington) ప్రభువు ఒకవార్తాపత్రికా విలేఖకునికొసంగిన సమావేశములో, సర్కారువారే కొన్ని కళలను వృద్ధిచేయు భారమును వహించ నిశ్చయించినట్లు తెలియజేసిరి. ఇతరదేశముల ప్రభుత్వములవారు వాణిజ్య పరిశ్రమలయందు జోక్యమును గలిగించుకొనుటవలన నష్టములేవియేని సంభవించినను ఇండియా దేశమునందు మాత్రము ఏకళలను విస్తరింపజేయుటకు ప్రజల ఉద్యమములు సఫలీకృతములు కాలేదో, వాటియందు సర్కారువారు ప్రమేయమును కలిగించుకొని, కొన్ని మాదిరి ఫ్యాక్టరీలనుగాని కర్మాగారములనుగాని స్థాపనముచేసి ప్రజలకు మార్గదర్శకులు కావలసిన ఆవశ్యకతమెండుగాగలదు.

ప్రత్తిపన్నులను గూర్చి ప్రభువుల సభయందు 1917 సం॥ మార్చి నెలలో ప్రసంగించుచు ఐలింగ్టను ప్రభువు మనదేశ పరిస్థితులను కొంతవరకు గ్రహించినవాడై ఇటుల ముచ్చటించెను. "హిందూదేశముయొక్క భావియౌన్నత్యము కళాపురోభివృద్ధిని ఆశించియున్నది. కళలభివృద్ధిజెందుచున్న కొలదిని రాను రాను ఇంగ్లాండునకును, ఇండియాకును విశేషమైన పోటీకూడ ప్రబలును. వాణిజ్య పరిశ్రమలయందు మసలుచున్న ఆంగ్లప్రజలెల్లరు, ఈవిషయమును గుర్తించవలసియున్నది." అసహాయస్థితియందుండెడి చిన్నరాష్ట్రములకు అభయహస్తము నిచ్చెదమని కంకణముగట్టుకొన్న బ్రిటిషు దొరతనమువారు, కళాప్రపంచమున, బెల్జియము, సర్వియా మాంటినిగ్రో, రుమేనియా దేశముల ప్రస్తుతస్థితికంటె హీనదశయందున్న ఇండియాదేశమునకుకూడ అభయహస్తమొసంగి రక్షించెదరుగాక! ఇండియా దొరతనమువారికి వాణిజ్య వ్యాపారములయందు ఇండియా కార్యదర్శియొక్క ఆటంకములు లేకుండ సంపూర్ణ స్వాతంత్ర్యము నొసంగుటయే మనకోరిక!

కర్జనుప్రభువు సైతము మనయెడల సానుభూతిని గనబరచుట చాలసుకరము. "లంకషైరు నూలుసరకులపై ప్రత్తిపన్నును అధికముచేయుట ఇండియాదేశమునకు చాలకాలమునకు న్యాయమును ప్రసాదించుటయని నామతము. ఇదివరకు అన్యాయముచేయబడిన దేశమునకు ఈప్రస్తుతపద్ధతి మనఃపూర్వకముగా నష్టపూర్తిని చేయుటయైయున్నది." ఆంగ్లప్రజలు కర్జను, ఐలింగ్టను ప్రభువులవాక్యములను, బాగుగ గ్రహించినవారై మనదేశమునకు న్యాయమునొసంగి నిస్తంద్రకీర్తియుతులు కావలసియున్నది.

వాణిజ్యనీతియందు బ్రిటిషుప్రజలు ఉదారభావమును గలవారై ఇండియాదేశముయొక్క అభివృద్ధిని గమనించినవారలై, ఇండియాదేశ పురోభివృద్ధికి అభ్యంతరములను కలిగించు ఇండియా దొరతనమువారికి ఆర్థికస్వాతంత్ర్యము నొసంగుట విధియైయున్నది. హిందూదేశము పేదవడి యున్నంతవరకు సామ్రాజ్యమునకు సహజమైనబలము అలవడదు.

స్వేచ్ఛా వ్యాపారము ; రక్షణ.

మన భరతఖండము పాశ్చాత్యదేశము లన్నిటికంటెను ముందుగా సకలైశ్వర్యముల తులదూగి సమస్త కళాప్రావీణ్యతం జెంది విజృంభించెనన్న సంగతి నిర్వివాదాంశము. ఆంగ్లేయులు కట్టుటకు వస్త్రములు లేక తోళ్ళనో చెట్లయొక్క పట్టలనో మానసంరక్షణార్థము ధరించి థేమ్సునదియందు చేపలను వేటాడు కాలమునకు మన ఢాకామజ్లినులు ప్రపంచ విఖ్యాతిగాంచినవి. ఆమజ్లినుల యొక్క ప్రావీణ్యత ఈక్రింది యితిహాసమువలన తెల్లమగును. ఔరంగజేబు మన దేశమేలు కాలమున ఒకానొక మొగలాయి స్త్రీ చక్రవర్తి దర్శనమునకు వచ్చెను. ఆమెను చూచిన తోడనే ఔరంగజేబు దుస్తుల ధరించి రావలె నని యాజ్ఞాపించెను. ఈచక్రవర్తికి ఇతర దుర్గుణము లెన్నియున్నను త్రాగుటయును పరస్త్రీగమనమును మొదలగు వ్యసనములకు మాత్రమెన్నడు చోటిచ్చినవాడు కాడు. చక్రవర్తియాజ్ఞ కాశ్చర్యపడి ఆమొగలాయి స్త్రీ "ఓనాయేలికా! నీదర్శనమునకు దుస్తుల ధరింపకుండ వచ్చుటకు నేనంతవెర్రినే! ప్రభుదర్శనార్థము నేను ప్రశస్తమైన యేడు ఢాకా మజ్లినుల ధరించివచ్చితినని నుడివెను." ఆహా! యేడుమజ్లినుల ధరించినను దేహముపై వస్త్రము లేనట్లు కన్పట్టినదే! ఏమి వీటిని నేసిన పనివాని నేర్పరితనమని చక్రవర్తి తనలో చాల సంతోషించి, ఆమొగలాయి స్త్రీతో "నీవు ధరించిన ఢాకామజ్లినులు చాల సన్నముగ నున్నవి గనుక మరొక దుస్తు ధరించి రావలెనని కోరెను." అట్టి ఢాకామజ్లినుల సంగతి ఇప్పుడు తలచుకొనిన యే భారతీయునకు విచా

రము రాకమానదు? మనకళా ప్రపంచమంతయు నేడు కళావిహీనమై మనము ప్రతివస్తువునకును పరరాష్ట్రముల వారిని ప్రార్థించవలసి వచ్చెనను సంగతి కడుం గడుశోచనీయము.

ఈస్టిండియా కంపెనీవారి అసూయా పరిపాలనమువలన మన కళలన్నియు శోభావిహీనములై యడుగంటినవి. * దేశీయ ప్రభుత్వమున్న యడల మనకట్టి దుస్థితి వచ్చియుండదేమో? తిరిగి వాటియందు వికాసము కలుగజేసివిజృంభింప జేయవలెనన్న మనవాణిజ్య చక్రమును యథేచ్ఛగావిహరింప నీయవచ్చునా లేక ఏమైన నిర్బంధమును కలుగజేయవలెనా యనునంశము మనము విచారింపవలసి యున్నది. మన వర్తకమునకు రక్షణ కావలయునా అక్కర లేదా యనువిషయమున పలువురు భిన్నాభిప్రాయులై యున్నారు.

రక్షణ యననేమి.

రక్షణ యనగా విదేశవస్తువుల పై పన్నులను విధించి స్వదేశవస్తువులకు వృద్ధినొందుటకు సదుపాయములు చేయుట. పన్నులను విధించుటయేగాక ప్రభుత్వమువారు అనేకవిధముల సహాయము చేయవచ్చును. క్రొత్తక్రొత్త కళలను స్థాపింప జేయుటకు గవర్నమెంటు వారు విస్తారము ద్రవ్యసహాయము చేయుటయు, వాటిని పైదేశముల కెగుమతి చేయుటకు ఎగుమతి పన్నులు వగైరాలను వేయకుండుటయు మొదలగు అనేక విధముల సహాయము చేయవచ్చును. జర్మనీ, అమెరికా సంయుక్త రాష్ట్రములు మొదలగు దేశీయ ప్రభుత్వముల వారు, వారివాణిజ్య చక్రము నీతీరుగనే విజృంభింప జేసినారు.

* R. G. Dutt.

బీటు-చక్కెర (ఒక తరహా కందమూలమునుండి తయారు చేసిన పంచదార) మనచెరకు పంచదారను నిలుచుట కాస్కారము లేకుండ మన మార్కెట్టునుండి సైతము పారదోలెనన్న సంగతి ఎల్లరకు తెలిసిన విషయమే.

స్వేచ్ఛావర్తక మననేమి.

స్వేచ్ఛావర్తకమనగా పన్నులేని వర్తకము. విదేశవస్తువులపై శుల్కమును విధించకుండుటయే పన్నులేని వర్తకమనబడును. మనదేశమునుండి ఎగుమతిచేయబడు వస్తువులపై పరరాష్ట్రములవారు శుల్కమును వసూలుచేసినను మనము మాత్రము వారివస్తువులపై పన్నువేయరాదని దీనియభిప్రాయము. ప్రపంచమునందలి ఎల్లదేశములలోను ఒక్క ఇంగ్లండుదేశముమాత్రము స్వేచ్ఛావర్తకమును కలిగియున్నది. ప్రపంచమునందెల్ల దేశములవారును స్వేచ్ఛావర్తకము నామోదించవలయుననియే, ఇంగ్లాండుదేశస్తుల యాశయము. కాని వీరి ప్రయత్నము లీసందర్భమున వృథాయయ్యెను. ఇంగ్లీషు అర్థశాస్త్రజ్ఞుల వాదములు జర్మనీ, సంయుక్తరాష్ట్రములు, జపాను మున్నగు దేశస్థులకు రుచింపవయ్యె. ఆంగ్లేయ అర్థశాస్త్రజ్ఞుల వాదములను మెచ్చుకొనుచు ఆయాదేశములవారు వారిదేశస్థితిగతులనుమాత్ర మాలోచించుకొని రక్షణత్వమునే అవలంబించియున్నారు.

ఒక్క ఇంగ్లండు దేశము మాత్రమిప్పటికిని స్వేచ్ఛావాదము ననుసరించియున్నది. కాని ఇటీవల రక్షణత్వసూచనలు పొడకట్టుచున్నవి. ఈ యుద్ధానంతరమున స్వేచ్ఛావాదము

నిలుచునో ఇంగ్లండుదేశము సైతము అన్నిదేశములతో పాటు రక్షణ నవలంబించునో మనము నిష్కర్షగా చెప్పజాలము.

స్వేచ్ఛావర్తకమువలని లాభములు.

స్వేచ్ఛావర్తకము నవలంబించుటవలన మనము ప్రతివస్తువును చౌకగాకొనుటకు వీలున్నది. ఏలననగా ప్రతిదేశమువారును పోటీకివచ్చి మనకు కావలసిన వస్తువులను సమకూర్చెదరు. అన్నిదేశములవారును పోటీకివచ్చినపుడు ధరలు చౌకగానుండక మానవు. మనకెవరు తక్కువ వెలకిచ్చెదరో వారివద్దనే మనము గ్రహించుటకు వీలున్నది. రక్షణనిమిత్తము విధించబడిన శుల్కము సరకులయొక్క ఖరీదును హెచ్చుచేయును. అట్లుచేయుటవలన వినియోజకునకు (అనుభవించెడు వానికి) కొంచెము నష్టము కలుగును. ఇంతేగాక మనము కలిగించిన కల్పిత ప్రోత్సాహమువలన మూలధనమును, శ్రమయును స్వాభావికముగా తక్కువఉపయోగకరమైన కార్యములలో వినియోగించిన వారమగుటయేగాక వాటియొక్క ఫలోత్పాదకశక్తిని సైతము తగ్గించిన వారమగుచున్నాము. కాబట్టి రక్షణ నవలంబించుటవలన తాత్కాలిక నష్టము కలుగక మానదు.

రక్షణవలని లాభములు.

అయిన ప్రస్తుతనష్టమునకు మించిన ఫలము తుదకు దేశమునకు లభించునని కొందరు రాజ్యతంత్రజ్ఞుల యభిప్రాయము. వారిలో లిస్టుఅను జర్మనురాజ్యతంత్రజ్ఞుడీవిషయమును గూర్చి ఎక్కువ శ్రమతీసికొని ప్రపంచమునకు తెలియజేసెను. రక్షణ నవలంబించుటవలన తుదకు దేశమునకుగలిగెడి హెచ్చు

లాభములేనన స్వదేశకళ లభివృద్ధిజెందుట, దేశమందలి శిల్పి
కరులందరు ఒకే వృత్తిలో యాజన్మాంతము కృషిచేయకుండ
పలువిధములైన వృత్తులనవలంబించుటకు వలనుపడుట, బుద్ధి
కుశలత వృద్ధియగుట, క్రొత్తక్రొత్త వ్యాపారములను స్థాపన
చేసి అవి చెడిపోకుండ తగునేర్పాటులచేయుట, దేశమందలి
ఖనిజములను సేకరించి ఉపయోగింపగలుగుట, యానసౌకర్య
ములను వృద్ధిచేయుట మొదలగునవి. ఇంతియేల! ఏకముగానన
లంబించుటవలన వ్యవసాయదశయందుండెడి దేశము పరిశ్రా
మిక కళలయందుత్తీర్ణత గాంచగలుగును. కాబట్టి మనము
దేశముయొక్క మొత్తపులాభము నాలోచించునప్పుడు, ఒక
సామాన్యసంసారికి సంభవించెడు నష్టమును పరిగణించక, దేశ
మున కేమార్గము నవలంబించుటవలన ఐశ్వర్యము చేకూరునో
దానినే, మనమాలోచించవలసి యున్నది. "కేవల ధనసంపా
దనకన్న సంఘముయొక్క ఉత్పాదకశక్తులను వృద్ధినొందించు
టకు తగిన ఏర్పాటులను చేయుట హెచ్చులాభకరమగును.
దేశముయొక్క ఉత్పాదకశక్తిని మనసునందిడుకొని మన
మాలోచించినచో ప్రస్తుతము కొన్ని వస్తువులు చౌకధరలకు
దొరకుటవలన గలిగెడు లాభమును, ముందు ముందు ఉత్పా
దకశక్తి కేవలమునశించుటవలన మనకురాబోవు గొప్పనష్టము
తుడిచివేయుచున్నది.

సంపదను వృద్ధిచేయుటకు మనకుగల శక్తిని వృద్ధిపరు
చుట, ప్రత్యేకధనసంపాదనముకన్న చాలరెట్లు ముఖ్యమైనది.
రక్షణపన్నులవలన, సరకులకు మనము కొంతహెచ్చుధర నియ్య
వలసి వచ్చినను ఈనష్టము, మనకు ఉత్పాదకశక్తి అధికమగుట

వలన గలుగు లాభమువలన, భర్తియగును. ఈ యుత్పాదకశక్తి
అధికమగుటవలన దేశమునకు ముఖ్యముగా కావలసిన ఎల్ల
వస్తువులను అనేకరెట్లు హెచ్చుసంఖ్యగా మనదేశమునందు
తయారుచేయ గలుగుదుము. ఇంతేగాక యుద్ధసమయముల
యందు అన్నివస్తువులకు అన్యదేశీయులపై ఆశపెట్టుకొని
ఇబ్బంది పడకుండ, స్వేచ్ఛగానుండ గలుగుదుము. విస్తారము
ఐశ్వర్యమును జాగ్రతపరచుటకన్న స్వకీయరక్షణ వేయిమడుం
గులు ఆవశ్యకము.

'లిస్టు' అను జర్మను అర్థశాస్త్రజ్ఞుడు.

రాజ్యపరిపాలనా తంత్రమునందు దేశీయ సంప్రదా
యము, చారిత్రాత్మక సంప్రదాయము, అను రెండుపద్ధతులు
గలవు. దేశీయ సంప్రదాయ పక్షమున వాదించువారలలో
'లిస్టు' అను శాస్త్రజ్ఞుడువిస్తారము ఖ్యాతిగాంచినవాడు. ఈమహా
ను భావుని యుద్దేశప్రకారము తమవాణిజ్య చక్రముయొక్క
అభివృద్ధియందు సకలదేశస్థులును మూడుదశలను గడుపవలసి
యున్నది.

1. మొదటిదగు వ్యవసాయదశయందు వారువిస్తార
ముగా అభివృద్ధిగాంచిన దేశములవారితో స్వేచ్ఛావర్తకము
నవలంబించవలెను. అటులజేసినగాని వీరివ్యవసాయము వృద్ధికి
రాదు. వ్యవసాయముబాగుగా వృద్ధియైనకొలది స్వేచ్ఛావర్తక
మంత లాభకరముగ నుండదు.

2. రెండవదియగు శిశుదశయందు పరిశ్రామిక కళ
లును, యానసౌకర్యములును, అన్యదేశవర్తకమును, వృద్ధి

యగుటకుగాను దేశప్రజలు రక్షణ నవలంబించవలెను. దిగు
మతిపన్నులను తొలుదొల్త తక్కువగా విధించి క్రమక్రమ
ముగా హెచ్చించవలెను. ప్రథమమునందు ఏవస్తువులు జన
సామాన్యముయొక్క ఉపయోగమున కావశ్యకములో వాటిని
తయారుజేయుటయందు తగుఏర్పాటులను జేయుటకు ప్రయ
త్నించవలెను. ఏదేశములు స్వాభావికముగా కళలనువృద్ధినొం
దింపజేయుటకు తగిన ద్రవ్యసాధనములను కలిగియుండునో ఆదే
శస్తులుమాత్రమే రక్షణ నవలంబించుటకు అర్హులైయున్నారు.
పరిశ్రామిక కళలయందు తీక్ష్ణత గాంచుటకు తగిన బుద్ధికుశల
తను, సాధనసంపత్తిని సకలసామగ్రులను ఆయాకళలస్థాపించి
వృద్ధికి తెచ్చుటకు తగిన ఉపాయములను, ఏదేశస్థులు కలిగి
యుందురో వారుమాత్రమే రక్షణ నవలంబించవలెను.

3. రక్షణ నవలంబించుటవలన ఐశ్వర్యమును శక్తిని,
సంపాదించినపిదప, మూడవదశయందు క్రమక్రమముగాతిరిగి
స్వేచ్ఛావర్తకమార్గము నధిష్ఠించవలెను. ఈదశయందు అటుల
జేయక, ఇంకను రక్షణనే కలిగియుండిరేని, కళలయొక్క
పురోభివృద్ధి కాటంకమగుటయేగాక వాటియొక్క క్షీణతకు
గూడ కారణమగును. ఇతరదేశస్థులయొక్క పోటీలేనందువలన
స్వస్థానమందలి ఉత్పాదకులకు సోమరితనము జాస్తియగును.

కాబట్టి రక్షణ ప్రతిదేశమునను ఒకానొక దశయందు
తప్పక యుండితీరవలయును. ప్రస్తుతము మనదేశము; పైన
జెప్పబడిన రెండవదశయందున్నది. కాన రక్షణావలంబన
మావశ్యకము.

రక్షణవీలులేని స్థితిగతులు.

ప్రపంచమునందలి దేశములలో విస్తీర్ణతలోను, జనసంఖ్య
లోను, ఫలవంతమగుక్షేత్రమును గనులనుకలిగి యుండుటలోను,
ప్రజలయొక్క గుణములలోను, వారిసంఘనియమములయొక్క
నిపుణతలోను, ఒకదేశమునుండి మరియొకదేశము విస్తారము
భేదించుచున్నది. వర్తకమార్గము నెద్దానినవలంబించిన బాగుగ
నుండునని యాలోచించునప్పుడు అన్నిపరిస్థితులను జాగ్రతగ
పరిశీలించవలసి యున్నది. ఆర్థికవిషయములయందు పరదేశ
ములను, ఏవస్తువుకొరకును ఆశించ నవసరములేకుండ దేశము
నకు కావలసినవన్నియు ఆదేశస్తులే తయారు చేసికొనుటకును,
కళాప్రపంచమునందు స్వాతంత్రతకలిగి యుండుటకును, కొన్ని
దేశములయొక్క విస్తీర్ణతయును జనసంఖ్యయును వీలుచిక్క
నియ్యవు. 8 చదరపుమైళ్లు విస్తీర్ణతగలిగినటువంటియు, 13,000
మంది జనసంఖ్యగలిగినట్టియు, మొనాకోసంస్థానముగాని, వేయి
చదరపుమైళ్ళ వైశాల్యమును 2 లక్షల 18 వేలు జన సంఖ్య
యును గలిగిన లక్సెంబర్గు రాజ్యముగాని విదేశవర్తకము లే
కుండ చేయుటకు ప్రయత్నించెనేని కేవల పరిహాస పాత్రము
లగుటయేగాక ఆ దేశప్రజలను మిగుల బాధపెట్టినవగును. వీరి
సంస్థానములు బహు చిన్నవగుటచే దేశీయవర్తకమునకు తగిన
అవకాశము లేదు. ఇరువది మొదలు అరువది లక్షలవరకు జన
సంఖ్యగల డెన్మార్కు, స్విట్జర్లాండు, బెల్జియము, పోర్చుగలు,
గ్రీసు, హాలెండు, నార్వే, స్వీడను దేశములకు సైతము విదేశ
వర్తకము[illegible] జేసికొని[illegible]నష్టమున్నది. ఈదేశముల
యందు ఉత్పత్తియగు వస్తువులలో వ్యత్యాసమంతగా గాన

రాదు. స్వల్పవిస్తీర్ణతను గలిగియుండుటవలనను, శీతోష్ణస్థితిలోను భూసారమునను, భేదమేమియు లేక ఒకేతీరుననున్నందున వలన, ఈదేశములలో యంత్రకళలకును హస్తకళలకును ఆవశ్యకమైన పలువిధములగు పచ్చిదినుసులు ఉత్పత్తియగుట లేదు. ఇటువంటిదేశములవారు వారికి కావలసిన యాపత్తుసరకులను వారే తయారుచేయుటకు పూనుకొనిరేని వీరిశ్రమ నైసర్గికముగ మిక్కిలి యల్పదశయందుండక మానదు.

భూపరిమాణము నపరిమితముగ గలిగియు జనసామాన్యమును తక్కువగా గలవగుటచే బ్రెజిలు, అర్జెంటయినురిపబ్లికు దేశములు సైతము విదేశవర్తకమును ఆపుచేసినందువలన నష్టము ననుభవించును. కళాపురోభివృద్ధికి కావలసిన ద్రవ్యసాధనము లనేకములు ఈదేశములయందు గలవు. జనసామాన్యము తక్కువయగుట వలనను, ఆదేశవాస్తవ్యులగు నీగ్రోజాతివారు నాగరికతనుగలిగి యుండకపోవుట వలనను, వీరి శ్రమావిభాగము సైతము కొన్ని వస్తువులను తయారు జేయుటయందు దక్క మిగిలిన భాగములయందు నీచదశయందే యున్నది.

బెల్జియము హాలెండు దేశములు దేశీయవర్తకముకంటె విదేశవర్తకమునకు ప్రాముఖ్యత నిచ్చుచున్నవి. పచ్చిదేశస్థులు సరకులయొక్క ఎగుమతి దిగుమతుల వలననే ఐశ్వర్యవంతులైరి. వీరికిసరకులను రవాణాచేయుటయే హెచ్చులాభకరముగా నున్నది. నార్వేదేశస్థులన్ననో వారికికావలసిన పెక్కు వస్తువులను పై దేశములనుండియే తెచ్చుకొనవలసి యున్నది. వీరితరదేశముల కమ్ము వస్తువులు చాలతక్కువ. డెన్మార్కు

స్విట్జర్లాండు మొదలగు దేశములు సైతమార్థిక విషయముల నీస్థితియందే యున్నవి.

రక్షణ అవసరమగు స్థితిగతులు.

వైశాల్యమునందును జనసంఖ్యయందును పైన పేర్కొనబడిన రాజ్యములకన్న వేయిమడుంగు లధికముగానున్న రషియా, అమెరికా సంయుక్తరాష్ట్రములు మున్నగుదేశములకు విదేశవర్తకముకంటె, దేశీయ వర్తకాభివృద్ధియే సకలైశ్వర్య దాయకంబు. ఆర్థికవిషయముల గమనించిన నీరెండు దేశములును శీతోష్ణస్థితియందును, నైసర్గిక స్వభావమందును, సుక్షేత్రములను, కళాకౌశలమునకును వాణిజ్యైపునకిని వలయు సకల సాధనములను గలిగి వెవ్వేరు ప్రపంచములవలె గన్పట్టుచున్నవి. ఈదేశస్థులు వారికి గావలసిన సకలవస్తు సముదాయమును వారే సంగ్రహించు నిమిత్తము ప్రయత్నములు సల్పుటకు వలయు నవకాశములు పెక్కులు. కాన నీదేశములకు విదేశవర్తకము ఏమియు లేకపోయినను, స్వదేశవర్తకమే వీరి నైశ్వర్యవంతుల జేయుటకు జాలును.

ముప్పదియొక్కకోట్ల ఏబదిలక్షుల ప్రజలనుగలిగి పదునేడుకోట్ల ఏబదిలక్షుల చదరపుమైళ్ళ విస్తీర్ణతను గలిగి యున్న మన ఇండియారాజ్యమును సైతము ఆర్థికవిషయముల పట్ల నొక ప్రత్యేక ప్రపంచముగనే పరిగణించవలసి యున్నది. సుమారెనిమిదికోట్ల ప్రజలను గలిగిన అమెరికా సంయుక్తరాష్ట్రములకే విదేశవర్తకముకన్న, స్వదేశవర్తకము లాభకారిగా నుండునపుడు, మనహిందూదేశమున దేశీయవర్తకమున కెక్కువ ప్రాముఖ్యత నీయవలెనని వేరె నుడువవలయునా!

అమెరికనులు రక్షణ నవలంబించినవారై వారిదేశీయ వర్తక
మును విజృంభింప జేసినవారగుటయేగాక పరరాష్ట్రములవారి
తో సైతము వాణిజ్య వ్యాపారములను నడుపుచునే యున్నారు.
కాన మనదేశపురోభివృద్ధికి సైతము రక్షణత్వ మావశ్యకమని
కన్పట్టుచున్నది. మనకు పరరాష్ట్రములతో వాణిజ్యవ్యాపార
ములు లేకపోయినను, మనస్వదేశ వర్తకము నభివృద్ధి చేసికొని
మనకుకావలసిన సరకులనన్నిటిని మనమే జాగ్రతపరచుకొను
టకు ప్రయత్నములు చేయవలయును. ప్రప్రథమమున రక్ష
ణత్వావలంబన మున్నగాని మనయుద్యమము నెరవేరదు.

ఇండియాదేశమునకు రక్షణ సాధ్యమా ?

మన భరతఖండమున కార్థికవిషయముల పట్ల పరదేశ
ములనుండి సంపూర్ణ స్వాతంత్ర్యమును కలుగునట్లు చేయుట
కవకాశములున్నవా లేవా యనుసంగతి మన మాలోచించ
వలసియున్నది. తనుపరికరముల నన్నిటిని మనము కలిగియుంటి
మని ముమ్మాటికిని నొక్కి చెప్పగలము.

ఏలననగా మన భారతరాజ్యరమారమణి అపారమైన
సంపదను గలిగియున్నది. ఆశ్చర్య జనకమగు కృషివాణిజ్య
లోహాది ద్రవ్యసాధనములు పెక్కులు మనదేశమున స్వయం
భువులు. అయిన ప్రస్తుతమవి చాలవరకు ప్రచ్ఛన్నములు.
ప్రశస్థమైన బొగ్గుగనులు, నాడెమైన కిరసనాయిలు(Petroleum)
అపారమైనకలవు, మనదేశమునగలవు. ప్రశస్థమైన ఇనుప
గనులు దేశమంతటను వ్యాపించియున్నవి. ఇనుముయొక్క
పరిశుద్ధతనాలోచించిన, ఇంగ్లాండునందలి ఇనుపవర్తక యూజ

మానులకుసైతము నోరూరకమానదు. యినుమొక్క విశేషమే
మన పెక్కుస్థలములయందు పరిగ్రహణమునకు, విశేషశ్రమ
యవసరములేకుండ పైభాగమునందే యున్నది. ప్రశస్థమైన
డామస్కసు కత్తులను తయారు చేయుటకు సైతము పనికి
వచ్చెడు ఉక్కును, మేంగనీసు గనులును కుప్పలుగా మన
దేశమునం దున్నవి. ఇంతేగాక బంగారు, వెండి, సత్తు,
సౌవీరము, సీసము, రాగి, సున్నము, రత్నములు మొదలగు
లోహము లీదేశమున పెక్కులుగలవు. ఒక్క లోహములేగాక
సకలవిధములైన ఆహారపదార్థములను ఈదేశముకలిగియున్నది.
మృదువున కాస్ట్రేలియా దేశపుపంటకు సమానమగునవియు
మోటుతనమునకు కాబాంకాదేశపు పంటకు సరివచ్చునవియు
నగు గోధుములు ఈదేశమున పైరగుచున్నవి. నూనెగింజలు,
పొగాకు, తేయాకు, కాఫీ, పంచదార, వాసనద్రవ్యములు,
లక్క, రంగులు, ప్రత్తి, జనుము, గోగు, అవిశనార, కొబ్బరి
పీచు మొదలగు అన్నిరకముల సరకు గలవు. వేయేల! వర్ణనా
తీతమగు పెక్కుదినుసు లీదేశమునగలవు.

ఇక దేశప్రజలన్నచో మితవ్యయమును పోషించినిగల
వారగుటయేగాక శ్రద్ధగాపాటుపడువారును, ఎంతటి దేహశ్రమ
కైన నోర్చువారును, వినయవిధేయతలుగల వారును, ఎట్టిదాని
నైన బోధపరచిన సులువుగా గ్రహించువారును, సూక్ష్మబుద్ధి
నుపయోగపరచి నాజూకైన పనులు నెరవేర్చుటయందు
సైతము కళాకౌశలము గలవారునై యున్నారు. కర్మకరుల
వేతనములా, [illegible]! క్షేత్రమా చాలవరకు అద్భుతమైన
ఫలోత్పాదక శక్తిని గలిగియున్నది.

ఇండియా దేశపు ఆర్థికభూగర్భశాస్త్రమున 'బాల్' అను నొక యాంగ్లేయపండితుడిట్లు వ్రాయుచున్నాడు. "ఇండియా దేశము, ప్రపంచమునంతటినుండి ఏసంబంధములేకుండ వేరు చేయబడినప్పటికిని, లేదా ఇతరదేశములయొక్క పోటీనుండి ఆదేశమునందు ఉత్పత్తియగు లోహములను గాపాడినదో, ఆదేశమునకు వలయు సర్వఖనిజములను తానే సరఫరాచేసికొనుటకుతగిన సామర్థ్యమున్నదని నుడువుటకు ఎవ్విధమైన అనుమానమును లేదు."

లోహప్రపంచము నందేగాక సకలవస్తు సముదాయమును ఉత్పత్తిచేయుటకు సైతము ఇండియాదేశము తగియున్నది. అమూల్యమైన బొగ్గుగనులను ఇనుపగనులను గలిగియుండుటయేగాక, యంత్రకళాభివృద్ధి కావశ్యకమైన విద్యుచ్ఛక్తిని జనింపజేయుటకు మనకొండలనుండి ప్రవహించు నదుల నీరును ఆకట్టుటకు చాల యవకాశమున్నది. తాతా అండు సన్సువారు బొంబాయి రాజధానిలో లోనవ్లాయొద్ద నొకగొప్ప విద్యుచ్ఛక్తి జనితస్థానమును నిర్మించినారు. దీనిచే ఆవిద్యుచ్ఛక్తి వలన నడుపబడుచున్న యంత్రములకు నిప్పుడు తక్కువఖర్చునకే ప్రశస్తమైన విద్యుచ్ఛక్తి లభించుచున్నది. ఇది ద్రవ్యవిషయముననే గాక ఆరోగ్యవిషయమున సైతము గొప్పలాభము.

ఇదివరకు మనము దేశాభివృద్ధికి అవసరములైన ప్రకృతినిగురించియు, శ్రమనుగురించియు చర్చించి యున్నాము. ఇకమూలధనము సంగతి నాలోచించవలసియున్నది. మనదేశమున సైతము కావలసినంత మూలధనమున్నది. కోట్లకొలది ధనముపయోగమునకు తీసికొనిరాబడకుండ పాతరబడియున్న

దనుమాట యెంతవరకు నిజమైనప్పటికిని, తాతా అండు సన్సువారివలన స్థాపింపబడిన విద్యుచ్ఛక్తియంత్రములకు గావలసిన మూలధనమంతయు మనదేశస్థులే జాగ్రతపరచగలుగుట శుభసూచకము. ఇంతియగాక మనకుగావలసిన ధనమును మనమితరదేశములనుండి అప్పుతీసికొనవచ్చును. మన మేకళాభివృద్ధికి ఆధనమును వెచ్చించనెంచితిమో, రక్షణవలననది వృద్ధియై లాభకారి యగునని తోచునపుడు మనకప్పు పుట్టకపోదు. ఈవిషయమున ప్రభుత్వమువారి సహాయమావశ్యము.

మూలధనము కళాభివృద్ధికి ఆవశ్యకము. అయిననేమార్కెట్టులలో దానివ్యాపారమునకు ఆటంకములు గలుగునో, యెచ్చోట పరదేశములయొక్క అపారమైన పోటీవలన వృద్ధిగాంచుటకై పెనగులాడుచున్నకళలు నశించుచుండునో, ఆమార్కెట్లదరికి మూలధనమెన్నడును స్వేచ్ఛగాచొరజాలదు.

సుమారు, నలుబది సంవత్సరములక్రిందట, ఇండియా దేశముయొక్క కళావాణిజ్యముల విస్తరింప జేయుటకును, గవర్నమెంటువారికి కావలసిన రివిన్యూ (రాబడి)నువృద్ధిచేయుటకును, అమితమగు నేలపన్నును కొంతవరకు తగ్గించి కృషిని వృద్ధిచేయుటకును, వీలుగలుగునిమిత్తము, రక్షణశుల్కములవిధించుట చాలసౌకర్యమును, అత్యవసరమునునై యున్నదని సర్ లెపెల్ గ్రిఫిను గారొక పత్రికయందు వ్రాసియున్నారు. ఈయుద్దేశము నెరవేరుటకుగాను రక్షణపన్నులు న్యాయముగా ఇండియా దేశమునందు విధింపబడవలెననియు, అందువలన దేశమునకు లాభకరమనియు వీరు అభిప్రాయపడిరి.

"అయిన నీవిషయము, ఇంగ్లాండునందలి ఇంగ్లీషు ప్రజలచేత పరిష్కరింప బడగూడదు. ఇండియా గవర్నమెంటు వారివలన, ఇండియా దేశస్థుల యాశయములను మనసునందిడుకొని నిర్ణయింపబడవలెను." సర్ గిల్బర్టు మోల్ స్వర్తు.

రక్షణపన్నులవలన ఇండియాకు నష్టమా ?

మనదేశమున సరకుల దిగుమతి అధికముగ నున్నది. వాటిపై తగుమాత్రము శుల్కమును వసూలుచేసినచో ప్రజల్కంత కష్టతరముగా తోచదు. అటులచేయుట మనకళాభివృద్ధికి అపరిమితమైన సహాయము నొనర్చుటయగును. ఇంతియగాక పన్నులధికమగుటవలన భారము మిక్కుటమై క్రుంగుచున్న క్షేత్రముయొక్క భారమును కొంతవరకు తగ్గించి వాటికి సదుపాయము చేయగలుగుదుము. ఈమార్గము నవలంబించుట వలన తగులుబడి మొదట కొంచము అధికమయినను దేశముయొక్క ఫలోత్పాదకశక్తి రానురాను అధికమై ఐశ్వర్యము వృద్ధియగును. ఈపన్ను ఆహారపదార్థములయొక్క వెలలను హెచ్చుచేయ జాలదు. ఎందువలన ననగా మనదేశమునందు వినియోగమునకు కావలసిన రాసినితీసివేయగా, మనమేటేట 78,000,000 ఇంగ్లీషు బారువల ఆహార పదార్థముల నితర దేశముల కెగుమతిచేయుచున్నాము. మరొక విశేషమేమనగా, వ్యవసాయవృత్తినే జీవనాధారముగాగల కూలివాండ్రు సదా ఉపయోగించెడు చిన్నచిన్న చిల్లరవస్తువులయం దెవ్విధములైన మార్పులును గలుగనేరవు.

మఱియు రక్షణపన్నులు తగుమాత్రములుగ వేనిపై విధింతుమో ఆవస్తువులయొక్క ఖరీదు విశేషముగ హెచ్చదని అనుభవమువలన తేలుచున్నది.

"సాధారణముగా దేశమునం దుత్పత్తియగుచున్నవియు లేదా ఉత్పత్తిచేయుటకు వీలయినవస్తువులు, టారిఫ్ (దేశములో తయారగు వస్తువులపై విధింపబడుపన్ను) తగుమాత్రమై ఆటంకకరముగా లేనపుడు ఉత్పాదకశక్తి యభివృద్ధిజెందును. అనేకమందికి ఆవస్తువునే తయారుచేయుటయందు ఇచ్ఛజనింపజేసి పోటీని ప్రబలముచేయును. అందువలన పరదేశములయొక్క గుత్తలు నశించక మానవు. ఇంతియగాక కొన్నికొన్ని సందర్భములయందు శుల్కము విధింపబడిన వస్తువులయొక్క వెలలు సైతము తగ్గునని రాజ్యాంగతంత్రమునందొక సిద్ధాంతము కలదు.

ఆవస్తువు దేశమునం దుత్పత్తియగునది కాకపోయినను, దేశమునం దుత్పత్తిచేయుటకు వలనుపడనిది యైనను, లేదా దానిపై విధింపబడిన శుల్కము క్షామదినములయం దాపదార్థమును ఉత్పత్తిచేయుటకు ఆటంకకరమగునంత హెచ్చయినయడల, ఆపన్నుమాత్రమే వస్తువుయొక్క ఖరీదును అధికముచేయును.

అమెరికా సంయుక్త రాష్ట్రములయందును, యూరపుఖండమునందును గూడ వర్తకపన్ను విధింపబడిన తరువాత ఆవస్తువుల యొక్క ఖరీదులు హెచ్చగుటకు బదులు అనేక సందర్భములయందు తక్కువకూడ అయినవి.

మెక్కిన్లీ టారిఫు (నిరకునామా) విధింపబడిన తరువాత సదా ఉపయోగములోనున్న పదునొకండు వస్తువులయొక్క ధరలు పూర్వముకన్న తగ్గెనని 2 వ అక్టోబరు 1891 సంవత్సరపు "అమెరికను ఎకనామిస్టు పత్రిక" ఒకపట్టీని ప్రకటించినది.

"దురదృష్టవశమున, సాధారణముగా స్వేచ్ఛావర్తకామోదమువలన అపారమైన లాభము కలుగునని నమ్ము బ్రిటీషు ప్రజలును ఇంగ్లీషు రాజ్యసమితియును ఇంకనూ దేశముయొక్క యాశయములను గమనించుటలేదు."

అనుల్లంఘ్యమైన రక్షణత్వము నూనియే కదా గ్రేటు బ్రిటను, కళావాణిజ్యములయందు ప్రపంచమునందలి యెల్ల దేశములలోను ప్రాముఖ్యత గాంచుటకును, అన్ని దేశములకంటె ముందుగా మూలధనమును విశేషముగా జాగ్రతపరచి ఇతర దేశములకు పెట్టుబడి పెట్టగలుగుటకును నిలబడినది. 1846 సంవత్సరమున స్వేచ్ఛావర్తకము నామోదించుటకు పూర్వము ప్రపంచమందలి మార్కెట్లన్నియు ఇంగ్లాండుయొక్క స్వాధీనమందుండినవి. ఇంతియగాక తన బొగ్గు వ్యాపారమునందును, నేతకళయందును, ఇనుప కళలయందును రక్షణత్వము నవలంబించి వృద్ధిచేసినదగుటయేగాక ఆకళలయందు పూర్ణముగా, గుత్తనుగూడ సంపాదించగలిగినది.

ఇంగ్లండు దేశ మొక్కటియే స్వేచ్ఛా వర్తకము నామోదించిన దేశమైయున్నది. కళావాణిజ్యముల యందు ఇంగ్లండునకుగల ప్రాధాన్యము రానురాను తగ్గుచున్నదను మాట ఎల్లరకు విదితమే. మూలధనమును సర్వదేశములకు

మొదట పెట్టుబడి పెట్టినదగుటచేత, అందువలన వచ్చెడి అధికమగు వడ్డీవలననే హెచ్చుసంపద ననుభవించుచున్నది.

బ్రిటిషు సామ్రాజ్యమునందలి ఆస్ట్రేలియా, కెనడా న్యూజిలాండు దేశములు సైతము రక్షణనవలంబించి వృద్ధిజెందుచున్నవి.

అమెరికా సంయుక్త రాష్ట్రములయందు రక్షణశుల్కములు విధింపబడిన కాలములయందు కలిమి హెచ్చుగుటయు నవి త్రోపుడుచేసినపుడెల్ల వర్తకము క్షీణించుటయు దుఃఖము హెచ్చుగుటయు తటస్థించుచు వచ్చినది.

ఇంగ్లాండునందు గత నలుబది సంవత్సరములలోను, విధింప బడినపన్ను రెండింతలధిక మగుటయేగాక ఏటేట అపరిమితముగ వృద్ధియగుచున్నది. 1870,88 సంవత్సరముల మధ్య ఇంగ్లాండునందు నూటికిరువదినాలుగు రూపాయల చొప్పున, పన్ను హెచ్చయినది. అయిన, ఈకాలముననే అమెరికా సంయుక్త రాష్ట్రములయందు నూటికి పదిరూపాయల చొప్పున పన్ను తగ్గినదని మెక్కిన్లీగారు నొక్కివక్కాణించిరి.

బిస్మార్కు ప్రభువు దూరదృష్టి.

స్వేచ్ఛావర్తకము నామోదించుటవలన సంభవించెడు నష్టములనుండి, జర్మనుదేశము, బిస్మార్కు ప్రభువుయొక్క దీర్ఘదర్శిత్వమువలనను రాజ్యాంగ తంత్రనిపుణతవలనను రక్షించబడినది.

బిస్మార్కు ప్రభువిట్లు వ్రాసెను:—

"స్వేచ్ఛావర్తకము లాభకారియగుననెడి దృఢమైననమ్మకమునుగలవారమై మేమొక్కరము మాత్రమెల్లపుడు దగా పడుట కంగీకరించము. ఇతరదేశములయొక్క దిగుమతులను స్వేచ్ఛగా మాదేశమునకు రానిచ్చుటవలననే మాదేశము, పరరాష్ట్రములయందు ఉపరిగా ఉత్పత్తిచేయబడుచున్న వస్తువులకెల్ల మార్కెట్టయి (బజారై) మేమువిశేష నష్టముపొందుచున్నాము. అటుల గానిచ్చుటవలననే మాదేశముయొక్క కళాభివృద్ధికి ఆటంకముకలిగెను. ఆర్థికవిషయములపట్ల మేము బలీయులము గాకపోవుటకుగూడ ఈరాజ్యనీతియే కారణమని నానమ్మకము.

మనము కొంతకాలము పైదేశములవారికి మనపణ్యాచక్రములయందు చోటివ్వకుండ ఆపుజేసి మనజర్మను కర్మకరులకు, మనజర్మను మార్కెట్టును, జాగ్రతపెట్టుట విధియై యున్నది. శాస్త్రములయందలి కేవలసూత్రములనే పరమావధిగా గ్రహించి వాటికిప్రాముఖ్యత నిచ్చువాడను కాను; నేనెప్పుడును అనుభవమునే శరణ్యముగాగొని రాజ్యనీతియందు మార్పులొనరించువాడను. రక్షణత్వము నవలంబించియున్న దేశములు ఐశ్వర్యవంతము లగుచుండుటయు, స్వేచ్ఛావర్తకము నామోదించిన దేశములుక్రమముగా క్షీణించుచుండుటయు నేను కండ్లారజూచుచున్నాము.

ఘనతవహించిన ఇంగ్లాండుదేశము సైతముక్రమముగా రక్షణచిహ్నాల పొడచూపుచున్నయది. అలతికాలముననే

ఇంగ్లాండు తన స్వంతమార్కెట్టునయిన, తనస్వాధీనమందుంచుకొనుటకుగాను, రక్షణత్వమునే యవలంబించును. వర్తకపన్నులు తగ్గించినందువలన మన మమితవ్యయమునకు నాహుతియగుచున్నామని నాయభిప్రాయము. (రక్షణలేనిచో) కొలదికాలములో రూపరి నశించెదమేమో యనిశంక నాకు తోచెడిని."

బిస్మార్కు ప్రభువుయొక్క సముద్యమ మాదేశీయుల యామోదమును వడసెను. జర్మనీదేశము రక్షణ నవలంబించెను. ఇపుడాదేశమెంత యౌన్నత్యదశయందున్నదో చూచుచునే యున్నాము.

కొందరు ఇంగ్లీషు అర్థశాస్త్రజ్ఞుల మతము.

వర్తకమునకు స్వేచ్ఛయుండవలెననియు గవర్నమెంటువారెవ్విధమైన జోక్యమునుగలిగించుకొనగూడదనియు ప్రబలవాదముచేసిన ఏడమున్స్మిత్తు రాజ్యతంత్రజ్ఞుడు సైతము 'పరరాష్ట్రముల యంత్రకళలను మనదేశమునకు దిగుమతి కానిచ్చితిమేని స్వదేశమందలి కళలకు ప్రాయశః నష్టము గలుగుననియును, వాటిలో కొన్ని పూర్తిగ నశించుననియును, సూచించి యున్నాడు.

అన్యదేశము లేవియేని తమదేశ సరకులనచ్చటికి కెగుమతి చేయుటకు సౌకర్యము లేకుండునట్లు విస్తారము వర్తకపన్నులను విధించెనేని, ఆయాదేశములపై వాటికిసమతుల్యా [illegible] పన్నులను వేయనగునని మిల్లుగారును స్మిత్తుగారును అభిప్రాయపడిరి.

ఇండియా దేశముయొక్క కళావాణిజ్యముల విజృంభింపజేసి దేశమును సకలైశ్వర్యముల తులదూగునట్లు జేయుటకు మార్గములజూపుచు 1905 సంవత్సరమున కాశీపట్టణమున జరగిన ప్రథమ 'ఇండియా కళాసభ'యందు సర్ గిల్బర్టు మోలెస్వర్తు కె.సి.ఐ.ఇ. గారు 'ఇండియా దేశమునకు పైదేశములనుండియేగాక ఇంగ్లండునుండి సైతము రక్షణ ఆవశ్యకమని' నొక్కివక్కాణించిరి.

జపాను ఔన్నత్యము.

గతనలుబది సంవత్సరముల క్రిందటివరకు పేరుప్రతిష్టలు లేని జపానుదేశమిపుడెంత యౌన్నత్య దశయందున్నదో మనమిపుడు కండ్లార జూచుచునే యున్నాము. ప్రపంచమునందలి గొప్పరాజ్యములలో నొకటిగా జపాను శోభిల్లుచున్నయది. ఈపురోభివృద్ధికి ప్రబలకారణము రక్షణ నవలంబించి దేశముయొక్క ఫలోత్పాదకశక్తి నభివృద్ధిచేయుటవలన కలిగినదియే. ఏదేశమున కర్థప్రాబల్యముగలుగునో, ఏదేశము సర్వకళాపరిపూర్తిగాంచి భాగ్యమున కాటపట్టగునో అట్టిదేశము సకలదేశములవలన గౌరవమర్యాదలం జెందుచుండును. ఏదేశమున కళావిజృంభణ్ణముండదో, ఏదేశమందలిప్రజలు తమకు కావలసిన సర్వవస్తువులకును పరదేశముల నాశించవలసివచ్చునో, ఆదేశమున దరిద్రదేవత మూర్తీభవించి నిరంకుశాధికారముగ నేలుచుండును. కొంతకాలమునకు ఆదేశము నామమాత్రావశిష్టమగుట చోద్యముగాదు. కాన మనదేశ వాణిజ్యవ్యాపారమ్ములభివృద్ధిగాంచుటకు రక్షణాత్వావలంబనమే మనకుశరణ్యము. ఇంతకుదక్క మరివేరుదారి గాన్పించదు.

రక్షణను మనదొరతనము వారిత్తురా?

రక్షణత్వమును మనకు గవర్నమెంటువారిత్తురా ఈయరా యనువిషయము నిచ్చోటమనము జర్చించ నగత్యము లేదు. మనదేశక్షేమము నే మనసునందిడుకొని ఇండియా గవర్నమెంటువారు రాజ్యతంత్రము నడిపిరేని మనకు రక్షణనొసగుట వారికి విధియై యున్నది. మన ప్రభుత్వమువారు సైతమిప్పుడిప్పుడు మనకళాభివృద్ధికి వలయు మార్గముల నవలంబించుచున్నారు. ఇటీవల సర్ గైఫ్లీటు ఫ్రుడ్ విల్సనుగారు గవర్నమెంటువారి రివిన్యూ నిమిత్తము, వెండి, పొగాకు, కిరసనాయలు మొదలగు వస్తువులపై విధించిన శుల్కములు మనకు కొంతవరకు రక్షణనిచ్చునవిగా నున్నవి. రక్షణ పన్నులవలన గవర్నమెంటువారి రివిన్యూకూడ అధికమై, కృషి, విద్యా వ్యాప్తమునకు గావలసిన ధనమునుగూడ సేకరింప నగును.

మన మింతదనుక రక్షణత్వావశ్యకతను గూర్చి ముచ్చటించితిమి. ఇక స్వేచ్ఛావాదుల యాక్షేపణలకు సమాధానముల నీయనగును.

లీస్మిత్తు గారి వితండవాదములు.

ఇటీవల ప్రొఫెసరు లీస్మిత్తుగారను నొక ఆంగ్లేయ రాజ్యతంత్ర శాస్త్రజ్ఞుడు మనహిందూదేశమునకు విచ్చేసి 'ఇండియా వర్తకప్రశంస' యనునొక గ్రంథమును రచించెను. ఈయన బహుశ్రమ తీసికొని స్వేచ్ఛవలని లాభములను రక్షణవలన గలిగెడి యరిష్టములను విపులముగా జర్చించి, మనదేశపురోభి

వృద్ధికి స్వేచ్ఛయే శరణ్యమని సిద్ధాంతీకరించెను. ఈమహాను
భావుని ఆక్షేపణల నొక్కొక్కటిగా విమర్శింతము.

రక్షణ నొసంగుటవలన సరకులయొక్క ఖరీదు హెచ్చు
యి, వినియోజకునకు నష్టము కలిగించుట తప్ప వేరు ప్రయో
జన మేమియు లేదని వీరియుద్దేశము. అన్యదేశవస్తువులపై మనము
విధించెడు శుల్కమును, వినియోజకులు భరించవలసి వచ్చునే
గాని పరదేశస్థులు అందొక చిల్లిగవ్వనైన ఈయరని వీరిమతము.
ఏదేశమైన ఒకానొక వస్తువు నుత్పత్తిచేయుటయందు గుత్తను
కలిగియున్న యెడల ఆసరకులు ఖర్చగుటకుగాను పైదేశముల
వారు విధించిన రక్షణపన్నును ఇచ్చుకొనవలసి వచ్చును.
ఏలయన పన్నునీయనిచో, ఆసరకులు చెల్లుబడి కానేరవు.
ఇదివరకు అపరిమితముగ లాభమును సంపాదించిన దగుటచే,
ఒక్కసారిగా పైమార్కెట్లయందలి బేరమును విడిచిపెట్టలేదు.
ఇపుడు చెల్లించవలసిన పన్నుపోగా శేషించిన లాభమే చాలు
నని తలచి, వర్తకము మాను కొనుటకన్న నిదియే శ్రేయో
దాయకమని ఎంచును. అటుల జేయనినాడు తనకావస్తువు
యందు గలగుత్త నశించును. ఒకవేళ మన మన్యదేశములకు
పన్నునేల కట్టవలెనని ఆలోచించినదై వర్తకమునే మాను
కొనిన, స్వదేశకళలు ఎవ్విధమైన పోటీలులేక దినదిన ప్రవర్ధ
మానములగుట కెవ్విధమైన సందియమును లేదు. అందువలన
మరియొక లాభముకూడ గలదు. అనేక విధములగు విదేశవస్తు
వులు కారు చౌకధరలకు మనమార్కెట్లకు వచ్చుచుండుట
చూచుచునే యున్నాము. చౌకగా లభించుచున్నవను సంగతి
పరిగణించుచున్నాము. కాని సరకులయొక్క నాణ్యమును

మనమాలోచించుటలేదు. అందువలన చాలమంది నష్టపోవు
చున్నారు. రక్షణ యున్నచో ఇట్టి నాణ్యము తక్కువగల
వస్తువులు మనదేశమునకు రానేరవు.

మనము మరియొక విషయము నాలోచించవలసి యు
న్నది. లీస్మిత్తుగారు చెప్పినవిషయమే నిజమగుచో, లంకాషైరు
వ్యాపారస్తులేల మననూలు సరకులపై విధించబడియున్న
యక్సైజుపన్నులను తీసివేయుట కంగీకరించుటలేదు? ఈపన్ను
వలన గవర్నమెంటువారికి వచ్చురాబడి విశేషమాయనిన, సంవ
త్సరమునకు నలుబదిలక్షల రూపాయలు మాత్రమే. ఇది
ఇండియా గవర్నమెంటువారి మొత్తపు రివిన్యూలో ఎంత
స్వల్పమో చెప్పనవసరము లేదు.

యక్సైజు పన్నులవలని కీడు.

దేశీయ మహాజన సభలయందును, శాసన నిర్మాణ
సభలయందును మనప్రతినిధులెంత మొఱ్ఱలిడినను, మనప్రభు
త్వమువారు లంకాషైరు వర్తకుల యాశయములను మనసున
నిడికొని, ఆపన్నులను తీసివేయుటలేదు. లీస్మిత్తుగారికంటె
లంకాషైరువర్తకులే అనుభవ వేద్యులగుటచే దీర్ఘదర్శులుగా
గన్పట్టుచున్నారు. యక్సైజు పన్నులను తీసివేసినయెడల,
బొంబాయి నూలు యంత్రకళాశాలలకు రక్షణ కలుగునని
యు నేతపనులు విస్తారమై విజృంభించుననియు, అవితల యెత్తు
చున్న కొలదితమకు ఇండియా మార్కెట్టునందుగల గుత్తనశించు
ననియు తెలిసికొనిన వారలై లంకాషైరు వర్తకులంగీకరించుట
లేదు. సంవత్సరమునకు ముప్పదికోట్ల రూపాయలు విలువగల

నూలుసరకులను మనమింగ్లాండునుండి గ్రహించుచున్నాము. యక్సైజుపన్నులను త్రోసివేసి, దిగుమతి శుల్కములను నూటికైదు రూపాయల చొప్పున విధించితిమేని, అలతికాలమున మనదేశమందలి నేతపనులభివృద్ధి యగును. అందువలన మనదేశమునకు అపారమైన లాభముగలదు. మన బొంబాయి నూలు యంత్రములందు తయారగు సరకులకు చైనాదేశమొక పెద్ద మార్కెట్టు. ఇటీవల రక్షణత్వావలంబన వలన ఐశ్వర్యవంతమై తలయెత్తిన జపానుదేశము, మనకు చైనామార్కెట్టులో పోటీ. యక్సైజు శుల్కములను మన నేతపనులు చెల్లించవలసిన వగుటచే, జపాను క్రమక్రమముగా మనకంటె తక్కువ ధరలకమ్ముటకు ప్రయత్నించుచున్నది. ఈయుద్యమము, చాలవరకప్పుడే జయముగాంచినది. కాబట్టి యక్సైజుపన్నులను తీసివేయని పక్షమున కొలది కాలములో మన వశమున నుండియున్న చైనా మార్కెట్టును, జపాను దేశమునకు సమర్పించి, మీనమేషముల లెక్కపెట్టుకొనుచు కాలము గడుపవలసి వచ్చును.

దేశక్షేమము ముఖ్యమా ? స్వలాభము ముఖ్యమా ?

దేశక్షేమమునకు హెచ్చుప్రాముఖ్యత నీయవలెనా స్వలాభమునే పరమావధిగా గ్రహించవలెనా యనునదియే మాలోచనీయము. మనమేమార్గము నవలంబించిన మనదేశమభివృద్ధిగాంచునో, దానినే ప్రతిదేశభక్తుడును శరణ్యముగా గ్రహించి ప్రస్తుత వ్యయ ప్రయాసలకోర్చియైన సఫలీకృత మనోరథుడగుట కర్తవ్యము. శాసననిర్మాణ సభలయందు మన

ప్రతినిధులు ప్రారంభవిద్యను మనదేశమునందెల్లెడల వ్యాపింపజేసి, మనదేశప్రజల నజ్ఞానాంధకారమునుండి విముక్తుల జేయుటకుగాను, ప్రభుత్వమువారికి ద్రవ్యము కావలయుచో, మరియొక పన్నును విధించిన నామోదించెదమని నుడివిన సంగతి యెల్లరెరింగిన విషయమే. కాని రక్షణనిచ్చునెడల, వృద్ధియగునని తోచెడి ఎల్లకళలకును, మనము ప్రస్తుతనష్టమునకునోర్చి రక్షణనీయవలసినదే. ఏలయన మన మెద్దానిని కాంక్షించుచున్నామో, అట్టిదేశీయపురోభివృద్ధికి రక్షణయే దావలము. వినియోజకుడు కొంతవరకు నష్టపోయిన నష్టపోవును గాక! దేశక్షేమమే మనకు శ్రేయోదాయకంబు.

రక్షణత్వము నవలంబించినందువలన దేశమందలి ప్రజలకు పనిని గలుగజేయుననియెడి యాశయమెప్పుడు యుక్తియుక్తము గాదనియును, ఇండియాదేశమున నది కేవలము బుద్ధిహీనతయనియును, లీస్మిత్తుగారి రెండవయాక్షేపణ. కొన్ని కళలు, కర్మకరులే లేక మొఱ్ఱలిడుచుండ, ప్రజలకుపనులు గలిగించవలసిన యవసరమీదేశమున కాన్పించదు. లీస్మిత్తుగారిట్లభిప్రాయపడుటవలన నిజస్థితిని వారు కనిపెట్టినట్లు తోచదు. కొన్ని కళలకు కర్మకరులు దొరకుట లేదనినంత మాత్రమున, ఇండియాదేశమునందలి పనులు నిర్వహించుటకుగాను దేశమందలి ప్రజలు చాలరని వీరూహించుట కేవలదురభిప్రాయము.

మనదేశమున ప్రజకు పనిలేక పోవుటచేతనే కదా, ఎట్టి యిక్కట్టులనైన బడి, పడరాని బాధలకు సైతమునోర్చి, పై దేశములకు కూలికి పోవుచున్నారు. దేశమునందలి కర్మకరు

లకు కావలసినంతపని మనదేశమున లేదు. అయిన పూర్వాచార పరాయణులగుటచే, పల్లెలనుండి పట్నములకు కర్మకరులు చేరుటకు కొంతకాలము పట్టక మానదు. స్వల్పసంతుష్టులై, ఒకపూటకు త్రాగుటకు గంజియున్న మనప్రజలు ఉన్న యూరనే గనిపెట్టుకొని యుందురు. ఇంగ్లాండునందు వలె పట్నములం బట్టిపోరు. పూర్వము మనదేశమున అధిక యాన్నత్యముగాంచి, ఇపుడు నశించిపోయిన కళలయందలి పనివాండ్రందరు, ఆవృత్తులను వదలుకొని వ్యవసాయ వృత్తి నవలంబించి యున్నారు. అందువలన కృషినే జీవనాధారముగాగల, కర్మకరులసంఖ్య అధికమయ్యెనన్న సంగతి ఎల్లరెరింగినదే.

1880 సంవత్సరమున క్షామ బాధల నివృత్తిజేయుటకు నియోగించబడిన సభవారు ఈక్రింది యభిప్రాయము నిచ్చినారు.

“ఈ యీతిబాధలను నివృత్తి జేయుటకునై ఏయేమార్గముల నవలంబించినను, యంత్రకళలను హస్తకళలను స్థాపించుటవలనగాని మరేవిధముననైనగాని, పలువిధములగు వృత్తుల నభివృద్ధిజేసి, ప్రస్తుతము సేద్యవృత్తియం దధికమైన కర్మకరులకు, జీవనాధారముల గల్పించిన తప్ప తృప్తికరముగ నుండజాలదు.

క్రొత్తమార్గముల వేనివేని గనిపెట్టినగాని తగినంత పనిని కలుగ జేయుట కవకాశము లేదు. ఇప్పట్టున నూతన కళల స్థాపించవలెననిన రక్షణ లేనిచో కొనసాగదు. చాలకాలముక్రిందటనే స్థాపించబడి పాతుకొనియున్న కళలతో, ఇప్పుడిప్పుడు తలలెత్తబోవు కళలకు పోటీ, కేవల మసంగతము.

తనతో సమానమైన వానితో పోటీయున్న తగవులేదు గాని ప్రొఫెసరు రామమూర్తివంటి వస్తాదుతో ఒకమరుగుజ్జువాడు కుస్తీకివచ్చినయడల గెలచుట కవకాశమున్నదా? కాబట్టి రక్షణలేనిచో క్రొత్తక్రొత్తకళల స్థాపింపవీలులేదు. అటుల స్థాపించినగాని మన కర్మకరులకు తగినంత జీవనోపాధి లేదు. కానరక్షణ ఆవశ్యకము.

రక్షణ అవసరము.

రక్షణను అవలంభించుటవలన, వినియోజకులకు కొంతవరకు కష్టతరముగా నుండుననుమాట మేముకాదనము. అందువలన వారు కొంతవరకు వ్యయప్రయాసలకు నోర్చవలెనను మాటగూడ సత్యమే. దేశక్షేమము కొరకు తగుమాత్రము వ్యయప్రయాసలకు నోర్చవలెననిన నెవరు కాదనగలరు? మన ప్రభుత్వమువారు సైతమిటీవల మనకళలకు రక్షణనీయవలెనను యుద్దేశముల గనబరచుచునే యున్నారు. సాధ్యమైనంతవరకు గవర్నమెంటువారి ఉపయోగమునకు కావలసిన సకల వస్తువులను మనదేశమునందే కొనవలసినదని స్థానికప్రభుత్వముల నాజ్ఞాపించినారు. ఇంతియగాక, మనకృషి వాణిజ్యాదులను వృద్ధిచేయుటయందు గవర్నమెంటువారు వెచ్చించుచున్న ద్రవ్యము, అనేకమార్గముల ప్రజలనుండియే సేకరించబడుచున్నది. మనము చెల్లించుచున్న పన్నులవలననే ఈద్రవ్యము సమకూర్చబడుచున్నది. కానదేశీయకళలు వృద్ధినొందుటకు, రక్షణ పన్ననెడి వేరొకపన్నును గవర్నమెంటువారు విధించినచో నేమిహానియున్నది? మనమీవిధముగ నాలోచిం

పెనుపుదల, వినియోగజకులకు కష్టముగా తోచుననియెడిసంగతి కంత ప్రాముఖ్యతనీయవలసిన యగత్యముండదు. ఏలయన దేశీయకళలు వృద్ధిగాంచుటకును, ప్రభుత్వమువారి వచ్చుబడి హెచ్చుయి మనకు క్షేమకరములగుపనుల నెన్నిటినో వారవలంబించుటకు వీలలవడుటకును, రక్షణ పన్నులను గూడ నొకపన్నుగ సేభావించి మనమువహించుట యవశ్యకర్తవ్యమై యున్నది.

వాణిజ్య వ్యాపారములయం దెవ్విధమైన నిర్బంధము లేకుండ, స్వేచ్ఛయేయుండి తీరవలయునని నిష్కర్షగావాదించు, స్వేచ్ఛానురక్తులుసైతము, శైశవ దశలయందున్న కళలకు రక్షణ నీయుట యవసరమని అంగీకరించి యున్నారు. వీరిలో జాన్ స్టూఆర్టు మిల్లు అనునొక ఆంగ్లేయరాజ్యతంత్రశాస్త్రజ్ఞుడు విస్తారము మెప్పువడసినవాడు. రక్షణలేనిచో, అన్యదేశకళల పోటీలవలన అభివృద్ధిగాంచుటకునై పెనగులాడుచున్న కళలు నశించునను సంగతి నిర్వివాదాంశము. మనదేశమందలి కళలన్నియు ప్రస్తుతము శైశవదశయందే యున్నవి. కాన రక్షణ ఆవశ్యకము.

దీనికి స్వేచ్ఛావాదులొక యాక్షేపణను జేయుచున్నారు. ఒకప్పుడు శైశవదశయందున్నదని యెంచి మనము రక్షణ నిచ్చుచో ఆకళ ఎల్లప్పుడు శైశవదశయందే యుండుననియు, ఆకళ బాగుగా వృద్ధిజెందిన తరువాతనైనను మనము రక్షణ తీసివేయుదమన్న అందువలన ధనికులైనవారు అడ్డు పెట్టుచుందురనియును, ఒక కళకు రక్షణ నొసంగుచో దేశము

నందలి సర్వకళలకు రక్షణ నీయవలసి వచ్చుననియును, అటుల జేయుటవలన వినియోగజకులకును దేశమునకును గూడ నష్టము గలుగుట తప్ప వేరులాభము లేదని వీరి మతము. ఈవాదమున కొంతవరకు సత్యములేక పోలేదు. రక్షణవలన నష్టములును గలవు. ఏమార్గము నవలంబించుట వలన మనదేశము సర్వకళా పరిపూర్తిజెంది ఐశ్వర్యోన్నతి గాంచుననుసంగతి మన మాలోచించ వలసియున్నది. ప్రస్తుత నష్టములెన్నియున్నను, రక్షణ లేనిచో మనకళలు వృద్ధినొందవనుసంగతి ఎల్లరు నెరింగిన విషయమే!

మనకళాభివృద్ధికి రక్షణయొక్క అవసరము లేకుండ వేరొండుమార్గమును, స్వేచ్ఛానురక్తులు చూపిరేని ఆమోదించుటకు మాకెవ్విధమైన యభ్యంతరమును లేదు. అదిమాకుపరమ సమ్మతము. వారితరమార్గమును సూచించగలుగుదురా? అటుల జేయనినాడు వృథాయాక్షేపణల వలననేమి ప్రయోజనము. ఏదైనకార్యమును నిర్వహించుట కష్టముగాని ఆక్షేపణలను జేయుట చాలసులువు. మన మేదేశచరిత్రలను జదివినను రక్షణలేక ఒక్కకళయును వృద్ధిజెందినట్లెచ్చటను గానరాదు. స్వేచ్ఛావాదమునకు జన్మభూమియగు ఇంగ్లండు దేశముసైతము అనుల్లంఘ్యమైన రక్షణనూనియే ఇంతఘనత వహించెననుసంగతి అందరెరింగినదే! అయినరక్షణ నాచంద్రార్కముగా మనదేశము కలిగియుండవలయునని మామతముకాదు. కళాపరిపూర్తియగు నంతవరకుమాత్రమే రక్షణను దాల్పవలెనని వెనుక చెప్పియేయుంటిమి. అటుపిమ్మట మేమును ప్రబలమైన స్వేచ్ఛావాదమును చేయుటకు సంసిద్ధముగా

నున్నాము. కాబట్టి ఆర్థికవిషయముల నాలోచించినను, జాతీయ గౌరవము నాలోచించినను, రక్షణలేనిది మనదేశము భివృద్ధి జెందజాలదు.

అన్యదేశీయులయొక్క పోటీలేనినాడు మనప్రజలు సోమరిపోతులై, రక్షణయున్నదగదా మనకళల కేయభ్యాసమును విఱ్ఱవీగి చెడిపోదురనియును, ఆకారణమువలన క్రమక్రమముగా కళలుసైతము క్షీణించుననియును మరియొకయాక్షేపణ. ఇది కేవల పరిహాసాస్పదముగాని వేరొండుగాదు.

ఏమన, మనకళలయందు కళయున్నగదా ఆకళ క్షీణించు నని మనము భయపడవలెను. అట్టికళయే లేనప్పుడు మనమేల జడియవలెను? ఇంతియగాక రక్షణనుగలిగియున్న జపాను, జర్మనీ, ఆస్ట్రేలియా, కెనడా దేశస్థులు సోమరిపోతులుగా నుండిరో, శౌర్యధైర్యములను కలిగియున్నారో మనముచూచుచునేయున్నాము. కావనిదియొక పిచ్చియాక్షేపణ. దీనిని ఖండించుటకునై మనమంతగా శ్రమపడ నగత్యము లేదు.

మనకళలు రక్షణయున్నగాని వృద్ధిజెందనేరవనియును, కేవలఆర్థిక సంపదకేగాక జాతీయగౌరవమునకు సైతము కళా ప్రపంచమున పరరాష్ట్రములనుండి స్వాతంత్ర్యమున్నగాని వలనుపడదనియును మనమింతదనుక చర్చించితిమి.

రక్షణనొసంగునెడల అన్నికళలును వృద్ధిజెందును. అయిన ఏకళకు రక్షణనిచ్చునెడల మనకునష్టము లేకుండ వృద్ధియై దేశమునకు క్షేమకరముగనుండునో దానినిగూర్చి నిర్ణయింతము.

ఏటేట మనమింగ్లండు దేశమునుండి సుమారు ముప్పది కోట్లరూప్యముల విలువగల నూలుసరకులను గ్రహించుచున్నాము. యక్సైజుపన్నులను త్రోపుడుచేసి నూటికయిదు రూపాయల చొప్పున ఇంగ్లండునుండివచ్చెడి బట్టలపై శుల్కముల విధించితిమేని, మనదేశమునందు ఖర్చుకు గావలసిన బట్టలనెల్ల మననూలుయంత్రములే తయారుచేయుటకు వీలలవడును. ఇందువలనప్రజలకును దేశమునకునుగూడ చాలలాభమున్నది. యక్సైజుపన్నులను త్రోపుడుచేయుటవలన, చీనా జపాను దేశములయందు మనకుగల నూలువర్తకము సైతము హెచ్చగును.

మనఖర్చుకు కావలసినంత ప్రత్తిమనదేశమున పైరగుచున్నది. రక్షణనుకలవారమై అన్యదేశీయులపోటీని లేకుండజేసితిమేని మనము వస్త్రములకొరకు గ్లాస్గోనుగాని, మ్యాంచెస్టరునుగాని, ప్రార్థించవలసిన యవసరముండదు. తొలుదొల్తమనకు నాణ్యమైన వస్త్రములు లభించక పోవచ్చును. మానరక్షణార్థముగదా వస్త్రధారణ! దేశక్షేమము కొరకు కొంతకాలము మోటైన వస్త్రముల ధరించవలసి వచ్చినను మనము సహించుట యవశ్యకర్తవ్యము.

ప్రతిసంవత్సరమును కోట్లకొలది రూప్యములవిలువ గల చర్మములను మన మన్యదేశములకు నెగుమతి చేయుచున్నాము. రక్షణనిచ్చిన మనతోళ్ళవర్తకము వృద్ధికాకపోదు. పట్టుపనులకును ఉన్నిపనులకును కాగితపు పనులకునుగూడ

సాధనసంపత్తి మనదేశమునగలదు. ప్రభుత్వమువారు రక్షణ నొసంగకుండుట, ఒకటియే వీటిపురోభివృద్ధి కాటంకము.

ఇంగ్లీషు మార్కెట్టునందు ఖర్చగుచున్న తేయాకు చాలవరకు చీనాదేశమునుండి ఎగుమతి చేయబడుచున్నది. కనుకదానిపై పన్నువిధింప బడెనేని మనదేశపు తేయాకు ఇంగ్లాండునందు హెచ్చుగాఖర్చగును.

చుట్టలును సిగరెట్లును పరరాష్ట్రములనుండి అపరిమితముగా మనదేశమునకు వచ్చుచున్నవి. రక్షణ నవలంబించితిమేని మనపొగాకువర్తకము విస్తారముగా అభివృద్ధియగును.

గాజుపనులను రంగులను అగ్గిపెట్టెలనుకూడ రక్షణను ధరించి మనదేశమున తయారుచేయ గలుగుదుము.

మనదేశీయ పురోభివృద్ధికి స్వేచ్ఛయేశరణ్యమని వాదించిన ప్రొఫెసర్ లీస్మిత్తుగారు సైతము ఇనుపపనులు రక్షణను దాల్చుటవలన హెచ్చుప్రాముఖ్యతను వడయగలవని వక్కాణించిరి.

లోహప్రపంచమునందు మనదేశము రక్షణనుదాల్చి సంపూర్ణ స్వాతంత్ర్యమును గాంచగలుగునని బాల్ అనునొక ఆంగ్లేయశాస్త్రజ్ఞుని యభిప్రాయమును ఇదివరకే సూచించియున్నాము.

కర్జనుప్రభువు గవర్నరు జనరలుగానుండు కాలమున, విదేశములనుండి ప్రభుత్వసహాయమువడసి దిగుమతిచేయబడుచున్న చక్కెరపై ఆసహాయమునకు తుల్యమగు పన్నులు

విధించబడెను. ఏటేట పదికోట్లరూప్యముల విలువగల చక్కెరను మనము విదేశములనుండి గ్రహించుచున్నాము. దీనిపై శుల్కమును విధించితిమేని కొంతవరకు పోటీతగ్గి, మనదేశమున తయారగు చక్కెరకు రక్షణగలుగును. ఈచక్కెరపై పన్నువిధించుటవలన గవర్నమెంటువారి వచ్చుబడిసైతము అధికమగుటకు వీలున్నది. ఎన్నియో క్షేమకరములగు పనులను గవర్నమెంటువారు ద్రవ్యలోపముచే పూనుకొనుటకు వీలులేక యున్నది. ప్రారంభవిద్యా వ్యాప్తియు, కృషికివలయు నీటిని సరఫరాచేయునిమిత్తము క్రొత్తక్రొత్త వాగులను గనిపెట్టుటయు, నదీప్రవాహములకు ఆనకట్టలనుగట్టి క్రొత్తక్రొత్త నీటికాలవలను త్రవ్వించుటయు మొదలగు పనులకు నపారమైన ధనముగావలసియున్నది. నేలపన్నువృద్ధిచేయుద మనిననది ఇదివరకే తలమునిగి, తాటిప్రమాణమై యున్నది.

గనుక దిగుమతిపన్నులను విధించుటయే ప్రభుత్వమువారికిని మనకునుగూడ చాలసౌకర్యము. గవర్నమెంటువారి రాబడినిమిత్తము విధింపబడెడు పన్నులనినచో స్వేచ్ఛావాదులేయభ్యంతరమును చెప్పజాలరు. ఈమార్గమును మనప్రభుత్వమువారవలంబించిరేని, తమవచ్చుబడి హెచ్చగుటకును మనకళలభివృద్ధి యగుటకునుగూడ వీలున్నది. ఈసంగతిని మనప్రభుత్వమువారు బడ్జెటును తయారుచేయునపుడు గమనించవలసియున్నది. పైదేశములనుండి వచ్చువస్తువులపై ఇదివరకున్న పన్నులుగాక నూటికయిదు రూపాయలవంతున హెచ్చింపబడవలెను.

బియ్యముపై ఇదివరకు మన గవర్నమెంటువారు ఎగుమతిపన్నును విధించియే యున్నారు. జనుము, గోగునారల (జ్యూటు) పై సైతము శుల్కమును విధించుటయవసరము. ఈజనుమునందేమి, ఇతర పచ్చిదినుసుల యందైననేమి, మన దేశమునకు గుత్తకలదు. మనమువిధించు పన్నులను చెల్లించి తీరవలయును. లేదావారి వ్యాపారముల పూర్తిగగట్టి పెట్టుకొనవలెను. వారేమిచేసినను, మనకుసుకరమే.

ఆహారపదార్థములను మనమపారముగా దేశమునందు కలిగి యుండుటచే, మనమే దేశీయులకును జడియనగత్యము లేదు. వారేమనల నాశ్రయించవలసియున్నది. కాన కళాభివృద్ధికిని దేశక్షేమమునకును రక్షణయావశ్యకము. ఇంతకు దక్క వేరొండుప్రాపులేదు. మనదేశముకూడ కళాపరిపూర్తి గాంచినగాని మనజాతీయగౌరవమునిలచుటకష్టము. బిస్మార్కు ప్రభువు నుడివినట్లు, కొంతకాలమునకు నామమాత్రావశిష్టులమగుదుమేమోయని భయము తోచుచున్నది. ప్రభుత్వము వారుమనకట్టిదుస్థితి కలుగకుండ రక్షణనవలంబించి సంరక్షించవలసియున్నది.

ఇండియా దేశము ; సామ్రాజ్య సపక్షభాగ సమస్య.

సామ్రాజ్య సపక్షభాగ సమస్యయననేమి? బ్రిటిషు సామ్రాజ్యమునకు జెందిన సకలరాష్ట్రములయొక్క వాణిజ్య పరిశ్రమలసమస్య. ఈసామ్రాజ్యమునందు కెనడా, ఆస్ట్రేలియా న్యూఫౌండులాండు మొదలగు అధినివేశములును ఆశ్రయ దేశమగు మన ఇండియాదేశమును కలవు. సూర్యుడస్తమించని ఈమహాసామ్రాజ్యమున, రక్షణత్వమును అనుల్లంఘ్యముగపూనిన జర్మనీ అమెరికా రాష్ట్రములయొక్క సరకులు ఖర్చగుచుండుటయు ఇంగ్లాండు దేశమునందలి వ్యాపారములు సన్నగిలుచుండుటయును ఆంగ్లప్రజలు కొందరు గమనించి యున్నారు. పార్లమెంటునందలి రెండుకక్షులలోను లిబరలు కక్షువారు స్వేచ్ఛావర్తకము ఉండితీరవలయు ననెడివారు. రెండవకక్షువారు ఏదోఒకవిధమైన రక్షణయున్నగాని దేశమునందలి వాణిజ్యపరిశ్రమలు ఉచ్ఛదశయందుండుటకు బదులు జీర్ణదశకు వచ్చుననెడి అభిప్రాయమును కలవారు. ఈరెండు కక్షులవారును తమతమ ప్రత్యేకమతములు ఇంగ్లాండు దేశీయౌన్నత్యమునకు దావలములని సంపూర్ణమైన నమ్మకమును కలవారు. ఎవరిమతమును వారు జనరంజకముచేసి దేశమునుద్ధరించవలయునని ఆతురతతో నుందురు. స్వేచ్ఛావర్తకమును గురించియు, రక్షణనుగూర్చియు మాచదువరులీవరకు పూర్తిగ గ్రహించి యుందురు.

సామ్రాజ్య సపక్షభాగ సమస్య యననేమి ?

ఇక సామ్రాజ్యసపక్షభాగ సమస్యయనిన నూతన విషయముకాదు. రక్షణపద్ధతియందు ఇదియొక సాంప్రదాయము. దీని ముఖ్యోద్దేశమేమనిన, బ్రిటిషు సామ్రాజ్యమునందలి ఎల్లరాష్ట్రములును ఆయాదేశములయందు తయారైన, అపక్వపదార్థ సంచయమునకేగాక యంత్రకళలు, హస్తకళలు మొదలగు సర్వకళలకును అన్యదేశములనుండి వచ్చెడి సరకులకంటె ప్రాముఖ్యతనీయుట. ప్రాముఖ్యతనీయుటయనగా, ఎగుమతిపన్నులను దిగుమతిపన్నులను విధించుటలో, ఇతర దేశముల దినసులకంటె బ్రిటిషు సామ్రాజ్యమునందలి సరకులయెడల సాదరభావమును గనబరచుట. ఇందులకొక యుదాహరణము:—విదేశవస్తువులపై నూటికి 10 వంతున పన్ను విధించినయెడల, సామ్రాజ్య రాష్ట్రములయందలి అదేసరకుపైని నూటికి మూడవవంతో నాల్గవవంతో, పన్నునువిధించుట. ఇటుల జేయుటవలని లాభమేమనగా, విదేశవస్తువులు ఖర్చగుటకుబదులు, సామ్రాజ్యమునందలి సరకులే హెచ్చుగఖర్చగును. అందువలన విదేశములకుపోవు లాభమంతయు, సామ్రాజ్యమునందే నిలిచియుండుట కవకాశము కలుగుచున్నది.

విదేశవస్తువులపై విధించబడినపన్ను అధికమగుటచే, చౌకధరలకు అమ్ముటకు వారికి వీలు అలవడదు. అందువలన సామ్రాజ్యమునందలి వస్తువులతో పోటీకి ఆగలేకపోవుట్ట తటస్థించును. ఆపద్ధతిని అవలంబించుట వలన సామ్రాజ్యము యొక్క ఆర్థికసంపద ఇంకను విరివియగునని ఈమతముయొక్క అభిప్రాయము.

యుద్ధ ఆంతరంగికసభ.

ఈసమస్యనుగూర్చి ఇపుడుచర్చించవలసిన అగత్యమేమి కలిగెనని కొందరు ప్రశ్నించవచ్చును. 1917 సం॥ ఏప్రియలు నెలలో ఇంగ్లాండుదేశమున సామ్రాజ్యయుద్ధ ఆంతరంగిక సభ సమావేశమయ్యెను. ఈసభకు అధినివేశనములనుండి ప్రతినిధులు విచ్చేసిరి. మన ఇండియాదేశమునకు ఇండియా కార్యదర్శి యగు ఛేంబర్లేనుగారే ప్రతినిధి. అధినివేశములనుండి ఆరాష్ట్ర ప్రతినిధులు సభకువిచ్చేయగా, ఇండియాదేశమునకు మాత్రము అట్టి ప్రజాప్రతినిధులను పంపుగౌరవ మబ్బలేదు. మనకార్యదర్శిగారికి సలహానిచ్చుటకుగాను ఇండియా దొరతనమువారు సర్ జేమ్సుమెష్టను, (సంయుక్త రాష్ట్రముల గవర్నరు) సర్ సత్యేంద్ర ప్రసన్నసింహా, బికనీరు మహారాజా గార్లనుపంపిరి. ఈసభ యుద్ధానంతర వాణిజ్యవ్యాపార సమస్యలను చర్చించుటకుగాను ముఖ్యముగా సమావేశమైనది. ఈసమావేశమునందు చర్చించబడిన ఇతర విషయములనుగూర్చి మేమిచట వ్రాయుబనిలేదు. మనదేశమునకు సంబంధించు ఒకగొప్పతీర్మానము నొకదానిని ఇచ్చటపొందుపరచవలసి యున్నది. ప్రజాప్రతినిధి సభయందు బోనరులాగారిట్లు ప్రకటించిరి:—సామ్రాజ్యమునందలి ప్రతిరాష్ట్రమును, మిత్రమండలివారి వృద్ధినికూడ గమనించుచు, సామ్రాజ్యమునందలి ఇతర భాగములయందు ఉత్పత్తికాబడు అపక్వపదార్థ సంచయమునకును, యంత్రకళలకును హస్తకళలకును, అనుకూలములగు షరతులను ఏర్పరచి సౌకర్యమును కలుగజేయుట పాడియనెడి ముఖ్యసూత్రమును

సామ్రాజ్యయుద్ధ ఆంతరంగికసభవారు ఏకగ్రీవముగా ఆమోదించి యున్నారు.

మన దొరతనమువారు పంపినమెస్టను, సింహా, బికనీరుమహారాజు, ప్రజాప్రతినిధులుకారు. ఆసభయందు మనపక్షమున అంగీకారమును తెల్పినది, అప్పటి ఇండియాకార్యదర్శియగు ఛేంబర్లేనుగారే కాని భారతీయులు ఎవ్వరును లేరు. మనదేశమునకు సంబంధించిన వాణిజ్యవ్యాపార సమస్యయందు, ప్రజాప్రతినిధులు ఎవ్వరునులేకయుండ తీర్మానములు గావింపబడెను. ప్రజాప్రతినిధులు లేకపోయినను సింహా, బికనీరుమహారాజవార్లనైన వారి అభిప్రాయములను అడిగినట్లు తెలియరాదు. వీరు ఇంగ్లాండునందుచేసిన ప్రసంగములలో ఈవిషయమునుగురించి ఎచ్చటనుకానరాదు. ప్రతినిధులనురావించి వారిసలహాను గైకొనకుండ, దేశపురోభివృద్ధికి సంబంధించిన సమస్యలనుచర్చించి తీర్మానములను చేయుటమాత్రము న్యాయముకాదు.

ఈ మహాసంగ్రామము ఇంగ్లాండునందలి ఎన్నియో ఆర్థికన్యాయములను, పరిపాలనా తంత్రములను చెల్లాచెదరు చేసినది. ఈసభవారు తీర్మానించిన మాత్రముననే, ఇంగ్లాండునందలి ప్రజలు తమసానుభూతిని ఈసమస్యకు నొసంగుదురాయనుసంగతి ముందు తేలవలసియున్నది.

సామ్రాజ్యసపక్షభాగ సమస్యయొక్క చరిత్రము.

1902 సం॥ న ఛాంబర్లేనుగారు తలపెట్టిన మహోద్యమము నేటికి ఫలోన్ముఖమునకు వచ్చినట్లున్నది. బ్రిటిషు ప్రజల

యందు పూర్వముకంటె ఇపుడు ఈసమస్యయందు సాదరభావము హెచ్చుగుచున్నట్లు తోచెడిని. ఇండియాదేశముయొక్క విదేశ వ్యాపార బాహుళ్యమును, ప్రాముఖ్యతను కొన్ని సమయములయందు బాగుగ కనిపెట్టినట్లు తోచుటలేదని అధికారవర్గమునకు జేరిన వాణిజ్యపార విమర్శకుడు వ్రాయుచున్నాడు. ఇండియా దేశముయొక్క అన్యదేశీయవర్తక సంబంధమందు ఇండియాదేశముయొక్క ఆశయములను గమనించుట బహు అరుదు. వర్తకవ్యాపార విషయములయందు ఆంగ్లేయ రాజ్యతంత్రజ్ఞులచే ఇండియాదేశము యొక్క ప్రత్యేక వ్యక్తిత్వము ఎన్నడును గుర్తించబడినటుల కానరాదు. యుద్ధానంతర వ్యాపార సమస్యలంగూర్చి, ఇంగ్లాండు దేశమున నెన్నియో సంఘములును సభలును చర్చించుచుండ, ఇండియావర్తక సమస్య విడిచి పెట్టబడుట కడుంగడు శోచనీయము. హాలెండు కమీషనువారు ఈసమస్యనుగూర్చి అభిప్రాయము నొసంగరాదని తీర్మానించబడెను. వాణిజ్యసంఘములకును, వర్తక సమితులకును ఇండియాదొరతనమువారు జారీ చేయించిన ఉత్తరములలో ఇండియావర్తక సమస్య విషయమై తామేమియు అభిప్రాయము నీయ పనిలేదనియును, ఆసమస్య సామ్రాజ్య ప్రభుత్వమువారే నిర్ణయించెదరనియును స్పష్టముగా తెలియపరచిరి. ఈదేశసమస్యలు, పరోక్షమునందు, దేశప్రజల ఎరుకలేకయే చర్చించబడి సామ్రాజ్యప్రభుత్వమువారేమార్గము నవలంబించెదరో, ఈదేశముకూడ దానిని చేతులు మోడ్చుకొని ఆమోదించవలసినదిగా నున్నది. ఇట్టి నీతి న్యాయము కాదని చెప్పక తీరదు.

ప్రథమమున 1903 సం॥ న సపక్షకరమైన పన్నులను గూర్చి ఇండియాదొరతనమువారు, ఇండియాదేశమునకు ఏ మాత్రము లాభకరముగ నుండునో చర్చించవలసిన అగత్యము కలిగెను. అప్పటి ఇండియా కార్యదర్శియగు హామిల్టను ప్రభువు, అధినివేశముల సభయందు సపక్షకరమైన పన్నులను గూర్చి ఆమోదించినట్లును, ఆతీర్మానమును ఆచరణములోనికి గొని వచ్చుటవలన ఇండియాదేశమునకు ఆనీతి ఎటుల పరిణమించునో మీ అభిప్రాయముల నీయవలసినదనియు ఇండియాదొరతనము వారికొక తంతినంపిరి. స్పష్టముగా ఈసరణిని మేము ఆచరణములోనికి గొని రావలయునని మాయుద్దేశ్యముకాన, మీ అభిప్రాయమేమని, మన దొరతనమువారు కోరబడలేదు.

తమ కొసంగబడిన సమాచారము చాల అస్పష్టముగ నున్నను, ఈన్యాయమును పాటించుటవలన ఇండియాదేశమునకు లాభకరమా నష్టదాయకమా అనుసంగతిని విపులముగ చర్చించిరి. ఇండియాదేశము అధినివేశములతో పాటు ఈసీతిని పాటించుట యుక్తమా అయుక్తమా అను సందర్భమున ఇండియాగవర్నమెంటువారు రెండువిషయములను చర్చించిరి. అందుమొదటిది—స్వతంత్రపరిపాలనమును గలిగిన అధినివేశములతోపాటు సమానహక్కులతో ఇండియా, ఈసమస్యను పాలించుట. ఒకప్పుడవసరమగుచో ఇంగ్లాండునుండియు బ్రిటిషు సామ్రాజ్యమునుండియు దిగుమతి కాబడు వస్తుజాలముపై, స్వదేశమునందలి సరకులకు కొంతవరకు రక్షణ నిచ్చునట్లుగా పన్నులను విధించుచు, సాధ్యమైనంతవరకు తన పరిస్థితులను బట్టి వీలుకలుగునపుడెల్ల సామ్రాజ్య వ్యాపారమునకు అన్య

దేశ దినుస్సులకన్న ప్రాముఖ్యత నిచ్చుటకు ఇష్టపడుట. ఈగత్యంతరమును సామ్రాజ్య ప్రభుత్వము వారామోదించినచో చాల శ్రేయోదాయకమని చెప్ప నక్కరలేదు. బ్రిటిషు దొరతనము వారు ఈస్వతంత్రమును ఈయరని ఆలోచించినవారై, ఇండియాకు లాభకరమయ్యును, దీనిని గురించి యోచించుటమానిరి. ఈపద్ధతిని త్యజించుచు ఇండియాదొరతనమువారు తమ భావమును ఇటుల వెలిపుచ్చిరి. "పూర్వపు అనుభవమును బట్టి చూడగా, ఇండియాదేశముయొక్క వాణిజ్యవ్యాపార సమస్యల నెపుడు జర్చించినను హిందూదేశముయొక్క హితమునే, ఎన్నడును ఆలోచన చేయుటలేదు. ఇంగ్లాండునందలి కొందరు వ్యాపారస్థుల లాభమునే పరమావధిగ గ్రహించుచున్నారు. హిందూదేశమునందలి కళలకు రక్షణ ఆవశ్యకమైయున్నను, లేదా ఇప్పుడు కోరబడినను, ఆరక్షణ విధానములు ఇంగ్లాండు దేశమునుండి ఈదేశమునకు వచ్చు దిగుమతులను విస్తారముగా బాధించును. కాని అన్యదేశములనుండి వచ్చుదిగుమతులను అంతగా బాధించజాలవు. అన్యదేశ దిగుమతులపై ఇంగ్లాండు నుండి వచ్చెడి దిగుమతులకంటె ఎక్కువ పన్నులను విధించినను, ఇండియాదొరతనమువారు పైని పేర్కొనబడిన రక్షణ పద్ధతిని అవలంబించినయెడల లంకషైరు వ్యాపారస్థులును డండీ వ్యాపారస్థులును అట్టి ఏర్పాటును అంగీకరింతురని గాని లేక బ్రిటిషు ప్రభుత్వమువారీ న్యాయమును ఆమోదించెదరని గాని మేమూహించ జాలము. కావున ఈగత్యంతరమును విడిచిపెట్ట వలసి వచ్చినది.

ప్రస్తుతము అమలులోనున్న వానితో సమముగ గాని అంతకన్న తక్కువగాగాని ఇంగ్లాండునుండియు అధీనదేశములనుండియు వచ్చెడి సరకులపై రెవిన్యూకుగాను దిగుమతి పన్నులను విధించి, అన్యదేశసరకులపై నూటికి 25 వంతున ఇప్పుడున్న పన్నును హెచ్చుచేయుట రెండవ గత్యంతరముగా యోచించబడినది. ఈవిధానమును ఆమోదించినచో ఇంగ్లాండునకు విశేషలాభము కలదుగాని ఇండియాదేశమునకు చూడ లాభమునకు బదులు విస్తారము నష్టము సంభవించునని గవర్నమెంటు వారభిప్రాయపడిరి. బ్రిటిషు వస్తువుల యెడల సాదరభావమును గనబరచి సపక్షకరమైన పన్నులను విధించుటవలన, అన్యదేశములు తమ కోపమును దీర్చుకొనుటకునై ఇండియాదేశమునుండి ఎగుమతికాబడు పదార్థ సంచయముపై అమితముగ పన్నులను విధించెదరను సంగతిని అప్పటిరాజస్వ మంత్రియగు సర్ ఎడ్వర్డు లాగారు గ్రహించి ఈపద్ధతి లాభకరము గాదని ఖండితముగా వాక్రుచ్చిరి.

సపక్షకరమైన పన్నులను మనము విధించుటవలన వాటికి పోటిగా ఎగుమతిపన్నులు అన్యదేశములచే విధింపబడును. అందువలన ఇండియాయొక్క ఎగుమతివర్తకము విశేషముగా హానిజెందకమానదు. అటుల జరగినచో రాజస్వమునకు చాలనష్టము. పూర్వము వెండి కారు చౌకగానుండుట చేత మనరూప్యముయొక్క విలువ స్థిరముగానుండక గడ్డియకొకకేత్రిని పరిణమించుచుండెడిది. రూప్యమునకు 16 అణాలు విలువగాక 10 అణాలు, 8 అణాలుకూడ అగుచుండెడిది. సవరనులయొక్క విలువ అందువలన అపరిమితముగ హెచ్చుచుండెడిది. అందువలన, సీమఖర్చులకునై ఏటేట ఇండియా సుమారు 20 మిలియన్ల పౌనులు పంపవలసి వచ్చుటవలన, ఇంగ్లాండునకు సవరనులంపుటకు ఎన్నియోరూప్యములు నష్టమువచ్చుచుండెడిది. కర్జనుప్రభువు సవరనుకు 15 రూప్యములు మూల్యమని నిర్ణయించెడు దనుక, ఇండియా రాజస్వము చాల విప్లవస్థితియందుండుచు వచ్చినది. తిరిగి, అట్టిసందిగ్ధావస్థ తటస్థించునేమోయని, ఇండియా దొరతనమువారు భయపడిరి.

సమస్యనంతయు చక్కగ చర్చించినవారై తమ అభిప్రాయములను ఈవిధముగా వ్యక్తీకరించిరి :—

(1) సామ్రాజ్యసపక్షభాగమతముయొక్క అవలంబన అవసరము లేకుండగనే, ఇండియాదేశము ఎగుమతులయందును దిగుమతులయందును, విశేషవ్యాపారమును చేయుచున్నది. కాన దీని యావశ్యకత అంతగా కానరాదు. (2) ఒకవేళ ఈ సమస్య ఆర్థికన్యాయములనుబట్టి ఆలోచించుటవలన అవసరమైనచో, సామ్రాజ్యమునకు ఇండియాదేశ మొసంగు సహాయము బహుస్వల్పముగాని అధికమేమియు లేదు. ఇందుకు ప్రతిఫలముగా ఇండియాదేశమునకుగలిగెడి లాభము చాలతక్కువ. లాభముమాట అటుండ విశేషనష్టమును పొందగలదు. (3) అన్యదేశములవారు మనసరకులపై విధించెడు పన్నులవలన, మనరాజస్వమంతయు చాలవరకు నష్టమును జెందకమానదు. ఈపద్ధతిని అవలంబించుటవలన ఈ నష్టము లన్నిటికిని ఓర్చి రాజ్యతంత్రమును నిర్వహింతమన్నను, ఇకముందైనను లాభ

కారిగానుండునని మాకు పొడగట్టుటలేదు. కాన నూతనమార్గ మునవలంబించుట మాకు సహేతుకరముగ కానరాదు.

ఈ జవాబుతో అప్పటికి ఈ సమస్య విరమించినది. 1913-వ సం॥ వరకు ఈసంగతిని ఇండియా గవర్నమెంటువారు తలపెట్టనవసరము కానరాలేదు. నల్లమందునుండివచ్చెడి ఆదాయము, బ్రిటిషుదొరతనమువారు చీనా ప్రభుత్వమువారితో చేసికొన్న ఒడంబడికవలన తగ్గిపోవునని గ్రహించినవారై, సపక్షకరమైన పన్నులను విధించినచో అధినివేశనములకును, ఇంగ్లాండునకును, హిందూదేశమునకునుగూడ లాభకరముగనుండునుగాన, ఆపద్ధతిని అవలంబింపుడని సామ్రాజ్యశాసన నిర్మాణసభయందు మధ్యపరగణాల ప్రతినిధియగు సర్ గంగాధర చిట్నవీసుగారు ఒకతీర్మానమును ఉపపాదించిరి. అప్పటి కోశాగారమంత్రియగు సర్ గైఫ్లీటువుడ్ విల్సనుగారు ఈతీర్మానమునవలంబించుటయందలి నష్టములను స్పష్టముగా శాసననిర్మాణసభయందు నొక్కివక్కాణించిరి. అంతటితో నేటివరకు ఈ ప్రశ్న తిరిగి ప్రజలమనముల నాకర్షించలేదు. సామ్రాజ్య యుద్ధ ఆంతరంగిక సభవారివలన, ఈసమస్య, భిన్నాభిప్రాయములు ఏమియులేకుండ అంగీకరింపబడినందున మనమీవిషయమునుగూర్చి వివరముగా విమర్శించవలసియున్నది.

ప్రస్తుతస్థితి.

ఇండియాయందలి అన్యదేశవర్తకముయొక్క విస్తీర్ణతను బట్టి ఈసమస్యను ముందు చర్చింతము. ముందుగా దిగుమతులనుబట్టి యోచింపనగును. ఇండియాకు వచ్చెడి దిగు

మతులు చాలవరకు యంత్రకళలును హస్తకళలును అయియున్నవి. ఎగుమతులన్ననో ముడువంతులకుపైగా అపక్వపదార్థసంచయము. 1906-వ సంవత్సరము మొదలుకొని 1911 నకు అంతమైన అయిదు సంవత్సరములలోను నూటికి 64-వ వంతు సుమారుగా ఇంగ్లాండునుండియే సరకులు దిగుమతికాబడినవి. ఇతరవిదేశముల సరకులు చాలతక్కువ. జర్మనీ నూటికి నాల్గవవంతును, బెల్జియము నాలుగవవంతును ఆస్ట్రియా, హంగేరీ, అమెరికా సంయుక్తరాష్ట్రములు ప్రత్యేకముగ చెరి మూడవవంతును, ఇతరరాష్ట్రములు అంతకన్న తక్కువగను మనదేశమునకు సరకులనంపినవి. ఈ దేశమునకు దిగుమతి అయిన పరిశ్రమలలో చాలభాగము నూలుసరకులే. 1908-9 సం॥ ముతో అంతమైన మూడు సంవత్సరములలోను సాలుసకు సుమారు 67-వ వంతు నూలుసరకులే దిగుమతి అయినవి. స్వదేశమునకు వచ్చెడి నూలునందును, నూలుసరకులయందును ఇంగ్లాండుదేశము గుత్తనుకలిగి యున్నది. విశేషించి ఎల్లకళలయందును నేతకళయే ఈదేశమున రక్షణను కోరుచున్నది. నూలుసరకులయందు, గ్రేటుబ్రిటనునకు పోటీదారులు లేకపోవుటవలన సపక్షకరమైన పన్నులు ఈ సరకులకు అగత్యములేదు. కోట్లకొలది ఆదాయము నల్లమందు ఇజార్దావలన ఈదేశమునకు వచ్చుచుండెడిది. చీనాదేశముతో జేసికొనిన ఒడంబడికవలన ఆ రివిన్యూ అంతయు గగనకుసుమమైనది. ఎన్నియో దేశక్షేమకరములగు ఉద్యమములను సర్కారువారు ద్రవ్యలోపముచే ఉపేక్షచేయుచున్న సంగతి

తెలిసియేయున్నది. ఇండియా రాజస్వము (ఆదాయము) యొక్కస్థితి యుద్ధ ఋణమునకై ఇండియా దొరతనమువారు ఇటీవల నొసంగిన నూటయేబదికోట్ల రూప్యములవలనను మరింత చీకాకుపడినది. ఏటేట ఆరుకోట్లరూప్యములు ఈఋణమునకు వడ్డీక్రింద ఇండియా చెల్లించవలసియున్నది. ఇట్టి స్థితియందు నూలుసరకులపై సర్కారువారు విధించిన దిగుమతి పన్నులను తీసివేయుటకు వీలుచిక్కదు. ఇంగ్లాండునుండి దిగుమతికాబడు నూలుసరకుల సంగతి నిర్ధారణచేయబడినది. విదేశములనుండి దిగుమతి అగుచున్న నూలుసరకులసంఖ్య చాల తక్కువ కాన వానిపైని అమితములగు పన్నులను విధించినను ఇంగ్లండు దేశపు సరకులకు ఏవిధమైన లాభమును కలుగదు.

దేశీయ మహాజనసభ 1885 సం॥ న ఆరంభమయినది మొదలుగా ఇండియా నూలుసరకులపై విధించబడిన యక్సైజు పన్నులను తీసివేయవలసినదని మననాయకులును ప్రతినిధులును ఏటేట మొరలిడుచునే యున్నారు. బ్రిటిషుప్రజలు ఈమొరలను గమనించి సామ్రాజ్యసపక్షభాగ సమస్యను ఆమోదించినపుడైన ఆపన్నులను తీసివేసి ఇండియా నూలు సరకులయెడల సానుభూతిని చూపుదురా? గ్రేటుబ్రిటనుదేశమున తయారై ఎగుమతికాబడుచున్న నూలుసరకులపై అన్యదేశములు ఎంతయో అధికములగు పన్నులనువిధించుచున్నవి. నూటిముప్పదియవ వంతు మొదలు 250-వ వంతు వరకుకూడ దిగుమతిపన్నులు విధింపబడుచునే యున్నవి. ఆంగ్లేయవర్తక వ్యాపారసరణియందు సంస్కారణములను చేయవలసియున్నదని

ప్రకటించు ఒకటారిఫ్ సంస్కారణ పత్రిక ఇటుల వ్రాయుచున్నది.

'రక్షణను వహించినదేశములప్పుడే మన నూలుసరకులను వారి పణ్యచక్రములనుండి వెడలగొట్టినవి. మననూలు సరకులకు ముఖ్య పణ్యచక్రము రక్షణనుపూనిన ఫ్రాన్సు, జర్మనీ, సంయుక్తరాష్ట్రములు కావు. ప్రాగ్దేశములుమాత్రమే. ఆప్రాగ్దేశములయందలి పణ్యచక్రములు స్వేచ్ఛావ్యాపారమును కలిగి యున్నవి. ఒక్కొక్కచోట కొన్ని నిర్బంధనలుండి యున్నను మనసరకులు ఆపణ్యచక్రములలో స్వేచ్ఛగా ప్రవేశించవచ్చును. మరియు ఇండియాదేశమునందు స్వేచ్ఛావర్తకమును ఎట్టి అభ్యంతరములు లేని బాహాటమైన పోటీయును కలదు. అనగా లంకషైరు వ్యాపారస్తులకు ప్రస్తుతము అమెరికాదేశముతోను చైనా, జపానుదేశములతోను పోటీయున్నది.'

ఈవ్రాతయందలి ముఖ్యోద్దేశము, ఇండియాదేశపు పణ్యచక్రముల నుండి జపాను అమెరికా దేశములయొక్క నూలుసరకులను పారదోలుటయే. ఈయన్యదేశ వస్తువులపై ఇంగ్లాండునుండి దిగుమతికాబడెడి లంకషైరు సరకులకు పక్షపాతమును చూపించవలసినదని టారిఫ్ రిఫార్మర్ల అభిప్రాయము. టారిఫ్ రిఫార్మర్లనగా ఇంగ్లీషువర్తక నీతియందు సంస్కారణములు కావించుట అవసరమనివాదించువారు. లంకషైరు వర్తకసంఘము, ఇండియాదేశమున ఇప్పుడే విజృంభించుచున్న నూలుకళయెడలగూడ ఇట్టి అభిప్రాయమునే కలిగియుండవచ్చును. అపక్వపదార్థసంచయము మనఇండియాదేశమున అపరిమితము.

కర్మకరుల వేతనములుకాజాలక. ఈ రెండు విషయములయందును లంకషైరుకన్న ఇండియాకు ఆధిక్యత యుండుటవలన దానికి ప్రతిహతముగా యక్సైజుపన్నులను విధించి తీరవలయునని లంకషైరు వాదించగలదు. ఈపన్నులు ప్రస్తుతము అమలులోనేయున్నవి. స్వదేశమునందు నాయకులును ప్రజలును కూడ ఈపాడుపన్నులను తొలగించి మాకు న్యాయమును ప్రసాదింపుడని పెట్టుచున్న మొఱలకు లంకషైరు ఇయ్యకొనునని తోచదు.

ఇండియాకు ఈ సమస్యలాభమా ?

యక్సైజు పన్నులు తొలగింపబడినవని యూహింతము. అటులయినచో, టారిఫ్‌రిఫార్మరులు ప్రస్తుతము ఉండియున్న స్వల్ప దిగుమతి పన్నులను చెల్లించుదురా? ఇండియా దేశముయొక్క హితమునే గమనించినప్పుడు, ఈ దేశమునకు దిగుమతికాబడు, బ్రిటీషు సామ్రాజ్యము సహా అన్యదేశ పరిశ్రమలమీదను (యక్సైజు పన్నులు లేక యుండ) నూటికి అయిదవవంతుపన్ను విధించినచో లాభకరముగ నుండును. బ్రిటీషు సరకులతో పోటికి వచ్చెడి అన్యదేశ వస్తువులపై, నూటికి పదవంతున దిగుమతిపన్ను అదనముగా విధించి బ్రిటిషు సరకులకు సౌకర్యము కలిగించవలసి వచ్చును. హిందూదేశము ఈ పద్ధతికి సమ్మతించునని యోచింతము. ఇంగ్లాండు దీని నంగీకరించుట సందేహాస్పదము. అన్యదేశములు తమ పరిశ్రమలపై అధికముగా దిగుమతి పన్నులను విధించినను సమ్మతించి ఇండియా అట్టి కార్యమునకు పూనుకొనినపుడు

ఇంగ్లండు ఏల సమ్మతించుటలేదు? ఇందలి రహస్యము మరేమియుకాదు. ఇండియా వర్తక నీతి తమ ఆజ్ఞాబద్ధమై యుండునుగాని, విదేశములు అట్లాడంబడవు. దేశీయ పారిశ్రామికాభివృద్ధికినై ఇతర రాష్ట్రములన్నియు అనుల్లంఘ్యమైన రక్షణత్వమును పూని ఇంగ్లీషు సరకులను తమ పణ్యాచక్రముల నుండి పారదోలినవి. ఇండియాదేశము అటుల చేయజాలదని లంకషైరు వర్తకుల ధైర్యము. కనుకనే అమెరికా, జపానుదేశముల సరకులనుకూడ మన పణ్యాచక్రములనుండి పారదోలి భరతఖండము నందంతటను తమ వ్యాపారమును నిరభ్యంతరముగా సాగించ నిచ్ఛగించినవారై ఈ సామ్రాజ్య సపక్షభాగ సమస్యకు నిపుడు గడంగిరి. ఈ ఇండియాదేశముయొక్క ఆశయములు, బలీయములగు ఆంగ్లేయవర్తక సంఘములయొక్క ఆశయముల ముందు తృణీకరింప బడుచువచ్చుచున్నవని ఖండితముగా ఇండియా దొరతనమువారు తమ నివేదనాపత్రమునందు వక్కాణించిరి. ఇంగ్లాండునుండి ఈదేశమునకు కొల్లలుగా వచ్చుచున్న పదార్థసంచయమునకు ఇండియా ఎట్టి పక్షపాతమును చూపించజాలదు. అట్టిపనికి పూనుకొనుటవలన దేశీయ కళలకును, దేశీయ ఆదాయమునకు గూడ చాల ముప్పు వాటిల్లక మానదు.

కరాచి వర్తక సంఘమునకు ముఖ్యుడుగనున్న వెబ్బుదొరగారుకూడ ఇండియా దొరతనమువారి ఉద్దేశ్యముతో నేకీభవించెను. ఈయన సామాన్యుడుకాడు. టారిఫ్ రిఫారము నందు విస్తారముగా సాదరభావమును కలవాడే. (1) సామ్రా

జ్యసపక్షభాగ సమస్యయొక్క సహాయమును లేనప్పుడు ఇంగ్లాండు అన్యదేశముల కలవడని పక్షపాతమును కలిగినదియై, ఇండియా దేశపు దిగుమతులలో చాలభాగమును తనయధీనము నందుంచుకొన గలిగినది. (2) అన్యదేశ సరకుల పై కొంత అధికముగా పన్నును విధించినను, ఇండియాకు వచ్చుచున్న ఎల్లదిగుమతుల పైని పన్నుల నధికముచేయుటకు బ్రిటిషు వర్తక వ్యాపారస్తులు అంగీకరించరు. (3) ఏటేట విరివిని గాంచుచున్న ఇండియాదేశ వ్యయమునకు దిగుమతి పన్నులను అధికముచేసి ఆదాయమును హెచ్చించవలసిన అవశ్యకత విశేషముగాకలదు. (4) బ్రిటిషు కళలకు వలెనే ఈదేశము నందలి కళలకుగూడ రక్షణత్వము ఆవశ్యకము. ఈనీతిని పాలించుటవలన బ్రిటిషు వ్యాపారస్తుల ఆశయములకు భంగకర మగుటచే, వారి అంగీకారమును బడయజాలదు. ఈకారణమువలన ఇంగ్లాండునుండియు బ్రిటిషు సామ్రాజ్యమునుండియు దిగుమతి కాబడుచున్న వస్తుజాలముపై ఇండియాయందలి కళలకు రక్షణ నొసంగునట్లుగా దిగుమతిపన్నులను విధించిన యెడల ఈదేశమునకుచాల సౌకర్యము కలుగుటకు వీలలవడినను అట్టిరాజ్య నీతిని ఇంగ్లాండు అంగీకరించజాలదు. ఇండియా దొరతనము వారును వెబ్బుగారునుకూడ ఈవిషయమున ఏకాభిప్రాయులై యున్నవారు.

ఇతరదేశ దిగుమతులపై బ్రిటిషు సామ్రాజ్య దిగుమతులకంటె నూటికి 25 వంతున దిగుమతి పన్ను అధికముగ చేయుటను గూర్చి చర్చింతము. నూటికి అరువదికంటె హెచ్చుగా ఇండియాకు ఇంగ్లాండునుండియే దిగుమతి యగుచున్నవని

ముందుసూచించి యుంటిమి. ఈపద్ధతి నవలంబించుట వలన ఇంగ్లాండునుండి వచ్చెడి సరకులు చాల తక్కువ పన్నులను కలిగియుండును. ఇండియాకు వచ్చెడి ఇతరదేశ పరిశ్రమలు చాల తక్కువ యగుటచే, దిగుమతిపన్నులను విస్తారముగా విధించినను ఇండియాకు అంతగా లాభించదు. ఈదేశమునందు వసూలు చేయబడుచున్న దిగుమతిపన్నులు ముఖ్యముగా రెవిన్యూకు చెందినవై యున్నవి. కావున ఆపన్నులను తగ్గించుటకు సాధ్యపడదు. ఒకవేళ అన్యదేశ సరకులపై విశేష దిగుమతి పన్నులను విధించినను, అందువలన ఇంగ్లాండునకు వచ్చెడి లాభమేమి? సపక్షకరములైన పన్నులను ఇండియాదొరతనమువారు విధించుటవలన గ్రేటు బ్రిటనునకు కలిగెడి లాభము అణుమాత్రమును లేదు. 1906-07 సం॥ న ఇండియాదేశము గ్రహించిన అన్యదేశ వస్తుసముదాయమును ప్రొఫెసరు లీస్మిత్తుగారిట్లుల విభాగించిరి:—

	సవరనులు
బ్రిటిషు ఇండియాలోనికి దిగుమతి కాబడిన సరకుల మొత్తపు విలువ	72,205,000
అందు ఇంగ్లాండునుండి వచ్చిన దిగుమతులు	48,199,000
,, బ్రిటిషు అధి నివేశనములు ,,	5,558,000
ఇతర విదేశములనుండి గ్రహింపబడినవి	18,448,000

సామ్రాజ్య పక్షపాతమతము సాధ్యముకాదు.

సామ్రాజ్య సపక్షభాగ మతము నవలంబించి విదేశవ్యాపారమునంతటిను ఇంగ్లాండునకు మరల్చవలెనని టారిఫ్ రిఫార్మర్ల ముఖ్యోద్దేశము. అటుల జేయుట ఎన్నటికిని సాధ్యము కానేరదు. బ్రిటిషు సామ్రాజ్యమునందలి వస్తు జాలమునకు మనమెంత

పక్షపాతమును చూపించదలచినను ఇతరదేశములనుండి వచ్చెడి దిగుమతి సరకులను గ్రేటుబ్రిటను సరఫరాచేయ జాలదు. అట్టి స్థితిలో పక్షపాతమును చూపిన లాభములేదు. ఇంగ్లాండునకు లాభించకున్నను కిరోసిన్‌నూనెయందును, చక్కెర వ్యాపారమునందును బ్రిటిషు సామ్రాజ్యమునందలి ఇతరభాగములకు అన్యదేశ దినసులకంటె పక్షపాతమును చూపించనగునని, ఒక యోచన.

కిరోసిన్‌నూనె స్థితి.

సర్ గై ఫ్లీటువుడ్ విల్సను మనరాజస్వ మంత్రిగనుండు కాలముననే కిరోసిన్‌నూనెపై పన్ను అధికము చేయబడినది. అటుల జేయుటయందు పక్షపాతమును కనబరచు ఉద్దేశ్యము కానరాదు. సపక్షకరమైన పన్నులు విధించనెంచినను దిగుమతిపన్నులను హెచ్చుచేయవలసియే యున్నది. కిరోసిన్‌నూనె అనుదినమును వాడుకలోనున్న ముఖ్యవస్తువు అయియున్నది. అట్టి దానిపై పన్నును వృద్ధిచేయుటచే చాలకష్టముగా నున్నదని దేశీయ నాయకులును, వార్తాపత్రికలును, తమయసమ్మతమును వెల్లడిచేసెను. ప్రస్తుతము విస్తారముగా కిరోసిన్‌నూనెను సరఫరాచేయుచున్న దేశములు రష్యా, అమెరికా సంయుక్తరాష్ట్రములు. బ్రిటిషు సామ్రాజ్యమునందలి ఇతరభాగములలో, కిరోసిన్‌నూనెను ఉత్పత్తిచేయు సాధనముల స్థితి ఎటులనున్నదో ఇచట నిర్ణయించ జాలముగాని, సామ్రాజ్యమునుండి మాత్రము ప్రస్తుతము ఈసరకు దిగుమతియగుట లేదు. బర్మాదేశమున ఈవ్యాపారము ఇటీవల చక్కగా వృద్ధియగుచున్నది. కిరోసిన్ నూనెపైని విధించబడిన

క్రొత్తపన్ను బర్మాదేశముయొక్క వ్యాపారమునకు లాభకారియయ్యెను. ఇట్టినీతిని పురస్కరించుకొని సామ్రాజ్యమునందు ఉత్పన్నమగు నూనెయెడల పక్షపాతమును చూపించ నెంచుచో, సామ్రాజ్యమున కంతగా లాభకారి గాకపోవుటయటుండగా, పన్నుల యొక్కయు ఋణదాతల యొక్కయు భారముచే క్రుంగుచున్న హిందూదేశపు బీదరైతులయొక్క బాధ హెచ్చుమడింప జేయుటయేకాని వేరొండు ప్రయోజనకారి కాజాలదు. పైదేశములనుండి మనము గ్రహించుచున్నంత కాలము కిరసనాయిలుపైని విధించబడెడి అధికపు పన్ను ప్రజలే చెల్లించవలసి వచ్చును.

చక్కెర స్థితి.

ఇక చక్కెరనుగూర్చి యోచింతము. ఈదేశమునకు విదేశములనుండి చక్కెర అమితముగ వచ్చుచున్న సంగతి ఎల్లరెఱింగినదే. దిగుమతులలో ముప్పాతిక అన్యదేశములే సరఫరా చేయుచున్నవి. ఈసందర్భమున మాత్రము, అధినివేశములకును ఆశ్రయ దేశములకును సపక్షకరమైన పన్నులను విధించుట కొంత ప్రయోజనకారి కాగలదు. ఆయాదొరతనములచే అమితమగు ధన సహాయమును వడసి, మన పణ్యాచక్రములను ఆవరించుచున్న అన్యదేశసరకులపై మామూలుకంటె హెచ్చగు పన్నులు ఇదివరకే విధింపబడినవి. కాని, ఈ చక్కెర వ్యాపారమునందుకూడ సామ్రాజ్యసపక్ష భాగమతమునకు వీలంతగా యున్నదని తోచదు. “కిరసనాయిలు నూనెకు వలెనే చక్కెరపైతము ఇండియాదేశమునకు వలయునంత బీటునుండిగాని చెఱకునుండిగాని బ్రిటిషు సామ్రాజ్యమున ప్రస్తుతము తయారు

చేయుటకు వీలులేదనియును, కొంతకాలము దనుక అన్యదేశముల నాశ్రయించుచుండవలయు" ననియు వెబ్బుగారు సూచించిరి. రెవిన్యూ నధికముచేయునట్టియు, రక్షణత్వమును కలిగించునట్టియు పన్నులను విధించుటకు, హిందూదేశస్థులు తమ సమ్మతిని నాయకుల మూలముగను, వార్తాపత్రికల మూలమునను, అనేకసందర్భములయందు వెల్లడిచేయుచునే యున్నారు. ఇంగ్లాండునకును అధినివేశములకును గూడ లాభకరముగనుండు సూత్రములను ఆమోదించుట ఇష్టమని సూచించుచున్నారు. అయినను పాఠక మహాశయులు పైచర్చవలన గ్రహించవలసిన ముఖ్యాంశము—ఇంగ్లాండునకు లాభము అత్యల్పమని నిశ్చయముగా తెలిసికొనవలసి యున్నది. అధినివేశనములు కొంతవరకు లాభమును పొందవచ్చును. కాని అధినివేశనములు దీనికి ప్రతిఫలముగా మనకుచేయు ఉపకారమేది? ఈదేశమునుండి పోవు కూలివాండ్రను పెట్టుచున్న బాధలటుండ, సుప్రసిద్ధ విద్యాధికులు సైతము తమదేశమును త్రొక్కరాదని ఆస్ట్రేలియా దేశవాసు లనుచున్నారు. ఇట్టి వ్యక్తిత్వమును గలిగిన వారికి భారతీయులయెడ సోదర ప్రేమ జనించుననుట యోచనీయము. సామ్రాజ్యమునందలి ఎల్ల రాష్ట్రములును కలిసియుండిన బాగుండుననెడి నీతి మంచిదే కాని సామ్రాజ్యములోని అన్ని దేశములును సమానగౌరవ ప్రతిపత్తుల నొకరికొకరు కలుగజేసినగాని అట్టి నియమము లాభకారి కాజాలదు.

పరస్పర వినిమయమునకు బ్రిటిషు అధినివేశనముల ప్రజలు అంగీకరించునెడల వర్తక వ్యాపారములయందు వారి

స్వరకులపైని ఇండియా సానుభూతిని కనబరచునగునని మేము సూచించియేయున్నాము. కావున సామ్రాజ్య సపక్షభాగమతమును బ్రిటిషు దొరతనమువారు ఆచరణములోనికి గొనిరాదలంచినపుడు హిందూదేశమునకు తగిన గౌరవ ప్రపత్తులను ఒసంగెదమని తక్కిన రాష్ట్రములు అభయహస్త మొసంగినగాని దొరతనమువారు ఈసమస్యను చర్చించుటకునైన వీలుపడదు. సామ్రాజ్యము యొక్క అభివృద్ధిని కాంక్షించుటలో ఇండియా ఏ యితర భాగములవారికిని తీసిపోను. సామ్రాజ్యముయొక్క ఐశ్వర్యమును బలమును పెంపుగాంచుటకు, అందలి ప్రతిభాగమునుకూడ ఐశ్వర్యవంతమై బలీయతను గాంచినగాని, వీలులపడను. కళావాణిజ్యముల నభివృద్ధిజేసి, హిందూదేశము యొక్క ఆర్థికసంపదను విరివిచేసినగాని సామ్రాజ్యమునకు చేకూరవలసిన ఆధిక్యత లభించదు.

ఎగుమతుల స్థితి.

ఎగుమతులయొక్క పరిస్థితులనుకూడ తర్కించి సపక్షకరమైన పన్నుల నామోదించుటవలని లాభనష్టములను నిర్ణయించవలసియున్నది. పరదేశయాత్ర వెడలు వస్తుజాలములో చాలవరకు అపక్వపదార్థ సంచయమును ఆహారపదార్థములునై యున్నవి. ఈదేశమునుండి గ్రహించినఅపక్వపదార్థ సంచయమునే తిరిగి వారు యంత్రకళలుగమార్చి, ఈదేశమునకంపి ఐశ్వర్యవంతులగుచున్నారు.

హిందూదేశము నందలి ద్రవ్యసాధనములు బ్రిటిషు సామ్రాజ్యమును ఐశ్వర్యవంతముగ జేయవలయునేకాని అన్యరాష్ట్రములను బాగుచేయుట పాడిగాదు. కాన రక్షణత్వము

నవలంబించియున్న, బ్రిటిషు సామ్రాజ్యమునకు చెందని, ఇతర
రాష్ట్రములకు పంపబడుచున్న పదార్థసంచయముపై ఎగుమతి
పన్నులను విశేషముగా వసూలు చేయవలసినదని ఒకఆశయము.
ఇటులగావించుటచే బ్రిటిషు కర్మకరులకును, మూలధనము
నకును లాభము కలుగుననియును, బ్రిటిషు సరకులపై దిగు
మతిపన్నులను విధించుచున్న అన్యదేశములు అట్టి పన్నులను
నిలుపుచేయుననియును కొందరు చెప్పుచున్నారు. బోనరులా
గారి ముఖ్యోద్దేశ్యముకూడ ఇదియేయని తోచెడిని. శత్రు
దేశములను తిరిగి ఇండియా పణ్యచక్రముదరికి రానీయకుండ
పారదోలవలయునని బ్రిటిషు రాజ్యతంత్రజ్ఞులు ఎన్నియో ప్రయ
త్నములు సల్పుచున్నారు. సామ్రాజ్యసపక్షభాగ మతము
నవలంబించుట లెస్సయని యుద్ధ ఆంతరంగిక సభవారుకూడ
అభిప్రాయపడుటకు ఇదియే కారణము.

ఇంగ్లాండుదేశము మనదేశమునందలి ఎగుమతులలో
నూటికి 25 వ వంతుమాత్రమే గ్రహించుచున్నది. మిగిలిన
భాగమంతయు రక్షణనుదాల్చిన ఇతరదేశములకు పోవుచున్నది.
రక్షణనుగూర్చి మేము చర్చించినప్పుడు ఎన్నియో అపక్వ
పదార్థములపై ఎగుమతిపన్నులను విధించుట అవసరమనియు,
అటుల చేయుటవలన మనకళలకు అపరిమిత సహాయము నొసం
గినవారమగుటయేగాక, రివిన్యూకూడ చాలవరకు వృద్ధి
యగుననియు, సూచించియేయున్నాము. అపక్వపదార్థ సంచ
యమునకేగాక ఆహారపదార్థముల (ధాన్యములు) కు గూడ
ఎగుమతిపన్నులువిధించుట కర్తవ్యమని చెప్పియుంటిమి. గోగు
నారపై అదనమైనపన్ను విధించవలసినదని సామ్రాజ్య

శాసన నిర్మాణసభలో దేశీయ ప్రతినిధులు తీర్మానముల నుప
పాదించియున్నారు. 1916-17 సం॥ ఆదాయవ్యయ పట్టికలో
గోగునారపైని అదనమైనపన్ను విధించబడెను. 50,000 సవ
రనులవరకు ఈపన్నువలన ఆదాయమురావచ్చునని కోశాగార
మంత్రి శాసననిర్మాణ సభయందు నివేదించెను. ఇది ఇంకను
చాలవరకు హెచ్చుచేయవలసిన ఆవశ్యకత కలదు. జపాను
దేశమునకు ఎగుమతి కాబడుచున్న ప్రత్తిపైనికూడ, ఎగుమతి
పన్నును విధించవలసినదని దేశీయులు కోరిరి. నూలుకళయందు
ఈదేశమునకన్న రక్షణను వహించుటవలన జపాను చాల
ప్రాముఖ్యతను గాంచుచున్నదని ఎల్లరు నెరింగిన విషయమే.
ఇతర వస్తువులయందు, జర్మనీ అమెరికా దేశములు ఇంగ్లీషు
సరకులను సన్నగిలునట్లు చేయగలుగుచున్నవని మాత్రము
అందరును అంగీకరించక తప్పదు. నూలు వర్తకమునందు
జపానుదేశము ప్రస్తుతము మ్యాంచెష్టరు సరకులకు చాల
యొత్తిడిని గలిగించుటయేగాక కొన్ని రకముల బట్టలయందు
ఇంగ్లాండుస్థానమునుతానే ఆక్రమించుచున్నటుల వర్తకలెక్కలు
చూచినవారికి తెల్లమగును. అన్యదేశముల సరకులపై ఇండి
యాదేశముయొక్క ఆశయములను మనసునందిడుకొని పన్ను
లను విధించవలయునని అనేక సభలమూలమునను వార్తాపత్రి
కల మూలమునను మననాయకులును ప్రజలును చాలకాలము
నుండి ఘోషించుచున్నారు. కాబట్టి మన వాణిజ్యవ్యాపారము
ను ఎట్టిరీతిగ సంస్కరించిన ఇంగ్లాండునకును, అధినివేశనముల
కును, అన్యరాష్ట్రముల సరకులకంటె పక్షపాతమును, చూపించ
వీలగునో, ఆసంగతిని మనమిపుడు తర్కించవలసి యున్నది;

పక్షపాతమును చూపించగలుగు సరణిని మనము కనిపెట్టగలిగినయెడల, అట్టి పద్ధతి నవలంబించుటవలన ఇండియాదేశమునకు లాభకారియా యను సంగతికూడ విమర్శనీయము.

గోగునార ఎగుమతి.

పరదేశ యాత్రవెడలు ఈ దేశ పదార్థసంచయములో చాలభాగము గోగునార అయియున్నది. సంవత్సరమునకు సుమారు 20 కోట్ల రూప్యముల మూల్యముగల గోగునారయును, 15 కోట్ల రూప్యముల విలువగల గోనెసంచులును, పట్టాలును, విదేశములకు నేగుచున్నవి. వంగరాష్ట్రమునందు ఈ వ్యాపారము ఇటీవల కొద్ది సంవత్సరములలో విశేష వృద్ధిని గాంచినది. ఇండియాదేశమును, అన్యదేశములును పోటీరాగానే ఇంగ్లాండునందు ఈ కళక్షీణదశకు వచ్చెను. ఇంగ్లాండు దేశము స్వేచ్ఛావర్తక న్యాయమును పాలించుచుండుటవలన, విదేశములు తమ దేశమునందే గోగునార యంత్రములు నిర్మించగలిగినవి. ఒకప్పుడు విదేశములన్నియు బ్రిటిషు యంత్రకళలనే ఆశించుకొని యుండెడివి. ఇపుడన్ననో తమదేశమునందే యంత్రశాలలను నిర్మించుకొన గలుగుటవలన, గోగునార విషయమున ఆర్థిక స్వాతంత్ర్యమును గాంచగల్గినవి. ఇంగ్లాండు దేశముయొక్క గుత్త ఈ విషయమున పూర్తిగ నశించుటయు డండీ పట్టణము ఈ పరిశ్రమయందు చాల బీదస్థితియందుండుటయు చూచునేయున్నాము. గోగునారను చాల దేశములవారు ఎవ్విధమైన పన్నులను విధించకయే తమ దేశమున జాగ నిచ్చుచున్నారు; తయారైన సరకుల పైనిమాత్రము నూటికి 2 మొదలు 30 వరకు శుల్కములు వసూలు చేయబడుచు

న్నవి. ఇండియాలో ఎగుమతి పన్నులను విధించినయెడల రెవిన్యూవిషయమున చాల లాభకరమగుటయేగాక, ఈకళ ఇంకను విజృంభించగలదు. ప్రపంచమునందంతటను గోగునార పైరునందు మన ఇండియాదేశము గుత్తను కలిగియున్నది. ఎంతపన్నును విధించినను భరించవలెనే గాని మరియొక గత్యంతర మేమియును లేదు. కాని, సామ్రాజ్యసపక్షభాగ మతావలంబకులమై ఇంగ్లాండు దేశమునకు పక్షపాతమును కనబరచితిమేని డండిపట్టణముయొక్క గోగునార పరిశ్రమ విశేషముగ వృద్ధియగును. అందుచే హిందూదేశ వ్యాపారము క్షీణించకమానదు. ఎగుమతిపన్నుల నధికము చేయుటవలన అన్యదేశములు గోగునారను ప్రియముగా కొని తీరవలసిన అవస్థకలుగగా, డండీ పట్టణమునకు చౌకగా లభించుచుండును. చౌకగా లభించుటచేత డండీ ఇండియాతో కూడ పోటీకిరాగలదు. అది ఎంత ప్రమాదమో విస్తరించి వ్రాయ నగత్యము లేదు. అట్టిమతము నవలంబించుటవలన దేశమున కెవ్విధమైన లాభమును కలుగదు. ఈ నష్టమును, ఇంగ్లాండు దేశము మరి ఏ విధముననైన పూర్తిచేయగలదా యనిన, నదియును లేదు. గోగునారను ఎగుమతి చేయునపుడు ఇంగ్లండునకు పక్షపాతమును చూపుటకు పరరాష్ట్రమునందలి వర్తకులు తమకు నష్టదాయకమని అంగీకరించజాలరు. విశేషించి ఈకళ ప్రస్తుతము బ్రిటిషువర్తకుల యాధీనముననే యుండుటవలన, అందలి లాభము బ్రిటిషువర్తకులే అనుభవించుచుండ తిరిగి పక్షపాతమును చూపమని కోరుట సరికాదు.

ప్రత్తి ఎగుమతి.

మనదేశమునుండి పరదేశ యాత్రవెడలు అపక్వ పదార్థసంచయమునందు ప్రత్తి ద్వితీయస్థానమును అలంకరించుచున్నది. ప్రత్తిపైని ఎగుమతి పన్ను విధింపబడినయెడల ఈదేశమునందలి నేతకళకు కొంత సహాకారిగా నుండును. ఇండియాయందలి ప్రత్తి సగమునకు సుమారుగా అన్యదేశముల కేగుచున్నది. కొంతకాలమువరకును జపానుదేశము ఈ దేశమునుండి నూలును గ్రహించుచుండెడిది. ఇపుడన్నno రక్షణను దాల్చిన దగుటచే, నేతకళను చక్కగా విజృంభింప గలిగి వడకిన నూలును గొనుటకు బదులుగా ప్రత్తి నేగ్రహించి, వారిదేశమున నూలు తయారుచేసి ప్రాగ్దేశములందలి పణ్యాచక్రములయందు ఇండియాకు పోటిగా వచ్చెను. ఎగుమతి కాబడుచున్న ప్రత్తిలో, ఇంగ్లాండుకంటె అన్యరాష్ట్రములే విశేషముగ గ్రహించుచున్నవి. అన్యరాష్ట్రములపై అదనముగా పన్ను విధించినయెడల, ఇంగ్లాండునకును ఇండియాకును కూడ లాభకారి కావచ్చును. అమెరికాదేశపు ప్రత్తి పంటమీదనే, లంకషైరు నూలు యంత్రశాలలు ఆధారపడి యున్నవి. కాబట్టి ప్రత్తిశుల్కము, ఇంగ్లాండునకు ఎవ్విధమైన బాధను కలిగించజాలదు. విశేషించి అన్యరాష్ట్రముల ఒత్తిడిని గూడ తగ్గించగలదు. ప్రత్తిపన్నులను విధించుటవలన, విదేశములు తమ అసమ్మతిని జూపుటకై ఈదేశసరకులకు కలుగజేసెడి నిర్బంధములుండగా ప్రస్తుత స్థితిగతులను బట్టిచూడ లాభమును పొందునది లంకషైరుగాని ఇండియా కానేరదు.

వాణిజ్య వ్యాపారములయందు నూతన పద్ధతుల నెలకొల్ప దలంచినచో ఏ సరణిని అవలంబించినయెడల ఇండియా దేశముయొక్క అభ్యుదయమునకు తోడ్పడునో, అట్టి రాజ్యనీతినే పాలించుట ధర్మమని పెక్కుసారులు ముచ్చటించి యున్నాము. సామ్రాజ్య సపక్షభాగ మతావలంబనము ఇండియా దేశమునకు లాభకారియగుననుట చాల సందేహాస్పదమని నిర్ణయించి యుంటిమి. ఇండియా దేశమునందు ఉత్పత్తియైన పదార్థములకు, ఇంగ్లాండుదేశమే, పక్షపాతమును కనబరచవలసి యున్నది. ఈ దేశముయొక్క ప్రస్తుత స్థితియందు రాజస్వమును అభివృద్ధి చేయవలసి యున్నదనియు, రక్షణను ఇంగ్లాండునుండికూడ హిందూదేశ క్షేమార్థమై మనము సంపాదించవలసి యున్నదనియు ఇదివరకు సూచించి యున్నాము.

గోధుమల స్థితి.

ఇండియాదేశము యొక్క గోధుమ పంటను గూర్చి ఆలోచింతము. ఇంగ్లాండు, ఒక్క ఇండియా నుండియే గాక, కెనడానుండికూడ గోధుమలను గ్రహించుచున్నది. ప్రస్తుతము పక్షపాతమును కాంక్షించుటలేదుగాని కొద్దికాలములో ఇండియాదేశ వస్తువులకంటె తన సామగ్రికే హెచ్చు పక్షపాతమును కనబరచమని కెనడా కోరవచ్చును. అపుడు ఇండియా గోధుమలసంగతి ఏమి కావలయును? ఇంగ్లాండునకు వలయు తేయాకునంతయు చైనా, ఇండియా, సింహళ ద్వీపములు సరఫరా చేయుచున్నవి. అందు ఇండియా సింహళ ద్వీపములు అమితముగా సరఫరా చేయుచున్నవి. సపక్ష

భాగమతము నవలంబించుటచేత సామ్రాజ్యమునుండి దిగుమతి కాబడు తేయాకు మీాది పన్ను తగ్గింపబడును. అపుడు చైనాదేశపు తేయాకు మన పోటీకి తాళజాలక ఇంగ్లండునుండి వెడలిపోవును. అయినను, ఇండియా తేయాకునకును, సింహళమునకును తరువాత పోటీరాకమానదు. ఈ సంగతులనన్నిటిని ఊహించిన వారలై, 1903 సం॥ న ఇండియాదొరతనమువారు ఆర్థికవిషయములపట్ల సామ్రాజ్యమునకు ఇండియాదేశము సమర్పించునదేదియు లేదనియు, తానే చాలవరకు నష్టపోవుననియు ఇండియాకార్యదర్శిగారికి నివేదనా పత్రమునంపిరి. పక్షపాత మతము నాచరించుటవలన సామ్రాజ్యమునందలి గోధుమ వర్తకమునకు విశేషలాభము కలుగునను కొందము. ఆలాభమును మనము కెనడా, ఆస్ట్రేలియా దేశములతోను మరి యితర వలసరాష్ట్రములతోను సమముగ పాల్గొనవలసి యుండును. గ్రేటుబ్రిటను మనదేశమునుండి విస్తారముగా అపక్వపదార్థ సంచయమును ఆహారపదార్థములను గ్రహించుచున్నది. గనుక దిగుమతులపై సపక్షకరమైన పన్నులను విధించి వీనివెలలను హెచ్చుచేయుటకు నిచ్చగించదు. అన్యదేశములనుండి దిగుమతి కాబడుచున్న వస్తుజాలముపై హెచ్చుపన్నులను విధించి, ఇండియా దేశమునుండి ఎగుమతికాబడు యంత్రకళలకును, హస్తకళలకును పక్షపాతమును కనబరచుననుకొందము. కాని, ఇండియానుండి ఎగుమతి కాబడు పరిశ్రమలు చాలతక్కువ. కాన ఇండియాకు ఎంత పక్షపాతము కనబరచినను నష్టముకూడిరాదు. అధినివేశములకును ఇండియాకును వర్తకమంతగాలేదు. ఇండి

యాదేశమునుండి స్వలాభమును కాంక్షించుటదక్క, ఇంగ్లాండుగాని అధినివేశములుగాని ఈదేశమునకు చేయుమేలు ఏమియు కానరాదు.

ఇంగ్లాండు ఇండియాకు రక్షణ నిచ్చునా ?

వర్తకసంస్కరణ వాదులు, ఇంగ్లాండునకు ప్రసాదించు రక్షణత్వమును ఇండియాదేశమునకు గూడ ప్రసాదించెదరా యని స్వేచ్ఛావర్తక వాదుల ప్రశ్న. దీనికి తగిన ప్రత్యుత్తరమును సంస్కరణ వాదులు ఈయజాల కున్నారు. తమ సరకులపై శుల్కములను వసూలు చేయుటకు లంకషైరు వ్యాపారస్థు లెన్నటికిని అంగీకరించరు. శుల్కముల నీయుట కుద్యుక్తులైనచో, యక్సైజుపన్నులను మన నూలు సరకులపై వసూలు చేసినగాని వారొప్పరు. యక్సైజుపన్నులను త్రోసివేసినగాని మన నేతకళ విజృంభించజాలదు. ఇండియాయొక్క నేతకళకు కలిగెడి లాభము లంకషైరునకు నష్టదాయకము. వారికి కలిగెడి నష్టము మనకళకు లాభకరము. ఇటులుండ ఈరెండు దేశములకును లాభదాయకమగు వర్తకసంస్కరణమును ఆచరణములోనికి దెచ్చుట కష్టసాధ్యము. ఐశ్వర్యవంతమై యున్న ఇంగ్లాండుదేశము కొంత నష్టమునకైన ఓర్చుట సమంజసముగాని, కఱవులతోను కాటకములతోను పీడింపబడుచు సంవత్సరమునకు ముప్పది రూపాయల ఆదాయముగల భారతీయులతో నిండియున్న ఈదేశమునకు ఇంకను నష్టమును కలుగజేయుట ధర్మముకాదు. సామ్రాజ్యముయొక్క బలాతిశయములు సర్వాంగపూర్తిని గాంచుటవలన గాని యలవడజాలవు.

సామ్రాజ్య పక్షపాత మతము నష్టము.

సామ్రాజ్య పక్షపాత మతము నష్టదాయకముగ నున్న దేకాని లాభకారి గాజాలదు. ప్రస్తుతము నూటికి 64వ వంతు దిగుమతులును, నూటికి 25వ వంతు ఎగుమతులును ఇంగ్లాండునకు చెందియున్నవి. దిగుమతికాబడుచున్న శేషించిన 36వ వంతు సరకులును, ఇంగ్లాండునకు మనమెంత పక్షపాతము చూపినను, అచ్చట తయారగుటకు వీలులేదు. అట్టి స్థితిలో పక్షపాతమును కనబరచవలసిన అవసరమేమి? కనపరచిన ప్రయోజనమేమి? ఎగుమతుల స్థితి నాలోచించినను అంత ప్రయోజనకారిగా నున్నటులతోచదు. నూటికి 25వంతునకు పైగా ఇంగ్లండు గ్రహించుటలేదు. మిగిలిన 75 వంతులును అన్యరాష్ట్రములే గ్రహించుచున్నవి. కాబట్టి ఎగుమతులయందు గాని, దిగుమతులయందుగాని పక్షపాతమును చూపించుట ఇండియాకు లాభకరముగాదు.

స్వేచ్ఛావర్తకముకంటె, పక్షపాతమతము ఈదేశమునకు మిక్కిలి విప్లవకారియగును. ప్రొఫెసరు కాళేగారు సూచించినటుల స్వేచ్ఛావర్తకము క్రొత్తకళలను స్థాపించి వృద్ధిలోనికి గొనివచ్చుటకు ఆటంకకరముగా నుండును గాని, పక్షపాతమతము, ఉన్న వానిని కూడ నశింపజేయును. ఈమతము నవలంబించుటవలన ఈదేశమెన్నటికిని వ్యవసాయదశయందుండి తీరవలసియే వచ్చును. అపక్వపదార్థ సంచయోత్పత్తి దక్క కళాస్థాపనమును కళా విజృంభణమును మనకు గగనకుసుమము లగును. ఆర్థిక స్వాతంత్ర్యమున్న గాని దేశీయ ఔన్నత్యమలవడదు.

పరిశ్రమాభివృద్ధికి మార్గములు.

వ్య వ సా య ము.

భారత భూమియందు కృషికళయే ఎల్లకళలయందును అగ్ర స్థానము నలంకరించుచున్న దన్న సంగతి నిర్వివాదాంశము. ఎల్ల దేశములకువలె గాక స్వదేశమున కర్మకరులకు సేద్యవృత్తియే, చాలవరకు జీవయాత్ర గడపుటకు నాస్పదమైయున్నది. ఇతర కళలు విరివిగా విజృంభింపని హేతువువలన కృషికళయే జీవనాధారమగుచున్నది. రక్షణను దాల్చి సర్వకళా పరిపూర్తి గాంచినను, సంయుక్త రాష్ట్రములకు వలె భరతవర్షమునందు పెక్కుప్రజలకు వ్యవసాయవృత్తియే జీవనాధారము కాక మానదు. ఏలయన యంత్రకళలు చాలవరకు కృషినే ఆధారభూతముగ కలిగియున్నవి. గనుక కృషికళయొక్క ప్రాముఖ్యత ఇంతయని నిర్ణయించుటకు వీలుచిక్కదు.

ప్రస్తుతము కృషికళ ఈదేశమున మిక్కిలి శోచనీయమైన అవస్థయందున్నది. ఆర్యులు భరతవర్షమును విక్రమోపార్జితులై స్వాధీనము చేసికొనిన కాలమున అపరిమిత సస్యాఢ్యమై బరగుచున్న స్వదేశమున నేడు పంటలకు మాటిమాటికి అపాయములే తటస్థించుచున్నవి. క్షేత్రమును ఎరువు వేయక ఏమాత్రము దున్ని సేద్యపరచినను అద్భుతముగ సస్య

ములు ఫలించి దేశము సుభిక్షముగ దనరారు చుండెడిది. ఇపుడన్ననో కృషికుడు సంవత్సరము పొడుగునను శ్రమపడినను, శ్రమకు తగిన లబ్ధి దొరుకక బీదవడి ఏషాహుకారునకో దాసుడై యుండవలసి వచ్చుచున్న సంగతి మనము కండ్లార గాంచుచున్నాము. ఇట్టి దుస్థితికి సుక్షేత్రయగు భరతవర్షము ఏల రావలసివచ్చెనో విచారించుట ఎల్లరకును అవశ్యకర్తవ్యము. శ్రీరామచంద్రునికాలమున 'నెలకు మూడువానలు' కురియుచుండెడి వన్నసంగతి పురాణప్రసిద్ధమేకదా ! నేటి స్థితి ఎటులనున్నది ? మూడేడులకొక వర్షమైనను లభించని తావులు కూడ గలవు. ప్రజలును పాలకులును భారత భూమి యందలి కృషికళను సముద్ధరించ నెంచినచో వారలకు అవశ్యమగు కర్తవ్యము—సస్యములను సాధ్యమైనంతవరకు వర్షాధారములుగ జేయక నదీనదంబుల నుండి జలమును కాలువల ద్వారా సరఫరా చేయుచుండుటయో లేక ప్రతిప్రత్యేక క్షేత్రమునందును నూతులను ద్రవ్వి పాతాళగంగను పైకి ఉబుకునట్లు చేయుటయో గావించవలసి యున్నది. అపుడుగాని వర్షముల వెఱపులేక సస్యములు సుభిక్షముగ పండుటకు వీలలనడదు.

నాగరికతను విశేషముగా కలిగియున్న రాష్ట్రములయందు ఎడతెగని పరిశోధనలవలన కృషికళను పెంపు చేయుటకునై ఎన్నియో నూతన మార్గములు కనుగొనబడినవి. ఈదేశమునందలి కృషికళకు తాతముత్తాతలనాటనుండియు ఆచారముగ వచ్చుచున్న మార్గముదక్క ఇతర పథంబులం ద్రొక్క మనంబు జనదు. పూర్వాచార పరాయణ ప్రియత్వ

మునకు దోడు దరిద్ర దేవత సర్వదా ఆశ్రయించియే యుండును. విద్యావిశేషమువలన అద్భుత ప్రజ్ఞను కలిగినవారై పాశ్చాత్య దేశముల వారెల్లరును తమదేశములనుండి తరిమివైచుటవలన గాబోలు ఆదరిద్రదేవత మనలను బాయక యున్నది. ప్రారంభవిద్యను సర్వప్రజలకును గరపి అజ్ఞానాంధకారమును బాపి, జ్ఞానచక్షువును తెరచినగాని అభివృద్ధిగాంచుటకు దారిలేదు. నూతన సంస్కరణములను విరివిగ స్వదేశమునందు కూడ ఆచరణములోనికి గొనివచ్చినగాని కృషికళ పెంపుగాంచదు. పాశ్చాత్యదేశములకు వలెనే భరతవర్షమునైతము నిలువనీడ నొసంగక దరిద్రదేవతను తరిమివేయవలెనన్న సహకార ప్రవృత్తియే సాధనాంతరంబు. ఈవిషయములు మున్ముందు విపులముగా జర్చించబడును.

జలాధారముల ప్రాముఖ్యత.

సర్కారు రాజస్వమునుగూర్చి ముచ్చటించుతరి, ఇనుపదారులకన్న జలాధారనిర్మాణమే హిందూదేశమునకు అత్యంతావశ్యకమని నిరూపించి యుంటిమి. ఐనను, ఒకటి రెండుసంగతులను ఇచ్చోటున నిర్వచించుట యుక్తమని తోచెడిని. కావేరీ, గోదావరీ మహానదులకు ఆనకట్టలనుగట్టి విఖ్యాతయశమువడసిన కాటనుమహాశయుడు, నీటికాలువలయొక్క ప్రాముఖ్యతను చక్కగ గ్రహించినవాడై, భరత వర్షముయొక్క భావిస్థితి జలాశయములను విరివిచేయుటయందే ఆధారపడి

యున్నదని నమ్మి, సర్కారు రాజస్వమును ఇందులకై వెచ్చించుట అవసరమని ప్రభుత్వమువారికి నివేదించెను. కాని మన దురదృష్టమువలన పాలకులకు అట్టిబుద్ధి స్ఫురించెదయ్యో!

ఇకనైనను రైల్వేలకునై కోట్లకొలదిధనమును వెచ్చించక, సర్కారువారు నీటిపారుదల పనులకునై విశేషధనమును వెచ్చించుట అవసరము. నీటిపారుదల విషయమున సాలుసరు రెండుకోట్ల రూప్యములు వెచ్చించుట కష్టమగుచున్నది. ఇట్టి రాజ్యనీతి క్రమమైనదికాదు. సర్కారువారు విశాలదృష్టితో తిలకించినయెడల అందలి లాభనష్టములు వారికి గోచరించగలవు.

వర్షమునే ఆధారభూతముగనమ్మి సేద్యముగావించెడి కృషికులకు సంవత్సరము పొడుగునను పనికలిగి యుండదు. డెల్టాభూములయందు మాత్రము మూడుపంటలు పండును గనుక ఎల్లప్పుడును పనికలిగియేయుండును. ఇతరప్రదేశములయందు ఎనిమిదిమాసములుదక్క, కృషికులు పాటుపడుచుండుటలేదు. వర్షములు ఎటూముటియగుచో చాలదినములవరకు పనికలుగదు. మిగిలిననాలుగు మాసములును నిర్వ్యాపారులై మిన్నక గృహాంగణంబుల నిద్రపోవలసిన వారగుచున్నారు. ఎంతశ్రమ నిరర్థక మగుచున్నదో, వేరుగ వ్రాయబనిలేదు. ఒక్క వరిపంటనే నమ్ముకొని, పండినను ఎండినను ఇతర దినసులపైరులను ప్రయత్నించక సోమరులై కాలము వృథపరచుచున్నారు. కృషికులు ఒక్క సంగతిని గమనించవలసియున్నది. కేవలమువర్షమునే ఆధారముగ నమ్ముకొనక, క్షేత్రములయందు బావులనుత్రవ్వి ఏతముల మూలకముగనో,

మోటల ఆధారమువలననో, సేద్యమునందున్న భూమివిస్తారము పరిమాణము కలిగియున్నయెడల పాతాళగంగను పైకి ఉబుకునట్లుచేసి నూనె-యంత్రముల (Oil engines) సహాయమువలన భూమికి నీటిని సరఫరాచేసి సస్యాఢ్యగజేయుట అవశ్యకర్తవ్యము. ఈయుద్యమమునకు సర్కారువారు సైతముకొంతవరకు సహకారులు కావలసియున్నది. నూతులను త్రవ్వుటకు కావలసిన పనిముట్లను జతపరచి ఒక్కొక్క ఉద్యోగియుని ప్రతి తాలూకాయందును నియమించి, ఏరైతు దరఖాస్తుచేయునో ఆరైతు భూమియందు నూతులను త్రవ్వుఏర్పాటులను గావించవలసియున్నది. సర్కారువారు నీరుపడువరకునుత్రవ్వి, అందుల ఖర్చును తామేవహించి మిగిలిన భాగమును త్రవ్వి ఉపయోగపరచుకొనుటకగుఖర్చును రైతునుండి రాబట్టుట సుగమము. ప్రతితాలూకా యందును ఒక్కొక్క ఉద్యోగియుని ఈపని నిమిత్తమై నియోగించి తీరవలయును. కొంతవరకు సర్కారువారికి ధనవ్యయ మగుననియెడిమాట సత్యమే! ప్రజాక్షేమము నిమిత్తమేకదా, ప్రభుత్వమువారు పాటుపడవలసి యున్నది.

తకావీ ఋణములు.

క్షామములు పట్టినపుడు సర్కారువారు రైతులకు తకావీ ఋణములనుపేర ధనమునొసంగుచున్నారు. ఈఋణము లంతగా రైతులకు ఉపచరించుటలేదని నిస్సంశయముగా చెప్పవచ్చును. రైతుయొక్క దరఖాస్తు అనేకమంది ఉద్యోగస్థుల ద్వారా తహసీల్దారుగారికి చేరవలసి యున్నది. దరఖాస్తుప్రకారము ఋణమువడయుట కష్టసాధ్యము. ఇందలి

లోపము ప్రత్యేక ఉద్యోగీయులయందు లేదు. ఆశాఖానిర్మాణమే కారణము. రైతులకుసులువుగా పైఅధికారులతో మనవి చేసికొనుటకు తగిన ఏర్పాటులు గావించుట అవసరము. ఋణముతీయబడిన ధనమునందు కొంతవరకు రుసుముల క్రింద వినియోగించవలసి వచ్చుచున్నది! ఇదిఎంతయు శోచనీయము. ఇంతవ్యయ ప్రయాసములకు నోర్చి తెచ్చిన ఋణమును రైతు వెంటనే తీర్చివేయవలసి యున్నది. అందలిలాభమును గ్రహించి తానుసుఖించుచున్నపుడుగదా, ప్రయాసము లేకుండ రైతునకు ఋణముతీర్చుటకు అవకాశముండును. ఋణము తీర్మానము చేయవలసినదని సర్కారు రివిన్యూ ఇనస్పెక్టరులు తొందర చేయుటవలన ఏషాహుకారులవద్దనో అధికవడ్డీకి తిరిగిఋణము తెచ్చి తీర్చవలసి వచ్చుచున్నది.

ఈపద్ధతి తృప్తికరముగలేదు. రైతుయొక్క క్షేమమును విచారించి తగునేర్పాటులు చేయుట కర్తవ్యము. సర్కారువారు రైతునకు సహాయము చేయనెంచినను ప్రస్తుతపద్ధతులు నిరోధకములగు చున్నవి. కృషికళను పెంపుచేయుటకు అవసరములగు ఉపకరణములను, రైతు సేకరించుటకు అనువగునట్లు ఋణము నొసంగుటకును, తిరుగ తీర్మానము చేయకోరినపుడు రైతునకు శ్రమలేకుండ గ్రహించుటకును తగిన ఏర్పాటులను సర్కారువారు చేయవలసియున్నది. రాబడిని చక్కగా వసూలుచేయుటయందే సర్కారు ఉద్యోగీయులు తమబుద్ధికుశలతను వినియోగించక, రైతుయొక్క క్షేమమునుకూడ ఒకకంట జూచుచుండవలెను.

మెరకభూములకు నీటి సరఫరా.

బావులనుత్రవ్వి, క్షేత్రమును సస్యశ్యామలముగ జేయవలసియున్నదని రైతునుహెచ్చరించి యుంటిమి. పూర్వకాలపు ఏతములతోను, మోటలతోను తనివిజెందక నూతన యుపకరణములను వాడుకలోనికిదెచ్చి కృషికులు అభివృద్ధికిరావలసి యున్నది. ప్రస్తుతము మన ఆంధ్రమండలమున వాడుకలోనున్న మోటలు పశువులకు విశేషశ్రమను కలుగజేయుచున్నవి. ముందునకును వెనుకకును నడువవలసి వచ్చుటచేతస్వల్పకాలములోనే పశువులు సీరసించి ఉపయోగానర్హములగుచున్నవి. అట్టి ఇక్కట్టులకు ఆస్పదము గాకుండ క్రొత్తపద్ధతులపైని మోటలు నిర్మించబడినవి. ఈపద్ధతివలన పశువులు వెనుకకును, ముందుకును నడవవలసిన అవసరములేదు. విశేషశ్రమలేకనే జలమును గ్రహించుటకు వీలలవడుచున్నది.*

కృషికులకు విద్యాజ్ఞాన మవసరము.

కృషికులయొక్క పూర్వాచార పరాయణ ప్రియత్వమును తొలగించి నూతన సంస్కరణములపట్ల కుతూహలురగునట్లు చేయుటకు నిర్బంధోచిత ప్రాథమిక విద్యయే ఆధారము. వ్రాయను, చదువను నేర్పినంతనే తృప్తిజెందక కృషి

* విషయమునుగూర్చి విపులముగ దెలియగోరువారు "రామచంద్ర ఏతంపర్కసు" మైలపూరు, మద్రాసు అని వ్రాయవలెను. వీరు చక్కని ఉపకరణములను నిర్మించిరి. మ-శ్రీ వేమవరపు రామదాసుపంతులుగారు మొదలగు మననాయకులు వీరి కర్మాగారమును పరీక్షించి శ్లాఘనీయములగు యోగ్యతాపత్రముల నొసంగిరి.

విషయకమగు విద్యావ్యాప్తిని చేయుట చాల అవసరము. వ్యవసాయశాఖను ఇంకను బలపరచి ప్రతితాలూకాయందును ఒక్కొక్క నిపుణుని యాజమాన్యముక్రింద మాదిరి వ్యవసాయక్షేత్రములు (Model demonstration farms) నెలకొల్పబడవలయును. నూతన యుపకరణములయొక్క ప్రాశస్త్యమును రైతులకు ప్రత్యక్షప్రమాణముగా బోధించవలసి యున్నది. ప్రతి గ్రామమునకును వ్యవసాయ విద్యయందు గడతేరిన వారు సంచార బోధకులుగ నియమితులు కావలెను. ప్రస్తుతము చెన్నరాజధాని కంతకును వ్యవసాయ కళాశాల ఒక్క కోయంబత్తూరు నగరమునందే నెలకొల్పబడి యున్నది. కళాశాలలు ఇంకను విరివి చేయబడవలెను. ఆంధ్రమండలమున ఒక్కవ్యవసాయకళాశాల ఉండితీరవలయును. కళాశాలయందు ప్రస్తుతము విద్యగరపుపద్ధతి సంతృప్తికరముగ లేదు. వ్యవసాయకళాశాలలయొక్క ముఖ్యోదేశ్యము రైతులను ఆకర్షించి నూతన విధానముల వారిని బరిచితులుగ జేయుటయే. ప్రస్తుతపుకళాశాలలు కృషికులను ఆకర్షించుటలేదు సరిగదా, చాల వరకు భూములు లేనివారినే విద్యార్థులుగ సేకరించి కొందరు ఉద్యోగియులను తయారు చేయుటయందే శ్రమ వృథపరచబడుచున్నది. ఇందులకుగల ముఖ్యకారణము, వ్యవసాయ విద్యను స్వభాషయందు గరపుటకు మారుగ ఆంగ్లభాషయందు అభ్యసింపవలసి వచ్చుచున్నది. మన కృషికులకు ప్రారంభవిద్యయే కఱవగుచుండగా, హూణ భాష నభ్యసించి వ్యసాయ కళాశాలలయందు విద్య గరచుటెట్లు? స్వభాషయందు ఎంత జడుడైనను, సులువుగ విద్యను గ్రహించనగు

నని ఎల్లరెరింగియే యున్నారు. ఆంగ్లభాషయందు న్యాయశాస్త్రపఠనము గావించవలెనన్న కొంతవరకు సమంజసముగ నున్నది. ఇతరములగు వైద్య, వ్యవసాయ శాస్త్రములు మున్నగునవి దేశభాషలయందు గరపుట లెస్స. పంజాబు దేశమున వైద్యకళాశాలను తెరచుసమయమున శ్రీహార్డింజి ప్రభువరేణ్యుడు దేశభాషలయందు విద్య గరపుటవలన గలుగు లాభములను విపులముగా జర్చించెను. విద్య జనసామాన్యోపయుక్తమగుటకు దేశభాషలయందు గరపుటయే అవశ్యకర్తవ్యము. అటుల జేసిననాడు, మనకృషికులు విద్యాభ్యాసమువలన జ్ఞానమును బడసి తాము తరించుటయేగాక దేశమునకు గూడ వన్నె తెచ్చిన వారలగుదురు. దేశభాషలయందు విద్యగరపుటకు తగిన పఠనీయగ్రంథములు లేవని కొందరు ఆక్షేపణలు చేయవచ్చును. పంజాబునందు హార్డింజి ప్రభువువలన తెరువబడిన వైద్యకళాశాలయందు విద్యయంతయు దేశభాషామూలముననె గరపబడుచున్నది. పఠనీయ గ్రంథములు తయారగు వరకునువిద్య దేశభాషలయందు గరపకూడదనుట హాస్యాస్పదము. ఆదరించెడువారున్న గ్రంథకర్తలకును గ్రంథములకును లోటుండదు. సరఫరా, అవసరమును బట్టియుండునన్న ఆర్థికన్యాయము ఇప్పట్టున సైతము వర్తించును. ఇండియా దొరతనమువారు హార్డింజి ప్రభువరేణ్యుని వాక్యములను పాలించి దేశభాషామూలమున విద్యగరపుటకు ప్రారంభించవలయును. ముఖ్యముగా పారిశ్రామిక, వ్యవసాయక, వైద్య, శిల్ప (ఎంజనీరింగు) కళాశాలలయందు, దేశభాషలనే ఉపయోగింపవలయును. అందువలన వాఙ్మయమునకును దేశమునకును గూడ

వికాసము హెచ్చును. ఆంగ్లవిద్యను పూర్తిగా పరిత్యజించ
వలెనని మామతముకాదు. పట్ట పరీక్షవరకును దేశభాషల
యందే విద్యగరపి, విషయమును ఇంకను తరచిపరిశ్రమచేయ
నెంచినవారు ఆంగ్లభాషయందలి ఉద్గ్రంథముల పఠనమునకు
గడంగవచ్చును. జనసామాన్యమునకు మాత్రము దేశభాషల
యందే విద్యగరప బడవలెను. ముఖ్యముగా కృషివిషయిక
మగు విద్య దేశభాషలయందు గరపబడినగాని వ్యవసాయ
దారులు లాభమును బెందజాలరు.

రైతుయొక్క దారిద్ర్యము.

కృషికళయందు ఈదేశము బీదవడియుండుటకు గల
రెండు ముఖ్యకారణములలోను, అజ్ఞానమును గూర్చి ముచ్చ
టించితిమి. ఇక రెండవదియగు దారిద్ర్యమునుగూర్చి ఒకించుక
నుడువవలసియున్నది. ఇతరదేశములయందలి కృషికులవలెగాక
మనవ్యవసాయదారులు మూలధనప్రాబల్యములేనివారలై నూ
తనవిధానములను ఆచరణములోనికి గొనితెచ్చుటకు శక్తిలేని
వారగుచున్నారు. అమెరికాసంయుక్తరాష్ట్రములయందు, వ్యవ
సాయదారులన్న ఎంతయో గౌరవముకలదు. విశేషధనవం
తులుకూడగలరు. ప్రభుసన్మానమునుకూడ వడయుచుందురు.
ఈదేశమున అంతహేయమైనవృత్తి లేదనిపించుచుండును. ఏలనన
మూలధన ప్రాబల్యము లేకయుండుటయే. కృషికళను పెంపు
చేయవలెనన్న, వ్యవసాయదారులకు తక్కువ వడ్డికి పెట్టుబడి
లభించునట్లు చేయుటకర్తవ్యము. ఏపనిచేయుటకును మూల
ధనముఅవసరము. కేవలము వరుణదేవునిమీాదనే భారముంచక

స్వయంసహాయమున ఏనూతులనో గోతులనో త్రవ్వి అందలి
జలముతో క్షేత్రములు సేద్యము చేయుదమన్న, మూలధనము
ఆవశ్యకము. దుక్కిపశువులను చక్కగా పనిచేయువానిని సంపా
దించవలెనన్న ధనము వెచ్చించినగాని లభించవు. శ్రమను తగ్గిం
చెడి నూతన యుపకరణములనుగొని వాడవలయునన్న ధనప్రాబ
ల్యముఅవసరము. ప్రశస్థమైన విత్తనములను జాగ్రతపరచుటకును
రసాయనశాస్త్రిప్రయుక్తమగు ఎరువులను వాడుటకును, కర్మ
కరులకు కూలినొసంగుటకును, క్షేత్రముయొక్క శిస్తునకును,
పంటలు తేలువఱకు తనకును తనకుటుంబమునకును గ్రాసము
నిమిత్తమును మూలధనము ఆవశ్యకము. పూర్వపుసస్యములనే
పైరు చేయక నూతనముగ ఏగోధుమపైరునో, చెరకు తోటనో
లేక ఏ బంగాళాదుంపలనో పండించవలయునన్న, మూల
ధనములేకున్న సాగదు. తమక్షేత్రములు ఇతర పంటలకు యో
గ్యము లయ్యును, మూలధనప్రాబల్యములేమిచే ఎందరోవ్యవ
సాయదారులు మిన్నక యుండవలసి వచ్చుచున్నది. భూమిని
అభివృద్ధిలోనికిగొనివచ్చి తగిన లబ్ధివడయుదమన్న కొంతధనము
ఖర్చుచేసినగాని వీలలవడదు. అట్టి ధనసంచయము కృషికు
లకు అలవడనంతకాలము స్వదేశమునందలి కృషికళపెంపు
గాంచుననియెడిమాట కలలోనివార్త. మన వ్యవసాయదారు
లను ఋణదాతలబారినుండి విముక్తులంజేసినగాని ఉత్సాహ
ముతో పనిచేయజాలరు.

సహకారప్రవృత్తి.

కర్షకులయొక్క దారిద్ర్యమును బాపుట యెట్లు? సహ
కారప్రవృత్తివలన మూలధనము చౌకగా లభింపజేయుటయే

సాధనాంతరము. వంగదేశమున రాయ పార్వతి శంకరఛౌధరీ యను ఒక జమీందారుగారు ధర్మగోలా యను పేర ధాన్యపు బ్యాంకులు తన జమీను గ్రామములయందు నెలకొల్పెను. ఆ బ్యాంకులు జయప్రదముగ పనిచేయుచున్నవి. కర్షకులకు వలయుధాన్యమును సరఫరాచేసి పంటలుపండిన వెనుక కొంత వడ్డీతో వసూలుచేసి అదియంతయును చేర్చి కర్షకుల ఉపయోముగ నిమిత్తము ఒకనిధిగా ఏర్పరచబడెను. ఆతీరుగనే ధాన్యపు బ్యాంకులను నెలకొల్పుటసమంజసమని డి. యమ్. హామిల్టను గారు ప్రథమ ఇండియాకళాసభయందు వాక్రుచ్చెను. కొందరు జమిందారులును, నేలఖామందులును ధనికులును కలసి ప్రతిజిల్లాకును ఒక సెంట్రలు బ్యాంకిగనేర్పడి, గ్రామసంఘములకు సాలునకు నూటికి ఆరు ఏడు రూప్యముల వడ్డీ చొప్పున ధాన్యమును సరఫరాజేసి పంటలుతేలిన తరువాత క్రమముగా వసూలు చేయుట సమంజసము. సెంట్రలు బ్యాంకి యందు చేర్చిన మూలధనమునకు సర్కారువారు నూటికి మూడురూప్యములు వడ్డీ నొసంగునట్లు పూచీపడవలెను. అటుల సర్కారువారు పూచీపడుటవలన నష్టమేమియును లేదు. సర్కారు గారంటీయున్నది కదా యని ధనికులు ఇట్టి యుద్యమములకు పూనుకొనుటకు వీలేర్పడును. వ్యవసాయదారులకు పెట్టిన పెట్టుబడి తీరకపోదు. ఆసాలున తీర్మానింపబడక పోయినను, పై సంవత్సరముననైన తీర్మానము చేయబడకపోదు. ప్రభుత్వము వారు కోట్లకొలది రూప్యముల రాబడిని మాఫుచేయ నంకించుటకంటె కొంత ధనమును గారంటీ చేసిన యెడల సర్కారు

రాజస్వము చక్కగ వసూలగుటయేగాక వ్యవసాయదారుల క్షేమము నారసినవారలు కూడ నగుదురు.

సహకారప్రవృత్తి పలుతెఱంగుల మూర్తీభవించవలసి యున్నది. ప్రశస్తమైనవిత్తులను సరఫరాచేయుటకు కొన్ని సంఘములు తలలెత్తవలసి యున్నది. పంటలు తేలువరకు కర్షకులకు వలయు ధనమును సరఫరాచేయుటకును, క్షేత్రమును అభివృద్ధిలోనికి గొనివచ్చుటకు సాధనములగు నూతనయుపకరణములను సులువుగా రైతులు గ్రహించుటకు వీలేర్పడుటకును కొన్ని సంఘములు బయలువెడలవలసి యున్నది. తయారైన దినుసులను తక్కువ ధరలకు వ్యాపారస్తులకు సమర్పించక తగిన ధరవచ్చినప్పుడు విక్రయించి రైతులకే ఆలాభమంతయును చెందుటకు అనువగునట్లుగ కొన్ని సహకారసంఘములు స్థాపించబడవలెను.

మంచివిత్తనముల ఆవశ్యకత.

కృషికి సంబంధించు విషయములను కొన్నిటిని ఇట పొందుపరచుట సమంజసము. వ్యవసాయమునకు ముఖ్యమైనది ప్రశస్తమైన విత్తనము. “విత్తు సహకారిగాకున్న రిత్తనేల, వంధ్యయగుగాక తాఫలవంతమగునె” యనియెడి నీతి వాక్యము ననుసరించి, విత్తనము పరిశుభ్రమైనది కానిచో, పంటయంతయును ధ్వంసమగుచున్నది. అమెరికా సంయుక్తరాష్ట్రములయందు పరిశుభ్రమైన విత్తనములు సేకరించుటకు విపులముగ ప్రయత్నములు గావింతురు. హిందూదేశమునందలి కర్షకులు ఈవిషయమునందు జాగరూకులై యుండుటలేదు, తగిన విత్తన

ములను జాగ్రత పరచుకొనుటకై వ్యవసాయదారులు విశేష
శ్రమను తీసికొనుట అగత్యము. ధాన్యపు విత్తనములయందు
కే[illegible] ధాన్యము చేరకుండ, ఏకతీరుగ నున్నవానినే సేకరించవలసి
యున్నది. అమెరికాయందలి వ్యవసాయులు తమ క్షేత్రముల
యందు కొంతభాగమును విత్తనములను పైరుచేయుటకునై
ప్రత్యేకముగా ఏర్పాటు చేసెదరు. విత్తనములు శుభ్రమైనవి
కాని యెడల పంట తక్కువకాకమానదు. పండినధాన్యమునకు
క్రమమైన ధరలు లభించుట దుర్లభము. కొన్ని విత్తనములను
పైరుచేసినయెడల విశేషముగా ధాన్యము పండుట కలదు.
కనుక కర్షకులు విత్తనములను సేకరించుటయందు ప్రమ
త్తులుగాక జాగరూకులై యుండవలెను. మంచిరకముల విత్తన
ములను ఉపయోగించుట వలన చెన్నరాజధానియందు ధాన్య
పు పంటను విరివిచేయుటకు వీలేర్పడును. ఇటీవల వ్యవసాయ
శాఖకు జెందిన మధురాసర్కిలు డిప్యూటీ డిరెక్టరుగారు తమవద్ద
ఆరుతరహాల విత్తనములు రైతులకు సరఫరా చేయునిమిత్తమై
జాగ్రతపరచబడి యున్నవని ప్రచురించిరి. ఈవిత్తనములు విశే
షముగా పంట నొసంగుననియు, కృషికులకు లాభకారులుగ
నుండుననియును వెల్లడిచేసిరి. ఈవిత్తనములయందలి విశేష
మేమనిన:—(1) కోయంబత్తూరునందు పైరు చేయగా విశేష
ధాన్యము నొసంగినవి. (2) ధాన్యము వెన్ను వేసిన తరువాత,
గింజలన్నియు ఏకకాలమున పాలుపోసి కొనును. అందువలన
కొన్నిగింజలు కోత తరుణమునకు వచ్చుటయును, మరికొన్ని
ఇంకను పాలుపోసికొను అవస్థయందే యుండుటయును తట
స్థించదు. (3) క్షేత్రము సారవంతమైనదై, విశేషముగా ఎరువు

వగైరాలను వేసి సత్తువచేసినయెడల, కోయంబత్తూరు నందు
పండినపంటకన్న అమితముగ పండ వచ్చును.

ఇట్టి విత్తనములను వ్యవసాయశాఖవారు పెక్కుతావుల
యందు వ్యవసాయదారులకు సరఫరాచేసియు, ఏప్రదేశము
నకు ఏరకము విత్తనములు విశేషలాభదాయకములో కనుగొ
నుటకునై మాదిరిక్షేత్రములయందు పైరుచేయుట సుగమము.
మాదిరిక్షేత్రములు జిల్లామొత్తమునకు ఒక్కొక్కటి చొప్పున
గాక విస్తారముగా నెలకొల్పబడవలెను. అచ్చటి కర్షకులు విత్త
నములయొక్క ప్రాశస్త్యమును గమనించినవెంటనే మాదిరి
క్షేత్రములు మూసివేయబడవచ్చును. ప్రత్యక్షముగా తనకండ్ల
ఎదుట లాభమును గాంచుచు, తానుకూడ బాగుపడగోరని
కుమతియుండడు. వ్యవసాయశాఖవారు ఈవిషయమును
చక్కగ గమనించి ఆచరణములోనికి గొనిరావలసి యున్నది.

క్షేత్రమును సారవంతముగ జేయుట.

కృషికులు గమనించవలసినవిషయము వేరొండుగలదు.
క్షేత్రమును సస్యాఢ్యగజేసి ఫలము ననుభవించవలెననెడు
ఆతురతయేగాని సారవంతముగ జేయవలెనన్న సంగతిని పూర్తిగ
గమనించినట్లుతోచదు. భారతభూమి ఎంత సుక్షేత్రమయ్యును
అనాదిగ సేవ్య పరచబడుచు వచ్చుచుండుటచేత కాలక్రమమున
నిస్సారమగుచుండెనన్న సంగతి గ్రహించవలసియున్నది. వర్ష
ములు కురిసినవెంటనే విత్తనములుచల్లి పంటలు పండించు
కొనుటతోడనే తమ పని పూర్తియైనదని కర్షకులు భ్రమియ
రాదు. పంటలకు ఆధారభూతమగు బొగ్గుపులుసు గాలి,

పొటాసియము, ఫాస్ఫరసు మొదలగు పదార్థములు ప్రతిపంట తోను భూమినుండి వెడలుచున్నవి. తిరుగా వానిని క్షేత్రమున ప్రవేశపెట్టినగదా సస్యములు చక్కగ ఫలించుట. చవిటిపఱ్ఱ యందు ఎంత పంటపండుచున్నదియును, ఇతర ప్రదేశముల యందలి సస్యములు ఎంత శోభాయమానమగుచున్నదియును మనము కండ్లారగాంచుచునే యున్నాము. పైన పేర్కొనబడిన పదార్థములు క్షేత్రమును సారవంతముగ జేసి సస్యములను విరాజిల్లునట్లుచేయుటకు ఆవశ్యకంబులు. అందు బొగ్గుపులుసుగాలి ముఖ్యము. కోట్లకొలది ధనసంచయమును ఒకతావున కుప్ప బోసినను శెలవుచేయ నారంభించినచో కొరతవడి సన్నగిల్లక పోదు. ఖర్చునకు తగినట్లుగా తిరుగా ధనమునార్జించి కొఠీయందు జేర్చినగదా ఎడతెగకుండ ధనరాశి ఖర్చునకు లభించుచుండును. ఎంతటి సారవంతమైనదయ్యును, క్షేత్రము ఎరువువేసి బలపరచు చుండనియడల నిస్సారము కాకమానదు.

సస్యములకు ఎరువుయొక్క ఉపయోగము ఇంతయని చెప్పతరముకాదు. పాశ్చాత్యదేశములలో వ్యవసాయదారులు విశేషద్రవ్యమును వెచ్చించి రసాయనశాస్త్రప్రయుక్తములగు ఎరువులను కొని క్షేత్రమును సారముచేయుచుందురు. మన దేశమునందు మూలధనప్రాబల్యము తక్కువయగుటచేత మనము వేరొండు విధమున ఎరువును జాగ్రతపరచుకొనవలసి యున్నది. రసాయనశాస్త్రప్రయుక్తమగు ఎరువులను విశేషధనము నొసంగి బొగ్గుపులుసు గాలిని క్షేత్రమున ప్రవేశపెట్టనెంచుట కంటె, సులువైనమార్గము మరొకటికలదు. బొగ్గుపులుసు గాలి, గాలియందు విస్తారముగా ఇమిడియున్నది. గుత్తులు

గుత్తులుగ వ్రేళ్లుగలిగిన పైరులను కొన్నిటిని నాటినచో, ఆ చెట్లు గాలినుండి బొగ్గుపులుసుగాలిని ఆకర్షించి వ్రేళ్లద్వారా క్షేత్రమున ప్రవేశపెట్టుచుండును. అట్టి పైరులలో మనవారు ఎఱిగినది ఒక్కజనుము మాత్రమే. అట్టి జనుమును సైతము విస్తారముగా ఉపయోగించుటలేదు. జనుముగాక మరికొన్ని ఇతరపైరులు కలవు.

వీనిని ప్రతికర్షకుడును ప్రతిసాలునను క్షేత్రమునందలి కొంతభాగమున నాటితీరవలయును. నాటినచోటునతిరిగి మరుచటి వత్సరముననే పైరుచేయక క్షేత్రమునందంతటను క్రమముగా పైరుచేయుచు రావలసియున్నది. నదీప్రవాహములు మిక్కుటమైనప్పుడు ప్రవాహవేగమున గొనితెచ్చిన వండ్రు మట్టియొక్క ప్రాశస్త్యమును వ్యవసాయదారులు చక్కగనెఱింగియేయున్నారు. అట్టి సారముకంటె పదిరెట్లు అదనముగా ఈపైరులను నాటినందువలన క్షేత్రము సారవంతమగును. కర్షకులు ఈవిషయమును చక్కగ గ్రహించి ఆచరణములోనికి గొనితేవలయును. ఈపద్ధతిని అమలులోనికి తెచ్చుటవలన వ్యవసాయదారులకు విశేషవ్యయప్రయాసములు తటస్థించవు.

పశువులగెత్తముయొక్క ప్రయోజనత్వమును వ్యవసాయదారులెరింగియేయున్నారు. పశువులకు తెలకపిండి వగైరాలన్ను మేతవేయవలసియున్నది. తెలకపిండి యనగా నువ్వుల నూనె తెలకపిండియేయని భ్రమజెందరాదు. ఏనూనెయొక్క తెలకపిండియైనను సరియే. తెలకపిండిని ఆహారపదార్థముగా నొసంగుటవలన పశువులు మంచిబలిష్టము లగునవియగుటయే

గాక చక్కని గెత్తముకూడ లభించును. అందులకై వెచ్చించిన ధనము నిష్ప్రయోజనమని తలచరాదు. డాక్టరు వ్రాయెల్కరుగారు నూనె గింజలను ఎగుమతి చేయుటవలన దేశముయొక్క సారవంతమును పోగొట్టుకొనుచున్నారని నొక్కివక్కాణించిరి. స్వదేశమును సారవంతముగ జేయవలసిన తెలకపిండి అన్యదేశములవారిని ఐశ్వర్యయుతులుగ జేయుట ఎంతయు శోచనీయము. ఈసందర్భమున ఛాటరుటనుగారి అభిప్రాయమును కొంతవరకు విమర్శించవలసి యున్నది. ఇండస్ట్రియలు ఇవల్యూషన్" అను ఇంగ్లీషు గ్రంథమున నూనె గింజలను పచ్చిపదార్థములుగనే ఎగుమతిచేసిన లాభకారియగును కాని నూనెలను తీసి ఎగుమతిచేయ ప్రయత్నించరాదని వీ రభిప్రాయపడిరి. ఇందులకుగల కారణము అపక్వపదార్థములను ఎగుమతిచేయుటకు ఓడఖర్చు తక్కువయగుననియును నూనెను రవాణాచేయుటకు పీపాలలో జాగ్రతగా నింపవలసి వచ్చుట వలన ఎగుమతి ఖర్చు విశేషమగుననియును వ్రాసిరి. ఛాటరుటనుగారి అభిప్రాయము యుక్తియుక్తముగ లేదని చెప్పక తప్పదు. ఆహెచ్చుకూలికంటె శతగుణంబులు తెలకపిండితో క్షేత్రముయొక్క సారమును పెంపుచేయుటవలన లభించితీరును. పశువులను పొలమునందే ఒకతావునుండి ఒక తావునకు మార్చుచు గోష్ఠముల నేర్పరచవలయును. క్షేత్రమునకు సారము చేయవలసినపేడను, పిడకలుగాచేసి వంటకట్టెయలకు బదులుగా వాడుక చేయుచున్నారు. ఇది వివేకశూన్యమైనపద్ధతి యని నిరూపించకతీరదు. స్వల్పలాభముకొరకు విశేషలాభమును వదలుకొననెంచుట బొగ్గులకునై కల్పతరువును ఛేదించి

నట్లులగును.

ఎముకలపొడుము విశేష సారవంతమైనది. దీనిని విదేశముల యందలి క్షేత్రములను పెంపుచేయుటకునై స్వదేశమును వీడిపోనీయరాదు.

పెంటను ఉపయోగపరచుటయందు కర్షకులు ఒకవిషయమును గమనించవలసి యున్నది. కుప్పలుకుప్పలుగా పొలములో పెంట వేయుచుండుట ఆచారమైయున్నది. ఇటుల జేయుట నష్టదాయకము. ఒకతావున చాలలోతువరకు భూమి సారవంతమైనదియగుటను, వేరొకచోట పెంటయొక్క సారము కొంచమైనను ప్రవేశించకపోవుటయును జరగుచున్నది. అందువలన సస్యములు ఏకరీతిగా విజృంభించక కొంత ప్రదేశమున విస్తారము పెరుగుటయును, కొంతప్రదేశమున చాల నీరసస్థితి యందుండుటయును సంభవించుచున్నది. ఇదిపంటకు చాలనష్టమును కలుగజేయును. నిస్సారముగానున్న ప్రదేశములో పంట తక్కువగుట యటుండ సారముచేరిన ప్రదేశమున సైతము చేనువిస్తారముగా పెరుగుటవలన, వెన్ను వేయుసరికి పీలవెన్ను వేయుటయో లేక గింజలలో చాలభాగము పొల్లుగింజ లుండుటయో తటస్థించుచున్నది. కుప్పలుగా పెట్టి వర్షములు కురియువరకును విడిచిపెట్టుటవలన, పెంటయందలి కొన్ని పదార్థములు ఉపయోగమునకు రాకుండ నశించిపోవుచున్నవి. అటులగాకుండ గెత్తమునందలి, సారమును కొంచెమైనను వృథాపరచక పొలమునకంతకును సమముగా ఉపయోగించునటుల చేయుట కర్తవ్యము. అందువలన తక్కువగెత్తమే హెచ్చుప్రదేశమున కుపయోగించ ననువగును. అమెరికా సంయుక్త రాష్ట్రముల

యందు జయప్రదముగ వాడుకచేయుచున్న ఎరువును వెద జల్లుయంత్రములను (Manure spreaders) స్వదేశమునందు ఉపయోగించుటయే ఇందులకుగల సాధనము. ఈయంత్రము యొక్క ఉపయోగము విశేషము. పెంటనంతయు చూర్ణముగా చేసి భూమియందెల్లెడల సమముగా వ్యాపింపజేయును. ఈయంత్రమును గోష్టములదరిని ఉంచి, ప్రతిదినమును బయల్వెడలిన గెత్తమును యంత్రములో నిండునంతవరకు చేర్చి పూర్తికాగానే పొలములకు గొనిపోవచ్చును. వెంట వెంటనే పొలమునందంతటను ఎరువును చక్కగా ఈయంత్రము వ్యాపించ జేయును. తరువాత తిరుగా గెత్తమును చేర్చుటకై గోష్టములవద్దకు గొని రావచ్చును. యంత్రము యొక్క ఉపయోగము అమూల్యము గాన వ్యవసాయదారులు వాడుక చేయుట శ్రేయస్కరము. యంత్రములకు వలయుధనమును పరపతి సంఘములనుండిగాని, సర్కారువారి నుండిగాని తీయవచ్చును.

యంత్రకళలు, హస్తకళలు.

పారిశ్రామిక కళలను గూర్చి కొంతవరకు రెండవ ప్రకరణమున ముచ్చటించియే యుంటిమి. ఐనను రెండు మూడు కళలను గూర్చి విపులముగా తెలియజేయుట సంభావ్యమని తోచెడిని.

అరటినార వ్యాపారము.

ప్రస్తుతము ఉపయోగములోనికి తేబడనిదియు ముందు ముందు విశేష అభివృద్ధిలోనికి గొని తేదగినదియు నగు అరటినార వ్యాపారమును గూర్చి యోచింతము.

అరటినారను తయారు చేసినయడల పణ్యాచక్రము లేదని-దిగులు చెంద నవసరము లేదు. ఇంగ్లాండునందు ఎన్ని వేల టన్నులనార ఎగుమతిచేసినను టన్నుకు మూడువందల రూప్యముల ధరచొప్పున విక్రయమగును. నీట బుట్టి పెరిగిన దగుటచే అరటిచెట్టుయొక్క నార విస్తారము కాలము చివికి పోకుండ నీటియందు వాడుక చేయుటకు వీలలవడును. అందువలన ఓడ త్రాళ్లకు ఈనార విస్తారముగా ఉపయోగించబడును. ఇంతియగాక బొందలయొక్క లోపలి భాగమునందలి నారను (అనగా దూటయొక్క దగ్గరభాగము) వేరుగా తీసినయడల ప్రశస్థమైన వస్త్రములను నేయుటకు ఉపయోగించవచ్చును. పట్టుతో సమముగ నుండును. నారకు రంగులువేసి తివాసులు మొదలైనవికూడ తయారు చేయనగును. ప్రయోజనమునందు అమూల్యమైన వస్తువని తేలుచున్నది.

ఇక దీనిని తయారు చేయుట ఎట్లు అనుసంగతిని గూర్చి విచారించవలసి యున్నది. యంత్రముల సాహాయ్యమున అరటినారను తీయ నెంచుట దుస్సాధ్యము. ఛిత్రముగా వస్తుప్రదర్శన శాలలయందు ప్రదర్శించుటకు మాత్రమే యంత్రముల మూలముగ తయారు చేయవచ్చును కాని పెద్దపెద్ద ఆవేశములను (ఫ్యాక్టరీ) నెలకొల్పి విస్తారముగా తయారు చేసి వ్యాపారముచేసి లాభమును గ్రహింతమన్న యంత్రములు సహాకారులు గానేరవు. గణపతి అయ్యరుగారిచే - తిరునల్వేలి యందు తయారు చేయబడిన యంత్రములును, కన్ననూరు (Cannanore) జెయిలులో వాడుక చేయబడుచున్న యంత్రములును పరిక్షచేయబడినవి. ఈయంత్రములవలన తయారు

కాబడునార బహుస్వల్పము. పెద్ద వ్యాపారము చేయుదమన్న కూలిగిట్టదు. విదేశయంత్రములు (Decorticators) ఉపయోగించునా యని తర్కించి చూడ నయ్యవినైతము ప్రయోజనశూన్యములయ్యెను. కత్తి నారను తీయుటకు ఉపచరించునే కాని మృదువగు అరటినారను తయారు చేయుటకు పనికిరావు. మెత్తనిదగుటచే తెగిపోవుచుండుట తటస్థించుచున్నది. కావున యంత్రముల సాహాయ్యము నపేక్షించకయే ఈనారను తీయుటకు ప్రయత్నములు సల్పవలసి యున్నవి.

వేరుసాధనము లేదని దిగులుజెంద నగత్యము లేదు. రసాయన శాస్త్రప్రకారము ప్రశస్థమైననారను తయారుచేయ నగును. అరటి బొందలను చీల్చి డిప్పలను మూడుతరగతులుగా విభజించవలయును. మొదటి తరగతివి ఉపరిభాగమున నుండును. అవిమోటుగా నుండుటచేత వస్త్రముల నేతకు పనికిరావు గాన ఓడత్రాళ్ళ నిమిత్తము ఉపయోగించ వలసి యున్నది. దూటను చుట్టియున్న డిప్పలు బహుమృదువుగ నుండునుగాన వానిని ప్రత్యేకముగా ఏర్చిన యడల నేతకు పనికివచ్చును. మధ్యరకముగ నున్నవి తివాసులు వగైరాలు నేయుటకు ఉపయోగపరచవచ్చును. మూడు తెగలుగ డిప్పలను విభజించి, సీలికుండీలవలె కుండీలను తయారుచేసి నీటియందు కొంత కాలము ఊరవేయవలెను. ఆనీటియందు కొన్ని రసాయన ద్రవ్యములు కలపవలసి యున్నది. రసాయనద్రవ్యముల ప్రభావము వలన డిప్ప యందలి గుజ్జంతయు చక్కగా చివికిపోవును. తరువాత నదీప్రవాహముననో లేక తటాకముననో కడిగి వేయవలెను. కడిగి వేయుటవలన పైగుజ్జంతయు పోవును.

శేషించినది గంధక - వాయువుయొక్క (Sulphur di-oxide) పొగవలన శుభ్రపడును. ఈవాయువును గాజు ఇండ్లను కట్టి (Glass chamebrs) ప్రయోగించవచ్చును. అనంతరము వెండి కట్టెవలె తయారైననారను, నీడను దండములపై ఆరవేయవలెను. ఆరిన తరువాత ఉపయోగమునకు సిద్ధమగును. దినమునకు నాలుగువందల బొందలు సరఫరా యగుప్రదేశమున ఇట్టి ఆవేశము నొకదానిని నెలకొల్పిన యెడల అయిదారువేల రూప్యముల మూలధనము అవసరము. తొలి సంవత్సరముననే ఖర్చులు పోను పెట్టుబడి పెట్టిన ద్రవ్యము లభించును. తరువాత ప్రతిసాలునను 4, 5 వేల రూప్యముల లబ్ధికలుగుచుండును. తొలుత గన్నవరం, ఆమలాపురం వగైరా కోనసీమ గ్రామములయందు ఇట్టి ఆవేశమును నెలకొల్పుటకు వీలున్నయది. విద్యాధికులు కొందరు ఈవిషయమును గూర్చి చక్కగా ఆలోచించి, ఒక ఆవేశమును స్థాపింప దలచిరేని తాము ధనికులగుటయే గాక దేశమునకు కూడ సేవచేసిన వారలగుదురు. గంజాంమండలము నందలి ఉద్దానమునకూడ అరటితోటలు మెండుగ నుండుటచే ఈవ్యాపారమును సులువుగా నెలకొల్పుటకు వీలున్నయది. మలబారు ప్రాంతమున కూడ ఇట్టి ఆవేశములకు చోటున్నయది. ఈవ్యాపారమును సాగించనెంచిన వారు ప్రస్తుతమున అరటితోటలను వేయుటకు ఆరంభించ నగత్యములేకుండ, తోటలు మెండుగా నున్న తావులనే ఫ్యాక్టరీలను స్థాపించవచ్చును. ఆంధ్రమండలమున ఇట్టి ఆవేశములు నెలకొల్పబడి, హిందూదేశమున కంతకును మార్గదర్శకము కావలసియున్నది.

చేతిమగ్గముల నేత.

ఈదేశమునందలి నేతపనివాండ్రు ఫ్యాక్టరీలలో పని చేయుటకు ఇచ్ఛగించరు. విద్యావిహీనత్వమును, పూర్వాచార పరాయణత్వమును ఇందులకు గారణము. నూలుబట్టలను తయారుచేయుటకు బొంబాయి అహమ్మదునగరము మొదలగు ప్రదేశముల యందువలె యంత్రశాలలు నెలకొల్పినగాని వీలు లేదని ఎంచరాదు. చేతిమగ్గములవలన సైతము విస్తారముగా దుస్తులను తయారు చేయవచ్చును. చాటరుటను, హావెలు మొదలగు ప్రముఖులు చేతిమగ్గముల నేతను విరివిచేయుటవలన నూలు వర్తకముయొక్క భావిదశ జయప్రదముగ నుండునని వ్యక్తీకరించిరి.

అనాదిగా తాతతండ్రులనుండి వాడుచువచ్చిన మగ్గములమీదనే బట్టలునేయుచు వచ్చుటవలన, రానురాను నేతపని హీనదశకు వచ్చుచున్నది. విదేశములనుండి వచ్చెడిసరకులతో పోటీకి ఆగలేక పోవుచున్నది. చాలమంది వృత్తులను త్యజించి కర్మకరులుగ కృషికళను ఆశ్రయించుటయో లేక వీరంగూను మోళ్మేను, ఆస్సాము ప్రాంతములకు కూలికి బోవుచుండుటయో తటస్థించుచున్నది.

అట్టి దుస్థితినిబాపి నేతకళను విరివిచేయనెంచుచో ఈ క్రిందివిధానములను ఆచరణములోనికి గొనివచ్చుటసమంజసము. అటులగావించనిచో అలతికాలముననే భరత వర్షమునందు నేతపనివాండ్రసంఖ్య క్షీణించి నామమాత్రావశిష్టము కావలసి వచ్చునేమోయని భయముతోచెడిని. (i) నేతపనివాండ్రు విస్తారముగానున్న ప్రతి ప్రదేశమునను నేతవిద్యాలయములు

నెలకొల్పబడవలెను. విద్యావారలకు ఉచితముగా గరపవలసియున్నది. ఈ విద్యాలయములయొక్క ముఖ్యోద్దేశ్యము నూతన యుపకరణములయొక్క ప్రాశస్త్యమును ప్రత్యక్షముగా బోధించుటయును, నూతన విధానములను ఆచరణములోనికి దెచ్చుటకు నేతపనివాండ్రకు సమర్థత కలుగజేయుటయునై యుండవలెను. (2) నూతన పద్ధతులపై నిర్మింపబడిన చేతిమగ్గములను, సింగరుకుట్టు యంత్రములవలె, నెలకు కొంత ద్రవ్యము చెల్లించెడి పద్ధతిపైని నేతపనివాండ్రకు సరఫరా చేయవలెను. మగ్గములను అరువుగా నిచ్చుటవలన, పనివాండ్రందరును కొని ఉపయోగించుటకు వీలుకలుగును. (3) నేతకువలయు నూలును (Yarn) సరఫరాజేయుటకు సంఘములు స్థాపింపబడవలెను. సహకారప్రవృత్తియే ఇందులకు మూలాధారము. అట్టిసంఘములు నెలకొల్పబడని ప్రదేశములయందు షాహుకారులవద్ద నూలును విషమషరతులపై తీయవలసి వచ్చుచున్నది. నేసినబట్టల నన్నిటిని బజారుధరలకు చాలతక్కువగా, షాహుకారునకు విక్రయించెడ పద్ధతిమీద, నేతవాండ్రు నూలును గొనుచున్నవారలు. నూలును సరఫరాజేసెడి సంఘములు స్థాపితములైన లాభమంతయును నేతవాండ్రకేజెందును.

(4) తయారైన వస్త్రములను తగినధరలకు విక్రయించుటకుకూడ సంఘములు ఏర్పరచబడవలెను. ఎక్కడధరలు ప్రియముగనున్నవో, ఎచ్చట మందముగా నున్నవో, నేతపనివాండ్రకు గమనించుటకు శక్తిచాలదు. స్వల్పలాభమును గ్రహించి అనుకూలమగు బజారులలో బట్టలను విక్రయించుటకు సంఘములు స్థాపితములు కావలెను. ఈసంఘ

ములు మరొక కార్యమును చేయగలవు. దేశమునందలి బజా
రులసంగతి యావత్తునుకనుగొని ఏమాదిరి వస్త్రములునేసిన
ఏప్రాంతములయందు విరివిగా ఖర్చగునో నేతగాండ్రకు
తెలియపరచి వ్యాపారమును వృద్ధిచేయగలవు.

క్రోముపద్ధతివలన తోళ్ళను పదునుచేయుట.

ప్రతి సంవత్సరమునను సుమారు పదికోట్లరూప్యముల
విలువగల చర్మములు పరదేశయాత్ర వెడలుచున్నవి. మద
రాసు, కలకత్తా, బొంబాయి రేవుపట్టణములయందు ఈవ్యా
పారము విశేషముగ జరుగుచున్నది. అనేకలక్షుల రూప్యములు
విలువగలజోళ్ళు ఈదేశమునకు దిగుమతియగుచున్నవి. జోళ్ళ
వర్తకముయొక్క విలువయటుండ ఏటేట ఇరువదియైదు మొ
దలు ముప్పదిలక్షుల రూప్యముల విలువగల తోలుసామాను
లను విదేశములనుండి గ్రహించుచున్నాము. కావున క్రోము
పద్ధతిపైని తోళ్ళను పదునుచేయుట వలన చాలలాభ
మున్నది.

సాధారణముగ వాడుకలోనున్న పద్ధతికిని క్రోముపద్ధ
తికిని విశేషభేదము లేదు. క్రోముపద్ధతియందలి విశేషమేమ
నిన తోళ్ళను పదునుచేయుటకు పూర్వము అనుసరించవలసిన
విధానములో సున్నపు పాలును పూర్తిగ వేరుపరచుటయే. ఈ
యొక్కవిషయమునుదక్క మిగిలినపద్ధతి రెండింటికిని సమాన
మే. ఈవిధానమును అవలంబించుటకు విశేష ఖరీదుగల
యంత్రములు అగత్యములేదు. అత్యద్భుతమైన నిపుణతగల
కర్మకరుల యావశ్యకత సైతముగానరాదు. కావున ఈకళను
చక్కగా పెంపుచేయుట సుగమము. దేశీయ పద్ధతియందు

సైతము కొన్నిమార్పులు గావించవలసి యున్నది. ఎందువలన
ననగా. పదునుచేయని చర్మముయొక్క వెల రు 1—12—0
అగుచుండగా, దేశీయపద్ధతిని పదునుచేయబడిన చర్మమునకు
రు 1—3—0 మాత్రమే లభించుచున్నది.

అసంఖ్యాకములుగ చర్మములను, పదునుచేయుటకు
అగత్యమగుకరక్కాయలుమొదలగుపదార్థములుపుష్కలముగ
ఈదేశమున దొరకును. గనుక ఎన్నియోచర్మ కర్మాగారములు
స్థాపించుటకు వీలున్నయది. ఆంధ్రమండలమున విజయనగరము
బరంపురము పట్టణములయందు కర్మాగారములు స్థాపించ
నగును. గంజాము విశాఖపట్టణ మండలములయందలి (ఏజన్సీ)
మన్య ప్రదేశముల నుండివచ్చెడి చర్మములు పై పట్టణముల
నుండియే చాలవరకు ఎగుమతియగుచున్నవి. విద్యాధికులును,
ధనాధీశులును త్వరపడవలయును.

పాల చూర్ణము.

పాలడబ్బాలు అసంఖ్యాకములుగ ఈదేశమునకు దిగు
మతియగుచున్న వన్నసంగతి ఎల్లరకును విశదమే. 1909-10
సం॥ వర్తకపు లెక్కల ప్రకారము 25,61,722 రూప్యములు
విలువగల గడ్డపాలు ఈదేశమునకు దిగుమతియైనవి. ఇన్ని
లక్షుల రూప్యముల విలువగల పాలడబ్బాలను, పాడిపంటలకు
వాసిగాంచిన హిందూదేశము విదేశములనుండి గ్రహించుచుం
డుటా సంతాపకరము. ఇంగ్లాండులో ఛెషైరునందు స్థాపించ
బడిన ఒక ఫ్యాక్టరీనిగూర్చి ఛాటరుటనుగారు వ్రాయుచు
ఇండియాయందుకూడ అట్టి ఆవేశనములను స్థాపించుటకు
వీలున్నదని వక్కాణించిరి. ఆకర్మాగారమున దినమునకు

మూడువేల గేలనుల పాలు ఖర్చగుచున్నవి, వెన్నను వేరు చేయు యంత్రసాహాయ్యమున తోలుత వెన్నను వేరు. చేసి ప్రతిదినమును లండను నగరమునకు పంపుచుందురు. తరువాత ఆపాలనుకాచి చూర్ణముగా మార్చెదరు.

కర్రలను కాల్చి బొగ్గుచేయుట.

బళ్లారి జిల్లాయందలి సాండూరు సంస్థానమునను, సేలము జిల్లాయందును ఇనుపగనులు విశేషముగా నున్నట్లు రెండవ ప్రకరణమున సూచించి యుంటిమి. అచ్చట బొగ్గుగనులు సమీపమున లేని హేతువువలన ఇనుపగనులు వాడుకచేయ బడు చుండుటలేదు. బొగ్గులేని కారణమున మిన్నకుండవలసిన అగత్యములేదు. కర్రలను కాల్చి బొగ్గు తయారుచేసి, ఆబొగ్గు వలన ఇనుపగనులను ఉపయోగములోనికి తీసికొని రావచ్చును. మైసూరునందలి కెమ్మన గిండి కనుమలయందలి ఇనుపగనులను, తాతాలండు సన్సువారి అయః కర్మాగారమునందు పనిచేయు చున్న సి. యఫ్. పెరిన్‌గారి సలహాపైని తాతాకంపెనీ వారి యాజమాన్యము క్రిందనే పని ప్రారంభించబడెను. జయప్రద ముగ ఈయుద్యమము నెరవేరుననుటకు సందియము ఇసుమంత యైనను లేదు. ఛాటరుటనుగారు ఒక బొగ్గు ఫ్యాక్టరీని చెన్న నగరమున స్థాపించుటకు మదింపువేసిరి. కర్రలను కాల్చుట వలన ఒక్క బొగ్గేగాక తారు, మెథిల్ ఆల్కహాలు, ఎసిటేటు ఆఫ్‌లైము అను పదార్థములు బయల్వెడలును. ఈపదార్థముల కంతకును మార్కెట్టు బహుళముగానున్నది. ఛాటరుటన్నుగారి. లెక్క ప్రకారము ఆరువేల టన్నుల కర్రను (సరగుడు కర్రను) సాలునకు ఉపయోగించుటకునై ఒక ఆవేశనమును స్థాపించు

టకు రెండులక్షల రూప్యముల మూలధనము అవసరము. ఈమూలధనముపై వచ్చెడి లబ్ధి, ఖర్చులుపోను సాలునకు రు. 35,900. ధనాధికులు ఈవిషయమును గమనించవలసి యున్నది.

యానసౌకర్యములు.

ఎగుమతి దిగుమతులు ఇండియాయందు ఏటేటసుమారు 250 కోట్ల రూప్యములవిలువగలవి జరుగుచున్నవి. దీనినిబట్టి యానసౌకర్యములను పెంపుచేయుటవలన స్వదేశమునందలి వాణిజ్యసంపద చక్కగా విరివియగునని వేరవ్రాయబనిలేదు. యానసౌకర్యములు ఎచ్చోట నలవడకుండునో, ఆప్రదేశము నందలి వ్యాపారము అభివృద్ధిజెందనేరదు. సరకులను తయారు చేయుటతోడనే తగిన లబ్ధికలుగదు. ఏపణ్యచక్రములయందు ఆసరకునకు గిరాకి యున్నదో, ఆప్రదేశములకు సరకులను గొనిపోయినగాని ప్రయోజనము లేదు. యానసౌకర్యములు అలవడనిచో ఉత్పత్తిచేయబడిన పదార్థసంచయము, చలనము లేక అచ్చటనే స్థావరము కావలసియున్నది. అందువలన సర కులకు తగినధరలు లభించవు. జయపురపు ఏజన్సీయందు ధాన్యము ఎంతచౌకగా చిక్కుచున్నదో చదువరులు ఎరిం గియేయుందురు. అచ్చటిధరలతో పార్వతీపురమునందలి ధర లను సరిపోల్చిచూచిన విశేష వ్యత్యాసముండును. యానసౌ కర్యములులేని హేతువువలన అచ్చటి సరకును ఇతర ప్రదేశ ములకు గొనితెచ్చుటకు వీలలవడుటలేదు. విజయనగరము నుండి పార్వతీపురమునకు బోవుచున్న అయోమార్గమును మధ్యపరగణాలయందలి రాయపురముతో కలిపినయడల జయ

పురమునందలి ధరలుకూడ ఇతరప్రదేశముల ధరలతో సమముగనే యుండును. కావున వాణిజ్యసంపదను విస్తరింపజేయుటకు యానసౌకర్యములను విరివిచేయుట అవశ్యకర్తవ్యము.

(1) ప్రభుత్వమువారు నీటిపారుదల పనులను విశేషముగా నిర్మించుటవలన కృషికళ నుద్ధరించుటయేగాక యానసౌకర్యములను పెంపుచేసిన వారగుదురు. ఇనుపదారులకంటె తక్కువ కూలికి నీటికాలువలపైని సరకును రవానాచేయవచ్చును.

(2) యానసౌకర్యములను వృద్ధిచేయుటకునై సర్కారువారు ఇండియాయందలి రైల్వేలనెల్ల తమఆధీనమునందుంచుకొనవలసియున్నది. కంపెనీల యాజమాన్యముక్రింద నుండుట వలన, స్వదేశవర్తకము వృద్ధియగుటలేదు. ఇంగ్లాండునుండి దిగుమతికాబడిన సరకులకు బొంబాయినుండి కలకత్తాకుగొని పోవుటకు విధించినకూలి, అలహాబాదు నుండి కలకత్తాకు గొనిపోవు స్వదేశవస్తువులపై విధించిన కూలికంటె తక్కువ. సామ్రాజ్యశాసన నిర్మాణసభయందుసర్ విఠల్‌దాసు థేకర్సే, ఆర్. యన్. మధోల్కరు మొదలగు ప్రముఖులు, ఇనుపదారులను కంపెనీల యాజమాన్యము క్రిందనుంచుకొనుట వలన ఎన్నియో స్వదేశకళలు రూపుమాయు చున్నవని గంభీరముగా వాక్రుచ్చిరి.

స్వదేశమునందు తయారగు వస్తువులకు విదేశవస్తువులతో పోటీయనునదియే అసంగతముగ నుండగా, కంపెనీ యాజమాన్యముక్రింద నుండిన ఇనుపదారులుకూడ స్వదేశకళలను క్షీణింపజేయుటకు సహకారులగుచున్నవి. ఒక ప్రదేశమునుండి

మఱొకప్రదేశమునకు జరుగు వ్యాపారమునకు సైతముకంపెనీలు ఆటంకములు కలుగజేయుచున్నవి. బ్లాకురేట్లను (Block rates) విధించుటవలన అసలుకన్న కూలి జాస్తియై, సరకులు ఖర్చగుటకు ఆటంకమగు చున్నది. బ్లాకు-రేట్లనగా కంపెనీలవలన విధించబడు పూరారేట్లు. ఇందులకు ఒక ఉదాహరణము.

ఒక ప్రదేశమునుండి వేరొక ప్రదేశమునకు సరకులను రవానా చేయునపుడు, రెండుమూడు కంపెనీల ఇనుపదారులగుండా గమ్యస్థానమును చేరగలుగునపుడు, ప్రతి కంపెనీయును వ్యాపారమును తమ అయోమార్గమునకే మరలించదలచి, తమ మార్గముగుండా పోవలసిన కొద్ది దూరమునకు పూరారేట్లను విధించుచుందురు. అందువలన సరకులకు రవానా కూలి హెచ్చగుచుండును. అట్టి రేట్లను బ్లాకురేట్లందురు. ఈరేట్లు వ్యావారమునంతను 'బ్లాకు' చేయును అనగా అడ్డగించును.

యానసౌకర్యములను పెంపుచేయుటకు మఱొకప్రయత్నముకూడ సల్పుట అగత్యము. వ్యానమోహానదాసు రామజీగారు వాక్రుచ్చినటుల, స్వదేశనావలను నిర్మించుట ఆవశ్యకము. ఓడలు ఇండియాకు స్వాంతముగా లేనిలోటును, ప్రస్తుత మహాసంగ్రామము వ్యక్తీకరించినది. మనసామాలుసరకులకు చైనాదేశము ఒకపెద్దమార్కెట్టు. ఆంగ్లేయ కంపెనీల యొక్క ఓడలను యుద్ధపరిస్థితులవలన చాలవరకు నౌకాదళమున చేర్చవలసివచ్చెను. ఓడలు లేనందువలన విదేశ వ్యాపారము చాలవరకు కట్టువడెను. యుద్ధానంతరమున ఇండియాయందు నావికా నిర్మాణమునకు పూనుకొనవలసి యున్నది.

మనపూర్వులకు నావికా నిర్మాణమునందుగల కౌశలమును శ్రీ రాధాకుముదముఖర్జీగారు 'ఇండియను షిప్పింగు' అను తమగ్రంథమున విపులముగ జర్చించిరి. * కాలహరణము నోనర్చక భారతీయులు నావికానిర్మాణమునకు గడంగవలసి యున్నది. చిదంబరం పిళ్లెగారివలన స్థాపింపబడిన స్టీము నావిగేషన్ కంపెనీయొక్క ఉదంతమును గమనించినవారలై విదేశవ్యాపారుల ఓడలకు ఇండియాయందలి ధనమును సమర్పించక, మనవ్యాపారమునంతయును ఇండియా స్టీమరులవలననే సాగించి దేశమునకును ప్రజలకును కీర్తితేవలసియున్నది. స్వయంసహాయమునకు మించిన పరమావధి వేరొండుగానరాదు. కాని ఆంగ్లేయనౌకలపై ఆధారపడియుండక వాణిజ్యవ్యాపారములను స్వదేశ ఓడలయందే జరుపుటవలన దేశముయొక్క ప్రతిభ హెచ్చుటయేగాక సంపదకూడ వృద్ధియగును.

వాణిజ్యము.

వాణిజ్యమును అభివృద్ధిచేయుటకు ముఖ్యములగు రక్షణనుగూర్చియు, యానసౌకర్యములను గూర్చియు ఇదివరకు చర్చించియే యుంటిమి. ఇక జాయంటుస్టాకు కంపెనీలనుగూర్చి కొంతవరకు ముచ్చటించవలసి యున్నది.

జాయంటు స్టాకుకంపెనీలు వాణిజ్యాభివృద్ధికి మూలాధారము. జాయంటు స్టాకుకంపెనీలు ఒకరియందు మరొకరికి నమ్మక ముండినయడల సులువుగా స్థాపించనగును. దేశము

* ఈ గ్రంథముయొక్క తెలుగు భాషాంతరీకరణము శారదాపబ్లిషింగు కంపెనీవారు ప్రకటించుచున్నారు.

ఋజుమార్గవర్తనులకు కఱవుపడి యుండలేదు. తగినవారిని డైరక్టరులుగ నియమించి, వ్యవహారములయం దారితేరిన నిపుణులను యజమానులుగ ఏర్పరచినయెడల వ్యాపారము జయప్రదముగా సాగగలదు.

బ్యాంకులనుకూడ విశేషముగ నెలకొల్పవలసియున్నది. బ్యాంకులయొక్క ఉపయోగము ఎల్లప్రజలకును కావలసియే యున్నది. చిల్లరవ్యాపారము చేయువారికిని లక్షలకొలది వ్యాపారము చేయువారికినిగూడ ఉపచరించును. నిలవయున్నధనమును బ్యాంకులలో దాచుచుండుటవలన అడిగినవెంటనే తిరిగి ద్రవ్యము ఈయ చేయబడుటయేకాక కొంతవరకు వడ్డిగూడ లభించును. స్వదేశకళలను వృద్ధిచేయుటకు విస్తారముగా మూలధనము అవసరము. బ్యాంకులు విస్తారముగా స్థాపించబడినయెడల వలయు మూలధనమును సేకరించుటకు వీలగును.

మరొకపద్ధతినిగూడ అవలంబించ వలసియున్నది. ఇన్సురెన్సు భీమా కంపెనీలు విస్తారముగా తలలెత్తవలసియున్నది. ఒక్క లైఫ్ ఇన్సురెన్సు కంపెనీలేగాక అగ్ని, జలప్రమాదములవలని, నష్టమును తొలగించుటకుగూడ భీమాకంపెనీలు ఏర్పడవలసియున్నది. ఇంగ్లాండునందు కిటికీలకు ఉపయోగించిన గాజుతలుపుల నష్టమునకుకూడ భీమాకంపెనీలుకలవని ప్రతీతి. అట్టివిషయములో ఇండియాయందు సైతము సకలప్రమాదములవలని నష్టములను తొలగించుటకు భీమా కంపెనీలు స్థాపించవలసి యున్నది.

వర్తకులు గమనించవలసిన విషయము వేరొండు కలదు. విశేషశ్రమపడి వ్యవసాయదారులవద్దను, ఇతర ఉత్పా

దకులనుండియును, సరకులను సేకరించి బస్తాకు ఒక కానిలాభము వచ్చిన, ఆ స్వల్పలాభముతోడనే సంతుష్టాంతరంగులై విదేశ వర్తకసంఘములకు సరకులను విక్రయించుచున్నారు. ఇందువలన లాభమంతయు అన్యదేశీయుల నోటబడుచున్నది. సరకులను గిరాకి అతిశయముగానుండు మార్కెట్టులకు ఎగుమతిచేసి అన్యదేశీయులు పూర్తిగాలాభమును గ్రహించుచున్నారు. మన వర్తకులు ధైర్యమునుగలవారలై తాము శ్రమపడి సంపాదించిన లాభమునంతయును ఇతరులకు సమర్పించక, తామే అన్యదేశములకుఎగుమతిచేసి లాభమును సంపాదించవలసి యున్నది. ఈవిషయమునుగూర్చి శ్రీయుత లాలాలజపతిరాయిగారు విపులముగ జర్చించి భారతీయులు అన్యదేశీయులచే కొల్లగొనబడుచున్న ధనరాశిని తామే గ్రహించవలసి యున్నదని వ్యక్తీకరించిరి.



PRINTED AT THE INDIA PRINTING WORKS, MADRAS.